# HISTORY OF USA (1776-1945AD)

## (DAHIS33)

## (BA - HISTORY)


ACHARYA NAGARJUNA UNIVERSITY

CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠం - 1

# ఉత్తర అమెరికా భౌగోళిక పరిస్థితులు - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రపై వాటి ప్రభావము

## 1.0. లక్ష్యం :

ఉత్తర అమెరికా ఖండము యొక్క భౌగోళిక పరిస్థితులు - అమెరికా సంయుక్త రాష్ట్రాల నైసర్గిక స్వరూపము - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రపై భౌగోళిక పరిస్థితుల ప్రభావములను గురించి తెలిసికొనుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


**1.1.** పరిచయము

**1.2.** అమెరికా సంయుక్త రాష్ట్రాల భౌగోళికాంశాలు

**1.2.1.** ఉనికి

**1.2.2.** విస్తీర్ణం

**1.2.3.** నైసర్గిక స్వరూప లక్షణాలు

**1.2.3.1.** అట్లాంటిక్ తీర మైదానము

**1.2.3.2.** అపలేచియన్ లేక అల్లిఘనీ పర్వతశ్రేణులు

**1.2.3.3.** మిసిసిపి లోయ ప్రాంతము

**1.2.3.4.** రాకీ పర్వతాలు

**1.2.3.5.** ఫసిఫిక్ తీర ప్రాంతము

**1.2.5.** వాతావరణము - శీతోష్ణ స్థితి

**1.2.6.** సహజ సంపద

**1.2.7.** అడవులు

**1.2.8.** ఖనిజ సంపద

**1.2.9.** అమెరికా సంయుక్త రాష్ట్రాలపై భౌగోళిక పరిస్థితుల ప్రభావం

**1.2.9.1.** విశాలమైన ప్రదేశం

**1.2.9.2.** తొలి స్థాపనకు అనువైన భౌగోళికాంశాలు

**1.2.9.3.** నిత్యమూ జరిగిపోయే సరిహద్దు రేఖ

**1.2.9.4.** రవాణా సంస్థపై ప్రభావం

1.2.9.5. భౌగోళిక భిన్నత్వ ప్రభావం

1.2.9.6. నూతన సంస్కృతి ఆవిర్భావం

1.2.9.7. ప్రజా జీవనం పై తీవ్ర ప్రభావం చూపే శీతోష్ణ స్థితి

1.2.9.8. విదేశీ విధానంపై ప్రభావం

1.3. సారాంశము


1.4. నమూనా ప్రశ్నలు

1.5. చదువదగిన గ్రంథాలు

## 1.1. పరిచయము :

ఉత్తరార్థ గోళములో పశ్చిమాన ముక్కోణాకారంలోనున్న నూతన ప్రపంచాన్ని ఉత్తర అమెరికా ఖండంగా పేర్కొనవచ్చును. ఇది ప్రపంచంలో మూడవ పెద్ద ఖండము. పరిమాణములో ఆసియా, ఆఫ్రికాల తర్వాత పెద్దది. ఇది భారతదేశానికి సుమారు 8 రెట్లుండును. దీనికి తూర్పున అట్లాంటిక్ మహాసముద్రము, పశ్చిమాన ఫసిఫిక్ మహా సముద్రములు కలవు. ఇది $7^0$ ఉత్తర అక్షాంశము నుండి $83^0$ ఉత్తర అక్షాంశము వరకు, $20^0$ పశ్చిమ రేఖాంశము నుండి $120^0$ పశ్చిమ రేఖాంశము వరకు విస్తరించి యున్నది. ఆర్కిటిక్ వలయము $66\ 1/2^0$ వద్ద ఈ ఖండము ఉత్తర భాగము మీదుగా పోవుచున్నది. అలాగే $23\ 1/2^0$ వద్ద కర్కటరేఖ దీనికి దక్షిణముగా పోవుచున్నది. ఇది కేంద్ర స్థానములోనుండుటచే యూరప్, ఆసియాలతో మంచి వ్యాపార సంబంధాలకు కల్గియున్నది.

ఉత్తర అమెరికా ఖండం యొక్క భౌతిక స్వరూపములో కొంత ప్రత్యేకత ఉన్నది. భౌగోళికంగా దీని స్వరూపమును తూర్పుననున్న మెట్ట భూములు, మధ్యలో విశాలమైన మైదానములు, పశ్చిమాన కోర్డిలిరాస్ పర్వత ప్రాంతాలను మూడు భాగాలుగా విభజించవచ్చును. (పటం నెం. 1)




పటం-1. ఉత్తర అమెరికా నైసర్గిక స్వరూపము

తూర్పు మెట్ట భూములలో ఎత్తు తక్కువగానున్న విస్తరించబడిన అపలేచియన్ పర్వతాలున్నాయి. విశాలమైన మధ్య మైదానములో సెయింట్ లారెన్స్, మిసిసిపి నదులు, సుపీరియర్, మిచిగాన్, హురాన్ ఇరీ, ఒన్ టారియో లాంటి పెద్ద మంచినీటి సరస్సులు, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నయాగరా జలపాతములున్నవి. పశ్చిమ ప్రాంతంలో ఉత్తరము నుండి దక్షిణము వరకు నదులకు జన్మస్థానమైన విశాల పర్వత ప్రాంతము విస్తరించి యున్నది. ఈ పర్వతాలలో అలాస్కాలోనున్న మెకిన్‌లీ శిఖరము ఎత్తైనది. కొలరెడో నది దాని ఉప నదుల వలన దీని పీఠ భూమిలో లోతైన లోయ లేర్పడినవి. సహజ సౌందర్యమునకు ప్రసిద్ధి గాంచిన గొప్ప అగాధ దరి (Grand Canyon) కొలరెడోలోనున్నది. ఈ ఖండంలో ఉత్తర దిశ నుండి అతి శీతల పవనాలు, దక్షిణ దిశ నుండి ఉష్ణ పవనాలు వీచుట వలన మధ్యధరా శీతోష్ణ స్థితి కల్గియుండును. భూ స్వరూపము, పవనములు వీచు దిశ,సముద్ర ప్రవాహాలను బట్టి ఇక్కడ వర్షపాతము సమృద్ధిగానుండును. పైనుదహరించిన ఉత్తర అమెరికా ఖండ భౌగోళిక పరిస్థితులే, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో గూడా కన్పించును. గాన దీని నైసర్గిక స్వరూపము, భౌగోళికాంశాలు, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రపై వీటి ప్రభావము మొదలగు అంశాలను సూక్ష్మ స్థాయిలో ఈ క్రింది విధంగా తెలిసికొందాము.

## 1.2. అమెరికా సంయుక్త రాష్ట్రాల భౌగోళికాంశాలు :

ఏ దేశ చరిత్రనైన అధ్యయనము చేయడానికి ముందు ఆ దేశ భౌగోళికాంశాములను తెలిసికోవలసిన అవరమున్నది. ఏలయనగా వీటి ప్రభావము ఆ దేశ చరిత్రపై నుండును. ప్రపంచంలోని అన్ని వలస రాజ్యాలతో పాటు ఈ దేశం ఆవిర్భవించినప్పటికిని, అన్ని రంగాలలో శరవేగంగా అభివృద్ధి చెంది గొప్ప చారిత్రకతను రూపొందించుకొన్నది. ఇందుకు ఉత్తర అమెరికా ఖండము యొక్క భౌగోళికాంశాలే, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రపై ప్రభావము చూపుతున్నాయి. ఈ అంశాలను గురించి ఈ క్రింద తెలిసికొందాము.

**1.2.1. ఉనికి :** అమెరికా ఉనికి మిగిలిన ప్రపంచానికి తెలిసిరావడం అనుకోకుండా జరిగిన సంఘటన. తూర్పు దేశాల్లో లభించు సుగంధ ద్రవ్యాలు, యాలకులు, తివాచీలు, గాజు సామాగ్రి, పట్టు వస్త్రాలు, అద్దకపు వస్త్రాలు మొదలగు వస్తువులపట్ల ఐరోపావారు బాగుగా ఆకర్షించారు. అందువలన వారు తూర్పుదేశాలైన ఇండియా దాని చుట్టూ నున్న దీవులతో పూర్వ కాలం నుండి క్రీ.శ. **1453** వరకు వర్తక, వాణిజ్యాలు అరబ్బుల ద్వారా ఒకే ఒక భూ మార్గమైన కాన్‌స్టాంట్‌నోపుల్ అను పట్టణం గుండా జరిగేవి. ప్రపంచ మతాల విస్తరణలో భాగంగా క్రైస్తవులకు, మహమ్మదీయులకు మధ్య జరిగిన 'క్రూసేడ్స్' అను పవిత్ర యుద్ధాల ఫలితంగా తురుష్కులు కాన్‌స్టాంట్ నోపుల్ ఆక్రమించడంతో ఐరోపావారు, తూర్పు దేశాలకు సముద్ర మార్గమును కనుగొనే ప్రయత్నం ముమ్మరం చేశారు. అనేక భౌగోళిక పరిశోధనల అనంతరం క్రీ.శ. **1497-98**లో పోర్చుగల్ దేశస్థుడైన వాస్కోడిగామా సాగించిన ప్రయాణ ఫలితంగా తూర్పు దేశాలతో వర్తకం లాభసాటిగా ఉంటుందన్న వార్త దావాలనంగా వ్యాపించింది. దీనితో ఐరోపా దేశాలన్నీ తూర్పు దేశాలతో వర్తకం చేయడానికి సంసిద్ధమైనాయి.

ఇండియాకు సముద్ర మార్గాలు కనుక్కొనే ప్రయత్నాలలో భాగంగా జెనీవాకు చెందిన క్రిస్టోఫర్ కొలంబస్ 'చీకటి సముద్రం'గా పేర్కొందిన అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటి బహామా దీవులున్న ఒక కొత్త ప్రపంచాన్ని క్రీ.శ. **1492**లో కనుగొన్నాడు. అయితే కొలంబస్‌కు పూర్వము **500** సంవత్సరాలకు ముందే యూరోపియన్‌లు కొత్త ప్రపంచములోనికి వెళ్ళి గ్రీన్ లాండ్ అను దీవిని కనుగొన్నట్లు తెలుస్తుంది. అట్లాంటిక్ మహా సముద్రాన్ని తేలికగా దాటవచ్చుని రుజువు చేసిన తర్వాత చాలా మంది కొత్త ప్రపంచంపై కాలుమోపి అవి తూర్పు దీవులని భ్రమించారు. వారిలో ఇటలీకు చెందిన అమెరిగో వెస్పూచి అనునతడు దక్షిణ అమెరికా కోస్తా వెంబడి సముద్రయానం చేసి క్రీ.శ. **501**లో బ్రెజిల్ చేరాడు. అతడు తాను స్థిరపడిన దేశమైనస్పెయిన్‌కు తిరిగి చేరుకొన్న తర్వాత తన సాహస కృత్యాలను గురించి స్నేహితులకు తెలియ జేస్తూ ఉత్తరాలు వ్రాశాడు. ఆనాడు దేశ పటాలు గీయడంలో పేర్కొందిన జర్మన్ భౌగోళిక శాస్త్రవేత్తకు ఈయన ఉత్తరం ఒకటి దొరికింది. ఆ ఉత్తరంలో వెస్పూచీ వర్ణించిన దేశానికి అమెరికా అని నామకరణము చేయడంతో ఇది అమెరికా ఖండంగా పేరుగాంచింది. ఏది ఏమైనను ఒక జర్మన్ దేశస్థుని పొరపాటు వలన కొత్త ప్రపంచానికి అమెరికా అని పేరు ఖాయమైనది.


అమెరికా సంయుక్త రాష్ట్రాలు **50** రాష్ట్రాలున్న దేశము. ఇది ఉత్తర అమెరికా ఖండంలో $24^0$-$49^0$ గల ఉత్తర అంక్షాంశము, $70^0$-$124^0$ గల రేకాంశాల మధ్య నున్నది. ఈ దేశానికి తూర్పున అట్లాంటిక్ మహా సముద్రము, పడమర ఫసిఫిక్ మహా సముద్రము,

ఉత్తరాన కెనడా, దక్షిణాన మెక్సికో దేశము మరియు మెక్సికో జల సంధిలు ఎల్లలుగానున్నవి. క్రీ.శ. 17,18 శతాబ్దాలలో ఐరోపా నుండి వచ్చిన ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్థలు కొత్త ప్రపంచంలో పరిణత చెందడం వలన అమెరికా సంయుక్త రాష్ట్రాలేర్పడినాయి.

**1.3.2. విస్తీర్ణము :** అమెరికా సంయుక్త రాష్ట్రాల విస్తీర్ణము అలాస్కా, హవాయి దీవులు, పోర్టోరికోలతో కలిపి దాదాపు 36,15,211 చ. మైళ్ళు (93,63,396 చ. కి.మీ.). ఇది భారత విస్తీర్ణమునకు షుమారు 3 రెట్లుండును. దీని రాష్ట్రాలన్నింటిలో విస్తీర్ణమైనది అలాస్కా, రెండోది టెక్సాస్. ఈ దేశము తూర్పు, పశ్చిమ తీరాలు ఒక్కొక్కటి 24,800 కి.మీ.కు మించిన పొడవుండును. దీనికి, కెనడాకు మధ్య నున్న సరిహద్దు దాదాపు 4,800 కి.మీ. పొడవుండును. అలాగే ఇది తూర్పు, పడమర సరిహద్దుల మధ్య 4,480 కి.మీ. దూరం విస్తరించిన సువిశాలమైన భూభాగము. ఈ దేశంలోని వివిధ రాష్ట్రాల విస్తీర్ణాన్ని ఈ క్రింది టేబుల్ ద్వారా తెలిసికొందాము.

| వరుస నెంబరు | రాష్ట్రం పేరు | సమాఖ్యలో చేరిన సం॥ | విస్తీర్ణము (చ.మైళ్ళలో) |
|---|---|---|---|
| 1. | అ.సం.రా.లు (13 వలసలు) | 1783 | 8,18,811 |
| 2. | లూయిసియానా | 1803 | 8,27,192 |
| 3. | ఫ్లోరిడా | 1819 | 72,003 |
| 4. | టెక్సాస్ | 1845 | 3,90,144 |
| 5. | ఒరెగాన్ | 1846 | 2,85,580 |
| 6. | మెక్సికన్ సెషన్ | 1848 | 5,92,017 |
| 7. | గడ్సడెన్ కొనుగోలు | 1853 | 29,640 |
| 8. | అలాస్కా | 1867 | 5,86,400 |
| 9. | హవాయ్ | 1898 | 6,424 |
| | మొత్తం విస్తీర్ణం | | 36,15,211 |

**1.2.3. నైసర్గిక స్వరూప లక్షణాలు :** నైసర్గిక స్వరూపాన్ని బట్టి అమెరికా సంయుక్త రాష్ట్రాలను ఐదు ప్రత్యేక భాగాలుగా విభజించవచ్చును. అవి. 1) అట్లాంటిక్ తీర మైదానము, 2) అపలేచియన్ పర్వత శ్రేణులు, 3) మిసిసిపి లోయ ప్రాంతము, 4) రాకీ పర్వతాలు, 5) ఫసిఫిక్ తీర ప్రాంతము (పటం నెం. 2) వివరాలు ఈ క్రింద చుద్దాము.




పటం - 2

**1.2.3.1. అట్లాంటిక్ తీర మైదానము :** అట్లాంటిక్ మహా సముద్రము, అపలేచియన్ పర్వత శ్రేణుల మధ్యలో ఉత్తరాన న్యూయార్క్ నుండి దక్షిణాన మెక్సికో సింధు శాఖల వరకు ఉండి **415**కి.మీ. విస్తీర్ణంలోనున్న ప్రాంతమే అట్లాంటిక్ తీర మైదానము. ఇది పశ్చిమానికి పోయే కొలది ఎత్తు పెరుగుతూ అపలేచియన్ పీఠభూమితో కలిసిపోతుంది. సువిశాలంగా నున్న ఈ మైదానంలో శాలుడా, జేమ్స్,రో అనోక్, డెలవేర్, హడ్సన్ అను నదులు ప్రవహిస్తున్నాయి. ఈ తీర మధ్య ప్రాంతమంతయు ఇసుకతో నిండియుండుట వలన వ్యవసాయోగ్యము కాదు. కాని తీర దక్షిణ ప్రాంతము సారవంతమైనదిగా నుండుట వలన పత్తి, పొగాకు, వరి, మొక్కజొన్న మొదలగు పంటలకనువుగా నుంది. ఈ తీరం చీలియుండుట వలన బోస్టన్, చార్లెలన్, న్యూయార్క్ వంటి సహజ సిద్ధమైన నౌకాశ్రయాలేర్పడినాయి. ఇవి విదేశీ వాణిజ్యానికి, చేపల పరిశ్రమకు పేరు గాంచాయి.

**1.2.3.2. అపలేచియన్ లేక అల్లిఘనీ పర్వత శ్రేణులు :** ఇవి ప్రపంచంలో అతి ప్రాచీన పర్వత శ్రేణులలో ఒకటిగా చెప్పవచ్చును. ఇవి దాదాపు సముద్రము మట్టం నుండి **3000-6000** అడుగుల ఎత్తులో పర్వతాలు, పీఠభూములు, లోయలతో కలిసి యున్న పర్వత శ్రేణులు. ఇవి అట్లాంటిక్ తీరానికి **400** కి.మీ. దూరంలో పడమరగా ఉత్తరం నుండి దక్షిణం వరకు వ్యాపించి ఉన్నాయి. ఇవి ఉత్తరానున్న కెనడాలోని నోవోస్కోషియా నుండి దక్షిణాన అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని జార్జియా, అలబామా రాష్ట్రాల వరకు వ్యాపించి యున్నాయి. వీటిని ఆయా ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలుస్తారు. న్యూ హాంప్షైర్‌లో తెల్ల పర్వతాలని, వెర్మాంట్‌లో ఆకుపచ్చ పర్వతాలని, న్యూయార్క్‌లో 'అదిరోండాక్స్ కెట్‌స్కిల్స్' అని, వర్జినియాలో నీలి పర్వత పంక్తులని ఉత్తర కెరోలీనా సరిహద్దులలో పెద్ద పొగ పర్వతాలని పిలుస్తారు. ఇవి ఉత్తరాన సన్నగా నుండి దక్షిణానికి పోయిన కొలది వెడల్పుగా ఉంటాయి. వీటికి దక్షిణంగా పీడ్మాంట్ వెడల్పయిన పీఠభూమి ఉంది. ఈ పీఠభూమి వేగంగా ప్రవహించే హడ్సన్, మొహక్ లాంటి నదులతో విభజింపబడిన జలపాత పంక్తి (Fall-line) గా ప్రసిద్ధి చెందింది. ఈ శ్రేణులకు పశ్చిమంగా మిసిసిపి నదీ లోయ, తూర్పు దిశలో బొగ్గు గనులకు ప్రసిద్ధి చెందిన అలీఘని పీఠభూమి ఉంది.

**1.2.3.3. మిసిసిపి లోయ ప్రాంతం :** అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనున్న మిసిసిపి నది ప్రపంచంలోని అతి పొడవైన నది. అందువలన ఈ నదీ లోయ ప్రాంతము చాలా విశాలంగా ఉండును. అపలేచియన్ పర్వత శ్రేణులు, రాకీ పర్వతాలకు మధ్య ఉత్తరాన కెనడా నుండి దక్షిణాన మెక్సికో సింధు శాఖల మధ్యనున్న నదీ పరివాహ ప్రాంతాన్ని మిసిసిపి లోయ ప్రాంతంగా పిలుస్తారు. ఈ లోయ ప్రాంతాన్ని మూడు భాగాలు విభజించుకోవచ్చు. అవి **1)** మెక్సికో సింధు శాఖ మైదాన ప్రాంతము, **2)** మధ్య ప్రాంత మైదానము, **3)** మహా మైదాన ప్రాంతము.

**మెక్సికో సింధు శాఖ మైదాన ప్రాంతము :** అమెరికాకు దక్షిణానున్న రియోగ్రాండ్ నది నుండి తూర్పున ఫ్లోరిడా ద్వీప కల్పానికి మధ్య నున్న సారవంతమైన కోస్తా ప్రాంతమే సింధు శాఖ మైదానము. ఇది పత్తి పంటకు, పండ్ల తోటలకు అనుకూలమైన ప్రాంతము.

**మధ్య ప్రాంత మైదానము :** మిసిసిపి నది ఎగువ ప్రాంతము, మిన్నెసోటా, డెన్ఆమ్స్ తదితర నదీ లోయ ప్రాంతములు మరియు ఒహియో రాష్ట్రము, పశ్చిమాన ఇలినాయిస్ వరకు, ఉత్తరాన కెనడా నుండి దక్షిణాన మెక్సికో వరకున్న మధ్య ప్రాంతమే ఈ మైదానం. సారవంతమైన ఈ ప్రాంతంలో గోధుమ, మొక్కజొన్నలు విస్తారంగా పండుతాయి. ఈ ప్రాంతాన్ని తూర్పు ఐరోపా, మంచూరియా ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికాలలో నున్న మైదానాలతో పోల్చవచ్చును. దీనికి ఉత్తరంగా **1600** కి.మీ. దూరంలో ఐదు నదులున్నాయి. అవి **1.** సుపీరియర్, **2.** మిచిగాన్, **3.** హురాన్ **4.** ఈరి, **5.** ఆంటేరియో. ఈ సరస్సుల మీద అమెరికా, కెనడాలకు ఉమ్మడి అధికారం ఉన్నది. ఒకప్పుడు అమెరికా ఉత్తర భాగాన్ని, కప్పియున్న మంచు ప్రాంతమే ఈ ఐదు మహా సరస్సులుగా రూపాంతరం చెందాయి. ఇవి అన్నియు మంచి నీటి సరస్సులు. వీటిలో 'లేక్ సుపీరియర్' ప్రపంచంలో అతి పెద్ద సరస్సుగా చెప్పవచ్చును.

**మహా మైదానము :** మధ్య ప్రాంత మైదానానికి పశ్చిమంగా రాకీ పర్వత శ్రేణులకు తూర్పు, ఉత్తర దక్షిణాలుగా విస్తరించిన వృక్ష రహిత ప్రాంతాన్ని మహా మైదాన ప్రాంతంగా పిలుస్తారు. రాకీ పర్వతాల్లో ఉద్భవించిన అర్కన్సాస్, వరుస మొదలైన నదులు ఈ మైదానంలో ప్రవహించినప్పటికీ అవి లోతుగా నుండుటవలన వాటి నీటిని మెరక ప్రాంతమైన ఈ మైదానానికి సరఫరా చేయడం నష్టంగా ఉంటుంది. అందువలన ఈ నదులు వ్యవసాయానికి ఉపయోగపడుట లేదు. కానీ ఈ ప్రాంతంలో స్వల్ప వర్షపాతం ఉండుట వలన పశుగ్రాసం సమృద్ధిగా లభిస్తుంది. దీని ఫలితంగా ఇక్కడున్న ప్రజలు విస్తారమైన పచ్చిక బయళ్లను అభివృద్ధి చేసి పశు పోషణను ప్రధాన వృత్తిగా చేసుకొన్నారు.

**1.2.3.4. రాకీ పర్వతాలు :** ఇవి ముడుత పర్వతాలు. ఇది మహా మైదానానికి పశ్చిమంగా అలస్కా నుండి దక్షిణ అమెరికా వరకు వ్యాపించి ఉన్నాయి. దక్షిణ అమెరికాలో వీటిని 'ఆండీ పర్వతాలు' అంటారు. వీటి ఎత్తు 900 మీ॥ నుండి 4,200 మీ॥ వరకు ఉంటుంది. ఫసిఫిక్ తీర మైదానానికి తూర్పు భాగంలోనున్న కొన్ని పర్వతాలను కాస్కేడ్ పర్వతాలని, మరికొన్నిటిని సియరానెవాడ పర్వతాలని, ఫసిఫిక్ తీర పర్వతాలని పిలుస్తారు. పశ్చిమాన ఫిసిఫిక్ తీర వెంబడి నున్న కాస్కేడ్, సియరానెవాడ పర్వతాలకు తూర్పునున్న రాకీ పర్వతాలకు మధ్యలోనున్న ప్రాంతాన్ని మహా అమెరికా ఎడారి అని పిలుస్తారు. అలస్కా రాష్ట్రంలో విస్తరించి ఉన్న మౌంట్ మెకన్లీ అన్నిటి కంటే ఎత్తైన శిఖరము, ఫసిఫిక్ మహా సముద్రం మీద వీచే ఋతు పవనాలను కాస్కేడ్, సియరానెవాడ పర్వతాలు అడ్డుకోవడం వలన ఈ ప్రాంతంలో తక్కువ వర్ష ప్రాంతము (0.5 సెం.మీ.) ఉంటుంది. ఈ ప్రాంతంలో చాలా పీఠ భూములు, సరస్సులు ఉన్నాయి. ఉటా రాష్ట్రంలో పెద్ద ఉప్పు నీటి సరస్సు ఉంది. ప్రాచీన కాలంలో వెండి, బంగారాల కోసం అన్వేషిస్తూ గుర్రాలు, వ్యాగన్‌ల ద్వారా ప్రయాణిస్తూ ఈ పర్వత ప్రాంతాలకు చేరేవారు.

**1.2.3.5. ఫసిఫిక్ తీర ప్రాంతము :** ఫసిఫిక్ సముద్ర తీరానికి తూర్పునున్న కాస్కేడ్, సియరానెవాడ పర్వత శ్రేణులకు మధ్యలో ఉత్తర దక్షిణాలుగా విస్తరించిన ఈ ప్రాంతాన్ని ఫసిఫిక్ తీర మైదానమంటారు. ఫసిఫిక్ తీర మహా సముద్రం నుండి వీచే ఋతు పవనాలను ఈ పర్వత శ్రేణులు అడ్డుకోవడం వలన తీర మైదానంలో వర్షపాతం ఎక్కువగా ఉంటుంది. ఈ మైదానంలో కొలంబియా, శాక్రిమంటో, శాన్ జాక్విన్ మొదలైన నదులు ప్రవహిస్తున్నాయి. ఇది సారవంతమైన లోతైన నదీ లోయలతో కూడిన దట్టమైన అడవులు, సారవంతమైన భూములు, పండ్ల తోటలు ప్రకృతి సౌందర్యాలతో విరాజిల్లుతుంది. పశ్చిమ తీరంలోని ఉత్తర భాగంలో ప్యూగట్ సౌండ్, విల్‌మచ్ లోయ సమీపంలో పల్లపు ప్రాంతాలున్నాయి. కాలిఫోర్నియాలో శాక్రిమంట్, శాన్ జాక్విన్ లాంటి నదులు ప్రవహించే మధ్య లోయ ప్రాంతమున్నది. ఈ తీర ప్రాంతము చీలియుండుట వలన లాస్ ఏంజిల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో మొదలగు సహజ సిద్ధమైన నౌకాశ్రయాలేర్పడ్డాయి.

**1.2.4. నదులు :** అమెరికాలో ప్రాణాధారమైన అనేక జీవనదులు ప్రవహిస్తున్నాయి. వానిలో మిసిసిపి మిక్కిలి పొడవైన నది. మిసిసిపి, మిసోరి నదులు, వాటి ఉపనదులు కలిపి 18,900 కి.మీ. పొడవు గల జల మార్గాలను ఏర్పరుస్తున్నాయి. మిసిసిపి నదిని జీవనదాత అని, జీవన పిత అని రెడ్ ఇండియన్స్ పిలుస్తారు. ప్రంచంలోని పెద్ద నదులైన అమెజాన్ (దక్షిణ అమెరికా), కాంగో (ఆఫ్రికా), వోల్గా (ఐరోపా), గంగా (ఇండియా), యాంగ్‌ట్జీ (చైనా)లలో మిసిసిపి నది ఒకటి. దీనికి ప్రధాన ఉపనది మిస్సోరి. ఇది పడమర నుండి ఎర్రని ఒండ్రు మట్టితో కూడిన జలాలతో వచ్చి మిసిసిపితో కలుస్తుంది. అలాగే తూర్పు నుండి ఒహియో నది నిర్మలమైన జలంతో చేరి, కొంత దూరము ఒకదానితో నొకటి కలవకుండా నీలి, ఎరుపు రంగుల జలాలుగా ప్రవహిస్తాయి. మిసిసిపి చివరకు న్యూ అర్లియన్స్ దగ్గర మెక్సికో సింధు శాఖను చేరుతుంది. ఫసిఫిక్ ప్రాంతంలో తక్కువ వర్షపాతమున్నను, దక్షిణానున్న కొలరాడో, ఉత్తరానున్న కొలంబియా నదులు ఆ లోటును భర్తీ చేస్తున్నాయి. ఈ రెండు నదులు సుప్రసిద్ధమైన గ్రాండ్‌కేన్యాన్ గుండా ప్రహిస్తున్నాయి. సెంట్ లారెన్స్ నది వివిధ పర్వతాలలో ప్రహిస్తు ప్రపంచ ప్రసిద్ధి చెందిన నయాగరా జలపాతాన్ని ఏర్పరస్తుంది. నైరుతీ ప్రాంతంలో నున్న రియో గ్రాండ్ నది మెక్సికో, అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సహజ సరిహద్దుగా నున్నది. పైన పేర్కొన్న పెద్ద నదులతో పాటు జేమ్స్, యూకన్, శాక్రిమెంటో, శాన్ జాక్విన్, మొదలగు నదులు గూడా ఈ దేశంలో ప్రవహిస్తున్నాయి. ఈ నదులన్నియు రహదార్లుగానే గాక అమెరికాలోని అనేక ప్రాంతాలను సస్యశ్యామలముగా చేసి వ్యవసాయాభివృద్ధికి ఎంతో సాయపడుతున్నాయి.

**1.2.5. వాతావరణము - శీతోష్ణస్థితి (Atmosphere and Climate) :** ఒక దేశము యొక్క అక్షాంశ రేఖాంశాలు, పర్వతాలు, తీరమైదానాలు మొదలగు భౌగోళిక స్వరూపాలు, ఆ దేశ వాతావరణము శీతోష్ణ స్థితిగతులపై ఆధారపడి యుండును. అమెరికాలో భిన్న శీతోష్ణ స్థితి గతులున్నాయి. వీటిని బట్టి అమెరికా భూ భాగాన్ని ఐదు జోన్స్‌గా విభజించవచ్చును. అవి. 1) అతి శీతల ప్రాంతము (Super Humid Zone). ఇది ఉత్తర ఫసిఫిక్ తీరం నుండి కాస్కేడ్ పర్వతాల మధ్య నున్న ప్రాంతము. ఇక్కడ సంవత్సర వర్షపాతము 75 సెం.మీ. - 375 సెం.మీ. మధ్య నున్నది. 2) శీతల ప్రాంతము (Humid Zone) : ఇది సుపీరియర్ లేక్ నుండి టెక్సాస్ రాష్ట్రం వరకు విస్తరించియున్నది. ఇక్కడ 75-125 సెం.మీ. వర్షపాతముండును. దీని ఉత్తర ప్రాంతంలో సంవత్సరానికి 100 రోజులు మంచుతో కప్పబడియుండును. దక్షిణాన వర్షపాతము మామూలుగానుండును. ఉష్ణోగ్రత $20^0$F - $70^0$F మధ్యనుండును. 3) సమశీతల ప్రాంతము (Sub humid Zone) : ఇది శీతల ప్రాంతానికి పశ్చిమాన 780-1300 చ. కి.మీ.లో విస్తరించిన ప్రాంతము. ఈ జోన్‌లో సంవత్సర సగటు వర్షపాతము 75 సె.మీ. తక్కువగానుండును. చలికాలంలో ఉష్ణోగ్రత $0^0$F - $50^0$F, వేసవిలో $103^0$F - $115^0$F లు ఉండును. చలి కాలము చివర్లో, వేసవి కాలము మొదట్లో వర్షాలు సామాన్యంగా పడతాయి. 4) సమ ఉష్ణ ప్రాంతము (Semi arid Zone) : ఇది ఉత్తర డకోటా మధ్య నుండి టెక్సాస్ వరకున్న ప్రాంతము. దీనిలో 3000 అడుగుల ఎత్తుగల పర్వతాలుంటాయి. దీని ఉత్తర ప్రాంతంలో వర్షపాతము 25 సెం.మీ., దక్షిణాన 62 సెం.మీ. లోపు ఉండును. ఉష్ణోగ్రత చలికాలంలో - $66^0$F నుండి $10^0$F వరకు, వేసవిలో $105^0$F నుండి $115^0$F వరకుండును. 5) ఉష్ణ ప్రాంతము (Arid Zone) : నెవాడా, ఉటా, అరిజోనా, న్యూ మెక్సికో మరియు ఆగ్నేయ కాలిఫోర్నియా ఆగ్నేయ ప్రాంతము మరియు టెక్సాస్ నైరుతీ భాగములలోనున్న ప్రాంతాన్ని అరిడ్ జోన్‌గా పిలువవచ్చును. ఈ ప్రాంతంలో వర్షపాతము 10 సెం.మీ. కంటె తక్కువ, వేసవిలో చాలా వేడిగా నుండును. ఉష్ణోగ్రత $134^0$F వరకుండును.

**1.2.6. సహజ సంపద (Natural resources) :** అమెరికాకు అపార సహజ సంపద, ఖనిజ సంపద ఉన్నది. ఆయా ప్రాంతాలలో లభ్యమయ్యే వస్తువులను బట్టి ఈ దేశాన్ని ఈ క్రింది జోన్స్‌గా విభజించవచ్చును.

**1) న్యూ ఇంగ్లండ్ ప్రాంతము :** పర్వతమయమైన ఈ ప్రాంతము శీతోష్ణస్థితి ప్రభావము వలన వ్యవసాయానికి అనుకూలంగా లేదు.

**2) మధ్య అట్లాంటిక్ ప్రాంతము :** ఇది న్యూ ఇంగ్లండ్ ప్రాంతము కంటే వ్యవసాయానికి అనుకూలంగా నుండును. కాయగూరలు, గోధుమ, వరి, కొబ్బరి మొదలగు పంటలు పండును. ఈ ప్రాంతము పారిశ్రామిక, వ్యాపార రంగాలు అభివృద్ధి చెందుట వలన అనేక పట్టణాలుద్భవించి, పట్టణ నాగరికత అభివృద్ధి చెందింది.

**3) దక్షిణ అట్లాంటిక్ ప్రాంతము :** ఇది అట్లాంటిక్ ప్రాంతము నుండి దక్షిణాన అపలేచియన్. మహామైదానము లోతట్టు ప్రాంతము వరకు విస్తరించియున్నది. ఇక్కడ సమ ఉష్ణమండల పంటలు పండును. పరిశ్రమలకు కావలసిన ముడి సరుకు ఇక్కడ విరివిగా లభించును.

**4) దిగువ మిసిసిపి లోయ ప్రాంతము :** ఇది చాలా సారవంతమైన ప్రాంతము. చెరుకు, వరి, సోయా చిక్కుడు, పత్తి సమృద్ధిగా పండును. ఈ పంటలకు సంబంధించిన పరిశ్రమలు గూడా బాగుగా స్థాపించబడ్డాయి. ఓహియో లోయ లేక ఎగువ మిసిసిపి లోయ ప్రాంతము వలన ఓహియో, టెన్నెసీ, కెంటకీ రాష్ట్రాలు వ్యవసాయకంగా కంటే పారిశ్రామికంగా బాగుగా అభివృద్ధి చెందాయి.

**5) మహామైదానము లోపలి ప్రాంతము :** ఇక్కడ గోధుమ, ధాన్యము సమృద్ధిగా పండే సారవంతమైన వ్యవసాయ భూములున్నాయి. వీనితో పాటు పౌల్ట్రీ, పాలు, గొఱ్ఱెల పెంపకము సర్వ సాధారణము.

**6) ఫసిఫిక్ పర్వత సముదాయము :** ఇది ఖనిజ సంపద బాగుగా లభించే ప్రాంతము. ఇక్కడ బంగారము, వెండి, రాగి, సీసము, జింక్ విరివిగా లభిస్తాయి. ఉప్పు సముద్రాలు, మంచికలప ఉన్న అడవులు సమృద్ధిగా ఉంటాయి. టెక్సాస్, ఓక్లాహోమా రాష్ట్రాలలో అధిక వర్షాల వలన వ్యవసాయము బాగుగా అభివృద్ధి చెందింది. ఆయిల్ నిక్షేపాలు బాగుగా ఉన్నాయి.

**1.2.7. అడవులు :** అమెరికాలో 1/3 వంతు అడవులున్నాయి. 20% కలప, 14% కాగితపు గుజ్జులు ఈ అడవుల ద్వారా లభ్యమగును. కోనిఫెరస్ అడవులలో అమెరికా ప్రపంచంలో రెండవ పెద్ద దేశము. పెరిగే వృక్ష సంపదను బట్టి అడవులను ఈ క్రింది విధంగా విభజించారు.

**1) టండ్రా అడవులు :** ఇవి ఉత్తర ప్రాంతంలో ఎక్కువగా నుండును. ఇక్కడ నేల పలుచగా నుండి నదీ వ్యవస్థ బాగుగా అభివృద్ధి చెందకపోవుట వలన మొక్కలు చాలా తక్కువగా పెరుగుతాయి. ఇక్కడ మాసెస్, అచెన్, సెడ్జెస్ వంటి చిన్న వృక్షాలు పెరుగుతాయి. వీనిలో ధ్రువపు ఎలుగబంటి, కారిబౌ, కస్తూరి మృగము, రైన్ డీర్ లాంటి జంతువులుంటాయి.

**2) టైగా అడవులు :** వీటిని బొరియల్ అడవులంటారు. ఇవి దక్షిణ కెనడా, అలాస్కాలలో నుండును. ఇక్కడ కోనిఫెరస్ లేక శృంగారపు వృక్షాలెక్కువ. ఇక్కడ కారిబౌ, బీవర్, మింక్ మొదలగు జంతువులుంటాయి.

**3) కొనిఫెరస్ అడవులు :** అలాస్కా ఫసిఫిక్ తీర ప్రాంతము, బ్రిటీష్ కొలంబియా, సెర్రా - నివోడా, కాలిఫోర్నియాలలో ఇవి బాగుగా పెరుగుతాయి. ముఖ్యంగా ఇక్కడ మెత్తని కలపనిచ్చు డగ్లస్ ఫెర్, రెడ్ సిడార్, హెమ్లాక్‌రకాల వృక్షాలు పెరుగుతాయి.

**4) గట్టి కలప ప్రాంత అడవులు :** అమెరికా ఈశాన్య ప్రాంతంలో ఇవి ఎక్కువగా లభిస్తాయి. గట్టి కలపనిచ్చే ఆకురాల్చే అడవులెక్కువ. బీచ్, బిర్చ్, యాపిల్, ఓక్, స్ప్రూస్ మొదలగు వృక్ష జాతులుంటాయి.

**5) మధ్యధరా అడవులు :** కాలిఫోర్నియా ప్రాంతాలలో ఇవి పెరుగుతాయి. ఇక్కడ చాలా ఎత్తైన మహగని, తాడిచెట్లు, చెర్రీలు, చెస్ట్‌నట్, వాల్‌నాట్ లాంటి వృక్షాలు పెరుగుతాయి.

**6) ప్రెయరీలు :** ఇవి ఏ వృక్షం లేని విశాలమైన పచ్చిక మైదానములు. అమెరికా నైఋతీ ప్రాంతము, కొలరాడో నదీ లోతట్టు ప్రాంతాలలో ఈ పచ్చిక భూములు పెరుగుతాయి.

**1.2.8. ఖనిజ సంపద :** ప్రపంచంలో ఎక్కువగా అభివృద్ధి చెందిన దేశం అమెరికా. దీనికి కారణము ఖనిజ సంపద సమృద్ధిగా లభించుటయే. లేక్ సుపీరియర్ పశ్చిమ ప్రాంతంలో ఇనుప గనులున్నాయి. ప్రపంచంలోని అతి పెద్ద ఇనుప ఉత్పత్తిదారులలో అమెరికా 5వ స్థానంలోఉన్నది. ప్రపంచ నిల్వలలో 9% ఇనుము ఈ దేశంలో కల్గియున్నది. నీలి పర్వత పంక్తికి పశ్చిమంగా నున్న ఆలీఘనీ పీఠభూమిలో బొగ్గు నిక్షేపాలున్నాయి. ముఖ్యంగా ఇండియానా, కెంటకీ, ఇల్లినాయిస్, టెక్సాస్, రాకీ పర్వతాలు మొదలగు ప్రాంతాలలో గనులెక్కువ. ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తి మరియు నిల్వ దారులలో ఈ దేశము రెండవది. కాలిఫోర్నియాకు దక్షిణానున్న లాస్ ఏంజల్స్ పరిసరాలు, అలాస్కాలలో చమురు గనులున్నాయి. ప్రపంచ నిల్వలలో 11% ఆయిల్ నిక్షేపాలు ఇక్కడే ఉన్నాయి. ప్రపంచంలో 13% పెట్రోలు అమెరికా ఉత్పత్తి చేస్తుంది. అరెగాన్ రాష్ట్రం నుండి 50% రాగి ఉత్పత్తి అవుతుంది. కొలరాడో పీఠభూమిలో బంగారము, వెండి, రాగి, సీసము లభిస్తాయి. రాకీ పర్వత ప్రాంతాలలో రాగి, యురేనియమ్, బంగారము, యశదము, సీసపు నిక్షేపాలున్నాయి. గల్ఫ్ తీరంలో ఖనిజ తైలము, సహజ వాయు నిక్షేపాలు పుష్కలంగా లభిస్తున్నాయి. ప్రపంచ గంధకం ఉత్పత్తిలో 90% అమెరికాలో నున్న గనుల నుండి ఉత్పత్తి జరుగును.

**1.2.9. అమెరికా సంయుక్త రాష్ట్రాలపై భౌగోళిక పరిస్థితుల ప్రభావం :** అమెరికా చరిత్రకు మూలాధారము దాని భూగోళ శాస్త్రము, శీతోష్ణస్థితి, సహజ వనరులు, సారవంతమైన నేలలు ముఖ్యంగా విదేశీ దాడుల నుండి రక్షణ మొదలగు అంశాల వలన అమెరికా సంయుక్త రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందింది. అమెరికా ఉత్తర భాగాన పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే, దక్షిణ ప్రాంతన వ్యవసాయకంగా వృద్ధి చెందింది. అడవులు, పచ్చిక బయళ్ళు ఎక్కువగా ఉండటం వలన కలప, పాడి పరిశ్రమలు స్థాపించబడి అమెరికా అతి వేగంగా అభివృద్ధి పథంలో నడిచింది. అమెరికా ఖండ భౌగోళికాంశాల వలన ఐరోపా నుండి వలస వచ్చినవారు చాలా మంది అమెరికాలో తూర్పు ప్రాంతంలో స్థిరపడి తూర్పు నుండి పడమరకు వ్యాప్తి చెందుట వలన కొన్ని ప్రదేశాలలో అధిక జన సాంద్రత గల జనాభాలున్న పెద్ద పెద్ద పట్టణాలేర్పడినాయి. వీటన్నింటికి ప్రధాన కారణము అమెరికా ఖండ భౌగోళికాంశాలే. అమెరికా చరిత్రపై వీటి ప్రభావం ఏ విధంగా ఉందో విపులంగా ఈ క్రింద పరిశీలించుదాం.

**1.2.9.1.** విశాలమైన ప్రదేశము : అమెరికా చాలా విస్తీర్ణముగల దేశం అగుట వలన పెరుగుతూ ఉన్న జనాభాకు అనువుగా ఉన్నది. 1607లో వర్జీనియా తీరంలో 104 మంది ఇంగ్లీషు వారు వలసలను స్థాపించారు. ఐరోపా దేశాలైన ఇంగ్లండు, ఐర్లండ్, జర్మనీ మొదలగు దేశాలకు చెందిన వలసదారులు నిరంతరంగా అమెరికాలో స్థిరపడుట వలన దాని జనాభా నాలుగు మిలియన్‌లకు పెరిగింది. 1900 సంవత్సరం నాటికి అమెరికా జనాభా 10 మిలియన్‌లకు చేరింది. ఈ 1960 నాటికి దాని జనాభా 180 మిలియన్‌లకు చేరింది. ఈ విధంగా ఆయా దేశాల నుండి అనేక మంది అధికంగా అమెరికాలో స్థిరపడిన జనాభాను భరించగల్గుతుందంటే దీనికి కారణము ఆ దేశము విశాలమైనదిగా నుండుటయే.

**1.2.9.2. తొలి స్థాపనలకు అనువైన భౌగోళికాంశాలు :** మొదటగా వచ్చిన ఐరోపా వలసదారులు స్థిరపడుటకు అట్లాంటిక్ తీరమైదానము సానుకూలంగా నున్నది. ఈ ప్రాంతంలో విస్తారంగా కలప లభించడం, నౌకా యానానికి అనువుగా నుండే అనేక నదులుండడం, బోస్టన్, న్యూయార్క్ వంటి సహజ ఓడరేవులుండడం, మొదలగు అంశాల వలన ఆంగ్లేయులు అట్లాంటిక్ తీర ప్రాంతంలో మొదటిగా 13 వలస రాష్ట్రాల నేర్పరచుకొనే అవకాశం కల్గింది. అ తర్వాత ఈ ప్రాంతమంతయు వ్యవసాయకంగాను, పారిశ్రామికంగాను బాగుగా అభివృద్ధి చెందడానికి భౌగోళికాంశాలే కారణమని చెప్పవచ్చును.

**1.2.9.3.** నిత్యమూ జరిగిపోయే సరిహద్దు రేఖ : ఎల్లప్పుడూ ఇతర దేశాల నుండి వచ్చి స్థిరపడే ప్రజల వలన నానాటికి జనాభా పెరుగుతూ ఉంది. దీనితోపాటు పరిశ్రమలు పెరిగి అనేక పట్టణాలేర్పడ్డాయి. దీనితో పట్టణ జనాభా పెరుగుట వలన అమెరికా దేశము నిత్యమూ పశ్చిమానికి పెరుగుతూ వస్తుంది. దీనికి కారణము పశ్చిమ ప్రాంతంలో జనాభా నివసించడానికి అనువైన ప్రదేశము ఈ దేశంలో ఉండుటయే. పైగా సరిహద్దు రేఖ విస్తరించుటయేగాక కొత్తవారు అమెరికాలో స్థిరపడుట వలన చెప్పనలవిగాని నూతన నాగరికత ఆవిర్భవిస్తుంది. ఈ నిరవధిక పశ్చిమ దిశ విస్తరణ, అమెరికా చరిత్ర మరియు ప్రజా జీవనాలపై రెండు విధాలుగా ప్రభావితం చూపుతుంది. 1) సరిహద్దు విస్తరణ వలన ప్రజల్లో పరస్పర అవగాహన, స్వేచ్ఛలు పెరిగి ప్రజాస్వామ్య దృష్టి ఏర్పడింది. ఫలితంగా అమెరికన్ ప్రజల జీవితాలలో ప్రజాస్వామ్యమనేది ఒక అంతర్భాగమైనది. 2) ఈ విస్తరణ వలన సరిహద్దు సమస్యలేర్పడుటయే గాక ఆర్థిక అసమానతలు ఉత్పన్నమై బానిసత్వ సమస్య ఏర్పడింది. ఈ సమస్య నానాటికి పెరిగి 1861 నాటికి అంతర్యుద్ధానికి దారి తీసింది.

**1.2.9.4.** రవాణా సంస్థపై ప్రభావము : అమెరికా చరిత్ర రూపకల్పనలో పర్వతాలు, మహా మైదానాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. ముఖ్యంగా అపలేచియన్ పర్వత శ్రేణుల ఉనికి మూలంగా ఈ చరిత్ర కొంత ప్రభావితం చెందింది. 1750 సంవత్సరం వరకు గల వలస యుగంలో అమెరికా చరిత్రలో పశ్చిమంగా వెళ్ళే ఇంగ్లీషు వారికి అపలేచియన్ పర్వతాలు అడ్డుగా నిలిచాయి. కాని ఫ్రెంచివారు మాత్రము ఈ పర్వతాలు దుర్గంగా నుండుట వలన, వీటిని దాటటానికి ఎలాంటి మార్గాలు లేనందు వలననే ఐరోపా వాసులు తూర్పు ప్రాంతంలో 13 వలసలు స్థాపించారు. అదే విధంగా 1800 సంవత్సరం నాటికి పశ్చిమ ప్రాంతంలో నున్న మిసిసిపి మహా మైదానాలలోని వ్యవసాయ భూముల్లో పండిన పంటలను తీర ప్రాంతాలకు చేరవేసే ప్రయత్నాలు ఈ శ్రేణుల వలన విఫలమైనాయి. అంతేగాక నదులు గూడ అనుకూలంగా లేకపోవడమే. చివరకు 1840 సంవత్సరంలో అపలేచియన్ పర్వతాల గుండా రైలు మార్గాలను నిర్మించడంతో ఈ సమస్య పరిష్కారమైనది.

**1.2.9.5.** భౌగోళిక భిన్నత్వ ప్రభావము : అమెరికాలోని వివిధ ప్రాంతాలలోని శీతోష్ణస్థితులు, సహ సంపదలు ఆ దేశ చరిత్రపై ప్రభావము చూపుతున్నాయి. వీటి వలన వివిధ ప్రాంతాలలో ఆర్థిక వ్యత్యాసాలేర్పడి క్షేత్రీయ వాదము లేదా ప్రాంతీయ వాదముద్భవించినది. అనగా ఉత్తర రాష్ట్రాలలో పరిశ్రమలు, వర్తక వ్యాపారాలు బాగుగా వృద్ధి చెందగా, దక్షిణ రాష్ట్రాలన్నియు వ్యవసాయ ప్రాంతాలైనాయి. కాల క్రమేణ వీరిరువురి మధ్య ఆంతర్యం పెరిగి స్వాతంత్ర్యానంతరము ఆయా ప్రాంతాల ప్రజలు, “తాము అమెరికన్‌లమనే'' మాట మరచి ఉత్తర ప్రాంతవారమని, దక్షిణ ప్రాంత వారమని, పశ్చిమ ప్రాంతవారమనే భేదాభిప్రాయాలతో ఉండేవారు. భౌగోళికంగా ఏర్పడిన భిన్నత్వ ప్రభావము వలన వివిధ రకాల జీవన మార్గాలు వీరిలో ప్రస్ఫుటంగా కనిపించేవి. చివరకు బానిస వ్యవస్థ విషయమై ఔత్తరాహులు, దక్షిణాత్యుల మధ్య బేధాలు పెరిగి 1861 నాటికి అంతర్యుద్ధానికి దారి తీశాయి. కావున అమెరికాలో తలెత్తిన క్షేత్రీయ వాదానికి మూలకారణం వివిధ ప్రాంతాలలో నున్న భౌగోళిక భిన్నత్వమే.

**1.2.9.6. నూతన సంస్కృతి ఆవిర్భావము :** పైనుదహరించనట్లుగా అమెరికా భౌగోళిక పరిస్థితుల వలన అమెరికాలో ఒక నూతన సంస్కృతి ఉద్భవించింది. ప్రారంభంలో ఇంగ్లీషు, ఐరిష్, ఫ్రెంచి, స్పానిష్, ఆఫ్రికన్ జాతుల ప్రజలు అమెరికాలో స్థిరపడి భౌగోళిక స్థితి గతుల వలన ఔత్తరాహులు, దక్షిణాత్యులు, పశ్చిమ వాసులనే భావనతో విడిగానుండేవారు. కాలక్రమేణ వీరందరూ కలిసి మెలసి సహ జీవనం ప్రారంభించారు. వీరిలో కులాంతర వివాహాలు, మతరహిత భావాలు పెరిగి ఒక నూతన సంస్కృతి సమాజం గల రాజ్యంగా నిర్మించాలనే భావన ఏర్పడింది. ఆర్థిక సంబంధాలు పెంచుకొని ఐరోపా వారితో సంబంధం లేకుండా ఒక నూతన స్వతంత్ర దేశంగా రూపుదిద్దుకోవాలనే యోచన అమెరికన్‌లందరిలో కల్గింది. ఆచార్య ఆస్కార్ హాండిలిన్ చెప్పినట్లు" అమెరికన్లు 1790-1820 మధ్యలో స్వయం ప్రతిపత్తి గల సంస్కృతి కోసం ప్రయత్నించారు. వీరు ఐరోపా నుండి విమోచన పొంది వారి కంటె మిన్నగా సాంస్కృతికాభివృద్ధి చెందారు". కావున అమెరికన్లు పాత ప్రపంచ సంస్కృతిని అనుసరించని ఒక కొత్త నాగరికతను సృష్టించి, ప్రపంచంలో తమ దేశాన్ని అగ్రగామిగా నిలిపారు

**1.2.9.7. ప్రజా జీనవంపై తీవ్ర ప్రభావం చూపే శీతోష్ణ స్థితి :** మెక్సికో సింధుశాఖలో ఏర్పడిన సముద్ర గాలులు, పవనాలు, అమెరికా శీతోష్ణ స్థితిపై తీవ్ర ప్రభావమును చూపుతున్నాయి. భూమధ్య రేఖా ప్రాంతం నుండి ఉద్భవించే ఉష్ణ ప్రవాహాల వలన ఆగ్నేయ ప్రాంతమంతయు వేడిగా మారును. ఈ వేడి ప్రవాహాల వలన ఉష్ణ మండల తుఫాన్‌లైన కత్రినా, హరికేన్, రీటా హరికేన్, టార్నాడోలు మొదలైనవి సంభవించి టెక్సాస్, లూయిసియానా వంటి రాష్ట్రాలలో తీవ్ర విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. వీటి వలన భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు మరియు 160-200 కి.మీ. వేగంతో పెనుగాలులు వచ్చి ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ విధంగా అమెరికా శీతోష్ణ స్థితుల్లోని భేదాలు, మార్పుల వలన దేశ ఆర్థిక వ్యవస్థ మరియు ప్రజల జీవన విధానంపైన చాలా ప్రభావం చూపుతుంది.

**1.2.9.8. విదేశీ విధానంపై ప్రభావము :** అమెరికా విదేశీ విధానంపై గూడ భౌగోళికాంశాలు ప్రభావం చూపుతున్నాయి. ఈ దేశానికి 4000 కి.మీ. పొడవుగల సముద్ర తీరముండుట వలన అది సురక్షితంగా నుండుటయే గాక ఒక శతాబ్ద కాలం పాటు ఐరోపా రాజకీయాలకు దూరంగా ఉండి దేశాభివృద్ధికి అవకాశం కల్గింది. ఐరోపావారు అమెరికాలో తాము స్థాపించుకొన్న వలసలను 1822 సంవత్సరంలో తిరిగి స్పెయిన్‌కు స్వాధీనం చేయడానికి ప్రయత్నించినపుడు అమెరికా అధ్యక్షులు ప్రఖ్యాతిగాంచిన మన్రో సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం "భవిష్యత్‌లో ఏ విదేశీ శక్తి అమెరికా అంతరంగిక విషయంలో జోక్యం చేసుకోరాదు". అందువలన ఏ ఐరోపా రాజ్యం అమెరికా విషయాలలో జోక్యం చేసుకోకపోవుట వలన అమెరికా పారిశ్రామికాభివృద్ధి, అంతర్నిర్మాణాభివృద్ధి, జరిగి ప్రపంచంలోనే గొప్ప శక్తివంతమైన రాజ్యంగా ఎదిగింది.

## 1.3. సారాంశము :

ఉత్తర అమెరికా ఖండము ప్రపంచంలోని 3వ పెద్ద ఖండము. ఇది భారతదేశానికి 8 రెట్లు, ఇది మంచి వ్యాపార కేంద్రం. దీనిలో మెట్ట భూములు, సారవంతమైన మైదానాలు, పర్వత శ్రేణులు, వివిధ రకాల శీతోష్ణస్థితి, వర్షపాతము మొదలగు భౌగోళికాంశాలే అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అగుపిస్తాయి. అమెరికా నైసర్గిక స్వరూపాన్ని బట్టి అట్లాంటిక్ తీర మైదానము, అపలేచియన్ పర్వత శ్రేణులు, మిసిసిపి లోయ ప్రాంతంలోని మెక్సికో సింధు శాఖ, మధ్య మహా మైదానము, రాకీ పర్వతాలు, ఫసిఫిక్ తీర ప్రాంతాలుగా విభజించారు. నదులు, వాతావరణము, శీతోష్ణ స్థితిగతులను బట్టి అమెరికాలో అతి శీతల, శీతల, సమ శీతల, సమ ఉష్ణ, ఉష్ణ ప్రాంతాలుగాను అలాగే న్యూ ఇంగ్లండ్ ప్రాంతం, మధ్య అట్లాంటిక్ ప్రాంతం, దక్షిణ అట్లాంటిక్ ప్రాంతం, దిగువ మిసిసిపి, మహా మైదాన ప్రాంతాలుగా విభజించవచ్చును. పైనుదహరించిన భౌగోళికాంశాలతో పాటు సహజ సంపద, ఖనిజ సంపదల ప్రభావము అమెరికా చరిత్రపై చూపుచున్నది. అది పారిశ్రామికంగా, వ్యవసాయకంగా వర్తక వాణిజ్య పరంగా అతి తక్కువ కాలంలో ఎదిగి ప్రపంచ రాజ్యాలలో అగ్రగామిగా నిలిచిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

## 1.4. నమూనా ప్రశ్నలు :

**1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)**

1. అమెరికా సంయుక్త రాష్ట్రాల భౌగోళిక పరిస్థితులను వివరింపుము.
2. అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రపై ఉత్తర అమెరికా భౌగోళికాంశాల ప్రభావమెట్టిదో వివరింపుము.

**2) లఘు వ్యాసరూప ప్రశ్నలు (15 మార్కులు)**

1) అమెరికా సంయుక్త రాష్ట్రాల నైసర్గిక స్వరూపమును గూర్చి వ్రాయుము.
2) అమెరికా సంయుక్త రాష్ట్రాల అడవులు, సహజ సంపదను గూర్చి క్లుప్తంగా వ్రాయుము.

## 1.5. చదువదగిన గ్రంథాలు :

1. Brown. R.H : Historical Geography of the United States
2. Elson. H.W. : History of United States of America
3. Hardlin Oscar : America - A History
4. Hill C.P. : A History of United States
5. Parkes H.B. : The United States of America
6. Semple. E.C. : American History and its Geographic Conditions
7. డా॥ వేమూరి కామేశ్వరరావు & శ్రీ భాగవతుల లక్ష్మీనారాయణ- అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర (తెలుగు అకాడమి)

**- ఎం. బోసుబాబు**

పాఠం - 2

# ఐరోపావారి రాక - అమెరికాలో బ్రిటీష్, స్పానిష్, ఫ్రెంచి వలసల స్థాపన - అమెరికాలో ఆంగ్లో-ఫ్రెంచి సంఘర్షణ - అమెరికా వలసల మీద బ్రిటీషు వారి విధానాలు

## 2.0. లక్ష్యం :

ఉత్తర అమెరికాకు ఐరోపావారు ప్రవేశించడం, స్పానిష్, ఫ్రెంచి, బ్రిటీష్ వారు అమెరికాలో వలసలను స్థాపించడం, అమెరికాలో వలసల విస్తరణ కోసం సాగిన ఆంగ్లో ఫ్రెంచి యుద్ధాలు, అమెరికాలో చివరకు స్థిరపడిన బ్రిటీషువారు, అమెరికాలో అమలు చేసిన బ్రిటీష్ పరిపాలనా విధానాలు మొదలగు అంశాలను గురించి తెలిసికొనుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


2.1. పరిచయము

2.2. తొలి భౌగోళిక అన్వేషణలు - అభివృద్ధి

2.3. అమెరికాలో ఐరోపావారి వలసల స్థాపన

2.3.1. స్పెయిన్ వారి వలసలు

2.3.2. ఫ్రెంచి వారి వలసలు

2.3.3. ఇంగ్లీషు వారి అన్వేషణలు - వలసలు

2.3.3.1. వర్జీనియా వలస స్థాపన (1607)

2.3.3.2. ప్లీమౌ, మెసాచూసెట్స్‌లలో వలసల స్థాపన

2.3.3.3. న్యూయార్క్, డెలవేర్‌లో వలసలు

2.3.3.4. రోడ్ ఐలాండ్స్‌లో వలసలు

2.3.3.5. మేరీలాండ్ వలసలు

2.3.3.6. న్యూహంప్‌షైర్ మరియు మెయిన్ వలసలు

2.3.3.7. నూజెర్సీ వలసలు

2.3.3.8. ఉత్తర, దక్షిణ కెరొలినా వలసలు

2.3.3.9. పెన్సిల్వేనియా వలసలు

2.4. అమెరికాలో ఆంగ్లో - ఫ్రెంచి సంఘర్షణ

2.4.1. విలియం రాజు యుద్ధం

2.4.2. రాణి అనీ యుద్ధం

2.5.3. జార్జి చక్రవర్తి యుద్ధం

2.5.4. సప్త వర్ష సంగ్రామము

2.6. అమెరికా వలసల మీద బ్రిటీష్ వారి విధానాలు

2.6.1. ప్రభుత్వ పాలనలో వలస ప్రజల ప్రాతినిధ్యం

2.6.2. రిట్స్ ఆఫ్ అసిస్టెన్

2.6.3. ఇంగ్లండ్ వాణిజ్య పద్ధతి

2.6.4. ఇతర శాసనాలు

2.7. నమూనా ప్రశ్నలు

2.8. చదువదగిన గ్రంథాలు

## 2.1. పరిచయము :

జెరూసలేములో పుట్టిన క్రైస్తవ మతము ఆసియా, ఐరోపాలలో వ్యాపించి ప్రపంచ మతంగా విస్తరించింది. ఈ మతం పుట్టిన షుమారు 500 సంవత్సరాలకు అరేబియాలో పుట్టిన ఇస్లాం మతం గూడా ఇదే విధంగా ప్రపంచ మతంగా విస్తరిస్తూ ఉంది. ఈ విస్తరణలో భాగంగా క్రైస్తవుల పవిత్ర స్థలాలన్నింటినీ సారసెన్ అనే ముస్లిం వర్గం వారు జయించుకొన్నను క్రైస్తవులు తమ వ్యాపారం దృష్ట్యా ఓర్పు వహించారు. ఐరోపా వ్యాపారమంతయు కాన్‌స్టాంట్ నోపుల్ (ఇస్తాంబుల్) అను పట్టణం గుండా సాగేది. సారసెన్ ముస్లింలకు యుద్ధం, పోరాటం అంటే చాలా ప్రీతి. వ్యాపారం కోసం తమ ప్రాంతాలకొస్తున్న క్రైస్తవులను ఇబ్బంది పెడుతూ ఎన్నో అవరోధాలు కలుగజేశారు. ఈ ముస్లింల ప్రవర్తనకు క్రైస్తవులు ఆగ్రహించి తమ పుణ్యక్షేత్రాల విముక్తి కొరకు ముస్లింలతో యుద్ధాలు చేశారు. వీటినే పవిత్ర యుద్ధాలంటారు. ఈ సందర్భంలో 1453లో తురుష్కులైన ముస్లింలు కాన్‌స్టాంట్ నోపుల్ పట్టణాన్ని హస్తగతం చేసికోవడంతో ఆసియా - ఐరోపాల మధ్య భూ మార్గం గుండా జరిగే వర్తకానికి తెరపడింది. ఫలితంగా పాశ్చాత్యులు సముద్ర మార్గ అన్వేషణల మీద దృష్టిని కేంద్రీకరింపజేశారు. దీనికి తోడు 13వ శతాబ్ది యాత్రికుడైన మార్కోపోలో తన గ్రంథమైన 'ట్రావెల్స్'లో తూర్పు దేశాల సంపదను గూర్చి వివరిస్తూ వాటితో వ్యాపారం లాభమని తెలిపాడు. ఇదే సమయంలో ఉత్తర, దక్షిణ దిక్కులను చూపించే నావికా దిక్సూచిని కనుగొన్నారు. ఈ తరుణంలోనే అలెగ్జాండ్రియా విశ్వవిద్యాలయ శాస్త్రజ్ఞులు భూమి గుండ్రంగా నున్నదని ఉద్ఘాటించారు. అందువలన పడమటి దిక్కుగా సముద్రం గుండా ప్రయాణం చేసి తూర్పున ఉన్న భారతదేశం, చైనా మొదలగు దేశాలకు చేరవచ్చునని ఔత్సాహికులైన నావికులు, వర్తక వ్యాపారులు భావించారు. వీనికి తోడు పోర్చుగల్ రాకుమారుడు, నావిగేటర్ బిరుదాకింతుడైన హెన్రీ దేశ పటాలు గీచే వారిచేత దేశపటాలను తయారు చేయించాడు. పైగా ఈయన నౌకాయాన పాఠశాలను స్థాపించి నావికులకు శిక్షణ ఇప్పించేవాడు. ఈయన ప్రోత్సాహంతోనే 1487లో బర్తలోమియా డయాజ్, 1498లో వాస్కోడిగామాలు ఆఫ్రికాను చుట్టి ఇండియాకు సముద్రమార్గాన్ని కనుగొన్నాడు. ఈ ప్రయాణ ఫలితంగా అన్ని ఐరోపా దేశాలవారు వారి వారి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

తూర్పు దేశాలకు సముద్రమార్గం కనుగొనే ప్రయత్నంలో పోర్చుగల్ ఉండగా, స్పెయిన్ చక్రవర్తుల ప్రోత్సాహంతో ఇటలీలోని జెనీవాకు చెందిన క్రిస్టోఫర్ కొలంబస్, తూర్పు దేశాల్లో లభించే సుగంధ ద్రవ్యాలు, బంగారం మొదలైన వస్తువుల వేటలో భాగంగా 1492లో ఇండియాకు చేరాలనే ఉద్దేశ్యంతో బయలుదేరి 'చీకటి సముద్రంగా' పేరుగాంచిన అట్లాంటిక్ మహా సముద్రాన్ని దాటి ఒక కొత్త ప్రపంచాన్ని వెలికితీసి అమెరికా చరిత్రకు పునాది వేశాడు. కొలంబస్ మొదట తాను కాలిడిన ప్రదేశము బహామాస్‌లోని ఒక దీవి. దీనికి సాన్ సాల్వడార్ అనిపేరు పెట్టాడు. 8నెలల తర్వాత కొలంబస్ అనేక పక్షులు, బంగారు ఆభరణాలు, కొంతమంది రెడ్ ఇండియన్‌లతో తిరిగివచ్చినందుకు స్పెయిన్ అతన్ని ఘనంగా సన్మానించింది. ఆ తర్వాత కొలంబస్ మూడుసార్లు కొత్త ప్రపంచానికి వెళ్ళినపుడు

తాను ఆశించిన వస్తువులు దొరకక పోవుటతో నిరుత్సాహంతో తిరిగివచ్చాడు. అయితే కొత్త అన్వేషణల వలన యూరోపియన్‌ల దృష్టి తూర్పు ప్రాంతాల సంపదల నుండి పశ్చిమ ప్రాంతాల వైపుకు మళ్ళింది.

## 2.2. తొలి భౌగోళిక అన్వేషణలు - అభివృద్ధి

తూర్పు దేశాలకు సముద్ర మార్గం కనుక్కోవడంలో కొలంబస్ విఫలం చెందాడన్న వార్త ఐరోపా దేశాలలో దావాలనంగా వ్యాపించింది. దీనికి స్పందించిన ఇటలీలోని జనీవా ప్రాంత వాసి, ఇంగ్లండ్‌లో స్థిరపడిన జాన్ కాబట్ **1497** లో ఇంగ్లండ్ రాజైన 7వ హెన్రీ ప్రోత్సాహంతో బయలుదేరి ఉత్తర అమెరికాలోని న్యూ ఫాండ్‌లాండ్ ప్రాంతాన్ని చేరి తిరిగి వచ్చాడు. మరల అతడు **1498**లో తన కుమారుడైన సెబాస్టియన్‌తో బయలుదేరి ఉత్తరాన కెనడా, దక్షిణాన ఉత్తర కెరొలినాలను కనుగొన్నాడు. అయితే తాను చేరుకొన్న ప్రాంతము ఆసియాలో ఒక భాగమని భావించి తన పొరపాటును తెలికోకుండానే చనిపోయాడు. ఈ రెండు సార్లు కూడా ఆశించిన సంపదగాని, తూర్పు దేశాల మార్గం గాని సాధించలేకపోవడంతో ఇంగ్లండ్ రాజుకు ఉత్సాహం సన్నగిల్లింది.

**1500**లో పోర్చుగీస్ కెప్టెన్ పెడ్రోకాబ్రాల్ అనుకోకుండా దక్షిణ అమెరికాలోని బ్రెజిల్‌ను కనుగొన్నాడు. ఇటలీలోని ఫ్లొరెంటీన్ నగరానికి చెందిన అమెరిగో వెస్పూచి అను ఓడల వ్యాపారవేత్త **1497-1512** ల మధ్య సముద్ర యానాలు చేసి **1507**లో ఉత్తరాల ద్వారా తన స్నేహితులకు అమెరికా ప్రయాణ విశేషాలను వివరించాడు. వీనిలో ఒక ఉత్తరం జర్మన్ భౌగోళిక శాస్త్రవేత్తకు దొరకడంతో వెస్పూచి వర్ణించిన దేశానికి 'అమెరికా' అను పేరు ఖాయం చేయడమైనది. **1513**లో స్పెయిన్ దేశానికి చెందిన వాస్కో న్యూనిజ్ డి బాల్బోవా, పనామా జలసంధి ద్వారా ప్రయాణించి దక్షిణ సముద్రమని పేరు పెట్టిన ఈనాటి పసిఫిక్ మహా సముద్రాన్ని కనుగొని కొలంబస్ కనుగొన్నది ఆసియా కాదని నిరూపించాడు.

## 2.3. అమెరికాలో ఐరోపా వారి వలసల స్థాపన :

తొలి భౌగోళిక అన్వేషణల ఆధారంగా 16వ శతాబ్ది ద్వితీయ భాగం నుండి ఐరోపా దేశాలైన స్పెయిన్, ఫ్రెంచి, బ్రిటీష్ వారు అమెరికాలో ఆయా ప్రాంతాలలో వలసలను స్థాపించారు. వివిధ దేశాలవారు స్థావరాలేర్పరచినను, అమెరికా చరిత్ర గతిని మార్చిన ఘనత ఇంగ్లీషు వారికే దక్కుతుంది. వాటి వివరాలు ఈ క్రింద తెలిసికొందాము.


**2.3.1. స్పెయిన్ వారి వలసలు : 1513**లో జువాన్ ఫోన్స్ డి. లియోన్ స్పెయిన్ లోని పోర్చొరికో నుండి బయలు దేరి ఫ్లోరిడా (పూలతో నిండిన స్థలం)ను కనుగొని మొదటి స్పానిష్ పతాకాన్ని ఉత్తర అమెరికాలో ఎగురవేశాడు. ఇతడు ఇక్కడే ఇండియన్స్ చేతిలో మరణించాడు. వాస్కో న్యూనిజ్ డి. బాల్బోవా సేకరించిన సమాచారంతో స్పెయిన్‌లోనున్న పోర్చుగీస్ నావికుడు ఫెర్డినాండో మాజిలాన్ **1519**లో మొదటిసారిగా ప్రపంచాన్ని చుట్టి రావాలని బయలుదేరాడు. అట్లాంటిక్, పసిఫిక్ సముద్రాలలో ప్రయాణించేటపుడు ఆకలి చావుతో చాలా మంది నావికులు చనిపోయారు. చివరకు మిగిలిన నావికులతో కొన్ని దీవులను చేరాడు. స్పెయిన్ రాజైన ఫిలిప్ గౌరవార్థం వాటికి ఫిలిప్పైన్స్ దీవులను పేరుపెట్టాడు. ఇక్కడే మాజిలాన్ స్థానికులతో గొడవలు పెట్టుకొని ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. కాని అతనితో బయలుదేరిన ఒక నౌక మూడు సంవత్సరాల తర్వాత **1522**లో స్పెయిన్ చేరింది. మాజిలాన్ నౌకాయానం వలన అమెరికా ఒక కొత్త ప్రపంచమని, దీనికి తూర్పున అట్లాంటిక్ సముద్రము, పశ్చిమాన పసిఫిక్ సముద్రములున్నాయని, భూమి గుండ్రంగా నున్నదని స్పష్టమైనది. **1519**లోనే స్పెయిన్‌కు చెందిన మరొక నావికుడు హెర్నాండో డి కార్టేజ్ క్యూబా నుండి బయలుదేరి బంగారం దొరికే ప్రాంతమైన మెక్సికోలో స్థావరాన్ని ఏర్పరచాడు. స్పెయిన్ చెందిన ఫ్రాన్సిస్కో పిజారో తన అనుచరులతో పనామా నుండి **1531**లో బయలుదేరి దక్షిణ అమెరికాలోని పెరూను జయించి, అక్కడనున్న ఇస్కాలు అనే ఇండియన్‌లను లొంగదీసుకొని వారి దగ్గర నుండి ఒక పెద్ద గదికి సరిపడే వెండి, బంగారాన్ని డి కార్టేజ్ కంటే ఎక్కువ సంపాదించాడు. **1535**లో పిజారో అను మరొక స్పానిష్ పరిశోధకుడు ఇన్కాస్ ప్రాంతాన్ని (పెరూ ప్రాంతం) ఆక్రమించి, వలసను స్థాపించాడు. **1539**లో హెర్నాండో డిసాటో తన **130** మంది అనుచరులతో బయలుదేరి నీటి పితగా పిలువబడే మిసిసిపి లోయ ప్రాంతాన్ని కనుగొన్నాడు. ఈ విధంగా 15వ శతాబ్ది ద్వితీయార్ధానికి అమెరికా సంయుక్త రాష్ట్రాలపై స్పెయిన్ తన ఆధిపత్యాన్ని ప్రకటించుకోగల్గింది. అంతేగాక ఈ ప్రాంతం నుండి వెండి, బంగారాలను

తమ నౌకల నిండా స్పెయిన్ తెచ్చుకుంటూ ఉండేది. దీన్ని చూసి బ్రిటీషు ఓర్వలేక ఆంగ్ల సముద్రపు దొంగలు ఎలిజబెత్ రాణి ప్రోత్సాహంతో స్పెయిన్ నౌకలను విచ్చలవిడిగా దోచుకోసాగినారు. ఈ దురాగతాలను అరికట్టడానికి స్పెయిన్ రాజైన్ ఫిలిప్ ఇంగ్లండ్‌ను జయించడానికి 1588లో 'స్పానిష్ ఆర్మడా'ను ఆ దేశం మీదకు పంపింది. ఈ పోరాటంలో స్పెయిన్ ఓడిపోవడంతో ఉత్తర అమెరికా తీరంపై ఇంగ్లండ్‌దే పై చేయి అయింది. అలాగే భూ ఆక్రమణల విషయంలో పోర్చుగల్, స్పెయిన్‌ల మధ్య సమస్యలుత్పన్నము కాకుండా ఉండడానికి 1493లో పోప్ అలెగ్జాండర్ VI భూ సరిహద్దు గీయడంతో వారి మధ్య యుద్ధానికి అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా ఉత్తర అమెరికాలోని పశ్చిమ ప్రాంతము, దక్షిణ అమెరికాలో బ్రెజిల్ మరియు చుట్టూ నున్న ప్రాంతం మినహాయించి మిగిలిన ప్రాంతమంతయు స్పెయిన్ ఆధీనంలోనికి వచ్చింది.

**2.3.2. ఫ్రెంచి వారి వలసలు :** ఇతర ఐరోపా వారి వలెనే ఫ్రెంచివారు కూడా సముద్ర మార్గాల అన్వేషణ, వలసల స్థాపనలను కొనసాగించారు. తొలి రోజుల్లో బ్రిటీష్ కంటే వీరు వీటి పట్ల ఎక్కువ శ్రద్ధ వహించారు. ఫ్రెంచి తరపున వెర్రజోనా అను వ్యక్తి 1524లో కెరొలినా నుండి న్యూఫౌండ్ లాండ్ వరకున్న ఉత్తర అట్లాంటిక్ తీరాన్నంతా పరిశీలించాడు. 1535-36 లలో జాక్వస్ కార్టియర్ మూడు సార్లు కొత్త ప్రపంచానికి వెళ్ళాడు. ఇతడు సెంట్ లారెన్స్ నదీ ముఖ ద్వారా కెనడాలోని మాంట్రియల్ ప్రాంతాన్ని పరిశీలించాడు. 1589 నాటికి ఫ్రెంచివారు అనేక ప్రయత్నాల ఫలితంగా బ్రెజిల్, పశ్చిమ ఇండియా దీవులు, దక్షిణ కెరొలినా, ఫ్లారిడాలలో ఫ్రెంచి వలసలను స్థాపించారు. సెయింట్ క్రోయిక్స్, రాయల్ పోర్ట్ వలసలను స్థాపించిన శామ్యూల్ డి చాంప్లెయిన్ అనే ఉన్ని వర్తకుడు క్విబెక్‌లో వలసను స్థాపించి "ఫాదర్ ఆఫ్ కెనడా" అని ప్రసిద్ధి చెందాడు. 1613 - 1616 సంవత్సరాల మధ్య చాంప్లెయిన్ ఈ వలసలను ఒట్టావా వరకు వ్యాప్తి చేసెను. ఇతని తర్వాత వచ్చిన ఉన్నివర్తకులు స్థానిక ఇండియన్‌లతో భాగుగా స్నేహం చేసి వర్తకాన్ని అభివృద్ధి చేసారు. ఫ్రెంచి వలసలను అభివృద్ధి చేసే దానిలో భాగంగా 1664 లో కాల్బర్ట్ అనునతడు "ది ఫ్రెంచి వెస్ట్ ఇండియా కంపెనీ" ను స్థాపించి, కార్టియర్ కనుగొన్న మౌంట్ రాయల్ లేక్ న్యూ ఫ్రాన్స్ ప్రాంతాన్ని ప్రధాన వలసగా అభివృద్ధి చేశాడు. 1669లో ఫ్రెంచి మిషనరీలు మరియు అన్వేషకులు కొత్త ప్రపంచంలో ఫాక్స్ నది దిగువనున్న విస్ కాన్సిన్, మిసిసిపిల గుండా అర్కాన్సాస్ ముఖ ద్వారానికి వచ్చి మెక్సికో సింధు శాఖ చేరారు. ఈ విధంగా ఫ్రెంచివారు ఆయా ప్రదేశాలను అన్వేషించి సెయింట్ లారెన్స్ నుండి మెక్సికో సింధుశాఖకు నీటి మార్గాన్ని కనుగొన్నారు. ప్రముఖ ఉన్ని వర్తకుడైన లాసెల్లె, ఒంటారియో సరస్సు దగ్గర ఎరాంటినాక్ అను కోట నేర్పాటు చేశాడు. 1679లో ఇల్లినాయిస్ నది దగ్గర మిచిగాన్ సరస్సు దిగువన సెయింట్ లూయిస్ అను మరొక కోట నేర్పాటు చేశారు. 1682 నాటికి లాసెల్లె ఈ దీవినంతటిని అన్వేషించి ఈ లోయ ప్రాంతానికి ఫ్రాన్స్ రాజుపేరుతో లూయిసియానా అని పేరు పెట్టాడు. 1725 నాటికి ఫ్రెంచి కంపెనీ ఈ లోయలో ఎక్కువ భాగాన్ని వలస క్రిందకు తెచ్చింది. 1731 నాటికి మిసిసిపి లోయ, వెస్ట్ ఇండీస్ ప్రాంతాలు ఫ్రెంచి ఆధీనంలోనున్నాయి. ఈ ప్రాంతాలన్నియు సారవంతమైన నదులుండుట వలన వ్యవసాయోగ్యంగా నున్నవి. ఆంగ్లో-ఫ్రెంచి సంఘర్షణ అనంతరము జరిగిన 1763 పారిస్ సంధి ప్రకారం వీనిలో కొంత భాగము వదులుకోవలసి వచ్చినది.

**2.3.3. ఇంగ్లీషు వారి అన్వేషణలు - వలసలు :** కొలంబస్ అమెరికాను కనుగొన్న తర్వాత 1487లో జాన్ కాబట్ అన్వేషణల ద్వారా న్యూపాండ్ లాండ్, వర్జీనియాలను వరుసగా గుర్తించారు. అయితే బ్రిటీష్ వారు ఈ ప్రాంతాలలో వలసలను స్థాపించడం గాని లేదా స్వాధీన పరచుకొనడంగాని ప్రయత్నించలేదు. దీనికి రాజకీయ, మత సమస్యలు, స్పెయిన్‌తో యుద్ధం మొదలగు అంతర్గత కారణాలుగా చెప్పవచ్చును. 8వ హెన్రీ (1509-47), మేరీ ట్యూడర్ (1553-58)ల పాలనా కాలాల్లో అన్వేషణల పట్ల పెద్దగా శ్రద్ధ వహించలేదు. కాని మొదటి ఎలిజబెత్ రాణి (1558-1603) పాలన ప్రథమ భాగంలో భూభాగ అన్వేషణలు కొన్ని జరిగాయి. 1576లో మార్టిన్ ఫ్రోబిషనర్ అను యాత్రికుడు లాబ్రడోర్ తీర ప్రాంతంను కనిపెట్టాడు. 1577లో ఫ్రాన్సిస్ డ్రేక్ ముందుగా మాజిలాన్ చూపిన మార్గంలో ప్రయాణించి తూర్పు దీవులు, బ్రెజిల్ తూర్పు తీర ప్రాంతాలను తెలిసికొన్నాడు. కాని ప్రభుత్వ సహకారం లోపించిన కారణంగా అన్వేషణలను తాత్కాలికంగా ఆపివేయడమైనది. ఆ తర్వాత రాణి ప్రోత్సాహంతో 1583లో గిల్‌బెర్ట్ విజయవంతంగా న్యూ పాండ్‌లాండ్ చేరి అక్కడే మరణించాడు. 1584లో రాణి ప్రోద్బలంతో వాల్టేర్ రాలే వర్జీనియా, ఉత్తర కెరొలినా ప్రాంతాలను చేరుకొన్నాడు. రాణి పేరుతో నున్న వర్జీనియా బ్రిటీష్ వారి మొదటి శాశ్వత వలస ప్రాంతం రాలేతో కలిసిన అనుచరులందరూ కొత్త ప్రపంచం యొక్క విశిష్టతను రాణీకి తెలియజెప్పడంతో అమెరికా వలసలపై ఆమె ఆసక్తిని కనబరచింది. ఇదే సమయంలో ఇంగ్లండ్ పారిశ్రామికంగా

అభివృద్ధి చెందుతూ అధిక లాభార్జన కొరకు అమెరికాలో వలసల నేర్పరచి వర్తకం చేయాలనే ఆలోచన కల్గింది. సర్ థామస్ మూర్ 1516లో లాటిన్ భాషలో వ్రాసిన 'ఉటోపియా' అను గ్రంథం ఇంగ్లీష్ వారిని అమెరికా వైపుకు దృష్టి మరల్చింది. ఇందుకు అన్ని విధాలా అభివృద్ధి చెంది అడ్డుగానున్న స్పెయిన్‌ను దెబ్బదీయడానికి ఎలిజబెత్ నిర్ణయించింది. అందుకు స్పానిష్ నౌకలను, ఓడరేవులను ధ్వంసం చేయడానికి ఆమె ఇంగ్లీష్ ఓడ దొంగలను ఉసికొల్పింది. ఫ్రాన్సిస్ డ్రేక్ నాయకత్వంలో స్పెయిన్ నౌకలను పట్టుకొని వెండి, బంగారాలను దోచుకుంటూ ఆర్థిక ఇబ్బందులను కల్గజేసింది. దీనితో స్పానిష్ రాజైన 2వ ఫిలిప్ 1588లో 'స్పానిష్ ఆర్మడా' అను పేరుతో 150 నౌకలతో బ్రిటీష్ పై యుద్ధం ప్రకటించింది. ఈ యుద్ధంలో ఇంగ్లండ్ విజయం సాధించడంతో నిరాటంకంగా అమెరికాలో వలస రాజ్యాలనేర్పరచుటకు అవకాశమేర్పడింది. 1606లో మొదటి జేమ్స్ ఒక చార్టర్ తయారు చేయడంతో లండన్ వర్తకులు అమెరికాలో ఆయా వలసలను స్థాపించడం మొదలు పెట్టారు. అమెరికాకు చేరిన వలస ప్రజల్లో ఇంగ్లీషు వారే ఎక్కువ. ఆయా వలసల స్థాపన వైనాన్ని ఈ క్రింది తెలిసికొందాము. (పటం. 3 చూడండి)




పటం.నెం.3

**2.3.3.1. వర్జీనియా వలస స్థాపన (1607) :** లండన్ కంపెనీవారు ఇంగ్లండ్ రాజు అనుమతితో 104 మంది నావికులతో 1-1-1607 న నేటి వర్జీనియాలో జేమ్స్ నదికి లోపల 50 మైళ్ళ దూరాన గల జేమ్స్ టౌన్‌లో వలసను స్థాపించారు. రాణి పేరున ఇంగ్లీషు వారు ఆ ప్రాంతానికి వర్జీనియా అని పేరు పెట్టారు. ఇక్కడే కొత్త ప్రపంచంలో మొదటి ఇంగ్లీష్ శిశువు జన్మించాడు. ఇతని పేరే వర్జీనియా డేర్. వర్జీనియాలో ఇండియన్‌ల ఆస్తిపాస్తులను దోచుకోవాలనుకొన్న ఇంగ్లీష్ వారిని బాణాలతో గాయపరచారు. దీనితో ఇంగ్లీష్ వారు రక్షణ ఏర్పాట్లు చేసికొన్నారు. అయినను స్థానికుల దాడుల వలన ఇంగ్లీషు వారు అనేక ఇబ్బందులనెదుర్కొనెను. ఈ సమయంలో కెప్టెన్ జాన్‌స్మిత్ వలస వారిని కాపాడి స్థానిక ఇండియన్‌లతో స్నేహ సంబంధాలు నెరిపి అన్ని విషయాలను వలస ప్రజలు తెలిసికొనేటట్లు స్మిత్ నేర్పాడు. 1614లో మొదటిసారిగా ఇంగ్లీషువారు ఇక్కడే పండిన పొగాకును ఇంగ్లండ్‌కు ఎగుమతి చేశారు. కాలక్రమేనా ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుట వలన జనసాంద్రత పెరిగింది. 1624లో బ్రిటీష్ రాజు దీన్ని స్వాధీనం చేసికొని గవర్నర్ల పాలన ప్రారంభించాడు. వర్జీనియా వలస స్థాపనతో బ్రిటీష్ వారికి అమెరికాలో తొలి అనుభవం కల్గింది.

**2.3.3.2. ప్లీమౌత్, మెసా చూసెట్స్‌లలో వలసల స్థాపన :** 1620లో 'మే ఫ్లవర్' అను ఓడలో 100 మంది ప్యూరిటన్ శాఖకు చెందిన వారు మత స్వేచ్ఛ కోసం ఇంగ్లండ్ నుండి అమెరికాలోని ప్లీమౌత్, మెసాచుసెట్స్‌లకు వలస వచ్చారు. వీరే "పిల్ గ్రిమ్ ఫాదర్స్'' అను పేరుతో ప్రసిద్ధికెక్కారు. వీరు తమ వెంట నిత్యావసర వస్తువులతో పాటు పశువులు, గుర్రాలను తమ వెంట తీసికొని ఈ ప్రాంతాలకు వచ్చారు. 1628లో ప్యూరిటన్ బృందం ప్లీమౌత్ సమీపంలోని బోస్టన్‌లో స్థావరం ఏర్పరచారు. 1629-42 మధ్య కాలంలో దాదాపు 20 వేల మంది ఇంగ్లీషు వారా ప్యూరిటన్‌ల స్థావరాలు చేరుకొన్నారు. 1670 నాటికి ప్లీమౌత్ అనేక పట్టణాలతో దాదాపు 8వేల మంది జనాభాతో విస్తరించింది. ఈ వలస ప్రజలు స్థానిక ఇండియన్‌లతో స్నేహంగా ఉంటూ వ్యాపారాభివృద్ధి చేసారు. 1691 నాటికి ప్లీమౌత్, మెసాచూసెట్స్ వలసతో విలీనమైనది.

**2.3.3.3. న్యూయార్క్, డెలవేర్‌లో వలసలు :** మొదట్లో ఈ రెండు వలసలను ఆంగ్లేతర కంపెనీలైన డచ్ పశ్చిమ ఇండియా, స్వీడిష్‌లు వరుసగా 1623, 1638లలో స్థాపించారు. డచ్ పశ్చిమ ఇండియా కంపెనీచే స్థాపించిన న్యూ నెదర్లాండ్స్ వలస తర్వాత 1623లో నూయార్‌గా మారింది. 1663లో ఆంగ్లేయులు న్యూయార్క్‌ను స్వాధీనం చేసికొని రాజు వలసగా ప్రకటించారు. అలాగే డెలవేర్ వలసగూడ విలియం పెన్ ఆధీనంలోనికి వచ్చి ప్రొప్రయిటరీ రాష్ట్రమైనది.

**కనెక్టికట్ వలస :** థామస్ హూకర్ నాయకత్వంలో మెసా చుసెట్స్ నుండి 1635లో దీన్ని స్థాపించారు. కాల క్రమేణా ఒక సంవత్సరములో 800 ప్రజలు కలిసి స్వంత రాజ్యాంగాన్ని ఏర్పరచుకొన్నారు. 1663లో ఇది రాజు వలసగా మారింది.


**2.3.3.4. రోడ్ ఐరాండ్స్‌లో వలసలు :** ఈ వలసను రోగార్ విలియమ్స్ అను మతాధికారి స్థాపించాడు. ఈ ప్రాంతంలోని బ్రిటీష్ వారు జొరబడినవారని, స్థానికులే నిజమైన కొత్త ప్రపంచ యజమానులని ఇతడు భావించాడు. 1636 తర్వాత స్థానిక ఇండియన్స్‌తో కలిసి ఇతడు ప్రావిడెన్స్ లాంటి పట్టణాలతో రోడ్ ఐలాండ్స్ వలసగా రూపొందించాడు. ఈ ప్రజలు కొంత కాలం మెసాచూసెట్స్, కనెక్టికట్ ప్రజలతో కలిసి జీవించారు. 1643లో తీసికొన్న తీర్మానము మేరకు ఒక రోడ్ ఐలాండ్ తప్ప మిగిలిన వలసలన్నియు న్యూ ఇంగ్లండ్ వలసల సముదాయం గల యూనియన్‌గా ఏర్పడ్డాయి.

**2.3.3.5. మేరీలాండ్ వలసలు :** ఈ వలసతోపాటు మిగిలిన ఏడు న్యూ ఇంగ్లండ్ వలసలు ఇంగ్లండ్ రాచరికం నుండి అనుమతి పొంది ఏర్పడ్డాయి. వర్జీనియా వలసకు ఉత్తరానున్న విశాలమైన భాగమే మేరీ లాండ్ ప్రాంతము. 1634 ప్రాంతంలో కేథలిక్స్, ప్రొటెస్టెంట్స్ కలిసి 300 మంది, బాల్డిమోర్ రాజైన సిలీసియస్ కల్వర్ట్ ఆదేశానుసారంగా దీన్ని స్థాపించారు. క్రైస్తవ మత స్పర్థలను దృష్టిలో నుంచుకొని 1649లో మత సామరస్య చట్టాన్ని ఇక్కడ ప్రవేశపెట్టారు. ఇక్కడ పొగాకు పంట విస్తారంగా పండుట వలన 1689 నాటికి ప్రజల సంఖ్య 25,000 కు పెరిగింది. అనతి కాలంలో ఇక్కడ మత కలహాలు పెరుగుట వలన 1691లో ఈ వలసను రాజు స్వాధీనం చేసికొన్నాడు.

**2.3.3.6. న్యూ హాంప్‌షైర్ మరియు మెయిన్ వలసలు :** 1623లో రై స్థలముతో పాటు మరి కొన్ని పట్టణాలు కలిసి ఈ వలస ఏర్పడింది. న్యూ ఇంగ్లండ్ వలసల కౌన్సిల్, ఈ రెండు వలస ప్రాంతాలపై అధికారాన్ని సర్‌పెర్డినాండ్ చార్లెస్, కెప్టెన్ మాసన్‌లకు అప్పగించింది. ఈ రెండింటిపైన అధికారాన్ని చెలాయించడానికి మెసాచుసెట్స్ ప్రయత్నించినపుడు 1677లో ఇంగ్లండ్ ప్రభుత్వము

మెయిన్ భాగాన్ని మెసాచూసెట్స్‌కు కలిపింది. 1679లో హాంప్‌షైర్ భాగం రాజు ఆధీనంలోనికి రావడంతో దీన్ని న్యూ హాంప్‌షైర్‌గా పిలిచారు. 1820 నాటికి మెయిన్, మెసాచూసెట్స్‌లు కలిపి స్వతంత్ర రాష్ట్రంగా విడిపోయింది.

**2.3.3.7. న్యూజెర్సీ వలసలు :** 2వ చార్లెస్ రాజు ఈ వలస యాజమాన్యపు హక్కును తన సోదరుడైన జేమ్స్ డ్యూక్ ఆఫ్ యార్క్‌కు జారీ చేశాడు. జేమ్స్ ఈ హక్కును తన స్నేహితులైన సర్ జార్జ్, లార్డ్‌జాన్ బర్కిలీలకు అమ్మాడు. 1674లో లార్డ్ బర్కిలీ న్యూజెర్సీలో తన భాగాన్ని ఇంగ్లీషు క్వేకర్స్‌కు, 1682లో సర్ జార్జి తన భాగాన్ని విలియంపెన్ మరియు ఇతర 11 మంది క్వేకర్స్‌కు అమ్మివేశారు. ఫలితంగా న్యూజెర్సీ భాగం 24 మంది యజమానుల ఆధీనంలోనికి వచ్చింది. చివరకు 1702లో ఇది రాజు ఆధీనంలోకి వచ్చింది.




పటం-4

**2.3.3.8. ఉత్తర, దక్షిణ కెరొలినా వలసలు :** వర్జీనియాకు దక్షిణాన, ఫ్లొరిడాకు ఉత్తరాన ఉన్న ప్రాంతమంతయు నివాస యోగ్యం కాని ప్రాంతము. స్పెయిన్ ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసికోవాలన్న ఆలోచన ఉన్ననూ, ఎలాంటి ప్రయత్నమూ జరుగలేదు. 2వ చార్లెస్ అనుమతితో 8 మంది యజమానులు, ఇతర బ్రిటీష్ అధికార్లు కలిసి కెరోలినా అను కంపెనీ పేరుతో 1670 లో ఈ ప్రాంతంలో వలసను ఏర్పరచారు. 1700 నాటికి ఇక్కడి వలసల జనాభా 5000 కు చేరింది. వీనిలో సగం మంది నీగ్రో బానిసలు. అందుచేత ప్రారంభం నుండి కెరోలినాలో భ్యూస్వామ్య వ్యవస్థ, నీగ్రో బానిస వ్యవస్థలతో కూడిన సమాజం ఏర్పడింది. 1712లో ఈ ప్రాంతం ఉత్తర, దక్షిణ కెరొలినాలుగా విడిపోయాయి. ఉత్తర కెరొలినాలో అతి సామాన్య మధ్య తరగతి వారు స్థిరపడ్డారు. ఇది 1728 నాటికి రాజు ఆధీనంలోనికి వచ్చింది. దక్షిణ కెరొలినాలో విలాస జీవితం గడిపే భూస్వాములుండేవారు. వీరు వారికున్న హక్కులను అమ్ముకోవడంతో దక్షిణ కెరొలినాను 1719లో రాజు స్వాధీనం చేసికొన్నాడు.

**2.3.3.9. పెన్సిల్వేనియా వలసలు :** దీన్ని 1682లో విలియం పెన్ అను క్వేకర్ స్థాపించాడు. ఇతడు ఫిలడెల్ఫియా నగరాన్ని చక్కగా నిర్మించాడు. ఈ ప్రాంతమంతయు సారవంతమైన భూములు, ఖనిజ సంపద ఉండుట వలన జర్మన్, స్కాటిష్, ఐరిష్ ప్రజలను ఆకర్షించింది. ఈ వలస 1776లో కాన్‌ఫెడరేషన్‌లో కలిసింది.

**జార్జియా వలసలు :** ఇది 2వ జార్జి రాజు కాలంలో స్థాపించబడిన చివరి వలస రాజ్యము. 1732లో కెరోలినాకు దక్షిణంగా నున్న భూ భాగాన్ని జేమ్స్ ఎడ్వర్ట్‌ఒగ్లే తోర్పె నాయకత్వంలో కొంత మంది యజమానులు రాజు నుండి దానంగా పొందారు. జార్జి రాజు నుండి పొందిన దానం కాబట్టి దీన్ని జార్జియా అని పేరు పెట్టారు. ఇది 1752లో రాజు ఆధీనంలోనికి వచ్చింది.

ఈ విధంగా 18వ శతాబ్ది అర్ధభాగానికి షుమారు 1000 మైళ్ళ విస్తీర్ణం గల అట్లాంటిక్ తీర ప్రాంతంలో మెయిన్ నుండి దక్షిణ కెరొలినా వరకు గల 13 వలస లేర్పడ్డాయి. వీనిలో 6 వలసలను కంపెనీవారు, మిగిలిన 7 వలసలను రాజు అనుమతితో ప్రైవేటు వ్యక్తులు స్థాపించారు. 1700 నాటికి ఈ వలసలలో 21, 22, 778 జనాభా ఉన్నట్లు తెలుస్తుంది.

## 2.5 అమెరికాలో ఆంగ్లో - ఫ్రెంచి సంఘర్షణ :

ప్రారంభం నుండి పాత ప్రపంచంలో అనేక చోట్ల ఆంగ్ల - ఫ్రెంచి శత్రుత్వం వలన చాలా సంఘర్షణలు జరుగుతుండేవి. వీని ప్రభావం కొత్త ప్రపంచంలో గూడ ఉండేది. 1689 నాటికి ఫ్రెంచి వారు సెయింట్ లారెన్స్ లోయ, లూయిసియానా, మిసిసిపి లోయ మొదలగు ప్రాంతాలను ఆక్రమించుకొని విస్తీర్ణంలో ఆంగ్ల వలసల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఉండేది. ఈ స్థావరాలన్నియు బ్రిటీష్ వలసలకు చాలా దగ్గరగా నుండును. వీరి సంఘర్షణకు వివిధ కారణాలున్నాయి. అవి - 1) బ్రిటీష్ వారు ఉత్తరాన అట్లాంటిక్ తీరంలోను, ఓహియో లోయ ప్రాంతంలోను తమ వలసలను వ్యాప్తి చేయాలన్న కోర్కె. 2) ఆంగ్ల వలస ప్రాంతమైన న్యూయార్క్‌ను ఆక్రమించి అమెరికాలోని బ్రిటీష్ రాజ్యాన్ని రెండు భాగాలు విడదీసి, తమ పతాకాన్ని న్యూయార్క్ ప్రాంతములో ఎగురవేయాలని ఫ్రెంచి కోర్కె. ఈ లక్ష్యాలతో ఆంగ్ల ఫ్రెంచి వారు తమ రాజ్యాల వ్యాప్తి, స్థిరత్వాల కోసం పరస్పర శతృత్వం పెరిగి అనేక యుద్ధాలు చేశారు. వాటిని ఈ క్రింద తెలిసికొందాము.

**2.5.1. విలియం రాజు యుద్ధం (1689-1697) :** ప్రొటెస్టెంట్ క్రైస్తవ మతస్థుడైన ఇంగ్లండ్ రాజు విలియం రాజ్యానికి 1689లో వచ్చి రెండవ జేమ్స్ విధానాలననుసరించాడు. కేథలిక్ అయిన ఫ్రెంచి రాజు 14వ లూయీ అంటే ఇతనికి గిట్టదు. వీరి మధ్య నున్న పగ కారణంగా ప్రపంచమంతటా ఆంగ్లో - ఫ్రెంచి సంఘర్షణలు తలెత్తాయి. ఈ సందర్భంగా జరిగిన బోయినె యుద్ధంలో ఫ్రెంచి ఆధీనంలోనున్న పోర్ట్ రాయల్‌ను బ్రిటీష్ స్వాధీనము చేసుకొంది. 1697లో జరిగిన రిస్విక్ శాంతి సంధితో విలియంరాజు యుద్ధము ముగిసింది.

**2.5.2. రాణి ఆనీ యుద్ధము (1701-13) :** ఇది బ్రిటీష్ రాణి ఆనీ కాలంలో జరిగిన స్పెయిన్ వారసత్వ యుద్ధంగా పేరొందింది. చేపలు, ఉన్నికి ప్రసిద్ధి చెందిన న్యూఫౌండ్ లాండ్, ఉత్తర అమెరికా ప్రాంతాలు ఫ్రెంచి ఆధీనంలో నున్న విషయాన్ని బ్రిటీష్ తట్టుకోలేకపోయింది. దీనికి తోడు ప్రొటెస్టెంట్, కేథలిక్ మత శాఖల మధ్యనున్న విభేదాలు. బ్రిటీష్ వారు ప్రొటెస్టెంట్లు అయితే

ఫ్రెంచివారు కేథలిక్స్. పైగా 14వ లూయీ అనంతరం వచ్చిన ఫ్రాన్స్ రాజు 2వ జేమ్స్ పాలనా పద్ధతులను బ్రిటీష్ వారికి నచ్చలేదు. అందుచేత ఇంగ్లండ్, హాలెండ్, ఆస్ట్రియాలు కలిసి ఒక పక్షంగాను, ఫ్రాన్స్, స్పెయిన్‌లు మరొక పక్షంగా ఏర్పడి యుద్ధం చేశారు. ఈ యుద్ధంలో ఇంగ్లండ్ అప్రమత్తంగా ఉండి పోరాడింది. అందుకే అనేక చోట్ల ఫ్రెంచి వారిని చిత్తుగా ఓడించింది. అలాగే అమెరికాలో గూడా బ్రిటీష్ వారే విజయం సాధించారు. చివరకు ఈ యుద్ధం 1713లో యుట్రెచ్ శాంతి సంధితో ముగిసింది.

**2.5.3. జార్జి చక్రవర్తి యుద్ధం (1745-1748) :** దీన్ని ఆస్ట్రియా వారసత్వ యుద్ధమనిగూడా పిలుస్తారు. ఇది అంతర్జాతీయంగా చెలరేగిన పెద్ద అలజడి. యుట్రెచ్ సంధి అనంతరం ఫ్రాన్స్, సెయింట్ లారెన్స్ ముఖ ద్వారాన లూయిస్ బర్గ్ అను బలమైన కోటతో పాటు 60 కోటలకు పైగా నిర్మించారు. ఆస్ట్రియా రాజైన 6వ చార్లెస్ మరణించడంతో తన కుమార్తె అయిన మేరియా థెరిస్సా సింహాసమధిష్టించెను. స్త్రీ పాలకురాలుగా చుట్టూ ఉన్న పాలకులు సహించలేకపోయారు. వారిలో ప్రష్యా రాజైన ఫ్రెడరిక్, ఆస్ట్రియా భాగాన్ని ఆక్రమించుటతో ఈ యుద్ధం ప్రారంభమైనది. దీని ప్రభావం అమెరికాపై గూడా పడింది. సర్ విలియం పప్పెరెల్ నాయకత్వంలో బ్రిటీష్ వారు ఫ్రెంచి కోట, లూయిస్ బర్గ్ పై దాడి చేసి స్వాధీనం చేసికొన్నారు. దీన్ని తిరిగి ఆక్రమించుటకు ఫ్రెంచి ప్రయత్నించి విఫలమైనది. చివరకు 1748లో ఎక్స్‌లా - షాపెల్ సంధిలో ఈ యుద్ధం ముగిసింది. దీని ఫలితంగా లూయిస్ బర్గ్‌ను తిరిగి ఫ్రెంచివారికి, భారతదేశంలోని మద్రాస్‌కు ఫ్రెంచి నుండి బ్రిటీష్‌కు అప్పగించడమైనది.

**2.5.4. సప్త వర్ష సంగ్రామము (1756-1763) :** తొలి యుద్ధాల వలన ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల మధ్యనున్న సమస్యలు తొలగలేదు. అమెరికాపై ఆధిపత్యం కొరకు ఇరువురు మరల 1754-1763 సంవత్సర మధ్య యుద్ధానికి తలపడ్డారు. ఈ సప్త వర్ష సంగ్రామము ఐరోపాలో రాక పూర్వమే అమెరికాలో రెండు సంవత్సరాలు ముందుగానే ప్రారంభమైనది. దీనికి కారణాలు : 1) ఓహియో లోయ భాగంపై అజమాయిషీ ఇరువురుకీ ఉందన్న వాదన. 2) ఈ లోయపై నున్న ఆధిపత్యం ద్వారా ఆలీఘనీ పర్వతాల ద్వారా ఖండం మధ్య భాగానికి తమ రాజ్యాన్ని విస్తరింపచేసి కోవాలని బ్రిటీష్ ఆలోచన. అదే విధంగా ఫ్రెంచి ఇదే ఆధిపత్యం ఉంటే ఆంగ్ల విస్తరణను అరికట్టి, బలంపుంజుకొని పూర్తిగా ఇంగ్లీష్‌ను వెళ్ళగొట్టాలని ఫ్రెంచి ప్రయత్నం. 3) తాము ఈ ప్రాంతాన్ని కనుగొని ఇక్కడ కోటలను స్థాపించామని ఫ్రెంచి వారు, కాదు మేమని బ్రిటీష్ వారు అని వాద, ప్రతి వాదనలు పెరిగి ఈ యుద్ధానికి దారి తీసింది.

1753లో ఫ్రెంచి వారు పిట్సుబర్గ్ పట్టణ సమీపంలోని 'డ్యూకస్‌నే' అను కోటను నిర్మించడంతో 1754లో ఆంగ్లో, ఫ్రెంచి సంఘర్షణ ప్రారంభమైనది. ఈ యుద్ధంలో వర్జీనియా తరపున మేజర్ జార్జి వాషింగ్‌టన్ ఇంగ్లీష్ సైన్యంలో పాల్గొనడం ఇదే ప్రథమం. తగినంత సైనిక శక్తి లేనందున ఫ్రెంచివారు ఓడిపోయారు. 1755లో బ్రిటీష్ జనరల్ బ్రాడక్ నాయకత్వంలో డూకనే కోటను ముట్టడించే సమయంలో ఫ్రెంచివారు రహస్యంగా ఆంగ్ల సైనికులను తుపాకులతో హతమర్చారు. దీనికి కారణం - ఆంగ్ల ప్రభుత్వానికి, ఆంగ్ల వలసలకు మధ్య సహకారం లోపించడమే. 1756లో అతి సమర్థుడైన విలియం పిట్ డ్యూకనే కోటను పట్టుకొని పిట్‌కు జ్ఞాపకార్థంగా పిట్స్ బర్గ్ అను కొత్త పేరు పెట్టారు. ప్రపంచంలోని ఇతర రంగాలలో గూడ ఫ్రెంచివారు ఓడారు. 1763లో జరిగిన పారిస్ సంధితో ఈ యుద్ధం ముగిసింది. ఈ సంధి ప్రకారం బ్రిటీష్ వారు క్యూబా, ఫిలిప్పీన్ దీవులను స్పెయిన్ కిచ్చి, దానికి బదులుగా ఫ్లోరిడాను పొందింది. కెనడా బ్రిటీష్ వశమైంది. ఫ్రెంచి ఆధీనంలో నున్న మిసిసిపి తూర్పు భాగంలోని నూ అర్లియన్స్ తప్ప మిగిలిన భాగం బ్రిటీష్ స్వాధీనమైనది. ఈ యుద్ధంలో ఫ్రెంచి పె, ఆంగ్ల విజయము అతి ముఖ్యమైనది.

## 2.6. అమెరికా వలసల మీద బ్రిటీష్ వారి విధానాలు :

పైనుదహరించినట్లుగా అమెరికాలో ఫ్రెంచివారికి ఉద్వాసన చెప్పడంతో మాతృదేశం నుండి వచ్చే సైనిక అవసరత బ్రిటీష్‌కు తీరిపోయింది. భిన్న దేశాలతో స్థాపితమైన అమెరికా వలసలలో మొదటి నుండి భిన్న సంస్కృతి వర్ధిల్లింది. కాలక్రమేణా ఈ వలసలు స్వయంపాలన కోసం ఉద్యమాన్ని నడపడానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. దీనికి కారణము వలసలపై బ్రిటీష్ వారి పాలనా పద్ధతులు. వాటిని ఈ క్రింద తెలిసికొందాము.

సప్తవర్ష సంగ్రామము తర్వాత అమెరికాలోని బ్రిటీష్ వారి వైఖరిలో పూర్తిగా మార్పు వచ్చింది. ఈ యుద్ధంలో సగానికి పైగా అమెరికన్లు పాల్గొని విజయం సాధించడంతో వారిలో ఆత్మ స్థైర్యమేర్పడి భవిష్యత్‌లో ఏ ఇబ్బంది కల్గినా మాతృదేశంపై నాధారపడవలసిన అవసరము లేదని వారు గ్రహించారు. పైగా ఈ యుద్ధాలు, వారినందర్ని దగ్గరకు చేర్చి వారి మధ్య పరస్పర అవగాహన, స్నేహసహకారం పెంపొందించి ఐక్యమత్యాన్ని అలవరచినాయి. వలసల్లో వస్తున్న మార్పులను ఇంగ్లండు వారు గ్రహించలేకపోయారు. ఫ్రాన్స్‌తో చేసిన యుద్ధ నష్టాన్ని పూరించడానికి వలసలపై కొత్త పన్నులు, కొత్త చట్టాలు అయలు చేయ ప్రయత్నించ ప్రారంభించారు. వలసలపై ఆధిపత్యాన్ని బ్రిటీషు రాజు, ఉమ్మడి వాటా కంపెనీలకు అప్పగించాడు. ఈ కంపెనీలు బ్రిటీష్ ప్రయోజనాల కోసం అమెరికాలోని సంపదలను అభివృద్ధి చేయవలసి యున్నది. ఇవి తమ కార్యాలయాలను బ్రిటన్‌లోనే ఉంచుకొని ఈ పని చేయవలసియున్నది. అందుచేత బ్రిటీషు వారు మాతృదేశ ఆర్థిక పరిస్థితి వలసవాదాన్ని దృష్టిలో నుంచుకొని వారికి అనుకూలమైన విధానాలను అమెరికా వలసలతో ప్రవేశపెట్టారు. వాటిని ఈ క్రింద తెలిసికొందాము.

**2.6.1. ప్రభుత్వ పాలనలో వలస ప్రజల ప్రాతినిధ్యం :** 13 వలసలు స్పష్టంగా మూడు కోణాలలో రూపుదాల్చాయి. ఉత్తరాన వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతంగా; దక్షిణాన వ్యవసాయ ప్రాంతంగా; మధ్య వలసలు పైరెండింటి మిశ్రమ ప్రాంతంగాను రూపొందాయి. అయినప్పటికినీ వారి పరిపాలనలో పెద్ద మార్పు లేదు. ప్రతి వలసలో ద్విసభా విధాన మున్నది. శాసన సభల్లో దిగువ సభను అసెంబ్లీ అనీ, ఎగువ సభను కౌన్సిల్ అని పిలుస్తారు. ఒక బిల్లు చట్టం కావాలంటే దాన్ని రెండు సభలు ఆమోదించాలి. ఆ తర్వాత గవర్నర్ సంతకం చేయాలి. ఇంగ్లండ్‌లోని పార్లమెంటుకు ప్రతినిధులను ఎన్నుకొనే మక్కు వలస ప్రజలకు లేదు. అందువలన పార్లమెంట్‌లో వలస ప్రజలకు ప్రాతినిధ్యం లేదు. 1619లో వర్జీనియా వలస ప్రజల అభ్యర్థన మేరకు లండన్ కంపెనీ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వీరికి ప్రభుత్వ వ్యవహారాల్లో కొంత ప్రాతినిధ్యం కల్పించబడింది. కాల క్రమేణా ప్రతినిధ్య హక్కు అన్ని వలసల్లో ఉండాలన్న ఆలోచన పెరిగింది. 1628 తర్వాత మెసాచూసెట్స్, న్యూ ఇంగ్లండ్ వలసలు స్వయం పాలనను సంపాదించుకొన్నాయి.

**2.6.2. రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్ :** సప్తవర్ష సంగ్రామం జరిగే సమయంలో వలస ప్రాంతాల్లో దొంగ వ్యాపారాన్ని అరికట్టడానికి బ్రిటీష్ ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకొంది. దొంగ వస్తువులు నిల్వ చేసే గిడ్డంగులపై దాడి జరపడానికి ప్రభుత్వ అధికారులకు అనుమతి పత్రాలను జారీ చేసింది. వాటిని 'రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్' అంటారు. మొదటి రిట్‌ను రెండవ చార్లెస్ కాలంలో ఇంగ్లండ్‌లో అమలు జరిపారు. ఇదే విధమైన రిట్ల అధికారాన్ని 3వ చార్లెస్ కాలం నుండి కస్టమ్స్ అధికార్లకివ్వబడింది. ప్రభుత్వం చేసిన రిట్లు అన్యాయంగా, అధర్మంగా నున్నాయని ఆనాటి ప్రముఖ న్యాయవాది జేమ్స్ ఓటెన్ జూనియర్‌తో పాటు అనేక మంది వ్యాపారాలు తీవ్రంగా ఖండించారు. అమెరికా అధ్యక్షుడైన జాన్ ఆడమ్స్ వ్రాతలు ప్రకారం రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్‌కు వ్యతిరేకంగా ఆయుధాల పోరాటంతో పాటు విప్లవ శిశువు పుట్టిందని చెప్పవచ్చును.

**2.6.3. ఇంగ్లండ్ వాణిజ్య పద్ధతి :** రాజ్య విస్తరణ కోసం ఇంగ్లండ్ జరిపిన పోరాటం వలన ఆ దేశం ఆర్థిక సంక్షోభానికి గురైంది. యుద్ధానికి ఇంగ్లండు చేసిన అప్పులు ఎక్కువైనాయి. దీనికి తోడు విపరీతంగా పెరిగిన ప్రభుత్వ ఖర్చులు, పాలనా వ్యయాలు బ్రిటీష్ ప్రభుత్వాన్ని పట్టి పీడిస్తున్నాయి. దీన్ని భర్తీ చేయడానికి వలస ప్రజల నుండి పన్నులు వసూలు చేయడమే ఏకైక మార్గమని ఇంగ్లండు తలచింది. ఇందుకు గాను ఇంగ్లండు వలసలపై తన వాణిజ్య పద్ధతిని ప్రవేశ పెట్టింది. దీని ప్రకారం వలస ప్రజలు మాతృదేశంతోనే వర్తకం చేయాలని, ఇతర దేశాలతో వ్యాపారము చేయడముగాని, తమ వస్తువులను తామే తయారుచేసుకోవడంగాని చేయరాదని ఇంగ్లండు కట్టుదిట్టం చేస్తూ తమ దేశ వ్యాపారాభివృద్ధి కోసం కొన్ని శాసనాలు, పద్ధతులను ప్రవేశపెట్టింది.

**2.6.4. ఇతర శాసనాలు : 1650**లో మొదటి నౌకాశాసనం, **1733**లో మొలాసెస్ శాసనం, **1750**లో ఇనుప శాసనం, **1764**లో పంచదార శాసనాలను ప్రవేశపెట్టి వర్తక వాణిజ్యాభివృద్ధి చేసి ఆర్థిక స్థోమతను పెంచటానికి ఇంగ్లండు ప్రయత్నించింది. అలాగే **1764** లో కరెన్సీ చట్టము, వలసలతోనున్న సైనిక ఖర్చులకు సంబంధించిన క్వార్టరింగ్ శాసనము **(1765)**, స్టాంపులపై పన్ను పెంచే స్టాంపుల శాసనం **(1765)** మొదలగు పద్ధతులను ప్రవేశపెట్టి వలస ప్రజల ఆగ్రహావేశాలకు ఇంగ్లండ్ గురి అయింది. ఈ శాసనాల వివరాలు

తర్వాత అధ్యాయంలో తెలిసికొనవచ్చును. ఇంగ్లండు విధానాల వలన వలస ప్రజల స్వయం పాలన, స్వేచ్ఛలకు ముప్పు వాటిల్లటంతో అక్కడి ప్రజలంతా స్వాతంత్ర సమరానికి ఉద్యుక్తులైనారు.

## 2.7. నమూనా ప్రశ్నలు :

**1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)**

1. అమెరికాలో ఐరోపావారి భౌగోళిక పరిశోధనలు, వారి వలస విధానమును గూర్చి ఒక వ్యాసమును వ్రాయుము.
2. అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆధిపత్యం కొరకు జరిగిన ఆంగ్లో - ఫ్రెంచి సంఘర్షణకు వివరింపుము.

**2) లఘు వ్యాసరూప ప్రశ్నలు (15 మార్కులు)**

1) అమెరికాలోని వలస ప్రజల మీద బ్రిటీష్ పాలనా పద్ధతులను వివరింపుము.

**3) లఘుటీక ప్రశ్నలు (5 మార్కులు)**

1) ఆస్ట్రియా వారసత్వ యుద్ధము

2) సప్తవర్ష సంగ్రామము

3) రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్

## 2.8. చదువదగిన గ్రంథాలు :


1. Brown. R.H : Historical Geography of the United States
2. Herbert E. Bolten and T.M. Marshall : Colonization of North America (1924)
3. Marshall Smelser : American History, At a Glance
4. Parkes. H.B. : The United States of America
5. డా॥ వేమూరి కామేశ్వరరావు & శ్రీ భాగవతుల లక్ష్మీనారాయణ - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర (తెలుగు అకాడమి)


**- ఎం. బోసుబాబు**

పాఠం - 3

# అమెరికా స్వాతంత్ర్య సమర కారణాలు - యుద్ధ గమనము - ఫలితాలు - కారణాలు

## 3.0. లక్ష్యం :

అమెరికా స్వాతంత్ర్య సమరానికి దారి తీసిన పరిస్థితులను గురించి అధ్యయనం చేయడం ఈ పాఠ్యాంశ ప్రధాన లక్ష్యం.

## విషయసూచిక :


3.1. పరిచయము

3.2. కారణాలు

3.2.1. మౌళిక కారణాలు

3.2.1.1. జాతీయ భావం

3.2.1.2. జనాభా పెరుగుదల

3.2.1.3. ప్రజాస్వామ్యానురక్తి

3.2.1.4. భౌగోళిక అంశాలు

3.2.1.5. బ్రిటీషు ప్రభుత్వ స్వభావం

3.2.1.6. రాజకీయ భావనలలో వ్యత్యాసం

3.2.1.7. బ్రిటీషు రాజనీతిజ్ఞులలో అవగాహనా రాహిత్యం

3.2.1.8. వైజ్ఞానిక కారణాలు

3.2.1.9. మర్కెంటలిజం

3.2.1.10. మొలాసిస్ చట్టం

3.2.1.11. నౌకా చట్టాలు

3.2.2. తక్షణ కారణాలు

3.2.2.1. ఆంగ్లో - ఫ్రెంచి యుద్ధం

3.2.2.2. చక్కెర చట్టం (1764)

3.2.2.3. స్టాంపుల చట్టం (1765)

3.2.2.4. రాకింగ్ హోమ్ చర్యలు

3.2.2.4.1. స్టాంపుల చట్ట ఉప సంహరణ

3.2.2.4.2. డిక్లరేటరీ చట్టం

3.2.2.5. చార్లెస్ టౌన్‌షెండ్ చట్టాలు (1767)

3.2.2.5.1. టౌన్ షెండ్ చర్యలకు నిరసన

3.2.2.5.1.1. బ్రిటీషు వస్తువుల దిగుమతి బహిష్కరణ

3.2.2.5.1.2. ప్రచార లేఖలు

3.2.2.5.1.3. బోస్టన్ హత్యాకాండ

3.2.2.6. బోస్టన్ టీ పార్టీ (1773)

3.2.2.7. దుస్సహ శాసనాలు (Punitive Acts)

3.2.2.7.1. బోస్టన్ రేవు చట్టం

3.2.2.7.2. మెసా చుసెట్స్ ప్రభుత్వ చట్టం

3.2.2.7.3. క్విబెక్ చట్టం

3.2.3. ఫిలడెల్ఫియా సమావేశం (1774)

3.2.4. సారాంశము

3.2.5. నమూనా ప్రశ్నలు

3.2.6. చదువదగిన గ్రంధాలు

## 3.1. పరిచయము :

ప్రజాస్వామ్య పరిణామ చరిత్రలో అమెరికా స్వాతంత్ర్య సమరం ఒక మహోజ్వల ఘట్టం. దీనిలో విశేషమేమంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సాధన కొరకు అమెరికా వలసలలోని ఆంగ్లేయులు పరులతో గాక తమ మాతృదేశంలోని ఆంగ్లేయులతో పోరాటం జరపడం, బ్రిటీషు వారు ఫ్రెంచివారిని 1763 నాటికి అమెరికా నుండి తరిమివేశారు. ఫ్రెంచి వారిని తరిమి వేయుట వలన అమెరికాపై తమ పట్టు తగ్గిందని అనతి కాలంలోనే వారు గ్రహించారు. ఫ్రెంచివారి బెడద తొలగిపోవడంతో అమెరికనులకు బ్రిటీషువారు కల్పించు రక్షణ అవసరం లేకపోయింది. అందువలన వారు మాతృదేశ ఆర్థిక అవసరాలను తీర్చడానికి సముఖంగా లేరు. తత్ఫలితంగా తలెత్తిన వివాదాలు అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి దారి తీయగా అందులో అమెరికనులు విజయం సాధించి స్వతంత్రులైనారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆవిర్భవించాయి. అమెరికా విప్లవం ప్రజాస్వామ్య జీవనాడులైన స్వదేశాభిమానము, స్వమత భాషా సంస్కృతులు, జీవన విధానముల ఎడల అచంచల విశ్వాసము మున్నగు విలువలను వెలవరించింది. సామ్రాజ్య వాదులకు సవాలు విసిరి విదేశీ పాలనలో మ్రగ్గువారికి మార్గదర్శకంగా నిలిచింది. విదేశీ దుష్టపాలనను అంతమొందించు హక్కు బాధిత జనులకు కలదని ఈ విప్లం ఋజువు చేసింది.

## 3.2. కారణాలు :

అమెరికా విప్లవ కారణాలు రెండు విధాలు. అవి. 1) మౌళిక లేక ప్రధాన కారణాలు. 2) తక్షణ కారణాలు. మౌళిక కారణాలు విప్లవ ఆవశ్యకతను సూచించగా, తక్షణ కారణాలు విప్లవ ఆరంభానికి దారి తీశాయి.

**3.2.1. మౌళిక కారణాలు :** బ్రిటీషు వారిలో అమెరికను వలస ప్రజలలో పేరుకుపోయిన అసంతృప్తికి అనేక మౌళిక లేక ప్రాథమిక కారణాలు ఉన్నాయి. తరాల తరబడి పెరుగుతూనే ఉన్న ఈ అసంతృప్తికి అనేక అంశాలు దోహదం చేశాయి.

**3.2.1.1. జాతీయ భావం :** అమెరికా వలస ప్రజలలో జనించి వృద్ధి చెందిన జాతీయతాభావం మౌళిక కారణాలలో ఒకటి. వలస ప్రజలలో అధిక సంఖ్యాకులు ఆంగ్లేయులే కాని అందరూ కాదు. షేక్స్ పియర్, మిల్టన్ కాలాలకు చెందిన ఆంగ్లేయులే కాక వారిలో జర్మనీ, స్విట్జర్‌లాండ్ హాలెండ్, ఫ్రాన్స్ మున్నగు ఇతర ఐరోపా దేశాల వారు గూడా ఉన్నారు. కొంత మందికి ఆంగ్లమే తెలియదు. భౌగోళిక పరిస్థితులు, వాణిజ్యం, వ్యవసాయం మున్నగు అంశాలు వారి దైనందిన జీవితాలను బ్రిటీషు వారికి భిన్నంగా రూపొందించినాయి. వారి సమాజం ఆంగ్ల సమాజానికి బిన్నంగా రూపుదిద్దుకొన్నది. అందువలన అమెరికాలో జనించి వికసించిన జాతీయ భావం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. కాని ఆ వాస్తవాన్ని అమెరికా ప్రజలుగాని బ్రిటీషు ప్రభుత్వంగాని గ్రహించలేదు.

**3.2.1.2. జనాభా పెరుగుదల :** ఐరోపా ఖండంలోని అనేక దేశాల నుండి మత ద్వేషాలు, సామాజిక వ్యత్యాసాలు, రాజకీయ వత్తిడులు, ఆర్థిక ప్రయోజనాలు మున్నగు కారణాల వలన అమెరికా చేరిన ప్రజల సంతానం క్రమ క్రమంగా వృద్ధి చెందింది. 1776 నాటికి అమెరికా వలసలలో పెరిగిన ఆ జనాభాలో చాలా మంది ఆంగ్ల జాతికి చెందినవారు కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే వారు అమెరికన్లు. వారు ఏమి ఆశించి వచ్చారో ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్న స్వేచ్ఛా జీవులు వారు.

**3.2.1.3. ప్రజాస్వామ్యానురక్తి :** అమెరికా వలస ప్రజలలో స్వాభిమానం, ప్రజాస్వామ్యానురక్తి ఎక్కువ. వారు ఎవరి ఆధిపత్యాన్ని సహించరు. రాజకీయంగా చైతన్యవంతులై ఆర్థికాభ్యుదయాన్ని సాధించిన అమెరికనులకు బ్రిటీషు వారి నిరంకుశ ధోరణులు, తమ అంతరంగిక విషయాల్లో, వారి జోక్యము రుచించలేదు. సమానత్వ హోదా తప్ప గ్రేట్ బ్రిటన్ ఆధిక్య ధోరణిని వారు ఏ మాత్రం సహించే స్థితిలో లేరు.

**3.2.1.4. భౌగోళిక అంశాలు :** గ్రేట్ బ్రిటన్‌కు అమెరికాకు మధ్య దూరం 3000 మైళ్ళు. అంత దూరాన ఉన్న ప్రదేశాలను అదుపులో ఉంచటం కష్టం. అదియును గాక ప్రకృతి కల్పించిన సహజ సిద్ధమగు రక్షణ శ్రేణులు అమెరికాకు భద్రతను సమకూర్చాయి. అందువలన పెద్ద సైన్యాన్ని పోషించవలసిన అవసరం అమెరికాకు లేదు. నౌకా నిర్మాణ విషయాలలో గొప్ప ప్రగతి సాధించిన, అమెరికా బ్రిటీషు వారి నౌకాదాడుల నుండి స్వీయరక్షణ చేసుకోగలిగిన స్థాయికి ఎదగ గలిగింది. విస్తీర్ణంలో గూడా తనకంటే ఎన్నో రెట్లు పెద్దదైన అమెరికాను ఎక్కువ కాలం అదుపులో ఉంచడం ఇంగ్లాండుకు చాలా కష్టం.

**3.2.1.5. బ్రిటీషు ప్రభుత్వ స్వభావం :** ఇంగ్లాండు దేశ అంతరంగిక విషయాలకు సంబంధించినంతవరకు ఆంగ్ల ప్రభుత్వం చాలా శక్తివంతమైనది. కానీ దేశాంతర విషయాలలో అది దుర్బలమైనది, శక్తి హీనమైనది, నిష్ఫలమైనది. తత్ఫలితంగా ఆంగ్ల శాసనాలు అమెరికా వలసలలో యధాతథంగా అమలు చేయబడలేదు. వలస ప్రజలు వాటిని తరచుగా ఉల్లంఘించేవారు. బ్రిటీషు ప్రభుత్వ శాసనాలు తమకు వర్తించవు, అనే చులకన భావం వారిలో జనించి వృద్ధి చెందింది.

**3.2.1.6. రాజకీయ భావనలలో వ్యత్యాసం :** ఆంగ్లేయులకు అమెరికనులకు రాజకీయ భావనలలో వ్యత్యాసమున్నది. " ఆంగ్ల ప్రజల హక్కులు" అనే అంశం మీద ఇరు ప్రాంతాల ప్రజలలో ఏకాభిప్రాయం లేదు. బ్రిటీషు పార్లమెంటు సభ్యుడు సామ్రాజ్యంలోని ప్రజలందరికి ప్రాతినిధ్యం వహిస్తాడని ఆంగ్లేయుల వాదన. వర్జీనియా, కరోలినా, పెన్సిల్వేనియా మున్నగు అమెరికా వలసలకు ప్రాతినిధ్యం వహించేవారు అవశ్యం ఆయా ప్రాంతాలకు చెందినవారై ఉండాలని అమెరికనుల ప్రగాఢ వాంఛ. బ్రిటీషు రాజనీతిజ్ఞులు, రచయితలు తమను "సామంత ప్రజలు"గా చిత్రించడాన్ని వారు తీవ్రంగా నిరసించారు.

**3.2.1.7. బ్రిటీషు రాజనీతిజ్ఞులలో అవగాహనా రాహిత్యం :** గ్రేట్ బ్రిటన్‌లో అమెరికా సమస్యల పట్ల సానుభూతి, అవగాహన గల రాజనీతిజ్ఞుల శకం నిరంకుశ ధోరణులు, తొందరపాటు మనస్తత్వము గలవారు కీలక పదవులను చేపట్టి పదే పదే పొరపాట్లు చేస్తూ అనాలోచిత చర్యలు చేపట్టి రెండు ప్రాంతాల మధ్య ఏర్పడిన చిన్న చిన్న చీలికలను పెద్ద అగాధంగా మార్చి యుద్ధ వాతావరణం ఏర్పడునట్లు చేశారు.

**3.2.1.8. వైజ్ఞానిక కారణాలు :** 18వ శతాబ్దంలో తమ రచనలచే ఐరోపాను జాగృతమొనర్చిన జాన్‌లాక్, డికార్టిస్ (De Cartis) మున్నగు రాజనీతివేత్తల భావనలైన హేతువాదము, సహజ హక్కుల సిద్ధాంతం, మానవతావాదం అనునవి అమెరికనులను గూడా ప్రభావితం చేశాయి. ప్రజల మాన ప్రాణములను, ఆస్తిపాస్తులను, స్వేచ్ఛను కాపాడుటయే నిజమైన ప్రభుత్వ లక్ష్యమని జాన్‌లాక్ ప్రతిపాదించిన సిద్ధాంతం అమెరికనులను ఆకర్షించింది. ప్రజల ఆమోదము పొందని ఏ పన్నునైనా ప్రభుత్వము విధించినపుడు అది వారి ఆస్తి హక్కును అపహరించినట్లేనని అతడు ప్రవచించిన మరొక సిద్ధాంతం అమెరికనులను మాతృదేశంలో పోరుకు సమాయత్తపరిచింది. నిరంకుశ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయుట ప్రజల హక్కేగాక వారి బాధ్యత గూడా అని జాన్‌వైస్, జొనాథన్ మెహ్యూ మున్నగువారు బోధించారు. జాతీయ నాయకులగు థామస్ జెఫర్‌సన్, జేమ్స్ ఓటిస్ మున్నగువారి రచనలు, బోధనలు అమెరికా విప్లవ జ్వాలలకు ఆజ్యము అందించినట్లయింది. ఇట్లు దేశీయ, విదేశీయ విజ్ఞుల బోధనలు, రచనలు అమెరికనులను చైతన్యవంతులుగాను ఖార్యోన్ముఖులుగాను చేసి విప్లవ పథం వైపున నడిపించాయి.

**3.2.1.9. మర్కెంటలిజం :** ఇంగ్లాండులోని రాజకీయ నాయకులు, అమెరికా వలసలలోని రాజకీయ నాయకులు ఇరువురు మార్కెంటలిజాన్ని ఆమోదించినవారే. అసలు మర్కెంటలిజమంటే ఏమిటి ? దిగుమతుల కంటే ఎగుమతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనేదే దీనిలోని మౌళికాంశం. దీనిలోని ఇతర అంశాలేవనగా. 1) ఆర్థికంగా దేశం స్వయం పోషకత్వం సాధించాలి. 2) వలసలు మాతృదేశం కోసమే మనుగడ సాధించాలి. 3) వలసలు మాతృదేశానికి అవసరమైన ముడి సరుకుల కేంద్రాలుగాను, నిర్మిత వస్తువులను అమ్మే మార్కెట్లుగాను వ్యవహరించాలి, 4) విదేశీ వ్యాపారం బ్రిటీషు నౌకల ద్వారాగాని, వలసల నౌకల ద్వారాగాని మాత్రమే జరపాలి, 5) వలసల ప్రధాన ఉత్పాదనలను గ్రేట్ బ్రిటన్‌కే ఎగుమతి చేయాలి. ఇంగ్లాండు వాటిని మిగతా ప్రపంచానికి సరఫరా చేయు విఫణిగా వ్యవహరిస్తుంది. 6) ఇతర దేశాల నుండి వలసలు దిగుమతి చేసుకునే వస్తువులు మొదట ఇంగ్లాండుకు చేరాలి. అక్కడ సుంకాలు విధింపబడిన తరువాత అవి వలసలకు తరలింపబడతాయి. 7) వలసల ఉత్పత్తులకు బ్రిటీషు మార్కెట్లలో మంచి ఆదరణ లభించాలి. బ్రిటీషు ప్రభుత్వం మార్కెంటలిజాన్ని ఆచరణలో పెట్టడానికి నౌకా చట్టాలు (Navigation Acts) చేసింది. ఈ చట్టాలు ఆంగ్ల వ్యాపార నౌకలను పటిష్టపరచడానికి డచ్ మున్నగు శత్రు వ్యాపార నౌకలను నష్టపర్చడానికి ఉద్దేశింపబడినాయి.

ఈ విధానం వలన అమెరికా వలసలకు కొన్ని ప్రయోజనాలు కలిగాయి. వాటి నౌకా వ్యాపారం వర్థిల్లటం అందులో ఒకటి. వాటి ఉత్పత్తులకు బ్రిటీషు మార్కెట్లలో ప్రత్యేక ఆదరణ లభించడం రెండవది. కాని వాస్తవానికి ఈ విధానం రూపొందింపబడింది, ప్రధానంగా మాతృదేశమైన ఇంగ్లాండు ప్రయోజనార్థమే. ఇది వలసల స్వాతంత్ర్యం మీద ఆంక్షలు విధిస్తుంది. తమ నోరుగొట్టి స్వలాభం కోసమే బ్రిటీషు పార్లమెంటు ఈ విధానం రూపొందించిందని వలసలు భావించాయి. ప్రపంచ దేశాలతో జరిపే స్వేచ్ఛా వ్యాపారమే తమకు ఎక్కువ ప్రయోజనకారియని అవి గ్రహించాయి.

ఆరంభం నుండి ఈ విధానాన్ని వలసలు పరిహసించి త్రోసి పుచ్చాయి. వాస్తవానికి వలసలు ఈ ఆంక్షలను ఆమోదించే స్థితిలో లేవు. "వ్యాపార నిబంధనలను ఉల్లంఘించుటకు అలవాటుపడిన వలసవాసులకు తమకు కొన్ని విషయాలలో మాత్రమే ప్రయోజనకారియగు ఈ విధానం ఎంత మాత్రము ఆమోద యోగ్యంగా లేదని" రామ్సే మ్యూర్ అను చరిత్రకారుడు నుడివినాడు. మొలాసిస్ చట్టాన్ని వలసవాసులు పదే పదే ఉల్లంఘించినారు. ఇందులోని ప్రధాన లోపం వర్తక సరకుల దొంగ రవాణా. దీని విషయంలో ఇరు పక్షాల వారి మధ్య ఉద్రికత్తలు పెరిగాయి. సరకుల దొంగ రవాణాను అరికట్టుటకు బ్రిటీషు ప్రభుత్వం తీసుకున్న చర్యలను వలసలు తీవ్రంగా నిరసించాయి. ఇంగ్లాండు - ఫ్రాన్సుల మధ్య యుద్ధం జరుగుతున్న తరుణంలో రవాణా జోరుగా సాగింది. బ్రిటీషు ప్రధాని గ్రెన్ విల్లీ వ్యాపార నిబంధనలను కఠినంగా అమలుపర్చ యత్నించినపుడు మాతృదేశ వ్యతిరేకథోరణులు పెచ్చు మీరాయి.

**3.2.1.10. మొలాసిస్ చట్టం (1763) :** 1763లో ఇంగ్లాండ్ మొలాసిస్ చట్టం చేసింది. దాని ప్రకారం తమకు చెందినటువంటి పశ్చిమ ఇండియా దీవుల నుండి అమెరికా వలసలకు దిగుమతి అగు మొలాసిస్‌పై ఇంగ్లాండు దిగుమతి సుంకాన్ని పెంచింది. ఈ పెంపుదల వలసలకు నష్టదాయకంగా పరిణమించి వారిలో అసంతృప్తిని రగిల్చింది.

**3.2.1.11. నౌకా చట్టాలు** (Navigation Acts) : తమ వలసలతో జరిపే వాణిజ్యంలో గ్రేట్ బ్రిటన్‌కు గుత్తాధిపత్యాం కట్టబెట్టేందుకు నౌకా చట్టాలు రూపొందింపబడినాయి. తొలి శాసనాలు (1382, 1485, 1540) ఆంగ్ల నౌకలను పరిరక్షించేందుకు ఉద్దేశింపబడినవి కాగా 17వ శతాబ్దం నాటివి, తమ వలసలతో జరిపే నౌకా వ్యాపారం ద్వారా అధిక రాబడి పొందడానికి ఉద్దేశింపబడినాయి. బ్రిటీషు వారి వలసలతో విదేశీ నౌకలుజరిపే వాణిజ్యాన్ని 1650 నాటి చట్టం నిషేధిస్తుంది. 1651 నాటి చట్టం బ్రిటీషు వలసలతో జరిపే వాణిజ్యం ఇంగ్లాండు నౌకలలోగాని వారి వలసల నౌకలలోగాని మాత్రమే జరగాలని ఆ నౌకా సిబ్బందిలో 75 శాతం ఆంగ్లేయులు ఉండాలని నిర్దేశిస్తుంది. పై అంశాలతో పాటు వలసలు కొన్ని సరుకులను ఇంగ్లాండుకు మాత్రమే ఎగుమతి చేయాలని 1660 నాటి చట్టం ఆదేశిస్తుంది. 1663, 1672, 1696 సంవత్సరాల నాటి నౌకా చట్టాలు ఆచరణలో విఫలమగుటచే అవి 1849, 1854 సంవత్సరాలలో ఉప సంహరింపబడినాయి. నౌకా చట్టాలను సక్రమంగా అమలు పరచడంలో గ్రేట్ బ్రిటన్ విఫలమయింది. ఆ వైఫల్యాలు అమెరికా విప్లవానికి దారి తీశాయి.

**3.2.2. తక్షణ కారణాలు :** కొన్ని సంఘటనలు మాతృ దేశానికి, వలసలకు మధ్య బేధాలను తీవ్రతరం చేశాయి. అందువలన రెండింటి మధ్య బహిరంగ పోరు అనివార్యమయింది.

**3.2.2.1. ఆంగ్లో - ఫ్రెంచి యుద్ధం :** ఆంగ్లో - ఫ్రెంచి యుద్ధానంతరం " అమెరికా విప్లవం ఆరంభం కావడానికి ఎంతో వ్యవధి లేదని ఫ్రెంచి గవర్నర్ డ్యూ ఛోసెల్ (Due de Choiseul) అంటాడు. అతని జోస్యం అనతి కాలంలోనే నిజమని ఋజువయింది. ఉత్తర అమెరికాలోని ఫ్రెంచి వలసల దండయాత్రా భయం ఉన్నంతకాలం అమెరికా వలసల ప్రజలు బ్రిటీషువారి ఆధిపత్యాన్ని, విధానాలను, తమకు ఇష్టమున్నను, లేకున్నను ఓపిగ్గా భరించారు. ఈ యుద్ధంలో ఫ్రెంచివారి పరాజయంతో ఆ భయం తొలగిపోయింది. అందువలన వారికి గ్రేట్ బ్రిటన్ కల్పించు రక్షణ ఆవశ్యకత తొలగిపోయి బ్రిటీషు వారి విధానాలను ప్రతిఘటించారు. అదియునుగాక ఈ యుద్ధంతో బ్రిటీషువారి పోరాట పటిమలో అమెరికనుల విశ్వాసం సన్నగిల్లింది. వారి కంటే అన్ని విషయాలలో తామే అధికులమని రాబోయే పోరాటంలో తమకే విజయం తథ్యమని వారు భావించారు. చరిత్రకారుడు హెచ్.బి. పార్క్స్ మాటలలో చెప్పాలంటే "ఉత్తర అమెరికా నుండి ఫ్రెంచి వారిని తరిమి వేయుటయే అమెరికా విప్లవానికి దారితీసింది.'' ఈ యుద్ధంలో బ్రిటీషు వారితో పోరాడి పరాజితులైన ఫ్రెంచివారు బ్రిటన్‌మీద ఉన్న అక్కసుతో అమెరికనులను ఆ దేశంపై పోరాటానికి ప్రోత్సహించుటతోపాటు వారికి తమ వంతు సాయం అందించినారు.

ఆంగ్లో - ఫ్రెంచి యుద్ధానంతరం ఇంగ్లాండ్ వలస విధానంలో మార్పు వచ్చింది. ఈ యుద్ధం వలన ఇంగ్లాండుకు కొన్ని క్రొత్త భూభాగాలు లభించుటతోపాటు ఋణభారం కూడా పెరిగింది. మారిన పరిస్థితులకు అనుగుణంగా తమ వలస విధానాన్ని దేశీయ విధానాలను రూపొందించవలెనని ప్రభుత్వాధిపతులు భావించారు. ఆంగ్ల శాసనాలను అమెరికనులు సరిగా పాటించడం లేదని, ఫ్రెంచివారితో జరిగిన యుద్ధంలో వారు తమకు నామమాత్రపు సాయం మాత్రమే అందించారని వారు గ్రహించారు. రేవుల వద్ద అమెరికనులు చెల్లించే సుంకాల సొమ్ము వాటి వసూళ్లకయ్యే ఖర్చులకు సరిపోయేది కాదు. అటువంటి పరిస్థితుల్లో అమెరికా వలసల ఎడల సానుభూతి, అచటి ప్రజాసమస్యల పట్ల అవగాహనగల ఇంగ్లాండ్ ప్రధాని విలియం పిట్ పదవీ విరమణ చేయగా ఆంగ్ల శాసనాలను తు.చా. తప్పకుండా అమలు చేయ కృతనిశ్చయుడైన జార్జి గ్రెన్ విల్లీ ఆ స్థానంలోకి వచ్చాడు.

గ్రెన్ విల్లీ అమెరికా రేవుల వద్ద సుంకాల వసూలు ఖచ్చితంగా చేయ సంకల్పించినాడు. నౌకా చట్టాలను సక్రమంగా అమలు చేయవలసిందిగా వలసల గవర్నర్‌లను ఆదేశించాడు. సరకుల దొంగ రవాణా చేయు వారిని నిర్బంధించడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అధికారులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాడు.

ఆంగ్లో ఫ్రెంచి యుద్ధము వలన పెరిగిన ఋణ భారం (75,000,000 పౌండ్లు), వలసలను రెడ్ ఇండియన్ల దాడుల నుండి కాపాడుటకు అగు సైనిక వ్యయము, క్రొత్తగా ఆక్రమణలోకి వచ్చిన భూములను కాపాడుటకు అగు ఖర్చులు మున్నగు వాటిలో అమెరికన్లు గూడా కొంత వ్యయ భారం భరించవలెనని బ్రిటీషువారి వాదన. అందుకొరకు వలసల వాణిజ్యంపై సుంకాలు విధించుటకు, విదేశీ వ్యాపారాన్ని క్రమబద్ధీకరించుటకు ఆంగ్ల ప్రభుత్వం పూనుకొన్నది. అట్టి చర్యలను వలస ప్రజలు తీవ్రంగా గర్హించారు.

**3.2.2.2. చక్కెర చట్టం (1764) :** 1764లో చక్కెర చట్టం చేయటం ద్వారా ఇంగ్లాండ్ తన నూతన వలస విధానాన్ని ఆచరణలో పెట్టింది. ఇది 1733 నాటి మొలాసిస్ చట్టం స్థానంలో ప్రవేశపెట్టబడింది. చక్కెర, కాఫీ మున్నగు అనేక ఇతర పదార్థాలపై సుంకాలు

విధింపబడినాయి. తమ రాబడిని పెంచుకోవడానికి ఆంగ్ల ప్రభుత్వం తీసుకొనే చర్యల్లో దీనిని మొదటి చర్యగా అమెరికనులు భావించారు. ఒకవేళ అమెరికనులు చక్కెర మీద విధింపబడిన సుంకాన్ని చెల్లించినప్పటికిని బ్రిటీషు ప్రభుత్వం ఆశించిన మొత్తం సొమ్ములో అది మూడవ వంతు మాత్రమే.

**3.2.2.3. స్టాంపుల చట్టం (1765) :** శేషించిన సొమ్ము రాబట్టేందుకు గ్రెన్ విల్లీ నాయకత్వంలోని బ్రిటీషు ప్రభుత్వం స్టాంపుల చట్టం చేసింది. దీని వార్షిక ఆదాయం లక్ష పౌండ్ల వరకు ఉంటుందని ఇంగ్లాండ్ ఆశించింది. కానీ దీనికి వలస వాసుల నుండి అనూహ్య ప్రతిఘటన ఎదురయింది. రామ్సే మ్యూర్ అన్నట్లు "దీని వలన రాబొయ్యే ప్రమాదాన్ని ఎవరూ ఊహించలేదు. విలియం పిట్‌గాని, విగ్గులుగాని ఈ బిల్లును నిరోధించలేదు." ఈ చట్టం ప్రకారం వార్తా పత్రికలు, కరపత్రాలు, వ్యాపార లావాదేవీ పత్రాలు, దస్తావేజులు మున్నగు పత్రాల మీద స్టాంపులు అంటించవలె, లేనిచో వాటికి చట్ట బద్ధత ఉండదు. దీని ద్వారా వచ్చే రాబడిని బ్రిటీషు ప్రభుత్వం వలసల రక్షణకు వ్యయిస్తుంది.

అమెరికనులు ఈ చట్టానికి అనేక విధాలుగా నిరసనను వ్యక్తీకరించారు. ఇది బ్రిటీషు ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని అమెరికను పత్రికలు దుమ్మెత్తి పోశాయి. బెంజమిన్ ఫ్రాంక్లిన్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించాడు. సుప్రసిద్ధ న్యాయవాది జేమ్స్ ఓటిస్ ఇది బ్రిటీషు ప్రభుత్వ చట్ట స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని వాదించాడు. పట్టణాలలో అమెరికనులు ముఠాలుగా ఏర్పడి "స్వేచ్ఛా పుత్రులు" (Sons of Liberty) అను పేరుతో స్టాంపులు అమ్మేవారిని బెదిరించారు. స్టాంపులను దగ్ధం చేశారు, బోస్టన్‌లో మృత్యు ఘంటికలు మ్రోగించారు. అమెరికను వర్తకులు ఇంగ్లాండు నుండి వచ్చే దిగుమతులకు వ్యతిరేకంగా వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకొని వాటిని పూర్తిగా నిషేధిస్తూ శపథం చేశారు. దీని వలన రాబోయే ప్రమాదాన్ని గురించి వర్జీనియా రాష్ట్ర అసెంబ్లీ అమెరికనులను హెచ్చరించింది. స్టాంపుల చట్టాన్ని ఉపసంహరించుకోవలసిందిగా బ్రిటీషు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయుటయేగాక తమ సమ్మతి లేకుండా పన్నులు విధించే అధికారం దానికి లేదని ఆ శాసన సభ వాదించింది.

స్టాంపుల చట్టాన్ని గూర్చి చర్చించడానికి రావలసిందిగా మెసాచుసెట్స్ శాసనసభ "చేరండి లేక చావండి" (Join or Die) అను నినాదంతో అన్ని రాష్ట్రాల వారికి ఆహ్వానాలు పంపింది. 13 రాష్ట్రాలకుగాను తొమ్మిది రాష్ట్రాల ప్రతినిధులు న్యూయార్క్‌లో జరిగిన ఈ సభకు హాజరైనారు. ఈ సమావేశానికి 'స్టాంపుల చట్ట సభ' అని పేరు.

వర్జీనియా అసెంబ్లీ తీర్మానాలను అందరూ ఆమోదించేటట్లు చూడాలని, బ్రిటీషు ప్రభుత్వ చర్యలను ఎదుర్కోవడానికి సమైక్య కృషి జరిగే విధంగా పాటుపడాలని వారు ఆదేశింపబడినారు. అంతకు ముందు లేని సమైక్యతా భావం, పట్టుదల వారిలో కన్పించాయి. వార్నర్ & మార్టిన్ మాటలలో చెప్పవలెనన్న "స్టాంపులను ఎవరూ వాడలేదు. సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ప్రదర్శించిన అపూర్వమైన సమైక్యతా భావం, కార్యదీక్షత అన్నిటికంటె ప్రమాదకరమైనవి." స్టాంపుల చట్టాన్ని నిరసిస్తూ వర్జీనియా రాష్ట్ర ప్రముఖ వక్త పాట్రిక్ హెన్రీ ఈ విధంగా అంటాడు. "జూలియస్ సీజర్ పతనానికి బ్రూటస్, మొదటి చార్లెస్ శిరచ్ఛేదానికి ఆ లివర్ క్రామ్‌వెల్ కారణభూతులగుటను గమనించి మూడవ జార్జి ప్రభువైనా జాగరూకుడై వ్యవహరిస్తే బాగుపడతాడు. లేకపోతే వారి గతే ఇతనికి పడుతుంది." అమెరికనుల ప్రతిఘటనను గూర్చి విన్న విలియం పిట్ "స్టాంపుల చట్టాన్ని అమెరికనులు వ్యతిరేకించినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది, నా ఉద్దేశంలో అమెరికా వలసలపై పన్ను విధించే హక్కు ఇంగ్లాండ్‌కు లేదు" అంటాడు. "గ్రేట్ బ్రిటన్ అమెరికాను రక్షిస్తుంది. కనుక విధిగా అమెరికా విధేయురాలై ఉండాలి" అనేది గ్రెన్ విల్లీ వాదన.

**3.2.2.4. రాకింగ్ హోమ్ చర్యలు :** గ్రెన్ విల్లీ అహంభావ పూరిత విధానాలకు విసిగిపోయిన ఇంగ్లాండు రాజు మూడవ జార్జి అతడిని తొలగించి రాకింగ్ హోమ్ ప్రభువును ప్రధానిగా నియమించాడు. అతడా పదవిలో ఒక సంవత్సరం మాత్రమే మనగలిగినాడు. కానీ ఆ స్వల్పకాలంలోనే అతడు చిరస్మరణీయమైన రెండు చర్యలు తీసుకున్నాడు. అవి.

**3.2.2.4.1. స్టాంపుల చట్ట ఉపసంహరణ :** రాకింగ్ హోమ్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే అచటి ఆంగ్ల ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలను గురించి, న్యూయార్క్ సమావేశాన్ని గురించి, అందులో తీసుకున్న ఆంగ్ల ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలను గురించిన వార్తలు ఇంగ్లాండు చేరాయి. విలియం పిట్ ఉత్తేజకరమైన తన ఉపన్యాసంలో "అన్యాయమైన ఆంగ్ల ప్రభుత్వ శాసనాలను వలసవాసులు

ధిక్కరించినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. స్వల్ప అదాయానికి ఆశ పడి సంవత్సరానికి 30 లక్షల పౌండ్ల ఆదాయాన్నిచ్చే అమెరికా వాణిజ్యాన్ని ఫణంగా పెట్టినాము. ప్రాతినిధ్యం పన్నుల విధింపు పరస్పర ఆశ్రయాలు. అందువలన వలసలపై పన్నులు విధించే హక్కు వాటి ప్రాతినిధ్యం లేని బ్రిటీషు పార్లమెంటుకు లేదు'' అని ఉద్ఘాటించాడు. మాతృ దేశానికి, వలసలకు మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. ఆ ఉద్రిక్తతను సడలించేందుకు రాకింగ్ హోమ్ పూనుకున్నాడు. అమెరికనులను శాంతపరచి సంతృప్తులుగా చేయుటకు వారు అమితంగా ద్వేషించే స్టాంపుల చట్టాన్ని రద్దు చేశాడు. అందుకు అమెరికాలో అందరూ సంతోషించారు. దీనితో రెండు దేశాల మధ్య అపోహాలు, అపార్థాలు, ఉద్రిక్త వాతావరణం తొలగిపోయినట్లు కన్పించింది. కాని వాస్తవానికి ఆ విపత్తు తాత్కాలికంగా వాయిదా పడింది, తొలగిపోలేదు.

**3.2.2.4.2. డిక్లరేటరీ చట్టం :** అమెరికనులను సంతుష్టులను చేయుటతోపాటు బ్రిటీషు పార్లమెంటు గౌరవాన్ని కాపాడి ఆంగ్ల సార్వభౌమాధికారాన్ని పరిరక్షించడానికి రాకింగ్ హోమ్ సమకట్టినాడు. అమెరికను వలసలకు సంబంధించిన శాసనాలు చేసే అధికారం బ్రిటీషు పార్లమెంటుకు కలదని ఇంగ్లాండు నిశ్చితాభిప్రాయం. కాని అమెరికనులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. నాడు ఎదురైన మౌళిక సమస్య అమెరికను వలసలకు సంబంధించిన చట్టాలు చేసే హక్కు బ్రిటీషు పార్లమెంటుకు కలదా ? లేదా ? అనేది "ఉన్నది'' అని బ్రిటీషు వారి వాదన. దానిని నిరూపించేందుకు రాకింగ్ హోమ్ మంత్రివర్గం డిక్లరేటరీ చట్టాన్ని చేసింది. దీని ప్రకారం వలసలకు సంబంధించిన శాసనాలు చేసే హక్కు బ్రిటీషు పార్లమెంటుకు కలదని తెలియజేయబడింది. ఆ వైఖరినీ వలస ప్రజలు వ్యతిరేకరించారు. వారు పన్నులు చెల్లించుటకు విముఖులు కారు. వారు వ్యతిరేకించేది తమకు ప్రాతినిధ్యం లేని బ్రిటీషు పార్లమెంటు విధించే పన్నులను మాత్రమే. "ప్రాతినిధ్యం లేనిదే పన్నులు లేవు'' అనేది వారి నినాదం. (No Taxation without Representation) అమెరికనులను సంతృప్తి పరచడంలో రాకింగ్ హోమ్ గూడా విఫలుడైనాడు.

**3.2.2.5. చార్లెస్ టౌన్ షెండ్ చట్టాలు (1767) :** సంవత్సర కాలంలో రెండు చట్టాలు చేసిన రాకింగ్ హోమ్ పాలన రాజు మూడవ జార్జికి అతని మిత్రులకు నచ్చకపోవుటచే రాజు అతనిని తొలగించి విలియం పిట్‌ని మరల ప్రధాన మంత్రిగా నియమించినాడు. అతని మంత్రివర్గంలో చేరిన వారందరు విభిన్న రాజకీయాభిప్రాయాలు కలవారు. అందువలననే బర్క్ ఆ మంత్రి వర్గాన్ని పలు వర్ణాలుగల మొజాయిన్ ఫలకముగా వర్ణించినాడు. ఈ మంత్రి మండలి కూడా ఆది నుండి అంతము వరకు పలు వైఫల్యాలను చవి చూసింది. ఇందులో చార్లెస్ టౌన్ షెండ్ కోశాధికారిగా నియమింపబడినాడు. అతడు గొప్ప వక్త.

విలియం పిట్ అస్వస్థత కారణంగా 1767లో టౌన్ షెండ్ పరోక్ష పన్నుల విధానం ద్వారా అమెరికనులను సంతృప్తి పర్చదలచి అనేక అనర్థాలకు దారి తీసిన దిగుమతి సుంకాల చట్టాన్ని చేసినాడు. దీని ప్రకారం వలసలకు దిగుమతియగు రంగులు, గాజుసామాగ్రి, సీసం, తేయాకు మున్నగు పదార్థాలపై సుంకం విధించాడు. దీని ద్వారా సంవత్సరానికి నలభైవేల పౌండ్ల ఆదాయం సమకూరగలదని అతడు ఆశించినాడు. ఆ ఆదాయాన్ని వలసల గవర్నర్‌ల న్యాయాధీశుల, ఇతర ఉద్యోగుల వేతనాలపై వ్యయించాలని అతడు తలచినాడు. వీరందరు స్థానిక శాసనసభలకు మారుగా ఆంగ్ల ప్రభుత్వానికి విధేయులై ఉండాలని అతని ఆకాంక్ష. స్టాంపుల చట్టం మాదిరిగా ఇది మరొక దురదృష్టకరమైన చట్టం. స్టాంపుల చట్ట ఉపసంహరణ ద్వారా వలస ప్రజలలో అపుడేమానుతున్న గాయాన్ని ఈ చట్టం ద్వారా మరల రేపినట్లయింది. వలస ప్రజలు సమైక్యంగా నిలబడి దిగుమతి సుంకాలు విధింపబడిన వస్తువులను బాయ్‌కాట్ చేయ నిశ్చయించి "స్వేచ్ఛా పుత్రుల - పుత్రికల సమాజము ("Society of the Sons and Daughters of Liberty") అను సంఘాలను నెలకొల్పినారు. ప్రాతినిధ్యము లేనిదే పన్నులు లేవు'' అనే నినాదాన్ని పునరుద్ఘాటించినారు. ఆంగ్ల ప్రభుత్వాధినేతలు వారిని "శిక్షార్హులైన అవిధేయ బాలురు''గా వర్ణించినారు.

నాడు అమలులో ఉన్న శాసనాలు ఖచ్చితంగా అమలు జరిగేందుకు టౌన్ షెండ్ మంత్రివర్గం చర్యలు తీసుకున్నది. వ్యాపార సుంకాల శాఖ పునర్వ్యవస్థీకరింపబడింది. నాటి నగరాలలో అతి పెద్దదైన బోస్టన్ నగరం ఉత్తర అమెరికాకు అధికార కేంద్రంగా చేయబడింది. సరకుల దొంగ రవాణా చేసే వారిని శిక్షించేందుకు బోస్టన్, ఫిలడెల్ఫియా, చార్లెస్ టౌన్‌ల వద్ద నౌకా సంబంధ న్యాయ స్థానాలు నెలకొల్పబడినాయి. పన్నుల వసూళ్ళు సక్రమంగా జరిగేటందుకు తగు చర్యలు తీసుకోబడినాయి. న్యూయార్క్ రాష్ట్రంలోని బ్రిటీషు సేనల ఖర్చు భరించుటకు

ఆ రాష్ట్ర శాసన సభ నిరాకరించుటతో దాని శాసన నిర్మాణాధికారాలను బ్రిటీషు పార్లమెంటు రద్దు చేసింది. డిక్లరేటరీ చట్టం ప్రకారం తన ఆధిక్యతను నిరూపించుటకు పార్లమెంటు చేసిన ప్రయత్నమే అందుకు కారణం. తదుపరి రాష్ట్ర శాసన సభ సైనిక వ్యయమును భరించుటకు సుముఖంగా ఉండుటతో రద్దు నిర్ణయం ఉపసంహరించుకోబడింది.

**3.2.2.5.1. టౌన్ షెండ్ చర్యల నిరసన :** అమెరికా వలసల నాయకులు టౌన్‌షెండ్ చర్యలను ప్రతిఘటించుటకు పూనుకొని అనేక చర్యలు తీసుకున్నారు. అవి :

**3.2.2.5.1.1. బ్రిటీషు వస్తువుల దిగుమతి బహిష్కరణ :** వలస ప్రజలు బ్రిటీషు ఉత్పత్తిదారుల మీద, వ్యాపారుల మీద వత్తిడి తెచ్చుటకు ప్రయత్నించారు. వారి నాయకులు బోస్టన్‌లో సమావేశమై ఇంగ్లాండు నుండి దిగుమతి అగు కొన్ని వస్తువులను నిషేధిస్తూ ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. తత్ఫలితంగా ఒక్క సంవత్సరంలోనే బ్రిటీషు దిగుమతులు 70 లక్షల పౌండ్లకు పడిపోయాయి. ఈ లోగా జాన్ డికెన్ సన్ "పెన్సిల్వేనియా రైతు వలస ప్రజలకు వ్రాసిన లేఖ" అను తన వ్యాసంలో బ్రిటీషు పార్లమెంటు తన ఆదాయాన్ని పెంచుకోవడానికి వలస ప్రజల మీద పన్నులు విధించే హక్కు లేదనియు, అందువలన టౌన్ షెండ్ చర్యలు రాజ్యాంగ విరుద్ధమనియు, న్యూయార్క్ శాసన సభ అధికారాల రద్దు వలస ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించుటయే అనియు తెల్పినాడు. బోస్టన్ వర్తకులను అనుకరిస్తూ న్యూయార్క్, ఫిలడెల్ఫియా, మున్నగు ఇతర రాష్ట్రాల వారుగూడా అలాంటి ఒప్పందాలపై సంతకాలు చేశారు.

**3.2.2.5.1.2. : ప్రచార లేఖలు :** వర్తకులే కాక రాష్ట్ర శాసన సభలు కూడా టౌన్ షెండ్ చర్యలను గర్హిస్తూ తమ నిరసనలను తెలియజేసాయి. మెసాచుసెట్స్‌లో శామ్యూల్ ఆడమ్స్ ప్రచారలేఖ (Circular Letter) నొకదానిని రూపొందించి అందులో టౌన్ షెండ్ చట్టాలు తమ సహజ హక్కులను, రాజ్యాంగ పరమైన హక్కులను ఉల్లంఘిస్తున్నాయని తెల్పినాడు. ఆ లేఖకు తమ ఆమోదము తెల్పవలసినదిగా ఇతర రాష్ట్ర శాసన సభలకు పంపగా మేరీలాండ్, దక్షిణ కరోలినా, జార్జియా, వర్జీనియా రాష్ట్రాలవారు దానికి తమ మద్దతు తెల్పినారు. అందులకాగ్రహించిన ఇంగ్లాండు రాజు మూడవ జార్జి ఆయా రాష్ట్ర శాసన సభలను రద్దు చేస్తూ ఆజ్ఞలు జారీ చేశాడు.

**3.2.2.5.1.3. బోస్టన్ హత్యాకాండ :** నాటి అమెరికాలో అతి పెద్ద నగరం బోస్టన్. అక్కడ ఉన్న వ్యాపార సుంకాల అధికారుల ఆధిపత్యాన్ని కాపాడుటకు, సరుకుల దొంగ రవాణాను అరికట్టుటకు బ్రిటీషు ప్రభుత్వం అచటికి రెండు పటాలాల ఎఱ్ఱకోటు సైనికులను పంపింది. అమెరికన్ అతివాదులు ఆ చర్యను వ్యతిరేకించినప్పటికిని సైన్యము అక్కడ నుండి కదలలేదు. 1770 మార్చి 5వ తేదీన బోస్టన్ "స్వేచ్ఛా పుత్రులు" కొందరు బ్రిటీషు సైనికులపై రాళ్ళు రువ్వి వారిని రెచ్చగొట్టగా వారు జరిపిన కాల్పులలో నలుగురు (లేక ఐదుగురు) అమెరికనులు మరణించారు. అందులో క్రిస్పస్ అటుక్స్ (Crispus Attuks) అను ప్రజా నాయకుడు గూడా మరణించాడు. ఎనిమిది మంది గాయపడ్డారు. దీనినే అమెరికనులు "బోస్టన్ హత్యాకాండగా" (Boston Massacre) వర్ణించినారు. దీనిని బోస్టన్ హత్యాకాండ అనుటకంటే "చిన్న జగడము" అనుట సమంజమని ఆచార్య థామస్ బైలీ అభిప్రాయపడినాడు. ఈ సంఘటనను స్మరిస్తూ 1780 వరకు ప్రతి సంవత్సరం బోస్టన్‌లో సంస్మరణ సభలు జరిగేవి. ఈ కాల్పులకు బాధ్యులైన కెప్టెన్ ప్రెస్టన్‌ను, ఏడుగురు సైనికులను దోషులుగా పరిగణించి విచారణ జరిపి వారికి స్వల్ప శిక్షలు విధించారు. ఈ సంఘటనతో బోస్టన్ వాసులకు ఆంగ్ల సైనికుల మధ్య వైరా భావము ఏర్పడింది.

**3.2.2.6. బోస్టన్ టీ పార్టీ (Boston Tea Party) :** 1773 చార్లెస్ టౌన్ షెండ్ 1767లో మరణించిన పిమ్మట హెన్రీ గ్రాఫ్టన్ కోశాగార మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినాడు. అస్వస్థత కారణంగా పదవిలో లేనపుడు తన పేరిట టౌన్ షెండ్ ప్రవేశపెట్టిన దిగుమతి సుంకాల చట్టం (Import Duties Act 1767) అమెరికా వలసలలో తీవ్ర అసంతృప్తి రగుల్కొల్పగా అందుకు నైతిక బాధ్యత వహించి లార్డ్ ఛాతామ్ (William Pitt, the Elder) ప్రధాని పదవికి (1768) రాజీనామా చేశాడు. అందువలన గ్రాఫ్టన్ కొద్దికాలం పాటు ప్రధాని బాధ్యతలు గూడా నిర్వహించవలసి వచ్చింది. అమెరికా వలసల అలజడుల వలన అతడు పలు విమర్శలకు గురియై, జార్జి ప్రభువు అభిమానాన్ని గూడా కోల్పోయి తన పదవికి రాజీనామా చేశాడు. అంతట మూడవ జార్జికి ఇష్టుడగు లార్డ్ ఫ్రెడరిక్ నార్త్ ఇంగ్లాండు ప్రధాని అయినాడు. అతడు కడు సమర్థుడు, ప్రభుత్వ వ్యవహారాలు నిర్వహించుటలో దిట్ట, రాజుకు మిక్కిలి విధేయుడు, అమెరికనులలో ప్రబలిన అసంతృప్తిని తొలగించి వారిని శాంతపర్చుటకు పార్లమెంటుపై వత్తిడి తెచ్చి 1770లో టౌన్ షెండ్ చట్టాలను రద్దు చేశాడు.

దిగుమతి సుంకాలు రద్దయినాయి. కానీ అమెరికా వలసలపై చట్టాలు చేసే హక్కు బ్రిటీషు పార్లమెంటుకు కలదని తెల్పుటకు ఒక్క టీ పొడి దిగుమతి మీద సంవత్సరానికి మూడు వందల పౌండ్లు మాత్రమే ఆదాయమిచ్చు దిగుమతి సుంకాన్ని విధించినాడు. వలస ప్రజలకిది సుతరామూ ఇష్టం లేదు. వారి దృష్టిలో అది అన్యాయం. వారు పన్నులు చెల్లింపుకు వ్యతిరేకం కాదు. పన్నుల భారం వారు మోయలేరని కాదు. తమకు ప్రాతినిధ్యం లేని బ్రిటీషు పార్లమెంటు విధించే పన్నులకు మాత్రమే వారు వ్యతిరేకులు. ఆ హక్కు పార్లమెంటుకు లేదని వారి వాదన. వలసలలో నిరసనలు, ప్రతిఘటనలు, అలజడులు చెలరేగాయి. అరాచక పరిస్థితులు రాజ్యమేలాయి. లార్డ్ నార్త్ ఆ పరిస్థితులను చక్కబర్చుటకు ప్రయత్నించాడు. అదే సమయంలో (1772) ఆర్థిక ఇబ్బందులలోఉన్న ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వసాయం అర్థించింది. కంపెనీలో టీపొడి నిల్వలు పేరుకుపోయాయి. దానికి సాయపడుటకు వలస ప్రజలకు చౌకగా టీ పొడి అందించుటకు కంపెనీకి గుత్తాధిపత్యం ఇవ్వబడింది. దిగుమతి సుంకం మూడు పెన్నీలుగా (పెన్నీ మన పైసతో సమానం, పౌండులో నూరవ భాగం) నిర్ణయింపబడింది. కంపెనీ టీ పొడిని చౌకగా అమ్ముట వలన అమెరికను వర్తకులు నష్టాలపాలై కంపెనీ గుత్తాధిపత్యాన్ని నిరసించి తీవ్రంగా వ్యతిరేకించారు.

కంపెనీ నౌకలు టీ పొడితో అమెరికా చేరాయి. న్యూయార్క్, ఫిలడెల్ఫియా రాష్ట్రాలు ఆ నౌకలు ఇంగ్లాండుకు తిరిగిపోయేటట్లు వత్తిడి చేశాయి. మరొక నౌక మెసాచుసెట్స్ రాష్ట్రంలోని బోస్టన్ రేవు చేరింది. అందులోని సరుకు గవర్నరు కుమారుల పేరిట పంపబడింది. అందువలన ప్రజా ప్రతిఘటనను పెడచెవిన పెట్టి ఆ గవర్నరు టీ పొడి పెట్టెలను దిగుమతి చేయ నిశ్చయించాడు. అతనికి తగిన గుణ పాఠం నేర్పాలని "స్వేచ్ఛా పుత్రులు" యాభైమంది రెడ్ ఇండియన్ల వేషధారణతో ఆ నౌకలో ప్రవేశించి 18,000 పౌండ్ల విలువగల 350 టీ పొడి పెట్టెలను సముద్రంలో పడవేశారు. ఈ సంఘటనే బోస్టన్ టీ పార్టీగా ప్రసిద్ధి చెందింది.

**3.2.2.7. దుస్సహ శాసనాలు** (Punitive Acts) : బోస్టన్ సంఘటనలకు ఆగ్రహించిన బ్రిటీషు ప్రభుత్వం అందుకు బాధ్యులైన మెసాచుసెట్స్ రాష్ట్ర వాసులను శిక్షించుటకు పూనుకొని మూడు చట్టాలు చేసింది. వాటిని దుస్సహ శాసనాలంటారు. రామ్సే మ్యూర్ అన్నట్లు బ్రిటీషు ప్రభుత్వం అమెరికనుల స్వేచ్ఛకు ప్రబల శత్రువని ఈ చట్టాలు ఋజువు చేశాయి. అవి ఇరువురి మధ్య ప్రత్యక్ష పోరాటానికి తెరతీశాయి.

**3.2.2.7.1. బోస్టన్ రేవు చట్టం :** బోస్టన్ రేవులో టీపొడి నీటి పాలగుటకు కారకులైన అచటి ప్రజలను శిక్షించుటకు బ్రిటీషు ప్రభుత్వం బోస్టన్ రేవు చట్టం చేసింది. దీని వలన బోస్టన్ రేవు మూసివేయబడింది. ఇచటి కార్యకలాపాలు ఈ రేవుకు సమీపమున ఉన్న న్యూసేలం రేవుకు మార్చబడినాయి. సముద్రం పాలు చేయబడిన టీ పొడి ధర, చెల్లించేంతవరకు బోస్టన్ రేవు మూసివేయబడింది. ప్రభుత్వ అధికారాలు పెంచబడినాయి. గవర్నర్ అనుమతి లేనిదే సభలు సమావేశాలు జరుపరాదు. రాష్ట్ర శాసనసభ ఎన్నిక ద్వారా కాక నియామకాల ద్వారా ఏర్పాటు చేయబడుతుంది. సమయానుకూలంగా రాష్ట్ర గవర్నర్లు సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. తక్షణ చర్యగా బ్రిటీషు ప్రభుత్వం నాలుగు సైనిక పటాలాలను బోస్టన్ పంపింది. ఆ సైనిక దళాల అధిపతి మెసాచుసెట్స్ గవర్నర్‌గా నియమితుడైనాడు. వలస రాష్ట్రాలు" దాసోహమో లేదా విజయమో తేల్చుకోవాలి" అంటాడు ఇంగ్లాండు రాజు మూడవ జార్జి.

**3.2.2.7.2. మెసాచుసెట్స్ ప్రభుత్వ చట్టం :** తన నిరంకుశ ధోరణిని మరింత ప్రస్ఫుటంగా విదితం చేస్తూ బ్రిటీషు ప్రభుత్వం చేసిన మరొక చట్టం మెసాచుసెట్స్ ప్రభుత్వ చట్టం. దీని ప్రకారం మెసాచుసెట్స్ తన ప్రతినిధులను శాసనసభకు పంపే వీలులేదు. పూర్వపు చార్టరు రద్దు చేయబడింది. ప్రభుత్వ అనుమతి లేకుండా సభలు, సమావేశాలు జరుపకూడదు, వలసలలోని నేరస్థులు ఇంగ్లాండులోనే విచారింపబడాలి, రాష్ట్ర పాలన బ్రిటీషు ప్రభుత్వం చే నియమింపబడిన గవర్నర్లు నిర్వహిస్తుంటారు. ఈ చట్టం వలన బ్రిటీషు - అమెరికా సంబంధాలు మరింతగా దిగజారాయి.

**3.2.2.7.3. క్విబెక్ చట్టం :** లార్డ్‌నార్త్ ప్రవేశపెట్టిన క్విబెక్ చట్టం ద్వారా కెనడాలో నివసించు కాథలిక్ క్రైస్తవులకు మత స్వేచ్ఛ, స్వీయపాలన లభించాయి. పరాజితులైన ఫ్రెంచివారు ఖాళీ చేసిన భూభాగంలో వలస విస్తరణ నిషేధింపబడింది. ఈ చట్టాన్ని అమెరికనులు తీవ్రంగా నిరసించారు.

**3.2.3. ఫిలడెల్ఫియా సమావేశం (1774) లేక ప్రథమ కాంటినెంటల్ కాంగ్రెస్ :** లార్డ్‌నార్త్ ప్రవేశపెట్టిన దుస్సహాశాసనాలు, మెసాచుసెట్స్ శాసనసభ అధికారాలను తగ్గించి గవర్నరు అధికారాలను పెంచుట మున్నగు అంశాలు వలస ప్రజలలో భయాందోళనలను కలిగించాయి. అటువంటి పరిస్థితి తమకు కూడా ఎదురవుతుందని వారు కలత చెందారు. ఆ పరిస్థితులను ఎదుర్కొనుటకు మెసాచుసెట్స్ విజ్ఞప్తిపై వలస రాష్ట్రాల ప్రతినిధులు జార్జియా రాష్ట్ర ప్రతినిధి మినహా - 1774 లో ఫిలడెల్ఫియాలో పీటన్ రాండోల్ఫ్ (Peyton Randolf) అధ్యక్షతన సమావేశమై తమ హక్కుల ప్రకటనను విడుదల చేశారు. అందులో బ్రిటీషు పౌరులుగా స్వేచ్ఛగా జీవించుటకు తమకు గల హక్కులను పునరుద్ఘాటించుటయేగాక బ్రిటీషు ప్రభుత్వం చేసి దుస్సహ చట్టాలు తమస్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరిస్తున్నాయని తెల్పినారు. తమ సమస్యలను పరిష్కరించేటంత వరకు ఇంగ్లాండు నుండి దిగుమతులను నిషేధించాలని వారు తీర్మానించారు. దానికి ప్రతిగా పన్నులు చెల్లించుటకు ప్రతిఘటిస్తున్న వలస ప్రజలకు రక్షణ కల్పించమని కోరే హక్కు లేదని బ్రిటీషువారు ప్రకటించారు. ఇట్లు రెండు ప్రాంతాల మధ్య పరస్పర విరుద్ధ అభిప్రాయాలు నెలకొని ఉన్నాయి.

ఫిలడెల్ఫియా సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు తమసమస్యల పరిష్కార సాధనకు ఇంగ్లాండు రాజు మూడవ జార్జికి ఒక విజ్ఞాపన పత్రాన్ని పంపుకున్నారు. జార్జి ప్రభువు ఆ విజ్ఞాపనను తిరస్కరించుటతో విప్లవం ఆరంభమయింది.

పైన వివరింపబడినట్లు బ్రిటీషు ప్రభుత్వ విధానాలు - ప్రధానంగా ఆర్థిక విధానాలు - అమెరికను వలసలకు నష్టదాయకంగా పరిణమించి పోరుబాట వైపు నడిపించాయి. అమెరికా స్వాతంత్ర్య సమరానికి ఇంగ్లాండు దేశ నిరంకుశ దోరణులే కారణమని చరిత్రకారుడు డేవిస్ అభిప్రాయపడగా తమకు ప్రాతినిధ్యం లేని బ్రిటీషు పార్లమెంటు పన్నుల విధానం ఒక వైపు తమకు నష్టదాయకంగా పరిణమించిన బ్రిటీషు వారి వ్యాపార విధానాలు మరొక వైపు కారణాలని H.G. వెల్స్ అను ప్రముఖ చరిత్రకారుడు నుడివినాడు.

## 3.2.4. సారాంశము :

ప్రజాస్వామ్య చరిత్రలో అమెరికా విప్లవం ఒక మహోజ్వల ఘట్టం. ఆంగ్లేయులు - ఆంగ్లేయులతో పోరాడుట దీనిలోని విశేషం. ఈ విప్లవానికి కొన్ని మౌళిక కారణాలు రంగం సిద్ధం చేయగా తక్షణ కారణాలు విప్లవ జ్యోతిని వెలిగించాయి. భౌగోళిక పరిస్థితులు, వ్యవసాయం, వాణిజ్యం మున్నగు అంశాలు వివిధ జాతులకు చెందిన అమెరికనులలో జాతీయతా భావాన్ని రూపొందించాయి. జనాభా పెరుగుదలతో పాటు వారిలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల ఎడల అనురక్తి కూడా పెరిగింది. అమెరికనులలో స్వాభిమానము, ప్రజాస్వామ్యాను రక్తి ఎక్కువ. వారు తమ ఆంతరంగిక విషయాలలో పరుల జోక్యం సహించలేకపోయారు. రాజకీయ భావనలలో గూడా వారికి, ఆంగ్లేయులకు అనేక భేదాభిప్రాయాల ఉన్నాయి. జాన్‌లాక్, డికార్టిస్ మున్నగు రాజనీతివేత్తలు భావనలైన సహజహక్కుల సిద్ధాంతం, హేతువాదం, మానవతావాదం అమెరికనులను ప్రభావితం చేయగా జెఫర్సన్, జేమ్స్ ఓటిస్ మున్నగు వారి రచనలు, బోధనలు వారిలో రాజకీయ చైతన్యాన్ని పోరాట స్ఫూర్తిని నింపాయి. ప్రకృతి కల్పించిన సహజ సిద్ధమగు రక్షణ శ్రేణులు అమెరికాకు భద్రత కల్పించాయి. బ్రిటీషు వారి ఆర్థిక విధానాలు (మార్కెంటలిజం) అమెరికనులకు నష్టదాయకంగా పరిణమించాయి. వారి విదేశీ వ్యాపారం స్వప్రయోజనాలకు భిన్నంగా కొనసాగింది. మొలాసిస్, నౌకా చట్టాలు పరిస్థితిని మరింత విషమింపజేశాయి. అలాంటి పరిస్థితుల్లో వారి సమస్యల పట్ల సానుభూతి, అవగాహనగల బ్రిటీష్ రాజనీతిజ్ఞులు కరువయ్యారు. అందువలన ఇరు ప్రాంతాల మధ్య పెద్ద అగాధం ఏర్పడింది.

కొన్ని సంఘటనలు, సన్నివేశాలు ఇరు ప్రాంతాల మధ్య భేదాలను తీవ్రతరం చేయటంతో పోరు అనివార్యమయింది. ఆంగ్లో-ఫ్రెంచి యుద్ధంలో ఫ్రెంచివారు పరాజితులై వారి బెడద తొలగిపోవుటతో అమెరికా వలసలకు ఆంగ్ల ప్రభుత్వ రక్షణ ఆవశ్యకత తొలగిపోయింది. అందులో ఆంగ్ల సైన్య పోరాట పద్ధతులు గమనించిన అమెరికనులలో ఆత్మ విశ్వాసం పెరిగింది. వివిధ పన్నుల రూపంలో యుద్ధ ఖర్చులను భరించుటకు వారు సిద్ధంగా లేరు. అందువలన వారు గ్రెన్ విల్లీ ప్రవేశపెట్టిన చక్కెర చట్టాన్ని, స్టాంపుల చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రదర్శనలు జరిపారు. వారిని శాంతింపజేయుటకు రాకింగ్ హోమ్ స్టాంపుల చట్టాన్ని ఉపసంహరించాడు. కాని బ్రిటీషు పార్లమెంటు ఆధిక్యతను చాటుటకు అతడు డిక్లరేటరీ చట్టాన్ని ప్రవేశపెట్టాడు. పరోక్ష పన్నుల ద్వారా ఇంగ్లాండు ఆదాయాన్ని పెంచే ప్రయత్నంలో బ్రిటీషు ఆర్థిక వ్యవహారాల మంత్రి టౌన్ షెండ్ దిగుమతి సుంకాల చట్టాన్ని ప్రతిపాదించాడు. స్టాంపుల చట్ట ఉపసంహరణ

ద్వారా అపుడే మారుతున్న గాయాన్ని ఆ చట్టం ద్వారా మరల రేపినట్లయింది. అమెరికనులు దిగుమతి సుంకాలు విధింపబడిన వస్తువుల దిగుమతిని బాయ్‌కాట్ చేశారు. శాంతి భద్రతలను కాపాడుటకు ఇంగ్లాండు రెండు పటాలాల ఎఱ్ఱకోటు సైనికులను బోస్టన్ పంపింది. తమపై రాళ్లు రువ్వి రెచ్చగొట్టిన బోస్టను వాసులపై వారు జరిపిన కాల్పులలో నలుగురు మరణించారు. అది బోస్టన్ హత్యాకాండగా ప్రసిద్ధికెక్కింది. తదుపరి అమెరికనులను శాంత పర్చుటకు ఇంగ్లాండు ప్రధాని లార్డ్ నార్త్ టౌన్‌షెండ్ చట్టాలు రద్దు పరచి ఒక్క టీపొడి మీద మాత్రమే స్వల్పంగా దిగుమతి సుంకం విధించినాడు. దానిని గూడా చెల్లించుటకు నిరాకరించిన బోస్టన్‌వాసులు టీపొడి పెట్టెలను సముద్రంలోకి గిరాటు వేశారు. దీనినే బోస్టన్ టీపార్టీ అంటారు. అందుకు బాధ్యులైన వారిని శిక్షించుటకు, పరిస్థితిని చక్కదిద్దుటకు ఇంగ్లాండు దుస్సహ శాసనాల రూపంలో కొన్ని కఠిన చర్యలు తీసుకుంది. వాటిని ఎదుర్కొనుటకు వలసల ప్రతినిధులు ఫిలడెల్ఫియాలో సమావేశమై స్వేచ్ఛగా జీవించే హక్కు తమకు కలదని తీర్మానాలు చేసి వాటిని ఇంగ్లాండు రాజు మూడవ జార్జికి పంపగా అతడు సానుకూలంగా స్పందింపకపోవుటచే అమెరికా విప్లవం ఆరంభమయింది.

## 3.2.5. నమూనా ప్రశ్నలు :

**1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)**

1. అమెరికా విప్లవమునకు దారి తీసిన పరిస్థితులేవి ?

(లేదా)

అమెరికా స్వాతంత్ర్య సమరానికి కారణాలేవి ?

2. అమెరికా విప్లవమునకు కారణమైన మౌళిక అంశములేవి

(లేదా)

అమెరికా విప్లవానికి రంగం సిద్ధం చేసిన అంశములేవి ?

**2) లఘు వ్యాసరూప ప్రశ్నలు (15 మార్కులు)**

1) అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి దారి తీసిన తక్షణ కారణములేవి ?

2) మర్కెంటలిజంలోని ప్రధానాంశములేవి ? దానికి అమెరికనుల ప్రతిస్పందన ఎట్లున్నది ?

**3) లఘుటీక ప్రశ్నలు (5 మార్కులు)**

1) నౌకా చట్టాలు

2) ఆంగ్లో - ఫ్రెంచి యుద్ధం

3) స్టాంపుల చట్టం

4) బోస్టన్ టీ పార్టీ

5) ఫిలడెల్ఫియా సమావేశం

### 3.2.6. చదువదగిన గ్రంథాలు :


1. రామచంద్రరావు సి.వి. - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర (1773-1865)
2. సింగరాచార్య బి.వి, - అమెరికా సంయుక్త రాష్ట్రాల సంగ్రహ చరిత్ర
3. స్టీఫన్ విన్సెంట్ భనే - అమెరికా
4. Parkes H.B. - The United States of America - A History
5. Wood Grey - An Outline of American History
6. Allan Nevins and Henry Steele Commager - A Short History of the United States
7. Thomas A. Bailey - - The American Pageant - A History of the Republic
8. Richard N. Cursent, Harry Williams T, and Frank Freidel - American History - A Survey


- డా॥ ఓ. సాంబయ్య

పాఠం - 3.3.

# అమెరికా స్వాతంత్ర్య యుద్ధ గమనము-ఫలితాలు

## 3.3.0. లక్ష్యం :

అమెరికా స్వాతంత్ర్య సమర ఘట్టాలను గురించి అధ్యయనం చేయడం ఈ పాఠ్యాంశ ప్రధాన లక్ష్యం. ఈ యుద్ధంలో ఆంగ్లేయుల పరాజయానికి కారణాలను పరిశీలిస్తూ ఫలితాలను పేర్కొనడం మరొక లక్ష్యం.

## విషయసూచిక :


3.3.1. పరిచయము

3.3.2. యుద్ధ గమనము

- **3.3.2.1.** లెక్సింగ్టన్ యుద్ధం **(1775)**
- **3.3.2.2.** ద్వితీయ కాంటినెంటల్ కాంగ్రెస్ **(1775-1776)**
- **3.3.2.3.** బంకర్ హిల్ యుద్ధం **(1775)**
- **3.3.2.4.** **1775-1776** సంవత్సరాల మధ్య జరిగిన పరిణామాలు
  - **3.3.2.4.1.** ఆలివ్ బ్రాంచ్ పిటీషన్ **(1775)**
  - **3.3.2.4.2.** వలసలు కెనడాను జయించు యత్నం **(1775)**
  - **3.3.2.4.3.** బోస్టన్ నుండి ఆంగ్ల సైన్య ఉపసంహరణ
  - **3.3.2.4.4.** వలసలకు ఉన్న అనుకూల పరిస్థితులు
- **3.3.2.5.** నిషేధ ఉత్తర్వుల చట్టం **(1776)**
- **3.3.2.6.** స్వాతంత్ర్య ప్రకటన **(1776)**
- **3.3.2.7.** బ్రాండ్ విన్ నుండి సారటోగా వరకు
- **3.3.2.8.** అమెరికనులకు ఫ్రెంచి సాయం **(1778)**
- **3.3.2.9.** ఫిలడెల్ఫియా నుండి ఆంగ్లేయులు వైదొలగుట
- **3.3.3.10.** యార్క్ టౌన్ యుద్ధం **(1781)**

3.4. అమెరికనుల విజయానికి కారణాలు

- **3.4.1.** మూడవ జార్జి బాధ్యత
- **3.4.2.** బ్రిటీష్ సైనికాధికారుల అసమర్థత
- **3.4.3.** యుద్ధ తంత్ర లోపాలు

3.4.4. మితిమీరిన బ్రిటీష్ ప్రభుత్వ జోక్యం

3.4.5. ఆంగ్లేయులు శత్రువుల బలాన్ని తక్కువగా అంచనా వేయుట

3.4.6. హేతుబద్ధముకాని బ్రిటీష్ వారి విధానాలు

3.4.7. బ్రిటీష్ వారి అసమర్ధ యుద్ధ నిర్వహణ

3.4.8. బ్రిటీష్ వారిలో సహకార లోపం

3.4.9. వలస ప్రజల పట్టుదల

3.4.10. అమెరికా సుదూర ప్రాంతంలో ఉండుట

3.4.11. విశాలమైన యుద్ధరంగం

3.4.12. అమెరికనులకు విదేశీ సాయం

3.5. వర్సే (Versailles) సంధి (1783)

3.6. యుద్ధ ఫలితాలు

3.6.1. అమెరికా పరంగా

3.6.1.1. నవ్య దేశ ఆవిర్భావం

3.6.1.2. ప్రభుత్వ నిర్మాణంలో క్రొత్త ప్రయోగాలు

3.6.1.3. ప్రభుత్వ స్వరూపంలో మార్పు

3.6.1.4. బానిస వ్యవస్థ రద్దు

3.6.1.5. విస్తృత ప్రాతిపదిక

3.6.1.6. సంస్కరణలు

3.6.1.7. ఆంగ్లికన్ చర్చి

3.6.1.8. లాయలిస్టుల బహిష్కరణ

3.6.2. ఇంగ్లాండుపై ప్రభావం

3.6.2.1. రాజరిక వ్యవస్థ బలహీన పడుట

3.6.2.2. ఆర్థిక రంగం

3.6.2.3. ఇంగ్లాండుకు గుణపాఠం - నూతన వలస విధానం

3.6.2.4. బ్రిటీష్ కామన్ వెల్త్

3.6.2.5. వలసాధిపత్యం పడమర నుండి తూర్పుకు

3.6.3. ఫ్రాన్స్‌పై ప్రభావం

3.6.3.1. ఫ్రెంచివారు ఉత్తేజితులగుట

3.6.3.2. ఫ్రెంచి విప్లవాన్ని వేగిరపర్చుట

3.6.3.3. ఫ్రాన్స్ పూర్వపు స్థితిని పొందగల్గుట

3.6.4. ఐర్లాండ్‌పై ప్రభావం

3.6.5. స్పెయిన్‌పై ప్రభావం

3.6.6. విప్లవ హక్కుకు ప్రాచుర్యం

3.6.7. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు

3.6.8. మర్కెంటలిజం

3.7. సారాంశము

3.8. నమూనా ప్రశ్నలు

3.9. చదువదగిన గ్రంథాలు

## 3.3.1. పరిచయము :

నాలుగవ పాఠంలో వివరింపబడినట్లు అనేక కారణాలు, - మౌళిక, తక్షణ, - యుద్ధారంభానికి దారి తీశాయి. ఈ యుద్ధం 1775లో మొదలై 1783 వరకు కొనసాగి ఆ సంవత్సరంలో జరిగిన వర్సై సంధితో (Treaty of Versailles) ముగిసింది. ఇందులో మూడు ఘట్టాలు ఉన్నాయి. అవి : మొదటి ఘట్టం 1775 నుండి 1778 వరకు. ఇందులో బ్రిటీషు వారు అమెరికనులను జయించుటకు తమ సర్వ శక్తియుక్తులను ఒడ్డి పోరాడినారు. రెండవ ఘట్టం 1778 నుండి 1781 వరకు. ఈ దశలో బ్రిటీషు వారు తమ యుద్ధ తంత్ర ప్రయోగంలో విఫలురైనారు. మూడవ ఘట్టం 1781 నుండి 1783 వరకు. ఈ కాలంలో ఫ్రాన్స్ మున్నగు ఐరోపా దేశాల సాయము పొందిన అమెరికనులు బ్రిటీషు వారిని పూర్తిగా నిర్జించి సర్వస్వతంత్రులైనారు. నాటి వలస ప్రజలను మూడు వర్గాలుగా విభజింపవచ్చును. అవి : 1) లాయలిస్టులు - వీరు బ్రిటీషు ప్రభుత్వము ఎడల ప్రభువు ఎడల విశ్వాసముగలవారు. 2) పేట్రియాట్స్ - వీరు అమెరికా దేశాభిమానులు. 3) తటస్థవాదులు - వీరు ఎటూ నిర్ణయించుకోలేని సందిగ్ధ అవస్థలో ఉన్నవారు. వీరిలో రెండవ వర్గమువారి బలము హెచ్చు.

## 3.3.2. యుద్ధ గమనము :

**3.3.2.1. లెక్సింగ్టన్ యుద్ధం (19, ఏప్రిల్, 1775) :** మెసాచుసెట్స్ ప్రజలు ఆంగ్లేయులను ఎదుర్కొనుటకు నిముష వీరులు (Minute Men) అను పౌర సైన్యమును ఏర్పాటు చేశారు. బ్రిటీషు వారి ఆజ్ఞలకు విరుద్ధంగా వారు కంకార్డ్ పట్టణంలో సమావేశమై ఆయుధ సామాగ్రిని, సైనికులను సమీకరించినారు. అది సహించని బోస్టన్ గవర్నర్ జనరల్ గేజ్ బ్రిటీషు ప్రభుత్వ అదేశాల మేరకు కంకార్డ్ వద్ద ఉన్న మందుగుండు సామాగ్రిని ధ్వంసము చేయుటకు, సమావేశమైన వారిని చెదరగొట్టుటకు, విప్లవ నాయకులైన జాన్ హాన్‌కాక్ శామ్యూల్ ఆడమ్స్‌లను నిర్బందించుటకు ఒక సైనిక దళమును అచటకు పంపినాడు. ఈ సైన్యం విప్లవ నాయకులను బంధించుటకు లెక్సింగ్టన్ చేరింది. దేశ భక్తులు (Patriots)గా వ్యవహరింపబడు అతివాదులు ఆత్మరక్షణార్థము Committe of Safety అను ఒక సభను ఏర్పాటు చేసి లెక్సింగ్టన్ పరిసరములలో బ్రిటీషు వారిని ఎదుర్కొన్నారు. ఆ పోరులో ఎనిమిది మంది పేట్రియాట్‌లు కాల్చిచంపబడ్డారు. తక్కినవారు చెల్లాచెదరైనారు. తదుపరి ఆంగ్ల సైన్యం లెక్సింగ్టన్‌కు పదిమైళ్ల దూరాన ఉన్న కంకార్డ్ (Concord) అను గ్రామం వైపు

కదిలింది. బ్రిటీషు ప్రభుత్వం గుర్తించని మెసాచుసెట్స్ శాసనసభ అక్కడ కొలువుదీరి ఉంది. బ్రిటీషు సైన్య కదలికలను గమనిస్తూ ఉన్న వార్తా హరులు వారి రాకను గూర్చి కంకార్డ్ వద్ద ఉన్న స్థానిక సైన్యాన్ని ముందుగానే హెచ్చరించారు. పేట్రియాట్ సైన్యం ఆంగ్లేయులను ఎదుర్కొనడానికి సన్నద్ధమైంది. ఆంగ్ల సైన్యం వారిని ఓడించి అచటి మందుగుండు సామాగ్రిని ధ్వంసం చేసి బోస్టన్‌కు తిరుగు ప్రయాణమైంది. చెట్లచాటున, గుట్టల చాటున నక్కి ఉన్న పేట్రియాట్ సైనికులు గెరిల్లా యుద్ధ పద్ధతులను అనుసరిస్తూ సుమారు 200 మంది బ్రిటీషు సైనికులను హతమార్చినారు. శేష సైన్యం బోస్టన్ చేరుటకు యత్నించగా న్యూ ఇంగ్లాండ్ సైన్యం వారిని అడ్డగించింది. బ్రిటీషు వారి పరాజయ వార్తలు మిగతా రాష్ట్రాలకు చేరగా ఆయా రాష్ట్రాల ప్రజలు గూడా ఆంగ్లేయులపై తిరగబడ్డారు. ఆంగ్ల ఉద్యోగులు, గవర్నర్లు బహిష్కరణకు గురి అయ్యారు. అట్లు అమెరికా స్వాతంత్ర్య సమరజ్యోతి వెలిగించబడింది.

**3.3.2.2. ద్వితీయ కాంటినెంటల్ కాంగ్రెస్ (1775-76) :** బ్రిటీషు వారికి ఏ విషయంలోనూ అమెరికనులు తీసిపోరని పై సంఘటనల వలన అమెరికను నాయకులు గ్రహించారు. సువ్యవస్థితము, సుశిక్షితము అయిన సైన్యము ఉంటే తాము ఈ యుద్ధాన్ని విజయవంతంగా కొనసాగించగలము అనే ఆత్మ విశ్వాసం వారిలో కలిగింది. ఈ అంశమే 1775లో మే నెల 10వ తేదీన ఫిలడెల్ఫియాలో సమావేశమైన ద్వితీయ కాంటినెంటల్ కాంగ్రెస్ ముందు చర్చకు వచ్చింది. ఈ కాంగ్రెస్, ప్రథమ కాంగ్రెస్ కంటే విప్లవ ప్రేరితమైనది. దీనిలో రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. బెంజిమిన్ ఫ్రాంక్లిన్, థామస్ జెఫర్సన్, జేమ్స్ విల్సన్, జాన్ హాన్‌కాక్ వంటి ప్రముఖులు దీనికి హాజరగుట అందులో ఒకటి. వలస రాష్ట్రాలన్నీ ఇందులో పాల్గొనుట రెండవది. భావితరాల వారిచే "జాతి పిత"గా అభిమానింపబడిన వర్జీనియా రాష్ట్ర నివాసి జార్జి వాషింగ్టన్‌ను అమెరికా వలసలకు ప్రధాన సేనానిగా ఈ కాంగ్రెస్ నియమించింది. సైనిక నిర్వహణలో ఇతడు కడు సమర్థుడు. సప్త సంవత్సర యుద్ధ కాలంలో (1756-63) ఇతని పట్టుదల, కార్యదీక్ష, సామర్థ్యం ఋజువయ్యాయి. నాటి అననుకూల పరిస్థితులలో గూడా అతడు 25,000 మందిని సైన్యంలో చేర్చుకుని సుశిక్షితులుగా చేసి మెసాచుసెట్స్ సాయం పంపినాడు. ఒక వైపు వాషింగ్టన్ బ్రిటీషు వారికి ఎదుర్కొనడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నాలు చేస్తుండగా మరోవైపు కాంగ్రెస్‌లోని అతివాదులైన బెంజిమిన్ ఫ్రాంక్లిన్, థామస్ జెఫర్సన్‌ల నాయకత్వంలో స్వాతంత్ర్య ప్రకటనకై పట్టుబట్టి ఒక ప్రణాళికాను రూపొందించినారు. దానిని కాంగ్రెస్ 4, జూలై 1776 తేదీన ఆమోదించింది. ఇందులో అమెరికా వలసలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గల ప్రదేశాలుగా ప్రకటింపబడినాయి.

**3.3.2.3. బంకర్ హిల్ యుద్ధం (17, జూన్, 1775) :** శక్తి సంపన్నమైన గ్రేట్ బ్రిటన్‌తో పోరాడే తాహతు, సాధన సంపత్తి వలసలకు ఉన్నాయా ? సుశిక్షితమైన ఆంగ్ల సైన్యంతో పోరాడగల శిక్షణ పొందిన పెద్ద సైన్యాన్ని వలసలు సమీకరించగలవా ? "సముద్రాల రాణి"గా వాసికెక్కిన ఇంగ్లాండుతో జరిగే నౌకా యుద్ధాలలో వలస రాష్ట్రాల నౌకా దళం తలపడగలదా ? ఇవన్నీ అమెరికన్ రాజనీతిజ్ఞులను వేధిస్తున్న శేష ప్రశ్నలు. కానీ అదృష్టం అమెరికనులనే వరించింది. అచంచలమైన స్వాతంత్ర్య పిపాస వారిలో పోరాట స్ఫూర్తిని నింపి భారీ స్థాయిలో జరిగిన యుద్ధాలలో గూడా విజయ సాధనకు తోడ్పడింది. వలస రాష్ట్రాలు సైనిక సమీకరణ మొదలు పెట్టాయి. బ్రిటీషు వారిని ఎదుర్కొనుటకు పౌర సైన్యాలు తయారైనాయి. ఇరు పక్షాల మధ్య బ్రీడ్స్ హిల్ (Breeds hill) లేక బంకర్ హిల్ (Bunker Hill) అను చోట భారీ యుద్ధం జరిగింది. జనరల్ హౌ (Howe) నాయకత్వంలో చేరిన అదనపు బలగాలతో ఉత్సాహం పుంజుకున్న బ్రిటీష్ సైన్యం 17, జూలై, 1775న బంకర్ హిల్ వద్ద ఉన్న పేట్రియాట్ సైన్యంతో తలపడింది. అది వేసవి సాయంకాల సమయం. బ్రిటీష్ వారిచే కర్షకులుగా వ్యవహరింపబడిన పేట్రియాట్ సైన్యం వీరోచితంగా పోరాడింది. ఈ యుద్ధంలో బ్రిటీష్ వారికి భారీ ప్రాణనష్టం సంభించింది. వారి పక్షాన 1000 మంది ప్రాణాలు కోల్పోగా వలసల వైపున 500 మంది మాత్రమే మరణించారు. బంకర్ హిల్‌ని ఆంగ్ల సైన్యం ఆక్రమించినప్పటికిని అమెరికా స్వాతంత్ర్య సమరంలో ఈ యుద్ధం చిరస్మరణీయమైన సంఘటనగా నిలిచిపోయింది. బంకర్ హిల్ వద్ద వినిపించిన మొదటి తుపాకి మ్రోత ప్రపంచమంతటా మార్మోగింది.

### 3.3.2.4. 1775-1776 సంవత్సరాల మధ్య జరిగిన పరిణామాలు :

**3.3.2.4.1. ఆలివ్ బ్రాంచ్ పిటీషన్ (5, జూలై, 1775) :** ఇంగ్లాండు ప్రభుత్వంతో రాజీపడుటకు అమెరికా వలస ప్రజలు చేసిన తుది ప్రయత్నం ఇంగ్లాండు రాజు మూడవ జార్జికి పిటీషన్ సమర్పించడం. దీనినే ఆలివ్ బ్రాంచ్ పిటీషన్ అంటారు. అందులో వారు తమ సమస్యలను సానుభూతితో పరిశీలించి వాటిని సామరస్య పూర్వకంగా పరిష్కరించమని జార్జి ప్రభువుకు విజ్ఞప్తి చేశారు. కాని చట్ట

బద్ధత లని సభ నుండి వచ్చిన ఆ అభ్యర్థనను తిరస్కరించమని అతడు ప్రధాని లార్డ్ నార్త్‌ను కోరినాడు. అంతట కాలనీ ప్రజలు ప్రత్యక్ష చర్యకు పూనుకోక తప్పింది కాదు.

**3.3.2.4.2. వలసలు కెనడాను జయించు ప్రయత్నం : (28, ఆగస్టు - 31, డిసెంబరు, 1775)** నిరాశ నిస్పృహలకు గురియైన వలస ప్రజలు బ్రిటీషు వారి దృష్టిని మరల్చుటకు కెనడాను ఆక్రమించ ప్రయత్నించినారు. కానీ ఆ ప్రయత్నం ఘోరంగా విఫలమయింది. వారి సేనాలులలో ముఖ్యుడైన మాంట్ గోమర్ క్విబెక్ వద్ద జరిగిన యుద్ధంలో మరణించగా సైన్యం వెనుదిరిగింది. ఆ విధంగా వారు కెనడాను జయించు ప్రయత్నంలో విఫలురైనారు.

**3.3.2.4.3. బోస్టన్ నుండి ఆంగ్ల సైన్య ఉప సంహరణ (1776) :** ఆ సమయంలో న్యూ ఇంగ్లాండులో ఉన్న ఆంగ్లసైన్యం స్వల్పం. నాటి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వారి మొత్తం సైన్యం గూడా నలభై వేలు మాత్రమే. ఆ స్వల్ప సైన్యంతో వలసల తిరుగుబాటులను అణచటం కష్టకార్యమే. అందువలన బ్రిటీషు ప్రభుత్వం జర్మనీ నుండి కిరాయి సైనికులను రప్పించి అమెరికాకు పంపింది. ఇంగ్లాండు తీసుకున్న ఈ చర్య వలస ప్రజలను కోపోద్రిక్తులుగా చేసి వారిలో మాతృదేశము ఎడల వైముఖ్యాన్ని మరింత పెంచింది. 1776లో జార్జి వాషింగ్టన్ జనరల్ హౌ (How) ను ఓడించి బోస్టన్‌ను ఆక్రమించినాడు. హౌ తన శేష సైన్యంతో బోస్టన్ నుండి వైదొలగినాడు.

**3.3.2.4.4. వలసలకు ఉన్న అనుకూల పరిస్థితులు :** వలసలకు ఉన్న విశాల భూ పరిమాణం వారికి సైన్యం కంటె ఎక్కువ ప్రయోజనకారిగా పరిణమించింది. ఇంగ్లాండు వలసల మధ్య ఉన్న పెద్ద దూరం వలన ఆ దేశం తన సైన్యానికి సకాలంలో సహాయం అందించలేకపోయింది. ఇది వలసలకు సిద్ధించిన మరొక ప్రయోజనం. విశాల దేశాన్ని జయించినప్పటికిన పలు ప్రదేశాలలో కోటలు నిర్మించి వాటిలో తగినంత సైన్యాన్ని నిల్వ ఉంచడం ఇంగ్లాండుకు తలకు మించిన భాగం. అదియునుగాక పోరాట కాలం పెరిగిన కొద్దీ వలసలకు విజయావకాశాలు హెచ్చు. శిక్షణ పొందిన సైన్యం అక్కడ వృద్ధి చెందుతుంది. ఫ్రెంచివారు అందించిన స్నేహ హస్తం వారి బలాన్ని ఇనుమడింప జేసింది.

**3.3.2.5.** **నిషేధ ఉత్తర్వుల చట్టం** (Prohibitory Act, 1776) : ద్వితీయ కాంటినెంటల్ కాంగ్రెస్‌లో తీసుకున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు సంబంధించిన నిర్ణయాలు బ్రిటీషు ప్రభుత్వాన్ని కలవరపరిచాయి. అందువలన పార్లమెంటు 1776లో నిషేధ ఉత్తర్వుల చట్టం చేసింది. దీని ప్రకారం అమెరికా తీరం నౌకా దిగ్బంధంలో ఉన్నట్లు ప్రకటింపబడింది. తిరుగుబాటు చేసిన వలసలతో రాకపోకలు నిషేధింపబడినాయి. అమెరికాకు ఆహార సరఫరాలను, యుద్ధ సామాగ్రిని అందకుండా చేసి వారు లొంగిపోవునట్లు వత్తిడి చేయుటయే దీని ప్రధానోద్దేశము. తిరుగుబాటులను అణచుటకు వేల కొలది జర్మనీ కిరాయి సైనికులను ఇంగ్లాండు వలసలలో దింపింది. అయినను ఆ క్లిష్ట పరిస్థితులలో అమెరికా సైనికులు అసమాన ధైర్య శౌర్యాలను ప్రదర్శించినారు. ఈ సమయంలోనే వర్జీనియా రాష్ట్ర అతివాద నాయకుడు రిచర్డ్ హెన్రీ లీ (Richard Henry Lee) కాంగ్రెస్ ముందు ఒక తీర్మానమును ఉంచినాడు. అది ఈ విధంగా ఉంది. "ఉండువలసిన విధంగానే ఈ పదమూడు సంయుక్త రాష్ట్రాల స్వేచ్ఛగా స్వతంత్రంగా ఉన్నాయి. బ్రిటీషు రాజ్యాధిపత్యం నుండి అవి విముక్తమయినాయి. గ్రేట్ బ్రిటన్‌కు, అమెరికా వలసలకు మధ్య అంత వరకు ఉన్న రాజకీయ సంబందాలన్నీ రద్దయినాయి" మాతృదేశంలో సంబంధాలన్నింటిని రద్దు చేయుటను చాలా మంది ప్రతినిధులు వ్యతిరేకించారు. కాని అతివాదులదే పై చేయి అయింది. టామ్ పెయిన్ (Tom Paine) ప్రచురించిన కరపత్రం "Common Sense" వలస వాసులలో బహుళ ప్రచారం పొంది స్వాతంత్ర్య పిపాసను, తీవ్రవాద భావాలను అంతటా వెదజల్లింది. "విడివడే సమయం ఆసన్నమయింది" అనే ఆ పత్రికా నినాదం వలస రాష్ట్రాల మారుమూలలా మార్మోగింది.

**3.3.2.6. స్వాతంత్ర్య ప్రకటన (4, జూలై, 1776) :** కాంగ్రెస్ సూచనల మేరకు వర్జీనియా రాష్ట్ర ప్రతినిధి థామస్ జెఫర్‌సన్ స్వాతంత్ర్య ప్రకటన చిత్తు ప్రతిని తయారుచేశాడు. అక్కడక్కడా కొద్ది మార్పులతో సభ దానిని ఏకగ్రీవంగా ఆమోదించింది. స్వాతంత్ర్య ప్రకటన ఆమోదింపబడిన 4, జూలై, 1776 తేదీ అమెరికా చరిత్రలో చిరస్మరణీయమైన దినం. "సంయుక్త కాలనీలు" స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగిన రాష్ట్రాలు" అని ఆ ప్రకటన వెలువరించింది. స్వాతంత్ర్య ప్రకటనలో ఒక భాగం ఇట్లున్నది. "జన్మతః మానవులందరూ సమానులే. సృష్టికర్త వారికి కొన్ని ఆమోఘమైన హక్కులను కల్పించాడు. జీవించుటకు, స్వేచ్ఛను అనుభవించుటకు, సౌఖ్య ప్రదమైన జీవితం గడుపుటకు గల హక్కులు నాటిలో కొన్ని....... ఎప్పుడైనా ప్రభుత్వం ఈ హక్కులకు విఘాతం కలిగిస్తే ఆ ప్రభుత్వాన్ని తొలగించి తమ హక్కులను, ఆశయాలను కాపాడు క్రొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ ప్రకటన గ్రేట్ బ్రిటన్‌కు 13 వలసలకు గల రాజకీయ సంబంధాలను

పూర్తిగా విచ్ఛిన్నం చేసింది. దీనితో సంపూర్ణ స్వాతంత్ర్యం మినహా ఏదీ వలసలకు సంతృప్తినీయదని విదితమయింది. బ్రిటీషు వారితో రాజీపడే ప్రసక్తి లేదని తేలిపోయింది.

ప్రాముఖ్యం : ఈ ప్రకటనతో అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర ఆరంభమయింది. వార్నర్ & మార్టిన్ (Warner & Martin) మాటలలో "స్వాతంత్ర్య ప్రకటనతో స్వతంత్ర అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర మొదలవుతుంది. "రామ్సేమ్యూర్ (Ramsay Mills) అను చరిత్రకారుడు నుడివినట్లు "ఈ ఉద్యమం వలన నూతన స్వతంత్ర దేశం ఆవిర్భవించింది. అప్పటి నుండి అచటి ప్రజలు వలస ప్రజలు అనుటకు మారుగా అమెరికనులు అని వ్యవహరింపబడినారు".

**3.3.2.7. బ్రాండ్ విన్ నుండి సారటోగా వరకు (1773) :** వలస వాసులకు నిర్జించుటకు బ్రిటీషువారు విస్తృత సన్నాహాలు చేశారు. హౌ (Howe) సేనాని ఫిలిడెల్ఫియాతో జరుపుతున్న పోరాటం కొనసాగించవలసినదిగా ఆదేశించారు. సర్ జాన్ బర్గోయిన్ (Sir John Burgoyne) కెనడా నుండి హడ్సన్ నదీ లోయ గుండా వచ్చే ఏర్పాటు చేయబడింది. జనరల్ క్లింటన్ (Clinton) న్యూయార్క్ నుండి వచ్చి బర్గోయిన్‌ను కలుసుకోవాలి. ఉత్తర, దక్షిణ రాష్ట్రాలను వేరు చేయుటకు ఈ ఏర్పాట్లు చేయబడినాయి.

జనరల్ హౌ బ్రాండివిన్ (Brandywine) వద్ద వాషింగ్టన్‌ను ఓడించి ఫిలడెల్ఫియాను ఆక్రమించినాడు. బర్గోయిన్‌ది వేరే కథ. కెనడా నుండి సుదీర్ఘ ప్రయాణం చేస్తూ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ విప్లవ సేనాని జనరల్ గేట్స్ (Gates) తో తలపడినాడు. శత్రు శ్రేణులను ఛేదించుటకు అతడు శత విధాలా ప్రయత్నించి విఫలుడైనాడు. తుదకాతడు సారటోగా వద్ద ఘోర పరాజాన్ని చవి చూసినాడు. అతడు లొంగిపోయినట్లు ప్రకటించుటయేగాక సారటోగా ఒప్పందం (Saratoga Convention) పై సంతకమిడినాడు. బ్రిటీషు సైనికులు అస్త్రసన్యాసం చేసి క్షేమంగా బయటపడ్డారు. తదుపరి వారు యుద్ధ ఖైదీలుగా మెసాచుసెట్స్ పంపబడినారు.

**3.3.2.8. అమెరికనులకు ఫ్రెంచి తదితర యూరోపియనుల సాయం (1778) :** వలస రాష్ట్రాల స్వాతంత్ర్య ప్రకటనతో (1776) అమెరికా స్వాతంత్ర్య సమరం లాంఛనప్రాయంగా మొదలై 1783 ఏప్రిల్ వరకు కొనసాగింది. కాంటినెంటల్ కాంగ్రెస్ ఐరోపా రాజ్యాల సాయం పొందుటకు బెంజమిన్ ఫ్రాంక్లిన్ నాయకత్వంలో ఒక ప్రతినిధి వర్గాన్ని ఐరోపాకు పంపింది. గ్రేట్ బ్రిటన్ ఎడల అసూయా ద్వేషాలు, వైర భావము గల ఫ్రాన్స్, స్పెయిన్, హాలెండ్ దేశాలు వలసల పక్షాన యుద్ధంలో ప్రవేశించడం అమెరికా అదృష్టం. సైనికులను, యుద్ధ సామాగ్రినే కాక ధన సాయం కూడా చేసి ఈ దేశాలు వలసలను ఆదుకున్నాయి. సారటోగా యుద్ధం (17, అక్టోబర్, 1777) లో అమెరికా సేనాని హోరేషియో గేట్స్ (Horotio Gates) సాధించిన విజయంతో యుద్ధ రంగంలో పెను మార్పు సంభవించింది. అమెరికనులు యుద్ధ గమనాన్ని తమకు అనుకూలంగా మార్చుకొనగలరని ఐరోపా దేశాల వారు విశ్వసించారు. ఇంగ్లాండుతో వైరము, కెనడాపై ఆశగల ఫ్రాన్స్ అమెరికా వలస రాష్ట్రాలతో ఒప్పందం కుదుర్చుకొని వలసల స్వాతంత్ర్యాన్ని గుర్తించింది. సైనికులను, సైనికాధికారులను సాయంగా పంపింది. సుప్రసిద్ధ ఫ్రెంచి సేనాని లాఫాయట్ (La Fayatte) బ్రిటీషు వారిని సమర్థవంతంగా నిలువరించి అమెరికా స్వాతంత్ర్య సమర చరిత్రలో శాశ్వత కీర్తినార్జించినాడు. ఫ్రెంచి చక్రవర్తి 16వ, లూయీ వలసలకు ఉదారంగా ధనసాయము అందించినాడు. తద్వారా కెనడాపై ఆధిపత్యం సాధించవచ్చని అతని ఆశ. ఫ్రెంచి దౌత్యము ఫలించి స్పెయిన్, హాలెండులు గూడా వలసల పక్షాన యుద్ధంలో పాల్గొన్నాయి. అవి యుద్ధంలో చురుకైన పాత్ర నిర్వహించడంతో బ్రిటీషువారు నిరుత్సాహపడ్డారు.

**3.3.2.9. ఫిలడెల్ఫియా నుండి ఆంగ్లేయులు వైదొలగుట (1778) :** 1777లో వాషింగ్టన్ పరిస్థితి దయనీయంగా మారింది. సైన్యానికి కడుపు నిండా అన్నం లేదు, దుస్తులు సరిగాలేవు, పాదరక్షలు లేవు, ప్రతిరోజు చాలా మంది తప్పించుకు పోతూ ఉండేవారు. ఆ విధంగా అతని సైనిక బలం క్షీణించనారంభించింది. అటువంటి సమయంలో ఫ్రెంచివారి రాక అతనికి పెద్ద ఉపశమనం కలిగించి యుద్ధగతినే మార్చింది. ఆంగ్లేయులు 1778లో ఫిలడెల్ఫియాను వదలి వెళ్ళవలసి వచ్చింది. తదుపరి వారు న్యూయార్కును తమ ప్రధాన స్థావరంగా చేసుకున్నారు. మధ్య రాష్ట్రాలన్నీ అమెరికను సైన్య వశమయ్యాయి.

**3.3.2.10. యార్క్ టౌన్ యుద్ధం (1781) :** 1781లో జరిగిన యార్క్ టౌన్ యుద్ధంలో ఆంగ్లేయుల పరాజయంతో అమెరికా స్వాతంత్ర్య సమరం దాదాపు ముగిసినట్లే. దక్షిణ రాష్ట్రాలు ఆంగ్లేయులకు అనుకూలంగా ఉన్నాయి. అందువలన వారచట యుద్ధం

కొనసాగించాలనుకున్నారు. తొలి దశలో వారు వలసలపై విజయం సాధించినట్లే కన్పిస్తుంది. జనరల్ క్లింటన్ చార్లెస్‌టన్‌ను ఆక్రమించి న్యూయార్క్‌కు వెళ్తూ కార్న్‌వాలీస్‌ను యార్క్ టౌను వద్దనున్న సైన్యానికి అధిపతిగా నియిమించినాడు. అతనితో పోరుసల్పుటకు కాంగ్రెస్ సారటోగా యుద్ధ విజేత జనరల్ గేట్స్‌ను (Gen. Gates) నియమించింది. కామ్‌డెన్ (Camden) వద్ద గేట్స్ పరాజితుడైనాడు. దక్షిణ రాష్ట్రాలు బ్రిటీషు వారి వశమయ్యేటట్లు కన్పించింది. ఇట్లు 1780లో పరిస్థితులు ఆంగ్లేయులకు అనుకూలంగా మారుతున్నట్లు కన్పించాయి.

అదే సమయంలో కార్న్‌వాలీస్ అమెరికా సేనాని గ్రీన్‌ను (Gen. Green) గిల్ ఫోర్డ్ (Guilford) వద్ద ఓడించాడు. అయినను కార్న్‌వాలీస్ తన స్వల్ప సైన్యంతో తాను జయించిన విశాల భూభాగాన్ని సమర్థవంతంగా అదుపులో ఉంచలేకపోయాడు. తత్ఫలితంగా అతడు తీరము వెంట న్యూయార్క్ వైపు కదలక తప్పలేదు. ఆ ప్రయాణంలో పొగమంచులో చిక్కుకున్న అతని 5000 సైన్యం అనేక ఇబ్బందులకు లోనై తుదకు యార్క్‌టౌన్ చేరి అచట రక్షణ ఏర్పాట్లు చేసుకుని తనకు సాయంగా రాబోవు ఆంగ్ల నౌకా దళం కొరకు వేచి ఉన్నాడు. కానీ ఆ నౌకాదళాన్ని ఫ్రెంచి నౌకాదళం అడ్డగించి తీరం సమీపాన ఉన్న ఆంగ్ల సైన్యాన్ని దిగ్బంధం చేసింది. ఈలోపున వాషింగ్టన్ 15,000 సైన్యంతో అక్కడకు చేరుకుని భూమి వైపునుండి ఆంగ్ల సైన్యాన్ని ముట్టడించినాడు. దాసోహమనుట తప్ప కార్న్ వాలీసీమ్‌కు మరో మార్గం కన్పించలేదు. చివరి సారగి అతడు అమెరికను శ్రేణులను ఛేదించి బయటపడుటకు విఫల ప్రయత్నం చేసినాడు. మార్గాంతరం లేని కార్న్ వాలీస్ తుదకు 19, అక్టోబర్ 1781 తేదీన ఎనిమిది వేల బ్రిటీష్ సైన్యంతో అమెరికనులకు లొంగి పోయాడు. ఈ వార్త ఇంగ్లాండు ప్రధాని లార్డ్‌నార్త్‌కు అశనిపాతమయింది. "దేవుడా! అంతా అయిపోయింది. అంటూ తన పదవికి రాజీనామా ఇచ్చాడు. కార్న్ వాలీస్ లొంగుబాటుతో అమెరికా స్వతంత్ర్య సమరం ముగిసినట్లే. 1783 వరకు ఇంగ్లాండుకు స్పెయిన్, హాలెండు దేశాలతో ఐరోపా, పశ్చిమ ఇండియా దీవులలో నౌకా యుద్ధాలు జరిగాయి. తుదకు 3, సెప్టెంబర్, 1783 తేదీన ఇంగ్లాండు, అమెరికా, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల మధ్య కుదిరిన వర్సే (Versailles) సంధిలో యుద్ధము ముగిసినట్లు అధికారంగా ప్రకటింపబడింది.

## 3.4. అమెరికనుల విజయానికి లేక బ్రిటీషు వారి పరాజయానికి కారణాలు :

ఉత్తర అమెరికాలోని తమ 13 వలసలపై పట్టు బిగించడానికి ఇంగ్లాండు ప్రయత్నించగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సాధనకై వలస ప్రజలు పోరాడినారు. అందుకులో బ్రిటీషువారు పరాజితులైనారు. అందుకు కారణాలేవన :

**3.4.1. మూడవ జార్జి ప్రభువు బాధ్యత :** మూడవ జార్జి వ్యక్తిగత పాలన, దూరదృష్టి లేని అతని విధానాలు, యుద్ధానికి, అందులో ఇంగ్లాండు పరాజయానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. తన వ్యక్తిగత ప్రాబల్యాన్ని పెంచుకొనడానికి అతడు పడిన తాపత్రయం యుద్ధ నిర్వహణలో ప్రదర్శించలేదు. ప్రజలు ఆశించినట్లుగా విలియం పిట్‌ని (Pitt the Elder) ప్రధానిగా నియమించలేదు. ఈ యుద్ధంలో ఫ్రెంచివారు అమెరికనుల తరపున చేరే అవకాశం ఉందని పిట్ హెచ్చరించినా జార్జి ప్రభువు స్పందించలేదు. రాజకీయ దౌత్యం నెరపి ఫ్రెంచివారి జోక్యాన్ని నివారించేందుకు అతడు తగు చర్యలు తీసుకొనలేదు. స్వంత నిర్ణయాలే తప్ప విజ్ఞుల సలహాలను కోరలేదు. రాజనీతిజ్ఞులు, మేధావులు నిర్లక్ష్యం చేయబడుట వలన సమయానుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం లోపించింది.

**3.4.2. బ్రిటీష్ సైనికాధికారుల అసమర్థత :** యుద్ధ సమయంలో బ్రిటీష్ సైనికాధికారుల అసమర్థత, అవివేకం బహిర్గతమయినాయి. బ్రూక్‌లిన్ (Brooklyn) యుద్ధంలో విజయం సాధించిన జనరల్ హౌ ముందుకు సాగి జనరల్ బర్గోయిన్ (Burgoyne) సైన్యంతో కలిసి నట్లయిన సారటోగా (Saratoga) వద్ద ఎదురైన ఘోర పరాజయం నివారింపబడి ఉండేది. అతని విధానాలు, వ్యూహాలు, నిర్ణయాలు లోప భూయిష్టంగా ఉండేవి. అవి ఆంగ్లేయుల ఓటమికి దారి తీశాయి. అమెరికా సేనాని జార్జి వాషింగ్టన్‌తో సాటియైనవారు ఒక్కరూ లేరు. నాటి ఇంగ్లాండును విజయపథం వైపు నడిపించుటకు రాబర్ట్ క్లైవ్, హేస్టింగ్స్ ప్రభువు, ఉల్ఫ్, పిట్ వంటివారు ఒక్కరూ లేరు. ఆంగ్ల సైనికాధికారులలో సమర్థులు లేరు. వారి పొరపాట్లు అపార నష్టం కలిగించాయి. వారి మధ్యనెలకొన్న పరస్పర అసూయా ద్వేషాలు యుద్ధ నిర్వహణపై ప్రతిబింబించి దుష్ప్రభావాన్ని కలిగించాయి. "యుద్ధ ప్రణాళికలు లోప భూయిష్టంగా ఉండుట వలన సువర్ణావకాశాలు చేజారిపోయేవి. అపార సాధన సంపత్తి, మంది మార్బలం, రాజ్యాధిపత్యం ఉండి కూడా అవి సరిసమానంగా లేని వలసలతో పోరాడి

ఓడిపోయిందంటే అందుకు ప్రధాన కారణం ఆంగ్ల సైనికాధికారుల అసమర్థత, నిర్వర్యత, వ్యూహ రచనా లోపాలు. సర్ విన్స్టన్ చర్చిల్ అమెరికా స్వాతంత్ర్యసమరంలో ఆంగ్లేయుల పరాజయాన్ని గూర్చి ఇట్లు వ్రాశాడు. "బ్రిటీషు వారి యుద్ధతంత్రంలో ఇన్ని పొరపాట్లు జరిగిన సందర్భాలు చాలా అరుదు. యుద్ధ నియమ నిబంధనలన్నీ ఉల్లంఘించడమో లేక నిర్లక్ష్యం చేయడమో జరిగింది."

**3.4.3. యుద్ధ తంత్ర లోపాలు :** ఆంగ్ల నౌకాదళ అసమర్థత వలన కొంత కాలంపాటు ఇంగ్లాండు సముద్రాధిపత్యం కోల్పోయింది. శాండ్‌విచ్ (Sand wich) నౌకా వ్యవహారాల మంత్రిగా ఉన్నపుడు అట్టి అసమర్థత మరీ ప్రస్ఫుటంగా కన్పించింది. ఆంగ్లేయుల నౌకా యుద్ధ తంత్ర లోపాల వలన అమెరికనుల సహాయం బయలుదేరిన ఫ్రెంచి నౌకాదళాన్ని కట్టడిచేసే అవకాశం చేజారిపోయింది. తత్ఫలితంగా ఫ్రెంచివారు అమెరికనులకు అవసరమగు యుద్ధ సామాగ్రిని, సైనికులను సకాలంలో పంపగలిగినారు. అది జార్జి వాషింగ్టన్ విజయానికి బ్రిటీషు వారి పరాజయానికి దోహదం చేసింది.

**3.4.4. మితి మీరిన బ్రిటీషు ప్రభుత్వ జోక్యం :** ఇంగ్లాండు యుద్ధ వ్యవహారాల కార్యాలయం అమెరికా యుద్ధాన్ని నిర్వహించింది. ఆ రోజుల్లో అట్లాంటిక్ మహా సముద్రానికి ఒక వైపున ఉన్న ఇంగ్లాండు నుండి సమాచార లేఖలు రెండవ వైపున ఉన్న అమెరికాకు చేరడానికి రెండు నెలల కాలం పట్టేది. అంత దూరం నుండి యుద్ధం నడిపించడమంటే చేజేతులా పరాజయాన్ని వరించడమే. మూడవ జార్జి యుద్ధ వ్యవహారాల కార్యదర్శి లార్డ్ జర్మన్ (Lord German) తరచుగా యుద్ధ నిర్వహణలో జోక్యం కలుగజేసుకుంటూ అమెరికాలో ఆంగ్ల సైన్యం అనుసరించవలసిన వ్యూహాలను నిర్దేశించేవాడు. సాధారణంగా యుద్ధరంగంలో ఉన్నవారు సమయోచితంగా వ్యూహ రచన చేస్తూ ఉంటారు. అట్టి అవకాశం ఆంగ్ల సైన్యాధికారులకు కరవయ్యింది. దానికి ఫలితంగా బ్రిటీషువారు భారీ మూల్యాన్నే చెల్లించవలసి వచ్చింది.

**3.4.5. ఆంగ్లేయులు శత్రువుల బలాన్ని తక్కువగా అంచనా వేయుట :** ఆంగ్లేయులు తమ బలాన్ని, శత్రువుల (అమెరికనుల) బలాన్ని తప్పుగా అంచనా వేశారు. తమకు, అమెరికాకు మధ్య ఉన్న దూరాన్ని గాని, అమెరికా వైశాల్యాన్ని గాని, ఆ దేశాన్ని గురించి తమకు సంపూర్ణంగా తెలియకపోవుటను గురించిగాని అర్థం చేసుకోవడంలో బ్రిటీషు వారు తగు జాగ్రత్త వహించలేదు. అందువలన వారు అమెరికనుల బలాన్ని తక్కువగా అంచనావేసి వారిని నిర్జించుటకు తగు చర్యలు తీసుకొనలేదు. అమెరికాతో పోరాడుటకు తగినంత సైన్యాన్ని సమకూర్చగలిగే సమయము ఉన్నప్పటికి ఇంగ్లాండు అందుకు పూనుకోలేదు. కానీ జార్జి వాషింగ్టన్ సమర్థవంతమైన నాయకత్వంలో సామాన్య అమెరికనులు గూడా సుశిక్షిత సైనికుల వలె ఆంగ్లేయులతో పోరాడి లెక్సింగ్టన్, బంకర్ హిల్ మున్నగు చోట్ల సాధించిన విజయాలు బ్రిటీషు వారిని నివ్వెరపర్చాయి.

**3.4.6. హేతుబద్ధము కాని బ్రిటీషు వారి విధానాలు :** అమెరికను వలస ప్రజలు తమ రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యానికై పోరాటం ఆరంభించారు. అటువంటి వారితో ఇంగ్లాండు యుద్ధానికి దిగిందంటే ఫలితాన్ని మనం ముందే ఊహించుకోవచ్చు. ఇంగ్లాండు వాదనలో పసలేదు. అది సహేతుకమైనదికాదు. వలస ప్రజలు స్వాతంత్ర్య సమరంలో హృదయ పూర్వకంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు రాజకీయంగా చైతన్యవంతులై బ్రిటీషు వారి ఆధిపత్యాన్ని త్రోసి పుచ్చి తమ స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని, జాతీయతను కాపాడుకొనటానికి పూనుకొన్నారు. కాని బ్రిటీషు సైనికులలో జాతీయతా భావం, దేశాభిమానం కొరవడ్డాయి. వారిలో అధిక సంఖ్యాకులు జర్మనీ మొదలగు విదేశాల నుండి విచ్చన కిరాయి సైనికులే. వారు తమ జీత భత్యాల కొరకు పని చేసేవారేగాని దేశాభిమానంతో కాదు. అందువలన వారు యుద్ధ విజయానికి పెద్ద ప్రాముఖ్యం ఇచ్చేవారు కాదు. దానికి ప్రతిగా అమెరికనులు అచంచల దేశభక్తితో ఉన్నత ఆదర్శాల సాధనకై పోరాటం సాగించినారు. అందులో అమెరికనులు విజయం సాధిఅత్తరనుకోవడంలో అబ్బురమేమున్నది ?

**3.4.7. బ్రిటీషు వారి అసమర్థ యుద్ధ నిర్వహణ :** యుద్ధ వ్యవహారాలలోను, నిర్వహణలోను ఆంగ్లేయుల పక్షాన సమర్థత లోపించింది. అది వారి పరాజయంలో ప్రతిఫలించింది. సైనిక సరఫరా సక్రమంగాలేదు. సైనిక వ్యవహారాలలో అవినీతి రాజ్యమేలింది. నౌకా బలం ఆశించినంత దృఢంగా లేదు. ఆంగ్ల సైనికుల ప్రవర్తన, కొన్ని సందర్భాలలో జుగుప్సాకరంగా ఉంది. అదియును గాక బ్రిటీషువారు అమెరికా సైనిక పాటవాన్ని తక్కువగా అంచనావేశారు.

**3.4.8. బ్రిటీషువారిలో సహకార లోపం :** అమెరికా వలసల విషయంలో బ్రిటీషు రాజనీతిజ్ఞులు విభిన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వలసలంటే కొంత మందికి సానుభూతి, మరికొంత మందికి చులకన భావం, అనేక మంది రాజనీతిజ్ఞులు, సేనానులు యుద్ధానికి వ్యతిరేకులు. వారి దృష్టిలో అది అన్యాయం. కాని వలస నాయకులు పరస్పర సహకారంతో, ఐకమత్యంతో, ఆత్మ విశ్వాసంతో, విజయమే ధ్యేయంగా కృషి చేశారు, కృతకృత్యులయ్యారు.

**3.4.9. వలస ప్రజల పట్టుదల స్వదేశాభిమానం :** వలస ప్రజలకు రాజకీయ, ఆర్థిక స్వేచ్ఛలు లేవు. తమ ఎడల బ్రిటీషు ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక విధానాల వలన వలసవాసులు తీవ్ర అసంతృప్తికి గురియైనారు. ఆంగ్ల ప్రభుత్వం క్రొత్త పన్నులు విధిస్తూ చట్టాలు చేసి వాటిని కఠినంగా అమలుపర్చుటకు యత్నించుట వారిని ఆగ్రహావేశపరులుగా చేసింది. మాతృదేశమైన ఇంగ్లాండుతో పూర్తిగా తెగతెంపులు చేసుకొనుటకు కృతనిశ్చయులైనారు, ఏ త్యాగానికైనా సిద్ధపడ్డారు. అందువలన సర్వమూ ఒడ్డి పోరాడినారు. వారిది ప్రజాయుద్ధం, ఆ విధంగా జాతీయ భావంతో జాగృతమైన అమెరికనులు ఎవరి ఆధిపత్యాన్ని ఆమోదించే స్థితిలో లేరు. అదియునుగాక వలస ప్రజలలో బ్రిటీషు సైనికుల శక్తియుక్తుల ఎడల చులకన భావం ఉన్నది. తమకు ఉన్న అనుకూల పరిస్థితులలో తప్పక తామే విజయం సాధించగలమనే ఆత్మ విశ్వాసం వారిలో ఉన్నది.

**3.4.10. అమెరికా సుదూర ప్రాంతంలో ఉండుట :** 13 అమెరికా వలసలకు ఇంగ్లాండుకు మధ్య దూరం 3000 మైళ్ళు. అంత దూరంలో ఉన్న అమెరికాకు సమయానికి యుద్ధ సామాగ్రిని, సైనికులను పంపడం చాలా వ్యయ ప్రయాసలతో కూడిన కార్యం. వార్తా సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు, సమయానికి సక్రమంగా సమకూర్చడం ఇంగ్లాండుకు శక్తికి మించిన పని అయింది. అందువలన బ్రిటీషు సైనిక దళాల సంయుక్త కార్యాచరణకు ఆటంకాలు కలుగుతూ ఉండేవి. అదియును గాక బ్రిటీషు వారి సైనిక కదలికలు, వారి వ్యూహాలు ఎప్పటికప్పుడు అమెరికనులకు అందుతుండేవి. పైగా అమెరికా నైసర్గిక స్వరూప, స్వభావాలు, స్థలాల ఉనికిని గురించిన వివరాలు ఆంగ్ల సైనికులకు సరిగా తెలియవు. ఈ విషయంలో స్థానికులే మెరుగైన స్థితిలో ఉన్నారు. వారు సకల సౌకర్యాలతో తమకు చిరపరిచితమైన స్వదేశంలో పోరాడుతున్నారు. అమెరికాలోని నదులు, చిత్తడి నేలలు, పర్వతాలు సరిగా అభివృద్ధి చెందని రహదారులు తదితర అవరోధాలు ఆంగ్ల సైనికుల పురోగమనాన్ని శాసించేవి. వాటిని గురించి పరిపూర్ణంగా తెలిసినవారు బ్రిటీషు సైనికులకు సహకరించేవారు కాదు. అటువంటి అనుకూల పరిస్థితుల్లో బ్రిటీషువారు ఓడినారు.

**3.4.11. విశాలమైన యుద్ధరంగం :** అమెరికా వలసలు విశాల ప్రదేశంలో విస్తరించి ఉన్నాయి. అందువలన అచటి యుద్ధ రంగాలు గూడా దూర దూరంగా విసిరివేయబడినట్లు ఉండేవి. వేయి మైళ్ళ ప్రదేశంలో యుద్ధాలు జరిగాయి. అంతటి విశాల ప్రదేశంలో తగినంత సైనిక బలం లేని ఇంగ్లాండు మూడు వేళ మైళ్ల దూరం నుండి పూర్తిగా తెలియని నేల మీద యుద్ధం నిర్వహించడం అత్యంత కష్ట సాధ్యమైన కార్యం. ఆ ప్రదేశాలు అమెరికనులకు చిరపరిచితాలు కాగా బ్రిటీషు సైన్యానికి అవి అపరిచితాలు. ఆంగ్ల సైన్యం పొరపాటున అడవిలో చిక్కుకుంటే క్షేమంగా బయట పడటం దాదాపు అసాధ్యంగా ఉండేది. కానీ అమెరికనుల పురోగమనానికి అడవులుగాని, కొండలుగాని అవరోధాలు కావు. అందువలన యుద్ధ నిర్వహణ బ్రిటీషు వారి కంటే అమెరికనులకు సులువయింది. కనుక “అమెరికను వలసల విజయంలో సైన్యం కంటే ఆ దేశ పరిమాణమే బ్రిటీషు సైనికులతో ఎక్కువగా పోరాడింది” అనుటలో వింత ఏమున్నది ?

**3.4.12. అమెరికనులకు విదేశీ సాయం :** స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కొరకు, న్యాయ సాధన కొరకు పోరాడుతున్న అమెరికా వలస ప్రజల ఎడల అభిమానంతో కొందరు, ఇంగ్లాండ్ ఎడల ద్వేష భావంతో కొందరు ఐరోపా దేశాల వారు వారికి అండగా నిలబడ్డారు. ఆ దేశాలలో ఫ్రాన్స్ ప్రధానమైనది. స్పెయిన్, హాలెండ్‌లు గూడా ఫ్రాన్స్‌తో చేరాయి. వీరి సాయం అమెరికనులకు ఎంతో మనో ధైర్యాన్ని ఇచ్చింది. సప్త సంవత్సర యుద్ధం (1756 - 63) లో బ్రిటన్‌తో పోరాడి ఓడిపోయిన ఫ్రాన్స్ ఆ దేశంపై ప్రతీకారం తీర్చుకోవడానికి, కెనడాను తిరిగి పొందడానికి, వలసల వ్యాపారంలో ఇంగ్లాండు గుత్తాధిపత్యాన్ని తొలగించడానికి 1778లో వలసల పక్షాన యుద్ధంలో ప్రవేశించి వాటికి సాయంగా సైనికులను, యుద్ధ సామాగ్రిని పంపి ఆదుకుంది. ఆ సాయం వలసలకు గొప్ప వరం లాంటిది. దానితో యుద్ధ స్వరూప స్వభావాలే మారిపోయాయి. ఫ్రెంచి వారి సాయం వల్లనే ఆంగ్ల సేనాని లార్డ్‌కార్న్ వాలీస్ 1781లో యార్క్ టౌన్ వద్ద లొంగిపోవలసి వచ్చింది. ఆ విధంగా ఫ్రెంచి వారి తోడ్పాటుతో అమెరికనులు యుద్ధాన్ని విజయవంతంగా ముగించగలిగినారు. 1779లో స్పెయిన్,

హాలెండ్‌లు బ్రిటన్‌కు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొన్నాయి. రష్యా, ప్రష్యా, డెన్మార్క్, స్వీడన్‌లు ఇంగ్లాండుకు వ్యతిరేకంగా 1780లో తటస్థ రాజ్యాల కూటమిగా ఏర్పడ్డాయి. అమెరికా స్వాతంత్ర్య సమరంలో మూడవ ఘట్టం (1781-83) ఇంగ్లాండుకు పైన పేర్కొనబడిన ఐరపా ఖండ దేశాలకు మధ్య పోరాటం జరిగిన కాలం. అందులో ఇంగ్లాండు అపార నష్టానికి గురి అయింది. ఒంటిరిగా పోరాడవలసి వచ్చింది. ఐరోపాలో ఏ ఒక్క దేశమూ ఇంగ్లాండుకు సాయంగా నిలబడలేదు. ఇట్లు ఐరోపా దేశాలు అమెరికా వలస విజయానికి, ఇంగ్లాండు పరాజయానికి దోహదం చేశాయి.

## 3.5. వర్సే (Versailles) సంధి (1783) :

19, అక్టోబరు, 1781 తేదీన లార్డ్ కార్న్ వాలీస్ యార్క్ టౌన్ వద్ద అమెరికనులకు లొంగిపోయాడు. దీనితో న్యూయార్క్, చార్లెస్టన్ మున్నగు కొన్ని పట్టణాలు బ్రిటీషు వారి ఆధీనంలో ఉన్నప్పటికిని అమెరికా స్వాతంత్ర్య సమరం దాదాపు ముగిసినట్లే. ఎనిమిది వేల ఆంగ్ల సైనికులతో లార్డ్ కార్న్‌వాలీస్ లొంగిపోయాడను వార్త ప్రధాని నార్త్‌కు ఆశనిపాతమయింది. అమెరికనుల స్వాతంత్ర్యాన్ని ఆమోదించమని మూడవ జార్జికి అతడిచ్చిన సలహా చెవిటివాని ముందు శంఖు ఊదినట్లయింది. రాజు అభీష్టానికి వ్యతిరేకంగా యుద్ధమును ఆపి వేయవలసినదిగా పార్లమెంటు 20, మార్చి 1782 తేదీన ఒక తీర్మానం చేసింది. దీనితో లార్డ్‌నార్త్ ప్రభుత్వం కుప్పకూలింది. జార్జి ప్రభువు వ్యక్తిగత నిరంకుశ పాలన అంతమై ఇంగ్లాండులో రాజ్యాంగ బద్ధ పాలన మొదలయింది. గత్యంతరం లేని రాజు ప్రభుత్వమును ఏర్పాటు చేయవలసినదిగా విగ్గులను ఆహ్వానించాడు. అమెరికనుల ఎడల సానుభూతిపరులైన విగ్గులు ఉదారమైన సంధి షరతులతో ఒక ముసాయిదాను 30, నవంబర్, 1782 తేదీన పారిస్‌లో రూపొందించినారు. కానీ ఫ్రెంచి వారి వైఖరి వేరే విధంగా ఉంది. వారికి తమ ప్రయోజనాలను కాపాడుకొనుటకు అనువైన, దుర్బలమైన అమెరికా కావాలి. అది సేద్యానికి ఉపయోగపడే సాధువైన గుజ్జులా ఉండాలే తప్ప జాడిచ్చి తన్నేటంత వీర్యవంతమైనదిగా ఉండకూడదు (Thomas A. Bailees). చర్చలలో అమెరికా ప్రతినిధులు బెంజమిన్ ఫ్లాంక్లిన్, జాన్ ఆడమ్స్, జానజేలు పాల్గొనగా ఇంగ్లాండు తరపున ప్రధాని షెల్‌బర్న్ హాజరైనాడు. తుదకు 3, సెప్టెంబర్, 1783 తేదీన వర్సే (Versailles) సంధి పత్రం పై అందరూ సంతకాలు చేశారు. ఈ సంధితో అమెరికా విప్లవం లేక అమెరికా స్వాతంత్ర్య సమరం ముగిసింది. దీనిలోని ప్రధానాంశము లేవన :

1) గ్రేట్ బ్రిటన్ అమెరికా వలసల స్వాతంత్ర్యాన్ని గుర్తించింది. సైనిక చర్యలన్నీ నిలిపి వేయబడినాయి. సాధ్యమైనంత త్వరలో సైన్యాన్ని, నౌకాదళాన్ని వలసల నుండి ఉపసంహరించడానికి ఇంగ్లాండు సమ్మతించింది.

2) అమెరికా సంయుక్త రాష్ట్రాల సరిహద్దులు నిర్ణయించబడ్డాయి. పెద్ద సరస్సులు ఉత్తరాన, మిసిసిపీ నది పశ్చిమాన, ఫ్లోరిడా దక్షిణాన ($31^0$ అక్షాంశము), అట్లాంటిక్ మహా సముద్రం తూర్పున అమెరికా సరిహద్దులుగా గుర్తింపబడినాయి. నాటి అమెరికా విస్తీర్ణం 8,27,800 చ.మై.; జనాభా 32,50,000.

3) మిసిసిపీ నది మీద ఇరువురికి (ఆంగ్లేయులకు, అమెరికనులకు) నౌకా యాన హక్కు కల్పించబడింది. న్యూఫౌండ్ లాండ్, కెనడా తీర ప్రాంతాలలో అమెరికనులకు చేపలు పట్టే హక్కు లభించింది.

4) 1763 నాటి పారిస్ సంధిలో బ్రిటన్‌కు లభించిన ఫ్లోరిడా, మైనార్కాలు తిరిగి స్పెయిన్ పరము చేయబడినాయి. అందుకు బదులుగా గ్రేట్ బ్రిటన్‌కు జిబ్రాల్టర్ దక్కింది.

5) ఇండియాలో పాండిచ్చేరి చంద్రనగర్‌లను, పశ్చిమ ఇండియా దీవులలోని టొబాగోను, సెయింట్ లూసియాను, పశ్చిమ ఆఫ్రికాలోని సెనిగాల్‌ను ఫ్రాన్స్ పొందింది.

6) కెనడా బ్రిటీషు వారి ఆధీనంలో ఉండునట్లు నిర్ణయింపబడింది.

7) లాయలిస్టుల (బ్రిటీషు ప్రభుత్వానికి, ప్రభువుకు అనుకూలురు) నుండి వశపర్చుకున్న ఆస్తులను తిరిగి వారికి ఇచ్చునట్లు, వారి హక్కులను కాపాడునట్లు రాష్ట్రాలను ఒప్పించుటకు అమెరికా కాంగ్రెస్ వాగ్దానం చేసింది.

8) బ్రిటీషు వ్యాపారులకు ఇవ్వవలసిన సొమ్మును అమెరికనులు సక్రమంగా చెల్లించునట్లు చేయుటకు అమెరికా ప్రభుత్వం అంగీకరించింది.

## 3.6. యుద్ధ ఫలితాలు :

మానవ జాతి చరిత్రలో అమెరికా విప్లవం ఒక ప్రధాన సంఘటన. దీని వలన ప్రపంచ చరిత్ర గమనాన్ని ప్రభావితం చేసిన అనేక ఫలితాలు కలిగాయి. అవి :

### 3.6.1. అమెరికా పరంగా :

**3.6.1.1. నవ్య దేశ ఆవిర్భావం :** వర్సే సంధి (1783)తో "అమెరికా సంయుక్త రాష్ట్రాలు" అను నూతన దేశం ఆవిర్భవించింది. ఇంగ్లాండు తో సహా అన్ని దేశాలు దీనిని గుర్తించాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలు సమాఖ్య తరహా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని ప్రజాసత్తాక రాజ్యంగా ఏర్పడినాయి. ఆంగ్ల భాష, సంప్రదాయాలు వారసత్వంగా పొందుటతో పాటు, ఇంగ్లాండుకు ఇతర ఐరపా దేశాలకు భిన్నంగా తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకొని శక్తివంతమైన దేశంగా రూపుదిద్దుకుంది. దిన దినాభివృద్ధి చెందుతూ జన సంఖ్యలోను, విస్తీర్ణతలోను ఐరోపా రాజ్యాలలో దేనికీ తీసిపోనంతగా ఎదిగి క్రమక్రమంగా అత్యున్నత శిఖరాలను అధిరోహించి నేటి ప్రపంచంలో అగ్రగామిగా నిలిచింది. అమెరికాలోని రాజరికాభిమానులు (Loyalists) కెనడాకు తరలి వెళ్లి అక్కడ స్థిరపడినారు.

**3.6.1.2. ప్రభుత్వ నిర్మాణంలో క్రొత్త ప్రయోగాలు :** స్వాతంత్ర్య సమరంలో విజయం సాధించిన పిమ్మట అమెరికనులు ప్రభుత్వ నిర్మాణంలో క్రొత్త ప్రయోగాలు చేశారు. వారు చేసిన రాజకీయ ప్రయోగాలు అనంతర కాలంలో అనేక దేశాల రాజకీయ పరిణామాలను ప్రభావితం చేశాయి. వంశపారంపర్య రాజరిక వ్యవస్థ రద్దు, కులీన వర్గ వ్యవస్థ రద్దు, లిఖిత రాజ్యాంగ ఏర్పాటు, మానవ హక్కుల ప్రకటన, అధికార పృథక్కరణ విధానమును అనుసరించుట, నిరోధ సమతౌల్య పద్ధతిని పాటించుట అనునవి వారి ప్రయోగాలలో కొన్ని, మానవ చరిత్రలో ప్రప్రథమంగా అమెరికనులు నూతన విధానానికి నాంది పలుకుతూ సమాఖ్య (Federal) విధానాన్ని ప్రవేశపెట్టినారు. 13 రాష్ట్రాలతో కూడిన సరళమైన సమాఖ్య ప్రభుత్వం నెలకొల్పబడింది. 1787లో ఫిలడెల్ఫియాలో సమావేశమైన రాజ్యాంగ పరిషత్తు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు సమాఖ్య రాజ్యాంగాన్ని రూపొందించగా అది 1789లో అమలులోకి వచ్చింది.

**3.6.1.3. ప్రభుత్వ స్వరూపంలో మార్పు :** అమెరికా విప్లవం వలన గ్రేట్ బ్రిటన్ అధీనంలోని 13 వలస రాష్ట్రాలు స్వాతంత్ర్యం సాధించి ఒక ఫెడరేషన్‌గా ఏర్పడినాయి. రాజరిక పాలనలో సామంత స్థాయిలో ఉన్న రాష్ట్రాలు విప్లవానంతరం రిపబ్లిక్‌లుగా రూపొందినాయి.

**3.6.1.4. బానిస వ్యవస్థ రద్దు :** అమెరికా స్వాతంత్ర్య సమరం బానిస వ్యవస్థ రద్దుకు మార్గము ఏర్పరచింది. పదకొండు రాష్ట్రాలలో బానిస వ్యవస్థ రద్దు చేయబడింది. కొన్ని సందర్భాలలో బానిసల యజమానులపై మితిమీరిన పన్నుల భారం మోపబడింది.

**3.6.1.5. విస్తృత ప్రాతిపదిక :** అమెరికా విప్లవంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు పాల్గొనుట వలన రాజకీయ వ్యవస్థకు విస్తృత ప్రాతిపదిక ఏర్పడింది. జప్తు చేయబడిన ఆస్తులు, రాజకీయ అధికారం పునర్విభజింపబడుట వలన అమెరికా సమాజంలో సమానత్వానికి, ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక ఏర్పడింది.

**3.6.1.6. సంస్కరణలు :** క్రిమినల్ శిక్షాస్మృతి, చెఱసాల సంస్కరణలు, లౌకిక, ప్రజాస్వామ్య తరహా విద్యా విధానం మున్నగు సంస్కరణలు చేపట్టబడినాయి.

**3.6.1.7. ఆంగ్లికన్ చర్చి :** ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలు చేయబడిన సొమ్ముతో నిర్వహింపబడుతున్న ఆంగ్లికన్ చర్చికి 13 రాష్ట్రాల వారు రద్దు చేశారు.

**3.6.1.8. లాయలిస్టుల (Loyalists) బహిష్కరణ :** అమెరికా విప్లవకాలంలో గ్రేట్ బ్రిటన్‌ను సమర్థించిన లాయలిస్టుల ఎడల టోరీల ఎడల అమెరికా ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించుటయే గాక వారిని దేశం నుండి బహిష్కరించింది. సుమారు లక్ష మంది

బహిష్కృతులు కెనడాకు, ఐరోపా దేశాలకు తరలి వెళ్లి తలదాచుకున్నారు. వార్నర్ & మార్టిన్ అను చరిత్రకారులు అన్నట్లు కెనడాకు వలస వెళ్లలేని లాయలిస్టులను ఇంగ్లాండు అమెరికనుల దయాదాక్షిణ్యాలకు లేక వారి ప్రతీకారేచ్ఛకు వదలివేసింది. వీరి బహిష్కరణతో అమెరికా సమాజం నుండి యథాస్థితి వాదులను (Conservatives) తరిమివేసినట్లయింది.

### 3.6.9. ఇంగ్లాండుపై ప్రభావం :

**3.6.9.1. రాజరిక వ్యవస్థ బలహీనపడుట :** ఈ విప్లవం ఇంగ్లాండులోని రాజరిక వ్యవస్థను చావుదెబ్బ తీసింది. అమెరికా విప్లవ పోరాటంలో ఇంగ్లాండు రాజు మూడవ జార్జి విధానాలు విఫలమగుటతో ఆ దేశంలో నిరంకుశ రాజరిక వ్యవస్థ తొలగిపోయి రాజ్యాంగ బద్ధ రాజరిక వ్యవస్థ ఏర్పడింది. లేనిచో ఈ పరిణామానికి మరికొంత కాలం పట్టి ఉండేది. అమెరికా స్వతంత్ర గుర్తింపు ఇంగ్లాండు నిరంకుశ రాజరిక వ్యవస్థ పతనానికి దారి తీసిందనుట పరమ సత్యం.

**3.6.2.2. ఆర్థిక రంగం :** ఇంగ్లాండు 13 వలస రాష్ట్రాలను కోల్పోవటంతో ఆ దేశ విదేశీ వ్యాపారానికి అపారనష్టం వాటిల్లింది. దేశ ప్రతిష్ఠ దిగజారింది. యుద్ధ ఖర్చుల వలన జాతీయ ఋణ భారానికి అదనంగా పదికోట్లు కలిశాయి. యుద్ధానంతరం 20,000 మందికి జీవనోపాధి కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం మీద పడింది.

**3.6.2.3. ఇంగ్లాండుకు గుణపాఠం - నూతన వలస విధానం :** అమెరికా విప్లవం ఇంగ్లాండుకు మంచి గుణ పాఠం నేర్పింది. దీనితో వలసల ఎడల అనుసరిస్తూ ఉన్న పూర్వపు విధానాలకు - వలసలు మాతృదేశ ఆర్థికాభివద్ధికే ఉన్నాయనే భావం కాల దోషం పట్టిందనే విషయాన్ని గ్రేట్ బ్రిటన్ గ్రహించింది. వలసల ఎడల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాటి అంతరంగిక విషయాల్లో తరచుగా జోక్యం కలుగజేసుకుంటూ ఆర్థికంగా దోచుకుంటూ ఉంటే తిరుగుబాట్లు తప్పవు అనే సత్యాన్ని ఈ విప్లవం ఋజువు చేసింది. టర్గో (Turgot) అన్నట్లు "వలసలు కాయల వంటివి. మ్రగ్గితే అవి రాలిపోతాయి.'' (The Colonies are like fruits, and when they are ripe, they will fall off - Turgot) రాజకీయ చైతన్యంతోపాటు ఆర్థికాభ్యుదయాన్ని సాధించిన వలసలు మాతృదేశ ఆధిపత్యాన్ని తృణీకరిస్తాయని దీని భావం. ఈ విషయాన్ని ఇంగ్లాండుతో సహా అన్ని అగ్ర రాజ్యాలు గ్రహించాయి. దీనితో ఇంగ్లాండు తన పూర్వపు వలస విధానాలకు స్వస్తి చెప్పి పరిమిత స్థాయిలో స్థానిక పరిపాలనా సంస్థలను నెలకొల్పి కాలాను గుణ్యమైన మార్పులకు అనుకూలంగా స్పందించనారంభించింది. అందువలననే "అమెరికా విప్లవం ఇంగ్లాండు వలస విధాన కుదుళ్లనే కదల్చి వేసింది'' అంటారు.

**3.6.2.4. బ్రిటీష్ కామన్‌వెల్త్ :** అమెరికా వలసల తిరుగుబాటు వలన ఇంగ్లాండ్ తన ఇతర వలసల ఎడల సమన్వయ విధానాన్ని అనుసరించింది. ఆ సమన్వయ విధానమే బ్రిటీష్ కామన్‌వెల్త్ ఆవిర్భావానికి దారి తీసింది.

**3.6.2.5. వలసాధిపత్యం పడమర నుండి తూర్పుకు :** ఇంగ్లాండు పశ్చిమ ప్రాంతాలలోని తన వలసలను కోల్పోవుటతో వలసాధిపత్య సాధనకు తూర్పు దేశాల వైపు దృష్టి మరల్చి ఆఫ్రికా, ఆసియా ఖండాలలో అనేక వలసలు నెలకొల్పి ఆర్థికంగా వాటిని దోచుకుని రాజకీయాధికార స్థాపన చేసింది.

### 3.6.3. ఫ్రాన్స్‌పై ప్రభావం :

**3.6.3.1. ఫ్రెంచివారు ఉత్తేజితులగుట :** అమెరికా విప్లవ విజయం ఫ్రెంచివారిని ఉత్తేజ పరచి కార్యోన్ముఖులుగా చేసింది. ఈ విప్లవ ప్రభావం ఇంగ్లాండునే కాక ప్రపంచ చరిత్రను - ముఖ్యంగా ఫ్రాన్స్ చరిత్రను అత్యధికంగా ప్రభావితం చేసిందని గ్రీస్ (Green) అను చరిత్రకారుడు నుడివినాడు. అమెరికనులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై నిరంకుశ రాజరిక వ్యవస్థపై విజయవంతంగా జరిపిన పోరాటం ఫ్రెంచి వారిని ముగ్ధులను చేసింది. వారు గూడా తమ దేశంలోని నిరంకుశ రాజరిక వ్యవస్థ నిర్మూలనకై ప్రయత్నములారంభించినారు. అమెరికా విప్లవ పోరాట కాలంలో అమెరికనుల పక్షాన ఇంగ్లాండుతో పోరు జరిపిన వారిలో ఫ్రెంచి సైనికులు, సైనికాధికారులు ఉన్నారు. ప్రజాస్వామ్య భావనలు వారిని ఆకట్టుకున్నాయి. అటువంటి ఆదర్శాలను ఫ్రాన్స్‌లో నెలకొల్పుటకు వారు విప్లవకారులతో చేతులు కలిపినారు. అమెరికా నుండి తిరిగి వచ్చిన ఫ్రెంచి సేనాని లాఫాయట్ (La Fayatte) విప్లవ సైన్యమును నడిపించినాడు.

**3.6.3.2. ఫ్రెంచి విప్లవాన్ని వేగిరపర్చుట :** అమెరికా విప్లవ గమన కాలంలో ఆదేశ పక్షాన ఫ్రాన్స్ అందులో పాల్గొని ముఖ్య భూమికను పోషించింది. సైనికులకు పంపుటతో పాటు పెద్ద మొత్తంలో ధనాన్ని గూడా ఖర్చు పెట్టింది. ఈ విప్లవ యుద్ధాలలో ఫ్రెంచి నౌకా దళానికి అపార నష్టం కలిగింది. తత్ఫలితంగా ఫ్రెంచి ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనాయి. ఆ ఆర్థిక సమస్యలే ఫ్రెంచి విప్లవాన్ని వేగిరపరచాయి.

**3.6.3.3. ఫ్రాన్స్ పూర్వపు స్థితిని పొందగల్గుట :** సప్త సంవత్సర యుద్ధ కాలంలో పరాజితమైన ఫ్రాన్స్ 1763లో జరిగిన పారిస్ సంధి ఫలితంగాకెనడా, కేప్ బ్రిటన్, నొవాస్కోషియా, పశ్చిమ ఇండియా దీవులలో కొన్నింటిని కోల్పోయి అవమానాల పాలయింది. కానీ అటు పిమ్మట అమెరికా స్వాతంత్ర్య సమరాన్ని ముగించిన వర్సే సంధి (1783) ద్వారా పశ్చిమ ఆఫ్రికాలోని సెనిగాల్ పశ్చిమ ఇండియా దీవులలోని టొబాగో, సెయింట్ లూసియాలను, ఇండియాలోని పాండిచ్చేరి, చంద్రనగర్‌లను తిరిగి పొంది చాలా వరకు తన పూర్వపు స్థితికి రాగలిగింది.

**3.6.4. ఐర్లాండుపై ప్రభావం :** అమెరికనులు సాధించిన విజయం ఐరిష్ జాతీయులకు ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని అందించింది. హెన్రీ గ్రాటన్ (Henry Grattan) నాయకత్వంలో వారు సమీకృతులై తమపై విధింపబడిన నిర్బంధాల తొలగింపునకు, తమకు ప్రత్యేక ఐరిష్ పార్లమెంట్ ఏర్పాటుకు ఆందోళన సాగించినారు. వారిని శాంతి పర్చుటకు పరిశ్రమల మీద, వాణిజ్యం మీద ఉన్న ఆంక్షలను ఇంగ్లాండు రద్దు చేసింది. తదుపరి ఐర్లాండుకు శాసన నిర్మాణ స్వాతంత్ర్యం లభించింది. ఆ విధంగా అమెరికా విప్లవం ఐరిష్ ప్రజల కోర్కెల సాధనకు అవకాశం కల్పించింది.

**3.6.5. స్పెయిన్‌పై ప్రభావం :** అమెరికా విప్లవం వలన స్పెయిన్‌కు మైనార్కా, ఫ్లోరిడాలు లభించాయి. కానీ స్పెయిన్ నౌకా దళం బ్రిటీష్ నౌకా దళం చేతిలో ధ్వంసమైపోయింది.

**3.6.6. విప్లవ హక్కుకు ప్రాచుర్యం :** ప్రజా పీడిత ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు ప్రజలకు గల తిరుగుబాటు చేయు హక్కును అమెరికా విప్లవం ధృవీకరించింది. ఇది సమస్త మానవాళికి ఈ విప్లవం ప్రసాదించిన గొప్ప కానుక, నిరంకుశత్వం నుండి ప్రజాస్వామ్యం వైపు వేసిన తొలి అడుగు. అమెరికనుల విజయం ఫ్రెంచి ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించింది. నాటి ప్రపంచంలో శక్తి సంపన్నమైన అగ్రదేశంగా పరిగణింపబడిన గ్రేట్ బ్రిటన్‌ను అమెరికాను వలస ప్రజలు సమర్థవంతంగా, విజయవంతంగా ఎదుర్కొనగలిగినపుడు దుర్బలమైన తమ నిరంకుశ, ప్రజాపీడిత రాజరిక వ్యవస్థను విప్లవం ద్వారా తామెందుకు అంతము చేయలేము అను ఆలోచన ఫ్రెంచి ప్రజలలో ఉదయించింది.

**3.6.7. స్వేచ్ఛా, స్వతంత్ర్యాలు :** రాజు దైవాంశ సంభూతుడు అను భావమును చావు దెబ్బతీసి ప్రజా సార్వభౌమాధికారము, జాతీయ ప్రభుత్వము అను రాజకీయ భావనలను ఈ విప్లవము ప్రపంచానికి చాటింది. స్వేచ్ఛ ప్రజాస్వామ్యము అను రాజకీయ భావనలకు అమెరికా విప్లవం పట్టుకొమ్మగా నిలిచింది. స్వాతంత్ర్య ప్రకటన ద్వారా ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రం ఈ విధంగా ప్రకటింపబడింది. "జన్మతః మానవులందరూ సమానులే. సృష్టికర్త వారికి కొన్ని అమోఘమైన హక్కులు కల్పించాడు. జీవించేందుకు, స్వేచ్ఛా, సౌఖ్యాలను అనుభవించేందుకు వారికి హక్కులు ఉన్నాయి. ఆ హక్కుల పరిరక్షణకు ప్రజల నుండి అధికారము పొంది ఏర్పరచబడిన ప్రభుత్వాలు ఉన్నాయి. "ప్రాతినిధ్యము లేనిదే పన్నులు లేవు, స్వేచ్ఛ లేని జీవితం కంటే మరణం మేలు'' (Patric K. Henry) అను సూక్తులు అణగద్రొక్కబడిన ప్రజలను సూటిగా స్వేచ్ఛ ప్రజాస్వామ్యాల వైపు నడిపించాయి. ప్రాథమిక దశలో అమెరికాలో పూర్తిస్థాయి ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడలేదు. ఓటు హక్కు సార్వజనీనము కాదు. కాలక్రమేణా ప్రజాస్వామ్య సాంప్రదాయాలు పూర్తి స్థాయిలో అమెరికన్ రిపబ్లిక్‌లో బలంగా వ్రేళ్లూనినాయి.

**3.6.8. మార్కెంటలిజం :** వలసలు మాతృదేశ ప్రయోజనార్థమే నిర్వహింపబడాలి అనే మర్కెంటలిస్టు విధానం సర్వత్రా విమర్శలకు గురి అయింది. అందువలన గ్రేట్ బ్రిటన్ తన విధానాలను మార్చుకున్నది.

## 3.7. సారాంశము :

బ్రిటీషు వారు అమెరికా వలసల పాలనలో అనుసరించిన ఆర్థిక విధానాల వలన అసంతృప్తులైన అచటి ప్రజలు, మాతృదేశంపై తిరుగుబాటు చేశారు. అనుభవజ్ఞుడు, సమర్థవంతుడు అయిన జార్జి వాషింగ్టన్ వారికి నాయకత్వం వహించాడు, సుశిక్షితమైన సైన్యాన్ని ఏర్పాటు చేసి బ్రిటీషు వారిని ఎదుర్కొన్నాడు. యుద్ధ గమనంలోని తొలి రెండు సంవత్సరాలలో బ్రిటీషు వారు ఉత్తర, మధ్య ప్రాంతాల రాష్ట్రాలను జయించుటకు ప్రయత్నించారు. లెక్సింగ్టన్ యుద్ధంలో అమెరికనులు విజయం సాధించగా, బంకర్ హిల్ యుద్ధంలో బ్రిటీషు వారిదే పై చేయి అయింది. వారి అధికార కేంద్రం బోస్టన్‌నుండి న్యూయార్క్‌కు మారింది. ఫిలడెల్ఫియా సమావేశం (1776)లో అమెరికనులు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుటతో పాటు హక్కుల ప్రకటన గూడా వెలవరిచారు. 1777లో బ్రిటీషు సేనాని బర్గోయిన్ సారటోగా యుద్ధంలో ఓడిపోయి అచట కుదిరిన ఒప్పందంపై సంతకమిడినాడు. ఈ విజయం యుద్ధ గమనంలో పెను మార్పుకు దారి తీసింది. దీనితో ఉత్తర రాష్ట్రాలపై ఆశ వదులుకొన్న ఆంగ్లేయులు దక్షిణ రాష్ట్రాలవైపు తమ దృష్టిని మరల్చినారు. కానీ ఉత్తర ప్రాంతంలో ఉన్న న్యూయార్క్ మాత్రం చివరి వరకు వారి ఆధీనంలోనే ఉంది. సారటోగా ఒప్పందం తరువాత అమెరికనుల సామర్థ్యంలో విశ్వాసం కుదిరిన ఫ్రాన్స్, స్పెయిన్ హాలెండ్ మున్నగు ఐరోపా దేశాలు వలసల పక్షాన చేరాయి. వాటి రాకతో ఉత్సాహాన్ని, బలాన్ని పుంజుకున్న అమెరికనులు బ్రిటీషు వారితో పోరాడుతూ 1781లో యార్క్ టౌన్ వద్ద వారి ప్రధాన సేనాని లార్డ్‌కార్న్‌వాలీస్‌ను ముట్టడించారు. మార్గాంతరం లేని కార్న్ వాలీస్ 8000 సైన్యంతో వారికి లొంగిపోయాడు. 1783 వరకు నౌకా యుద్ధాలు కొనసాగాయి. 1783 నాటి వర్సే సంధితో అమెరికా స్వాతంత్ర్య సమరం ముగిసింది. అమెరికా (అ.సం.రా.) స్వతంత్ర దేశంగా గుర్తింపబడింది.

ఇంగ్లాండు రాజు మూడవ జార్జి నిరంకుశ విధానాలు, బ్రిటీష్ సైనికాధికారుల అసమర్థత, వారి వ్యూహ రచనా లోపాలు, వారిలో పరస్పర సహకారం లోపించుట, వారి అసమర్థ యుద్ధ నిర్వహణ, బ్రిటీష్ ప్రభుత్వం యుద్ధ నిర్వహణలో తరచుగా జోక్యం చేసుకోవడం, శత్రువుల బలాన్ని తక్కువగా అంచనా వేయడం, సహేతుకంగా లేని బ్రిటీషు వారి విధానాలు మున్నగు అంశాలు బ్రిటీషు వారి పరాజయానికి దారి తీయగా, వలస ప్రజల కార్యదీక్ష, పట్టుదల, రెండు దేశాల (ఇంగ్లాండు, అమెరికా) మధ్య ఉన్న దూరం, విశాలమైన యుద్ధ రంగం, జార్జి వాషింగ్టన్ సమర్థవంతమైన నాయకత్వం, అమెరికనులకు లభించిన విదేశీ సాయం అనే అంశాలు అమెరికనులను విజయపథం వైపు నడిపించాయి.

స్వాతంత్ర్య సమరంలో విజయం సాధించుటతో అమెరికా (అ.సం.రా.) సర్వ స్వతంత్ర దేశంగా అవతరించింది. దిన దినాభివృద్ధి చెందుతూ అగ్రగామి దేశంగా రూపొందింది. ప్రభుత్వ నిర్మాణంలో క్రొత్త ప్రయోగాలను విజయవంతంగా చేపట్టింది. ఇంగ్లాండులో నిరంకుశ రాజరిక వ్యవస్థకు కాలం చెల్లిపోయి రాజ్యాంగబద్ధ రాజరిక పాలన ఆరంభమయింది. అమెరికాలో తన వలస విధానం దుష్ఫలితాలకు దారి తీయగా ఇంగ్లాండు ఇతర వలస ప్రాంతాలలో స్థానిక సంస్థలకు పరిమిత స్థాయిలో స్వేచ్ఛనిస్తూ నూతన వలస విధానాన్ని ఆచరణలో పెట్టింది. ఆ విధానం బ్రిటీష్ కామన్‌వెల్త్ ఆవిర్భావానికి మార్గము ఏర్పరచింది. ఇంగ్లాండ్‌పై ద్వేషంతో అమెరికా విప్లవకారులకు సాయం చేసిన ఫ్రాన్స్ ఆర్థిక ఇబ్బందులకు లోనై ప్రజలలో తీవ్ర అసంతృప్తిని రగిల్చింది. ఆ విప్లవం ఫ్రెంచివారిని ఉత్తేజపరచి వారిని గూడా అదేబాటలో నడిపించింది. పాలకుల దుష్టపాలనను అంతమొందించే హక్కు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించే హక్కు పాలితులకు ఉందని చాటి చెప్పిన ఈ విప్లవం భావితరాలకు, ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచింది.

## 3.8. నమూనా ప్రశ్నలు :

**1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)**

1. అమెరికా స్వాతంత్ర్య సమర ఘట్టాలను వివరించండి. ?

లేదా

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై అమెరికనులు బ్రిటీషు వారితో జరిపిన పోరాటాన్ని వర్ణించండి. ?

2. అమెరికా విప్లవ ఫలితాలేవి ?

లేదా

అమెరికా విప్లవం ప్రపంచ చరిత్ర గతిని ఏ విధంగా ప్రభావితం చేసింది ?

**2) లఘు వ్యాసరూప ప్రశ్నలు (15 మార్కులు)**

1) విప్లవ పోరాటంలో అమెరికనులకు అనుకూలించిన పరిస్థితులేవి ?

2) బ్రిటీషువారి యుద్ధ నిర్వహణలో గల లోపాలు వారి పరాజయానికి దోహదం చేశాయనుట ఎంత వరకు సమంజసం ?

**3) లఘుటీక ప్రశ్నలు (5 మార్కులు)**

1) వర్సే సంధి - 1783

2) ఇంగ్లాండుపై అమెరికా విప్లవ ప్రభావం

3) ఫ్రాన్స్‌పై అమెరికా విప్లవ ప్రభావం

4) అమెరికా చరిత్రపై విప్లవ ప్రభావం

## 3.9. చదువదగిన గ్రంథాలు :


1. రామచంద్రరావు సి.వి. - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర (1773-1865)
2. సింగరాచార్య బి.వి, - అమెరికా సంయుక్త రాష్ట్రాల సంగ్రహ చరిత్ర
3. స్టీఫన్ విన్సెంట్ భెనే - అమెరికా
4. Parkes H.B. - The United States of America - A History
5. Wood Grey - An Outline of American History
6. Allan Nevins and Henry Steele Commager - A Short History of the United States
7. Thomas A. Bailey - - The American Pageant - A History of the Republic
8. Richard N. Cursent, Harry Williams T, and Frank Freidel - American History - A Survey


**- డా॥ ఓ. సాంబయ్య**

పాఠం - 4

# కాన్ఫెడరేట్ రాజ్యాంగము

## 4.0. లక్ష్యం :

ఈ పాఠ్య భాగాన్ని చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

J కాన్ఫెడరేట్ ప్రభుత్వ ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు,

J ప్రభుత్వ లక్షణములు,

J సాధించిన విజయాలు,

J ప్రభుత్వం ఎదుర్కొనిన సమస్యలు,

J కాన్ఫెడరేట్ ప్రభుత్వ పతనమునకు గల కారణములను తెలుసుకుంటారు.

## విషయసూచిక :


4.1. పరిచయము

4.2. కాన్ఫెడరేట్ ప్రభుత్వమునకు ముందువున్న పరిస్థితులు

4.3. కాన్ఫెడరేట్ ప్రభుత్వ అధికారాలు

4.4. కాన్ఫెడరేట్ ప్రభుత్వం సాధించిన విజయాలు లేక ఎదుర్కొన్న సమస్యలు

4.4.1. ఆర్థిక సమస్య

4.4.2. పశ్చిమ ప్రాంత భూముల సమస్య

4.4.2.1. 1784 జఫర్‌సన్ చట్టం

4.4.2.2. 1785 భూమి ఆర్డినెన్స్ చట్టం

4.4.2.3. 1787 వాయవ్య ప్రాంత ఆర్డినెన్స్ చట్టం

4.5. కాన్ఫెడరేట్ ప్రభుత్వ వైఫల్యాలు

4.5.1. వెర్మాంట్, కెంటుకీ, టెన్నిస్ ఉద్యమాలు

4.5.2. బ్రిటన్‌తో వివాదం

4.5.3. స్పెయిన్‌తో వివాదం

4.6. కాన్ఫెడరేట్ ప్రభుత్వ పతనమునకు గల కారణములు

4.6.1. పన్నులు విధించు అధికారం లేకపోవుట

4.6.2. దిగుమతి పన్నుల చట్టాలు

4.6.3. కర్షకుల తిరుగుబాటు

4.6.4. అంతర్జాతీయ సంబంధాలపై ప్రభుత్వానికి అధికారం లేదు

4.7. సారాంశము

4.8. నమూనా ప్రశ్నలు

4.9. చదువదగిన గ్రంధాలు

## 4.1. పరిచయము :

అమెరికా స్వాతంత్ర్య సంగ్రామం జరుగుతున్న సమయంలోనే, స్వాతంత్ర్య ప్రకటనకు ముందు 1775 మే 10వ తారీఖున జాన్ హాన్‌కాక్ అధ్యక్షతన ఫిలడెల్ఫియాలో రెండవ కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశం అయి ఈ వలసలన్నింటికి ఒకే తరహాలో కేంద్ర ప్రభుత్వాన్ని రూపొందించాలి అని జాన్ డికిన్ సన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో థామస్ జఫర్‌సన్ కూడా ఒక సభ్యుడు. ఈ కమిటీ రాజ్యాంగమును రూపొందించి 1777లో కాంగ్రెస్‌కు సమర్పించినది. దీనిని రచించినది జాన్ డికిన్ సన్. రాష్ట్రాల అధికారాలు పటిష్ఠంగా ఉండేందుకు రాజ్యాంగ సూత్రాలను కాంగ్రెస్ అనేక మార్లు సవరించి, 1777 నవంబర్ 15న ఆమోదించినది. కాని పశ్చిమ ప్రాంతంలోని భూముల విషయంలో తలెత్తిన అభిప్రాయ భేదాల వలన వలస రాజ్యాలన్నీ ఈ రాజ్యాంగాన్ని ఆమోదించడానికి నాల్గు సంవత్సరాలు పట్టింది. 1781, మార్చి 1న వలస రాజ్యాల ఆమోదం లభించడంతో కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఏర్పడినది. ఈ ప్రభుత్వం 1781, మార్చి 1 నుండి 1789 మార్చి 3 వరకు అనగా నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చే వరకు అధికారంలో వున్నది.

## 4.2. కాన్ఫెడరేట్ ప్రభుత్వానికి ముందు వున్న పరిస్థితులు :

విప్లవ కాలంలో, విప్లవం తరువాత ఏర్పడు ప్రభుత్వ వ్యవస్థ ఎలాంటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక ఆదర్శాలను కలిగి ఉండాలనే విషయంపై తీవ్రమైన వివాదాలు ఏర్పడినాయి. ఈ విషయంలో పరస్పర విరుద్ధమైన రెండు ఉద్యమాలు వ్యక్తమయినాయి. అవి : (1). ప్రజాస్వామ్య ఉద్యమం లేదా తీవ్రవాద ఉద్యమం, (2). ధనిక ఉద్యమం లేదా సాంప్రదాయక ఉద్యమం. ప్రజాస్వామ్య ఉద్యమంలో శామ్ అడమ్స్, ప్యాట్రిక్ హెన్రీ, థామస్ జఫర్‌సన్ ముఖ్యులు. ఇది అమెరికాలోని వ్యవసాయ వర్గానికి ప్రాతినధ్యం వహించినది. ధనిక వర్గ ఉద్యమ నాయకుడు అలెగ్జాండర్ హ్యామిల్టన్. ఇది వర్తక, పారిశ్రామిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించింది. ఈ రెండు ఉద్యమాలు ఆనాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలకు చెందిన అనేక విషయాలపై విభేదించినాయి.

ప్రజాస్వామ్య వాదులు, ప్రభుత్వ విధానాలు సామాన్య పౌరుని బాగోగులను గూర్చి శ్రద్ధ వహించేవిగా ఉండాలని, ప్రభుత్వ కార్యకలాపాలపై నిర్దుష్టమైన అదుపులు ఉండాలని సూచించారు. వీరు జాన్‌లాక్ రూపొందించిన సహజహక్కుల (Natural Rights) సిద్ధాంతం చేత ప్రభావితులై వ్యక్తి ఔన్నత్యానికి, స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చారు. అధికార కేంద్రీకరణతో కూడిన పటిష్టమైన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదమని, అధికార వికేంద్రీకరణ ఉండాలని భావించారు. రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ, స్వయం నిర్ణయాధికారం ఉండాలి. ప్రజలందరు ప్రభుత్వ నిర్వహణలో భాగస్వాములుగా ఉండాలి. సమాజంలో ధనిక, కులీన వర్గాలకు ప్రత్యేకమైన ఎలాంటి హక్కులు వుండరాదు అని అన్నారు. వీరు ఆర్థిక స్వేచ్ఛకు ప్రత్యేకమైన ప్రాధాన్యతనిచ్చి, ఆర్థిక స్వేచ్ఛ లేనిదే రాజకీయ స్వేచ్ఛ నిరర్థకమని అందువలన ప్రతి వ్యక్తికి కొంత ఆస్తి హక్కు ఉండాలని మితంగా ఆస్తి ఉన్న వారందరికి ఓటు హక్కు ఇచ్చి ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో పొందుపరచి ప్రభుత్వము యొక్క అధికారాలను పరిమితం చేసి అధికారం అనేది ప్రధానంగా కార్యవర్గానికి గాక, శాసనసభలకు చెంది ఉండాలని సూచించినారు.

ధనిక వర్గ ఉద్యమవాదులు ప్రభుత్వంపై సామాన్య ప్రజల ప్రభావాన్ని వ్యతిరేకించినారు. వీరి ఉద్దేశ్యంలో సామాన్య ప్రజలు అజ్ఞానులు, క్రమశిక్షణ లేనివారు. వీరు ప్రభుత్వము యొక్క అధికారంలో జోక్యం చేసుకొంటే దేశ ప్రగతి కుంటుపడుతుందని, వీరి వలన

వ్యక్తి స్వేచ్ఛ, నాగరికతా ప్రమాణాలు, నాశనమయిపోతాయని సూచించినారు. అలెగ్జాండర్ హ్యామిల్టన్ సంపన్నులైన, కులీనులైన విజ్ఞానవంతులే ప్రభుత్వ పాలనను నిర్వహించాలి. అప్పుడే వర్తక వాణిజ్యాలు, పరిశ్రమలు ప్రోత్సహించబడి దేశం ప్రగతిని సాధిస్తుంది. ఇలాంటి ప్రగతిని సాధించడానికి అవసరమైన శాంతి భద్రతలను కల్పించడానికిగాను అధికార కేంద్రీకరణతో కూడిన పటిష్టమైన కేంద్ర ప్రభుత్వం అధికారం చెలాయిస్తూ ఉండాలి అని సూచించినారు.

ఇటువంటి ఉద్యమాలతో 1754లో వలసలన్నిటికీ కలిపి ఒక ప్రభుత్వాన్ని రూపొందించటానికి బెంజమిన్ ఫ్రాంక్లిన్ 'ఆల్బనీ ప్రణాళిక' (Albani Plan) అని ఒక ప్రణాళికను రూపొందించినాడు. పెన్సిల్వేనియా, మేరిల్యాండ్, న్యూయార్క్, న్యూ ఇంగ్లాండ్ వలసల ప్రతినిధులతో ఆల్బనీ పట్టణంలో జరిగిన సమావేశంలో అతడు ఈ ప్రణాళికను రూపొందించినాడు. కాని వలసల శాసనసభలు ఈ ప్రణాళికను ఆమోదించలేదు. 1774లో ప్రథమ కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశంలో జోసెఫ్ గ్యాలోవే ఒక వలసల కూటమిని ప్రతిపాదించాడు. కాని ఈ ప్రతిపాదన ఒక్క ఓటు తేడాతో వీగిపోయినది. చివరగా విప్లవ కాలంలో వలసలన్ని కలిసి 1777లో కాన్ఫెడరేట్ ప్రభుత్వమును ఏర్పాటు చేసుకున్నాయి.

## 4.3. కాన్ఫెడరేట్ ప్రభుత్వ అధికారాలు :

కాన్ఫడరేట్ రాజ్యాంగ సూత్రాలలనుసరించి ప్రజల సుఖం, రక్షణ వంటి వ్యవహారాలు సమర్థంగా నిర్వహించగల ప్రభుత్వం, అవసరం అని గుర్తించి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ప్రప్రథమంగా ఒక ప్రభుత్వమును ఏర్పాటు చేసినారు. దీని అధికారాలు : విదేశాంగ విధానం, రక్షణ అంతర్ రాష్ట్ర వివాదాల పరిష్కారం, దేశమంతటి మీద పన్నులు విధించే హక్కు మున్నగు అంశాలకు మాత్రమే దీని అధికారాలు పరిమితమైనాయి. కాని వాణిజ్యపరమైన శాసనాలు చేసే హక్కు ఈ ప్రభుత్వానికి లేదు. ఈ ప్రభుత్వ నిర్వహణకు అయ్యే ఖర్చును వివిధ రాష్ట్రాల నుండి వసూలు చేసుకోవాలి. ఏ రాష్ట్రం ఎంత చెల్లించాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ప్రభుత్వ నిర్వహణకు ముఖ్య అంగాలైన శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయ శాఖలు వేర్వేరుగా ఉండక, కాంగ్రెస్ అనే సంస్థలో వుంటాయి. ప్రతి రాష్ట్రం ఒక ప్రతినిధిని ఎన్నుకొని కాంగ్రెస్‌కు పంపుతుంది. దేశ అవసరాల దృష్ట్యా ముఖ్యమయిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రభుత్వానుకూలంగా కనీసం తొమ్మిది రాష్ట్రాల ప్రతినిధులు ఓటు వేయాలి. యుద్ధ సమయంలో అవసరమైన సైన్య సమీకరణను ప్రభుత్వము రాష్ట్రాలకు అభ్యర్థనల ద్వారా తెలియజేస్తుంది. అప్పుడే ఏ రాష్ట్రం ఎంత సైన్యాన్ని పంపాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

## 4.4. కాన్ఫెడరేట్ ప్రభుత్వం సాధించిన విజయాలు లేక ఎదుర్కొన్న సమస్యలు :

కాన్ఫెడరేట్ ప్రభుత్వం (మార్చి 1, 1781 నుండి మార్చి 3, 1789) నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చే వరకు కొనసాగింది. ఈ ప్రభుత్వ కాలాన్ని కొంత మంది చరిత్రకారులు నాయకత్వ లోపం, ఆర్థిక మాంద్యం మరియు అంతర్గత కలహాలతో కూడిన కాలంగా పేర్కొన్నారు. కాని యధార్థానికి ఈ ప్రభుత్వం కొన్ని విషయాలలో విఫలమైనప్పటికి దేశం ఎదుర్కొంటున్న అంతరంగిక సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించింది. ఈ కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు అనేక రంగాలలో ప్రగతిని సాధించాయి.

ఈ కాలంలో ప్రభుత్వం ఎదుర్కొనిన సమస్యలలో ముఖ్యమైనవి రెండు. అవి :

1. ఆర్థిక సమస్య, 2. పశ్చిమ ప్రాంత భూముల సమస్య

**4.4.1. ఆర్థిక సమస్య :** స్వాతంత్ర్య యుద్ధ కాలంలో, యుద్ధం తరువాత అమెరికా కొన్ని సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. అటువంటి వాటిలో ఆర్థిక సమస్య క్లిష్టమైనది. యుద్ధం వలన ఆర్థిక రంగంలో కొన్ని ఒడుదుడుకులు వచ్చి అమెరికా అప్పులపాలయింది. దేశీయ, విదేశీయ వాణిజ్యములలో అనేక ఇబ్బందులు తలెత్తెను. వీటిని అధిగమించుటకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నది. అవి:

1) దేశంలో తయారయిన వస్తు ఉత్పత్తులకు విదేశీ మార్కెట్లను కల్పించుట కొరకు ఐరోపా ఖండంలోని ఫ్రాన్స్, స్వీడన్, హాలెండ్, ప్రష్యాలాంటి ప్రముఖ దేశాలతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నది.

2) యుద్ధం తరువాత ఇంగ్లాండ్ నుండి భారీ ఎత్తున చేసుకున్న దిగుమతుల వలన అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1784, 1785 సంవత్సరములలో ఆర్థిక మాంద్యం వచ్చింది. దీనిని అధిగమించుట కొరకు విదేశాలలో మార్కెట్లలను ఏర్పాటు చేసింది.

3) చైనా మరియు తూర్పు ఇండియా దీవులతో వ్యాపార సంబంధాలు ఏర్పాటు చేసుకొని 1784 - 85 సంవత్సరంలో చైనా దేశానికి "ఎక్స్‌ప్రెస్ ఆఫ్ చైనా" (Express of China) అనే వాణిజ్య నౌకను పంపినది.

4) విదేశముల నుండి దిగుమతయ్యే వస్తువుల మీద అనేక రాష్ట్రములు రక్షణ సుంకాలను విధించినాయి. దీని వలన ఆర్థికంగా రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి.

5) రాష్ట్రాలనుసరించిన రక్షణ విధానం వలన దేశీయ పరిశ్రమలు అభివృద్ధి చెందుటకు, రాష్ట్రముల మధ్య స్వేచ్ఛా వ్యాపారములు కొనసాగుటకు చర్యలు తీసుకొనబడినవి.

6) రాష్ట్రాల మధ్య రవాణాసౌకర్యాలను అభివృద్ధి చేయుట కొరకు రోడ్లు, వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకొనబడినవి.

7) వ్యాపార వాణిజ్య రంగములను అభివృద్ధి చేయుట కొరకు, అవసరమైనప్పుడు ఋణములను ఇచ్చుట కొరకు ఫిలడెల్ఫియా, బోస్టన్, న్యూయార్క్ నగరములందు వాణిజ్య బ్యాంకులు స్థాపించబడ్డాయి.

**4.4.2. పశ్చిమ ప్రాంత భూముల సమస్య :** కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జటిలమైన సమస్య పశ్చిమ ప్రాంత భూముల సమస్య. ఈ ప్రాంతాలలో స్థిరపడే విషయంలో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించక ముందే ప్రజలు తండోపతండాలుగా యుద్ధమునకు పూర్వమే అపలేచియన్ పర్వాతాల అవతలి వైపుకు దాటి పశ్చిమంగా తరలి వెళ్ళి అక్కడి భూములను ఆక్రమించుకొని కాలనీలపై తమ హక్కును ప్రకటించినాయి. పశ్చిమ ప్రాంతమని పిలవబడే భూభాగం ఓహియోనదికి వాయువ్యంగా, మిసిసిపీ నదికి తూర్పుగా, మహా సరస్సులకు దక్షిణంగా వుంది. ఈ పశ్చిమ ప్రాంతాన్ని వాయవ్య ప్రాంతం లేదా వాయవ్య ప్రదేశం అని కూడా పిలుస్తారు. పశ్చిమ ప్రాంత భూములు అందరికి చెందినవిగా భావించాలని వాటిని విభజించి స్వతంత్ర ప్రభుత్వాలు ఏర్పరచే హక్కు కాన్ఫెడరేట్ ప్రభుత్వ ఆధీనంలో ఉంచవలెనని రాష్ట్రాలన్ని ఒక అంగీకారానికి వచ్చాయి. 1780లో న్యూయార్క్ రాష్ట్రం తన హక్కులను ప్రభుత్వానికి దాఖలు చేసింది. మిగిలిన రాష్ట్రాలు కూడా అదే మార్గాన్ని అనుసరించాయి. యుద్ధం ముగిసేసరికి, ఓహియోనదికి ఉత్తరాన ఉన్న భూములు అలెఘనీ పర్వత శ్రేణికి పశ్చిమంగా ఉన్న భూములు ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయి అని స్పష్టం చేయబడింది. అటువంటి రోజులలో ప్రజల మధ్య జాతీయత, ఐకమత్యమును పెంపొందించుట కూడా ప్రభుత్వం మనకు ఒక పెద్ద సమస్య అయింది. కాని ఈ సమస్యలను ప్రభుత్వం విజయవంతంగా పరిష్కరించగలిగింది. ఈ సమస్యలను పరిష్కరించుటకుగాను ప్రభుత్వం మూడు చట్టాలను జారీ చేసింది.

అవి. 1. జఫర్‌సన్ చట్టం (1784)

2. భూమి ఆర్డినెన్స్ చట్టం (1785)

3. వాయవ్య ప్రాంత ఆర్డినెన్స్ చట్టం (1787)

**4.4.2.1. జఫర్‌సన్ చట్టం (1784) :** థామస్ జఫర్‌సన్ రూపొందించిన సూత్రముల ప్రాతిపదికగా కాంగ్రెస్ 1784లో ఒక ఆర్డినెన్స్ జారీ చేసినది. ఈ ఆర్డినెన్స్ ప్రకారం పశ్చిమ ప్రాంత ప్రజలకు స్వయం పరిపాలనను ప్రసాదించాలని, ఆ ప్రాంతాన్నంతటిని పది లేక అంతకంటే ఎక్కువ రాష్ట్రాలుగా విభజించాలని నిర్ణయించారు. కాని, కాంగ్రెస్ భూ చట్ట వ్యాపారస్తుల ఒత్తిడులకు లోనై ఆర్థిక అవసరముల దృష్ట్యా వాయువ్య ప్రాంత భూములకు సంబంధించి 1785లో మరియొక చట్టాన్ని ప్రవేశపెట్టింది.

**4.4.2.2. భూమి ఆర్డినెన్స్ చట్టం (1785) :** ఈ చట్టము ప్రకారము వాయువ్య ప్రాంతాన్ని సర్వే చేసి దానిని 92 చ. కి.మీ. విస్తీర్ణం గల పట్టణాలుగా విభజించాలని ఈ విస్తీర్ణంలో సమాన కొలతలు గల 36 దీర్ఘ చతురస్ర విభాగాలుంటాయి. ఒక్కో పట్టణంలో 10.24 చ.కిమీ ను కాన్ఫెడరేట్ ప్రభుత్వమునకు, 2.56 చ.కి. మీటర్ల పాఠశాలలకు కేటాయిస్తారు. ఇవి పోగా మిగిలిన ప్రాంతాన్ని 40 హెక్టార్లు ఒక డాలర్‌కు తక్కువ కాకుండా బహిరంగ వేలంలో అమ్ముతారు. కొనుగోలు దారులు ఒక విభాగం 2.5 చ. కి.మీ. భూమికి తక్కువ కాకుండా కొనాలి. కాని ఈ నిబంధనలన్ని అక్కడ నివాసమేర్పరచుకొనదలచిన ప్రజలకంటే వ్యాపారస్తులకు అనుకూలంగా ఉండి, వారు ఈ భూములను ఎక్కువగా కొనే అవకాశ మేర్పడినది. ఈ నిబంధనల ప్రకారం కొంత భూమిని సర్వే చేసిన తరువాత కాంగ్రెస్ ఆర్థిక దుస్థితిని మెరుగుపరచుకొనుటకు సర్వే చేయని 60వేల హెక్టార్ల భూమిని 40 హెక్టార్లు 9 సెంట్లకు తక్కువ కాకుండా, కొన్ని ప్రముఖ వర్తక సంఘాలకు అమ్మివేసింది. అవి ఓహియో కంపెని, స్కాషియా కంపెని మరియు న్యూజెర్సీ కంపెని మొదలగునవి. ఈ అమ్మకమైన వెంటనే అమెరికన్ పౌరులకు పెద్దసంఖ్యలో ఆ ప్రాంతాలకు తరలి వెళ్ళినారు. కాని కంపెనీలు ఈ ప్రజలు పట్ల తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోయినాయి. ఫలితంగా అక్కడి ప్రభుత్వమునకు ఎదో ఒక విధమైన పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఏర్పడింది. అప్పుడు కాన్ఫెడరేట్ ప్రభుత్వం, పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి 1787లో వాయవ్య ప్రాంత భూమి ఆర్డినెన్స్‌ను జారీ చేసింది.

**4.4.2.3. వాయవ్య ప్రాంత భూమి ఆర్డినెన్స్ చట్టం (1787) :** ఈ చట్టం ప్రకారం వాయవ్య ప్రాంతం మూడు ప్రాంతాలకు తక్కువ కాకుండా ఐదు ప్రాంతాలకు ఎక్కువ కాకుండా విభజింపబడుతుంది. ఈ విభజింపబడిన ప్రాంతాలలో రాష్ట్ర ప్రతిపత్తిని పొందటానికి మూడు దశలు నిర్ణయించబడినాయి. మొదటి దశలో కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఒక గవర్నర్‌ను, కొంత మంది న్యాయమూర్తులను నియమిస్తుంది. వీరి ఆధ్వర్యంలో పరిపాలన సాగేటట్లు నిర్ణయించబడినది. రెండవ దశలో ఏ ప్రాంతంలోనైనా 5,000 మంది వయోజనులు చేరినప్పుడు ఎగువ సభ, దిగువ సభ గల శాసన సభ కలిగివుండే అర్హత ఆ ప్రాంతమునకు వస్తుంది. క్రింది సభను ప్రజలే ఎన్నుకుంటారు. అంతేగాక అప్పుడు ఆ ప్రాంతము నుండి ఓటింగ్ హక్కులేని ఒక ప్రతినిధిని కాంగ్రెసుకు పంపవచ్చును. చివరిదశలో, ఏ ప్రాంతలోనైనా స్వతంత్ర పౌరుల సంఖ్య 60,000 మంది జనాభా వున్నప్పుడు యూనియన్‌లో తొలి రాష్ట్రాలన్నిటితో పాటు సమాన ప్రతిపత్తి గల రాష్ట్రంగా గుర్తింపు లభిస్తుంది. ఈ ప్రాంతాలకు వెళ్ళిన వారందరికి రాజకీయ, సాంఘిక హక్కులుంటాయి. ప్రభుత్వం ఈ ప్రాంతాలలోని ప్రజలందరికి పౌర హక్కులు, స్వాతంత్ర్యం, విద్యా సౌకర్యాలు మరియు వసతులను కల్పిస్తుంది. ఈ ప్రాంతాలలో "బానిసత్వం, నిర్బంధ సేవత్వం" నిషేధించడమైనది. ఈ విధంగా సమానతా సిద్ధాంతం ప్రాతిపదికపై ఒక క్రొత్త వలస పరిపాలనా విధానం ఆరంభమైంది. వలసలంటే మాతృదేశానికి లాభం చేకూర్చడం కోసమే ఉండాలనే, చిరకాలంగా వస్తున్న నమ్మకాన్ని ఈ క్రొత్త విధానం త్రోసిపుచ్చింది. ఈ సిద్ధాంతానికి బదులుగా వలసలు జాతి విస్తరణలో భాగాలని, సమానత వలన వచ్చే సౌకర్యాలు వాటి సహజమైన హక్కులేగాని ఎవరి దయ వలన సంక్రమించినవి కావనీ ఈ క్రొత్త సిద్ధాంతం తేటతెల్లం చేసింది. చట్టంలో పొందుపరచిన ఇటువంటి సూత్రాల వలన అమెరికా భూమి పంపకం నవ విధానానికి పునాధి అయింది. ఇటువంటి జాతి విస్తరణ విధానం వలన అమెరికా సంయుక్త రాష్ట్రాలలో తూర్పు, పశ్చిమ ప్రాంతాల మధ్య ఘర్షణలు నివారించబడి అమెరికా, పశ్చిమాన పసిఫిక్ మహా సముద్రం వరకు వ్యాప్తి చెంది 13 రాష్ట్రాలు, 50 రాష్ట్రాలుగా పెరగడానికి అవకాశం కలిగింది. ఇటువంటి చట్టాలు ప్రభుత్వానికి గల జాతీయ సార్వభౌమత్వాధికారానికి ప్రతీకలుగా నిలిచినాయి. అయితే కొన్ని సమస్యల పరిష్కారంలో మాత్రం ఈ సంయుక్త రాష్ట్రాల ఆర్డినెన్స్‌లు ఆశాభంగం కల్గించాయి.

## 4.5. కాన్ఫెడరేట్ ప్రభుత్వ వైఫల్యాలు :

కాన్ఫెడరేట్ ప్రభుత్వం పశ్చిమ ప్రాంత సమస్య పరిష్కారములోను, ఆర్థిక దుస్థితిని అధిగమించుటలోను కొన్ని విజయాలు సాధించినను విదేశాంగ విధానము, అంతరంగిక విషయాలు, సరిహద్దు తగాదాలను పరిష్కరించటంలో అది విఫలమయింది.

**4.5.1. వెర్మాంట్, కెంటుకీ, టెన్నిసీ ఉద్యమాలు :** కాన్ఫెడరేట్ ప్రభుత్వ ఆధీనంలో లేని కొంతమంది వాయవ్య ప్రాంత ప్రజలు స్వయం పాలన కొరకు మరియు స్వతంత్ర రాష్ట్ర ప్రతిపత్తి కొరకు ఉద్యమాలు లేవదీశారు. 1787లో వెర్మాంట్ ప్రాంత ప్రజలు ఎథాన్

అలెన్ నాయకత్వంలో తిరుగుబాటు చేసి తమ ప్రాంతాన్ని రాష్ట్రంగా ప్రకటించుకొని రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వెర్మాంట్‌లో కొంతభాగం న్యూయార్క్ ఆధీనంలో ఉండుట వలన వెర్మాంట్‌ను రాష్ట్రంగా గుర్తించడానికి న్యూయార్క్ వ్యతిరేకించింది. అందువలన కాన్ఫెడరేట్ ప్రభుత్వం వెర్మాంట్‌ను రాష్ట్రంగా గుర్తించలేదు. తదుపరి వెర్మాంట్‌ను ఒక రాష్ట్రంగా న్యూయార్క్ 1791 సంవత్సరంలో గుర్తించింది. ఇటువంటి ఉద్యమాలే కెంటుకీ, టెన్నిసీ ప్రాంతాలలో కూడా మొదలయినాయి. వీటిలో కూడా కొన్ని ప్రాంతాలు వర్జీనియా, ఉత్తర కరోలినాల ఆధీనంలో ఉన్నందు వలన ప్రత్యేక రాష్ట్రానికై అక్కడ బయలుదేరిన ఉద్యమాలను కూడా కాన్ఫెడరేట్ ప్రభుత్వం గుర్తించలేదు.

**4.5.2. బ్రిటన్‌తో వివాదం :** అమెరికాలోని లాయలిస్టులకు, వర్సే సంధి ప్రకారం ఇచ్చిన హామీలను పూర్తిగా నేరవేర్చలేదనే నెపంతో బ్రిటన్, మహా సరస్సులకు దక్షిణంగా ఉన్న డెట్రాయిట్ మొదలైన కొన్ని స్థావరాలను ఖాళీ చేసి వెళ్ళడానికి నిరాకరించింది. పైగా స్థానికులయిన రెడ్ ఇండియన్లతో స్నేహం చేసి వాయవ్య ప్రాంతంలోని వ్యాపారాన్ని తన ఆధీనంలో ఉంచుకోవటానికి బ్రిటన్ ప్రయత్నించింది. అప్పటికి వర్సే సంధి ప్రకారం అమెరికాకు, బ్రిటీష్ వారికి మధ్య ఈశాన్య ప్రాంతంలో సరిహదు ఖచ్చితంగా నిర్ణయించబడలేదు.

**4.5.3. స్పెయిన్‌తో వివాదం :** స్వాతంత్ర్య యుద్ధ సమయంలో స్పెయిన్, అమెరికాకు అండగా నిలిచింది. కాని స్వాతంత్ర్య యుద్ధం తరువాత వలసల విస్తరణకు, వాటి రక్షణకు పశ్చిమ ప్రాంతంలో స్పెయిన్, అమెరికాకు అడ్డంకిగా తయారయింది.

వారి మధ్య వివాదగ్రస్తమయిన అంశము లేవనగా :

1) 1783లో జరిగిన వర్సే సంధిలో బ్రిటన్ తటస్థంగా వున్నందువలన స్పానిష్ ఫ్లోరిడాకు, అమెరికాకు మధ్య సరిహద్దు సరిగా లేక స్పెయిన్‌కు, అమెరికాకు మధ్య వివాదం ఏర్పడినది. స్పెయిన్ ఈ సరిహద్దు $32^0$ ఉత్తర అక్షాంశం వరకు ఉందని, అమెరికా ఈ సరిహద్దు $31^0$ ఉత్తర అక్షాంశం వరకు మాత్రమేనని వివాదపడినాయి.

2) స్వాతంత్ర్య యుద్ధంలో స్పెయిన్ సైనిక స్థావరాలుగా వున్న 'నాచెజ్' మొదలైనవి తనకే చెందాలని స్పెయిన్ కోరింది. అంతేగాక స్పెయిన్ లూయిసియానా, ఫ్లోరిడాలను పొందడం వలన మిసిసిపీ నదీ ప్రాంతమంతా ఆదేశ ఆధీనంలో వుంది. మిసిసిపీ నదీ ప్రాంతంలో అమెరికన్‌లు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవటానికి బ్రిటన్ అంగీకరించింది. కాని స్పెయిన్, మిసిసిపీ నది మీద బ్రిటన్‌కు హక్కు ఉందని గుర్తించనందువలన అమెరికన్లు తమ సరుకులను మిసిసిపీ నది మీద రవాణా చేయడానికి స్పెయిన్ అనుమతించలేదు.

ఈ రెండు సమస్యల వలన స్పెయిన్‌కు, అమెరికాకు మధ్య వివాదం ఏర్పడింది.

మిసిసిపీ నది మీద స్వేచ్ఛగా వ్యాపారం చేసుకొనే హక్కు, న్యూ ఆర్లియన్స్ రేవు నుంచి వారి ఉత్పత్తులను ఐరోపా దేశాలకు ఎగుమతి చేసుకునే సౌకర్యం పశ్చిమ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి అమెరికన్లకు అవసరం. అందుకుగాను 1784 సంవత్సరంలో ప్రభుత్వం బ్రిటన్‌తో సంధి చేసుకోవడానికి తన ప్రతినిధిగా జాన్ ఆడమ్స్‌ను పంపింది. కాని బ్రిటన్ అనుసరించిన విధానం వలన ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఇటువంటి పరిస్థితులలో 1786లో జాన్‌జే, స్పెయిన్ ప్రభుత్వంతో న్యూయార్క్‌లో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీని ప్రకారం స్పెయిన్‌తో వ్యాపారం సాగిస్తున్న అమెరికన్ వర్తకులకు స్పెయిన్ ప్రభుత్వం కొన్ని రాయితీలు కల్పించినప్పటికి, అమెరికన్లు మిసిసిపీ నదిని వ్యాపార ప్రయోజనాలకు వాడుకోవటానికి స్పెయిన్ అనుమతించలేదు. అదే కాలంలో దక్షిణ, పశ్చిమ రాష్ట్రాలలో తీవ్ర అలజడులు ప్రారంభమయ్యాయి. ఈ రాష్ట్రాలలోని ప్రజలు "మేము కాన్ఫెడరేషన్ ప్రభుత్వం నుంచి విడిపోతామని, స్పెయిన్‌ను న్యూ ఆర్లియెన్స్ ప్రాంతం నుంచి వెళ్ళగొడతామని" హెచ్చరికలు జారీ చేశారు. వీరిలో కొంత మంది ప్రజలు స్పెయిన్ సామ్రాజ్యంలో విలీనం కావడానికి కూడా సుముఖత చూపించారు. కాని ఈ ఒప్పందం కార్యరూపం దాల్చలేదు. ఇటువంటి పరిస్థితులలో కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఐరోపా దేశాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి ఈ సమస్యలను పరిష్కరించలేకపోయినది.

## 4.6. కాన్ఫెడరేట్ ప్రభుత్వ పతనమునకు గల కారణములు :

కేంద్ర ప్రభుత్వ - రాష్ట్రాల మధ్య జరిగిన వివాదాలను, బ్రిటన్, స్పెయిన్ దేశాలతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించటంలో విఫలం చెంది 8 సంవత్సరముల (1781-1789) కాలంలోనే ప్రభుత్వం పతనమయింది. అందుకు కారణము లేవనగా :

**4.6.1. పన్నులు విధించు అధికారం లేకపోవుట** : జాతీయ ప్రయోజనాల కోసం అవసరం వచ్చినప్పుడు పన్నులు విధించడం, రవాణా సుంకాలు విధించడం ద్వారా వ్యాపారం క్రమబద్ధం చెయ్యడం మున్నగు అంశాలలో ప్రభుత్వానికి ఎటువంటి అధికారము లేదు. దీని వలన ప్రభుత్వం ఆర్థికంగా బలహీనమై పతనమైంది.

**4.6.2. దిగుమతి పన్నుల చట్టాలు** : మెసాచుసెట్, న్యూయార్క్ పెన్సిల్వేనియా శాసనసభలు సొంత నిర్ణయాలతో తమ రాష్ట్రాలకు దిగుమతి అయ్యే వస్తువుల మీద పన్నులు చెల్లించాలి అని చట్టాలు చేసినాయి. దీని వలన ఇరుగుపొరుగు రాష్ట్రాలు నష్టపోయినాయి. వర్తక నిర్బంధాల మూలంగా రాష్ట్రాల మధ్య వివాదాలు చెలరేగినాయి. ఉదా : న్యూజెర్సీ వర్తకులు న్యూయార్క్‌లోకూరగాయలు అమ్ముకోవాలంటే ప్రవేశ రుసుము చెల్లించాలి. పన్ను చెల్లించకుండా హడ్సన్ నది దాటడానికి వీలు లేదు.

**4.6.3. కర్షకుల తిరుగుబాటు** : యుద్ధానంతరం ఏర్పడిన ఆర్థిక ఇబ్బందుల వలన ప్రజలలో అసంతృప్తి పెరిగింది. ముఖ్యంగా కర్షకులలో ఇది ఎక్కువగా కన్పిస్తుంది. ఈ అసంతృప్తి వలననే కర్షకులు మెసాచుసెట్స్‌లో డేనియల్ షేస్ అనే మాజి సైనిక దళాధిపతి నాయకత్వమున ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు.

**4.6.4. అంతర్జాతీయ సంబంధాలపై ప్రభుత్వానికి అధికారం లేదు** : అంతర్జాతీయ సంబంధాలపై ప్రభుత్వానికి పూర్తి అజమాయిషి ఉండాలి. కాని కొన్ని రాష్ట్రాలు విదేశాలతో తమంతట తామే సంప్రదింపులు ప్రారంభించాయి. ఈ వలసలలోని తొమ్మిది రాష్ట్రాలు సొంతంగా సైన్యాలను కూడా సమకూర్చుకున్నాయి. మరియు కొన్ని రాష్ట్రాలు సొంతంగా చిన్న, చిన్న నౌక దళాలు ఏర్పరచుకున్నాయి. ఇటువంటి చర్యల వలన రాష్ట్రాల మధ్య సమన్వయం కొరవడింది.

## 4.7. సారాంశము :

కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఏర్పాటుకు ముందు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఉద్యమాలు జరిగాయి. వీటి ద్వారా ఉద్యమకారులు భవిష్యత్తులో ఎటువంటి ప్రభుత్వ వ్యవస్థ వుండాలో తెలియచేసారు. వీరి వలన 1781లో కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఏర్పాటు అయింది. ఈ ప్రభుత్వానికి అనేక అధికారాలు కూడా వున్నాయి. కాని వాణిజ్యపరమైన శాసనాలు చేసే అధికార మాత్రం లేదు. దీనిలో శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయశాఖలు వేర్వేరుగా వుండక కాంగ్రెస్ అనే సంస్థలో వుంటాయి. ఇది నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చే వరకు కొనసాగింది. ఈ ప్రభుత్వం అనేక సమస్యలను ఎదుర్కొన వలసి వచ్చింది. అవి : ఆర్థిక సమస్య, పశ్చిమ ప్రాంత భూముల సమస్య. విదేశాలతో వాణిజ్య ఒప్పందాలను చేసుకొని రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేసి, ముఖ్యమైన నగరాలలో వాణిజ్య బ్యాంకులను నెలకొల్పి ఆర్థిక సమస్యను అధిగమించింది. పశ్చిమ ప్రాంత భూముల సమస్యను పరిష్కరించుట కొరకు ప్రభుత్వం మూడు చట్టాలను చేసింది. వీటి వలన సమాన సిద్ధాంతం ప్రాతిపదికగా వలసల పరిపాలనా విధానం ఆరంభమైంది. ఈ పరిపాలనాలో తూర్పు, పశ్చిమ ప్రాంతాల మధ్య ఘర్షణలు నివారింపబడి అమెరికా, పశ్చిమాన పసిఫిక్ మహా సముద్రం వరకు విస్తరించింది. ఇటువంటి చట్టాలు ప్రభుత్వానికి గల జాతీయ సార్వభౌమత్వాధికారాన్ని తెలియచేశాయి. కాని కొన్ని సమస్యల పరిష్కారంలో మాత్రం ఈ చట్టాలు ఆశాభంగం కల్గించాయి. ఈ ప్రభుత్వ కాలంలో కొన్ని ప్రాంతాలలో ఉద్యమాలు, తిరుగుబాటులు చేలరేగాయి. బ్రిటన్, స్పెయిన్ దేశాలతో వివాదాలు ఏర్పడి వీటిని పరిష్కరించటంలో విఫలం చెంది, ఎనిమిది సంవత్సరాల కాలంలోనే ప్రభుత్వం పతనమైంది. దీనిలో కొన్ని లోపాలు వున్నప్పటికి ఇది అంతకు ముందున్న ప్రభుత్వ వ్యవస్థలు అన్నిటికంటే మేలయిందని దీనిని ఐరోపా దేశాలలోని ప్రభుత్వ వ్యవస్థలతో పోల్చినప్పుడు "స్వర్గానికి, నరకానికి మధ్య ఉన్నంత వ్యత్యాసం ఉందని" థామస్ జఫర్‌సన్ అన్నాడు. కాన్ఫెడరేట్ రాజ్యాంగం అమెరికాలో ప్రథమ రాజ్యాంగం. ఇది పటిష్టమైన కేంద్ర ప్రభుత్వము ఏర్పరచలేకపోయినప్పటికి, రాష్ట్రాల మధ్య సమైక్యతను

పెంపొందించి జాతి విస్తరణకు దోహదం చేసింది. ఈ ప్రభుత్వం, ప్రభుత్వ వ్యవస్థలో లోపాలను గుర్తించి మున్ముందు బలమైన కేంద్ర ప్రభుత్వం ఏర్పరచుకోవలసిన అవశ్యకతను గుర్తించేటట్లు చేసింది. థామస్ బెయిలీ కాన్ఫెడరేట్ ప్రభుత్వాన్ని "నేటి రాజ్యాంగానికి దారి తీసిన ప్రథమ సోపానం" అని అన్నారు.

## 4.8. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)

1. అమెరికా స్వాతంత్ర్య సమరానంతరం కాన్ఫెడరేట్ ప్రభుత్వం సాధించిన విజయాలేవి ?
2. కాన్ఫెడరేట్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించండి.

### 2) లఘు వ్యాసరూప ప్రశ్నలు (15 మార్కులు)

1) కాన్ఫెడరేట్ ప్రభుత్వ పతనానికి కారణాలేవి ?

2) కాన్ఫెడరేట్ ప్రభుత్వ అధికారాలేవి ?

### 3) లఘుటీక ప్రశ్నలు (5 మార్కులు)

1) పశ్చిమ ప్రాంత భూముల సమస్య

2) కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఎదుర్కొన్న ఆర్థిక సమస్యలు.

## 4.9. చదువదగిన గ్రంథాలు :


1. రామచంద్రరావు సి.వి. - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర (1773-1865)
2. సింగరాచార్య బి.వి, - అమెరికా సంయుక్త రాష్ట్రాల సంగ్రహ చరిత్ర
3. స్టీఫన్ విన్సెంట్ భనే - అమెరికా
4. Parkes H.B. - The United States of America - A History
5. Wood Grey - An Outline of American History
6. Allan Nevins and Henry Steele Commager - A Short History of the United States
7. Thomas A. Bailey - - The American Pageant - A History of the Republic
8. Richard N. Cursent, Harry Williams T, and Frank Freidel - American History - A Survey


**- డా॥ ఓ. సాంబయ్య**

**పాఠం - 5**

# నూతన రాజ్యాంగము - దాని లక్షణాలు

## 5.0. లక్ష్యం :

ఈ పాఠ్యభాగాన్ని చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

J అమెరికా నూతన రాజ్యాంగ నిర్మాణమునకు దారి తీసిన పరిస్థితులు,

J పనితీరు,

J హక్కుల బిల్లు,

J ప్రభుత్వ శాఖల మధ్య అధికారుల విభజన,

J న్యాయశాఖ స్వాతంత్ర్యం,

J రాజ్యాంగ సవరణ విధానం తెలుసుకోవడం.

## విషయసూచిక :


**5.1.** పరిచయము

**5.2.** నూతన రాజ్యాంగ నిర్మాణానికి దారి తీసిన పరిస్థితులు

**5.3.** నూతన రాజ్యాంగ నిర్మాణం

**5.3.1.** ఫిలడెల్ఫియా పరిషత్

**5.4.** నూతన రాజ్యాంగ లక్షణాలు

**5.4.1.** లిఖిత రాజ్యాంగం

**5.4.2.** దృఢ రాజ్యాంగం

**5.4.3.** శాశ్వత రాజ్యాంగం

**5.4.4.** సంక్షిప్త రాజ్యాంగం

**5.4.5.** సమాఖ్య రాజ్యాంగం

**5.4.6.** రాజ్యాంగ అధిక్యత

**5.4.7.** ప్రజా సార్వభౌమాధికారం

**5.4.8.** లౌకిక రాజ్యం

**5.4.9.** హక్కుల బిల్లు (Bill of Rights)

**5.4.10.** అధ్యక్ష తరహా పద్ధతి

5.4.11. అధికార పృథక్కరణ

5.4.11.1. శాసన నిర్మాణ శాఖ

5.4.11.1. సెనేట్ (ఎగువ సభ)

5.4.11.2. ప్రజా ప్రతినిధుల సభ (House of Representatives)

5.4.11.2. కార్యనిర్వాహక శాఖ (పరిపాలనా శాఖ)

5.4.11.3. న్యాయశాఖ

5.4.12. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం

5.4.13. ద్వంద్వ పౌరసత్వం

5.4.14. నిరోధ సమతుల్య పద్ధతి (Principle of Checks and Balances)

5.5. రాజ్యాంగ సవరణ

5.6. సారాంశము

5.7. నమూనా ప్రశ్నలు

5.8. చదువదగిన గ్రంథాలు

## 5.1. పరిచయము :

స్వాతంత్ర్య పోరాటానంతరం దేశంలోని మేధావులందరు కలిసి భవిష్యత్తులో ఎటువంటి ప్రభుత్వం వుండాలో నిర్ణయించుకొని 1787, మే 25వ తారీఖున ఫిలడెల్ఫియాలో సమావేశం అయి 16 వారాల చర్చల అనంతరం 1787, సెప్టెంబరు 17న రాజ్యాంగాన్ని రచించి కాన్ఫెడరేషన్ ప్రభుత్వమునకు సమర్పించినారు. దీనిని ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రభుత్వమునకు మొదటి ప్రెసిడెంటు ఎన్నిక అయిన తరువాత అనగా మార్చి 4, 1789 నుండి రాజ్యాంగము అమలులోకి వచ్చింది.

## 5.2. నూతన రాజ్యాంగ నిర్మాణానికి దారి తీసిన పరిస్థితులు :

అమెరికా స్వాతంత్ర్య సమరానంతరం ఏర్పడిన ఆర్థిక ఇబ్బందుల వలన దేశంలో అసంతృప్తి పెరిగింది. ముఖ్యంగా రైతులలో ఇది ఎక్కువగా ఉన్నది. పండించిన సరకులు మార్కెట్‌లో గుట్టలుగా పడి వుండేవి. అప్పులపాలైన రైతులు తమ ఆస్తుల స్వాధీనపు విషయంలోనూ, అప్పు తీర్చకపోతే జైలు శిక్ష విధించే విషయంపైనను ఆందోళన చేశారు. వీటి నుండి తమకు రక్షణ కావాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. 1786, వేసవి కాలంలో పలు రాష్ట్రాలలోని ప్రజలు సభలు, సమావేశాలు జరిపి తమ రాష్ట్రాలలో సక్రమమైన పాలనా సంస్కరణల కోసం అలజడి చేశారు. దీని వలన ఎందరో రైతులు అప్పులకు గురి అయి, ఆస్తులు పోయి జైలు శిక్షలు అనుభవించారు.

1786లో మెసాచుసెట్స్ రైతులు, డేనియల్‌షేస్ అనే మాజీ సైనిక దళాధిపతి నాయకత్వం క్రింద, మరల రాష్ట్రాలకు ఎన్నికలు జరిగే వరకు అప్పుల దావాలపై తీర్పులివ్వకుండా వుండేందుకు గ్రామీణ ప్రాంతాలలోని న్యాయస్థానాలను మూసి వేయించడానికి ప్రయత్నించారు. అంతేగాకుండా సింగ్ ఫీల్డ్‌లోని ప్రభుత్వ ఆయుధాగారంపై దాడి చేశారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రతిఘటించింది. కాని తిరుగుబాటుదారులకు పనిముట్లే వారి ఆయుధాలు కావటం వలన సాయుధ బలాలు వారిని సులభంగా అణచివేశాయి. ఈ తిరుగుబాటు ప్రభావం వలననే శాసనసభ, రైతుల కష్టాలను చర్చించి వాటిని తీర్చడానికి ప్రయత్నాలు చేసింది.

ఈ సందర్భంగా రాష్ట్రాల మధ్య అనుబంధం "వట్టి ఇసుకతో వేసిన త్రాడు" వంటిది అని జార్జి వాషింగ్‌టన్ అన్నాడు. ఈ తిరుగుబాటు వలన కాంగ్రెస్ ప్రతిష్ఠ బాగా దెబ్బతింది. పటోమక్ నది మీద పడవలు నడిపే హక్కు విషయమై మేరీలాండ్‌కీ, వర్జీనియాకీ మధ్య వివాదం ఏర్పడినది. ఈ వివాదాన్ని పరిష్కరించటానికి 1786లో అయిదు రాష్ట్రాల ప్రతినిధులు ఎనీపాలిస్‌లో సమావేశం అయినారు. ఇది వ్యాపారానికి సంబంధించిన సమస్య అది ఇతర సమస్యలతో ముడిపడి ఉందనీ, ఇంత క్లిష్ట సమస్యను ఈ అల్ప ప్రాతినిధ్యం గల సమావేశం పరిష్కరించలేదని అలెగ్జాండర్ హామిల్టన్ ఈ సమావేశంలో వాదించి మిగతా వారిని కూడా ఒప్పించినాడు. ఇంకా ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాలు కేంద్రానికి ప్రతినిధులను పంపి "ఫెడరల్ ప్రభుత్వ రాజ్యాంగమును" యూనియన్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఒక తీర్మానం కూడా జారి చేశాడు. కాని ఈ చర్యను కాంటినెంటల్ కాంగ్రెస్ వ్యతిరేకించింది. తరువాత వర్జీనియా రాష్ట్ర ప్రజలు తమ ప్రతినిధిగా జార్జి వాషింగ్టన్‌ను ఎన్నుకున్నారు. తరువాత కొద్ది నెలల్లో రోడ్ ఐలెండ్ రాష్ట్రమునకు తప్ప మిగిలిన రాష్ట్రాలకు ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఎన్నికలు జరిగాయి.

## 5.3. నూతన రాజ్యాంగ నిర్మాణం :

ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో వాణిజ్య సమస్యలేగాక, రాజ్యాంగాన్ని, ప్రభుత్వ స్వరూపాన్ని గూర్చి కూడా చర్చించడం మంచిదని నిర్ణయించుకొని 1787లో ఫిలడెల్ఫియాలో అన్ని రాష్ట్రాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ సమావేశాన్ని కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఆమోదించి దీనికి హాజరు కావలసినదిగా పదమూడు రాష్ట్రాలకు ఆహ్వానాలు పంపింది.

**5.3.1. ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్ (1787 మే 25, 1787 సెప్టెంబరు 17) :** ఈ సమావేశంలో రోడ్ ఐలాండ్ రాష్ట్రం మినహా మిగిలిన పన్నెండు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ రాజ్యాంగ పరిషత్ సభ్యులను "రాజ్యాంగ పితలు" (Fathers of Constitution) అని పిలిచారు. ఇందులో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో వలస ప్రభుత్వంలోనూ, రాష్ట్ర పరిపాలనలోనూ, కాంగ్రెస్‌లోనూ, కోర్టులలోనూ, యుద్ధ రంగంలోనూ, అనుభవం గడించిన నాయకులు పాల్గొన్నారు.

ఈ సమావేశానికి 55 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో చాలా మంది ధనిక, కులీన వర్గానికి, వర్తక వర్గానికి చెందినవారు. వీరిలో 81 సంవత్సరాల వయోవృద్ధుడైన బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఒకడు. మిగిలిన వారందరూ యువకులు లేదా మధ్య వయస్కులు; సరాసరి 42 సంవత్సరాలు వయస్సు కలవారు. ఈ సమావేశంలో ప్యాట్రిక్ హెన్రీ లాంటి తీవ్రవాదులు పాల్గొనలేదు. దీనిలో వర్జీనియా రాష్ట్రం నుండి జేమ్స్ మ్యాడిసన్ మరియు జార్జి మేసన్ పాల్గొన్నారు. జేమ్స్ మ్యాడిసన్ రాజనీతిజ్ఞుడు, కార్యవాది, రాజకీయ శాస్త్రంలో నిష్ణాతుడు. ఇతడు ఏ విషయాన్ని గురించైనా క్షుణ్ణంగా పరిశీలించి అధికారికంగా చెప్పగలడు. పెన్సిల్వేనియా రాష్ట్రం నుండి గౌవర్నియర్ మారిస్ మరియు జేమ్స్ విల్సన్ పాల్గొన్నారు. గౌవర్నియర్ మారిస్ సమర్థుడు, సాహసం గలవాడు, జాతీయ ప్రభుత్వం యొక్క ఆవశ్యకతను స్పష్టంగా గుర్తించాడు. విల్సన్ జాతీయతను పెంపొందించడానికి నిర్విరామంగా కృషి చేసినాడు. మెసాచుసెట్స్ నుండి రూఫస్ కింగ్ మరియు ఎల్‌బ్రిడ్జ్‌గెరీ పాల్గొన్నారు. వీరిద్దరూ యువకులూ, సమకాలీన రాజకీయాల మీద అనుభవం గల సమర్థులు. న్యూయార్క్ రాష్ట్రం నుండి అలెగ్జాండర్ హ్యామిల్టన్, డెలావేర్ నుండి జాన్‌డికిన్‌సన్ ఈ సమావేశానికి హాజరైనారు. ఈ సమావేశానికి హాజరు కాని వారిలో విప్లవంతో ప్రముఖపాత్ర వహించిన థామస్ జఫర్‌సన్ ఒకడు. ఇతడు ఆ సమయానికి ప్రభుత్వ ప్రతినిధిగా ఫ్రాన్సులో ఉన్నాడు. జాన్ ఆడమ్స్ ఇంగ్లాండ్‌లో మరియు జాన్ జే స్పెయిన్‌లో ఉండటం వలన వారు ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. ఈ సమావేశం రాజ్యాంగ పరిషత్తుకు అధ్యక్షునిగా గొప్ప అనుభవశాలి సమర్థుడు అయిన జార్జి వాషింగ్టన్‌ను ఎన్నుకొన్నది. ఈ పరిషత్ నాలుగు నెలల కాలంలో (1787 మే 25 నుంచి 1787 సెప్టెంబరు 7) నూతన రాజ్యాంగమును రూపొందించింది. వివిధ ప్రభుత్వ, రాజ్యాంగ స్వరూప, సిద్ధాంతాల మీద చక్కని అవగాహన కలిగిన జేమ్స్ మ్యాడిసన్ రాజ్యాంగ నిర్మాణంలో అద్వితీయమైన పాత్ర నిర్వహించినాడు. అందుకే అతనిని " అమెరికన్ రాజ్యాంగ పిత (Father of American Constitution) అని అంటారు.

## 5.4. నూతన రాజ్యాంగ లక్షణములు :

అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగము ప్రపంచ రాజ్యాంగములన్నింటి కన్నా భిన్నమైనది. ప్రజాస్వామ్య రాజ్యాంగాలలో మొదటిది.

**5.4.1. లిఖిత రాజ్యాంగము :** ఇది లిఖిత రాజ్యాంగము. దేశంలోని 55 మంది ప్రముఖులు 12 రాష్ట్రాల ప్రతినిధులుగా 1787 మే 25న ఫిలడెల్ఫియాలో సమావేశం అయి రాజ్యాంగాన్ని 16 వారాలలో రచించారు. దీనిలో ఏడు ప్రకరణములు (Articles) ఉన్నాయి. ఈ రాజ్యాంగానికి నేటి వరకు (మే 7, 1992) 27 సవరణలు మాత్రమే జరిగాయి.

**5.4.2. దృఢ రాజ్యాంగం :** ఇది ప్రపంచ రాజ్యాంగాలన్నింటిలో ధృఢమైనది. దీనిని సవరించటం అంత సులభం కాదు. రాజ్యాంగమును సవరించుటకు రాష్ట్రాల లెజిస్లేటివ్ అసెంబ్లీలో 2/3వంతు మెజారిటి లేక 2/3 వంతు సభ్యుల యొక్క ఆమోదం రెండు సభలలో వుండాలి.

**5.4.3. శాశ్వత రాజ్యాంగం :** ఈ రాజ్యాంగాన్ని రచించి ఇప్పటికి రెండు వందల సంవత్సరములు అవుతుంది. నాటి నుండి నేటి వరకు మార్పులను తట్టుకొని కాలాను గుణ్యంగా అభివృద్ధి చెందుతుంది.

**5.4.4. సంక్షిప్త రాజ్యాంగం :** ఈ రాజ్యాంగం ప్రపంచ రాజ్యాంగములన్నింటిలో సంక్షిప్తమైనది. దీనిలో ఏడు ప్రకరణములు (7 Articles) మాత్రమే వున్నాయి. రాజ్యాంగాన్ని చదువుటకు 20 నిమిషములు పడుతుంది. ఈ రాజ్యాంగాన్ని చాలా మంది రాజకీయవేత్తలు కొనియాడారు. ప్రొ॥ జింక్ (Zink) "సంక్షిప్తత అనేది అమెరికా రాజ్యాంగానికి వున్న ముఖ్య లక్షణం" అని అన్నారు.

**5.4.5. సమాఖ్య రాజ్యాంగం :** ఇది సమాఖ్య రాజ్యాంగం. కేంద్ర ప్రభుత్వం సమాఖ్య విధానం ద్వారా ఏర్పడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార పంపిణీ చేయబడింది. కాని రాష్ట్రాలు తమ అధికారాలను చాలా పరిమితంగా మాత్రమే కేంద్రానికి దత్తత చేశాయి. ఈ రాజ్యాంగములో రెండు ప్రభుత్వాల అధికారాలను గురించి విపులంగా వివరించినారు. అవి : 1) కేంద్ర ప్రభుత్వం, 2) రాష్ట్ర ప్రభుత్వం.

దేశ రక్షణ, విదేశీ వ్యవహారములు, విదేశీ వాణిజ్యం, అంతర్ రాష్ట్ర వాణిజ్యము, పన్నులు విధించు అధికారము మొదలగునవి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వున్నాయి. ప్రాథమిక విద్య, ఆరోగ్యము, రహదారులు, వివాహాలు, విడాకులు, పౌరహక్కుల రక్షణ, స్థానికావసరాలకు సంబంధించిన విషయాలు రాష్ట్రముల అజమాయిషిలో వున్నాయి. కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధిస్తే వాటిని రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. అవశేషాదికారములు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో వుంటాయి.

**5.4.6. రాజ్యాంగ ఆధిక్యత :** దేశంలో రాజ్యాంగమే అత్యున్నత న్యాయస్థానము. దీనికి అందరు కట్టుబడి వుండాలి. దీనిని కేంద్ర ప్రభుత్వముగాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని అతిక్రమించుటకు వీలులేదు. న్యాయమూర్తులు కూడా రాజ్యాంగము చెప్పినట్లే నడుచుకోవాలి.

**5.4.7. ప్రజాసార్వభౌమాధికారం :** అమెరికా రాజ్యాంగము ప్రజాసార్వభౌమాధికారానికి అంకితమైనది. ఈ విషయం రాజ్యాంగ ప్రవేశికలో చెప్పబడినది. "సంయుక్త రాష్ట్రాల ప్రజలమైన మేము కలసి పరిపూర్ణ సమాఖ్యగా రూపొందుటకు, న్యాయస్థానమును స్థాపించుటకు, అందరికి సమాన న్యాయమును అందించుటకు, ఆంతరంగిక శాంతి సౌభాగ్యములను కల్పించుటకు, ఉమ్మడి రక్షణను, సాధారణ సంక్షేమమును అభివృద్ధి చేయుటకు, మాకు, భావితరముల వారికి, స్వేచ్ఛాశీస్సులు సమకూర్చుటకు ఈ రాజ్యాంగమును రూపొందించు ఏర్పాటు చేసికొంటిమి" అని రాజ్యాంగ నిర్మాతలు అన్నారు.

ఈ అధికారాలన్ని అధ్యక్షుడు, కాంగ్రెస్ మరియు సెనేట్‌లకు ప్రజల నుండి వచ్చాయి.

**5.4.8. లౌకిక రాజ్యం :** రాజ్యాంగము ఏ మతానికి ప్రత్యేకమైన హోదానివ్వలేదు. రాజ్య విధానాలు వేరు, మతము వేరు. దేశ రాజకీయాలలో మత ప్రసక్తి వుండదు. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో గాని, విద్యాలయాలలో ప్రవేశానికి గాని మతము ప్రతిబంధకము కాదు. ప్రభుత్వం దృష్టిలో అన్ని మతాలు సమానమే. దేశంలోని ప్రజలందరికి రాజ్యాంగం మతపరమైన స్వేచ్ఛను ప్రసాదించింది.

**5.4.9. హక్కుల బిల్లు** (Bill of Rights) **:** వ్యక్తిగతమైన హక్కులను కాపాడుటకు రాజ్యాంగములో 1791లో హక్కుల బిల్లు చేర్చబడింది. ఈ ప్రాథమిక హక్కులు దేశంలోని ప్రజలందరికి రాజ్యాంగం ద్వారా సంక్రమిస్తాయి. వీటికి న్యూయార్క్‌లో జరిగిన అమెరికా ప్రథమ కాంగ్రెస్ సమావేశం (1791)లో పది సవరణలు చెయ్యబడ్డాయి. "హక్కుల బిల్లు" అనే పేరుతో ఇవి రాజ్యాంగంలో చేర్చబడ్డాయి. అవి.

1) ఒక మతాన్ని బలపరచడానికి గాని లేదా మత స్వాతంత్ర్యాన్ని నిరోధించడానికి లేదా వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వాతంత్ర్యాన్ని భగ్న పరచడానికి గాని, శాంతియుతంగా ప్రజలు సమావేశాలు జరుపుకొని తమ కష్టాలను ప్రభుత్వానికి నివేదించుకోలేకుండా చేయటానికి గాని కాంగ్రెస్ ఎట్టి చట్టాన్ని చెయ్యరాదు.

2) స్వతంత్ర రాజ్య భద్రతకు సైన్యం అవసరం గనుక సక్రమ పద్ధతులలో ప్రజలు ఆయుధాలను కలిగి వుండే అధికారాన్ని భగ్నపరచరాదు.

3) ఇంటి యజమాని అనుమతి లేనిదే శాంతికాలంలో సైనికులెవరినీ యింటిలో ఉంచరాదు. యుద్ధ కాలంలో మాత్రం చట్టాన్ని అనుసరించి మాత్రమే సైనికులను గృహస్థుల ఇళ్ళల్లో ఉంచవచ్చు.

4) అకారణంగా వ్యక్తులను, వారి యిళ్ళను, పత్రాలను, సోదా చెయ్యరాదు, స్వాధీన పరచుకోరాదు, ఈ విషయాలలో వారి హక్కులకు భంగం కలుగచేయరాదు, ఏ ప్రదేశాన్ని సోదా చెయ్యాలో, ఏ వ్యక్తిని, ఏ పత్రాన్ని స్వాధీన పరచుకోదలచారో అందులో ఖచ్చితంగా పేర్కొనాలి.

5) గ్రాండ్ జూరీ తీర్పులేనిదే ఏ వ్యక్తిపై కూడా పెద్ద క్రిమినల్‌నేరారోపణ చేసిగాని, హత్యా నేరారోపణ చేసిగాని శిక్ష విధించరాదు. సైన్యాలలోని వారు జరిపిన నేరాల విషయంలో, దేశానికి ప్రమాదకర పరిస్థితి ఏర్పడిన సందర్భంలో సైనికుల విషయంలో ఇది వర్తించదు. ఒకే నేరానికి ఏ మనిషికి రెండుసార్లు శిక్ష విధించరాదు, తనపై గల క్రిమినల్ కేసును ఒప్పుకు తీరాలని ఎవరి మీద ఒత్తిడి చేయరాదు, చట్టాన్ని అనుసరించి తప్ప, ఎవరి ప్రాణానికి, స్వాతంత్ర్యానికి, ఆస్తిపాస్తులకు భంగం కలిగించరాదు, తగిన పరిహారం ఇవ్వనిదే ప్రయివేటు ఆస్తులను ప్రభుత్వం వశపరచుకోరాదు.

6) క్రిమినల్ ప్రాసిక్యూషన్‌లలో సత్వరమే బహిరంగ విచారణ జరగాలని కోరడానికి ముద్దాయిలకు హక్కు కలదు. నిష్పాక్షికంగా కేసుల విచారణ జరపాలి. నేరం ఏ ప్రాంతంలో జరిగినదో ఆ ప్రాంతాన్ని చట్టరీత్యా నిర్ధారణ చేసి, అక్కడి జూరీలు మాత్రమే విచారణ జరపాలి. ముద్దాయికి అతడు చేసిన నేరం, దాని స్వభావాన్ని, నేరారోపణకు గల కారణాలను తెలియజేయాలి. అతడి నేరాన్ని ఋజువు చెయ్యడానికి సాక్షులుండాలి. అతడి తరుపున కూడా సాక్షులుండగల పద్ధతిని విధిగా అమలు జరిపి, అతడికి ప్రభుత్వం తరపున న్యాయవాదుల సహాయం లభింప చెయ్యాలి.

7) సివిల్ నేరాలలో 20 డాలర్లు విలువకు పై బడిన దావాల విషయంలో జూరీ ద్వారా విచారణ జరిపించాలి. ఒక జూరీ విచారణలో తేలిన వాస్తవాన్ని గురించి అమెరికాలోని ఏ కోర్టు వారు, న్యాయ చట్టాన్ని అనుసరించి తప్ప, పునర్విచారణ జరపరాదు.

8) ముద్దాయిని తాత్కాలికంగా విడుదల చెయ్యడానికి మితిమీరిన జామీనును కోరరాదు, మితిమీరిన జరిమానాలను విధించరాదు. అతి క్రూరమైన, నిర్దాక్షిణ్యమైన శిక్షలను విధించరాదు.

9) ప్రజలకు గల కొన్ని హక్కులను, రాజ్యాంగ చట్టంలోని సూత్రాలను కాపాడాలి. ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి వాటిని భగ్నపరచరాదు.

10) రాజ్యాంగ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి కేటాయించబడని హక్కులు రాష్ట్ర ప్రభుత్వాలకు చెందాలి. రాష్ట్ర ప్రభుత్వాలకు చెందరాదంటూ నిషేధించబడని హక్కులు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఉంచుకోవచ్చు లేదా అవి ప్రజలకు సంక్రమించాలి.

ఈ పది సూత్రాలను రాజ్యాంగంలో చేర్చడం ద్వారా అమెరికా ప్రజలకు మేలు జరిగింది. అమెరికా ప్రజల లక్ష్యాలకు ఈ రాజ్యాంగ చట్టం, ఈ హక్కుల బిల్లు అనేవి మూల స్తంభాలు. వాక్ స్వాతంత్ర్యం, మత స్వాతంత్ర్యం, అన్యాయంగా నేరారోపణ చెయ్యబడకుండా రక్షణ, న్యాయస్థానాల ద్వారా విచారణ పొందగల హక్కు - ఇవన్నీ అమెరికన్ ప్రజలకు ఇవ్వబడ్డాయి.

ఈ హక్కులన్నియు కొన్ని పరిమితులతో ప్రభుత్వ ఆధీనంలో వుంటాయి. ఈ హక్కుల విషయంలో దేశంలోని పౌరులకు ఏ విధమైన ఆటంకం కలిగినను, పౌరుడు నిర్భయంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు.

**5.4.10. అధ్యక్ష తరహా పద్ధతి :** రాజ్యాంగం ప్రకారం అధ్యక్షునకు సర్వోన్నత అధికారాలు ఇవ్వబడ్డాయి. కార్యనిర్వాహఖ శాఖకు అధ్యక్షుడు అధిపతి. ఇతనిని నాల్గు సంవత్సరముల కొకసారి ప్రజలు నేరుగా ఏన్నుకొంటారు. రాష్ట్రములలో కూడా గవర్నర్లను ప్రజలే నేరుగా ఎన్నుకొంటారు.

**5.4.11. అధికార పృథక్కరణ :** మాంటెస్క్యూ అధికార పృథక్కరణ సిద్ధాంతాన్ని సాధ్యమైనంత వరకు రాజ్యాంగంలో పొందుపరచినారు. రాజ్యాంగ పరిషత్ సమావేశానికి హాజరైన వారందరు 'బాలెన్స్ ఆఫ్ పవర్' (Balance of Power) పై నమ్మకం వున్నవారు. దీని వలన ప్రభుత్వాన్ని మూడు సమాన ప్రతిపత్తి గల అంగాలుగా - వీటి మధ్య పరస్పర సమన్వయం ఉండే విధంగా విభజించినారు. అవి శాసన నిర్మాణ శాఖ, కార్యనిర్వాహక శాఖ (పరిపాలనా నిర్వహణ శాఖ) మరియు న్యాయశాఖ. వీటిలో దేనికీ సంపూర్ణాధికారం సంక్రమించకూడదు. ఇవి ఒక దాని మీద ఒకటి ఆధారపడి వుండాలి. అప్పుడు ప్రభుత్వం సమర్థవంతంగా పని చేయగలుగుతుంది అని రాజ్యాంగ నిర్మాతలు అభిప్రాయపడినారు.

**5.4.11.1. శాసన నిర్మాణ శాఖ :** శాసన నిర్మాణ శాఖను కాంగ్రెస్ అని పిలుస్తారు. దీనిలో రెండు సభలు వున్నాయి.

**5.4.11.1.1. సెనేట్ (ఎగువ సభ) :** ఇది శాశ్వత సభ. ఇది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. దీనిలోని సభ్యులలో మూడవ వంతు మంది రెండేళ్ళ కొకసారి ఎన్నుకోబడతారు. ఈ సభలోని సభ్యుల పదవీకాలం ఆరు సంవత్సరాలు, ప్రతి రెండు సంవత్సరముల కొకసారి 1/3 వంతు సభ్యులు పదవీ విరమణ చేస్తారు. న్యూజెర్సీ లాంటి చిన్న రాష్ట్రం అయినా, న్యూయార్క్ లాంటి పెద్ద రాష్ట్రాలయినా రాష్ట్రానికి ఇద్దరు సెనేటర్లు మాత్రమే ఉంటారు. సెనేటర్‌లను, రాష్ట్ర శాసనసభలు ఎన్నుకొంటాయి. వీరి దీర్ఘకాల సభ్యత్వం వలన సెనేట్, దిగువ సభకంటే ఎక్కువ అధికారాలు కలిగి వుంటుంది. దీనిలో అనుభవజ్ఞులు, మేధావులు ఉంటారు. విదేశాలతో చేసుకొనే సంధులను, ఒడంబడికలను సెనేట్‌లోకి సభ్యులు మూడింట రెండు వంతుల మంది ఆమోదించాలి. అధ్యక్షుడు చేసే ఉన్నత పదవుల నియామకాలు కూడా సెనేట్ ఆమోదం పొందాలి.

**5.4.11.1.2. ప్రజా ప్రతినిధుల సభ** (House of Representatives) **:** దీనిని కాంగ్రెస్‌లో దిగువసభ అని పిలుస్తారు. దీనిలోని సభ్యులను రాష్ట్ర జనాభా నిష్పత్తిలో ప్రజలు ప్రత్యక్ష ఎన్నిక పద్ధతి ద్వారా ఎన్నుకుంటారు. వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలు. శాసన నిర్మాణంలో ఈ సభ ముఖ్యపాత్ర వహిస్తుంది.

**5.4.11.2. కార్య నిర్వాహఖ శాఖ (పరిపాలనా శాఖ) :** కార్యనిర్వాహఖ శాఖకు అధ్యక్షుడు (President) అధిపతి. కాంగ్రెసు చేసిన శాసనాలను ప్రభుత్వ కార్యనిర్వాహఖ శాఖ అమలు జరుపుతుంది. కాంగ్రెసు విధించే పన్నులను ఇది వసూలు చేస్తుంది. శాసనాలన్నీ సక్రమంగా అమలు జరిగేటట్టు చూడడం దేశాధ్యక్షుని కర్తవ్యం. ఒకసారి ఎన్నికయిన అధ్యక్షుడు నాలుగు సంవత్సరాల వరకు అధికారంలో వుంటాడు. ఇతనిని ప్రజలే నేరుగా ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. అధ్యక్షుడు, కాంగ్రెసు చేతిలో కీలుబొమ్మగా ఉండడు. కాంగ్రెసు ఆమోదించిన ప్రతి శాసనాన్ని అధ్యక్షుని ఆమోదానికి పంపవలసి వుంటుంది. అతడు ఆమోదించి దాని మీత సంతకం చేసిన తరువాతనే అది శాసనం అవుతుంది. అతడు ఆమోదింపదలచుకోని శాసనాలను గురించి పునరాలోచించవలసిందిగా వాటిని కాంగ్రెసుకు త్రిప్పి

పంపి వేయవచ్చు. అప్పుడు కాంగ్రెసు మూడింట రెండు వంతుల ఓట్లతో దానిని తిరిగి ఆమోదిస్తే, ప్రెసిడెంటు సంతకం అవసరం లేకుండానే అది శాసనం అవుతుంది. ఇతడు కాంగ్రెస్ చర్చలలో పాల్గొనడు, కాంగ్రెస్‌ను రద్దు చేయలేడు.

**5.4.11.3. న్యాయశాఖ :** సుప్రీంకోర్టు, కాంగ్రెసు నెలకొల్పే ఇతర న్యాయ సంస్థలు ఈ శాఖ పరిధి క్రిందకు వస్తాయి. జాతీయ, అంతర్ రాష్ట్ర వివాదాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు ఇస్తుంది. సుప్రీంకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తిని మరియు ఎనిమిది మంది న్యాయమూర్తులను దేశాధ్యక్షుడు (President) సెనేట్ అనుమతితో నియమిస్తాడు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు అంతిమ నిర్ణయాలు. రాజ్యాంగమును రక్షించుట, దేశంలోని పౌరులందరికి సమాన ప్రతిపత్తిగల న్యాయాన్ని అందించటం న్యాయశాఖ బాధ్యత. రెండుగాని అంతకన్నా ఎక్కువ రాష్ట్రాల మధ్యగాని, వ్యక్తులకూ, రాష్ట్రాలకూ మధ్యగాని ఏర్పడే వివాదాలలో తీర్పు చెప్పే అధికారం న్యాయశాఖకు వుంది. ఇది ఒక్క మహాభియోగ తీర్మానం (Impeachment) తప్ప మిగిలిన అన్ని నేరాలను విచారించవచ్చు. ఏ శాసనమైనా రాజ్యాంగ విరుద్ధమా కాదా అని నిర్ణయించే అధికారం న్యాయస్థానానికి వుంది. సుప్రీం కోర్టు అధికారాలలో న్యాయ సమీక్షాధికారం (Impeachment) మహత్తరమైనది.

**5.4.12. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం :** రాజ్యాంగం ప్రజల కొరకు నిర్మించబడింది. రాజ్యాంగములోని రెండు సభలు - సెనెట్ మరియు ప్రజా ప్రతినిధుల సభ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. దేశాధ్యక్షుని మరియు రాష్ట్ర గవర్నర్‌లను ప్రత్యక్ష ఎన్నిక పద్ధతి ద్వారా ప్రజలే నేరుగా ఎన్నుకుంటారు.

**5.4.13. ద్వంద్వ పౌరసత్వం (Double Citizenship) :** రాజ్యాంగం దేశ ప్రజలకు ద్వంద్వ పౌరసత్వమును కలుగజేసింది. ఒక అమెరికా పౌరుడు దేశమునకు పౌరుడేగాక, తాను నివసించుచున్న రాష్ట్రానికి కూడా పౌరుడే.

**5.4.14. నిరోధ సమతుల్య పద్ధతి (Principle of Checks and Balances) :** సమాఖ్య రాజ్యాంగాన్ని అనుసరించి జాతీయ ప్రభుత్వంలో కార్యనిర్వాహఖ శాఖ, శాసన నిర్మాణ శాఖ, న్యాయశాఖ అనే మూడు శాఖలు వున్నాయి. వీటిలో ఏ శాఖ ఎక్కువ అధికారములు కలిగి, నియంతృత్వ ధోరణిలో వ్యవహరించకుండా నిరోధ సమతుల్య పద్ధతిని ప్రజాస్వామ్యాధికారాల రక్షణకై రాజ్యాంగ నిర్మాతలు ప్రవేశపెట్టినారు. దీనినే నిరోధ సమతుల్య పద్ధతి అంటారు. ఉదా॥ ఎ) కాంగ్రెస్ ఆమోదించిన బిల్లులను అధ్యక్షుడు సంతకం పెట్టకుండా తిరిగి పంపివేయవచ్చును. ఉన్నత ప్రభుత్వోద్యోగులను నియమించు అధికారము అధ్యక్షునికి వున్నప్పటికిని వారి నియామకములను సెనేట్ ఆమోదించవలెను. బి) అధ్యక్షుడు సెనేట్ యొక్క ఆమోదంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తులను నియమించును. సి) న్యాయశాఖ, కాంగ్రెస్ చేసిన శాసనాలు, అధ్యక్షుడు తీసుకున్న చర్యల, ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా వుంటే అవి శాసన విరుద్ధమని ప్రకటిస్తుంది. ఈ విధంగా ఇది ఒక శాఖ ఇంకొక శాఖ యొక్క నియంతృత్వ ధోరణిని అరికట్టుటకు, వ్యక్తి స్వేచ్ఛకు ఉద్దేశింపబడినది.

## 5.5. రాజ్యాంగ సవరణ :

మారుతున్న కాలానికి అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరించవలసిన అవసరం ఏర్పడినపుడు అటువంటి సవరణలు చేయడానికి రాజ్యాంగం చివరి భాగంలో కొన్ని అంశాలు చేర్చినారు. అవి : కాంగ్రెసు ఉభయ సభలలోను కలిపి మూడింట రెండువంతుల సభ్యులు ఆమోదించిన యెడల రాజ్యాంగానికి కాంగ్రెసు అటువంటి సవరణను ప్రతిపాదించవచ్చును. లేక రాష్ట్ర శాసనసభలలో మూడింట రెండువంతుల సభ్యులు ఆమోదం పొందినప్పుడు మాత్రమే సవరణ జరుగుతుంది. కాని రాజ్యాంగము ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎలా కావాలంటే అలా మలచుకొనడానికి వీలుగా రచింపబడినందు వల్లను, కాంగ్రెసు, న్యాయస్థానాలు దానిలోని సూత్రాలను నిర్వచించడానికి అవకాశం ఉన్నందువల్లను రాజ్యాంగాన్ని ఎక్కువసార్లు సవరించవలసిన అవసరం లేకుండా పోయింది. అందుకే ఇప్పటివరకు 27 సవరణలు మాత్రమే జరిగినాయి.

## 5.6. సారాంశము :

అమెరికా స్వాతంత్ర్యం తరువాత ఏర్పడిన ఆర్థిక ఇబ్బందుల వలన దేశంలో అనేక ప్రాంతాలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటులు చేలరేగినాయి. ఇటువంటి పరిస్థితులలో భవిష్యత్తులో దేశంలో తిరుగుబాటులు నివారించేందుకు ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినారు. ఈ ప్రభుత్వము ఏ విధంగా వుండాలి, ఎటువంటి అధికారాలు కలిగివుండాలి అని దేశంలోని మేధావులందరు కలసి ప్రభుత్వాన్ని నడపుటకు ఒక రాజ్యాంగం అవసరం అని గుర్తించి 1787లో ఫిలడెల్ఫియాలో సమావేశం అయినారు. దీనికి జార్జి వాషింగ్టన్ అధ్యక్షుడు. ఈ రాజ్యాంగ పరిషత్ 4 నెలల కాలంలో నూతన రాజ్యాంగాన్ని రూపొందించింది. దీనిలో 7 ప్రకరణలు వున్నాయి. ఇది ధృఢ మరియు సంక్షిప్త రాజ్యాంగం. దీనిలో దేశంలోని ప్రజల వ్యక్తిగతమైన హక్కులను కాపాడుటకు గాను 1791లో పది సవరణల ద్వారా "బిల్ ఆఫ్ రైట్స్" చేర్చబడ్డాయి. ప్రభుత్వశాఖల మధ్య ఒకదాని మీద ఒకటి అధికారం చెలాయించకుండా వుండేందుకు మాంటెస్క్యూ రూపొందించిన అధికార పృథక్కరణ విధానమును ప్రవేశపెట్టినారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అవసరం వచ్చినప్పుడు రాజ్యాంగాన్ని సవరించుటకు చివరి భాగంలో రాజ్యాంగ సవరణ పద్ధతులను వివరించినారు. ఈ రాజ్యాంగము అన్ని రాష్ట్రాలకు ఉపయోగపడదని, కొంత మంది దీన్ని వ్యతిరేకించినారు. కాని అధ్యక్ష ప్రభుత్వ విధానము, పరుష రాజ్యాంగము, ప్రజాసార్వభౌమాధికారం వున్నందున నేటికిని అమెరికా సంయుక్త రాష్ట్రములందు ప్రజాస్వామ్య వ్యవస్థ చెక్కుచెదరక నిలిచి వున్నది. రాజ్యాంగమును గురించి నికొలస్ అను రాజకీయ విశ్లేషకుడు "అమెరికా రాజ్యాంగము ఆ దేశ చరిత్రతో అంతర్లీనమైన సంబంధం కలిగి వున్నది" అని కొనియాడారు. మరొక రాజకీయ విశ్లేషకుడు రాజ్యాంగమును గురించి "అమెరికా రాజ్యాంగము నైతిక మరియు అనుభవ పూర్వకమైన అంశాలు కలిగివున్న ఒక ప్రత్యేకమైన కలగలుపు" అని అన్నారు.

## 5.7. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)

1. నూతన రాజ్యాంగ నిర్మాణం జరిగిన విధానాన్ని వివరించండి.
2. నూతన రాజ్యాంగ ప్రధాన లక్షణాలేవి ?

### 2) లఘు వ్యాసరూప ప్రశ్నలు (15 మార్కులు)

1) నూతన రాజ్యాంగ నిర్మాణమునకు దారి తీసిన పరిస్థితులేవి ?
2) ప్రభుత్వ శాఖల మధ్య అధికార విభజన జరిగిన తీరును తెల్పండి.

### 3) లఘుటీక ప్రశ్నలు (5 మార్కులు)

1) ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్
2) హక్కుల బిల్లు (Bills of Rights)
3) రాజ్యాంగ సవరణ విధానం.

## 5.8. చదువదగిన గ్రంథాలు :

1. రామచంద్రరావు సి.వి. - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర (1773-1865)
2. సింగరాచార్య బి.వి, - అమెరికా సంయుక్త రాష్ట్రాల సంగ్రహ చరిత్ర

3. స్టీఫన్ విన్సెంట్ భనే - అమెరికా

4. Parkes H.B. - The United States of America - A History

5. Wood Grey - An Outline of American History

6. Allan Nevins and Henry Steele Commager - A Short History of the United States

7. Thomas A. Bailey - - The American Pageant - A History of the Republic

8. Richard N. Cursent, Harry Williams T, and Frank Freidel - American History - A Survey

- డా॥ ఓ. సాంబయ్య

పాఠం - 6

# జార్జి వాషింగ్టన్ (1789-1797)

## 6.0. లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాలు ప్రథమ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన జార్జి వాషింగ్టన్ పరిపాలన విధానం, అలెగ్జాండర్ హేమిల్టన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల గురించి తెలుసుకోవడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


6.1. పరిచయము

6.2. వాషింగ్టన్ జీవితం

6.3. అధ్యక్ష కార్యదర్శి మండలి

6.4. న్యాయశాఖా చట్టము

6.5. ప్రాథమిక హక్కులు

6.6. మొదటి సుంక చట్టము

6.7. ఆర్థిక సంస్కరణలు - హామిల్టన్

- 6.7.1. అలెగ్జాండర్ హామిల్టన్ ఆర్థిక విధానాలు
- 6.7.2. రుణాలు
- 6.7.3. జాతీయ బ్యాంకు స్థాపన
- 6.7.4. విస్కీ మీద పన్ను
- 6.7.5. రక్షణ పన్ను
- 6.7.6. సమీక్ష

6.8. రాజకీయ పార్టీల అవతరణ

6.9. వాషింగ్టన్ విదేశాంగ విధానము

- 6.9.1. ఫ్రాన్స్, బ్రిటన్‌ల మధ్య యుద్ధం - వాషింగ్టన్ తటస్థ విధానము
- 6.9.2. ఫ్రాన్స్ - అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సంబంధాలు - జినె చర్యలు
- 6.9.3. బ్రిటన్ - అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సంబంధాలు - జాన్ జే సంధి
- 6.9.4. స్పెయిన్ - అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సంబంధాలు - థామస్ పిన్క్నె సంధి

6.10. వాషింగ్టన్ పదవీ విరమణ

6.11. వాషింగ్టన్ ఘనత

6.12. నమూనా ప్రశ్నలు

6.13. చదువదగిన గ్రంథాలు

## 6.1. పరిచయము :

స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం అనే ప్రాతిపదికపై అమెరికన్‌లు ఇంగ్లండ్‌తో పోరు సల్పి విజయాన్ని సాధించారు. ఫలితంగా ఏర్పడిన స్వతంత్ర అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ప్రథమ కేంద్ర ప్రభుత్వం జాన్ డికిన్‌సన్ రూపొందించిన కాన్‌ఫెడరేట్ సూత్రాల ఆధారంతో నెలకొన్నది. ఈ కాన్‌ఫెడరేట్ ప్రభుత్వం 1781 నుంచి 1789 వరకు అధికారంలో వుంది. ఈ కాలంలో, దేశాన్ని ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొగల కేంద్ర ప్రభుత్వాన్ని, తత్సంబంధ రాజ్యాంగాన్ని రూపొందించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ యత్నాల వల్ల 1789 మార్చి 4న నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. నూతన రాజ్యాంగం కింద జార్జి వాషింగ్టన్ 1789 ఏప్రిల్ 30న న్యూయార్క్ నగరంలోని వాల్ స్ట్రీట్‌లోని ఫెడరల్ హాలులో అమెరకా సంయుక్త రాస్త్రాల మొదటి అధ్యక్షుడుగా పదవీ స్వీకారం చేసినాడు. జాన్ ఆడమ్స్ ఉపాధ్యక్షుడుగా పదవీ ప్రమాణం చేసినాడు. వీరిద్దరి పదవీ స్వీకారంతో 1789 లో న్యూయార్క్ తొలి రాజధానిగా ఫెడరల్ ప్రభుత్వం పని చేయడం ఆరంభించింది. జార్జి వాషింగ్టన్ శీల సంపద, ప్రతిష్ఠ నూతన ప్రభుత్వానికి స్థిరత్వాన్ని చేకూర్చాయి. దేశ విదేశాలలో గౌరవాస్పదాలైన, విశాల భావాలతో కూడిన జాతీయ విధానాలను అవలంబించి, వాషింగ్టన్ నూతన ప్రభుత్వంలో ప్రజలకు విశ్వాస గౌరవాలను ఏర్పరచటానికి కృషి చేశాడు.

## 6.2. వాషింగ్టన్ జీవితం :

వాషింగ్టన్ 1732, ఫిబ్రవరి 22న వర్జీనియా రాష్ట్రంలోని బ్రిడ్జెస్ క్రీక్ అనే చోట జన్మించాడు. ఇతడు కొంత కాలం మౌంట్ వెర్నన్‌లో సర్వేయర్‌గా పనిచేసినాడు. సప్త వర్ష యుద్ధంలో ఇతడు ఆంగ్లేయుల తరపున ఫ్రెంచి సైన్యంతో వీరోచితంగా పోరాడినాడు. ఇతని పేరు చరిత్ర పుటలలోకి ఎక్కడం ఇదే మొదటిసారి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఇతడు ఒక గొప్ప నాయకుడుగా ఉన్నాడు. ఇతడు ప్రథమ, ద్వితీయ కాంటినెంటల్ మహాసభలకు, ప్రతినిధిగా ఉన్నాడు. స్వాతంత్ర్య యుద్ధ కాలంలో ఇతడు సర్వసైన్యాధ్యక్షుడిగా పనిచేసి వలసలకు అఖండ విజయాలు చేకూర్చినాడు.

అమెరికా సంయుక్త రాష్ట్రాల స్వాతంత్ర్య యుద్ధ విజేతయైన వాషింగ్టన్‌కు అధ్యక్ష పదవిపై వాంఛలేదు. స్వాతంత్ర్య సమరం ముగిసే నాటికి అతను మానసికంగాను, శారీరకంగానూ కూడా ఎంతో అలసి ఉన్నాడు. అందువల్ల మౌంట్ వెర్నన్‌లోని తన ఎస్టేట్‌కు పోయి శాంతియుతమైన జీవితాన్ని గడపవలెనని అభిషలసించినాడు. అధ్యక్షపదవిపై వాంఛ చూపలేదు. కాని ప్రజల కోరికననుసరించి పదవి చేపట్టిన తరువాత నిర్విరామ కృషి చేసి తన బాధ్యతలను అతి సమర్థంగా నిర్వర్తించినాడు.

## 6.3. అధ్యక్ష కార్యదర్శి మండలి :

అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడిగా వాషింగ్టన్ తొలి కర్తవ్యం నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం. మంచిపేరు, సామర్థ్యం, నిజాయితీ కలవారిని తన కార్యదర్శులుగా నియమించాడు. అలెగ్జాండర్ హామిల్టన్‌ను కోశాగార కార్యదర్శిగా, థామస్ జెఫర్సన్‌ను విదేశాంగ కార్యదర్శిగా, హెన్రీ నాక్స్‌ను రక్షణ శాఖ కార్యదర్శిగా, ఎడ్మండ్ రాండాల్ఫ్‌ను అటార్నీ జనరల్‌గా నయమించి వాషింగ్టన్ తన పాలనాదక్షతను కనపరచాడు. అయితే పార్టీ రాజకీయాలకు అతీతుడుగా ఉండదలచినప్పటినీ, కార్యాచరణలో వాషింగ్టన్ ఫెడరలిస్ట్ పార్టీకి చెందినవాడు గానే ప్రవర్తించాడు. అధ్యక్ష కార్యదర్శి మండలి ఏర్పాటును గురించి రాజ్యాంగం ఏమీ చెప్పలేదు. కాని వాషింగ్టన్ ఒక నిర్ణయాన్ని తీసుకొనే ముందు తన కార్యదర్శులను సంప్రదించి తరువాత నిర్ణయం తీసుకొనేవాడు. ఈ విధంగా తొలి నుంచి కార్యదర్శి మండలి ప్రభుత్వ యంత్రాంగంలో ఒక భాగమయిపోయింది.

## 6.4. న్యాయశాఖా చట్టము :

అధ్యక్ష కార్యదర్శి మండలిని ఏర్పాటు చేసే విషయంలో లాగానే, న్యాయశాఖను ఏర్పాటుచేసే విషయంలో కూడా 1789 నూతన రాజ్యాంగం నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. అందువల్ల ఈ లోటును పూరించి న్యాయశాఖను ఏర్పాటు చేయటానికై 1789లో కాంగ్రెస్

న్యాయశాఖా చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం మేరకు సుప్రీం కోర్టుకు ఆరుగురు న్యాయమూర్తులను నియమించాలని, పదమూడు డిస్ట్రిక్ట్ కోర్టులను, మూడు సంచార, న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నది. న్యూయార్క్‌కు చెందిన జాన్‌జేను వాషింగ్టన్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు. రాజ్యాంగాన్ని అత్యున్నత చట్టంగా ప్రభుత్వం చేసే చట్టాలు రాజ్యాంగ బద్ధమైనవా కావా అని నిర్ణయించే న్యాయ సమీక్షాధికారం ఫెడరల్ న్యాయమూర్తులకు ఉందని న్యాయశాఖ చట్టం పేర్కొంది. 1791, 1792 లలోనే సంచార న్యాయస్థానాలు ఈ న్యాయ సమీక్షాధికారాన్ని ఉపయోగించుకొని రాష్ట్ర శాసన సభలు జారీ చేసిన కొన్ని చట్టాలను, ఫెడరల్ కాంగ్రెస్ జారీ చేసిన ఒక చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని రద్దు చేశాయి. ఈ విధంగా హామిల్టన్ ఫెడరలిస్ట్ పత్రికలోని తన రచనలలో ప్రవచించిన న్యాయ సమీక్షా విధానం అతి త్వరలోనే ఫెడరల్ ప్రభుత్వ విధానంలో ఒక భాగమయింది. 1803లో రెండో అధ్యక్షుడయిన జాన్ ఆడమ్స్ ఏర్పడిన 'మర్బరీ-మదిన్' వివాదంలో ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు ఈ న్యాయ సమీక్షా విధానాన్ని పునరుద్ఘాటించటంతో దాని యొక్క ప్రాముఖ్యత స్పష్టమయింది.

## 6.5. ప్రాథమిక హక్కులు :

1789 నూతన రాజ్యాంగాన్ని ఆమోదించుటకు కొన్ని రాష్ట్రాలు ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో పొందుపరచాలని నిబంధన పెట్టాయి. అందువల్ల కాంగ్రెస్ 1791లో రాజ్యాంగానికి 12 సవరణలు చేయగా, అందులో పదింటిని మాత్రమే రాష్ట్రాలు ధృవీకరించాయి. ఇదే ప్రాథమిక హక్కులుగా ప్రసిద్ధిగాంచింది. ఇందులో మత స్వాతంత్ర్యము, పత్రికా స్వాతంత్ర్యము, వాక్ స్వాతంత్ర్యము మున్నగు హక్కులు, అమెరికన్‌లకు సంప్రాప్తించింది.

## 6.6. మొదటి సుంక చట్టము :

ప్రభుత్వానికయ్యే తక్షణ ఖర్చులను ఆర్జించటానికి కాంగ్రెస్ 1789లో మొదటి సుంక చట్టాన్ని ప్రవేశపెట్టింది. హామిల్టన్ రక్షణ సుంకాలను సమర్థించేవాడయినప్పటికే, ఈ మొదటి సుంక చట్టంలో హామిల్టన్‌కు ఎటువంటి ప్రమేయం లేదు. కాంగ్రెస్ ఈ చట్టాన్ని మ్యాడిసన్ నాయకత్వంలో ఆమోదించడం జరిగింది. ఈ చట్టం ప్రకారం అనేక విదేశీ దిగుమతులపైనా సుంకాలు విధించారు. దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం ఒనగూడటమే గాక అప్పుడపుడే రూపుగొంటున్న అమెరికన్ పరిశ్రమలకు రక్షణ కల్పించబడింది.

## 6.7. ఆర్థిక సంస్కరణలు - హామిల్టన్ :

విత్త, ఆర్థిక సమస్యలకు సంబంధించి ఒక కార్యక్రమాన్ని రూపొందించటం వాషింగ్టన్ ప్రభుత్వం ఎదుర్కొన్న ప్రధాన సమస్య. ఈ కార్యక్రమాన్ని రూపొందించటం కోశాగార కార్యదర్శి హామిల్టన్ బాధ్యత. హామిల్టన్ ఈ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాడు.

**6.7.1. అలెగ్జాండర్ హామిల్టన్ ఆర్థిక విధానాలు :** విప్లవ యోధుడుగా, న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సిద్ధాంత నిర్మాతగా పేరు పొందిన అలెగ్జాండర్ హామిల్టన్ 1755లో బ్రిటీష్ పశ్చిమ ఇండియా దీవులలో ఒకటైన నెవిస్‌లో జన్మించాడు. కొద్ది కాలం సెయింట్ క్రో అనే చోట గుమాస్తాగా పనిచేశాడు. 1773లో న్యూయార్క్ నగరం చేరి అచట గల కింగ్స్ కళాశాలలో విద్యనభ్యసించి న్యాయశాస్త్రంలో పట్టభద్రుడయ్యాడు. అమెరికా స్వాతంత్ర్య పోరాట కాలంలో సైన్యాధికారిగా చేరి, చాలా కాలం వాషింగ్టన్ వద్ద కార్యదర్శిగా ఉన్నాడు. సైన్యాధ్యక్షుడుగా యార్క్ టౌన్ వద్ద జరిగిన యుద్ధంలో తన ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. ఒక సంవత్సరం పాటు కాంగ్రెస్ సభ్యుడుగా ఉన్న తర్వాత న్యూయార్క్ నగరంలో న్యాయవాద వృత్తి చేపట్టాడు. ఆ నగరంలోని సంపన్న కుటుంబాలలో ఒకటైన ష్యూలర్ కుటుంబంలో వివాహం చేసుకొన్నాడు. 1786లో అన్నా పోలీస్‌లో జరిగిన పరిషత్తును న్యూయార్క్ రాష్ట్ర ప్రతినిధిగా హాజరయ్యాడు. ఈ పరిషత్తులో ప్రభుత్వం స్వరూపాన్ని గూర్చి చర్చించడానికి మరో సమావేశం ఏర్పాటు చేయడం అవసరమని తెలుపుతూ ఒక నివేదికను తయారు చేసినాడు. పటిష్టమైన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచవలెనని ఫిలడెల్ఫియా సమావేశంలో సూచించాడు. ఫెడరలిస్ట్ పత్రికలో పటిష్ఠమైన జాతీయ ప్రభుత్వ నిర్మాణ అవసరాన్ని సమర్థిస్తూ, అనేక వ్యాసాలు రాశాడు.

మేధావి, వక్త, రచయిత అయిన హామిల్టన్ ఆర్థిక విషయాలలో ప్రత్యేకమైన ప్రతిభతో అమెరికన్ జాతీయ ఆర్థిక విధానానికి పునాదులు ఏర్పరచాడు. కోశాగార పదవిని అలంకరించే నాటికి హామిల్టన్ వయస్సు ముప్ఫై నాలుగేళ్ళు. ప్రజల యొక్క అవసరాలను గమనించి వాటికి అనుగుణంగా కాంగ్రెస్‌లో చట్టాలను ప్రవేశపెట్టే చొరవను వాషింగ్టన్ కనపరచలేదు. అందువల్ల ఆ బాధ్యతను హామిల్టన్ తనకు తానై స్వీకరించి కాంగ్రెస్‌లో శాసన సభానాయకత్వాన్ని వహించాడు. కోశాగార శాఖను సృష్టించిన చట్టం మేరకు, కోశాగార కార్యదర్శి నేరుగా కాంగ్రెస్‌కు బాధ్యత వహించవలసివుంది. దీనిని బట్టి కోశాగార కార్యదర్శిగా కాంగ్రెస్‌లో తనకు ప్రత్యేకమైన సంబంధం ఉందని హామిల్టన్ తీర్మానించి తనకు తానై ప్రధానమంత్రిలాగా వ్యవహరించాడు. అంతేగాక, ఇతర శాఖల కార్యకలాపాలలో జోక్యం చేసుకోసాగాడు.

హామిల్టన్ మూల సిద్ధాంతము ఫెడరల్ ప్రభుత్వానికి ధనిక వర్గాన్ని సన్నిహితం చేయటం. సామాన్య ప్రజానీకానికి తమను తాము పరిపాలించుకొనే సామర్థ్యం లేదని హామిల్టన్ విశ్వాసం. ఇతడు ప్రజాస్వామ్య ఆదర్శాలను నిరసించాడు. న్యాయం, శాంతి భద్రతలు, సత్పరిపాలన, వ్యక్తి స్వేచ్ఛ కులీన వర్గ పరిపాలన వల్ల మాత్రమే ఏర్పడగలవని ఇతని విశ్వాసం. కులీనులంటే సంపన్నులు, సత్కుల సంజాతులు, వివేకవంతులని ఇతని నిర్వచనం. అందువల్ల హామిల్టన్ ఆర్థిక విధానాలన్నీ సంపన్న వర్గానికి, సమాఖ్య ప్రభుత్వానికి మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొల్పడానికి ఉద్దేశించినవే. హామిల్టన్‌ది మిక్కిలి ఆకర్షణీయమైన వ్యక్తిత్వం. ఇతడు తన సిద్ధాంతాలలో పూర్తి విశ్వాసం కలిగి, వాటిని ఆచరణలో పెట్టడంలో ఎనలేని ధైర్యసాహసాలు ప్రదర్శించాడు. ఆర్థిక విషయాలలో ఇతని నిజాయితీ శంకరహితమయినది, సంపూర్ణమైనది.

హామిల్టన్ కాంగ్రెసుకు సమర్పించిన మూడు నివేదికలు అతని ఆర్థిక విధానాన్ని గురించి తెలుపుతాయి. అవి : 1) 1790, జనవరి 9న సమర్పించిన ప్రభుత్వ రుణాల మీద నివేదిక, 2) 1790, డిసెంబర్ 13న సమర్పించిన జాతీయ బ్యాంకు మీద నివేదిక, 3) 1791, డిసెంబర్ 5న సమర్పించిన ఉత్పత్తిదారుల మీద నివేదిక (రక్షణ సుంకాలు).

**6.7.2. రుణాలు :** స్వాతంత్ర్య యుద్ధ కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు అప్పులు చేశాయి. హామిల్టన్ కాంగ్రెస్‌కు సమర్పించిన ప్రభుత్వ రుణాల మీద నివేదికలో ప్రభుత్వం చెల్లించవలసిన రుణాలను మూడు వర్గాలుగా విభజించాడు. అవి : 1) సమ్మేళనా ప్రభుత్వం విదేశాలకు చెల్లించవలసిన రుణం. ఈ విదేశీ రుణం 1789 డిసెంబర్ నాటికి వడ్డీతో కలిపి మొత్తం 11,710,379 డాలర్లు. 2) సమ్మేళనా ప్రభుత్వం దేశంలో చెల్లించవలసిన రుణం. ఈ అంతర్ దేశీయ రుణం మొత్తం వడ్డీతో కలిపి 40,414,086 డాలర్లు. 3) అమెరికన్ విప్లవ కాలంలో వివిధ రాష్ట్రాలు చేసిన రుణాలు. ఈ రాష్ట్ర రుణాలు మొత్తం 25,000,000 డాలర్లు. ఈ పద్దులన్నీ కలిసి మొత్తం ప్రభుత్వ రుణాలు 77,124,465 డాలర్లు.

ఈ ప్రభుత్వ రుణాలన్నింటినీ తీర్చే బాధ్యత ఫెడరల్ ప్రభుత్వం వహించాలని హామిల్టన్ తన నివేదికలో కాంగ్రెస్‌కు ప్రతిపాదించాడు. ఫెడరల్ ప్రభుత్వం ప్రజల మీద పన్నులు విధించి ఈ రుణాల మీద వడ్డీని మొదట తీర్చివేయాలని, తరువాత క్రమంగా అసలుకు తీర్చాలని తన అభిప్రాయాన్ని తెలిపాడు. ఆ విధంగా చేసిన యెడల రెండు ప్రయోజనాలు చేకూరుతాయని హామిల్టన్ వాదించాడు. అవి. 1) రుణాలిచ్చిన ధనవంతుల అండదండలు ప్రభుత్వానికి లభిస్తాయి. 2) ప్రభుత్వం నుంచి రుణాల చెల్లింపు రూపంలో పొందిన ధనంలో వారు నూతన వ్యాపారాలను ప్రారంభించడానికి అవకాశమేర్పడుతుంది.

హామిల్టన్ రుణాల చెల్లింపు పథకాన్ని కొంత మంది వ్యతిరేకించారు. అందుకు కారణాలు : 1) ప్రభుత్వం ఆసాముల దగ్గర రుణాల తీసుకొన్నప్పుడు హామీగా పత్రాలు వ్రాసి ఇచ్చింది. ఇట్టి బాండ్లలో విప్లవకాలంలో సైనికులకు జీతాలు ఇవ్వలేక ఆ జీతాలకు బదులుగా హామీ పత్రాల రూపంలో రాసి ఇచ్చిన బాండ్లు చాలా వున్నాయి. సైనికులు ఆర్థిక బాధలకు తట్టుకోలేక ఆ బాండ్లను సట్టా వ్యాపారస్తులకు తగ్గింపు ధరలకు అమ్మారు. ఈ విధంగా తగ్గింపు ధరలకు మొదటి ఆసాముల దగ్గర బాండ్లను కొన్న సట్టా వ్యాపారస్థులకు ఆ బాండ్ల మీద ఉండే అసలు విలువను చెల్లించడం సబబుకాదు. 2) రుణాలను చెల్లించడానికి ప్రభుత్వం దేశంలోని పేదలందరి నుంచి పన్నుల రూపంలో ధనాన్ని రాబట్టడం మిక్కిలి శోచనీయము.

అయితే హామిల్టన్ రుణాల చెల్లింపు విషయంలో తన పట్టుదల వీడలేదు. కొద్దిమంది ఆసాముల చేతిలో కేంద్రీకృతమైన ధనం పెట్టుబడిరూపంలో ఉపయోగించడం జరుగుతుందని, దేశ ప్రజలందరి చేతిలో ఉన్న డబ్బు నిత్య జీవితావసరాలకు ఖర్చయిపోతుందని హామిల్టన్ వాదించాడు. కాంగ్రెస్ సభ్యుల్లో చాలా మంది సంపన్నులు వారి వద్ద తక్కువ ధరలను కొన్న బాండ్లు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల వారు హామిల్టన్ ప్రతిపాదనను సమర్థించారు. కాన్ఫడరేట్ ప్రభుత్వం చేసిన రుణాలన్నిటినీ జాతీయ ప్రభుత్వం తీర్చాలని హామిల్టన్ ప్రతిపాదించిన బిల్లును కాంగ్రెస్ ఆమోదించింది.

రుణాలు తీర్చే బాధ్యతను ఫెడరల్ ప్రభుత్వం వహించాలనే ప్రతిపాదన చేయడంలో హామిల్టన్‌కు మూడు ఉద్దేశాలు గలవు. అవి. 1) రుణాలు తీర్చే బాధ్యతను ఫెడరల్ ప్రభుత్వం వహించడం వల్ల ప్రజల విశ్వాసం రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఫెడరల్ ప్రభుత్వం మీదికి మళ్ళి ఫెడరల్ ప్రభుత్వం బలపడుతుంది. 2) రుణాల చెల్లింపు రూపంలో ప్రభుత్వం చెల్లించే ప్రతీ డాలరు పరిశ్రమలలో, వ్యాపారాలలో పెట్టుబడికి ఉపయోగపడే సంపదగా చెలామణి అవుతుంది. 3) స్వాతంత్ర్య పోరాటానికి రాష్ట్రాలు చేసిన రుణాలను చెల్లించే బాధ్యత నైతికంగా ఫెడరల్ ప్రభుత్వం వహించవలసి ఉంటుందని హామిల్టన్ భావించడము.

రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన రుణాలను కూడా ఫెడరల్ ప్రభుత్వం తీర్చాలనే హామిల్టన్ ప్రతిపానను దక్షిణ రాష్ట్రాలు ముఖ్యంగా జెఫర్‌సన్ అనుయాయులు ప్రతిఘటించారు. అందుకు కారణాలు : 1) వర్జీనియా మరికొన్ని దక్షిణ రాష్ట్రాలు తమ ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి అప్పటికే రుణాలను చెల్లించివేశాయి. అటువంటి రాష్ట్రాలలో మరలా ప్రజల మీద పన్నులు విధించి ఇతర రాష్ట్రాలు చేసిన అప్పులను ఫెడరల్ ప్రభుత్వం తీర్చడం వాటిని నచ్చలేదు. 2) స్వాతంత్ర్య పోరాట కాలంలో, అధిక మొత్తాలు అప్పులు చేసిన మెసాచుసెట్స్ వంటి ఉత్తర రాష్ట్రాల రుణ బాధను తొలగించడానికి ఫెడరల్ ప్రభుత్వం తమ ప్రజల మీద పన్నులు విధించటాన్ని, తమ దగ్గర పన్నులు వసూలు చేయటాన్ని, కొద్ది మొత్తాలు అప్పు చేసిన దక్షిణ రాష్ట్రాలు ఏవగించుకొన్నాయి. 3) హామిల్టన్ పథకం ఉత్తర రాష్ట్రాలలోని వర్తక వర్గాలకు లాభాలు చేకూర్చిపెట్టేదిగా ఉందని దక్షిణ రాష్ట్రాల వారు విమర్శించారు.

హామిల్టన్ దక్షిణ రాష్ట్రాల వారి వాదాన్ని అంగీకరించాడు. కాని జాతీయ ప్రభుత్వం పటిష్ఠం కావడానికి, ప్రజలు జాతీయ ప్రభుత్వానికి సన్నిహితం కావటానికి వేరే మార్గం లేదన్నాడు. జాతీయ సమైక్యాన్ని గురించి ప్రస్తావించి అమెరికా స్వాతంత్ర్య పోరాటం ఒక ఉన్నత ఆశయ సిద్ధికై జరిగిందనీ దానికై రాష్ట్రాలు చేసిన అప్పులను జాతీయ ప్రభుత్వం తీర్చే బాధ్యతను అందరి బాధ్యతగా గుర్తించాలని వాదించాడు. కాని దక్షిణ రాష్ట్రాలు ఈ వాదనకు తలఒగ్గలేదు.

చివరకు హామిల్టన్ దక్షిణ రాష్ట్రాలకు నాయకుడైన జెఫర్‌సన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకొన్నాడు. ఈ ఒప్పందం ప్రకారం కాంగ్రెస్‌లో జెఫర్సన్ అనుయాయులైన దక్షిణ రాష్ట్రాల ప్రతినిధులు రాష్ట్రాల రుణాలను ఫెడరల్ ప్రభుత్వం తీర్చే బాధ్యతకు సంబంధించిన బిల్లును ఆమోదించారు. దీనికి బదులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజధానిని వర్జీనియా రాష్ట్రంలోని పోటో మ్యాక్ నదీ తీర ప్రాంతంలో నిర్మించటానికి ఉద్దేశించిన బిల్లును, కాంగ్రెస్‌లో ఉత్తర రాష్ట్రాల ప్రతినిధుల చేత ఆమోదింప చేయడానికి హామిల్టన్ వాగ్దానం చేశాడు. ఈ వాగ్దానం మేరకు 1800లో రాజధానిని ఫిలడెల్ఫియా నుంచి పోటో మ్యాక్ నదీ తీరాన నూతనంగా నిర్మించిన వాషింగ్టన్‌కు తరలించాడు.

అమెరికన్ కాంగ్రెస్ రాజకీయాలలో ప్రత్యేక ప్రయోజనాలకు సంబంధించిన చట్టాలు ఆమోదించడానికి కాంగ్రెస్‌లోని వివిధ వర్గాల వారు సహకరించడాన్ని దుక్క దొర్లింపు (Log Rolling) అని పిలిచారు. అట్టి సన్నివేశాలలో హామిల్టన్, జెఫర్‌సన్‌ల మధ్య జరిగిన ఈ ఒప్పందం మొదటిది.

**6.7.3. జాతీయ బ్యాంకు స్థాపన :** హామిల్టన్ ఆర్థిక ప్రణాళికలో రెండో అంశము అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయ బ్యాంకు స్థాపన. జాతీయ పరపతిని పెంచడంలో జాతీయ బ్యాంకు స్థాపన ఒక ప్రధాన అంశమని హామిల్టన్ భావించాడు. 1784లో వెలిసిన బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్ నిబంధనావళి ముసాయిదాను రూపొందించి, బ్యాంకింగ్ కార్యకలాపాల్లో తనకు గల ఆసక్తిని హామిల్టన్ కనపరచాడు. దేశ ఆర్థిక ప్రగతిని సాధించడానికి జాతీయ బ్యాంక్ స్థాపన అత్యవసరమని భావించిన హామిల్టన్, కోశాగార కార్యదర్శిగా నియమితుడయిన

తరువాత 1790 డిసెంబరు 13న ఒక నివేదికను కాంగ్రెస్‌కు సమర్పించాడు. ఈ నివేదికలో బ్యాంక్ స్థాపన వల్ల ఏర్పడే ప్రయోజనాలు, కలిగే ఆర్థిక ఇబ్బందులను హామిల్టన్ పేర్కొన్నాడు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వలె అమెరికన్ జాతీయ బ్యాంకులో ప్రభుత్వ నిధులు మదుపు చేస్తారు. అవసరమైనపుడు ప్రభుత్వానికి గాని, పౌరులకు గాని ఈ బ్యాంకు రుణాలిస్తుంది. ఈ బ్యాంకు కరెన్సీ నోట్లను జారీ చేయవచ్చు. కొత్త వ్యాపారం ప్రారంభించేవారికి రుణాలను మంజూరు చేయవచ్చు. బ్యాంకు మూలధనంలో అయిదింట ఒక వంతు ప్రభుత్వము, అయిదింట నాలుగు వంతులు ధనికులు మదుపు పెట్టవచ్చు. ఇవి హామిల్టన్ బ్యాంకు పథకంలోని ముఖ్యాంశాలు.

అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయ బ్యాంకు స్థాపన విషయమై కాంగ్రెస్‌లో చర్చకు వచ్చినపుడు అతి తీవ్ర విమర్శకు గురి అయ్యింది. బ్యాంకు స్థాపన రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధమని మ్యాడిసన్ గట్టిగా వాదించి దాని స్థాపనను నిరసించాడు. ఈ బ్యాంకు స్థాపన పథకంపై హామిల్టన్, జెఫర్‌సన్‌ల మధ్య తీవ్ర వాగ్వివాదాలు జరిగాయి. బ్యాంకు స్థాపన రాజ్యాంగ విర్ధుమని జెఫర్‌సన్, అతని అనుయాయులు పేర్కొని, బ్యాంకు స్థాపనకు సంబంధించి ఈ కింది అనుమానాలు వ్యక్తం చేశారు. 1) ఈ బ్యాంక్ ధనవంతుల ప్రయోజనాలకు మాత్రమే ఉపకరిస్తుంది. 2) బ్యాంకు వల్ల వ్యవసాయ ప్రధానమైన దక్షిణ రాష్ట్రాల కన్నా, వ్యాపారం పరిశ్రమల మీద ఆధారపడిన ఉత్తర రాష్ట్రాలకు మేలు ఎక్కువ చేకూరుతుంది. 3) సమాఖ్య ప్రభుత్వం క్రమేణా మిక్కిలి బలపడి రాష్ట్రాలను తన చేతి కీలు బొమ్మలుగా చేసుకోగలదు. అమెరికన్ రాజ్యాంగంలో బ్యాంకును స్థాపించే విషయం పేర్కొనలేదని అందువల్ల సమాఖ్య ప్రభుత్వానికి బ్యాంకును స్థాపించే అధికారం లేదని వీరి వాదన.

జెఫర్‌సన్, అతని అనుయాయులు చేసిన ఆరోపణలకు హామిల్టన్ ఖండించలేదు, కాని బ్యాంకు స్థాపన రాజ్యాంగ విరుద్ధమని పేర్కొనడాన్ని ఖండించాడు. రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్న అధికారాలలో పాటు కొన్ని సూచితాధికారాలు కూడా ఉంటాయని హామిల్టన్ ఉద్ఘాటించాడు. ఈ సూచితాధికారాల సిద్ధాంతం ప్రకారం బ్యాంకును స్థాపించే అధికారం ప్రభుత్వానికున్నదని అతడు వాదించాడు.

జాతీయ బ్యాంకు స్థాపనకు సంబంధించిన బిల్లుకు అనుకూలంగా 39 వోట్లు, ప్రతికూలంగా 20 వోట్లు రావడంతో బిల్లు నెగ్గింది. ఈ బిల్లును తన ఆమోదాన్ని తెలిపే ముందు అధ్యక్షుడు వాషింగ్టన్, బ్యాంకు రాజ్యాంగ బద్ధతను గూర్చి, తన కార్యదర్శులు వారి అభిప్రాయాలను రాత పూర్వకంగా తనకు తెలుపవలెనని కోరాడు. విదేశాంగ కార్యదర్శి జెఫర్‌సన్, అటార్నీ జనరల్ ర్యాండాల్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలను తెలిపారు. వాషింగ్టన్ ఈ రెండు అభిప్రాయాలను హామిల్టన్‌కు పరిశీలనకు పంపి, అతని అభిప్రాయాన్ని తెలుపవలసిందిగా కోరాడు. హామిల్టన్ తన జవాబులో రాజ్యాంగంలోని సూచితాధికారాలను చక్కగా సమర్థించి వాషింగ్టన్ సందేహాలను నివృత్తి చేశాడు. వాషింగ్టన్‌కు హామిల్టన్ వాదన నచ్చింది. అంతేగాక, ఆర్థిక విషయంలో కోశాగార కార్యదర్శిని బలపరచడం తన విధి అని కూడా వాషింగ్టన్ భావించాడు. బ్యాంకు బిల్లు మీద సంతకం చేశాడు. 1791 డిసెంబర్ 12న ఫిలడెల్ఫియాలో అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయ బ్యాంకు స్థాపన జరిగింది. బ్యాంకు చార్టర్ ప్రకారం ఇది 20 సంవత్సరాల పాటు పనిచేస్తుంది. ఈ బ్యాంకులో ప్రభుత్వ నిధులు మదుపు చేస్తారు. అవసరమైనప్పుడు ప్రభుత్వానికి గాని, పేదలకు గాని ఈ బ్యాంకు రుణాలిస్తుంది. ఈ బ్యాంకు కరెన్సీ నోట్లను జారీ చేస్తుంది. కొత్త వ్యాపారాలు, పరిశ్రమలు ప్రారంభించే వారికి రుణాలను మంజూరు చేయవచ్చు. 10 మిలియన్ డాలర్ల మూల ధనంతో బ్యాంకును ప్రారంభించారు. జాతీయ బ్యాంకును స్థాపించిన హామిల్టన్ అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్థిక రంగంలో ఒక సంప్రదాయానికి కారకుడయ్యాడు. హామిల్టన్ ఒక రుణ విమోచనా నిధిని ఏర్పరచాడు. దీని ద్వారా ప్రభుత్వ నిధులు క్రమేణా పెరిగి జాతీయ రుణంలోని అసలును చెల్లించడానికి వసతి ఏర్పడింది.

**6.7.4. విస్కీ మీద పన్ను :** హామిల్టన్ 1791 లో విస్కీ మీద పన్ను విధించే బిల్లును కాంగ్రెస్ చేత ఆమోదింపచేశాడు. దీనికే ఎక్సయిజ్ సుంకం అని పేరు. ఈ పన్ను మూలంగా ప్రభుత్వానికి అదనపు ఆదాయం చేకూరడమే గాక, పశ్చిమ ప్రాంతంలో ప్రభుత్వ అధికారం దృఢతరం కాగలదని హామిల్టన్ భావించాడు. పశ్చిమ ప్రాంతాలలో ముఖ్యంగా పశ్చిమ పెన్సిల్వేనియాలో నివసించేవారికి విస్కీ వ్యాపారం జీవనోపాధిగా చాలా ముఖ్యమయింది. ఈ పన్నును వ్యతిరేకిస్తూ చాలా రాష్ట్ర శాసన సభలు నిరసన తీర్మానాలు చేశాయి. పశ్చిమ పెన్సిల్వేనియాలో ఈ పన్నుకు నిరసనగా తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటును 'విస్కీ తిరుగుబాటు' అని పిలిచారు.

హామిల్టన్ ప్రోద్బలంతో వాషింగ్టన్ నాలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 15 వేల మంది సైనికులను తిరుగుబాటును అణచివేయడానికి పంపాడు. నిరసన రూపమైన రైతుల చిన్న తిరుగుబాటును అణచడానికి అంతపెద్ద సైన్యాన్ని పంపడం పిచుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్లుందని జెఫర్సన్ విమర్శించాడు. మొత్తం మీద జాతీయ ప్రభుత్వం పంపిన సేనలు తిరుగుబాటును అణచివేశాయి. కొంత మంది విప్లవకారులను ఫెడరల్ ప్రభుత్వం నిర్బంధంలో ఉంచి ఫిలడెల్ఫియాకు తరలించింది. కొంత కాలం తరవాత వారు విడుదలయ్యారు. ఇద్దరు వ్యక్తులపై దేశ ద్రోహం నేరం కింద శిక్ష విధించినప్పటికీ వారిని కూడా ప్రభుత్వం క్షమించి వదలివేసింది. ఈ విధంగా నూతన ప్రభుత్వం శాంతి, భద్రతలకు భంగము కల్గించు ఎట్టి సవాళ్ళనైనా ఎదుర్కొనగలదని, కేంద్ర ప్రభుత్వానికి పన్ను విధించు అధికారం కలదని నిరూపించెను.

**6.7.5. రక్షణ పన్ను :** ఉత్పత్తిదారుల పరిశ్రమలు స్థాపించడానికి, వాటిని పెంపొందించడానికి సహాయాన్ని అందచేయడం ప్రభుత్వ బాధ్యత అని హామిల్టన్ భావించాడు. ఈ ఉద్దేశముతో హామిల్టన్ 1791 లో కాంగ్రెస్‌కు ఉత్పత్తుల మీద నివేదిక సమర్పించాడు. ఆడమ్ స్మిత్ 'స్వేచ్ఛా వ్యాపార' సిద్ధాంతాన్ని విమర్శించి నూతన రాజ్యమైన అమెరికాలో అపుడే స్థాపించి ఎదుగుతున్న పరిశ్రమలకు, ఉత్పత్తులకు రక్షణ అవసరమని హామిల్టన్ వాదించాడు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఆర్థికంగా ఐరోపా మీద ఆధారపడకూడదని, స్వతంత్రమైన ఆర్థిక విధానాలను రూపొందించుకోవాలని వాదించాడు. దిగుమతుల మీద ఎక్కువ రక్షణ సుంకాలు విధించి, పరిశ్రమలకు సబ్సిడీలు ఇవ్వాలని ప్రతిపాదించాడు. కాని ఈ నివేదికలోని అంశాలను తక్షణం అమలు పరచలేదు. అందుకు కారణం ఉత్తరాది వ్యాపారులు, దక్షిణాది వ్యవసాయదారులు విదేశీ వ్యాపారాన్ని తగ్గించే ప్రతిపాదనల పట్ల ఆసక్తి చూపకపోవడమే.

**6.7.6. సమీక్ష :** హామిల్టన్ ఆర్థిక సంస్కరణల విజయం ఆర్థిక మంత్రిగా అతని సామర్థ్యానికి ఒక నిదర్శనం. ఈ సంస్కరణల ఫలితంగా అమెరికన్ స్టాకులు ఐరోపాలో బాగా అమ్ముడు పోయాయి. దేశీయ, విదేశీయ రుణాలన్నిటినీ 1817 నాటికి ప్రభుత్వం చెల్లించి వేసింది. దాదాపు దివాలా తీసిన రాష్ట్రాలను ఆర్థిక పరపతి కలిగిన రాష్ట్రాలుగా హామిల్టన్ తన ఆర్థిక చర్యల చేత రూపొందించగలిగారు. ఆర్థికంగా జాతి గౌరవాన్ని పెంపొందించాడు. ఇది అద్భుతమైన కార్యం, కాని ఈ కార్యాన్ని సాధించడంలో హామిల్టన్‌కు తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది. అతడు విధించిన పన్నులను చెల్లించడానికి ఇష్టపడని వారు అతని ఆర్థిక చర్యలను ప్రత్యక్షంగా ప్రతిఘించారు. దీనికి ఉదాహరణగా విస్కీ తిరుగుబాటును పేర్కొనవచ్చు.

## 6.8. రాజకీయ పార్టీల అవతరణ :

అమెరికన్‌ల విభిన్నమైన ఆర్థిక దృక్పథాలు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో రాజకీయ పార్టీలేర్పడటానికి దారి తీసినాయి. హామిల్టన్ ఆర్థిక పథకాల మూలంగా హామిల్టన్‌కు, జెఫర్సన్‌కు మధ్య జరిగిన వాగ్వివాదాలు పార్టీల అవతరణకు దోహదం చేసినాయనడంలో సందేహం లేదు. హామిల్టన్ అనుయాయులు ఫెడరలిస్ట్‌లుగా,జెఫెర్సన్ అనుచరులు రిపబ్లికన్‌లుగా వ్యవహరించారు.

డబ్బు, తెలివితేటలు ఉన్న వారి చేతి మీదుగా ప్రభుత్వం నడవవలెనని ఫెడరలిస్ట్‌లు ఆకాంక్షించినారు. ప్రజాస్వామ్యమంటే అరాజకత్వమని, వారి అభిప్రాయం. హామిల్టన్ పథకాలు వాస్తవానికి వర్తకులకు, పెట్టుబడిదారులకు లాభదాయకంగా ఉన్నాయి. రైతులకు అవి ఏ విధంగాను తోడ్పడలేదు. వ్యవసాయ ప్రాంతమైన దక్షిణ రాష్ట్రాలకన్నా పారిశ్రామిక ప్రాంతమైన ఉత్తర రాష్ట్రాలకే అవి శుభం కలిగించినాయి. ఫెడరలిస్ట్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించిన కులీన వర్గంవారి పార్టీ. అది ఔత్తరాహుల పార్టీ అని చెప్పవచ్చు. దక్షిణ ప్రాంతంలోని కొంత మంది కులీనులు ఈ పార్టీలో చేరినారు.

హామిల్టన్ ఆర్థిక పథకాలకు వ్యతిరేకంగా ఒక ఉద్యమము మొదట దక్షిణ ప్రాంతానికి చెందిన తోట పెంపకందారులలో ప్రారంభమయింది. జెఫర్సన్, జేమ్స్ మాడిసన్‌లు హామిల్టన్‌ను వ్యతిరేకించినవారికి నాయకత్వం వహించారు. వీరిని సమర్థించిన వారు దాక్షిణాత్యులు. ఉత్తర ప్రాంతంలో కూడా ఏదో కొద్ది మంది వీరికి మద్దతునిచ్చారు. వీరందరు రిపబ్లికన్‌లు. వీరు ప్రజాస్వామ్యం, మానవ హక్కుల సంరక్షణ వంటి వాటిని నెలకొల్పడమే తమ ధ్యేయమని చాటినారు. ప్రభుత్వ యంత్రాంగం రాజ్యాంగానికి అనుగుణంగా

నడుచుకోవలెనని 'సూచితాధికారాలు' అనే ముసుగులో రాజ్యాంగం తమకిచ్చిన అధికారాన్ని ఏ ప్రభుత్వ యంత్రాంగం చెలాయించరాదని వీరు వాదించినారు.

ఈ విధమైన ఆశయాలు గల రెండు పార్టీలు 1791 నాటికి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో రూపు సంతరించుకొన్నాయి. ఫెడరల్ కాంగ్రెస్ సభ్యులు, రాష్ట్ర శాసన సభల సభ్యులు ఈ రెండు పార్టీలలో ఏదో ఒక దానిలో చేరసాగినారు. రెండు పార్టీల వారు ఎన్నికలకు సిద్ధమయినారు. రెండు పార్టీలవారు వార్తాపత్రికలను ప్రచురించనారంభించారు. వాషింగ్టన్‌కు ఫెడరలిస్ట్‌లపై అభిమానం ఉన్నప్పటికీ తన మంత్రి మండలిలో హామిల్టన్, జెఫర్సన్‌లను ఇద్దరినీ ఉంచుకొన్నాడు. కాని జెఫర్సన్ 1793లో రాజీనామా చేసినాడు.

## 6.9. వాషింగ్టన్ విదేశాంగ విధానము :

అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో ప్రథమ అధ్యక్షుడైన జార్జి వాషింగ్టన్, రెండో అధ్యక్షుడైన జాన్ ఆడమ్స్ పదవీ కాలాలలోని విదేశీ వ్యవహారాలు ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నాయి. వాషింగ్టన్ తను అనుసరించిన విదేశాంగ విధానాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించి, దాని ఆచరణలో అమూల్యమైన వాస్తవికతను, నిర్ణయాలను తీసుకోవడంలో నిలకడను ప్రదర్శించాడు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు దాని ప్రయోజనాలను సాధించుకోవటానికి, సంరక్షించుకోవడానికి అంకిత భావంతో ఉన్న సంపూర్ణ స్వతంత్ర రాజ్యమని అది ఐరోపాలోని ఏ రాజ్యానికో అనుబంధంగా లోబడి ఉన్న రాజ్యం కాదని ప్రపంచానికి వెల్లడి చేయడం వాషింగ్టన్ విదేశాంగ విధాన ప్రధాన ఆశయాలలో ఒకటి. వలస మనస్తత్వంలో ఇంగ్లాండులో ఇంకా సాంప్రదాయకమైన అనుబంధాలు కొనసాగిస్తున్న కొందరు అమెరికన్లు అలాగే ఐరోపాలోని భావ విప్లవానికి, సంఘర్షణలకు అంకితమైన కొందరు అమెరికన్లు ఈ విషయాన్ని మొదటిగా గ్రహించాలని వాషింగ్టన్ వాంఛించాడు. "కొన్ని ప్రత్యేకించిన జాతుల పట్ల శాశ్వతమైన, గాఢమైన ద్వేషభావాలుకాని, మరికొన్నిటిపట్ల గాఢమైన అనుబంధలు కాని కలిగి ఉండరాదు. వాటి స్థానంలో అందరి పట్ల యోగ్యమైన స్నేహ పూరితమైన భావాలు పెంపొందించుకోవాలి" అని తన అధ్యక్ష పదవీ వీడ్కోలు సమావేశంలో తన విదేశాంగ విధానంలో ప్రధాన ధ్యేయాన్ని వాషింగ్టన్ పేర్కొన్నాడు. అమెరికా ప్రయోజనాలకు ముప్పు కలిగేటప్పుడు ఇతర దేశాలలో యుద్ధం చేయడంగాని, తాత్కాలిక ఒప్పందాలు ఏర్పరచుకోవడానికి వాషింగ్టన్ విముఖుడు కాదు కాని అమెరికా సంయుక్త రాష్ట్రాలు తన శక్తిని పెంపొందించుకోవాలంటే, దానికి చిరకాల శాంతి అవసరమని అతని విశ్వాసం. తాత్కాలికంగా అమెరికన్ హక్కులను కొన్నింటిని వదులుకొని అయినా ఇట్టి శాంతిని సాధించడం జాతి అభివృద్ధి అవసరమని అతని దృఢ విశ్వాసం. అందువల్ల బ్రిటన్‌తో సహకరించాలనే ఫెడరలిస్టుల ఒత్తిడిని, ఫ్రాన్స్‌లో సహకరించాలనే రిపబ్లికన్ల ఒత్తిడిని వాషింగ్టన్ సమర్థవంతంగా ప్రతిఘటించాడు.

**6.9.1. ఫ్రాన్స్, బ్రిటన్‌ల మధ్య యుద్ధం - వాషింగ్టన్ తటస్థ విధానము :** 1789లో ఫ్రాన్స్‌లో చెలరేగిన విప్లవంలో రక్తపాతము, హింసాకాండ పెచ్చు పెరిగి పోవడం చూసి భీతిల్లిన ఇతర ఐరోపా చక్రవర్తులు ఈ విప్లవంలో జోక్యం కలిగించుకోవడానికి ప్రయత్నించినారు. అనతి కాలంలోనే విప్లవ జ్వాలలు ఐరోపా అంతటా పాకింది. ఫ్రాన్స్ తిరిగి తన పాత శత్రువైన ఇంగ్లండ్‌లో మరొకసారి పోరాటం ప్రారంభించింది. దీనిలో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు అత్యంత క్లిష్ట పరిస్థితి దాపురించింది. ఒక వైపున అమెరికన్ విప్లవం తుది దశలో ఫ్రాన్స్ వలసల పట్ల సానుభూతిని, మిత్రత్వాన్ని ప్రదర్శించి, వలసల స్వాతంత్ర్యానికి దోహదం చేసింది. దానికి ప్రతిఫలంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు తనకు సహాయం చేయగలదని ఫ్రాన్స్ ఆదేశించింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని రిపబ్లికన్ పార్టీవారు ఫ్రెంచి విప్లవకారుల పట్ల సానుభూతి ప్రకటిస్తూ తమ దేశము బ్రిటన్‌కు తగిన శాస్తి చేసే తరుణం వచ్చిందని ఆశించారు. మరొకవైపు అమెరికన్‌లు బ్రిటన్‌లో తమకున్న సంబంధాలను మరవలేదు. స్వాతంత్ర్య సమరానికి ముందు తమకు బ్రిటన్ మాతృదేశమన్న విషయాన్ని అమెరికన్‌లు విస్మరించలేదు. అందువల్ల బ్రిటన్‌కు శత్రువైన ఫ్రాన్స్, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు కూడా శత్రువే అన్న భావాన్ని ఫెడరలిస్ట్‌లు వ్యక్తం చేస్తూ వచ్చినారు. స్వాతంత్ర్యాన్ని సాధించినంత మాత్రాన బ్రిటన్‌లో అమెరికన్‌లు తెగతెంపులు చేసుకొన్నట్లు కాదని కూడా వీరు వాదించారు. అంతేగాక అమెరికన్‌లు సముద్రాంతర వాణిజ్యంలో చాలా భాగం బ్రిటన్‌లో జరుగుతున్నది. ఇది సక్రమంగా సాగనట్లయితే హామిల్టన్ ఆర్థిక పథకాలు కూలిపోతాయి. ఈ విధంగా అమెరికన్ ప్రభుత్వం బ్రిటన్‌కు మద్దతు ఇవ్వవలెనని ఫెడరలిస్ట్‌లు, విప్లవకారులకు సహాయం చేయాలని రిపబ్లికన్‌లు వాదించారు.

ఇటువంటి పరిస్థితులలో వాషింగ్టన్ విజ్ఞత, దూరదృష్టిలో కూడిన దృఢమైన విదేశాంగ నీతిని అవలంబించాడు. 1793 ఏప్రిల్ 22న వాషింగ్టన్ తన తటస్థ విధానాన్ని ప్రకటించాడు. తన ప్రకటనలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఫ్రాన్స్, బ్రిటన్‌ల రెండింటిలో దేనిలోనూ చేతులు కలపదని వాషింగ్టన్ పేర్కొన్నాడు. అమెరికన్, ప్రజలూ ఆ రెండు దేశాలలో దేనికీ మద్దతు ఇవ్వరాదని, యుద్ధ సామాగ్రిని సరఫరా చేయరాదని ఆంక్ష విధించారు. జెఫర్సన్‌తో సహా వాషింగ్టన్ కాబినెట్ సభ్యులు తటస్థ విధానాన్ని హర్షించినారు.

**6.9.2. ఫ్రాన్స్ - అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సంబంధాలు - జినె చర్యలు :** ఫ్రెంచి రిపబ్లిక్ తొలి దౌత్య ప్రతినిధిగా ఎడ్మండ్ చార్లెస్ జినె అమెరికా సంయుక్త రాష్ట్రాలలో నియమితుడయ్యాడు. జినె చర్యల వల్ల వాషింగ్టన్ తటస్థ విధానం తీవ్రమైన పరీక్షకు లోనయింది. 1793లో జినె చార్లెస్ టన్ రేవు పట్టణంలో దిగగానే, అక్కడ అతనికి రిపబ్లికన్ పార్టీ అధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ ఘన స్వాగతం అతని విచక్షణా శక్తిని పోగొట్టింది. విచక్షణా శక్తిని కోల్పోయిన జినె అనేక అక్రమ చర్యలకు పాల్పడుతూ వాషింగ్టన్ తటస్థ విధానాన్ని ఉల్లంఘించాడు. అమెరికన్ నౌకాశ్రయాలను స్థావరాలుగా ఉపయోగించి బ్రిటీష్ వారి వర్తక సామాగ్రిని కొల్లగొట్టమని 14 ఫ్రెంచి యుద్ధ నౌకలను ప్రోత్సహించాడు. అవి 80 బ్రిటీష్ యుద్ధ నౌకలను పట్టుకొని అమెరికన్ రేవులకు చేర్చాయి. స్పానిష్ వలసల మీద దండెత్తే ఉద్దేశ్యంతో అమెరికన్ పౌరులను సైన్యంగా పోగు చేశాడు. రిపబ్లికన్ పార్టీ వారితో గూడుపుఠాణీ చేసి అమెరికన్ రాజకీయాలలో తలదూర్చాడు. చార్లెస్ టన్ రేవు నుంచి ఫిలడెల్ఫియా చేరేప్పటికి వాషింగ్టన్ తటస్థ విధాన ప్రకటన జినెకు తెలియవచ్చింది. కాని అతడు. దానిని లక్ష్య పెట్టక, అక్రమచర్యలకు పూనుకొని వాటిని కొనసాగించాడు. ఫ్రాన్స్ పట్ల ఎనలేని సానుభూతి గల విదేశాంగ కార్యదర్శి జెఫర్సన్ కూడా జినె చర్యలను గర్హించాడు. అతనికి రిపబ్లికన్ పార్టీతో గల సాన్నిహిత్యం ఆ పార్టీని అప్రతిష్ఠపాలు చేయగలదని హెచ్చరించాడు. జినె చర్యలను ఏవగించుకొన్న వాషింగ్టన్ ధృఢమైన వైఖరిని అవలంబించి అతనిని తన ప్రభుత్వానికి అయిష్టుడైన వ్యక్తిగా ప్రకటించి, అతనిని ఫ్రాన్స్‌కు వెనుకకు పిలిపించవలసిందిగా ఫ్రెంచి ప్రభుత్వాన్ని కోరాడు. తాను ఫ్రాన్స్‌కు తిరిగిపోతే గెలిటిన్‌లో తన శిరచ్ఛేదన తప్పదని తెలుసుకొన్న జినె తెలివి తెచ్చుకొని, తన పదవికి రాజీనామా ఇచ్చి, న్యూయార్క్ గవర్నరయిన క్లింటన్ యొక్క కుమార్తెను వివాహమాడి అమెరికన్ పౌరుడుగా స్థిరపడ్డాడు.

**6.9.3. బ్రిటన్ - అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సంబంధాలు - జాన్ జే సంధి :** 1783 పారిస్ సంధి తర్వాత అమెరికా సంయుక్త రాష్ట్రాలు, బ్రిటన్‌ల మధ్య వైషమ్యాలు తీవ్రమయ్యాయి. అందుకు గల కారణాలు : 1) వాయవ్య సరిహద్దులోని అమెరికన్ స్థావరాలను వదలి వెళ్ళడానికి బ్రిటన్ నిరాకరణ, 2) వాయవ్య సరిహద్దు ప్రాంతంలో రెడ్ ఇండియన్ జాతులకు బ్రిటన్ ఆయుధ సహాయం చేసి వారిని అమెరికన్ల మీద దండెత్తమని ప్రోత్సహించడం, 3) అమెరికా సంయుక్త రాష్ట్రాలు బ్రిటన్‌కు చెల్లించవలసిన రుణాలను చెల్లించకపోవడం. 4) 1793లో బ్రిటన్, ఫ్రాన్స్‌ల మధ్య యుద్ధం ఏర్పడినపుడు అమెరికన్ వ్యాపార నౌకల తటస్థ హక్కులను గౌరవించడానికి నిరాకరించడం, 5) బ్రిటీష్ వారు అనుసరించిన 'ఇంప్రెస్‌మెంట్' విధానం. అనగా తటస్థ నౌకలలో కనపడిన బ్రిటీష్ పౌరులను బ్రిటీష్ నౌకాదళంలోనికి బలవంతంగా చేర్చుకోవడం. ఈ కారణాల వల్ల బ్రిటన్, అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య విభేదాలు తీవ్రతరమయ్యాయి. 1791లో రెడ్ ఇండియన్లు బ్రిటీష్ ఆయుధాలలో పశ్చిమ ఒహియో ప్రాంతంపై దాడి చేసి అక్కడ జరిగిన ఒక యుద్ధంలో ఆ ప్రాంతం మీద గవర్నర్‌గా ఉన్న ఆర్థర్ సెయింట్ క్లేర్‌ను ఓడించారు. 1794 నాటికి, బ్రిటన్, అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య యుద్ధం తప్పదనే పరిస్థితి ఏర్పడింది.

బ్రిటన్‌తో కలహం వల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ యొక్క పటిష్టతకు భంగం వాటిల్లుతుందని హామిల్టన్ భావించాడు. నూతన రాజ్యమయిన అమెరికా సంయుక్త రాష్ట్రాల అభివృద్ధికి శాంతి అవసరమని భావించిన వాషింగ్టన్ బ్రిటన్‌తో సామరస్య పూరితమైన ఒప్పందం ఏర్పరచుకోవాలని నిశ్చయించాడు. ఫ్రెంచి విప్లవం రేకెత్తించిన భయం వల్ల, ఆర్థిక అవసరాల దృష్ట్యా ఫెడరలిస్ట్‌లు వాషింగ్టన్ నిర్ణయాన్ని సమర్థించారు. న్యూ ఇంగ్లాండ్ వర్తకులు లాభదాయకమైన వర్తకాన్ని కొనసాగిస్తుండేవారు. ఈ వ్యాపారానికి కావలసిన పెట్టుబడిని బ్రిటీషు పెట్టుబడి దారుల నుంచి పొందుతుండేవారు. బ్రిటీష్ వారు అమెరికన్ నౌకలను కొన్నిటిని పట్టుకొన్నప్పటికీ, యుద్ధ ఫలితంగా అమెరికన్ వ్యాపారులకు విశేష లాభాలు చేకూరుతుండేవి. అందువల్ల బ్రిటన్‌లో గల వ్యాపార సంబంధాలు భంగం కావడం అమెరికన్ వ్యాపారులకు ఆమోదయోగ్యం కాలేదు.

అమెరికన్ వ్యాపారులకు అభిప్రాయాలను, హామిల్టన్ భావాలను గమనించిన వాషింగ్టన్ ప్రధాన న్యాయమూర్తి అయిన జాన్ జేను ప్రత్యేక రాయబారిగా బ్రిటన్‌కు పంపాడు. ఈలోపుగా వాయవ్య ప్రాంతంలో బ్రిటీష్ వారి ఆధిక్యాన్ని అంతం చేసే సంఘటన ఒకటి జరిగింది. 1794లో జనరల్ ఆంథోని వెయిన్ ఒహియో ప్రాంతంలో ఫాలన్ టంబర్స్ వద్ద జరిగిన యుద్ధంలో రెడ్ ఇండియన్లను ఓడించాడు. దీఈనిలో ఆ ప్రాంతం మీద బ్రిటీష్ వారు ఆశ వదులుకొన్నారు. ఈ సంఘటన బ్రిటన్‌లో జాన్ జే సాధించవలసిన కార్యాన్ని సులభతరం చేసింది.

జాన్ జే బ్రిటన్‌లో 1794 నవంబర్‌లో ఒక ఒప్పందం కుదుర్చుకొన్నాడు. దీని ప్రకారం 1) వాయవ్య ప్రాంతంలో జంతువుల ఉన్ని లభించే ప్రాంతాల నుంచి, కోటల నుంచి త్వరలో ఖాళీ చేసి వెళ్ళటానికి బ్రిటన్ అంగీకరించింది. 2) విప్లవానికి ముందు అమెరికన్ పౌరులు బ్రిటీష్ వర్తకుల దగ్గర చేసిన రుణాలను తీర్చడానికి అమెరికన్ ప్రభుత్వము అంగీకరించింది. 3) రెండు దేశాల మధ్య ఉన్న తగాదాలను పరిష్కరించడానికి రెండు దేశాల ప్రతినిధులు గల కమీషన్‌ను ఏర్పాటు చేసే నిర్ణయం తీసుకోవడమయింది. 4) రుణాల విషయంలో కచ్చితంగా ఎంత సొమ్ము అమెరికన్ ప్రభుత్వం చెల్లించవలెనో, యుద్ధ సమయంలో బ్రిటన్ స్వాధీనపరచుకొన్న నౌకలకు గాను బ్రిటన్ ఎంత ధనము నష్ట పరిహారంగా చెల్లించవలెనో అను విషయాల గురించి, కెనడా, అమెరికాల మధ్య సరిహద్దు గురించి కమిషన్‌లు చర్చించేటట్లు నిర్ణయించడమయింది. 5) తటస్థ రాజ్యాల హక్కుల విషయంలో అమెరికా దృక్పథాన్ని బ్రిటన్ తోసి పుచ్చింది. 6) అమెరికా నుంచి ఫ్రాన్స్‌కు, ఫ్రెంచి పశ్చిమ ఇండీస్ దీవులకు ఆహార పదార్థాలు తీసుకొని వెళ్ళుతూ ఉన్న అమెరికన్ నౌకలను పట్టుకోనని బ్రిటన్ హామీ ఇవ్వలేదు.

జే సంధి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు దౌత్యపరమైన ఓటమి. జే సంధి బ్రిటన్‌కు లొంగుబాటు అని రిపబ్లికన్లు దానిని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు దానిని మిక్కిలిగి నిరసించారు. సభలలో, సమావేశాలలో జే బొమ్మలను తగుల బెట్టారు. జే సంధిని సమర్థించిన హామిల్టన్ మీద రాళ్ళు రువ్వారు. జే సంధిని నచ్చని విదేశాంగ కార్యదర్శి ఎడ్‌మండ్ రాండల్ఫ్ రహస్యంగా సెనెట్‌లో దాని ఓటమికై కృషి చేశాడు. దీంతో వాషింగ్టన్ రాండల్ఫ్‌ను పదవి నుంచి తొలగించాడు. వాషింగ్టన్ బ్రిటన్‌తో యుద్ధానికన్న జే సంధి మేలని భావించాడు. అతని సమర్థతతో సెనెట్ 1795 జూన్ 22న జే సంధిని ఆమోదించింది. చాలా మంది చరిత్రకారులు ఇది విజ్ఞతతో కూడిన నిర్ణయమని భావించారు.

**6.9.4. స్పెయిన్ - అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సంబంధాలు - థామస్ పిన్‌క్నే సంధి :** సముద్రాభిముఖంగా పారే మిసిసిపీ నది యొక్క చివరి రెండు వందల మైళ్ళు, దానికి ఇరువైపుల గల భూమి స్పెయిన్‌కు చెందినందువల్ల అమెరికా, ఐరోపాల మధ్య వ్యాపారానికి స్పెయిన్ వల్ల అవరోధం, ముప్పు ఏర్పడవచ్చు. అందువల్ల, మిసిసిపీ నది మీద స్వేచ్ఛగా నౌకాయానికి, అలాగే సరుకులను మిసిసిపీ నది ముఖ ద్వారం వద్ద గల న్యూ ఆర్లియన్స్ రేవులో భద్రపరచుకోవడానికి హక్కులు సంపాదించడం అత్యంత అవసరమని అమెరికా సంయుక్త రాష్ట్రాలు భావించింది. ఈ కారణం వల్ల వాషింగ్టన్ లండన్‌లో ఉన్న అమెరికన్ దౌత్య ప్రతినిధి థామస్ పిన్‌క్నేను ప్రత్యేక దౌత్యాన్ని నిర్వహించడానికై స్పెయిన్ రాజధాని మ్యాడ్రిడ్ పంపించాడు. అదే సమయంలో ఫ్రాన్స్‌కు శత్రువైన బ్రిటన్ తనపై దండెత్తి వస్తుందన్న భయంతో స్పెయిన్ అమెరికాతో స్నేహం చేయడానికి ఉబలాటపడింది. ఐరోపా యుద్ధాలలో స్పెయిన్ ఫ్రాన్స్ పక్షంలో చేరడం ఈ భయానికి దారి తీసింది.

వాషింగ్టన్ ఆదేశానుసారం థామస్ పిన్‌క్నే స్పెయిన్‌తో ఒక సంధి కుదుర్చుకొన్నాడు. దీని ప్రకారం 1) అమెరికన్‌లు మిసిసిపీ నదిని నౌకాయానానికి యద్దేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. 2) విదేశాలకు అమెరికన్ సరుకులను ఎగుమతి చేయడానికి మిసిసిపీ ముఖద్వారం దగ్గర ఉన్న న్యూ ఆర్లియన్స్ నౌకాశ్రయాన్ని అమెరికన్‌లు వాడుకోవచ్చు. 3) అమెరికా సంయుక్త రాష్ట్రాల దక్షిణ సరిహద్దుగా స్పెయిన్ ఆధీనంలోని ఫ్లోరిడా ఉత్తర సరిహద్దుగా 31వ అక్షాంశము నిర్ణయించబడింది. దీని ప్రకారం జార్జియా గురించి అమెరికా స్పెయిన్‌లకు గల తగాదా పరిష్కారమయింది. 4) ఉత్తర అమెరికాలో స్పెయిన్ వారి ఆధీనంలో ఉన్న ప్రాంతానికి సంయుక్త రాష్ట్రాలకు మధ్య నున్న సరిహద్దు ప్రాంతంలో ఉన్న రెడ్ ఇండియన్‌లను అదుపులో పెట్టడానికి చర్యలు తీసుకొందామని రెండు ప్రభుత్వాలు నిర్ణయం చేసుకొన్నాయి.

వాషింగ్టన్ విజ్ఞత, దూరదృష్టిలో కూడిన దృఢమైన విదేశాంగ నీతిని అవలంబించి, ఇంగ్లాండ్ స్పెయిన్‌లతో స్నేహ సంధులు ఏర్పరచుకొని, ఫ్రాన్స్‌పట్ల దృఢ వైఖరినవలంభించి అనేక సమస్యలను పరిష్కరించి, భౌగోళికంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల సమగ్రతను సంరక్షించాడు.

## 6.10. వాషింగ్టన్ పదవీ విరమణ :

మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయవలసిందిగా వాషింగ్టన్‌ను ఫెడరలిస్టు పార్టీకి చెందిన అతని మిత్రులు ప్రోత్సహించారు. కాని వాషింగ్టన్ అందుకు నిరాకరించాడు. అందుకు కారణాలు లేకపోలేదు. వాషింగ్టన్ శారీరకంగా అలసిపోవటంతో పాటు రాజకీయంగా నిందలకు, దూషణలకు, కొంత గురి అయ్యాడు. రాజకీయ ప్రత్యర్థులు అతనిని 'అమెరికన్ సీజర్' అని, 'దేశానికి సవతి తండ్రి' అని నిందించసాగారు. వాషింగ్టన్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి నిరాకరించి విశ్రాంతి తీసుకోవడానికి నిర్ణయించడంతో అధ్యక్ష పదవికి రెండు సార్లకు మించి ఎవరు కాని పోటీచేయకుండా ఉండటం ఒక రాజకీయ సంప్రదాయంగా నెలకొంది.

వాషింగ్టన్ పదవీ విరమణ ఉపన్యాసం ఫిలడెల్ఫియా పత్రిక అమెరికన్ డైలీ అడ్వర్‌టైజర్‌లో 1796 సెప్టెంబర్ 19న ప్రచురించబడింది. ఈ ఉపన్యాసంలో జాతీయ జీవన విధానానికి రాజకీయ పక్షాలు గొడ్డలిపెట్టు అని, స్వదేశీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి తోడ్పడవలెనని, ఐరోపా దేశాలలో శాశ్వత సంధులు కాని, శతృత్వం కాని చేయరాదని హెచ్చరించాడు.

## 6.11. వాషింగ్టన్ ఘనత :

జార్జి వాషింగ్టన్ అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఒనర్చిన సేవ అపరిమితం, అమూల్యం, ఆర్థికంగా జాతీయ ప్రభుత్వం తన పాదాల మీద తాను నిలబడేటట్లు చేసినవాడు వాషింగ్టన్. అన్నిటికీ మించి ఇతడు సముద్రాంతర దేశాలలో జటిలమైన సంబంధాలు ఏర్పరచుకోకుండా, విదేశీ యుద్ధాలలో తలదూర్చకుండా జాతిని రక్షించాడు, గణతంత్ర రాజ్యంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు ప్రయోగాత్మకంగా నెగ్గి జాతీయ వ్యక్తిత్వాన్ని సంతరించుకొంది. వాషింగ్టన్ విదేశాంగ నీతి భవిష్యత్‌లో అమెరికా అధ్యక్షులు అనుసరించిన విదేశాంగ నీతికి ఒరవడి అయింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజల స్మృతి పథంలో వాషింగ్టన్ చిరస్థాయిగా నిలిచిపోయినాడు.

## 6.12. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)

1. అలెగ్జాండర్ హామిల్టన్ ఆర్థిక సంస్కరణలను గురించి వ్రాయుము
2. జార్జి వాషింగ్టన్ విదేశాంగ విధానమును తెల్పుము
3. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో రాజకీయ పక్షాల పుట్టుక, 1797 వరకు వాని పెరుగుదల వివరింపుము ?.

### 2) లఘు వ్యాస రూప ప్రశ్నలు (15 మార్కులు)

1) జాన్ జే సంధి

2) పిన్‌క్నె సంధి

## 6.13. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America, A History
2. Monison & Commager - The Growth of American Republic (Vols. I & II)

3. Novins & Commager - A Short History of the United States

4. K. Rajayyan - History of the United States

5. C.P. Hill - A History of United States of America

6. J.W. Pratt - History of United States Foreign Policy

7. Morris, Richard (Ed.) - Basic ideas of Alexander Hamilton

8. Stanwood Edward - A History of the Presidency from 1788 to 1897

9. వేమూరి కామేశ్వరరావు & భాగవతుల లక్ష్మీనారాయణ - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర (తెలుగు అకాడమి)

- డా॥ వి.కె. మోహన్

పాఠం - 7

# జాన్ ఆడమ్స్ (1797-1801), థామస్ జెఫర్‌సన్ (1801-1809)

## 7.0. లక్ష్యం :

జాన్ ఆడమ్స్ అధ్యక్ష కాలమును, థామస్ జెఫర్‌సన్ అంతరంగిక, విదేశాంగ విధానమును గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


7.1. జాన్ ఆడమ్స్

- 7.1.1. పరిచయము
- 7.1.2. జీవితము
- 7.1.3. ఫ్రాన్స్‌తో వివాదము - XYZ ఉదంతం, కన్వెన్షన్ సంధి
- 7.1.4. వైదేశిక, విద్రోహ చర్యల చట్టాలు
- 7.1.5. వర్జీనియా, కెంటకీ శాసన సభల తీర్మానాలు
- 7.1.6. 1800 సంవత్సరపు ఎన్నికలు
- 7.1.7. అర్ధరాత్రి నియామకాలు
- 7.1.8. ఘనత

7.2. థామస్ జెఫర్‌సన్

- 7.2.1. పరిచయము
- 7.2.2. జెఫర్‌సన్ ప్రజాస్వామ్యం
- 7.2.3. న్యాయమూర్తులతో వివాదం - మార్బరీ, మాడిసన్ వివాదం
- 7.2.4. లూయిసియానా కొనుగోలు
- 7.2.5. జెఫర్‌సన్ రెండో అధ్యక్ష పాలన
- 7.2.6. ఎంబార్గో చట్టం
- 7.2.7. ఘనత

7.3. నమూనా ప్రశ్నలు

7.4. చదువదగిన గ్రంథాలు

## 7.1. జాన్ ఆడమ్స్ :

**7.1.1. పరిచయము :** అమెరికా సంయుక్త రాష్ట్రాలు మొదటి అధ్యక్షుడుగా రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన జార్జి వాషింగ్టన్ మూడోసారి ఆ పదవిని నిర్వహించడానికి పూర్తిగా నిరాకరించాడు. దాంతో వాషింగ్టన్ తరువాత ఎవరు అధ్యక్ష పదవిని అలంకరించవలెననే సమస్య ఉత్పన్నమయింది. నాటికే (1796) అమెరికా సంయుక్త రాష్ట్రాలలో రెండు రాజకీయ పార్టీలు పటిష్టమయినాయి. 1796 ఎన్నికలలో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఫెడరలిస్ట్, రిపబ్లిక్ పార్టీలు రెండూ అభ్యర్ధులను నిలబెట్టినాయి. ఫెడరలిస్ట్‌లు జాన్ ఆడమ్స్‌ను అధ్యక్ష పదవికి, థామస్ పిన్క్నెను ఉపాధ్యక్ష పదవికి నిలబెట్టినారు. రిపబ్లికన్‌లు థామస్ జెఫర్సన్, అరన్‌బర్‌లను అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు నిలబెట్టినారు. ఈ ఎన్నికలలో నూతనంగా చేరిన రాష్ట్రాలతో సహా మొత్తం 16 రాష్ట్రాలు పాల్గొన్నాయి. ఈ ఎన్నికలలో రాజకీయ ఆవేశకావేషాలు నమ్మశక్యం కానంతగా విజృంభించాయి. పరస్పర దూషణలు సామాన్యమయ్యాయి. ఎన్నికల ప్రచారం సమస్యల మీద కాక ఎక్కువగా, వ్యక్తుల మీద కేంద్రీకృతమయ్యింది. జెఫర్సన్ అనుయాయులు తమ ప్రచారంలో వాషింగ్టన్ హయాంలో విస్కీ తిరుగుబాటును బల ప్రయోగం ద్వారా అణచడాన్ని, అమెరికన్ ప్రయోజనాలు విస్మరించి బ్రిటన్‌తో జే సంధి చేసుకొన్న తీరును ప్రస్తావించి ఫెడరిలస్ట్‌లను తీవ్రంగా విమర్శించారు. అయితే జాన్ ఆడమ్స్‌కు న్యూ ఇంగ్లండ్ రాష్ట్రాల నుంచి ఎక్కువ మద్దతు లభించింది. ఆడమ్స్‌కు 71, జెఫర్సన్‌కు 68 ఎలెక్టొరల్ కాలేజీ ఓట్లు వచ్చాయి. ఫలితంగా ఆడమ్స్ స్వల్పమైన ఆధిక్యంతో అధ్యక్షుడుగా ఎన్నికయినాడు. ఆడమ్స్ తరువాత ఎక్కువ ఓట్ల వచ్చిన జెఫర్సన్ ఉపాధ్యక్షుడయినాడు.

**7.1.2. జీవితం :** జాన్ ఆడమ్స్, హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో 1755లో పట్టభద్రుడయి 1758లో మెసాచుసెట్స్ బార్‌లో న్యాయవాదిగా ప్రవేశించినాడు. బోస్టన్ గెజెట్ అను పత్రికలో బ్రిటన్ విధించిన స్టాంపుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ చాలా వ్యాసాలు ప్రచురించినాడు. 1787లో జరిగిన పారిస్ సంధి సమావేశంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల తరఫున పాల్గొన్నాడు. 1785-1788ల మధ్య కాలంలో బ్రిటన్‌లో అమెరికా సంయుక్త రాష్ట్రాల విదేశాంగ మంత్రిగా ఉన్నాడు.

జాన్ ఆడమ్స్ రాజనీతి నిష్ణాతుడు, యదార్ధవాది, నిజాయితీ పరుడు కాని చతురత లేనివాడు. వాషింగ్టన్ అధ్యక్ష కాలంలో ఎనిమిదేళ్ళు ఉపాధ్యక్షుడుగా ఉన్నా అధ్యక్షుడుగా రాణించలేకపోయినాడు. సమస్యలను ఆచరణాత్మకంగా పరిష్కరించవలసి వచ్చినపుడు సరియైన నిర్ణయాలను చేయలేకపోయాడు. అతని మొదటి పొరబాటు, వాషింగ్టన్ కార్యవర్గాన్ని యధాతథంగా కొనసాగించడం. ఈ కార్యవర్గ సభ్యులు ప్రభుత్వంలో నాయకత్వానికై హామిల్టన్ వైపు చూడసాగారు. ప్రభుత్వ విధానాలను గూర్చిన నిర్ణయాలు తీసుకోవడంలో ఆడమ్స్ఎట్టి చొరవ చూపక, ఆ విధానాల నిర్ణయాన్ని పూర్తిగా కాంగ్రెస్‌కు వదిలివేసాడు. ఫెడరలిస్ట్ పార్టీలో హామిల్టన్, ఆడమ్స్‌ల మధ్య విద్వేష భావం పెరిగింది. పరిమిత సంఖ్యలో ఉన్న కులీనీల చేతి మీదుగా నడిచే ప్రభుత్వమంటే ఆడమ్స్‌కున్న విముఖత్వం వారిద్దరినీ విడదీసింది. కార్యదర్శి వర్గంలోని సభ్యులందరితోను రహస్యంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ హామిల్టన్ వారిని తన గుప్పిట్లో ఉంచుకొనేవాడు. ఆడమ్స్‌కు ఈ తతంగమేమీ తెలిసేదికాదు. హామిల్టన్ అనుయాయులు బ్రిటన్ వైపు మొగ్గుతూ అవకాశం చిక్కినదే తడవుగా బ్రిటన్, ఫ్రాన్స్‌లకు జరుగుతున్న యుద్ధంలో బ్రిటన్‌వైపు చేరడానికి సంసిద్ధులను చేయవలెనని హామిల్టన్ ప్రయత్నించాడు. కాని అతని ప్రయత్నం ఫలించలేదు.

**7.1.3. ఫ్రాన్స్‌తో వివాదము - XYZ ఉదంతం, కన్వెషన్ సంధి :** అమెరికా సంయుక్త రాష్ట్రాలు 1794లో బ్రిటన్‌తో చేసుకున్న జే సంధి ఫ్రాన్స్‌కు ఆగ్రహం కలిగించింది. ఫ్రాన్స్‌కు శత్రువైన బ్రిటన్‌తో అమెరికా సంయుక్త రాష్ట్రాల మైత్రికి అది మొదటి మెట్టుగా ఫ్రాన్స్ భావించింది. అమెరికా స్వాతంత్ర సమర కాలంలో ఫ్రాన్స్, అమెరికాల మధ్య జరిగిన ఫ్రెంచి - అమెరికా ఒప్పందాన్ని (1778) జే సంధి ఉల్లంఘిస్తుందని ఫ్రాన్స్ అభిప్రాయపడింది. ఇందుకు ప్రతీకారచర్యగా ఫ్రెంచి యుద్ధ నౌకలు అమెరికన్ వ్యాపార నౌకలను పట్టుకోవడం ప్రారంభించాయి. 1797 మధ్య కాలానికి ఫ్రెంచివారు దాదాపు 300 అమెరికన్ నౌకలను పట్టుకొన్నారు. దీనికి తోడు పారిస్‌లోని ప్రభుత్వం నూతనంగా నియమించిన అమెరికన్ దౌత్య ప్రతినిధిని నిరాకరించింది. ఫ్రాన్స్ యొక్క ఈ అహంకారపూరిత చర్యల పట్ల జాతి అంతా ఆగ్రహావేశ పూరితమై ఉన్నప్పటికీ జాన్ ఆడమ్స్ తన సంయమనం కోల్పోకుండా వ్యవహరించాడు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు యుద్ధాలకు దూరంగా ఉండవలెనని వాషంగ్టన్ తన వీడ్కోలు సందేశంలో ఇచ్చిన సందేశాన్ని మనసులో ఉంచుకొని

ఫ్రాన్స్ దుశ్చర్యల వల్ల తలెత్తిన సమస్యలను ఆడమ్స్ సంప్రదింపుల ద్వారా పరిష్కరించదలచాడు. ఫ్రాన్స్‌లో ఈ సంప్రదింపులు జరపడానికై జాన్ మార్షల్, ఎల్‌బ్రిడ్జ్ జెర్రీ, చార్లెస్ సి. పింక్నేలతో కూడిన దౌత్య సంఘాన్ని ఫ్రాన్స్‌కు పంపించాడు.

ఆనాడు ఫ్రాన్స్ 'డైరెక్టరీ' పరిపాలనలో ఉన్నది. ఆ ప్రభుత్వ విదేశ వ్యవహార కార్యదర్శి టాలీరాండ్ లంచగొండి. ఇతడు అమెరికన్ ప్రభుత్వ ప్రతినిధులలో సంప్రదింపులు జరపడానికి ముగ్గురు అనామకులను వారి దగ్గరికి పంపినాడు. వారిని XYZ అని ఫ్రెంచి అధికార పత్రాలలో పేర్కొన్నారు. టాలీరాండ్‌తో అమెరికన్ రాయబారులు సంప్రదింపులు జరపాలంటే కింది షరతులకు ఒప్పుకోవాలని XYZ లు కోరినారు. అవి : 1) టాలీరాండ్‌కు, డైరెక్టరీకి అమెరికన్ ప్రభుత్వము 2,50,000 డాలర్లు లంచం ఇవ్వవలె. 2) అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఫ్రెంచి ప్రభుత్వానికి 32 మిలియన్ ఫ్లోరిన్లు రుణంగా ఇవ్వాలి. ఇది విని పింక్నే 'ఆరు పెన్నీలు కూడా ఇవ్వము' అని గర్జించినాడు. అమెరికన్ రాయబారులు ఆగ్రహావేశాలతో 1798లో న్యూయార్క్‌కు తిరిగి వచ్చినారు. XYZ ఉదంతం దేశమంతటా వార్తా పత్రికల ద్వారా తెలియగానే అమెరికన్‌లు కోపోద్రిక్తులయినారు. ఫ్రాన్స్‌తో దృఢంగా వ్యవహరించిన జాన్ మార్షల్ ప్రజల ప్రశంసలనందుకొన్నారు.

XYZ ఉదంతం అవకాశంగా తీసుకొని ఫెడరలిస్ట్‌లు, ఫ్రాన్స్‌పై యుద్ధ ప్రకటనకై ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి, ప్రజలలో తమ పలుకుబడిని పెంచుకోదలచారు. ఫ్రాన్స్ పట్ల సానుభూతిగల రిపబ్లికన్‌లు కూడా ఆడమ్స్‌కు సంపూర్ణ సహకారమిచ్చినారు. ఫ్రాన్స్‌తో యుద్ధానికి కావలసిన ఏర్పాట్లు చేయడంలో అమెరికన్‌లు నిమగ్నులయినారు. నౌకాశాఖను ఏర్పరచినారు. సైనికుల సంఖ్యను పెంచినారు. జనరల్ వాషింగ్టన్‌ను సైన్యాధిపతిగా చేయడానికి నిర్ణయించారు. ఇందుకు వాషింగ్టన్ అంగీకరించాడు. వాషింగ్టన్ కోరిక మేరకు సైన్యంలో మేజర్ జనరల్‌గా నియమింపబడిన హామిల్టన్ ఫ్రాన్స్‌లో యుద్ధం అవకాశంగా ఫ్లోరిడా, లూయిసియానా, మెక్సికోలు జయించి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో చేర్చాలని కలలు కన్నాడు. అమఅమెరికన్ విప్లవ కాలంలో ఫ్రాన్స్‌తో 1778లో చేసుకొన్న సంధి రద్దయింది. ఫ్రాన్స్‌తో వాణిజ్య సంబంధాలు ఆగిపోయినాయి. 1778 నుంచి 1800 వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాల ఫ్రాన్స్ మధ్య అప్రకటిత నౌకా యుద్ధం కొనసాగింది. దాదాపు 100 ఫ్రెంచి నౌకలను అమెరికా సంయుక్త రాష్ట్రాలు స్వాధీనం చేసుకొన్నది. యుద్ధం సంభవిస్తే ఫ్రాన్స్ పక్షాన ఉన్న స్పెయిన్‌లో కూడా పోరాడవలసివస్తుందని అమెరికా సంయుక్త రాష్ట్రాలు స్పెయిన్‌కు చెందిన లాటిన్ అమెరికన్ వలసలపై దండెత్తడానికి తగిన ప్రయత్నాలు చేయసాగింది.

యుద్ధాలలో పూర్తిగా మునిగి ఉన్న ఫాన్స్, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మరి ఒక యుద్ధాన్ని కొని తెచ్చుకోవడానికి సిద్ధంగా లేదు. అమెరికన్లకు ఆయుధాలు, యుద్ధ సరఫరాలు చేసి బ్రిటిష్ వారు వారికి అత్యంత సన్నిహితులయ్యారు. అందువల్ల టాలీరాండ్ మరొక నూతన దౌత్య ప్రతినిధిని ఫ్రాన్స్‌కు పంపమని, వారిని సకల మర్యాదలతో ప్రభుత్వం ఆహ్వానిస్తుందని ఆడమ్స్‌కు తెలియజేసాడు. అందువల్ల ఆడమ్స్ తిరిగి ముగ్గురు దౌత్య ప్రతినిధులను ఫ్రాన్స్‌కు పంపించినాడు. ఫ్రాన్స్‌తో చేసే శాంతి ప్రయత్నాలలో తనతో అంగీకరించని విదేశాంగ కార్యదర్శి అయిన పికరింగ్‌ను ఆడమ్స్ పదవినుంచి తొలగించాడు. నెపోలియన్ పరిపాలనలో ఉన్న ఫ్రాన్స్ అమెరికాతో సంధి చేసుకోవడానికి అంగీకరించింది. సుదీర్ఘమైన సంప్రదింపుల తరువాత పారిస్‌లో 1800 కన్వెన్షన్ అనే పేరుతో నెపోలియన్ అమెరికా సంయుక్త రాష్ట్రాలతో సంధి అంగీకరించాడు.

ఈ సంధి ప్రకారం 1) అమెరికాకు ఇబ్బందికరంగా పరిణమించిన 1778 ఫ్రెంచి - అమెరికా సంధిని రద్దు చేయటానికి ఫ్రాన్స్ అంగీకరించింది. 2) ఫ్రాన్స్ యుద్ధ నౌకల చేత నష్టపడిన అమెరికన్ నౌకా వ్యాపారులకు ఫ్రాన్స్ చెల్లించవలసిన 20 మిలియన్ డాలర్ల నష్ట పరిహారాన్ని తానే చెల్లించడానికి అమెరికా అంగీకరించింది. 3) తటస్థ దేశాల నౌకలలో రవాణా అయ్యే సరకులను యుద్ధ సామాగ్రిగా పరిగణించరాదు.

దృఢ సంకల్పంతో జాన్ ఆడమ్స్ చేసిన ఈ శాంతి సంధి ప్రయత్నం ప్రశంసా పాత్రమయ్యింది. యుద్ధం వల్ల అమెరికాకు ఏర్పడే అనేక కష్టాలను ఈ సంధి ద్వారా ఆడమ్స్ నివారించగలిగాడు. ఫ్రాన్స్ నుంచి లూయిసియాను, జెఫర్సన్ కొనుగోలు చేయడానికి ఆడమ్సే మార్గాన్ని సుగమం చేశాడు. ఈ శాంతి సంధి వల్ల ఆడమ్స్ ప్రజానురాగానికి దూరమయ్యాడు. కాని ఈ శాంతి సంధి ద్వారా జాతికి తాను గొప్ప మేలు చేశాననే తృప్తిని ఆడమ్స్ మిగుల్చుకొనినాడు.

**7.1.4. వైదేశిక, విద్రోహ చర్యల చట్టాలు :** అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మధ్యంతరంగా ఏర్పడిన ఫ్రెంచి వ్యతిరేక వాతావరణం అవకాశంగా కాంగ్రెస్‌లో అధిక సంఖ్యలో ఉన్న ఫెడరలిస్టుల తమ ప్రత్యర్థులయిన జెఫర్‌సన్ అనుయాయుల పలుకుబడిని తగ్గించే విధంగా కొన్ని చట్టాలను ప్రవేశపెట్టారు. 1798 జూన్ 18న ప్రవేశపెట్టిన ఈ చట్టాలను విదేశ, విద్రోహ చట్టాలని పిలిచారు.

ఐరోపాలోని అట్టడుగు వర్గాలవారు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వలస రావడం కులీన సంపన్న వర్గాలకు చెందిన ఫెడరలిస్ట్‌లకు ఇష్టం లేదు. ఇట్లా వలస వచ్చిన వారిని జెఫర్‌సన్ అనుయాయులు స్వాగతించి తమకు అనుకూలమైన ఓటర్లుగా మార్చుకోసాగారు. ఇది ఇష్టపడని ఫెడరలిస్ట్‌లు ఈ అట్టడుగు వర్గాలు అమెరికాకు వలస రాకుండా నిరుత్సాహ పరచడానికై వారికి కొన్ని అడ్డంకులు కల్పించే విధంగా విదేశీ చట్టాన్ని ప్రవేశపెట్టారు. అమెరికన్ పౌరసత్వాన్ని పొందడానికి అయిదేళ్ళ నివాసం ఆనాడు షరతుగా ఉండేది. ఈ విదేశీ చట్టం అయిదేండ్ల నివాసమనే షరతును పధ్నాలుగేండ్లకు పొడిగించింది. ఈ చట్టం విదేశీయులకు స్వాగతం పలికి వారిని త్వరితంగా పౌరులుగా జాతిలో కలుపుకొనే అమెరికన్ మర్యాదకు, సాంప్రదాయానికి స్వస్తి పలికింది.

మరి రెండు విదేశీ చట్టాల ద్వారా దేశానికి అపాయం కలిగించే వారని భావించిన విదేశీయులకు శాంతి సమయంలో దేశం నుంచి బహిష్కరించడానికి, యుద్ధ సమయాలలో వారిని కారాగారంలో బంధించడానికి అధ్యక్షునికి అధికారాలు ఇవ్వబడ్డాయి. ఫ్రాన్స్ మీద ఏ క్షణంలో అయినా అమెరికా యుద్ధం ప్రకటించవచ్చు అని తలచిన సమయంలో ఇలాంటి చట్టాలు సమర్థనీయమైనప్పటికీ, అధ్యక్షునికి ఈ చట్టాల వల్ల సంక్రమించే అధికారాలు అమెరికన్ సాంప్రదాయానికి, రాజ్యాంగ ఉద్దేశాలకు విరుద్ధమైనవి.

ఆనాడు నెలకొని ఉన్న పరిస్థితులలో ఈ విదేశీ చట్టాలు పూర్తిగా అసమంజసమైనవని చెప్పటానికి వీలు లేదు. ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఐర్లాండ్ మొదలయిన దేశాల నుంచి వందల కొద్దీ విదేశీ ఆటంకవాదులు ఆయా దేశాలలోని ప్రభుత్వాల ఆగ్రహాన్ని తప్పించుకోవడానికై అమెరికాలో స్థిరపడ్డారు. ఇలాంటి వారంతా జెఫర్‌సన్ అనుయాయులై బ్రిటిష్ వ్యతిరేక విధానాలకై ఘోషించసాగారు. వీరిలో కొందరు దేశ బహిష్కారానికి గురియైన ఫ్రెంచి గూఢచారులున్నారు. ఈ విదేశీ చట్టాలను ఆడమ్స్ కఠినంగా అమలు పరచలేదు. అయితే ఈ చట్టాలు కొందరు విదేశీ ఆందోళనకారులకు భీతిని కలిగించి, వారు తమంతట తామే అమెరికాను విడిచి వెళ్ళేటట్లు చేశాయి. ఇలాంటి వారిలో రెండు నౌకలలో దేశాన్ని వదలి పెట్టిపోయిన ఫ్రెంచివారున్నారు. అంతేగాక చాలా మంది విదేశీయులను అమెరికాకు వలస రాకుండా ఈ చట్టాలు నిరుత్సాహపరిచాయి.

ఈ చట్టం కింద రిపబ్లికన్ పార్టీకి చెందిన పత్రికా సంపాదకులను, ఇతరులను 24 మందిని నిర్బంధంలోని తీసుకొన్నారు. కాని వీరిలో 10 మంది మీద మాత్రమే న్యాయ విచారణ జరిపి శిక్షలు విధించడం జరిగింది. నిర్బంధితులైన వారిలో ఎన్నడూ మరొకరికి ఎట్టి హాని తలపెట్టనివారున్నారు. ఈ చట్టాల వల్ల అమెరికన్‌లలో చెలరేగిన అలజడిని రిపబ్లికన్‌లు తమ స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకొన్నారు. ఫెడరలిస్ట్‌లు దేశంలో ఒకే పార్టీని స్థాపించడానికి కృషి చేస్తున్నారని, వారు విదేశాలలో జన్మించి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వచ్చి రాజ్యాంగానికి శత్రువులయినారని ప్రచారాలు చేయసాగారు. ఇటువంటి ప్రచారాల ద్వారా రానున్న ఎన్నికలలో ఫెడరలిస్ట్ పార్టీని చిత్తుగా ఓడించగలమని రిపబ్లికన్‌ల ఆశ.

**7.1.5. వర్జీనియా, కెంటకీ శాసన సభల తీర్మానాలు :** విదేశ, విద్రోహ చట్టాల యెడల ఆగ్రహం చెందిన రిపబ్లికన్లు ఆ చట్టాల మీద ప్రతిచర్య తీసుకోవడానికి ఉద్యుక్తులయ్యారు. ఫెడరలిస్ట్‌లు తమ నిరంకుశ చర్యలతో వాక్, పత్రికా స్వాతంత్ర్యాలతో బాటు, ఇతర రాజ్యాంగ హక్కులను కూడా హరించి వేయగలరని జెఫర్‌సన్ భీతిల్లాడు. అంతేగాక, అతని రాజకీయ పక్షమైన డెమోక్రాటిక్ రిపబ్లికన్లను కూడా నామరూపాలు లేకుండా చేయగలరని భయపడ్డాడు. ఇదే జరిగితే అనర్థదాయకమైన ఏక పక్ష నిరంకుశత్వానికి దేశం లోనవుతుందని భీతిల్లాడు. కాని ఉపాధ్యక్షుడుగా విదేశ, విద్రోహ చట్టాలను బహిరంగంగా ఖండించలేని సంకట పరిస్థితి జెఫర్‌సన్‌కు ఎదురయ్యింది. ఆ చట్టాలను బహిరంగంగా ఖండిస్తే దేశ ద్రోహం కింద జెఫర్‌సన్ శిక్షార్హుడవుతాడు. అందువల్ల అతడు రహస్యంగా కొన్ని తీర్మానాలు రాసి పంపి, వాటిని 1798లో కెంటకీ రాష్ట్ర శాసనసభ చేత ఆమోదింపజేసాడు. జెఫర్‌సన్ మిత్రుడైన మ్యాడిసన్ రచించిన ఇలాంటి తీర్మానాలనే కొన్నింటిని 1798లో వర్జీనియా రాష్ట్ర శాసనసభ ఆమోదించింది. అమెరికాలోని 13 రాష్ట్రాల సమాఖ్య ప్రభుత్వాన్ని సృష్టించి, దాని అధికార పరిధిని నిర్ణయిస్తూ ఒక ఒప్పందానికి వచ్చాయి. అందువల్ల సమాఖ్య ప్రభుత్వం దాని అధికార పరిధిని దాటి ఒప్పందాన్ని ఉల్లంఘించిందా

లేదా అని నిర్ణయించవలసిన న్యాయ నిర్ణేతలు రాష్ట్రాలే. విదేశ, విద్రోహ చట్టాలకు ప్రవేశపెట్టి సమాఖ్య ప్రభుత్వం దానికి గల రాజ్యాంగ అధికారాలను అధిగమించిందని వర్జీనియా, కెంటకీ తీర్మానాలు పేర్కొన్నాయి. కాని ఇతర రాష్ట్రాల శాసనసభలు వర్జీనియా, కెంటకీ తీర్మానాలను సమర్ధించలేదు. ఫెడరలిస్టులు ఆధిక్యంలో వున్న రాష్ట్రాల శాసనసభలు కొన్ని వర్జీనియా, కెంటకీ తీర్మానాలను ఖండించాయి. అయితే రిపబ్లికన్‌ల విస్తృత ప్రచారం వల్ల ఫెడరలిస్ట్‌లు అపఖ్యాతి పాలైరి.

**7.1.6. 1800 సంవత్సరపు ఎన్నికలు :** 1800 సంవత్సరపు అమెరికా సంయుక్త రాష్ట్రాల ఎన్నికలలో ఫెడరలిస్ట్‌లు జాన్ ఆడమ్స్, పిన్‌క్నేలను, రిపబ్లికన్‌లు జెఫర్‌సన్, ఆరన్‌బర్‌లను తమ తమ అభ్యర్థులుగా నిలబెట్టినారు. ఆడమ్స్ దగ్గర ఉపాధ్యక్షుడుగా పనిచేసిన జెఫర్‌సన్ తన పదవీ కాలంలో రిపబ్లికన్ పార్టీని పటిష్టం చేయడానికి నిర్విరామంగా కృషి చేసినాడు. ఉత్తేజ పూరితమైన పత్రికా వ్యాసాల ద్వారా తనపార్టీలో నవ చైతన్యాన్ని కలిగించాడు. కాంగ్రెస్‌లోని అభ్యర్థులలో తనకు గల సన్నిహిత్వం ద్వారాను, తనకు దూరంగా ఉన్న వారిలో లేఖల ద్వారాను సంప్రదింపులు జరిపి పార్టీ ఔన్నత్యానికి పాటు పడినాడు. కాని ఈ తతంగమంతా బహిరంగంగా కాక తెరవెనుకకు ఉండి జరిపించేవాడు. తన ఉద్దేశాలను వెలిబుచ్చేటపుడు కూడా 'మన స్నేహితుల దృష్టిలో' లాంటి ఊత పదాలను వాడి వీలైనంత వరకు తన పేరు బయటకు పొక్కకుండా జాగ్రత్తపడేవాడు. ముఖ్యంగా జెఫర్‌సన్ రిపబ్లికన్ వార్తా పత్రికల ద్వారా పార్టీ సమైక్యానికి కృషి చేశాడు. రిపబ్లికన్‌లు తమ ఎన్నికల ప్రచారంలో వైదేశిక, విద్రోహ చర్యల చట్టాలను తీవ్రంగా విమర్శించారు. సైన్యానికి అయ్యే ఖర్చును ఖండించినారు. ఫ్రెంచి యుద్ధాలలో అమెరికా ప్రభుత్వము ప్రజల నుంచి శక్తికిమించిన ధనాన్ని పన్నుల రూపంలోరాబట్టిందని ప్రచారం చేసినారు. ఫెడరలిస్ట్‌లు తమ ప్రచారంలో ప్రభుత్వం ప్రజలకు చెల్లించవలసిన బాకీలను జెఫర్‌సన్ ఎగవేస్తాడని, నౌకాదళాన్ని రూపుమాపుతాడని ప్రజలను భయపెట్టినారు. జెఫర్‌సన్ తాగుబోతని, నాస్తికుడని, సమూల సంస్కరణ విధాన ఉన్మాత్తుడని విమర్శించారు. రిపబ్లికన్‌ల విజయం నియంతృత్వానికి, భీతావహ పరిపాలనకు దారి తీస్తుందని ఫెడరలిస్ట్‌లు ప్రచారం చేశారు. కాని ఇట్టి విపరీత ప్రచారం ఫెరలిస్ట్‌లకు ఎలాంటి సత్ఫలితాన్ని ఇవ్వలేదు. వారి యుద్ధ ప్రణాళికల వల్ల, పౌర స్వేచ్ఛల మీద వారు నడిపిన పోరాటం వల్ల ఫెడరలిస్ట్‌లు ప్రజాభిమానాన్ని చాలా వరకు నష్టపోయారు.

1800 ఎన్నికలలో నిలచిన అభ్యర్థులకు ఎలక్టోరల్ వోట్లు ఈ క్రింది విధంగా వచ్చాయి.

| | | | | |
|---|---|---|---|---|
| థామస్ జఫర్‌సన్ | - | రిపబ్లికన్ | - | 73 ఓట్లు |
| ఆరన్‌బర్ | - | రిపబ్లికన్ | - | 73 ఓట్లు |
| జాన్ ఆడమ్స్ | - | ఫెడరలిస్ట్ | - | 65 ఓట్లు |
| సి.సి. పింక్నె | - | ఫెడరలిస్ట్ | - | 64 ఓట్లు |
| జాన్ జె | - | ఫెడరలిస్ట్ | - | ఒక ఓటు |

ఈ ఫలితాలు ఫెడరలిస్ట్ పార్టీ దేశంలో తన పలుకుబడిన కోల్పోయిందన్న సత్యాన్ని రుజువు చేసినాయి. ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు మాత్రం ఈ ఎన్నికలలో ఫెడరలిస్ట్ పార్టీని బలపరిచినాయి. రిపబ్లికన్ పార్టీ జాతీయ పార్టీ స్థానాన్ని ఆక్రమించింది. మధ్య, దక్షిణ రాష్ట్రాలు చాలా వరకు రిపబ్లికన్ల వశమయ్యాయి.

ఈ పరిణామానికి ఆడమ్స్, హామిల్టన్‌ల మధ్య చెలరేగిన రాజకీయ స్పర్థ చాలా వరకు దోహదం చేసింది. 1796 సంవత్సరం ఎన్నికల్లో జెఫర్‌సన్ ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యేందుకు హామిల్టన్ సహాయపడినాడు. 1800 సంవత్సరం ఎన్నికలలో ఆడమ్స్ అధ్యక్షుడుగా, పింక్నె ఉపాధ్యక్షుడుగాను ఎన్నిక కావలెనని ఫెడరలిస్ట్‌ల ఆకాంక్ష. కాని వ్యక్తిగతమైన స్పర్థలేగాక హామిల్టన్ అతని అనుచరులు ఫ్రాన్స్‌తో జరిపిన నౌకా యుద్ధాన్ని సంప్రదింపుల ద్వారా ఆడమ్స్ ఆపివేయడం గొప్ప నేరంగా ప్రకటించినారు. అందుకు శిక్షగా హామిల్టన్ 1800 సంవత్సరం ఎన్నికలలో ఆడమ్స్‌కు వ్యతిరేకంగా పనిచేశాడు. దీని వల్ల ఆడమ్స్, పింక్నెలకు కావలసిన ఓట్లు మెజారిటీ రాకపోగా జెఫర్‌సన్, ఆరన్‌బర్‌లకు ఒక్కొక్కరికి సరిసమానంగా 73 ఓట్లు వచ్చినాయి.

అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులకు సరి సమానంగా ఓట్లు వచ్చినపుడు తుది నిర్ణయం ప్రజా ప్రతినిధుల సభలో జరగవలె. కాని సభలో 35 సార్లు వోటింగ్ జరిగినా, జెఫర్‌సన్, ఆరన్‌బర్‌లలో ఎవరికీ ఖచ్చితమైన మెజారిటీ రాలేదు. చివరకు హామిల్టన్ తన పలుకుబడిని ఉపయోగించి కొంత మంది ఫెడరలిస్ట్‌లు ఆరన్‌బర్‌కు ఓటు వేయకుండా 'బ్లాంక్ ఓట్లు'గా చేసినాడు. 36వ బాలట్‌లో థామస్ జెఫర్‌సన్ అధ్యక్షుడుగా ఎన్నికయినాడు.

అధ్యక్ష ఎన్నికలలో ఎలాంటి ప్రతిష్టంబన తిరిగి ఏర్పడకుండా 1804లో 12వ రాజ్యాంగ సవరణ చేయడం జరిగింది. ఈ సవరణ ప్రకారం అధ్యక్షునికి, ఉపాధ్యక్షునికి ఎలక్టొరల్ కాలేజీలో వేర్వేరుగా ఓట్లు వేయడం జరుగుతుంది.

**7.1.7. అర్ధరాత్రి నియామకాలు :** 1800 సంవత్సరపు ఎన్నికల్లో ఫెడరలిస్ట్‌లు అధ్యక్ష పదవినే గాక, కాంగ్రెస్‌లో కూడా తమ అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని వారు ప్రయత్నించారు. ప్రభుత్వాన్ని వదలి బయటికి పోయేముందు ఫెడరలిస్ట్‌లు న్యాయశాఖలో తమ బలాన్ని పటిష్టం చేసుకొన్నారు. 1801 మార్చి 3వ తేది అర్ధరాత్రి వరకు ఆడమ్స్ అధ్యక్షుడుగా కొనసాగాడు. తన అధ్యక్ష పదవి చివరి రోజులలో ఆడమ్స్ చాలా మంది ఫెడరల్ న్యాయమూర్తులను నియమించాడు.

1800 లో జరిగిన అధ్యక్ష ఎన్నిక తర్వాత కొనసాగిన 'లేమ్‌డక్ కాంగ్రెస్' (అనధికార కాంగ్రెస్) 1801 న్యాయశాఖ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం డిస్ట్రిక్ట్ జడ్జీల, సంచార న్యాయస్థానాల న్యాయమూర్తుల సంఖ్యను బాగా పెంచింది. ఈ పదవులన్నింటిలో ఆడమ్స్ ఫెడరలిస్ట్‌లను నియమించాడు. ఆడమ్స్ చేసిన ఈ నియామకాలను 'అర్ధరాత్రి నియామకాలు' అని పిలిచారు. తన పదవీ విరమణ ముందు ఆడమ్స్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా నియమించగలిగాడు. జాన్‌మార్షల్‌ను ఆడమ్స్ సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమించాడు.

ఆడమ్స్ తన అధ్యక్ష పదవీ కాలంలో చేసిన కార్యాలన్నింటిలో జాన్ మార్షల్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించడం అతి ముఖ్యమయింది. కాలాంతరంలో జెఫర్‌సన్ అధ్యక్ష విధానాలకన్నా మార్షల్ తదితర ఫెడరలిస్ట్ న్యాయమూర్తులు చేసిన తీర్పులు అమెరికా పురోభివృద్ధిపై అధిక ప్రభావాన్ని కనపరచాయి. మార్షల్ నాయకత్వంలో న్యాయస్థానాలు రాష్ట్రాల అధికారాలను పరిమితం చేసి ఫెడరల్ ప్రభుత్వ అధికారాలను పెంచే విధంగా తీర్పులు ఇచ్చాయి. వ్యాపార వర్గాల ఆస్తి హక్కులకు అత్యధికమైన రక్షణ కల్పించాయి. ఫెడరలిస్ట్‌లు మరలా అధికారంలోనికి రాకపోయినప్పటికీ అది ఫెడరలిస్ట్ పార్టీ అభిమానులైన న్యాయమూర్తుల ద్వారా అమెరికన్ వ్యవస్థలపైన తన ప్రభావాన్ని కొనసాగించింది.

**7.1.8. ఘనత :** జాన్ ఆడమ్స్ విధానాల వలన ఫెడరలిస్ట్ పార్టీ అపఖ్యాతి పాలగుటయే గాక తాను రెండో సారి అధ్యక్షుడుగా ఎన్నికగు అవకాశాన్ని పోగొట్టుకొన్నాడు. కాని తన పదవి కంటే, పార్టీ శ్రేయస్సు కంటే దేశ శ్రేయస్సు దృష్టిలో వుంచుకొని ఆడమ్స్ వ్యవహరించుట అతని నిష్కళంక జాతీయతకు మచ్చు తునక, భావితరాల వారికి ఆదర్శము.

## 7.2. థామస్ జెఫర్‌సన్ :

**7.2.1. పరిచయం :** జాన్ ఆడమ్స్ తరువాత అమెరికా సంయుక్త రాష్ట్రాల మూడో అధ్యక్షునిగా ఎన్నికైన థామస్ జెఫర్‌సన్ వర్జీనియా రాష్ట్రంలోని షాడ్‌వెల్‌లో 1743 ఏప్రిల్ 13న జన్మించాడు. ఇతని తండ్రి పీటర్ జెఫర్సన్ సామాన్య రైతు కుటుంబానికి చెందినవాడు. తల్లి జేన్ ధనవంతుల కుటుంబానికి చెందింది. జెఫర్‌సన్, విలియం అండ్ మేరీ కళాశాలలో పట్టభద్రుడయినాడు. ఇతడు గ్రంథ పఠనం పట్ల ఎక్కువ ఆసక్తి చూపేవాడు. ఇతనికి ఫ్రెంచి, స్పానిష్, ఇటాలియన్, ఆంగ్లో శాక్సన్ మొదలయిన భాషలలో ప్రవేశము ఉండేది. ఇతనికి తత్వశాస్త్రము, చరిత్ర, న్యాయశాస్త్రము, రాజనీతి శాస్త్రాలలో అభిరుచి మెండు. జంతు, వృక్ష, రసాయన, వ్యవసాయ శాస్త్రాలలో గొప్ప పాండిత్యం ఉండేది. మాంటిసెల్లోలోని తన స్వగృహానికి కావలసిన నమూనాను తానే స్వయంగా తయారుచేసినాడు. ఇతనికి సంగీతంలో కూడా మంచి ప్రావీణ్యం ఉండేది. ఇతడు తన వృద్ధాప్యంలో వర్జీనియా విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పినాడు.

జెఫర్‌సన్ ప్రథమంలో న్యాయవాద వృత్తి చేపట్టినాడు. 1769లో వర్జీనియా శాసన సభ హౌస్ ఆఫ్ బర్గెసెస్‌కు ఎన్నికయినాడు. 1775-76లో జరిగిన కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశానికి జెఫర్‌సన్ హాజరయినాడు. స్వాతంత్ర్య ప్రకటన పత్రాన్ని జెఫర్‌సన్ స్వహస్తాలతో లిఖించినాడు. 1779-81 మధ్య కాలంలో వర్జీనియా గవర్నర్‌గా ఉన్నాడు. 1783-84లో అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడుగా ఉన్నాడు. 1784 భూ చట్టాన్ని జెఫర్‌సన్ స్వయంగా తయారుచేసినాడు. 1785-89 మధ్య కాలంలో ఫ్రాన్స్‌లో అమెరికా సంయుక్త రాష్ట్రాల విదేశీ రాయబారిగా ఉన్నాడు. వాషింగ్టన్ అధ్యక్ష పదవీ కాలంలో విదేశాంగ శాఖ కార్యదర్శిగా ఉన్నాడు. ఆడమ్స్ అధ్యక్ష పదవీ కాలంలో ఉపాధ్యక్షుడుగా ఉన్నాడు. హామిల్టన్ ఆర్థిక విధానాలతో విభేదించి వాషింగ్టన్ కార్యదర్శి మండలి నుంచి 1793లో రాజీనామా చేసి, రిపబ్లికన్ పార్టీకి నాయకత్వం వహించాడు.

**7.2.2. జెఫర్‌సన్ ప్రజాస్వామ్యం :** 1801 మార్చి 4న అమెరికా సంయుక్త రాష్ట్రాల నూతన రాజధాని వాషింగ్టన్‌లో మూడో అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన థామస్ జెఫర్‌సన్ నిరాండర వ్యక్తి, గొప్ప మానవతావాది, సృష్టిలో మానవులందరికీ కొన్ని హక్కులున్నాయని కేవలం భాగ్యవంతులకే అవి పరిమితమై ఉండరాదని అతడు వాదించేవాడు. ఆ హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ కర్తవ్యమని భావించేవాడు. వ్యవసాయము సర్వతోముఖాభివృద్ధి పొందవలెనని అభిలషించేవాడు. జన బాహుళ్యంలో కిక్కిరిసి ఉన్న పట్టణాలంటే అతనికి చాలా ఏవగింపు. ప్రజలపై ప్రభుత్వాధికారం ఎంత తక్కువగా ఉంటే అంత మంచిదని వాదించేవాడు. లాంఛన గౌరవాలు, బిరుదు సత్కారాలు, ఆడంబరాలు, రాజమర్యాదలు తుడిచివేయడానికి ఇతడు ప్రయత్నం చేసినాడు. అధ్యక్ష పదవీ ప్రమాణ స్వీకారం చేసే రోజున కూడా కోచ్‌లో వెళ్ళక కాలినడకనే వెళ్ళినాడు. కాంగ్రెస్‌లో తాను ఇవ్వవలసిన ఉపన్యాసాలను తన గుమాస్తా చేత చదివించేవాడు. తాను నిరంకుశ ధోరణిలో వ్యవహరించడం లేదని ఈ రూపంలో అతడు కాంగ్రెస్‌కు తెలిపేవాడు. తన పదవీ ప్రమాణ స్వీకార ఉపన్యాసంలో ప్రజాస్వామిక దృక్పథాన్ని స్పష్టీకరించినాడు. దేశంలో పరమ ద్వేషం రూపుమాసిపోయిందని, అదే విధంగా రాజకీయ రంగంలో కూడా ద్వేష భావాలను విసర్జించవలెనని అన్నాడు. జాతి ఐకమత్యాన్ని ఉద్దేశించి జెఫర్‌సన్ అన్న మాటలు చరిత్ర ప్రసిద్ధమైనవి. అబ్రహం లింకన్ ఉపన్యాసాలలో వలె ఈ మాటలలో కూడా సమత, సహనము ఉన్నాయి. 1800 ఎన్నికను జెఫర్‌సన్ ఒక విప్లవంగా పేర్కొన్నప్పటికీ, అతడు తన పదవీ స్వీకారోపన్యాసంలో చక్కని వాక్య నిర్మాణంలో కూడిన పదజాలంతో రాజకీయ విభేదాలను విస్మరించి, సామరస్య పూరితంగా "మనమంతా రిపబ్లికన్లమే, మనమంతా ఫెడరలిస్ట్‌లమే" అని చెప్పాడు. ఫెడరలిస్ట్‌లు, రిపబ్లికన్లు తమ తమ దృక్పథాలను వెల్లడించడం అసమంజసం కాదు, ఫ్రాన్స్‌లో నెపోలియన్ స్థాపించిన సైనిక నియంతృత్వాన్ని అమెరికా సంయుక్త రాష్ట్రాలలో నెలకొల్పరాదు. అసంఖ్యాకమైన సైనికులున్న సైన్యాన్ని, నౌకా విభాగాలను నెలకొల్పి పన్నులతో ప్రజలను పీడించడం సరి అయిన మార్గం కాదు. అధ్యక్షుడుగా అతని విధానాలు, అతడు చేసిన ప్రకటనల కన్నా చాలా తక్కువ తీవ్రతలో ఉన్నాయి. ఇట్టి అనునయ విధానాన్ని అనుసరించడంలో అతనికి అతని విదేశాంగ కార్యదర్శి అయిన మ్యాడిసన్ యొక్క కోశాగార కార్యదర్శి అయిన గెలాటిన్ యొక్క ప్రేరణ, సలహా ఉన్నాయి. అందువల్లనే దక్షిణాదిలోని కొందరు తీవ్ర రిపబ్లికన్లు, జెఫర్‌సన్ ఫెడరలిస్ట్‌ల కంటే విభిన్నమయిన వాడు కాడని చెప్పడం జరిగింది. జెఫర్‌సన్ అధ్యక్షతా కాలాన్ని చరిత్రకారులు ప్రజాస్వామ్య విప్లవం వర్ణించినారు.

జెఫర్‌సన్ మంత్రిమండలిలో వర్జీనియాకు చెందిన జేమ్స్ మాడిసన్ విదేశాంగ కార్యదర్శిగా, అల్బర్ట్ గెలాటిన్ కోశాగార కార్యదర్శిగా నియమితులయినారు. కాంగ్రెస్‌లోని రెండు సభలలో మెజారిటీ ఉన్న రిపబ్లికన్లు హామిల్టన్ ప్రవేశపెట్టిన విస్కీ పన్నును రద్దు చేశారు. విదేశ, విద్రోహ చట్టాలు, వాటి కాలం తీరి అంతమయిపోయేటట్లు చేశారు. ప్రభుత్వ వ్యయంలో తీవ్రమైన పొదుపు పాటించాలని జెఫర్‌సన్ వ్యక్తం చేశాడు. అందుకు అనుగుణంగా కోశాగార కార్యదర్శి అయిన గెలాటిన్ సైన్యం మీద, నావికాదళం మీద ఖర్చును తీవ్రంగా తగ్గించి జాతీయ రుణాన్ని త్వరితంగా చెల్లించి వేయడానికి ప్రణాళిక రూపొందించాడు. ప్రభుత్వ పదవులలో ఉన్న ఫెడరలిస్ట్‌లను కొందరిని తొలగించి, జెఫర్‌సన్ వారి స్థానంలో రిపబ్లికన్‌లను నియమించాడు. ఈ విధంగా జెఫర్‌సన్ తర్వాతి కాలంలో ఏడో అధ్యక్షుడైన ఆండ్రూ జాక్సన్ అధికారికంగా అనుసరించిన 'స్పాయిల్స్ విధానానికి' శ్రీకారం చుట్టాడని చెప్పవచ్చు. జెఫర్‌సన్ వ్యవసాయంలో నూతన శాస్త్రీయ పద్ధతులను ప్రవేశపెట్టాడు. పశ్చిమ ప్రాంతాలలోని భూములలో ప్రజలు స్థిరపడటాన్ని ప్రోత్సహించాడు. ఉదారమైన పౌరసత్వ చట్టం ద్వారా, విదేశాలలోని ప్రజలు వచ్చి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో స్థిరపడటాన్ని ప్రోత్సహించాడు. ఇతర రాజ్యాలతో శాంతి సామరస్యాలను, స్నేహ సంబంధాలను ఏర్పరచుకోవటానికి కృషి చేశాడు. ప్రజాస్వామ్య ఆదర్శాలైన స్వేచ్ఛా సమానత్వాలను సమర్థించాడు.

వ్యక్తి హక్కులను రక్షించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని భావించాడు. అతనికి మానవుని శీలంలో, ఇంగితంలో ఎనలేని విశ్వాసం ఉండేది. తన అధ్యక్ష పదవీకాలంలో జెఫర్‌సన్ దేశంలో అంతటా ప్రజాస్వామ్య సంప్రదాయాలను, విధానాలను మిక్కిలిగా ప్రోత్సహించాడు. అధ్యక్ష పదవిని ఆవరించి ఉన్న వైభవాన్ని పరిహరించాడు. వివేకమైన పొదుపుతో కూడిన ప్రభుత్వాన్ని నెలకొల్పటానికి ప్రయత్నించాడు.

**7.2.3. న్యాయమూర్తులతో వివాదం - మార్బరీ, మాడిసన్ వివాదం :** జాన్ ఆడమ్స్ తన అధ్యక్ష పదవి చివరి రోజులలో చాలా మంది ఫెడరలిస్ట్‌లను న్యాయాధిపతులుగా నియమించాడు. ఈ ఫెడరలిస్ట్ న్యాయాధిపతులు అమెరికన్ ప్రజలకు న్యాయం చేకూర్చలేరని జెఫర్‌సన్ భావించాడు. అంతేగాక రాజ్యాంగ విషయాలపైన ఫెడరల్ న్యాయాధిపతులకు పూర్తి అధికారమిస్తే వ్యక్తి స్వాతంత్ర్యానికి భంగం కలుగుతుందని జెఫర్‌సన్ భావించారు. 1803 నాటి మార్బరీ, మాడిసన్ వివాదంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్షల్ ఇచ్చిన తీర్పు రిపబ్లికన్లకు ఆందోళనను కలిగించింది.

జాన్ ఆడమ్స్ తన అధ్యక్ష పదవీ విరమణకు ముందు చేసిన అర్ధరాత్రి నియామకాలలో మార్బరీని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాడు. కాని పదవీ నియామక పత్రం మార్బరీకి అందకముందే ఆడమ్స్ పదవీ విరమణ చేశాడు. జెఫర్‌సన్ యొక్క విదేశాంగ కార్యదర్శి అయిన మాడిసన్ పదవీ నియామక పత్రాన్ని మార్బరీకి అందజేయలేదు. దాంతో ఆ పత్రాన్ని తనకు జారీ చేసినట్లు మాడిసన్‌కు ఆదేశం ఇవ్వవలసిందిగా సుప్రీంకోర్టును అభ్యర్థించాడు. ఈ వివాదంలో ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును న్యాయ విధానంలోని తర్కానికి, రాజకీయమైన లాఘవానికి అత్యుత్తమమైన దానినిగా పేర్కొనవచ్చు. మార్బరీ కోరిన ఆ దేశాన్ని విదేశాంగ కార్యదర్శికి ఇవ్వడానికి కోర్టుకు రాజ్యాంగ పరమైన అధికారం లేదని మార్షల్ తన తీర్పులో వక్కాణించాడు. ఈ విధంగా అతడు ప్రభుత్వంలో వివాదం లేకుండా చేసుకొన్నాడు. అదే సమయంలో శాసనసభలు చేసే చట్టాలను సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉందని ఆ తీర్పులో పేర్కొని, కాంగ్రెస్‌లో రిపబ్లికన్ పార్టీ అధిక్యతతో ఉన్నందువల్ల దానికి లభించిన అధికారానికి హద్దులు ఉన్నాయని స్పష్టపరచాడు.

ఇట్టి స్థితిలో మహాభియోగం ద్వారా న్యాయమూర్తులను తొలగించటానికి రిపబ్లికన్‌లు నిర్ణయించుకొన్నారు. 1804 జాన్ పికరింగ్ అనే జిల్లా న్యాయాధిపతిని విచారించి అతని చర్యలు మతిభ్రమణను సూచిస్తున్నవనే నిందతో అతనిని పదవి నుంచి తొలగించారు. అదే సంవత్సరం శామ్యూల్ ఛేజ్ అనే సుప్రీంకోర్టు న్యాయాధిపతిని కాంగ్రెస్ అభియోగం మోపి విచారించింది. కాని ఈ అభియోగం వీగిపోయింది. ఇలా ఫెడరలిస్ట్ న్యాయమూర్తులను తొలగించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయిన తరువాత కాలక్రమంలో రిపబ్లికన్‌లను న్యాయస్థాన పదవులకు నియమించడం తప్ప జెఫర్‌సన్‌కు గత్యంతరం లేకపోయింది. కాని దురదృష్టవశాత్తు ఇలా నియమించడానికి కూడా వీలు లేకుండా ఫెడరలిస్ట్ న్యాయమూర్తులు చిరకాలం జీవించారు. ప్రధాన న్యాయమూర్తి మార్షల్ 1835 వరకు ఆ పదవిలో కొనసాగాడు.

**7.2.4. లూయిసియానా కొనుగోలు :** అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడుగా లూయిసియానా కొనుగోలు జెఫర్‌సన్ విదేశాంగ నీతికి ఘన విజయం. ఇది ఆ దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన విషయము. లూయిసియానా మిసిసిపీ నది నుంచి పడమట దిశగా రాకీ పర్వతాల వరకు ఉత్తరంగా కెనడా వరకు విస్తరించి ఉన్న అతి విశాల ప్రదేశం. దీనిని ఫ్రాన్స్ 1783లో స్పెయిన్‌కు దత్తం చేసింది. కాని 1800లో రహస్య సంధి ద్వారా నెపోలియన్ ఈ ప్రాంతాన్ని స్పెయిన్‌నుండి తిరిగి స్వాధీనం చేసుకొన్నాడు. ఈ లూయిసియానాలోనే మిసిసిపీ నది ముఖ ద్వారం వద్ద న్యూ ఆర్లియన్స్ రేవు ఉంది. ఈ రేవులో అమెరికన్లు తమ సరకులు నిలువచేసుకునే హక్కును 1795 పిన్‌క్నె సంధి ప్రకారం స్పెయిన్ అంగీకరించింది. పై రహస్య సంధి విషయం వదంతిగా జెఫర్‌సన్‌కు తెలియ వచ్చింది. 1802లో న్యూ ఆర్లియన్స్ రేవులో సరకులు నిలువ చేసే హక్కును స్పెయిన్ ఉపసంహరించడంలో పై రహస్య సంధిని గూర్చిన వదంతులు రూఢి అయ్యాయి.

న్యూ ఆర్లియన్స్‌లో సరకులను నిలువ చేసుకొనే హక్కు అమెరికా పశ్చిమ సరిహద్దులోని వ్యవసాయ దారులకు ప్రాణపదమైనది. వారు తమ వ్యవసాయ ఉత్పత్తులను మిసిసిపీ నది మీదుగా తెచ్చి సరుకులను తీసికొని పోయే ఎగుమతి నౌకలు వచ్చే వరకు వాటిని న్యూ ఆర్లియన్స్‌లో భద్రపరచుకోవలసి ఉంటుంది. ఈ హక్కును కోల్పోయినట్లు తెలియగానే పశ్చిమ సరిహద్దులోని వ్యవసాయదారుల కోసం మిన్నుముట్టింది. అవసరమయితే తుపాకులతో న్యూ ఆర్లియన్స్ మీద దాడి చేయడానికి యుద్ధానికి వారు సిద్ధమయ్యారు. అదే జరిగి వుంటే స్పెయిన్ ఫ్రాన్స్‌లలో అమెరికా యుద్ధానికి దిగవలసి వచ్చేది. ఈ పరిస్థితి శాంతి కాముఖుడు, ఇతర దేశాల రాజకీయాలలో జోక్యానికి విముఖుడు అయిన జెఫర్‌సన్‌ను సంధిగ్ధావస్థలో పడవేసింది. శక్తి హీనమైన స్పెయిన్ చేతిలో లూయిసియానా ఉన్నంత వరకు

అమెరికా భయపడనవసరం లేదు. అదును చూచి దానిని స్పెయిన్ నుంచి అమెరికా చేజిక్కించుకోగలదు. కాని ఆనాటి యుద్ధ వ్యూహ చతురలలో మేటి అయిన నెపోలియన్ చేతుల్లో లూయిసియానా ఉండటం అమెరికా సంయుక్త రాష్ట్రాల భవిష్యత్తుకు, శాంతి భద్రతలకు అత్యంత ప్రమాదకరమయిన విషయం.

న్యూ ఆర్లియన్స్‌కు సంబంధించిన సమస్యను సాధ్యమైనంత వరకు శాంతియుతంగా పరిష్కరించడానికి జెఫర్‌సన్ నిశ్చయించాడు. 1803లో జేమ్స్ మన్రోను పారిస్‌కు పంపి అక్కడ రాయబారిగా ఉన్న రాబర్ట్ ఆర్. లివింగ్‌స్టన్‌లో కలిసి ఈ సమస్యా పరిష్కారానికిక్తై ఫ్రాన్స్‌తో మంతనాలు జరుపమన్నాడు. ధర పది మిలియన్ డాలర్లకు మించకుండా న్యూ ఆర్లియన్స్‌ను దానికి తూర్పుగా వీలైనంత ప్రదేశాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నించవలసిందిగా ఇద్దరు రాయబారుకు ఆదేశమిచ్చాడు. ఈ మంతనాలు విఫలమై పరిస్థితి విషమిస్తే ఇంగ్లండ్‌లో మైత్రికి మంతనాలు ప్రారంభించమన్నాడు.

మన్రో పారిస్ చేరేలోగానే నెపోలియన్ లూయిసియానాను అమ్మివేసే ఉద్దేశంలో ఉన్నాడు. ఫ్రెంచి వలస అయిన హెయితీలోని నీగ్రోలు విప్లవం లేవదీయగా నెపోలియన్ ఆ విప్లవాన్ని అణచివేయడానికి తన సైన్యాన్ని హెయితీకి పంపినాడు. ఆ సైన్యం హెయితీ యుద్ధ రంగంలో కొంత 'యెల్లో ఫీవర్' లో మరి కొంతా దెబ్బతిని సర్వనాశనమయింది. ఇది గాక 1801లో బ్రిటన్‌లో తాత్కాలికంగా ముగిసిన యుద్ధం మళ్ళీ ప్రారంభం కాబోతున్నది. లూయిసియానాను బ్రిటీష్ వారు కబళించకుండా కాపాడుకోవడానికి కావలసిన ఫ్రెంచి సైన్యం అమెరికాలో లేదు. పైగా బ్రిటన్‌లో పోటీగా అమెరికాను బలిష్టమైన దేశంగా రూపొందించవలెనని నెపోలియన్ సంకల్పము.

అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఊహించని వేగంతో సంఘటనలు ముందుకు సాగాయి. ఒక వారం రోజులు బేరసారాలు సాగిన తర్వాత 1803 ఏప్రిల్ 30న ఒక మిలియన్ చదరపు మైళ్ళ విస్తీర్ణం గల లూయిసియానాను 15 మిలియన్ల డాలర్లకు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు దత్తం చేస్తూ సంధి పత్రాల మీద సంతకాలు జరిగాయి. ప్రపంచ చరిత్రలో ఇంత విస్తారమయిన స్థిరాస్తిని అమ్మిన, కొన్నా సంఘటన మరొకటి లేదు.

రాజ్యాంగం ప్రకారం కొత్త భూభాగాన్ని కొనడానికిగాని, ఆ భూభాగంలో నివసించేవారికి పౌరసత్వపు హక్కులివ్వడానికి గాని ఫెడరల్ ప్రభుత్వానికి అధికారం లేదు. కాని అంత విశాల భూభాగాన్ని నామమాత్రమైన ఖరీదుకు కొనే అవకాశాన్ని జెఫర్‌సన్ వదులకోలేకపోయినాడు. అందుచేత సూచితాధికారాల సిద్ధాంతాన్ని అమలులోకి తెచ్చి లూయిసియానా కొనుగోలు సెనెట్‌చే ఆమోదింపజేసినాడు.

లూయిసియానా కొనుగోలు వల్ల 1) అమెరికా సంయుక్త రాష్ట్రాల విస్తీర్ణం అంతకు ముందున్న విస్తీర్ణానికన్నా రెండింతలకు మించి పెరిగింది. 2) లూయిసియానా కొనుగోలు వల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాలకు జీవన ప్రదమైన మిసిసిపీ నదీ అమెరికా నది అయ్యింది. దీని వల్ల వ్యాపారాభివృద్ధికి సానుకూలత ఏర్పడింది. 3) ఈ ప్రదేశం మంచి వ్యవసాయకంగా సంపన్న రాష్ట్రాలు ఏర్పడ్డాయి. 4) పశ్చిమ సరిహద్దులో విదేశీ రాజ్యాధిపత్యం, దాని వల్ల ఏర్పడే శత్రు భయం లేకుండా పోయింది.

లూయిసియానా కొనుగోలు జెఫర్‌సన్ విదేశాంగ నీతిలో కలికితురాయి అయి నిలిచింది. భవిష్యత్తులో అమెరికా ప్రపంచ అగ్రరాజ్యాలలో ఒకటిగా రూపొందడానికి దోహదం చేసింది. ఫ్రాన్స్, అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య విరోధం లేకుండా ఈ కొనుగోలు చేసింది. ఫలితంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఇంగ్లండ్‌లో జటిలమైన ఒప్పందాలు ఏర్పరచుకోవలసిన అవసరాన్ని తప్పించింది.

**7.2.5. జెఫర్‌సన్ రెండో అధ్యక్ష పాలన :** 1804 అధ్యక్ష ఎన్నికల్లో జెఫర్‌సన్ విజయం సాధించి రెండోసారి అధ్యక్షుడయినాడు. ఈ ఎన్నికల్లో జెఫర్‌సన్ 162 వోట్లు రాగా, ఫెడరలిస్ట్ పార్టీకి చెందిన అతని ప్రత్యర్థి పిన్‌క్నెకు 14 వోట్లు వచ్చాయి. తన రెండో అధ్యక్ష పదవీ కాలంలో చాలా భాగం జెఫర్‌సన్ అమెరికా తటస్థ రాజ్య హక్కులను కాపాడుకొనే ప్రయత్నంలోనే గడపవలసి వచ్చింది.

**7.2.6. ఎంబార్గో చట్టం :** 1793 నుంచి అమెరికా సంయుక్త రాష్ట్రాలు తటస్థ నౌకా వ్యాపారాన్ని కొనసాగిస్తుండేది. కాని 1805లో ఈ తటస్థ నౌకా వ్యాపారానికి తీవ్ర విఘాతం ఏర్పడింది. బ్రిటీష్ ప్రభుత్వం 'ఆర్డర్-ఇన్-కౌన్సిల్' జారీ చేయగా ఫ్రాన్స్ బెర్లిన్ మిలాన్ డిక్రేలు జారీ చేసింది. దీనిలో అమెరికా వ్యాపార నౌకల పరిస్థితి క్లిష్టమయింది. అమెరికన్ వ్యాపార నౌకలను పట్టుకోవడాని కన్నా అమెరికన్ గౌరవ ప్రతిష్ఠలకు ఎక్కువ భంగం కలిగించిన విషక్షం బ్రిటిష్ వారు అనుసరించిన 'ఇంప్రెస్ మెంట్' విధానం. జాతి గౌరవాన్ని

అవమానాలకు గురి చేస్తున్న బ్రిటన్, ఫ్రాన్స్‌ల యొక్క చర్యలను అమెరికా సహించలేకపోయింది. జెఫర్‌సన్ ఆలోచన మేరకు కాంగ్రెస్ 1807లో ఎంబార్గో చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం అమెరికన్ నౌకలలోగాని, విదేశీ నౌకలలో గాని అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి ఏ సరకునుగాని ఐరోపా దేశాలకు ఎగుమతి చేయరాదు. అయితే ఈ చట్టం విఫలమయింది. తరువాత అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఎంబార్గో చట్టం స్థానే 'నాన్ ఇంటర్ కోర్సు' చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం అమెరికన్ వ్యాపార నౌకలు ఇంగ్లాండ్ - ఫ్రాన్స్‌లలో తప్ప మిగిలిన అన్ని దేశాలతో వర్తకం చేయవచ్చు. 1812లో బ్రిటన్‌తో యుద్ధం ప్రారంభమయ్యే వరకు వ్యాపార నియంత్రణ అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వ విధానంలో ఒక భాగమైపోయింది.

**7.2.7. ఘనత :** జెఫర్‌సన్ 1809 మార్చి 4న పదవీ విరమణ చేసినాడు. జెఫర్‌సన్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి నిరాకరించాడు. ఈ విషయంలో తాను వాషింగ్టన్ సిద్ధాంతాన్ని అమలులో పెడుతున్నట్లుగా ప్రకటించాడు. జెఫర్‌సన్ గొప్ప మేధావి, ఆలోచనా పరుడు, ఒక్క లింకన్ మినహాయించి అమెరికా అధ్యక్షులతో జెఫర్‌సన్ అంత సూటిగా, హృదయానికి అత్తుకొనేటట్లు, భావ వ్యక్తీకరణ చేయగలవారు మరెవ్వరూ లేరు. అతని భావాలు, కొన్ని ప్రజాస్వామ్య సిద్ధాంతాలలో అంతర్భాగమయ్యాయి. జెఫర్‌సన్ బహు భాషా కోవిదుడు. అతడు వివిధ కళలో, సాంఘిక శాస్త్రాలలో, విజ్ఞాన శాస్త్రాలలో సమానమైన ప్రతిభగలవాడు. వర్జీనియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించటమే గాక, ఆ విశ్వవిద్యాలయ కట్టడాలకు కూడా రూప కల్పన చేశాడు. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనను, వర్జీనియా మత స్వేచ్ఛా చట్టాన్ని రూపొందించిన మహామేధావి జెఫర్‌సన్. ఒక్క వాక్యంతో చెప్పాలంటే అతడు రచయిత, వేదాంతి, రాజనీతి తత్త్వవేత్త, విజ్ఞుడైన రాజకీయ వేత్త.

## 7.3. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)

1. జాన్ ఆడమ్స్ అధ్యక్ష కాలమును వివరించుము
2. జెఫర్‌సన్ ఎన్నిక 1800వ సంవత్సరపు విప్లవం అని వర్ణించుట సరియైనదా ?
3. జెఫర్‌సన్ ప్రజాస్వామ్యం గురించి వివరింపుము.

### 2) లఘు వ్యాసరూప ప్రశ్నలు (15 మార్కులు)

1) XYZ ఉదంతం
2) అర్ధరాత్రి నియామకాలు
3) లూయిసియానా కొనుగోలు
4) ఎంబార్గో చట్టం

## 7.4. చదువదగిన గ్రంథాలు :


1. C.P. Hill - History of the United States
2. Allan Novins and Commager - A Shorst History of United States
3. S.K. Padever - Jefferson
4. Gilbert Chinard - Thomas Jefferson
5. H.B. Parkes - The United States of America - A History
6. D. Merrill Peterson - Thomes Jefferson and the New Nation
7. Stanwood Edward - A History of the Presidency from 1788 to 1897
8. Richard M. Morris - Encyclopaedia of America History
9. బి.ఏ. తెలుగు అకాడమి.


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 8.1

# 1812 యుద్ధం - జేమ్స్ మన్రో - జాన్ క్విన్సీ ఆడమ్స్

## 8.1.0. లక్ష్యం :

1812 సంవత్సర సంగ్రామమునకు గల కారణాలు, యుద్ధ గమనం, ఫలితాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


8.1.1. పరిచయము

8.1.2. 1812 - యుద్ధ కారణాలు

8.1.2.1. మేకన్స్ బిల్ నంబరు - 2

8.1.2.2. రెడ్ ఇండియన్ల దాడులు

8.1.2.3. పశ్చిమ ప్రాంత విస్తరణకు అవరోధాలు

8.1.2.4. వార్ హాక్స్ యుద్ధోన్మాదము

8.1.2.5. యుద్ధ ప్రకటన

8.1.3. యుద్ధ ప్రకటన నాటి పరిస్థితులు

8.1.4. యుద్ధ గమనము

8.1.4.1. థేమ్స్ యుద్ధ రంగం

8.1.4.2. నౌకా యుద్ధము

8.1.4.3. దక్షిణ ప్రాంతంలో యుద్ధము

8.1.4.4. న్యూ ఆర్లియన్స్ యుద్ధము

8.1.5. ఘెంట్ సంధి

8.1.6. హార్ట్ ఫోర్డ్ సమావేశము

8.1.7. యుద్ధ ఫలితాలు

8.1.8. రెండో స్వాతంత్ర్య సంగ్రామం

8.1.9. నమూనా ప్రశ్నలు

8.1.10. చదువదగిన గ్రంథాలు


## 8.1. పరిచయము :

అమెరికా సంయుక్త రాష్ట్రాల తటస్థ దేశ హక్కులను బ్రిటన్ ఉల్లంఘించటమేగాక, పశ్చిమ సరిహద్దు ప్రాంతం వారు ఇంకా పశ్చిమంగా విస్తరించవలెనని ఉబలాటపడుతూ ఉండగా బ్రిటన్ ఆ కార్యక్రమానికి అంతరాయం కలిగించడం 1812 యుద్ధానికి దారి తీసింది. 1812లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో బ్రిటన్ మీద యుద్ధ ప్రకటన విషయమై రిపబ్లికన్ పార్టీలోనే బేధాభిప్రాయాలు ఏర్పడి పార్టీ

రెండుగా విడిపోయింది. ఔత్తరాహులైన కొంతమంది రిపబ్లికన్‌లు బ్రిటన్‌లో యుద్ధాన్ని వ్యతిరేకించి న్యూయార్క్‌కు చెందిన డివిట్ క్లిన్‌టన్‌ను తమ అభ్యర్థిగా పోటీ చేయించారు. యుద్ధాన్ని సమర్థించిన రిపబ్లికన్‌లు మాడిసన్ అభ్యర్థిత్వాన్ని బలపరిచినారు. ఈ ఎన్నికలలో ఫెడరలిస్ట్ పార్టీ పాల్గొనలేదు. క్లిన్‌టన్‌కు న్యూ ఇంగ్లండ్, మధ్య రాష్ట్రాలవారు, మాడిసన్‌కు దక్షిణ పశ్చిమ రాష్ట్రాలవారు బలపరచగా మాడిసన్‌కు 128 ఓట్లు, క్లిన్‌టన్‌కు 89 ఓట్లు వచ్చినాయి. మేధావిగా పేరు మోసిన మాడిసన్ అధ్యక్షుడయినాడు. వార్ హాక్స్ ఒత్తిడి ఫలితంగా, బ్రిటన్‌తో తటస్థ హక్కుల విషయమై సామరస్యం కుదరనందు వల్ల చివరకు 1812 జూన్ 18న అమెరికన్ కాంగ్రెస్ బ్రిటన్‌పై యుద్ధం ప్రకటించింది.

## 8.1.2. 1812 యుద్ధ కారణాలు :

**8.1.2.1. మేకన్స్ బిల్ నంబరు - 2 :** బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఒకదానిలో ఒకటి ప్రత్యక్ష యుద్ధం చేయటానికి వీలులేక ఆర్థిక యుద్ధానికి తలపడినాయి. బ్రిటన్ వాణిజ్యం మీద దెబ్బతీయడానికి ఫ్రాన్స్ 'భూ ఖండ విధానాన్ని' అమలులో పెట్టగా, బ్రిటన్ 'ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్' జారీ చేసింది. దీనిలో అమెరికా వ్యాపారావకాశాలు కుంటుపడినాయి. 1803-1812 మధ్య కాలంలో 1500 అమెరికన్ నౌకలను బ్రిటన్ ఫ్రాన్స్‌లు స్వాధీనం చేసుకొన్నాయి. కాని అన్ని అమెరికన్ నౌకలు దిగ్బంధన వ్యూహాల నుంచి తప్పించుకొని రెండు దేశాలతోను వ్యాపారం సాగించి అపారమైన లాభాలు గడించినాయి. బ్రిటన్ ఫ్రాన్స్‌లు రెండూ తటస్థ దేశ హక్కులను విస్మరించి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు హాని కలిగించినా దేశంలోని జనబాహుళ్యము ఫ్రాన్స్ మీద కన్నా బ్రిటన్ మీద ఎక్కువగా శతృభావంతో ఉంది. బ్రిటన్ అమెరికన్ నౌకలను అడ్డగించి తన సైన్యం నుంచి పారిపోయి వచ్చినారనే నెపంతో కొంత మంది వ్యక్తులను తన స్వాధీనం చేసుకోసాగింది. జెఫర్సన్ బ్రిటీష్ ప్రభుత్వంలో కొనసాగించిన సంప్రదింపులు వ్యర్థమైనాయి. దీనికి తోడు 1807 లో బ్రిటీష్ యుద్ధ నౌక లియోపార్డ్ అమెరికన్ యుద్ధ నౌక చెసాపీక్‌ను అడ్డగించి స్వాధీనం చేసుకొని అందులోని నలుగురు ఓడపని వారిని నిర్బంధించి తన సైన్యంలో చేర్చుకొన్నది. ఆ వ్యక్తులలో ముగ్గురు అమెరికన్‌లు.

చెసాపీక్ ఉదంతం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో గొప్ప అలజడిని లేవదీసింది. కాని అధ్యక్షుడు జెఫర్సన్ బ్రిటన్‌లో యుద్ధం చేయకుండా ఇంకోరకంగా ఒత్తిడి తీసుకొని రావలెనని ప్రయత్నించాడు. బ్రిటన్‌కు అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆహార పదార్థాలు, ఇతర సరుకులూ చాలా అవసరమని, వాటిని నిలిపివేస్తే, బ్రిటన్ ఇక్కట్లకు లోనవుతుందని భావించిన జెఫర్సన్ 1807లో 'ఎమ్‌బార్గో' చట్టాన్ని జారీ చేశాడు. ఈ చట్టం అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి విదేశాలకు సరుకుల ఎగుమతిని నిషేధించింది. ఈ చట్టం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బతీసింది. దేశంలో వస్తువుల ధరలు పడిపోయినాయి. ఆర్థిక రంగంలో ప్రతిష్ఠంభన ఏర్పడింది. చాలా మంది నౌకా యజమానులు, వర్తకులు దివాలా తీసినారు. న్యూ ఇంగ్లండ్ రాష్ట్రాలలో ఈ చట్టము అమలు జరపడం దుస్సాధ్యమయింది. న్యూ ఇంగ్లండ్ నౌకలలో మూడింట ఒకటి ప్రభుత్వం కన్ను కప్పి దొంగచాటుగా విదేశాలతో వర్తకం సాగించి అపారమైన లాభాలను ఆర్జించసాగినాయి. బ్రిటన్‌తో యుద్ధం సంభవిస్తే అమెరికన్‌లు వాణిజ్యము సర్వనాశనమవుతుందని న్యూ ఇంగ్లండ్‌వారు భావించినారు. 'ఎమ్ బార్గో' చట్టము రాజ్యాంగానికి విరుద్ధమని వారు ప్రచారం చేయసాగినారు. ఈ పరిస్థితుల వల్ల 'ఎమ్ బార్గో' చట్టాన్ని కాంగ్రెస్ రద్దు పరచింది. దాని స్థానంలో జెఫర్సన్ 1809లో 'నాన్ ఇంటర్ కోర్సు' చట్టము అనే దాన్ని కాంగ్రెస్ చేత జారీ చేయించాడు. ఈ చట్టము బ్రిటన్, ఫ్రాన్స్‌లు మినహా ప్రపంచంలోని ఏ ఇతర దేశంలోనైనా అమెరికన్‌లు వ్యాపారం చేయవచ్చునని పేర్కొన్నది. ఈ చట్టంపై సంతకం చేసిన తరువాత మూడు రోజులకు జెఫర్సన్ పదవీ విరమణ చేసినాడు. ఇతని తరువాత మాడిసన్ అధ్యక్షుడయినాడు. ఇతని జెఫర్సన్‌కున్నంత అధికార దక్షత, సమర్థత లేవు. ఇతడు రాజకీయ విధానాలను కాంగ్రెస్‌కే వదిలివేసినాడు. 'నాన్ ఇంటర్ కోర్సు' చట్టాన్ని కూడా న్యూ ఇంగ్లాండ్ వర్తకులు ఉల్లంఘించినారు.

అందుచేత కాంగ్రెస్ 'నాన్ ఇంటర్ కోర్స్' చట్టాన్ని గూడా రద్దు చేసి దీనికి బదులుగా "మేకన్స్ బిల్ నంబరు - 2" అనే చట్టాన్ని జారీ చేసింది. దీని ప్రకారం ప్రపంచంలోని అన్ని దేశాలతో వ్యాపారం చేయవచ్చు. కాని ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లకు సంబంధించి వాటిలో మొదటగా ఏదైతే అమెరికన్ వ్యాపార హక్కుల మీద ఆంక్షలు రద్దు చేస్తుందో, ఆ దేశంలో మాత్రమే అమెరికా వ్యాపార సంబంధాలు

పునఃప్రారంభిస్తుంది. అట్లా చేయని దేశంలో వ్యాపారాన్ని నిషేధిస్తుంది. అనగా తన వ్యాపార హక్కులను గౌరవించడానికిగాను, బ్రిటన్ ఫ్రాన్సులకు అమెరికా కొన్న ప్రలోభాలు చూపినట్లయింది. ఈ చట్టం జారీ అయిన వెంటనే నెపోలియన్ (ఫ్రాన్స్) అమెరికన్‌ల తటస్థ రాజ్య హక్కులలో జోక్యం కలుగజేసుకోనని ప్రకటించినాడు. అందువల్ల మాడిసన్ బ్రిటన్‌లో వాణిజ్య సంబంధాలు నిలిపివేసినట్లు ప్రకటించినాడు. కాని నెపోలియన్ తన వాగ్దానానికి కట్టుబడి ఉండక అమెరికా తటస్థ హక్కులను నిర్లక్ష్యం చేసి ముందువలెనే ప్రవర్తించసాగాడు.

మాడిసన్ నిర్ణయం రాజకీయంగా ప్రాణాంతకమయింది. నెపోలియన్ చేసిన వంచనను గ్రహించలేక, అమెరికా అతనిలో పొత్తు కలపడానికి ఉత్సాహం చూపడం బ్రిటన్‌కు ఎనలేని ఆగ్రహం కలిగించింది. ఏనాడైతే మాడిసన్ అమెరికాను వ్యాపార రీత్యా దూరం చేశాడో, ఆనాటి నుంచి అతడు రాజకీయంగా ఫ్రాన్స్‌కు చేరువై, యుద్ధం వైపు కదలిపోయాడు.

**8.1.2.2. రెడ్ ఇండియన్ల దాడులు :** తెకుంసె, ప్రాఫెట్ అనే ఇద్దరు రెడ్ ఇండియన్ సోదరుల నాయకత్వంలో ఒహియో నదికి ఉత్తర ప్రాంతంలో నున్న రెడ్ ఇండియన్‌లు ఒక సంఘంగా ఏర్పడి, పశ్చిమ సరిహద్దులలో నివసించే అమెరికన్లపై దాడులు చేయడం ప్రారంభించారు. వీరు బ్రిటీష్ తోళ్ళ వ్యాపారస్తుల నుంచి ఆయుధాలు కొనుగోలు చేసేవారు. సరిహద్దు ప్రాంతానికి గవర్నర్‌గావున్న జనరల్ విలియం హారిసన్ వేయి మంది సైన్యంతో ఇండియానాలోని తిప్పెకోనే మీద రెడ్ ఇండియన్లు జరిపిన మెరుపుదాడిని విజయవంతంగా ప్రతిఘటించాడు. ఈ యుద్ధంలో అమెరికన్లు రెడ్ ఇండియన్‌ల నుంచి బ్రిటీష్ ఆయుధాలను చాలా చేజిక్కించుకొన్నారు. రెడ్ ఇండియన్‌లకు బ్రిటీష్‌వారు ఆయుధాలు అందించడం 'వార్ హాక్స్'కు ఆగ్రహం కలిగించింది. రెడ్ ఇండియన్ల బెడద అంతం కావాలంటే బ్రిటీష్ వారి అండతో రెడ్ ఇండియన్లకు కేంద్ర స్థావరంగా వున్న కెనడాను అమెరికా జయించడం ఒకటే మార్గమని వార్ హాక్స్ భావించారు.

**8.1.2.3. పశ్చిమ ప్రాంత విస్తరణకు అవరోధాలు :** అమెరికా సంయుక్త రాష్ట్రాల పశ్చిమ ప్రాంతాలు సారవంతమైనవి. 'ఫాలెన్ టింబర్స్' యుద్ధ విజయానంతరం అమెరికన్‌లు పశ్చిమ ప్రాంతాన ఉన్న రెడ్ ఇండియన్‌లను తరిమివేసి అనేక ప్రాంతాలను హస్తగతం చేసుకొని స్థిరపడిరి. అమెరికా పశ్చిమ ప్రాంత విస్తరణకు అరికట్టనిదే తమ ఆధీనంలోని కెనడాకు రక్షణ లేదని, ఈ ప్రాంతంలో తమకు లాభసాటియగు ఉన్ని వ్యాపారమును స్వేచ్ఛగా కొనసాగించుటకు వీలుండదని బ్రిటన్ రెడ్ ఇండియన్ల పట్ల సానుభూతి వహించి అమెరికన్‌లు ప్రతిఘటించసాగెను. ఇట్టి బ్రిటీష్ చర్యను అమెరికన్‌లు ద్వేషించసాగిరి.

**8.1.2.4. వార్ హాక్స్ యుద్ధోన్మాదము :** యువకులైన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులతో కాంగ్రెస్ ఆనాడు నిండి ఉండెను. వీరు సంఖ్యాధికత్యతతో ప్రతినిధుల సభను తమ చెప్పుచేతులలో పెట్టుకొని 34 సంవత్సరాల వయస్సు గల హెన్రీక్లేను తమ స్పీకర్‌గా ఎన్నుకొన్నారు. కాంగ్రెస్‌లో, బ్రిటన్‌లోయుద్ధానికి ఉవ్విళ్లూరే ఈ ప్రతినిధులనంతా 'వార్ హాక్స్' అని పిలిచారు. వీరు అమెరికన్ల మీద దాడులు చేసే రెడ్ ఇండియన్ల బెడదను అంతం చేయడానికి కంకణం కట్టుకొన్నారు. అంతేగాక రెడ్ ఇండియన్లకు కేంద్ర స్థావరంగా వున్న కెనడాను జయించాలని భావించారు. వీరి మరొక ధ్యేయం సముద్రాల మీద స్వేచ్ఛ. స్వేచ్ఛా వ్యాపారం, నావికులకు రక్షణ వారి ప్రచార నినాదాలలో ఒకటి.

**8.1.2.5. యుద్ధ ప్రకటన :** వార్ హాక్స్ ఒత్తిడి ఫలితంగా అమెరికన్ కాంగ్రెస్ 1812 జూన్ 18న బ్రిటన్‌పై యుద్ధం ప్రకటించింది. ప్రతినిధుల సభలో యుద్ధ ప్రకటనకు అనుకూలంగా 79 ఓట్లు, ప్రతికూలంగా 49 ఓట్లు వచ్చాయి. సెనేట్‌లో యుద్ధ ప్రకటనకు అనుకూలంగా 19 ఓట్లు వ్యతిరేకంగా 13 ఓట్లు వచ్చాయి. వ్యాపార, నౌకా వ్యాపార కేంద్రాలు ఉన్న న్యూ ఇంగ్లాండ్ రాష్ట్రాలు, అట్లాంటిక్ తీరం వెంబడి ఉన్న మధ్య రాష్ట్రాలు యుద్ధాన్ని వ్యతిరేకించాయి. పడమటి రాష్ట్రాలు, నైరుతి దిశలో ఉన్న రాష్ట్రాలు యుద్ధాన్ని సమర్థించాయి. పశ్చిమ రాష్ట్రాలలోని అమెరికన్లకు స్వయంగా నౌకా వ్యాపారంలో ఆసక్తి లేకపోయినా వారి వ్యవసాయికోత్పత్తులు ఐరోపాకు ఎగుమతి కావాలంటే సముద్రాల మీద స్వేచ్ఛ, తటస్థ వ్యాపార హక్కుల పరిరక్షణ అవసరం. వారు తమ వ్యవసాయోత్పత్తుల ఎగుమతికి అడ్డంగా నిలచిన బ్రిటీష్ ప్రభుత్వ 'ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్'ను ఏవగించుకొన్నారు.

## 8.1.3. యుద్ధ ప్రకటన నాటి పరిస్థితులు :

1812లో అమెరికన్ కాంగ్రెస్ బ్రిటన్‌పై యుద్ధం ప్రకటించే నాటికి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు యుద్ధం చేయడానికి కావలసిన సాధన సంపత్తి, ఆర్థిక స్తోమత లేదు. ఫెడరల్ సైన్యం సంఖ్య 7వేల కన్నా తక్కువగా ఉంది. సైన్యాధికారులు అమెరికన్ విప్లవం కాలం నాటికి చెందిన వయోవృద్ధులు, యుద్ధ నౌకల సంఖ్య చాలా తక్కువ. యుద్ధం ప్రారంభమయిన తరువాత ఫెడరల్ ప్రభుత్వము వివిధ రాష్ట్రాల సైన్యం నుంచి 4 లక్షల మంది సైనికులను ఫెడరల్ సైన్యంలో చేరమని కోరింది. చాలా మంది ఈ కోరికను ఖాతరు చేయలేదు. ఫెడరల్ సైన్యంలో చేరిన చాలా మంది సైనికాధికారుల పట్ల అవిధేయంగా ఉండటమో లేదా పారిపోవడమో జరిగింది. అదిగాక యుద్ధ ఖర్చులకు చాలినంత ధనం లేకపోయింది. అందుచేత ఖర్చులో మూడింట ఒక వంతు భాగాన్ని ఫెడరల్ ప్రభుత్వం పన్నుల ద్వారా రాబట్టింది. మిగతా రెండు వంతుల ధనాన్ని ధనికుల వద్ద నుంచి ప్రభుత్వం అప్పుగా కోరింది. కాని చాలా మంది ధనికులు యుద్ధాన్ని వ్యతిరేకించి రుణమీయ నిరాకరించినారు. 1811 నాటికి 'బాంక్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్' కాల పరిమితి ముగిసినందువల్ల అది రద్దయింది. ఈ బాంక్ ఉండే పక్షంలో ప్రభుత్వానికి యుద్ధ సమయంలో సహాయం లభించి ఉండేది. ఈ యుద్ధాన్ని ప్రారంభించే విషయంలో దేశ ప్రజలలో ఏకాభిప్రాయం లేదని, అనైక్యత విస్తారంగా ఉందని గమనించిన మాడిసన్ ఒకే ఒక ఆశతో దాదాపు మరణాంతకమైన యుద్ధ ప్రకటనను సమర్థించాడు. యుద్ధంవల్లనైనా అమెరికన్లు తమ విభేదాలు విస్మరించి తమ జెండా కింద ఒకటయి ఐకమత్యంతో శత్రువు నెదిరిస్తారని అతని ఆశ. కాని ఈ ఆశ నెరవేరలేదు.

## 8.1.4. యుద్ధ గమనము :

బ్రిటన్ ఐరోపా యుద్ధాలలో తలమునకలై ఉన్నందున చెప్పుకోదగ్గ సంఖ్యలో సైనికులను అమెరికాకు చేరవేయలేకపోయింది. కెనడాలో ఉన్న బ్రిటీష్ సైన్యము, స్థానిక కెనడా సైన్యము కలిసి అమెరికన్ సైన్యాన్ని ఓడించగలదనే ఆశాభావము బ్రిటన్‌కు ఉంది. 1812లో అమెరికన్ సైన్యము లేక చాంప్లెయిన్, నయాగరా, డెట్రాయిట్‌ల మార్గంలో వెళ్ళి కెనడాను ముట్టడించవలెనని ప్రయత్నం విఫలమయింది. పైగా బ్రిటీష్ సైన్యము మిచిగన్‌లో ప్రవేశించి డెట్రాయిట్‌ను స్వాధీనం చేసుకొని తెకంసే ముఠా సహాకారం పొందింది.

**8.1.4.1. థేమ్స్ యుద్ధరంగం :** పడమటి ప్రాంతానికి యుద్ధ సరఫరాలు తరలించాలంటే మహా సరస్సులను స్వాధీనం చేసుకోవడం అవసరం. ఆలివర్ హజర్డ్ పెర్రీ అనే ఉత్సాహవంతుడైన నౌకా దళాధికారి 'ఈరీ' సరస్సులో తానుగా నిర్మించిన ఒక నౌకా దళంలో ఆ సరస్సు వద్ద జరిగిన ఒక పోరాటంలో బ్రిటీష్ నౌకా దళాన్ని ఓడించాడు. పెర్రీ విజయం కుంగిపోతున్న అమెరికన్ ఉత్సాహానికి కొత్త ఊపిరిపోసి దానిని పునరుజ్జీవింప చేసింది. ఈరీ సరస్సు స్వాధీనం కావడంతో పడమటి ప్రాంతంలో డెట్రాయిట్‌లో ఉన్న బ్రిటీష్ స్థావరాలు త్వరగా పతనమయ్యాయి. తూర్పు దిశగా, కెనడాలోకి పారిపోతున్న బ్రిటీష్ సైనికులను జనరల్ హారిసన్ నాయకత్వంలోని అమెరికన్ సైన్య దళం వెంబడించి వారిని థేమ్స్ యుద్ధంలో ఓడించింది. 1813 అక్టోబర్‌లోజరిగిన యుద్ధంలో రెడ్ ఇండియన్ల నాయకుడై బ్రిటీష్ సైన్యంతో బ్రిగేడియర్ జనరల్ పదవిని పొందిన తెకుంసే మరణించాడు. కాని నయాగరా, లేక చాంప్లెయిన్‌ల నుంచి కెనడాను జయించడానికి వెళ్ళిన అమెరికన్ సైన్యాన్ని తరిమికొట్టడమయింది. అయితే 1814లో వృద్ధులయిన విప్లవ కాలపు అధికారుల స్థానంలో కొంత మంది యువక సైన్యాధికారులు తర్ఫీదయి యుద్ధంలోకి ప్రవేశించిన కారణంగా అమెరికన్‌లు నయాగార ప్రాంతంలో కొన్ని విజయాలు సాధించారు. ఈ లోపుగా ఐరోపా యుద్ధరంగాలలో నెపోలియన్ పూర్తిగా ఓడిపోయినాడు. ఐరోపాలో యుద్ధం ముగియగానే బ్రిటన్ అధిక సంఖ్యలో తన సైన్యాన్ని చేరవేసింది. 1814లో బ్రిటిష్ సైన్యము చాంప్లెయిన్ మార్గం ద్వారా న్యూయార్క్‌ను ముట్టడించ ప్రయత్నించింది. కాని ఈ ప్రయత్నం విఫలం కాగా ఆ సైన్యము కెనడాకు మళ్ళీ వెళ్ళింది. కెనడా సరిహద్దులలో జరిగిన యుద్ధ రంగాలలో జయాపజయాలు రెండు వైపుల సమపాళ్ళలోనే ఉన్నాయని చెప్పవచ్చు.

**8.1.4.2. నౌకా యుద్ధము :** తొలి దశలో అమెరికా నౌకాదళము సాగర ప్రాంత యుద్ధాలలో కొన్ని విజయాలు సాధించింది. విప్లవం రోజులలో లాగా అమెరికన్‌లు బ్రిటీష్ వాణిజ్యం మీద దెబ్బతీసినారు. కాని 1813లో పటిష్టమైన బ్రిటీష్ నౌకాదళము అమెరికా చేరి అట్లాంటిక్ కోస్తా ప్రాంతాన్ని దిగ్బంధం చేసింది. 1814లో బ్రిటీష్ నౌకాదళము చెసాపిక్ అఖాతాన్ని ముట్టడించింది. అక్కడ ఉన్న

అమెరికన్ నౌకా దళాన్ని ఓడించి బ్రిటీష్ నౌకా దళము వాషింగ్టన్ పట్టణంలోకి ప్రవేశించింది. బ్రిటీష్‌వారు వాషింగ్టన్‌లో విధ్వంసక చర్యలకు పూనుకొన్నారు. అధ్యక్ష కార్యాలయమైన క్యాపిటల్‌ను, అధ్యక్ష ప్రసాదమైన వైట్ హౌస్‌ను, ఇతర ప్రభుత్వ భావనాలను తగలబెట్టినారు. మాడిసన్‌లో బాటు కొంత మంది కార్యదర్శులు ప్రాణరక్షణార్థం చుట్టు పక్కల గల కొండలలోనికి పారిపోయి తలదాచుకొన్నారు. దీనికి ముందు అమెరికన్‌లు కెనడాలోని యార్క్ పట్టణాన్ని ముట్టడించి కెనడా పార్లమెంట్ భవనాన్ని, ఇతర ప్రభుత్వ భవనాలకు ధ్వంసం చేసినారు. ఒక విధంగా వాషింగ్టన్‌లో జరిగిన విధ్వంసక చర్యలు బ్రిటీష్‌వారి ప్రతీకార చర్యలని చెప్పవచ్చు. ఈ చర్యలు బ్రిటీష్ వారికి సైతం విభ్రాంతి కలిగించాయి. తరువాత బ్రిటీష్ వారు బాల్టిమోర్ పట్టణాన్ని ముట్టడించి ప్రయత్నించి విఫలులయినారు. ఈ పరాజయం తరువాత బ్రిటీష్‌వారు చెసాపిక్ యుద్ధ ఘట్టానికి స్వస్తి చెప్పి వెళ్ళినారు. ఈ యుద్ధ ఘట్టము అమెరికన్‌లకు అవమానకరమైనప్పటికీ బ్రిటీష్ వారికి ఘన విజయాలను సాధించి పెట్టలేదు.

**8.1.4.3. దక్షిణ ప్రాంతంలో యుద్ధము :** అమెరికన్ సైనికులు దక్షిణ ప్రాంతంలో తమ శక్తి సామర్థ్యాలు చక్కగా ప్రదర్శించారు. ఈ ప్రాంతంలో విజయాలను సాధించిన ఘనత ఆండ్రూ జాక్సన్‌కు దక్కుతుంది. మిసిసిపీ ప్రాంతంలో నివసిస్తున్న క్రీక్ ఇండియన్‌లు తెకంసే ప్రోత్సాహంతో 1813లో ఆ ప్రాంత అమెరికన్‌లపై దాడులు జరిపినారు. టెన్నెసీ మిలీషియాకు నాయకుడుగా ఉన్న జాక్సన్ తన సైన్యంతో వెంటనే ఇండియన్‌లను చుట్టుముట్టినాడు. అనేక మాసాలపాటు కొనసాగిన తీవ్ర సంఘర్షణ తరువాత జాక్సన్ హార్స్ షూ బెండ్ యుద్ధ రంగంలో క్రీక్ ఇండియన్‌లను చిత్తుగా ఓడించాడు. ఈ విజయం ఫలితంగా క్రీక్ ఇండియన్‌లు అలబామాలో తమ స్వాధీనంలో ఉన్న భూభాగమంతటినీ అమెరికన్‌లకు ఇచ్చివేసినారు. హారిసన్ వాయువ్య ప్రాంతంలోని ఇండియన్‌లను అణచివేసినట్లే, జాక్సన్ నైరుతి ప్రాంత ఇండియన్‌లను అదుపులోకి తెచ్చినాడు. ఈ విజయం తరువాత జాక్సన్ నైరుతి ప్రాంత కేంద్ర సైన్యానికి నాయకుడుగా నియమితుడయినాడు.

**8.1.4.4. న్యూ ఆర్లియన్స్ యుద్ధము :** బ్రిటీష్ సైన్యం 1814లో న్యూ ఆర్లియన్స్ రేవుపై చేసిన దాడి మిసిసిపీ లోయనంతా భయభ్రాంతం చేసింది. ఈ దాడిని ఎదుర్కోవలసిందిగా అమెరికన్ ప్రభుత్వం ఆండ్రూ జాక్సన్‌ను ఆదేశించింది. జాక్సన్ సైన్యంలో లూయిసియానా, కెంటకే, టెన్సిన్ రాష్ట్రాలకు చెందిన నావికులు, రౌతులు, ఓడ దొంగలు, మిలీషియా సైనికులు, ఫ్రెంచివారు, నీగ్రోలు మొత్తం ఏడువేల మంది ఉన్నారు. ఎనిమిది వేల యోధులలో కూడిన బ్రిటీష్ సైన్యం 1815 జనవరి 8న న్యూ ఆర్లియన్సులోని అమెరికన్ సైన్యంపై దాడి చేసింది. ఒక్క అరగంట సేపు జరిగిన యుద్ధంలో బ్రిటీష్ సైన్యం తీవ్ర ఓటమికి లోనయింది. ఈ యుద్ధంలో రెండు వేల మంది బ్రిటీష్ సైనికులు చనిపోవడం, గాయపడడం జరిగింది. అమెరికన్ సైనికులలో మరణించిన వారి సంఖ్య 21. ఈ మారణ హోమం అనవసరంగా జరిగింది. ఎందుకంటే న్యూ ఆర్లియన్స్ యుద్ధానికి రెండు వారాల ముందే 1812 యుద్ధాన్ని విరమిస్తూ హాలండ్‌లోని ఘెంట్ వద్ద శాంతి సంధి జరిగింది. న్యూ ఆర్లియన్స్ యుద్ధం జాక్సన్‌కు కీర్తి ప్రతిష్ఠలు ఒనగూర్చి, కాల క్రమంలో అతడు అమెరికా అధ్యక్షుడు కావడానికి మార్గమేర్పడింది.

## 8.1.5. ఘెంట్ సంధి (1814) :

1812 చివరలో రష్యా చక్రవర్తి మొదటి అలెగ్జాండర్ బ్రిటన్ అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య శాంతి సాధనకై మధ్యవర్తిత్వాన్ని వహించడానికి ముందుకు వచ్చాడు. నెపోలియన్ సైన్యం రష్యా మీద దండయాత్ర చేస్తున్న తరుణంలో మిత్ర దేశమయిన బ్రిటన్ తన సైనిక శక్తిని అమెరికాలో వ్యర్థం చేయడం రష్యా చక్రవర్తికి నచ్చలేదు. రష్యా చక్రవర్తి ప్రతిపాదన వెంటనే ఎలాంటి ఫలితం ఇవ్వకపోయినా, శాంతి సాధనకు వీలు కల్పించగల యంత్రాంగం ముందుకు సాగేటట్లు చేసింది. శాంతి సాధనకై కృషికిగాను అయిదుగురు అమెరికన్ శాంతి దూతలు హాలెండులో వున్న ఘెంట్ నగరాన్ని చేరుకొన్నారు. అమెరికన్ శాంతి దూతలకు నాయకుడు జాన్ క్విన్సీ ఆడమ్స్, ఘెంట్‌లో శాంతి సంప్రదింపులు ప్రారంభమయ్యేనాటికి అమెరికాలో బ్రిటన్‌ను విజయపరంపర వరిస్తూ ఉంది. ఆ విజయోత్సాహంలో బ్రిటన్ అమెరికా నుంచి విపరీతమయిన, అపరిమితమయిన కోర్కెలు కోరింది. అమెరికన్ శాంతిదూతలు ఈ షరతులు తోసిపుచ్చినారు. షరతులపై చర్చలు జరుగుతున్న సమయంలోనే లేక్ చాంప్లెయిన్, బాల్టిమోర్‌లలో అమెరికన్‌లు విజయాలు సాధించినారన్న వార్తలు అందినాయి. బ్రిటన్ అప్పటికే యుద్ధమంటే విముఖత వెలిబుచ్చసాగింది. అప్పటికి దాదాపు ఇరవై సంవత్సరాలుగా బ్రిటన్ ఫ్రెంచి

విప్లవకారులతో, ఆ తరువాత నెపోలియన్‌తో యుద్ధం సాగిస్తున్నది. ఈ సుదీర్ఘ యుద్ధాలు బ్రిటీష్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బతీసినాయి. ఈ పరిస్థితులలో బ్రిటన్ ఏదో విధంగా అమెరికాతో సంధి కుదుర్చుకోవలెనని నిశ్చయించింది. 1814 డిసెంబరు 24న సంధి ప్రతంపై సంతకాలు అయినాయి.

ఘెంట్ సంధి ప్రకారం 1) రెండు పక్షాల వారు యుద్ధ సమయంలో ఆక్రమించుకొన్న భూభాగాన్ని స్వంతదారులకు తిరిగి ఇవ్వవలెను. 2) బ్రిటన్‌కు విధేయులుగా ఉన్న రెడ్ ఇండియన్‌లు అమెరికానుంచి వారికి హక్కు ఉన్న ప్రాంతాలను తిరిగి పొందవచ్చు. 3) ఈ సంధి పత్రంలో 'ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్'ను గురించి గాని, 'ఇమ్‌ప్రెస్‌మెంట్' పద్ధతి గురించి గాని ఏమీ పేర్కొనలేదు. కాని ఈ రెండు దేశాల మధ్య ఉన్న ఇతర చిన్న చిన్న తగాదాలు సంధి సమావేశం తరువాత జాయింట్ కమిషన్స్ ద్వారా పరిష్కరించుకొనే అవకాశం కలిగింది. ఇలా ఇరు పక్షాల వారు వారి వారి కోర్కెల మీద మొండిగా ఒత్తిడి తేనందువల్ల సంధి మంతనాలు, యుద్ధం వలెనే ఎవరికీ గెలుపు ఓటమిల ప్రసక్తి లేకుండా ముగిశాయి.

## 8.1.6. హార్ట్ ఫోర్డ్ సమావేశము :

ఘెంట్‌లో శాంతి చర్చలు కొనసాగుతూ ఉన్న సమయంలో న్యూ ఇంగ్లండ్ రాష్ట్రాలకు చెందిన కొంత మంది ఫెడరలిస్ట్ నాయకులు అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి విడిపోవలెననే ఉద్దేశంతో కనెక్టికట్ రాష్ట్రంలోని హార్ట్‌ఫోర్డ్ దగ్గర సమావేశముయినారు. వీరు బ్రిటన్‌లో వాణిజ్య సంబంధాలకు అంతరాయం కలిగించిన 1812 యుద్ధాన్ని వ్యతిరేకించినారు. ఈ యుద్ధము పశ్చిమ ప్రాంతం వారి పురోభివృద్ధికి దోహదకారి అని భావించినారు. వీరు తమ రాష్ట్రాల సైన్యాన్ని యుద్ధ సమయంలో ఫెడరల్ ప్రభుత్వం ఆధీనంలో ఉంచడానికి నిరాకరించినారు. ఈ రాష్ట్రాల వర్తకులు యుద్ధ సమయంలో బ్రిటీష్ సైన్య నౌకా దళాలతో వ్యాపారం కొనసాగించినారు. అంతే కాకుండా ఆ రాష్ట్రాల రాజకీయ నాయకులు వర్జీనియా, కెంటకే తీర్మానాలను తలదన్నే రీతిలో ఫెడరల్ ప్రభుత్వ చర్యలను రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించవచ్చు అనే నినాదాన్ని ఏక కంఠంతో చాటినారు.

కాని, హార్ట్‌ఫోర్డ్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి విడిపోయే విషయాన్ని చర్చించక రాజ్యాంగ చట్టాన్ని సవరించడానికి కొన్ని సవరణలు ప్రతిపాదించినారు. యుద్ధం ప్రకటించే విషయంలో, నిరోధాలు విధించడంలో, కొత్త రాష్ట్రాలను చేర్చుకొనే విషయంలో కాంగ్రెస్ అధికారాలపై కొన్ని హద్దులు విధించవలెనని ఈ సవరణల సారాంశము. ఈ సమావేశ నివేదిక వాషింగ్టన్‌కు చేరే నాటికే న్యూ ఆర్లియన్స్ యుద్ధరంగంలో అమెరికన్‌ల విజయం వార్త చేరింది. దీంతో అధ్యక్షుడు మాడిసన్ ఈ నివేదికను ఖాతరు చేయలేదు.

## 8.1.7. యుద్ధ ఫలితాలు :

1812 యుద్ధము అమెరికా సంయుక్త రాష్ట్రాలకు కొన్ని మంచి ఫలితాలను ప్రసాదించింది. వాటిలో పేర్కొనదగినవి.

1. 1812 యుద్ధము అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజానీకంలో జాతీయ భావాన్ని, విదేశీ వ్యవహారాలలో ఏకాంత విధానాన్ని వృద్ధి చేసింది. ఈ యుద్ధ అంతమయ్యే నాటి వరకు అమెరికన్ రాజకీయపార్టీలు బ్రిటన్ లేక ఫ్రాన్స్‌ను సమర్థిస్తూ ఉండేవి. కాని ఈ యుద్ధం తరువాత ఏకాంత విధానాన్ని ఆచరణలో పెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయి.

2. ఈ యుద్ధం ఆర్థికంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలకు లాభాన్ని చేకూర్చింది. ఎమ్‌బార్గో, నాన్ ఇంటర్ కోర్సు చట్టాల వల్ల, 1812 యుద్ధం వల్ల విదేశాల నుంచి సరుకులు దిగుమతి చేసుకోవడం కష్టతరమయింది. తమకు కావలసిన వస్తువులను తామే తయారు చేసుకుంటే ఆర్థికంగా తమ కాళ్ళ మీద తాము నిలబడతామన్న ఆత్మ విశ్వాసం అమెరికన్‌లలో కలిగింది. ఈ లక్ష్యాన్ని సాధించినట్లయితే ఏకాంత విధానాన్ని తాము నిర్విఘ్నంగా పాటించవచ్చునని నిశ్చయించుకొన్నారు. ఈ పరిస్థితులలో అమెరికన్లు కర్మాగారాలు నెలకొల్పి వస్తూత్పత్తి చేయడానికి కంకణం కట్టుకొన్నారు. ఫలితంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు క్రమక్రమంగా గొప్ప పారిశ్రామిక దేశంగా రూపొందింది.

3. 1812 యుద్ధం వల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాలు శక్తి సామర్థ్యాలున్న దేశమని ఐరోపా గుర్తించింది. అందువల్ల ఈ యుద్ధం తరువాత అమెరికా సంయుక్త రాష్ట్రాల వ్యవహారాలలో ఐరోపా జోక్యం చేసుకోవడం మానివేసింది.
4. ఈ యుద్ధంలో అమెరికన్‌లు రెడ్ ఇండియన్‌లను ఓడించినందువల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాల పశ్చిమ సరిహద్దులలో శాంతి స్థాపన జరిగింది.
5. ఈ యుద్ధ ఫలితంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలకు పశ్చిమ దిశకు విస్తరణ కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడినాయి.
6. అమెరికన్‌లకు బ్రిటీష్ వారికి మధ్య కుదిరిన సామరస్యమైన ఈ సంధి ఉత్తర సరిహద్దు ప్రాంతంలో శాంతికి దోహదం చేసింది.
7. పశ్చిమ ప్రాంతాల విషయమై దేశము నిర్లక్ష్యం చేయడం లేదనే నమ్మకం కలిగించడానికి ఆ ప్రాంతాలలో శాంతికి దోహదం చేసింది.
8. ఈ యుద్ధం తరువాత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఆధిక్యాన్ని తేటతెల్లం చేస్తూ సుప్రీంకోర్టు చాలా తీర్పులు ఇచ్చింది.
9. ఈ యుద్ధం తరువాత అవలంబించిన ఏకాంత విధానం దాదాపు ఒక శతాబ్ద పర్యంతం అవిచ్ఛిన్నంగా సాగింది.
10. దేశ అవసరాలను గుర్తించిన ప్రభుత్వం దేశంలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ రహదార్లు నిర్మించింది. ఈ చర్య దేశంలోని వివిధ వర్గాలను సంఘటిక పరచడానికి కూడా ఉద్దేశించింది.
11. దేశ రక్షణ కోసం సైన్య, నౌకా బలాల సంఖ్యను పెంచడం కూడా ఈ తరుణంలోనే జరిగింది.
12. స్వదేశీ వస్తువులు సులభంగా అమ్ముడుపోవడం కోసం విదేశీ వస్తువులపైన విపరీతంగా సుంకాలు విధించారు.
13. దేశ కరెన్సీ నిలకడగాను, దేశమంతటా ఒకే రూపంలో ఉండడానికి అమెరికా సంయుక్త రాష్ట్రాల రెండో జాతీయ బ్యాంకు స్థాపితమయింది.

## 8.1.8. రెండో స్వాతంత్ర్య సంగ్రామం :

1812 యుద్ధం అనవసరమయిన, దురదృష్టకరమయిన యుద్ధమయినప్పటికీ, అది అమెరికా సంయుక్త రాష్ట్రాలలో జాతీయతా భావాన్ని, దేశభక్తిని పెంపొందించిందని కొందరు చరిత్రకారుల అభిప్రాయపడినారు. ఈ యుద్ధంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు సాధించిన కొన్ని విజయాలు అమెరికన్లకు నూతనమైన ఆత్మగౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని చేకూర్చాయి. శత్రువు నెదిరించడానికి అమెరికాలోని వివిధ ప్రాంతాలవారు, వివిధ రాష్ట్రాలవారు సైన్యంలో ఒకచోట చేరడం వల్ల జాతీయ ఐక్యతా భావం, దేశభక్తి పెంపొందింది. అమెరికన్లు సంకుచితమైన ప్రాంతీయ తత్వాన్ని విస్మరించేటట్లు చేసింది. ఈ యుద్ధం వల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఇతోధికమైన ప్రౌఢత్వాన్ని, స్వేచ్ఛా భావాన్ని సంతరించుకొంది. ఆల్బర్ట్ గెలాటిన్ ప్రవచించినట్లు యుద్ధానికి ముందు అమెరికన్లు అత్యంత స్వార్థపరులుగా అర్థాపేక్షపరులుగా, స్థానికమైన సంకుచితత్వం కలవారుగా ఉన్నారు. యుద్ధానికి తర్వాత వారు తమను ఇతోధికంగా అమెరికన్లుగా భావించుకొని ఆలోచనలలో, చేతలలో ఒకే జాతిగా మసలసాగారు. సమాఖ్య యొక్క స్థిరత్వం దీని వల్ల బలపడింది. ఈ దృష్టిలో పరిశీలించినప్పుడు 1812 యుద్ధాన్ని రెండో స్వాతంత్ర్య సంగ్రామమని పేర్కొనవచ్చు.

## 8.1.9. నమూనా ప్రశ్నలు :

**1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)**

1. 1812 యుద్ధము అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో రెండవ అమెరికా స్వాతంత్ర్య యుద్ధమని ఏలా పిలువబడెను.
2. 1812 యుద్ధ కారణాలు, ఫలితాలు వివరింపుము.

**2) లఘు వ్యాసరూప ప్రశ్నలు (15 మార్కులు)**

1) వార్ హాక్స్

2) ఘెంట్ సంధి

## 8.1.10. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America
2. C.P. Hill - History of the United States
3. Richard M. Morris - Encyclopaedia of American History
4. Novins & Commager - A Short History of the United States
5. Merle Curti - The History of the United States of America (2 Vols.)
6. K. Rajayyan - History of the United States


**- డా॥ వి.కె. మోహన్**

పాఠం - 8.2

# జేమ్స్ మన్రో (1817-1825)
# జాన్ క్విన్సీ ఆడమ్స్ (1825-1829)

## 8.2.0. లక్ష్యం :

మన్రో సిద్ధాంతము ప్రకటించుటకు దారి తీసిన పరిస్థితులు, భవిష్యత్తులో అది అమెరికా విదేశాంగ విధానమునకు ఎట్లా ఆధారమయ్యెనో గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


8.2.1. జేమ్స్ మన్రో
- 8.2.1.1. పరిచయము
- 8.2.1.2. సహృద్భావశకము
- 8.2.1.3. పశ్చిమ దిశ విస్తరణ
- 8.2.1.4. మిస్సోరి సమస్య
- 8.2.1.5. రష్ - బ్యాగట్ ఒప్పందం
- 8.2.1.6. ఫ్లోరిడా కొనుగోలు
- 8.2.1.7. మన్రో సిద్ధాంతము
  - 8.2.1.7.1. మన్రో సిద్ధాంతానికి దారి తీసిన పరిస్థితులు
  - 8.2.1.7.2. మన్రో సిద్ధాంతానికి ప్రధాన అంశాలు
  - 8.2.1.7.3. మన్రో సిద్ధాంతం పట్ల స్పందన
  - 8.2.1.7.4. మన్రో సిద్ధాంతం అమలు తీరు
  - 8.2.1.7.5. మన్రో సిద్ధాంతం ప్రాముఖ్యము

8.2.2. జాన్ క్విన్సీ ఆడమ్స్
- 8.2.2.1. పరిచయము
- 8.2.2.2. జార్జియా - ఇండియన్‌ల తగాదా
- 8.2.2.3. సుంకం విషయక వాగ్వివాదము
- 8.2.2.4. విదేశీ వ్యవహారాలు

8.2.3. నమూనా ప్రశ్నలు

8.2.4. చదువదగిన గ్రంథాలు

## 8.2.1. జేమ్స్ మన్రో :

**8.2.1.1. పరిచయం :** 1816 అధ్యక్ష ఎన్నికలలో వర్జీనియాకు చెందిన జేమ్స్ మన్రో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా, న్యూయార్క్‌కు చెందిన రూఫస్ కింగ్ ఫెడరలిస్ట్ పార్టీ తరపున పోటీ చేసారు. జేమ్స్ మన్రోకు 183 ఓట్లు రాగా, అతని ప్రత్యర్థి రూఫస్ కింగ్‌కు 34 ఓట్లు వచ్చాయి. రూఫస్ కింగ్‌కు మెసాచుసెట్స్, కనెక్టికట్, డెలవేర్ రాష్ట్రాల వారు ఓటు వేయగా మిగిలిన రాష్ట్రాలన్నీ మన్రోకు ఓటు వేశాయి. మన్రో అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. ఈ కాలానికి ఫెడరలిస్ట్ పార్టీ దాని అవసానదశకు చేరుకుంది. రిపబ్లికన్ పార్టీ బాగా బలం పుంజుకుంది.

**8.2.1.2. సుహృద్భావ శకము :** అధ్యక్ష పదవిని అలంకరించే నాటికి మన్రో వయస్సు 61 సంవత్సరాలు. ఇతడు విప్లవ కాలంలో సైనికుడు గాను, తరువాత కొంత కాలం రాయబారిగా ఉన్నాడు. మన్రో అధ్యక్షుడు కాగానే న్యూఇంగ్లండ్‌కు చెందిన మన్రో జాన్‌క్విన్సీ ఆడమ్స్‌ను విదేశాంగ కార్యదర్శిగా, కెరోలినా వాస్తవ్యుడైన జాన్. సి. కాల్హూన్‌ను యుద్ధ కార్యదర్శిగా నియమించాడు.

అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో రాజకీయ పార్టీల మధ్య ప్రతిస్పర్ధాభావం అంతరించిపోయిన మన్రో ఎనిమిది సంవత్సరాల అధ్యక్ష కాలాన్ని 'సుహృద్భావశక'మని పిలిచారు. పదవీ స్వీకారం చేసిన తరువాత మన్రో దేశమంతటా సుహృద్భావ పర్యటన చేసినాడు. దేశంలోని రాజకీయ పార్టీ మధ్య భేదాభిప్రాయాలు తొలగించడం, ఫెడరల్ ప్రభుత్వంపై అసంతృప్తి ప్రకటించిన వారిని కూడగట్టుకొనడం, ప్రజలలో దేశ భక్తిని ఇనుమడింప చేయటం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశాలు. 1817లో ఫెడరలిస్ట్‌లతో నిండి ఉన్న న్యూ ఇంగ్లండ్‌లో మన్రో సుహృద్భావ పర్యటన చేశాడు. న్యూ ఇంగ్లాండ్‌లో మన్రోకు హృదయపూర్వకమైన ఘనస్వాగతం లభించింది. రాజకీయంగా మన్రోకు శత్రుప్రాంతమనదగిన న్యూ ఇంగ్లండ్‌లో అతనికి లభించిన ఘన స్వాగతాన్ని చూసి బోస్టన్ పట్టణ వార్తా పత్రిక "ది కొలంబియన్ సెంటినెల్' ఆశ్చర్య చకితమై అమెరికాలో 'సుహృద్భావశకం' ప్రారంభమయిందని వ్రాసింది. ఈ వ్యాఖ్య దేశం నాలుగు మూలలా మారుమోగింది. దేశంలో మొట్టమొదటిసారిగా పార్టీ విభేదాలు అంతరించినాయి. ఈ కారణంగానే మన్రో 8 సంవత్సరాల పదవీ కాలాన్ని 'సుహృద్భావశక'మని చరిత్రకారులు వర్ణించారు. 1820లో మన్రో ఒక్క ఓటు మినహా ఏకగ్రీవంగా ఎన్నికయినాడు. దేశ చరిత్రలో ఏకగ్రీవంగా ఎన్నికయిన ఘనత వాషింగ్టన్‌కే చెందవలెనని ఆ ఒక్క ఓటరూ జాన్ క్విన్స్ ఆడమ్స్‌కు ఓటు చేసినాడు.

మన్రో పరిపాలనా కాలానికి సుహృద్భావశకమనే పేరు సమంజసం కాదని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడినారు. మన్రో పాలనలోని తొలి సంవత్సరాలలో శాంతి, సౌభాగ్యాలు విలసిల్లినప్పటికీ, అతని పాలనా కాలం చాలా వరకు సమస్యలతో, అలజడితో కూడింది. అతని కాలంలో రక్షణ సుంకం, జాతీయ బ్యాంకు, దేశంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ భూముల అమ్మకం మొదలైన అనేక క్లిష్ట సమస్యలను సంబంధించి, తీవ్ర వాదోపవాదాలు చెలరేగాయి. ఉత్తర, దక్షిణాల మధ్య వర్ణ పోరాటం తీవ్రమై బానిసత్వ సమస్యను గూర్చిన పోరాటం వికృత రూపం దాల్చసాగింది. 1820 నాటికి రిపబ్లికన్ పార్టీలోని ప్రముఖ రాజకీయ నాయకుల మధ్య వర్ణ వైషమ్యాలు, అంతఃకలహాలు ఏర్పడి 'సుహృద్భావశకం' స్థానంలో 'ఉద్రేక భావ శకం' చోటు చేసుకుంది. రిపబ్లికన్ పార్టీలో ప్రముఖ నాయకులైన క్లే, కాల్హూన్, జాక్సన్, జాన్ క్విన్సీ ఆడమ్స్ మొదలైనవారు ఒకరితో ఒకరు ప్రాబల్యానికై పోటీపడి, తమ తమ ప్రాంతాలకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలను పరస్పర విరుద్ధమని వాటిని సమర్థించసాగారు.

**8.2.1.3. పశ్చిమ దేశ విస్తరణ :** అమెరికా సంయుక్త రాష్ట్రాల పశ్చిమ దిశ విస్తరణ మన్రో పాలనా కాలంలో త్వరితగతిని సాగింది. ఈ కాలంలో ఆరు కొత్త రాష్ట్రాలు సమాఖ్యలో చేర్చుకోబడ్డాయి. అవి ఇండియానా, మిసిసిపీ, ఇల్లినాయిస్, ఆలాబామా, మెయిన్, మిస్సోరి. ఈ విస్తరణను సూచించే మరొక లక్షణం అతి లాభాపేక్షతో కూడిన పడమటి భూములు అమ్మకానికి సంబంధించిన పట్టా వ్యాపారం. ఈ పట్టా వ్యాపారాన్ని అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయ బ్యాంకు ప్రోత్సహించింది. బ్యాంకుకు పశ్చిమ ప్రాంతాలలోని రైతులు ఎక్కువగా రుణపడి ఉన్నారు. రుణాలు తీర్చలేని రైతులు తమ భూములను అతి తక్కువ ధరలకు పట్టా వ్యాపారులకు అమ్ముకోవలసి వచ్చింది.

**8.2.1.4. మిస్సోరి సమస్య :** 1815 తరువాత కొనసాగిన పశ్చిమ విస్తరణ కార్యక్రమోద్యమం రోజులలో దాక్షిణాత్యులు చాలా మంది మిస్సోరీ ప్రాంతాన్ని ఆక్రమించినారు. 1819 నాటికి ఈ ప్రాంతంలో 60 వేల మంది నివసిస్తుండేవారు. వారు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతూ ఉండేవారు. ఈ విషయమై ప్రజాప్రతినిధుల సభలో బిల్లు ప్రవేశపెట్టడమయింది. సభలో ఉండేవారు బిల్లు

విషయమై తర్జన భర్జనలు జరుపుతూ ఉండగా న్యూయార్క్‌కు చెందిన యూజిన్ టాల్ మాడ్జి అనే ప్రతినిధి కింది విధంగా సవరణ సూచించాడు. మిస్సోరి ప్రత్యేక రాష్ట్రంగా యూనియన్‌లో చేరిన తరువాత బానిసలను ఆ రాష్ట్రంలోనికి తీసుకొని రాకూడదు. మిస్సోరీ రాష్ట్రంగా అవతరించి తర్వాత ఆ రాష్ట్రంలో జన్మించిన బానిసల బిడ్డలను 25 సంవత్సరాల వయస్సు వచ్చిన వెంటనే పౌరులుగా గుర్తించవలెను. ఈ సవరణలో ఉన్న అంతరార్థం కొంత కాలానికి మిస్సోరిలో బానిసత్వ నిర్మూలన జరగవలె. టాల్ మాడ్జి సవరణపై దేశమంతటా వాదోపవాదాలు చెలరేగాయి. 1812 యుద్ధం తరువాత అమెరికాలో ఒక వైపు జాతీయతా భావము మరొకవైపు ప్రాంతీయతా వాదం తలెత్తినాయి అనడానికి ఈ వాదోపవాదాలే నిదర్శనము.

ఉత్తర ప్రాంతంలో మిస్సోరిని బానిసత్వ వ్యవస్థగల రాష్ట్రంగా యూనియన్‌లో చేర్చుకొనటాన్ని వ్యతిరేకిస్తూ సభలు జరిగినాయి. వార్తాపత్రికలు సంపాదకీయాలు ప్రచురించినాయి. దక్షిణ ప్రాంతంలో మిస్సోరీని బానిసత్వ వ్యవస్థ గల రాష్ట్రంగా చేర్చుకోనవలెనని వక్తలు, రచయితలు వాదించారు. దాక్షిణత్యులు, ఔత్తరాహికులు కూడా తాము కోరిన విధంగా జరగని పక్షంలో యూనియన్ నుంచి విడిపోతామని బెదిరించినారు. ఈ పరిస్థితుల్లో 1819 వేసవిలో టాల్‌మాడ్జ్ సవరణ 'హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్'లో ఆమోదాన్ని పొందింది. కాని సెనేట్ ఈ సవరణను ఆమోదించలేదు. మిస్సోరినీ బానిసత్వ వ్యవస్థ గల రాష్ట్రంగా చేర్చురొనే విషయం దాక్షిణాత్యులకు పెద్ద సమస్యగా తయారయింది. 1819 నాటికి దక్షిణ ప్రాంతంలో పత్తి పెంపకము అపారముగా వృద్ధి అయింది. దీనికి ఎక్కువ నేల, ఎక్కువ మంది పనివారు కావలసి వచ్చింది. ఇదే గాక 1820 నాటికి ఉత్తర ప్రాంతం జనాభా 51,52,000 మంది. దక్షిణ ప్రాంత జనాభా 44,85,000 మంది. ప్రజా ప్రతినిధుల సభలో ఉత్తర ప్రాంతం నుంచి 105 మంది ప్రతినిధులుండగా, దక్షిణం నుండి 85 మంది మాత్రమే ఉన్నారు. విదేశాల నుంచి వచ్చినవారు ఉత్తర ప్రాంతంలో జీవన పరిస్థితులు మెరుగుగా ఉన్నందువల్ల అక్కడికే వలస పోయేవారు. ఈ విధంగా ఉత్తర ప్రాంతం జనాభా క్రమేణా పెరుగుతూ వస్తున్నది. అంటే భవిష్యత్తులో హౌస్‌లో ఉత్తర ప్రాంత ప్రతినిధుల సంఖ్య పెరగటం తథ్యము. 1819 నాటికి బానిసత్వ వ్యవస్థ గల రాష్ట్రాల సంఖ్య 11 కాగా బానిసత్వ వ్యవస్థ లేని రాష్ట్రాలు 11 ఉన్నాయి. అంటే సెనేట్‌లో ఉత్తర ప్రాంతం నుంచి 22 మంది ప్రతినిధులు, దక్షిణం నుంచి 22 మంది ఉన్నారు. హౌస్‌లో తన ప్రతినిధుల సంఖ్య తక్కువగా ఉన్నందువల్ల కనీసం సెనేట్‌లోనయినా దక్షిణ ప్రాంతానికి ఉత్తర ప్రాంతానికి సరిసమానమయిన ప్రాతినిధ్యం ఉండవలెనని దక్షిణ ప్రాంతం అభిలషించింది. మిస్సోరి బానిసత్వ వ్యవస్థగల రాష్ట్రంగా చేరవలెనని ప్రయత్నించగా దాక్షిణాత్య రాష్ట్రాల సంఖ్య 12కు పెరుగుతుందని ఔత్తరాహికులు తమ వ్యతిరేకాన్ని వెలిబుచ్చినారు.

మిస్సోరి ప్రాంతం సమాఖ్యలో రాష్ట్రంగా ప్రవేశించడానికి సంబంధించిన ఈ సమస్య చివరకు 1820 రాజీతో తొలగింది. ఈ రాజీని ఏర్పాటు చేయడంలో కెంటోలి రాష్ట్రానికి హెన్రీక్లే ప్రముఖ పాత్ర వహించాడు. ఈ రాజీ మేరకు మిస్సోరీ నూతన రాష్ట్రంగా సమాఖ్య చేరడానికి కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. మెసాచుసెట్స్‌లో భాగమైన మెయిన్ ప్రాంత ప్రజలు కోరినట్లు మెయిన్ కూడా నూతన రాష్ట్రంగా సమాఖ్యలో చేరింది. ఈ విధంగా బానిసత్వం లేని రాష్ట్రాలు 12, బానిసత్వ ఉన్న రాష్ట్రాలు 12 ఏర్పడి సెనేట్‌లో ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య అధికార సమతౌల్యం కొనసాగింది. మిస్సోరి రాజీ అమలులోకి వచ్చిన తరువాత 30 సంవత్సరాల వరకు యూనియన్‌లో కొత్త రాష్ట్రాలు చేర్చుకొనవలసిన పరిస్థితి ఏర్పడినపుడు ఒక రాష్ట్రం బానిసలు గల రాష్ట్రంగాను, ఇంకొక రాష్ట్రం బానిసలు లేని రాష్ట్రంగాను చేర్చుకోవడం జరిగింది.

**8.2.1.5. రష్-బ్యాగట్ ఒప్పందం :** 1814 ఘెంట్ సంధిలో అపరిష్కృతంగా వదలిన అనేక విషయాలు పరిష్కారం కోసం మన్రో ప్రభుత్వం 1817లో బ్రిటన్ రష్ బ్యాగట్ ఒప్పందం కుదుర్చుకొన్నది. ఈ ఒప్పందం ప్రకారం,

1) న్యూఫౌండ్‌ల్యాండ్ సముద్రంలో చేపలు పట్టుకునే హక్కులు కెనడియన్లతో పాటు అమెరికన్లకు కూడా లభించాయి.

2) రాకీ పర్వతాల వరకు విస్తరించిన $49^0$వ అక్షాంశం లూయిసియానా ఉత్తర సరిహద్దుగా నిర్ణయమయింది.

3) 1818లో ఈ సరిహద్దు రేఖను పసిఫిక్ మహా సముద్రం వరకు పొడిగించే అవకాశాన్ని బ్రిటీష్, అమెరికన్ శాంతి దూతలు చర్చించారు. కాని ఈ విషయంలో ఒప్పందం కుదరక ఆరెగాన్ ప్రాంతంలో ఇరు పక్షాలు తమ హక్కులను వదులుకోకుండా పదేళ్ళు ఆ ప్రాంతాన్ని బ్రిటన్, అమెరికాలు కలిసి ఆక్రమించేటట్లు ఒప్పందం ఏర్పరచుకొన్నారు.

4) బ్రిటన్‌గాని, అమెరికా సంయుక్త రాష్ట్రాలుగాని మహా సరస్సులలో యుద్ధ నౌకలను ఉంచరాదు.

5) కెనడా, అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సరిహద్దు రేఖను నిర్ణయించటానికి సరిహద్దు కమిషన్లు ఏర్పాటు చేసినందువల్ల రెండు దేశాలకు పరస్పరమైన భద్రత లభించింది.

**8.2.1.6. ఫ్లోరిడా కొనుగోలు :** స్పెయిన్ 178లో బ్రిటన్‌నుండి తూర్పు ఫ్లోరిడా, పశ్చిమ ఫ్లోరిడాలను పొందినవి. ఫ్రాన్స్ దగ్గర నుంచి లూయిసియానా ప్రాంతాన్ని జెఫర్‌సన్ కొన్నప్పుడు పశ్చిమ ఫ్లోరిడా లూయిసియానాలో చేరిందని వాదించి ఆ ప్రాంతాన్ని అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భాగంగా ప్రకటించినాడు. స్పెయిన్ ఆధీనంలోని తూర్పు ఫ్లోరిడా అమెరికన్‌లకు సమస్యలు తెచ్చి పెట్టింది. చిర కాలం నుంచి తూర్పు ఫ్లారిడా తిరుగుబాటుదార్లయిన రెడ్ ఇండియన్‌లకు, ఓడ దొంగలకు, దొంగ రవాణా దార్లకు, పారిపోయిన బానిసలకు తలదాచుకొనే ప్రదేశంగా ఉన్నది. ఫ్లొరిడాను స్పెయిన్ తన అదుపాజ్ఞలలో పెట్టలేకపోయింది. జార్జియా, ఫ్లొరిడా సరిహద్దులలో నివసిస్తున్న జార్జియా వ్యవసాయదారులను సెమినోల్ ఇండియన్‌లు దారుణంగా హింసించేవారు.

అమెరికన్ల ప్రాణాలను, ఆస్తిపాస్తులను కాపాడే విషయంలో స్పెయిన్ శ్రద్ధ చూపనందువల్ల మన్రో ఆ పనిని ఆండ్రూ జాక్సన్‌కు అప్పగించాడు. 1818లో జాక్సన్ తన సైన్యాన్ని మధ్య ఫ్లొరిడా ప్రాంతానికి నడిపించాడు. జాక్సన్ ఫ్లొరిడాలో సెంట్ మార్క్స్, పెన్ సకోలా అనే రెండు కోటలను స్వాధీనం చేసుకొన్నాడు. ఇద్దరు రెడ్ ఇండియన్ నాయకులను ఎలాంటి విచారణ లేకుండా ఉరి తీసాడు. దీనితో తృప్తి చెందక ఇండియన్లకు సహాయం చేసినందుకు ఫెన్సకోలా నివాసులైన ఆంబ్రిస్టర్, ఆర్బుతోనాట్ అనే ఇద్దరు బ్రిటీష్ పౌరులను ఉరితీసాడు. అక్కడి స్పెయిన్ గవర్నర్‌ను పదవీ భ్రష్టుణ్ణి కావించాడు.

ఫ్లొరిడాలో ఆండ్రూ జాక్సన్ చర్యలు అతనికిచ్చిన అధికారాన్ని మించి ప్రవర్తిస్తున్నట్లు సూచిస్తున్నాయని మన్రో యుద్ధ కార్యదర్శి కాల్హూన్, మరికొంత మంది కాబినెట్ సభ్యులు విమర్శించారు. రాజ్య కార్యదర్శి జాన్ క్విన్ అడమ్స్, జాక్సన్ చర్యలను పరోక్షంగా సమర్థించి మిగిలిన కార్యదర్శులనంతా తన అభిప్రాయంలో ఏకీభవింపజేశాడు. తనకు క్షమాపణ చెప్పకోవలెనని స్పెయిన్ పట్టుదల పట్టింది. స్పెయిన్ క్షమాపణ చెప్పక పోగా, అది అమెరికన్ భూ భాగం మీద ఫ్లొరిడా సరిహద్దును దాటి దాడి చేసే బందిపోట్లను అదుపులో పెట్టక, 1795 స్పానిష్ - అమెరికన్ సంధిని ఉల్లంఘించిందని, స్పెయిన్ అమెరికాకు యుద్ధ ఖర్చుల కింద నష్టపరిహారం చెల్లించాలని స్పెయిన్ ప్రభుత్వానికి ఆడమ్స్, స్పష్టపరిచాడు.

ఫ్లొరిడా సమస్యకు ఆడమ్స్ రెండు పరిష్కార మార్గాలను సూచించాడు. అవి. 1) స్పానిష్ ప్రభుత్వం సరిహద్దు ప్రాంతాన్ని తన అదుపులోనికి తెచ్చుకొని, అమెరికన్ భూ భాగం మీద రెడ్ ఇండియన్ దాడులను అరికట్టడం. ఇది స్పెయిన్‌కు అప్పట్లో అసాధ్యమయిన పని. 2) స్పెయిన్ తన ఆత్మాభిమానాన్ని చంపుకొని అమెరికా సంయుక్త రాష్ట్రాలకు దత్తం చేయడం. అప్పుడు దక్షిణ అమెరికాలో సాగుతున్న విప్లవ పరిస్థితులలో అమెరికాను ఎదిరించి ఫ్లొరిడాను నిలుపుకోవటం అసాధ్యమని స్పానిష్ ప్రభుత్వం గమనించింది. అందువల్ల స్పెయిన్ అమెరికా సంయుక్త రాష్ట్రాలతో 1819లో ఆడమ్స్ - ఓనిస్ సంధి చేసుకొన్నది. ఈ సంధి ప్రకారం 1) అంతవరకు అస్పష్టంగా ఉన్న లూయిసియానా ప్రాంతం పశ్చిమ సరిహద్దు నిర్ణయమయింది. 2) ఫ్లొరిడా ప్రాంతమంతటిని అమెరికా 5 మిలియన్‌ల డాలర్లకు కొన్నది. 3) ఓరగాన్ ప్రాంతంపై తనకున్న హక్కును స్పెయిన్ వదులుకొన్నది. 4) అమెరికా టెక్సాస్‌పై తనకే విధమైన హక్కు లేదని ఒప్పుకొన్నది. కొందరు దేశ భక్తులు అమెరికా టెక్సాస్‌ను వదులుకోవటాన్ని తీవ్రంగా విమర్శించినప్పటికీ, ఈ సంధి ద్వారా ఒక్క కలం పోటుతో స్పెయిల్‌లో ఎడతెగని వివాదాన్ని అమెరికా సంయుక్త రాష్ట్రాలు అంతం చేసింది. అమెరికా భూ భాగానికి నిండుతనం చేకూరింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయతా గౌరవం పెంపొందింది.

**8.2.1.7. మన్రో సిద్ధాంతం :** అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో మన్రో పేరును చిరస్మరణీయమొనర్చి, అతనికి చిరయాశస్సును గడించింది. అమెరికన్ విదేశాంగ నీతికి సంబంధించి అతని పేరున వెలసిన మన్రో సిద్ధాంతం. మన్రో సిద్ధాంతంలోని అంశాలన్నీ మన్రో స్వయంగా రూపొందించినవి కావు. జేమ్స్ మన్రో 1 అతని విదేశాంగ కార్యదర్శి అయిన జాన్ క్విన్సీ ఆడమ్స్‌లిద్దరూ దీర్ఘంగా చర్చించి రూపొందించినవి. ఇవి పూర్తిగా కొత్త భావాలని చెప్పటానికి వీలులేదు. థామస్ జెఫర్‌సన్ రచనల నుంచి ఈ భావాలను అరువు తీసుకొనటం

జరిగింది. వాషింగ్టన్ మొదలయిన వారి వలెనే జెఫర్సన్ అమెరికా కొత్త ప్రపంచ వ్యవహారాలలో నాయకత్వం వహించవలెనని, ఐరోపా రాజ్యాలు నాటి రాజకీయాలను, యుద్ధాలను పాత ప్రపంచానికి పరిమితం చేసుకోవాలని సూచించినాడు. మన్రో సిద్ధాంతం అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయ చట్టం గాని ఇతర దేశాలను న్యాయబద్ధంగా కట్టుబడిలో పెట్టగల అంతర్జాతీయ చట్టంగాని కాదు. అయినా మన్రో సిద్ధాంతం ప్రకటితమైన తరువాత ఒక శతాబ్దం వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాల విదేశాంగ విధానానికి అది కీలక సూత్రమయింది. క్రమంగా పశ్చిమార్ధ గోళం నాయకత్వ బాధ్యత, మధ్య దక్షిణ అమెరికాల సంరక్షకత్వం అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వానికి సంక్రమించినాయి. పశ్చిమార్ధ గోళం వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకోన యత్నించిన ఇతర దేశాలను అమెరికన్ ప్రభుత్వం గట్టిగా పంపివేయగలిగింది.

**8.2.1.7.1. మన్రో సిద్ధాంతానికి దారి తీసిన పరిస్థితులు :** పశ్చిమార్ధ భూగోళంలో దక్షిణ, మధ్య అమెరికాలు, కరిబీయన్ సముద్ర దీవులు, మెక్సికో, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు దాదాపు మూడు శతాబ్దాల పాటు స్పెయిన్ సార్వభౌమత్వం కింద ఉన్నాయి. కాని **1824** నాటికి క్యూబా, పోర్టోరికోలు మాత్రమే స్పెయిన్‌కు మిగిలాయి. స్పెయిన్ వలసల్లో ప్రతిఘటనోద్యమం **1814**లో ప్రారంభమైంది. సైమన్ బొలివర్, జోసే శాన్ మార్టిన్, బెర్నార్డో ఓహిగ్గిన్స్ మొదలైన విప్లవ నాయకులు స్పానిష్ దక్షిణ అమెరికన్ వలసల స్వాతంత్ర్య పోరాటంలో తమ శాయశక్తులా పోరాడి స్వాతంత్ర్యం సంపాదించినారు.

లాటిన్ అమెరికాలో విప్లవం చెలరేగిన నాటి నుంచి వారిపై అమెరికన్లు సానుభూతి చూపించసాగినారు. దీనికి అనేక కారణాలున్నాయి. స్వాతంత్ర్యం సాధించే విషయంలో లాటిన్ అమెరికన్‌లు తమ అడుగుజాడలలో నడుస్తున్నారని అమెరికన్లు భావించినారు. లాటిన్ అమెరికన్ వలసలు స్పెయిన్ స్వాధీనంలో ఉన్నంత వరకు స్పెయిన్‌తో మాత్రమే వ్యాపార సంబంధాలు ఉండవలె. స్వాతంత్ర్యం సిద్ధించినట్లయితే అమెరికా ఆ రాజ్యాలలో లాభసాటి వ్యాపారం సాగించవచ్చు. అమెరికా ఖండం నుంచి ఐరోపా సామ్రాజ్య విస్తరణను రూపుమాపినట్లయితే తనకు ఖచ్చితమైన భద్రత ఏర్పడటమే గాక పాత ప్రపంచ యుద్ధాలకు, కీచులాటలకు తాను దూరంగా ఉండవచ్చు. ఇరుగు పొరుగు దేశాల ప్రజాస్వామిక ప్రభుత్వాలేర్పడినట్లయితే తన ప్రజాస్వామిక విధానానికి బల ప్రతిష్టలు చేకూరుతాయి. లాటిన్ అమెరికా విప్లవం తొలి దశలో అమెరికా బ్రిటన్‌తో పోరాడుతున్నది. **1815**లో స్పెయిన్, లాటిన్ అమెరికన్ వలసలకు జరుగుతున్న పోరాటం విషయంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు తటస్థ విధానాన్ని ప్రకటించింది. ఈ తటస్థ్యము వలసలకు సహాయకరంగానే ఉన్నది. ఈ విధానం వల్ల లాటిన్ అమెరికా రాష్ట్రాలు తిరుగుబాటు జరుపుతున్న వలసలుగా కాక పరదేశంలో యుద్ధం చేస్తున్న దేశాలుగా గుర్తులోకి వచ్చినాయి. ఆ రాష్ట్రాల నౌకలు యుద్ధ నౌకలుగా పరిగణితమవుతాయి. కాని సముద్రచోరులు నౌకలు పరిగణనకురావు. అమెరికా తన తటస్థ చట్టాన్ని సవరించినప్పటికీ విప్లవకారులు అమెరికన్ సరుకులను, నిరాయుధ నౌకలను కొనటానికి అనుమతించింది. ఆయుధాలను, యుద్ధ నౌకలను కొనటం నిషేధించింది. విప్లవకారులు అమెరికన్‌లను తమ సైన్యంలో చేర్చుకోరాదు. ఈ నిబంధనలను విప్లవకారులు సులువుగా ఉల్లంఘించసాగినారు.

కెంటోలి రాష్ట్రానికి చెందిన వ్యక్తి, రాజీలు ఏర్పాటు చేయడంలో ఆరితేరి మహాపరిష్కర్తగా ప్రసిద్ధి వహించిన హెన్రీ క్లే విప్లవ వలసలను స్వతంత్ర రాజ్యాలుగా గుర్తించమని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేశాడు. చివరకు **1822**లో మెక్సికో, పెరూ, కొలంబియా, చిలీ మొదలైన రాజ్యాలను స్వతంత్ర రాజ్యాలుగా గుర్తించడానికి మన్రో నిశ్చయించినాడు.

పాత ప్రపంచం నుంచి కొత్త ప్రపంచాన్ని వేరే చేసే అఖిల - అమెరికా వ్యవస్థ ఏర్పడటాన్ని బ్రిటన్ వ్యతిరేకించింది. అందువల్ల బ్రిటన్ లాటిన్ అమెరికాలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు జోక్యం కలుగజేసుకొనటాన్ని అరికట్టవలెనని ప్రయత్నించింది. లాటిన్ అమెరికన్ వలసలు స్వతంత్ర రాజ్యాలయినట్లయితే ఆ దేశాలతో బ్రిటన్ వ్యాపార సంబంధాలు పెట్టుకోవలెనని ఆశించింది. విప్లవ నాయకులైన బొలివర్, శాన్‌మార్టిన్‌లకు బ్రిటన్ చేయూతనిచ్చింది. బ్రిటిష్ సైనికులు వారి సైన్యాలలో వాలంటీర్లగా పనిచేసినారు.

రష్యా చక్రవర్తి మొదటి అలెగ్జాండర్ ఇంగ్లండ్, పోప్ మినహా మిగిలిన యూరప్ దేశాల పాలకులందరిలో పవిత్ర కూటమిని ఏర్పరచాడు. స్పెయిన్ అమెరికాలో తన సామ్రాజ్యాన్ని కోల్పోయిన విషాధ గాధను ఈ కూటమికి తెలియజేయగా దానిని తిరిగి సంపాదించుకొనడానికి సహాయపడటానికి, దానికి ప్రతిఫలంగా అందులో కొన్ని ప్రాంతాలు తాము తీసుకోవడానికి సిద్ధమయినాయి. ఫ్రాన్స్ దృష్టి క్యూబా మీద

పడింది. రష్యా అలాస్కాను ఆక్రమించి క్రమంగా పసిఫిక్ తీరం వెంట దక్షిణానికి వ్యాపించి కాలిఫోర్నియాను సంపాదించవలెనని చూస్తు ఉన్నది. పవిత్ర సంధి ఆదేశం ప్రకారం ఆస్ట్రియా నేపిల్స్, పీడ్ మాంట్‌లలో జరిగిన తిరుగుబాట్లను అణచివేసింది. స్పెయిన్‌లో జరిగిన ఒక తిరుగుబాటును ఫ్రాన్స్ అదుపులోకి తెచ్చింది. ఆ తరువాత స్పానిష్ అమెరికన్ వలసల తిరుగుబాటును అణిచివేసే పనిని పవిత్ర కూటమి ఫ్రాన్స్‌కు అప్పచెప్పింది.

ఈ వార్త అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చేరడంతో అమెరికన్లు ఆందోళన చెందారు. ప్రజాస్వామ్య విప్లవాల పట్ల సానుభూతి కలిగిన అమెరికన్లు రాజరిక శిదిలాల నుంచి లాటిన్ అమెరికా గణతంత్ర రాజ్యాలు ఆవిర్భవించటాన్ని హర్షించారు. ఐరోపా రాజ్యాలు నూతన ప్రపంచ రాజకీయాలలో జోక్యం చేసుకొంటే, గణతంత్ర రాజ్య విధానానికి తీరని హాని ఏర్పడుతుందని అమెరికన్లు భీతిల్లారు. ప్రజాస్వామ్యానికి, గణతంత్ర రాజ్యా విధానానికి పట్టుకొమ్మ అయిన అమెరికా భౌగోళిక భద్రతకు ఐరోపా రాజ్యాల సామీప్యం భంగకరమని భావించారు.

ఈ పవిత్ర కూటమిని బ్రిటన్ కూడా ప్రతిఘటిస్తుంది. స్పానిష్ అమెరికన్ రాష్ట్రాలతో బ్రిటన్ పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నది. అందువల్ల ఈ ప్రాంతాలు మళ్ళీ ఫ్రాన్స్‌కుగాని, స్పెయిన్‌కు గాని వశం కావటం బ్రిటన్‌కు ఇష్టం లేదు. బ్రిటీష్ విదేశీ వ్యవహార కార్యదర్శి కాజెల్రీ మొదటి స్పెయిన్‌కు, వలసలకు మధ్యవర్తిగా వ్యవహరించవలెనని ప్రయత్నించాడు. కాని అతని ప్రయత్నం విఫలం కాగా వలసల స్వాతంత్ర్యాన్ని బ్రిటన్ గుర్తించడానికి తగిన ప్రయత్నం చేస్తున్న సమయంలో మరణించాడు.

కాజెల్రీ స్థానంలో వచ్చిన లార్డ్ కానింగ్ **1823** ఆగస్టులో అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వానికి ఒక ప్రతిపాదన చేసినాడు. దాని ప్రకారం పశ్చిమార్ధ గోళ వ్యవహారాలలో ఐరోపాలోని రాజ్యాలేవీ జోక్యం కలిగించుకోరాదని, ఇంగ్లండ్ అమెరికా సంయుక్త రాష్ట్రాలు సంయుక్తంగా ఒక హెచ్చరిక చేయవలె. అదే సమయంలో బ్రిటన్ అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలలో ఇతోధిక ప్రాంతాలను సంపాదించబోమని వాగ్దానం చేయగలమని కూడా ఈ హెచ్చరికలో తెలపవలె.

లార్డ్ కానింగ్ ప్రతిపాదనను అమెరికాలో వచ్చిన ప్రతిస్పందనలు వివిధంగా ఉన్నాయి. వృద్ధులైన జెఫర్‌సన్, మాడిసన్‌లతో సహా మన్రోకు సన్నిహితులైన సలహాదారులు ఈ విషయంలో అమెరికా బ్రిటన్‌తో చేతులు కలపడం మంచిదని సలహా ఇచ్చారు. కాని ఈ సలహాను విదేశాంగ కార్యదర్శి అయిన జాన్ క్విన్సీ, ఆడమ్స్ ఆమోదించలేదు. ఐరోపా దేశాలే కాకుండా అమెరికా సంయుక్త రాష్ట్రాలు కూడా లాటిన్ అమెరికా ఏ విధమైన సంబంధమూ పెట్టుకోరాదని బ్రిటీష్ వారి ఆశయమని, అందువల్ల దానిని అంగీకరించడం తమకు శ్రేయస్కరం కాదని అభిప్రాయపడినాడు. 'బ్రిటన్ అనే యుద్ధ నౌకకు అంటి పెట్టుకొన్న పిల్ల పడవ వలె అమెరికా తయారు కావడం మంచిది కాదని, బ్రిటన్‌ను అనుసరించక తనదారి తను చూసుకొనటం తమదేశానికి శ్రేయస్కరమని ఆడమ్స్ సలహా ఇచ్చినాడు. ఆడమ్స్ సంయుక్త ప్రకటనను వ్యతిరేకిస్తూ ఈ విధంగా అన్నాడు : సంయుక్త ప్రకటన చేయవలసిన అవసరం లేకుండానే బ్రిటన్ లాటిన్ అమెరికాలో ఫ్రెంచివారి జోక్యం కలగజేసుకోకుండా చేయగలదు. లాటిన్ అమెరికా ప్రాంతాలను సంపాదించబోమని అమెరికా వాగ్దానం చేసినట్లయితే భవిష్యత్‌లో క్యూబాను గాని మెక్సికోనుగాని సంపాదించడానికి వీలుపడదు. అందువల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాలు తనకు తానై ఐరోపా రాజ్యాలకంతా ఒక హెచ్చరిక చేయడం అమెరికాకు శ్రేయస్కరమని ఆడమ్స్ భావించాడు. పాత ప్రపంచంలోని ఐరోపా రాజ్యాల ఇక్కట్లు అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజనీతి ప్రదర్శనానికి చక్కని అవకాశమిచ్చినాయి. ఈ రాజనీతి ఫలితమే మన్రో సిద్ధాంతము.

**8.2.1.7.2. మన్రో సిద్ధాంతంలోని ప్రధాన అంశాలు :** ఆడమ్స్ సలహా మేరకు మన్రో **1823** డిసెంబర్ 2న కాంగ్రెస్‌కిచ్చిన సందేశంలో 'మన్రో సిద్ధాంతం'మని ప్రసిద్ధిగాంచిన భావాలు ప్రకటించాడు. ఇందులో ముఖ్యమైన అంశాలు :

1) పశ్చిమార్ధగోళంలో ఏ ఐరోపా దేశం కూడా వలసలు స్థాపించరాదు.

2) పశ్చిమార్ధ గోళంలో అప్పటి వరకున్న స్వతంత్ర దేశాలు వ్యవహారాలలో ఐరోపాదేశాలు ఏ విధమైన జోక్యం కలిగించుకోరాదు.

3) ఐరోపా అంతరంగిక వ్యవహారాలలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు జోక్యం కలిగించుకోదు.

కాబట్టి మన్రో సిద్ధాంతము ఐరోపా రాజ్యాలు లాటిన్ అమెరికా రాష్ట్రాలను స్పెయిన్‌కు, పోర్చుగల్‌కు తిరిగి కట్టబెట్టకుండా ఉండడానికి జారీ చేసిన ఒక హెచ్చరిక. మొదటగా మన్రో సిద్ధాంతం వాయువ్యంలో అలస్కా నుంచి ఉత్తర అమెరికా ఖండం దక్షిణ భూ భాగంలోనికి చొచ్చుకొని వస్తున్న రష్యన్‌లను హెచ్చరిస్తూ చేసింది. ఐరోపా రాజ్యాలు అమెరికాలో వలసలు స్థాపించే శకం అంతమయిందని ఈ సిద్ధాంతం మిక్కిలి స్పష్టంగా హెచ్చరించింది. ఐరోపాలోని అగ్రరాజ్యాలు నాటికి స్థాపించుకొని ఉన్న వలసలను యధాతథంగా ఉంచుకోవచ్చుగాని, కొత్త వలసలను స్థాపించడంగాని, జరిపించడం గాని చేయరాదు.

ఈ సిద్ధాంతంలోని మరో హెచ్చరిక ఐరోపా రాజ్యాలు అమెరికా రాజకీయాలలో జోక్యం చేసుకోవడానికి సంబంధించినది. దక్షిణంలో నూతనంగా రూపుగొన్న స్పానిష్ అమెరికన్ గణ రాజ్యాలను మనసులో పెట్టుకొని మన్రో ఈ హెచ్చరిక చేశాడు. 1822 నాటికి అర్జెంటీనా, చిలి, పెరు, కొలంబియా, మెక్సికో అను ఐదు స్పానిష్ వలసలు స్వాతంత్ర్య సాధించుకొన్నాయి. అదే సంవత్సరం పోర్చుగీసు పాలన నుంచి బ్రెజిల్ విముక్తి పొంది స్వతంత్రమయింది. 1824 నాటికి అమెరికా ఖండం ఐరోపా రాజ్యాల అధికారం నుంచి విముక్తి పొందింది. ఈ వలసల రాజ్యాలన్నీ స్వాతంత్ర్య సాధన తరువాత తమను గణతంత్ర రాజ్యాలుగా ప్రకటించుకొన్నాయి. వీటిని స్వాతంత్ర రాజ్యాలుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు గుర్తించింది. ఈ రాజ్యాల రాజకీయాలలో ఐరోపా రాజ్యాలు జోక్యం చేసుకోవడం అమెరికా సంయుక్త రాష్ట్రాలు అమిత్ర చర్యగా పరిగణిస్తుందని మన్రో సిద్ధాంతం పేర్కొంది. ఐరోపా రాజ్యాల పాలకులను వారి రాజరిక విధానాలను పశ్చిమార్ధగోళానికి దూరంగా ఉంచమని మన్రో హెచ్చరించాడు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలు లాటిన్ అమెరికా రాజ్యాల స్వాతంత్ర్యాన్ని సమర్ధించేటట్లు చేయడానికి అనేక బలమైన రాజకీయ, ఆర్థిక సైనిక కారణాలున్నాయి. అవి 1) అమెరికా భూ ఖండం నుంచి ఐరోపా సామ్రాజ్యవాదం వైదొలగిపోవటం అమెరికా సంయుక్త రాష్ట్రాల శాంతి భద్రతలకు దోహదకారి అవుతుంది. 1) ఐరోపా యుద్ధాల నుంచి, రాజ్య వైషమ్యాల నుంచి అమెరికాకు విముక్తి లభిస్తుంది. 3) అమెరికా సంయుక్త రాష్ట్రాల ఉత్పత్తులకు దక్షిణ అమెరికాలో అంతా విస్తారమైన విపణులు లభిస్తాయి. 4) గణతంత్ర వ్యవస్థల వ్యాప్తి తన గణతంత్ర పాలనా విధానానికి బలాన్ని గౌరవాన్ని చేకూరుస్తుంది. 5) మన్రో సిద్ధాంత ప్రకటన అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయతా స్ఫూర్తికి ఉత్తేజమిచ్చింది. 6) నూతనంగా ఏర్పడిన లాటిన్ అమెరికా విపణులలో సర్వ శక్తిమంతమైన డాలర్ రాజ్యం చేసేటట్లు చేసింది.

**8.2.1.7.3. మన్రో సిద్ధాంతం పట్ల స్పందన :** మన్రో సిద్ధాంతం పట్ల ఐరోపా రాజ్యాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుంచి అమెరికన్ ప్రజాస్వామ్య విధానాన్ని ఏవగించుకొన్న వీరు సైనికంగా బలహీనమైన అమెరికా సంయుక్త రాష్ట్రాల అహంకార పూరితమైన ఇలాంటి హెచ్చరికలు చేయడాన్ని జీర్ణించుకోలేకపోయారు. కాని వారి పరిస్థితులు, బ్రిటీష్ నౌకా బలం తమ కోపాన్ని దిగమింగేటట్లు చేశాయి. మన్రో సిద్ధాంత ప్రకటన ఏక పక్ష ప్రకటనగా పవిత్ర కూటమి భావించి దానిని విస్మరించ తలచింది.

ఇంగ్లాండులో మన్రో సిద్ధాంతం పట్ల స్పందన మిశ్రమంగా ఉంది. అమెరికా ఖండంలోని విపణుల నుంచి బ్రిటీష్ వర్తకం మిక్కిలిగా లాభపడింది. బ్రిటీష్ పత్రికలు మన్రో హెచ్చరికను చాలా వరకు సమర్ధించాయి. కాని బ్రిటిష్ విదేశాంగ కార్యదర్శి జార్జి కానింగ్ ఈ ప్రకటన పట్ల అసహనం ప్రదర్శించాడు. మన్రో సిద్ధాంతం మేరకు ఐరోపా రాజ్యాలు మాత్రమేగాక, బ్రిటన్ కూడా భవిష్యత్తులో అమెరికాలో ఎట్టి భూ భాగాన్ని సంపాదించడానికి వీలుండదని కానింగ్ గ్రహించాడు. వలసలు స్థాపించరాదనే సూత్రం ఐరోపా రాజ్యాలతో పాటు బ్రిటన్‌కు కూడా వర్తిస్తుంది.

మన్రో సిద్ధాంతం పట్ల కొత్తగా ఏర్పడ్డ లాటిన్ అమెరికా గణతంత్ర రాజ్యాలు వివిధంగా స్పందించాయి. తమ స్వాతంత్ర్య సంపాదనలో ఈ రాజ్యాలకు బ్రిటన్ నుంచి ఎక్కువ సహాయం పొందాయి. అవి ఆర్థికంగా కూడా ఆ దేశం మీద ఆధారపడి ఉన్నాయి. తమ స్వాతంత్ర్య పరిరక్షణకు బ్రిటీష్ నౌకా బలమే గట్టి రక్షణగా భావించాయి. మన్రో సిద్ధాంతం ప్రకటన అమెరికా సంయుక్త రాష్ట్రాలు తన శాంతి భద్రతలను కాపాడుకోవడానికి చేసిన ప్రకటనగా భావించాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాల విస్తరణ విధానం తమ స్వాతంత్ర్యానికి భంగకరం కాగలదని ఈ రాజ్యాలు భావించాయి.

**8.2.1.7.4. మన్రో సిద్ధాంతం అమలు తీరు :** మన్రో సిద్ధాంతం వాస్తవానికి నాటి రాజకీయాలలో చెప్పుకోదగ్గ ఎలాంటి సంచలనం కలిగించలేదు. అమెరికన్లు కూడా దానిని ప్రశంసించి, కొద్ది కాలం తరువాత దాని సంగతి పూర్తిగా మరచిపోయారు. రెండు శతాబ్దాలకు

పైగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మన్రో సిద్ధాంతం మన్రో వ్యక్తిగత అభిప్రాయంగా భావించబడింది. 1) అధ్యక్షుడు పోల్క్ 1845లో మన్రో సిద్ధాంతాన్ని పునరుద్ఘాటించడంతో అది అమెరికన్ విదేశాంగ నీతిలో ఒక భాగమయింది. టెక్సాస్, ఆరెగాన్ ప్రాంతాలలో ఫ్రెంచి, బ్రిటీష్ వారి చర్యలకు సంబంధించి పోల్క్ ఈ సిద్ధాంతాన్ని ప్రవచించాడు. 2) వెనిజులా సరిహద్దు వివాదానికి సంబంధించి అధ్యక్షుడు క్లీవ్‌ల్యాండ్ 1895లో మన్రో సిద్ధాంతాన్ని ప్రవచించి, బ్రిటన్‌ను ప్రతిఘటించి అది అమెరికన్ అభిప్రాయానికి తలవొగ్గేటట్లు చేయడంతో మొదటిసారిగా మన్రో సిద్ధాంతం ఆచరణలోనికి వచ్చింది. 3) అధ్యక్షుడు థియోడర్ రూజ్వెల్ట్ కరీబియన్ దీవులలో తాను అనుసరించిన 'బడితె కర్ర' విధానాలకు సంబంధించి 1904లో మన్రో సిద్ధాంతాన్ని ప్రస్తావించి, దానికొక ఉప సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. 4) 1930లో రూజ్వెల్ట్ ఉప సిద్ధాంతాన్ని నిరాకరించి, క్లార్క్ మెమోరాండం మన్రో సిద్ధాంత ప్రధాన ఉద్దేశం లాటిన్ అమెరికాను ఐరోపా రాజకీయ జోక్యం నుంచి రక్షించడం మాత్రమేనని ఉద్ఘాటించింది. 5) ఇటీవలి కాలంలో క్యూబా రాజకీయాలలో సోవియట్ రష్యా జోక్యాన్ని నిరసిస్తూ అధ్యక్షుడు కెన్నడీ, మన్రో సిద్ధాంతాన్ని 1962లో ప్రస్తావించాడు.

**8.2.1.7.5. మన్రో సిద్ధాంతం ప్రాముఖ్యం :** మన్రో సిద్ధాంతం అమెరికన్ విదేశాంగ నీతిలో ఒక మైలురాయిగా నిలిచి, అమెరికన్లకు శాంతి భద్రతలను చేకూర్చి, వారు చాలా కాలం తమ శక్తులనంతా తమ రాజకీయ ఆర్థిక అభివృద్ధి మీద కేంద్రీకరించడానికి అవకాశమిచ్చింది. మన్రో సిద్ధాంత ప్రకటన అమెరికా సంయుక్త రాష్ట్రాల నూతన జాతీయతా స్ఫూర్తికి ఉత్తేజమిచ్చింది. మౌళికంగా ఈ సిద్ధాంతం అమెరికా సంయుక్త రాష్ట్రాల శాంతి భద్రతలను గూర్చి ఆలోచించి చేసింది కాదు. ఈ సిద్ధాంతాన్ని రూపొందించిన ఘనత అధ్యక్షుడు మన్రోకు, అతని విదేశాంగ కార్యదర్శి క్విన్సీ ఆడమ్స్‌కు సమానంగా చెందుతుంది.

## 8.2.2. జాన్ క్విన్సీ ఆడమ్ :

**8.2.2.1. పరిచయం :** 1824 అధ్యక్ష ఎన్నికల్లో ఫెడరలిస్ట్ పార్టీ తమ అభ్యర్థిని నెలబెట్టలేదు. కానీ రిపబ్లికన్ పార్టీ నలుగురిని పోటీకి నిలబెట్టింది. వారు మెసాచుసెట్స్‌కు చెందిన జాన్ క్విన్సీ ఆడమ్స్, టెన్నిసీకి చెందిన ఆండ్రూ జాక్సన్, కెంటుకేకి చెందిన హెన్రీ క్లే, జార్జియాకు చెందిన విలియం హెచ్. క్రాఫోర్డ్. జాక్సన్‌కు 99, ఆడమ్స్‌కు 84, క్రాఫోర్డ్‌కు 41, క్లేకు 37 ఓట్లు వచ్చాయి. ఒక్కరికీ స్పష్టమయిన మెజారిటీ లేనందువల్ల అధ్యక్షుని ఎన్నుకొనే నిర్ణయాన్ని ఓటింగ్ ద్వారా ప్రతినిధుల సభ చేయవలసి వచ్చింది. క్లే అనుయాయులు ఆడమ్స్‌కు ఓటు వేయడంతో ఆడమ్స్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. తర్వాత క్లేను, ఆడమ్స్ తన విదేశాంగ కార్యదర్శిగా నియమించాడు. దీనితో ఆగ్రహించిన జాక్సన్ అనుయాయులు ఆడమ్స్ అధ్యక్ష పాలనను విఫలం చేయడానికి ప్రయత్నించారు. రిపబ్లికన్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఆడమ్స్, క్లే అనుయాయులు నేషనల్ రిపబ్లికన్లనే పేరుతో జాక్సన్, కాల్హూన్ అనుయాయులు డెమోక్రటిక్ రిపబ్లికన్లు అనే పేరుతో రెండు ప్రత్యేక రాజకీయ పార్టీలుగా రూపొందారు.

**8.2.2.2. జార్జియా - ఇండియన్‌ల తగాదా :** ఆడమ్స్ 1827లో క్రీక్ ఇండియన్‌లతో వాషింగ్టన్ సంధిని కుదుర్చుకొన్నాడు. దీని ప్రకారం క్రీక్ ఇండియన్‌లు తమ భూములను జార్జియాకు దత్తం చేసినందుకు ఎక్కువ నష్ట పరిహారం పొందారు.

**8.2.2.3. సుంక విషయక వాగ్వివాదము :** రక్షణ పన్నుల విషయమై పారిశ్రామిక రాష్ట్రాలు పెన్సిల్వేనియాలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇదివరలో కంటే ఎక్కువ రక్షణ కలిగించే రీతిగా ఒక పథకాన్ని తయారు చేసి కాంగ్రెస్‌కు సమర్పించారు. 1828లో ఒక పన్నుల చట్టాన్ని కాంగ్రెస్ జారీ చేసింది. కాని ఈ చట్టం విషయమై జాక్సన్ అనుచరులు లేవదీసిన అలజడివల్ల ఆడమ్స్‌కు కొంత అపఖ్యాతి తప్పలేదు.

**8.2.2.4. విదేశీ వ్యవహారాలు :** లాటిన్ అమెరికన్ రాజ్యాలు 1826లో పనామాలో ఒక సమావేశం జరిపాయి. ఆడమ్స్, క్లేలు ఇద్దరూ ఈ రాజ్యాలలో స్నేహ సంబంధాలను ఏర్పరచుకోవలెనని అభిలషించినారు. అయితే సమావేశానికి ప్రతినిధులను పంపే విషయంలో విఫలమయ్యారు. సమావేశానికి హాజరైన బ్రిటీష్ ప్రతినిధులు లాటిన్ అమెరికన్ రాజ్యాలతో దృఢమైన స్నేహ సంబంధాలు ఏర్పరచుకొన్నారు.

ఆడమ్స్ తన పదవీ స్వీకార సమయంలో అనేక వాగ్దానాలు చేశాడు. అయి అమలయి వుంటే అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో అతని పేరు సుప్రసిద్ధమయి ఉండేది. కాని ఆడమ్స్ తన ఊహలను కార్యచరణలో పెట్టే విషయంలో విఫలుడయ్యాడు.

## 8.2.3. నమూనా ప్రశ్నలు :

**1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)**

1. మన్రో సిద్ధాంతము ప్రకటించుటకు దారి తీసిన పరిస్థితులు, భవిష్యత్తులో అది అమెరికా విదేశాంగ విధానమునకు ఎట్లు ఆధారమయ్యెనో తెల్పుము.
2. మన్రో సిద్ధాంతమును వివరించి వాని అంతర్ధానమును పరిశీలింపుము.
3. జాన్ క్విన్సీ ఆడమ్స్

## 8.2.4. చదువదగిన గ్రంథాలు :

1. Dexter Perkins - A History of Moroe Doctrine
2. Stanwood Edward - A History of the Presidency from 1788 to 1897
3. Marquis James - Andrew Jackson, Portrait of a President
4. H.B. Parkes - The United States of America
5. C.P. Hill - History of the United States

- డా॥ వి.కె. మోహన్

పాఠం - 9

# ఆండ్రూ జాక్సన్ (1829-1837)

## 9.0. లక్ష్యం :

ఆండ్రూ జాక్సన్ ప్రజాస్వామ్యం, అతని అంతరంగిక, విదేశాంగ విధానాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


9.1. పరిచయము
9.2. జాక్సన్ జీవితం
9.3. జాక్సన్ వ్యక్తిత్వం
9.4. జాక్సన్ పదవీ స్వీకార ప్రమాణ దినం
9.5. జాక్సన్ ప్రజాస్వామ్యం
9.6. లోకోఫోకోలు
9.7. స్పాయిల్స్ విధానం
9.8. సుంక విషయిక వాగ్వివాదము
9.9. వ్యర్థీకరణ సమస్య
9.10. బ్యాంకు ఉదంతము
9.11. రెడ్ ఇండియన్ల సమస్య
9.12. న్యాయమూర్తుల నియామకం
9.13. విదేశీ విధానం
9.13.1. పశ్చిమ ఇండియా దీవులలో వ్యాపారం
9.13.2. ఫ్రాన్స్ నుంచి నష్ట పరిహారం పొందుట
9.13.3. టెక్సాస్ రిపబ్లిక్ స్థాపన
9.14. ఘనత
9.15. నమూనా ప్రశ్నలు
9.16. చదువదగిన గ్రంథాలు


## 9.1. పరిచయము :

అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో 1828 అధ్యక్ష ఎన్నిక ఒక నూతన శకానికి నాంది పలికింది. ఈ ఎన్నికలలో ప్రజాస్వామ్య సూత్రానికి ఘనమైన విజయం లభించింది. ఈ ఎన్నికల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్ష పదవికి ఎన్నికైన వారిలో తొలి యదార్ధ ప్రజా ప్రతినిధి ఆండ్రూ జాక్సన్. ఇతని ఎన్నిక ఒక విప్లవంగా భావించబడింది. ఈ ఎన్నికలో కులీన ధనిక వర్గానికి చెందిన జాన్ క్విన్సీ ఆడమ్స్‌ను తోసిరాజని సామాన్యుడుగా జన్మించి సైన్యాధ్యక్ష పదవీ స్థాయికి ఎదిగిన జాక్సన్ అధ్యక్షుడయినాడు.

1828 ఎన్నికలలో అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా జరిగింది. ఆడమ్స్, క్లేల నాయకత్వంలో ఉన్న నేషనల్ రిపబ్లికన్ పార్టీ, జాక్సన్, క్రాఫర్డ్, కాల్హౌన్‌ల నాయకత్వంలో ఉన్న డెమోక్రటిక్ పార్టీ ఎన్నికల ప్రచారంలో అధ్యక్ష ఎన్నికకు నిలిచిన అభ్యర్థులను గూర్చి పరస్పరం వ్యక్తిగత దూషణకు, వారి శీలాన్ని కించపరచడానికి పూనుకొని ఒకరి మీద ఒకరు బురద చల్లుకొన్నారు. ఆడమ్స్ కులీన వర్గానికి చెందిన వాడనీ, ప్రజాధనాన్ని వినియోగించి తన విలాసాల కోసం 'వైట్ హౌస్'ను జూద గృహంగా మార్చాడనీ మొదలైన రకరకాల అసంగతమైన అభియోగాలను జాక్సన్ అనుయాయులు ఆడమ్స్‌పై మోపారు. జాక్సన్ వివాహానికి సంబంధించి లేనిపోని ఆరోపణలను ఆడమ్స్ అనుయాయులు జాక్సన్‌పై చేశారు. అతనిని వ్యభిచారిగా చిత్రించి ప్రచారం చేశారు. అయితే ఎన్నికలలో చివరకే, జాక్సన్ ఘన విజయం సాధించాడు. జాక్సన్‌కు 178 ఓట్లు రాగా ఆడమ్స్‌కు 83 ఓట్లు మాత్రమే లభించాయి. అమెరికాలోని సామాన్య ప్రజలు తమ ఆశయాలకు ప్రతీకగా నిలిచిన వ్యక్తి అయిన జాన్సన్‌ను అధ్యక్షుడుగా ఎన్నుకొన్నారు.

## 9.2. జాక్సన్ జీవితం :

జాక్సన్ 1767లో వాక్సాలో జన్మించాడు. అతని తండ్రి ఉత్తర ఐర్లాండ్ నుంచి అమెరికాకు ప్రవాసిగా వచ్చాడు. తల్లి స్కాచ్ వనిత. జాక్సన్ కొంత కాలం గుర్రాల జీనులు తయారు చేసే వాని వద్ద సహాయకుడుగా, ఆ తరువాత కొంత కాలం ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. తీరిక సమయాలలో చదువుకొని న్యాయవాది అయ్యాడు. 21 సంవత్సరాల వయస్సులోనే టెన్నిసీ ప్రాంతానికి చెందిన నాష్‌విల్ జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితుడయ్యాడు. టెన్నీసీ రాజకీయాలలో పాల్గొన్నాడు. పోటీ వ్యాపారాలు చేశాడు. చాలా ముష్టి యుద్ధాలలో, ద్వంద యుద్ధాలలో పాల్గొన్నాడు. అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రతినిధుల సభకు టెన్నిసీ రాష్ట్రం నుంచి ప్రతినిధిగా ఎన్నికయ్యాడు. 1797లో సెనేటర్‌గా ఎన్నికయ్యాడు. రాష్ట్ర మిలిషియాలో సైన్యాధికారిగా ఉన్నాడు. క్రీక్ ఇండియన్‌లలో జరిగిన ఒక యుద్ధంలో విజయం సాధించి పేరు గడించాడు. 1812 సంగ్రామంలో పాల్గొని, 1815లో న్యూ ఆర్లియన్స్ యుద్ధ రంగంలో బ్రిటీష్ సైన్యంపై ఘన విజయం సాధించటంలో జాక్సన్ పేరు దేశమంతటా మారుమోగింది. దీనితో అతడు ప్రభుత్వ సైన్యంలో సైన్యాధికారి పదవిని పొందగలిగాడు. మన్రో అధ్యక్ష పాలనా కాలంలో అతడు ప్రభుత్వ ఉత్తరువులను అధిగమించి, అమెరికా సరిహద్దులను దాటి స్పెయిన్ అధికారంలో వున్న ఫ్లొరిడా ప్రాంతంలోనికి చొచ్చుకొని పోయి, అక్కడ కొంత ప్రాంతాన్ని ఆక్రమించాడు. జాక్సన్ చేసిన సాహసంతో, అతని పేరు మరీ వ్యాప్తిలోనికి వచ్చింది. ప్రజలు అతని ధైర్య సాహసాలు గుర్తించి అభిమానంతో అతనిని 'వృద్ధ హికరీ' అని పిలిచారు. 'హికరీ' ఉత్తర అమెరికాలో లభ్యమయ్యే అత్యంత దృఢమైన వృక్షం. ఇక్కడ బలానికి, సామర్ధ్యానికి, పట్టుదలకు సంకేతం. ప్రజానురాగానికి పాత్రుడైన జాక్సన్ 1828 ఎన్నికలలో అధ్యక్షపదవికి పోటీ చేసి ఘన విజయం సాధించాడు.

## 9.3. జాక్సన్ వ్యక్తిత్వం :

జాక్సన్ తన జీవితంలో సాధించిన ఔన్నత్యానికి కారణాలు అచంచల ధైర్యం, సడలని ఆత్మ విశ్వాసం, స్వయం కృషి. ఇతడు నిష్కపటి, నిర్మోహమాటి అవమానాన్ని సహించక, దానిని మరువక, ప్రత్యర్థుల మీద కక్ష సాధించేవాడు. అధ్యక్ష ఎన్నిక నాటికి జాక్సన్, టెన్నిసీ రాష్ట్రంలో బానిసల యజమానిగా, సంపన్నమైన భూస్వామిగా స్థిరపడ్డాడు. తన అధ్యక్ష పదవీ కాలంలో ఉదాత్తతతో, మర్యాదతో, నిజాయితీగా, పటిష్ఠంగా వ్యవహరించాడు. వడ్డీ వ్యాపారస్థులచే మోసానికి ఒకసారి గురి కావడం వల్ల వారిని ఎన్నడూ క్షమించలేదు. రుణగ్రస్తులైన పశ్చిమ ప్రాంతంలోని రైతులకు అండగా నిలిచాడు. జాక్సన్‌ను అభిమానించి సమర్థించినవారు పశ్చిమ ప్రాంతంవారు మాత్రమే కాదు దక్షిణంలోని వ్యవసాయదారులు, తూర్పు పట్టణాలలోని శ్రమ జీవులు, చిన్న వ్యాపారులు, జాతీయ బ్యాంకు విధానాలు నచ్చని బ్యాంకర్లు మొదలయిన వారు. జాక్సన్ అధ్యక్ష పదవినలంకరించే నాటికి అతని వయస్సు 62 సంవత్సరాలు. తనకు ముందు పాలించిన అందరి అధ్యక్షులు కన్నా మిన్నగా ఇతడు ప్రభుత్వాన్ని నడిపించాడు. అతని పరిపాలన జెఫర్‌సన్ ప్రవచించిన ప్రజాస్వామ్య సూత్రానుగుణంగా నడిచింది.

అధ్యక్షుడు కాంగ్రెస్‌కు ఇచ్చే సందేశాలను రూపొందించడానికి పరిపాలనా విధానంలోని వివిధ అంశాల వ్యాఖ్యానికి జాక్సన్ తన మిత్రులైన వ్యాన్ బూరెన్, సెనేటర్ బెంటన్‌ల మీద ఆధారపడ్డారు. వీరు గాక పరిపాలనలో ఎదుర్కొనే అనేక సమస్యలను ఎదుర్కొనటానికి,

సలహాలు ఇవ్వటానికి తన మిత్రులతో కూడిన ఒక 'కిచెన్ క్యాబినెట్'ను జాక్సన్ ఏర్పరచాడు. అధ్యక్షుని కార్యదర్శి మండలికి, అనధికారికమైన ఈ కిచెన్ క్యాబినెట్‌కు మధ్య వాన్‌బూరెన్ సేతువులాగా ఉండేవాడు. కాని అన్ని ప్రభుత్వ నిర్ణయాల వెనుక జాక్సన్ ప్రేరణ ఉండేది.

## 9.4. జాక్సన్ పదవీ స్వీకార ప్రమాణ దినం :

జాక్సన్ అధ్యక్ష పదవీ స్వీకార ప్రమాణ దినం అత్యంత ఆశ్చర్యకరంగా జరిగింది. జాక్సన్ పదవీ స్వీకార ఉపన్యాసం ఉదాత్తంగా వుంది. కాని ఆ తరువాత జరిగిన విందుకు అందరూ ఆహ్వానించబడ్డారు. వీరిలో 'వైట్ హౌస్' కిక్కిరిసి పోయింది. అధ్యక్ష భవనంలోని తివాచీలు, అలంకరణ సామాగ్రి, ఇతర విలువైన వస్తువులు దుమ్ముతో, ధూళితో నిండిపోయాయి. విలువైన గాజు సామానులు, పింగాణీ సామానులు పగిలిపోయాయి. ప్రతివారు తమ ఇష్టం వచ్చినంత తిన్నారు, తాగారు. అంతా అల్లకల్లోలంగా ఉంది. అధ్యక్షుడు ఒక కిటికీ నుంచి తప్పించుకొని ఈ అల్లకల్లోలం నుంచి బయటపడవలసి వచ్చింది. వాషింగ్టన్ నగరంలోని మర్యాదరస్తులందరూ ఇవి తమ గౌరవానికి జరిగిన భంగపాటుగా భావించారు.

## 9.5. జాక్సన్ ప్రజాస్వామ్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో జాక్సన్ ప్రజాస్వామ్య ఆశయాలు, పరిపాలనా ధ్యేయాలు, 'జాక్సన్ ప్రజాస్వామ్యం' అనే పేరుతో ప్రసిద్ధి పొందాయి. ఈ ఆశయాలను, ధ్యేయాలను జాక్సన్ అధ్యక్ష పదవీ విరమణ సందర్భంలో **1837**లో స్పష్టంగా పేర్కొన్నాడు. అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలలో అత్యధికులు వ్యవసాయదారులు, రైతులు, మెకానిక్కులు, శ్రమ జీవులు, వీరి సంక్షేమానికై ప్రభుత్వ పాలన జరగాలి. 'వారి శ్రమ మీద, పొదుపు మీదనే వారి విజయం ఆధారపడి ఉంటుంది. కాని వారి ఈ శ్రమ ఫలితంగా ఉన్నట్లుండి వారు సంపన్నులు కాలేరని ఈ వర్గాలన్నింటికీ తెలుసు. ప్రభుత్వంలో వారి పలుకుపబడి లేకుండా పోయే ప్రమాదం ఎప్పుడూ ఉంది. దీనికి కారణం కాగితపు కరెన్సీ ద్వారా ధనిక వర్గాలు సంపాదించే అధికారం ఈ కాగితపు కరెన్సీని ఈ వర్గాలు తమ వశంలో పెట్టుకోగలిగి ఉన్నాయి. అలాగే వివిధ రాష్ట్రాలలో ప్రత్యేకమైన హక్కులను సంపాదించుకోగలిగిన అనేక వ్యాపార సంస్థల నుంచి కూడా ఈ ప్రమాదం ఏర్పడుతుంది. ధనిక వర్గం అధికారాలను అదుపులో పెట్టడానికి వ్యవసాయదారులు, శ్రామికులు ఏకం కావాలని జాక్సన్ భావించాడు. దీనిని సాధించడానికి మార్గం వాణిజ్య వ్యాపారాలలో స్వేచ్ఛా విధానాన్ని ఖచ్చితంగా అనుసరించటమేనని భావించాడు. కొద్ది ఆస్తులు కలవారికి రక్షణ కల్పించాలని, బ్యాంకింగ్ సంస్థలకు, పారిశ్రామిక సంస్థలకు ఎలాంటి ప్రత్యేక రక్షణలు కల్పించరాదు. వ్యాపారంలో గట్టిపోటీ ఉండేటట్లు చేయాలి. ప్రభుత్వ భూములలో స్థిరపడేవారిని ఆ భూములు సులభంగా పొందగలిగేటట్లు చూడాలి. జాతీయ ప్రభుత్వ విధానాలు రూపొందించటంలో రాజ్యాంగాన్ని అధిగమించక, దానిని తు.చ. తప్పక అనుసరించాలి. జాక్సన్ జాతీయవాది. అప్పట్లో దక్షిణ కెరోలీనా రాష్ట్రంలో రూపుగొంటున్న వేర్పాటు వాదాన్ని అతడు సహించలేదు.

అమెరికన్ జాతీయ జీవిన విధానంలో అప్పుడప్పుడే మార్పు ప్రారంభమవుతున్నది. రహదారుల నిర్మాణం, ఈరీ కాలువ నిర్మాణం, స్టీంబోటు వాడకం, ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలిగించి వారు వ్యాపార వాణిజ్యాలలో ఎక్కువగా పాల్గొనడానికి అవకాశం కల్పించాయి. ఇతోదికంగా అమెరికన్లు రాజకీయాలలో ఆసక్తి కనపరిచారు. 1819లో వ్యాపారంలో ఏర్పడిన ప్రతిష్ఠంబన ఫలితంగా రుణగ్రస్తులకు కాపాడటానికై కొత్త చట్టం తేవాలని, సుంకాలను పెంచాలని, భూములను సంపాదించేటందుకు ప్రజలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని ప్రజలు కోరసాగారు. ఈ మార్పుల ప్రేరణగా రూపుగొన్న ఒక విస్తృత ఉద్యమానికి జాక్సన్ నాయకత్వం వహించాడు. ఈ ఉద్యమాన్ని సమర్థించిన వారిలో పశ్చిమ ప్రాంతాలలోని, దక్షిణ రాష్ట్రాలలోని వ్యవసాయదారులు, ఆగ్నేయ ప్రాంతంలోని మధ్య తరగతివారు, శ్రామిక జీవులు వున్నారు. ఈ ఉద్యమ ఫలితాలు కొన్ని రాష్ట్రాల రాజకీయాలలో ప్రజాస్వామ్యపు విలువలను పెంపొందించడం ద్వారా స్పష్టమయ్యాయి. ఉదాహరణకు ప్రజా విద్యా విధానం, రుణగ్రస్తులయిన వారికి జైలు శిక్ష విధింపును రద్దు చేయటం మొదలయిన మానవతా సంస్కరణలను కొన్ని రాష్ట్రాలు అమలు చేశాయి. చాలా రాష్ట్రాలు ఓటరు కావడానికి ఆస్తి అర్హతను తొలగించి ఓటర్ల సంఖ్యను పెంచాయి. కొన్ని అధికార పదవులను అధిష్ఠించడానికి వాతపరంగా, ఆస్తిపరంగా ఉన్నటువంటి అర్హతలను, ఆంక్షలను కొన్ని రాష్ట్రాలు తొలగించాయి. కొన్ని అధికా పదవులకు అభ్యర్థులను ప్రజలు ఎన్నుకొనేటట్లు కొన్ని రాష్ట్రాల చట్టాలు చేశాయి. గవర్నర్లను కొద్ది కాల పరిమితులలో ఎన్నుకోవటం,

తరచుగా ఎన్నికలు, శాసన సభలలో దిగువ సభలకు ఎక్కువ అధికారాలు, కార్యవర్గ శాఖల, న్యాయశాఖల మీద కొన్ని ఆంక్షలు విధించటం మొదలుగా ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే అనేక పాలనా సంస్కరణలను తమ రాజ్యాంగాలలో సవరణల ద్వారా కొన్ని పశ్చిమ రాష్ట్రాలు ప్రవేశపెట్టాయి. కొన్ని రాష్ట్రాలు ప్రజలే న్యాయమూర్తులను ఎన్నుకొనే ఏర్పాటు తమ రాజ్యాంగంలో పొందుపరచాయి. ఈ మార్పుల వల్ల ప్రజలలో ఎక్కువ మంది రాజకీయ కార్యక్రమాల్లో పాలుపంచుకొనే అవకాశం ఏర్పడింది. ప్రజలలో ఎక్కువ మంది ఆకాంక్ష ఫలితంగా ఏర్పడిందే ప్రభుత్వమని జాక్సన్ ప్రజాస్వామ్యంలోని మౌళిక సూత్రం.

జాక్సన్ - జెఫర్‌సన్ యుగాల ప్రజాస్వామ్యం గురించి వివరించడం అవసరం. జెఫర్‌సన్‌కు సామాన్య ప్రజలపై మంచి ప్రీతి ఉండేది. జాక్సన్‌కు సామాన్య పౌరులే సర్వస్వము. జెఫర్‌సన్ దృక్పథం ప్రకారం ఉన్నత పదవులు పొందగోరేవారికి చదువు, అనుభవము, బుద్ధిబలము మొదలయిన అర్హతలుండవలె. విద్య, అనుభవము మొదలయినవి అందరికీ లభించినపుడు సామాన్య పౌరులు ఉన్నత పదవులనలంకరించటం యథావిధిగా జరుగుతుంది. సామాన్య పౌరులు ఈ అర్హతలు పొందేలోగా పదవులలో ఉన్నవారు జన బాహుళ్యము బాగుపడటానికి శక్తివంచన లేకుండా కృషి చేయవలె. జాక్సన్ ఉద్దేశంలో సాధారణ జ్ఞానము గల ఏ సామాన్య మానవుడైన ప్రభుత్వ రంగంలో ఉన్నత పదవినలంకరించి మంచి పనులు చేసే సమర్థతతో ఉంటాడు. స్థూలంగా చెప్పాలంటే ఈ ఇద్దరు అధ్యక్షులూ ప్రభుత్వం ప్రజల కోసమే అనే విషయాన్ని గుర్తించినారు. కాని పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో చాలా మంది వలె జాక్సన్ ప్రజలచేత ప్రభుత్వం అనేది ఎప్పుడు కోరితే అప్పుడు సాధ్యమని నమ్మినాడు. ప్రజలు నడిపే ప్రభుత్వం అంటే జాక్సన్ దృష్టిలో పట్టణ కార్మికులు, చిన్న వ్యాపారస్తులు, వ్యవసాయదారులు. జెఫర్‌సన్ ముఖ్యంగా వ్యవసాయదారుల సంక్షేమం కోసం చర్యలు తీసుకొనేవాడు. అధికారంలో ఉన్న ప్రతి వ్యక్తి విద్యావంతుడైనా కాకపోయినా ప్రజలకేమి అవసరమో తెలుసుకొని అది చేయటానికి ప్రయత్నించవలెనని జాక్సన్ ఉద్దేశం. ప్రజల అవసరానికి విరుద్ధంగా కాంగ్రెస్ ఏదైనా చట్టాన్ని ఆమోదించినా లేదా సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా, అధ్యక్షుడు ప్రజల అవసరానికి అనుగుణంగా చర్య తీసుకోవలెను. ప్రతిపక్షం వారిపై జాక్సన్ వలెనే జెఫర్‌సన్ కాంగ్రెస్ పట్ల, సుప్రీంకోర్టు పట్ల నిర్మోహమాటంగా ప్రవర్తించేవాడు.

## 9.6. లోకో ఫోకోలు :

జాక్సన్ ప్రజాస్వామ్య ఆశయాలను సమర్థించే అతని అనుయాయులలో తీవ్రవాదులు కొందరు ఉండేవారు. వీరిని 'లోకో ఫోకో'లని పిలిచారు. పరిశ్రమలు, సంపద మిక్కిలిగా కేంద్రీకృతమయిన న్యూయార్క్, మెసాచుసెట్స్ ప్రాంతాలలో వీరు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరు ఏర్పాటు చేసిన ఒక సమావేశాన్ని వీరి ప్రత్యర్థులు కొందరు సమావేశ స్థలంలోని దీపాలు ఆర్పివేసి విఫలం చేయాలనుకొన్నారు. అయితే ఈ తీవ్రవాదులు అగ్గిపుల్లలు వెలిగించి సమావేశాన్ని కొనసాగించారు. అప్పట్లో అగ్గిపుల్లలను 'లాకోఫోకో'లు అని పిలిచేవారు. జాక్సన్ ప్రజాస్వామ్యపు ఆశయాలతో కూడిన వీరి ఉద్యమాన్ని 'లోకో ఫోకోయిజం' అని పిలిచారు. ఈ లోకో ఫోకోయిజంకు ప్రధాన ప్రచారకుడు విలియం లెగ్గెట్. విలియం కులెన్ బ్రయాంట్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'న్యూయార్క్ ఈవెనింగ్ పోస్ట్'లో లెగ్గెట్ సంపాదకీయాలు రాసేవాడు.

## 9.7. 'స్పాయిల్' విధానం :

ప్రభుత్వ ఉద్యోగాలను వాటికి అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని, ఉద్యోగులు సక్రమంగా వారి విధులు నిర్వహించటానికి ఆ విధులను స్పష్టంగా సులభంగా అర్థమయ్యేటట్లు నిర్వచించాలని జాక్సన్ 1829లో ఒక సందేశంలో పేర్కొన్నాడు. కాని ఆచరణలో ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించి అమెరికన్ రాజకీయ జీవితంలో 'స్పాయిల్స్ సిస్టం' అనే అవాంఛనీయమైన సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడు.

ప్రభుత్వోద్యోగాలను చేజిక్కించుకోవడానికి జాక్సన్ అనుయాయులు రాజధాని వాషింగ్టన్‌లో 1829లో సమావేశమ్యారు. ఎన్నికలలో తమ అభ్యర్థి విజయం సాధించాడు కాబట్టి దానికి ప్రతిఫలంగా తామంతా ప్రభుత్వ పదవులకు అర్హులమని భావించారు. వారిలో ఒకడైన విలియం యల్. మార్సీ గెలిచినా వానిదే దోపిడీ అనే సూత్రాన్ని ఉద్ఘాటించాడు. దీనిని బట్టి 'స్పాయిల్స్ సిస్టం' అనే పదం వాడుకలోకి వచ్చింది. ఈ విధానం మేరకు ప్రభుత్వంలోని అత్యున్నత ఉద్యోగాల నుంచి అతి చిన్న ఉద్యోగాల వరకు ఉన్న ఉద్యోగాలన్నిటినీ ఎన్నికలలో

నెగ్గిన రాజకీయ పార్టీకి చెందిన సభ్యులకు పంపకం చేయడం జరుగుతుంది. ఇలాంటి విధానము అప్పటికే రాష్ట్రాలలో అమలులో వుంది. దానిని జాక్సన్ జాతీయ ప్రభుత్వంలో ప్రవేశపెట్టడం అవివేకపు చర్య. ఆడమ్స్ అనుయాయులని అనుమానమున్న వారినంతా ఉద్యోగాలలో నుంచి తొలగించి, ఆ ఖాళీలను జాక్సన్ తన పార్టీ సభ్యులతో నింపాడు. వీరంతా అర్హతలేనివారు, అనుభవ శూన్యులు, అవినీతి పరులు, సంఖ్యా పరంగా చూస్తే జాక్సన్ తొలగించిన ఉద్యోగుల సంఖ్య ఎక్కువేమీ కాదు. కాని తరువాత చాలా కాలం వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వం అనుసరించిన ఈ విధానం సమర్ధనీయమయినది కాదు.

జాక్సన్‌కు ముందున్న అధ్యక్షులెవ్వరూ ప్రభుత్వపరంగా, అధికారయుతంగా, స్పాయిల్స్ విధానాన్ని ఒక సిద్ధాంతంగా ప్రకటించలేదు, ఆమోదించలేదు, సమర్ధించలేదు. మొదటిసారిగా జాక్సన్ ఈ విధానాన్ని ప్రభుత్వ విధానంగా ఆమోదించాడు. ఫలితంగా జాక్సన్ తరువాత ఒక అర్ధ శతాబ్దం వరకు ఎన్నికలలో గెల్చిన ప్రతి రాజకీయ పార్టీ అప్పటికి ఉన్న ఉద్యోగులను తీసి వేసి ఆ ఖాళీలను తన పార్టీ సభ్యులతో, అనుయాయులతో నింపడం మామూలయింది. ఒక నిరుద్యోగి 1881లో నిరాశతో అప్పుడు అధ్యక్షుడుగా ఉన్న గారీ ఫీల్డ్‌ను కాల్చి చంపేవరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో సివిల్ సర్వీస్ విధానాన్ని క్రమబద్ధం చేయటానికి ఎలాంటి ప్రయత్నం జరగలేదు.

## 9.8. సుంక విషయక వాగ్వివాదము :

దక్షిణ రాష్ట్రాలు జాక్సన్ ఔన్నత్యానికి చాలా దోహదం చేశాయి. కాని అతని అధ్యక్ష పాలనా కాలంలో దక్షిణ రాష్ట్రమయిన దక్షిణ కెరోలినా వల్ల అతడు తీవ్రమయిన సమస్యను ఎదుర్కొవలసిన పరిస్థితి ఏర్పడింది. అదీకాక ఈ సమస్యకు కారకుడు జాక్సన్ రాజకీయ పార్టీకే చెంది, దక్షిణ కెరోలినాలో ప్రముఖ రాజకీయ నాయకుడు, ఉపాధ్యక్షుడూ అయిన జాన్. సి. కాల్హూన్ కావటం మరొక విశేషం.

దక్షిణ కెరోలినాలో భారీ పరిశ్రమలేమీ పెంపొందలేదు. అచట పత్తి పండించే భూములు నిస్సారమయినాయి. ఇదే కాలంలో ఉత్తరంలోని పారిశ్రామిక రాష్ట్రాలు సంపన్నమయ్యాయి. జాతీయ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రక్షణ సుంకాల వల్ల దక్షిణ కెరోలినా ప్రజలు విదేశీ ఉత్పత్తులను, ఉత్తర రాష్ట్రాల పారిశ్రామిక ఉత్పత్తులను అధికమైన ధరలను చెల్లించి కొనుగోలు చేయవలసి వచ్చింది. అందుచే వీరికి జాతీయ ప్రభుత్వం మీద ద్వేషభావం ఏర్పడింది. రాజ్యాంగ విరుద్ధంగా, రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం సుంకాలను ప్రవేశపెట్టున్నదని వారు చెప్పసాగారు. ఈ అభిప్రాయాలనంతా కాల్హూన్ తాను రూపొందించిన 'ఎక్స్ పోజిషన్ అండ్ ప్రొటెస్ట్' అనే పత్రంలో పేర్కొన్నాడు. ఈ పత్రాన్ని 1828 డిసెంబర్‌లో దక్షిణ కెరోలినా రాష్ట్ర శాసన సభ' సౌత్ కరోలినా ఎక్స్‌పోజిషన్' అనే పేరుతో ఆమోదించింది. ఈ పత్రంలో రాజ్యాంగం మేరకు రాష్ట్రాల హక్కులేమిటో స్పష్టంగా పేర్కొనటం జరిగింది. దీని ప్రకారం వివిధ రాష్ట్రాలు వాటి మధ్య ఏర్పరచుకొన్న ఒప్పందం వల్ల రాజ్యం ఏర్పడింది. జాతీయ ప్రభుత్వం ఏ విషయంలో గాని, ఏ చట్టం చెయ్యటంలోగాని రాజ్యాంగంలో పేర్కొన్న అధికారాలను అధిగమిస్తున్నాదా అని తేల్చుకొనే హక్కు ప్రతి రాష్ట్రానికి ఉంది. జాతీయ ప్రభుత్వం తన అధికారాలను అతిక్రమించిందని ఏ రాష్ట్రానికైనా తోచినప్పుడు ప్రభుత్వం జారీ చేసిన చట్టం తన రాష్ట్రంలో చెల్లనేరదని ఆ రాష్ట్రం ప్రకటించవచ్చు. దీనినే వ్యర్ధీకరణ అంటారు. ఈ వ్యర్ధీకరణ హక్కు మాత్రమే గాక కాల్హూన్ వాదం ప్రకారం అవసరమని భావిస్తే ఆ రాష్ట్రం సమాఖ్యలో నుండి విడిపోవచ్చు. దక్షిణ రాష్ట్రాలలో చాలా మంది ప్రజలు కాల్హూన్ యొక్క ఈ అభిప్రాయాలతో ఏకీభవించారు. దీంతో సమాఖ్య మనుగడకే ముప్పు వాటిల్లింది.

## 9.9. వ్యర్ధీకరణ సమస్య :

రాష్ట్రాల హక్కుల సమస్యను గురించి సెనేట్‌లో 1830 జనవరిలో మెసాచుసెట్స్ రాష్ట్ర సెనేటర్ వెబ్‌స్టర్‌కు, దక్షిణ కెరోలినా రాష్ట్ర సెనేటర్ రాబర్ట్ ఆర్. హెయిన్‌కు మధ్య చర్చ జరిగింది. ఈ చర్చలో రాష్ట్రాలకు ఆమోదయోగ్యంకాని జాతీయ ప్రభుత్వ చట్టాలను వ్యర్థం చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకుందని హెయిన్ వాదించాడు. సమాఖ్యను పటిష్టంగా ఉంచవలసిన అవసరాన్ని గురించి వెబ్‌స్టర్ వాదించాడు. వెబ్‌స్టర్ వాదన ప్రజాభిప్రాయాన్ని చాలా వరకు ప్రభావితం చేసింది. జాక్సన్ జన్మదిన సందర్భంగా జరిగిన ఒక విందులో రాష్ట్రాల హక్కుల సిద్ధాంతాన్ని జాక్సన్ సమర్ధిస్తాడని కాల్హూన్, అతని అనుయాయులు ఆశించారు. కాని జాక్సన్ లేచి కాల్హూన్ వైపు చూస్తూ "మన సమాఖ్య

సౌష్టవాన్ని కాపాడక తప్పదు'' అని వక్కాణించినాడు. తరువాత దక్షిణ కెరోలినా ప్రత్యక్షంగా సుంకాల శాసనాన్ని రద్దు చేయడానికి, యూనియన్ నుంచి విడిపోవడానికి సిద్ధం కాగా అధ్యక్షుడు తాను లోగడ చేసిన హెచ్చరికకు అనుగుణంగా **40** వేల అమెరికన్ సైన్యాన్ని ఆ రాష్ట్రం పైకి పంపదలచుకొన్నట్లు బెదించినాడు. దీనితో దక్షిణ కెరోలినా లొంగిరాక తప్పలేదు. కాని, ఆ రాష్ట్రానికి కలిగిన పరాభవాన్ని కొంత తగ్గించడానికి **1833**లో రాజీ సుంకము ప్రవేశపెట్టబడింది. దీని వల్ల లాంఛనంగా సుంకం కొంచెం తగ్గింది. దక్షిణ కెరోలినా **1833** సుంకాల చట్టాన్ని ఆమోదించి, వ్యర్థీకరణ తీర్మానాన్ని ఉపసంహరించుకొంది.

## 9.10. బ్యాంకు ఉదంతము :

**1816**లో స్థాపించిన అమెరికా సంయుక్త రాష్ట్రాల రెండో జాతీయ బ్యాంకు **20** సంవత్సరాల కాలపరిమితి **1836**కు అంతం కావచ్చింది. **1836** లోపల ఫెడరల్ ప్రభుత్వం ఆ బ్యాంకును ఎత్తివేయడమో లేదా కాలపరిమితిని మళ్ళీ పొడిగించడమో చేయవలసి ఉన్నది. **1790**లో జాక్సన్‌కు ఒక వ్యాపార సంస్థతో సంబంధాలు ఉన్నాయి. కాని ఆ వ్యాపార సంస్థ దివాలా తీసింది. దాని వల్ల జాక్సన్ నష్టపోయాడు. నాటి నుంచి జాక్సన్‌కు బ్యాంకులంటే గిట్టదు. జాతీయ బ్యాంకు పెట్టుబడిలో అయిదింట ఒక వంతు ప్రభుత్వ ధనము, మిగిలిన నాలుగు వంతులు పెట్టుబడిదారులు పెట్టినారు. ఈ పెట్టుబడిదారులు కాంగ్రెస్ సభ్యులకు అప్పులివ్వడం మూలంగాను, ఇతర విధాలుగా తోడ్పడటం ద్వారా కాంగ్రెస్‌లో కూడా తమ పలుకుబడిని చెలాయించవచ్చు. అమెరికన్ పౌరులకు బ్యాంకు అప్పులిచ్చివారి దగ్గర వడ్డీ రాబట్టుకొంటుంది. అందువల్ల పెట్టుబడిదారులకు లాభం చేకూరుతుంది. ఎవరికి ఏ విధమైన ప్రత్యేక సౌకర్యాలు ఉండరాదని విశ్వసించే జాక్సన్ బ్యాంకుల స్థితి రాజకీయంగా కలుషితమైపోయిందంటూ వాటిని పూర్తిగా నిర్మూలించటానికి నిశ్చయించినాడు. పశ్చిమ ప్రాంతంవారు కూడా బ్యాంకుకు శత్రువులుగా తయారయినారు.

జాతీయ బ్యాంకు విషయానికి, **1832** అధ్యక్ష ఎన్నికల్లో ప్రాముఖ్యం ఇవ్వటం జరిగింది. బ్యాంకు అధ్యక్షుడుగా వున్న నికోలస్ బిడిల్ నేషనల్ రిపబ్లికన్ పార్టీలో ఒక ముఖ్య సభ్యుడుగా ఉన్నాడు. ఈ పార్టీ కెంటకీకి చెందిన హెన్రీ క్లేని అధ్యక్ష పదవి నిలబెట్టింది. అంతేగాక బ్యాంకు కాలపరిమితిని తిరిగి పొడించడానికి కాంగ్రెస్‌లో ఒక బిల్లు ప్రవేశపెట్టింది. ఈ బిల్లు **1832** జూలైలో కాంగ్రెస్ ఆమోదాన్ని పొందింది. కాని జాక్సన్ తన వీటో అధికారంతో బిల్లును తోసిపుచ్చినాడు. బ్యాంకు ఒక గుత్తాధికారమని, అమెరికన్ పౌరులందరి దగ్గర నుంచి వసూలయిన బాంకు లాభాలతో కొంత మంది పెట్టుబడిదారులు జేబులు నింపుకొంటున్నారని జాక్సన్ ఆనాడు అన్నాడు. **1832** ఎన్నికలలో జాక్సన్ తిరిగి ఎన్నికయినాడు. ఈ విజయంతో బ్యాంకును ఎత్తివేసే విషయంలో జాక్సన్ పట్టుదల పెరిగింది. బ్యాంకులో ఉన్న ప్రభుత్వ ధనాన్ని సంపూర్ణంగా ఉపసంహరించవలసిందిగా ఉత్తరువులిచ్చినాడు. ఈ చర్య రాజ్యాంగ విరుద్ధమని విమర్శకు లోనయింది. బ్యాంకు రాజ్యాంగ సమ్మతమైందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ తీర్పు చెప్పినాడు. అయినప్పటికీ జాక్సన్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. బ్యాంకు మూతపడింది. జాతీయ ద్రవ్య వినిమయ బాధ్యత రాష్ట్రాల బ్యాంకులకు అప్పగించడమయింది. ఈలోపు ప్రభుత్వ భూములకు, నూతన పరిశ్రమలకు దేశమంతటా గిరాకీ అధికమయింది. ఈ పరిస్థితులలో రాష్ట్రాల బ్యాంకులు కరెన్సీ నోట్లును అమితంగా అచ్చువేసి విడుదల చేయటం వల్ల ధరలు విపరీతంగా పెరిగిపోయినాయి. దేశంలోని ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టడానికి కాగితపు కరెన్సీ జారీ చేయడం అరికట్టడానికి జాక్సన్ **1836**లో స్పీషీ సర్క్యులర్‌ను జారీచేసింది. దీని ప్రకారం భూములు కొనుక్కొనేవారు ఆ ఖరీదును కేంద్ర ప్రభుత్వానికి బంగారు, వెండి రూపంలోనే చెల్లించవలెనని జాక్సన్ శాసించినాడు. కాని ఈ సర్క్యులర్ బూడిదలో పోసిన పన్నీరయింది.

జాక్సన్ పదవీ విరమణ చేసే నాటికి దేశంలోని ఆర్థిక వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమయిపోయింది. వెండి, బంగారాలు కరువయినాయి. నోట్ల ధనం మాత్రం అపారంగా పెరిగిపోయింది. కొత్తగా పెట్టుబడిపెట్టి భూములను సాగుచేయడం పూర్తిగా నిలిచిపోయింది. బ్యాంకులు దివాలా తీసినాయి. వేలమందికి వృత్తులు లేకుండా పోయినాయి.

## 9.11. రెడ్ ఇండియన్ల సమస్య :

రెడ్ ఇండియన్ జాతులను మిసిసిపీ నది ఆవలి తీరానికి తరలించడం జాక్సన్ తన ధ్యేయంగా పెట్టుకొన్నాడు. ఎనిమిదేళ్ల అతని అధ్యక్ష పాలనా కాలంలో రెడ్ ఇండియన్లలో **94** సంధి ఒప్పందాలు జరిగాయి. ఫలితంగా వేల కొద్ది ఇండియన్లు తమ జాతులకు, తెగలకు చెందిన భూములను పోగొట్టుకున్నారు. వీరిని పడమటికి తరిమివేయటం జరిగింది. కొంతమంది ఇండియన్లు దీనిని ప్రతిఘటించలేమని తెలిసి తల ఒగ్గారు. మరికొందరు ప్రతిఘటించి కష్టాల పాలయ్యారు. వీరిలో జార్జియాకు చెందిన చెరోకే తెగ ఇండియన్ల పట్ల ప్రభుత్వం అనుసరించిన విధానం అన్ని విధాలా గర్హనీయమైంది.

చెరోకే తెగ ఇండియన్లు నాగరికతా, సభ్యతలు కలిగిన జాతి. ప్రభుత్వం వారితో చేసుకొన్న సంధి మేరకు వారి భూముల నుంచి వీరిని కదలించరాదు. కాని జార్జియాలోని అమెరికన్లు రెడ్ ఇండియన్ల భూములను ఆక్రమించడానికై రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. ఆ భూములలో బంగారు గనులు బయటపడడంతో ఈ ఒత్తిడి ఎక్కువయింది. ఆ భూములను ఆక్రమించడానికి ఆక్రమంగా ప్రయత్నాలు జరిగాయి. జాక్విన్సీ, ఆడమ్స్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఇండియన్ల రక్షణకై సైన్యాన్ని పంపాడు. ఆ సైన్యాన్ని జాక్సన్ ఉపసంహరించాడు.

ఈ వివాదం వోర్సెస్టర్ - జార్జియా అనే కేసుగా సుప్రీంకోర్టులో తీర్పుకు వచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్, జార్జియా రాష్ట్రానికి ఇండియన్ల భూములలో జోక్యం చేసుకొనే హక్కు లేదని తీర్పు ఇచ్చాడు. ఈ తీర్పుమీద జాక్సన్ స్పందిస్తూ 'జాన్ మార్షల్ తన తీర్పు ఇచ్చాడు. కాని దానిని అమలు జరపమనండి' అని పేర్కొన్నాడు. తరువాత ఇండియన్లలలో కొందరిని లంచాలతో ప్రలోభపెట్టి వారు జార్జియాలోని భూములను వదులుకొనేటట్లు ఒప్పందం చేసుకొన్నారు. బదులుగా వారికి మిసిసిపీనదికి పడమటగా ఉన్న భూములు ఇచ్చారు. దీనికి అంగీకరించని రెడ్ ఇండియన్లను **1838** నాటికి బలవంతంగా తరిమివేశారు.

## 9.12. న్యాయమూర్తుల నియామకం :

జాక్సన్ పాలనా కాలంలో న్యాయశాఖ విధానాలలో మార్పులు తేవటం జరిగింది. **1835**లో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ చనిపోవటంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా ఎనిమిదిమంది న్యాయమూర్తులను నియమించే అవకాశం జాక్సన్‌కు లభించింది. ఫలితంగా మరొక తరం వరకు రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించటంలో ప్రధాన న్యాయస్థానం నగర వాసులు, సంపన్నుల ప్రయోజనాలకు అనుకూలంగా కాక వ్యవసాయదారులు, సామన్య ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా తీర్పులు ఇవ్వటం జరిగింది. మేరీల్యాండ్ రాష్ట్రానికి చెంది, కోశాగార కార్యదర్శిగా ఉన్న రోజర్ బి. టేనిని **1835**లో జాక్సన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు. మార్షల్ అవకాశం వచ్చినప్పుడల్లా తన తీర్పుల ద్వారా సమాఖ్య ప్రభుత్వం అధికారాలు విస్తృత పరచడానికి ప్రయత్నించాడు. రోజర్ బి.టేని తన తీర్పుల ద్వారా రాష్ట్రాల హక్కులు, అధికారాలు పరిరక్షించడానికి ప్రయత్నించాడు. మార్షల్ ఒప్పందాల పవిత్రతను ఆస్తి హక్కును అనుల్లంఘనీయమైన మిత పవిత్రతతో చూసేవాడు. కాని టేనీ ప్రజాప్రయోజనాలను, సంక్షేమాన్ని పెంపొందించడానికై ఆస్తి హక్కును క్రమబద్ధం చేసే వీలును రాష్ట్రాలకు కల్పించేవాడు. ప్రధాన న్యాయస్థానంలో వచ్చిన మార్పుకు ఒక చక్కని ఉదాహరణ ఛార్లెస్ లివర్ బ్రిడ్జి కేసు, ఈ కేసులో ఛార్లెస్ లివర్ బ్రిడ్జి కంపెనీ గుత్తాధికారాన్ని కూలదోసి, ప్రజల ప్రయోజనాల దృష్టితో రెండో వంతెన నిర్మాణానికి అనుమతి ఇవ్వడం జరిగింది.

## 9.13. విదేశీ విధానం :

విదేశీ విధానంలో జాక్సన్ అతని ముందున్న అధ్యక్షుడు జాన్క్విన్సీ ఆడమ్స్ కన్నా ఎక్కువ విజయం సాధించాడు.

**9.13.1. పశ్చిమ ఇండియా దీవులతో వ్యాపారము :** బ్రిటీష్ పశ్చిమ ఇండియా దీవులతో అమెరికా వ్యాపారం కొనసాగించడానికి బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించవలెనని లేకపోతే తీవ్రమైన చర్యలు తీసుకొంటానని జాక్సన్ బ్రిటీష్ ప్రభుత్వానికి తెలియజేసినాడు. బ్రిటీష్ ప్రభుత్వం కొన్ని చిన్న షరతులు విధించి పశ్చిమ ఇండియా దీవులతో అమెరికా వ్యాపారం కొనసాగించడానికి అనుమతి ఇచ్చింది.

**9.13.2. ఫ్రాన్స్ నుంచి నష్టపరిహారం పొందుట :** గతంలో నెపోలియన్ విధించిన దిగ్బంధం వల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాలు నష్టపడింది. ఈ నష్టానికి గాను అమెరికా సంయుక్త రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించడానికి 1831లో ఒప్పుకొంది. కాని ఫ్రెంచి శాసనసభ ఈ నష్ట పరిహార ధనాన్ని మంజూరు చేయటంలో జాప్యం చేసింది. ఈ జాప్యం సహించని జాక్సన్ నౌకా బలాన్ని ఫ్రాన్స్‌తో యుద్ధానికి సన్నద్ధం కమ్మని, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని ఫ్రెంచి వారి ఆస్తులను జప్తు చేయవలసిందిగా కాంగ్రెస్‌కు సలహా ఇచ్చాడు. జాన్సన్ తన దురుసుతనానికి క్షమాపణ చేప్తే, నష్ట పరిహారాన్ని మంజూరు చేస్తామని ఫ్రెంచి అసెంబ్లీ బెదిరించింది. క్షమాపణ చెప్పటానికి జాక్సన్ అంగీకరించలేదు. 1835 నాటికి ఫ్రాన్స్ నష్టపరిహారం చెల్లించలేదు. తర్వాత జాక్సన్ క్షమాపణ చెప్పలేదుగాని తనకు ఫ్రాన్స్‌ను అవమానించే ఉద్దేశం లేదని ప్రకటించాడు. బ్రిటన్‌కలుగజేసుకొని రెండు దేశాల మధ్య సామరస్యాన్ని నెలకొల్పింది. ఫ్రెంచి ప్రభుత్వం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించింది.

**9.13.3. టెక్సాస్ రిపబ్లిక్ స్థాపన :** 1830 నాటికి ఇరవై వేల మంది అమెరికన్‌లు టెక్సాస్‌లో భూములు కొని స్థిరపడ్డారు. టెక్సాస్‌లోని అమెరికన్‌లకు, వారిని పరిపాలిస్తున్న మెక్సికో ప్రభుత్వానికి మధ్య కొంత కాలానికి ఘర్షణ ప్రారంభమయింది. మెక్సికో ప్రభుత్వం టెక్సాస్‌లోని అమెరికన్లకు స్వయం పరిపాలన సౌకర్యం కలిగించలేదు. అంతేగాక ఆ ప్రభుత్వం టెక్సాస్‌కు అమెరికన్‌లు వలస రావటాన్ని నిషేధించి, దిగుమతి సరుకులపై పన్ను విధించింది. 1829లో టెక్సాస్‌లో బానిస వ్యవస్థను నిషేదించింది. ఈ కారణాల వల్ల వలసదారులు అసంతృప్తి చెంది స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. మెక్సికన్ సైన్యానికి, వలసదారుల సైన్యానికి మధ్య 1836లో యుద్ధం ప్రారంభమైంది. ఈ యుద్ధంలో వలసదారుల సైన్యం ఘన విజయం సాధించింది. టెక్సాస్ స్వతంత్ర రాజ్యమయింది. టెక్సాస్ ప్రభుత్వం అమెరికాలో అంతర్భాగం కావటానికి ప్రయత్నించింది. టెక్సాస్‌ను అమెరికాలో చేర్చుకొన్నట్లయితే మెక్సికో అమెరికాపై యుద్ధం ప్రకటిస్తుందని జాక్సన్ భయపడ్డాడు. అంతేగాక ఔత్తరాహికులు బానిసత్వ వ్యవస్థగల మరో రాష్ట్రాన్ని యూనియన్‌లో చేర్చుకొనటానికి నిరసించినారు. ఈ కారణాల వల్ల జాక్సన్ టెక్సాస్ ప్రభుత్వపు అభ్యర్థనను తోసిపుచ్చినాడు. 1837లో స్వతంత్ర టెక్సాస్ రిపబ్లిక్ ఉనికిని అధికార పూర్వకంగా జాక్సన్ గుర్తించినాడు.

## 9.14. ఘనత :

జాక్సన్ ప్రజాభిమానం చూరగొన్న అధ్యక్షుడు. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన, సమర్థుడైన అధ్యక్షుడు అతనిలోని సహజమైన మంచితనం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల అతనికి గల అంకిత భావం అతని విజయానికి కారణమయ్యాయి. ఇతడు జాతీయ రాజకీయాలలో సామాన్య ప్రజలు పాల్గొనేటట్లు చేశాడు. వారిని ఒక తాటి మీదికి తెచ్చి బలమైన, శాశ్వతమైన డెమోక్రాటిక్ పార్టీని రూపొందించాడు. సామాన్య ప్రజలు ఓటు వేయడానికి, ఉన్నత పదవులు నిర్వహించటానికి అన్ని విధాలా అర్హులని రుజువు చేశాడు.

జాక్సన్ గుణాలతో పాటు అతని దోషాలను కూడా పేర్కొనవలసి వుంది. ప్రభుత్వోద్యోగ నియామకాలలో జాక్సన్ అనుసరించిన 'స్పాయిల్స్' విధానం సరిఅయింది కాదు. జాక్సన్ అనుసరించిన బలహీనమైన ఆర్థిక విధానాల వల్ల దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఒక శతాబ్దం పాటు పూర్తిగా కోలుకోలేకపోయింది.

## 9.15. నమూనా ప్రశ్నలు :

**1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)**

1. ఆండ్రూ జాక్సన్ అధ్యక్ష పదవీ కాలం ఏ విధముగా ప్రాముఖ్యతను సంతరించుకొనెను. ?
2. ఆండ్రూ జాక్సన్ పరిపాలనను గూర్చి తెల్పుము. ?
3. జాక్సన్ ప్రజాస్వామ్యం గురించి వివరింపుము. ?

## 9.16. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Oscar Hadlin | - | The American : A History of the people of the United States |
| 2. | Marquis James - Andrew Jackson | - | Portrait of the President |
| 3. | G. Johnson | - | Andrew Jackson |
| 4. | William Macdonald | - | Jacksonian Democracy |
| 5. | A.M. Schleisinger | - | The Age of Jackson |
| 6. | H.B. Parkes | - | The United States of America - A History |


- డా॥ వి.కె. మోహన్

**పాఠం - 10**

# పశ్చిమ దిశ విస్తరణ

## 10.0. లక్ష్యం :

19వ శతాబ్దిలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు పశ్చిమ దిశగా విస్తరించుటకు గల కారణాలు, విస్తరణలో వివిధ ఘట్టాలు, ఫలితాలను గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


10.1. పరిచయము

10.2. పశ్చిమ దిశ విస్తరణకు కారణాలు

- 10.2.1. ఆర్థిక కారణాలు
- 10.2.2. ఫెడలర్ ప్రభుత్వ ప్రోత్సాహం
- 10.2.3. కనిపించే విధి (మానిఫెస్ట్ డెస్టినీ)
- 10.2.4. అన్వేషకుల ప్రచారం
- 10.2.5. మోర్మాన్లు
- 10.2.6. కాలిఫోర్నియా గోల్డ్ రష్
- 10.2.7. ప్రయాణ సౌకర్యాలు

10.3. పశ్చిమ దిశ విస్తరణలో వివిధ ఘట్టాలు

10.4. పశ్చిమ దిశ విస్తరణ ఫలితాలు - టర్నర్ సిద్ధాంతం

10.5. నమూనా ప్రశ్నలు

10.6. చదువదగిన గ్రంథాలు


## 10.1. పరిచయము :

19వ శతాబ్దిలో అమెరికా పశ్చిమ దిశ విస్తరణ అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో ఒక మహత్తర సంఘటన. ఈ పశ్చిమ దిశ విస్తరణ, అమెరికన్ జాతీయతను రూపొందించుటలో ప్రధాన పాత్ర వహించింది. అమెరికాలో వలసలు స్థాపించబడిన నాడే వలస ప్రజలు పశ్చిమ దిశకు తరలివెళ్ళవలెనని ఉత్సాహం చూపారు. కాని వారి ప్రయత్నాలకు ఆనాడు మొదట ఫ్రెంచివారు, తరువాత బ్రిటీష్ వారు వమ్ము చేశారు. అయితే వలసలు స్వాతంత్ర్యం పొందుటలో ఈ అడ్డంకులు తొలగిపోయాయి. 1840-1850 మధ్య కాలంలో అమెరికన్లు పశ్చిమ దిశకు విస్తరించే కార్యక్రమాన్ని చురుకుగా కొనసాగించి అమెరికా సంయుక్త రాష్ట్రాల విస్తీర్ణాన్ని దాదాపు రెట్టింపు చేసినారు. టెక్సాస్, ఒరగాన్, కాలిఫోర్నియా, నైరుతి ప్రాంతంలో కొంత భాగాన్ని అమెరికన్లు హస్తగతం చేసుకొన్నారు. 19వ శతాబ్ది అంతం వరకు పశ్చిమ దిశ విస్తరణ అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో ఒక ప్రధాన ఘట్టము, అమెరికన్ జాతీయతను తీర్చిదిద్దుటలో ముఖ్యమైనవి'' అని హెచ్.బి.

పార్క్స్ అంటాడు. పశ్చిమ దిశ విస్తరణ ఫలితంగా అమెరికన్‌లు బానిసత్వ సమస్యను ఎదుర్కొనవలసి వచ్చింది. ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన బానిసత్వ దురాచారం నూతన రాష్ట్రాలలో ప్రవేశింపనీయవచ్చునా, వద్దా అనే జటిల సమస్యతో అమెరికన్‌లు సతమతమయినారు. మిస్సోరీ, ఆర్కాన్సాస్, నైరుతి ప్రాంతాలలో వున్న మోతుబరి రైతులు నీగ్రోలను తమతో తీసుకొని పోయి నూతన బానిస రాష్ట్రాలను ఏర్పాటు చేసే హక్కు తమకు ఉన్నదని వాదించేవారు. రాజ్యాంగంలో అటువంటి చర్యలు నిషేధించినట్లుగా ఎక్కడ పేర్కొనలేదు. అందువల్లనే కెంటకీ, టెన్నెసీ, మిసిసిపీ, లూయిసియానా రాష్ట్రాలను అప్పటికే సమాఖ్యలో చేర్చుకోవడమయింది. ఉత్తర రాష్ట్రాలలో బానిసత్వ వ్యవస్థ పట్ల ఏహ్యాభావం వృద్ధి పొందసాగింది. దీనికి నైతికమేగాక రాజకీయ, ప్రాంతీయవాద కారణాలు కూడా ఉన్నాయి. బానిస రాష్ట్రాలు పాబ్రల్యంలో స్వతంత్ర రాష్ట్రాలకు మించిపోవడం పట్ల, దిగుమతి పన్నులు తగ్గించటం, వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యమివ్వటం, వ్యాపార ప్రధానమయిన ఉత్తరాది రాష్ట్రాల మంచి చెడ్డలు వెనకబడటం తప్పదని ఔత్తరాహుల భయం.

## 10.2. పశ్చిమ దిశ విస్తరణకు కారణాలు :

19వ శతాబ్దిలో అమెరికా పశ్చిమ దిశగా విస్తరించుటకు అనేక కారణాలు గలవు. ప్రథమంలో నూతన భూములు పొందవలెనను ధ్యేయంతో ప్రారంభమయి, కనిపించే విధి అను ధ్యేయంతో బలం పుంజుకొంది.

**10.2.1. ఆర్థిక కారణాలు :** కొత్త భూములు అన్వేషణలో పశ్చిమ ప్రాంతము సారవంతమైనదని, అచట అపార సహజ సంపద కలదని విదితమయింది. మిసిసిపీ, మిస్సోరి మొదలగు నదుల పరివాహక ప్రాంతము సస్యశ్యామలమైనది. కాలిఫోర్నియాలో బంగారు గనులు, నెవడాలో వెండి నిక్షేపాలు గలవు. వీనికి తోడు ఈ ప్రాంతం ఉన్ని వ్యాపారమునకు ప్రసిద్ధమైనది. ఇట్టి ఆర్థిక సంపద సహజంగానే అమెరికన్లకు ఆకర్షించింది. 1840 నాటికి సస్యశ్యామలమైన మిసిసిపీ ప్రాంత ఆక్రమణ పూర్తి కావటంతో, సహజ సంపద గల కాలిఫోర్నియా,ఔరగాన్, టెక్సాస్, న్యూ మెక్సికోలపై దృష్టి పడింది. 1837 తరువాత ఏర్పడిన ఆర్థిక మాంద్యము వలన పన్నులు చెల్లింపలేనివారు, అంతర్యుద్ధంలో రాజకీయ, ఆర్థిక ఇబ్బందులకు గురైనవారు తమ దృష్టిని పశ్చిమం వైపు మరల్చారు. 1887 క్షామం తర్వాత అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఏర్పడిన పరిస్థితులు కూడా విస్తరణ కార్యక్రమానికి దోహదం చేసింది. ఆహార పంటల ధరలు హఠాత్తుగా పడిపోవటం వల్ల వ్యవసాయదారులు దెబ్బతిన్నారు. 1830 తరువాత కొనసాగిన రోడ్డు రవాణా సౌకర్యాల కార్యక్రమం వల్ల ప్రభుత్వం పన్నులను అధికం చేసింది. ఆ సుంకాలను మిసిసిపీలోయ రాష్ట్రాల వారు చెల్లించలేక ఋణగ్రస్తులయినారు. న్యూమెక్సికోలో గొప్ప వ్యాపార కేంద్రమైన శాంతాఫే పట్టణంలో 1821లో అమెరికన్లు వ్యాపారం ప్రారంభించారు. తరువాత అక్కడికి వెళ్ళిన అమెరికన్ వర్తకులు తిరుగు ప్రయాణంలో తోళ్ళు, వెండి, బంగారాలను తెచ్చేవారు. ఈ విధంగా అమెరికన్ వర్తకులు న్యూమెక్సికోను రాకపోకలు సాగించినందువల్ల నూమెక్సికో పైన మెక్సికో అధికారం నామ మాత్రంగా ఉందని కూడా అమెరికన్‌లకు తెలిసింది. అమెరికన్‌లు ఎక్కువ భూభాగాన్ని ఆక్రమించుకోవలెనని ఉబలాట పడటానికి ఈ పరిస్థితి దోహదం చేసింది.

**10.2.2. ఫెడరల్ ప్రభుత్వ ప్రోత్సాహం :** అమెరికా స్వాతంత్ర్య యుద్ధం అంతమయ్యే నాటికి ఉత్తర కెరోలినా, వర్జీనియా, పశ్చిమంగా వెళ్ళి కెంటకీ, టెన్నిసీల యందు తమ స్థావరాలను ఏర్పరచుకొనిరి. స్వాతంత్ర్య యుద్ధానంతరము కాన్‌ఫెడరేట్ ప్రభుత్వము, తదుపరి ఫెడరల్ ప్రభుత్వం పశ్చిమ దిశ విస్తరణను ప్రోత్సహించి అందుకనుగుణంగా అనేక చట్టాలు చేసింది. మొట్టమొదటి కాన్‌ఫెడరేట్ ప్రభుత్వం 1785లో భూ చట్టాన్ని జారీ చేసి భూమిని సర్వే చేసి పట్టణాలుగా విభజించి, ఒక్కొక్క వ్యక్తి 640 ఎకరములకు తక్కువ గాకుండా కొనవలెనని, ఎకరము ఖరీదు డాలర్‌కు తక్కువ కాకుండా బహిరంగ వేలమున అమ్మవలెనని ఆదేశించింది. తరువాత ఫెడరల్ ప్రభుత్వం 1796లో ఎకరము ఖరీదును రెండు డాలర్లకు పెంచగా, 1800లో కాంగ్రెస్ జారీ చేసిన చట్ట ప్రకారం ఒక వ్యక్తి కొనుగోలు చేయు భూమి 320 ఎకరములకు తగ్గించబడెను. పశ్చిమ భూములను కొనుగోలు చేయువారికి ఋణాలిచ్చిరి. లూయిసియానా కొనుగోలు వలన పశ్చిమ దిశ విస్తరణ చురుకుగా సాగింది. 1804లో ఒక వ్యక్తి కొనుగోలు చేయు భూమి 160 ఎకరాలకు, ఖరీదు అర డాలర్‌కు కాంగ్రెస్ తగ్గించింది. పశ్చిమ దిశ విస్తరణ వాదులకు కాంగ్రెస్ అనేక పర్యాయాలు ఋణాలు చెల్లించు కాలపరిమితిని పెంచుట, వారికొని సందర్భాలలో మాఫీ చేయుట జరిగింది. 1820 నాటికి ఒక వ్యక్తి కొనుగోలు చేయు భూమి 80 ఎకరాలకు తగ్గించబడెను. అమెరికన్‌ల పశ్చిమ విస్తరణ వ్యాప్తికి

అవరోధము కల్పించు రెడ్ ఇండియన్‌లను ప్రభుత్వం శిక్షించింది. అమెరికా పౌరులు పశ్చిమ దిశగా తరలి వెళ్ళుటకు, సిథరపడుటకు, వారు రాష్ట్ర ప్రతిపత్తిని పొందుటకు ఆ తరువాత ఆ రాష్ట్రాన్ని యూనియన్‌లో చేర్చుకొనుటకు ఫెడరల్ ప్రభుత్వం గణనీయమైన పాత్రను వహించింది.

**10.2.3. కనిపించే విధి (మానిఫెస్ట్ డెస్టినీ) :** పశ్చిమ దిశ విస్తరణకు మరొక ప్రధాన కారణము 'మానిఫెస్ట్ డెస్టినీ' (దైవం మోపబడిన కార్యము) అను భావోద్యమ. జాక్సన్ శకంలో అమెరికన్ పౌరుడు తన దేశము ప్రపంచమంతటిలో మహోన్నతమైనదని భావించడం ప్రారంభించినాడు. తన దేశము అన్ని రంగాలలోను పురోగమించిందని, వైభవ ప్రభావాలతో తులతూగుతున్నదని ప్రతి అమెరికన్ పౌరుడు దృఢంగా నమ్మినాడు. అమెరికన్ జాతి అనే సువర్ణ చిత్రం కిందికి దూర పశ్చిమ ప్రాంతము, కెనడా, మెక్సికో, మధ్య దక్షిణ అమెరికాల ప్రజలను చేర్చవలెనని అమెరిన్లు కలలుకన్నారు. మహోన్నత్కృష్టమైన అమెరికన్ ప్రజాస్వామ్యం పైన పేర్కొన్న ప్రాంతాలలో వేళ్ళూనేటట్లు చేయవలెనని ఆశించారు. ఈ విధంగా అమెరికన్ సంస్కృతి విస్తరణ దైవము మోపబడిన కార్యభారమని అమెరికన్లు విశ్వసించారు.

**10.2.4. అన్వేషకుల ప్రచారం :** పర్వత పురుషులు అనే పేరు పొందిన కొంత మంది వర్తకులు బీవర్ మృగాల కోసం అన్వేషణలు జరుపుతూ పశ్చిమ ప్రాంతాలను బాగా పరిశీలనవల్ల తూర్పు ప్రాంతపు అమెరికన్లకు పశ్చిమ ప్రాంతంలోని సారవంతమైన భూములతోబాటు నౌకాయానికి అనువైన నదులను గురించి కూడా క్షుణ్ణంగా తెలిసింది. లెవిస్, క్లార్క్ వంటి అన్వేషకులు మహా మైదాన ప్రాంతాలలో స్థిరపడటంలో గల ఇబ్బందులను స్పష్టపరచారు. పశ్చిమ ప్రాంతాలలో వలసల స్థాపనకు మార్గదర్శకులైన, అన్వేషకులు పట్టువీడక మహా మైదానాల మీదుగా నైరుతి ప్రాంతాలకు, వాయవ్య ప్రాంతాలకు చేరుకొన్నారు. నైరుతి దిశలోని టెక్సాస్ ప్రాంతంలో 1820లో అమెరికన్లు వలసలు ఏర్పరచుకొన్నారు. ఈ వలసల స్థాపన ఉధృతంగా సాగి చివరకు మెక్సికోతో పోరాటానికి దారి తీసింది. ఈ దిశగా శాంతాఫే ద్వారా జరుగుతుతున్న వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. అమెరికా రచయిత అయిన వాషింగ్టన్ ఇర్వింగ్' 'కెప్టెన్ బోన్‌విల్ సాహస కృత్యాలు' అనే తన గ్రంథం ద్వారా బోన్‌విల్ సాహసాలకు ప్రచారం కల్పించడంతో అమెరికన్లకు ఓరగాన్ ప్రాంతం మీద ఆసక్తి కలిగింది. అరణ్యాలతో, గడ్డి మైదానాలతో, సమశీతోష్ణస్థితిలో ఓరగాన్ ప్రాంతం చాలా ఆకర్షనీయమైన ప్రదేశం. ఫలితంగా ఓరిగాన్ వలస మార్గం 1842లో మొదలయ్యింది.

**10.2.5. మోర్మాన్లు :** 'మోర్మాన్సు' అని పిలువబడే ఒక మత శాఖకు చెందిన వారు 'గ్రేట్ ఫాల్స్ సరోవర్' ప్రాంతానికి మూకుమ్మడిగా వలసపోయారు. వీరి నాయకుడు జోసెఫ్ స్మిత్ తనకు ఒక దేవత ధర్మనమయిందనీ, ఆమె తనకు కొన్ని వింత రాతలతో రేకులను, మాంత్రిక శిలలను ఇచ్చిందని చెప్పి, ఈ రాతలను 1830లో 'బుక్ ఆఫ్ మార్మాన్సు' అను గ్రంథంగా ప్రకటించాడు. మోర్మాన్లు మొదట ఒహియా రాష్ట్రంలో వున్నారు. తరువాత వీరు ఒహియా నుంచి మిస్సోరికి, అక్కడినుంచి ఇల్లినాయిస్‌లోని నావూకు వెళ్ళారు. స్మిత్ తరువాత మోర్మాన్ల నాయకుడైన బ్రిగ్‌హామ్‌యంగ్ మోర్మాన్లచే దీర్ఘయాత్ర చేయించి నిస్సారంగా వుండే 'గ్రేట్ సాల్ట్ లేక్' కి తీసుకువెళ్లాడు.

**10.2.6. కాలిఫోర్నియా గోల్డ్ రష్ :** కాలిఫోర్నియాలో బంగారం గనులు విస్తారంగా ఉన్నాయనే వార్త దేశం నలుమూలలా వ్యాపించింది. దీనితో దేశంలోని అన్ని మూలల నుంచి, అన్ని ప్రాంతాల నుంచి, త్వరగా సంపన్నులు కావాలనే ఆశలో, అన్ని వర్గాలవారు, జాతుల వారు, భాషల వారు, వృత్తులవారు వేలం వెర్రిగా కాలిఫోర్నియాలోని శాక్రమెంటో లోయకు ఎగబడ్డారు. అదృష్టం ఉన్న వారికి బంగారం లభించింది. బంగారం లభించని దురదృష్టవంతులు చాలా మంది కాలిఫోర్నియాలోనే వ్యవసాయదారులుగా స్థిరపడ్డారు.

**10.2.7. ప్రయాణ సౌకర్యాలు :** 1848 జర్మనీ విప్లవోద్యమం విఫలమయిన తరువాత అనేక మంది జర్మన్‌లు కాందిశీకులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలకు తరలి వచ్చారు. వీరిలో ఎక్కువ మంది పశ్చిమ ప్రాంత భూములకు, ముఖ్యంగా లిస్కాన్‌సిన్, అయోవా, మిస్సోరి ప్రాంతాలకు వెళ్ళి స్థిరపడ్డారు. వీరు పశ్చిమ ప్రాంతంలోని బీటి భూములను సాగులోనికి తెచ్చారు. తమ కృషితో వీటిని ప్రపంచంలోనే ధాన్యం పండించే భూములలో అతి విస్తారమైన ప్రదేశంగా రూపొందించారు. ఈ అభివృద్ధిని సాధించడానికి అప్పుడే ప్రవేశించిన రైలు మార్గాలు పెద్ద ప్రోత్సాహక శక్తిగా సహాయపడ్డాయి. పశ్చిమంలోని మైదానాలలో స్థిరపడిన వ్యవసాయదారులు గోధుమలను,

ఇతర ధాన్యాలను తూర్పు ప్రాంతంలోని నగరాలకు పంపటానికి రైలు మార్గాలు చక్కని వీలు కల్పించాయి. అలాగే తూర్పు ప్రాంతంలోని పారిశ్రామిక ఉత్పత్తులను పశ్చిమంలోని వ్యవసాయదారులకు చేరవేశాయి. 1860 నాటికే పశ్చిమ దిశావిస్తరణోద్యమం శీఘ్రగతిని పుంజుకోవటానికి రైలు మార్గాలు మిక్కిలిగా సహాయపడ్డాయి.

## 10.3. పశ్చిమ దిశ విస్తరణలో వివిధ ఘట్టాలు :


అమెరికా విప్లవానికి ముందు పశ్చిమ దిశ విస్తరణను బ్రిటీష్ ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకొంది. అయినప్పటికీ వర్జీనియా, ఉత్తర కెరోలినాలకు చెందిన అగ్రగాములు అపలేచియన్ పర్వతాల తర్వాతి ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పరచుకొన్నారు. ఈ స్థిర నివాసాలే తర్వాత టెన్నెసీ, కెంటుకీ రాష్ట్రాలుగా రూపొందాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అమెరికన్ ప్రభుత్వం పశ్చిమ ప్రాంతాలలో స్థిర నివాసాలు ఏర్పరచుకొనేవారిని ప్రోత్సహించింది. ఫలితంగా క్రమక్రమంగా ప్రజలు మిసిసిపీ లోయలోనికి, ఒహియో ప్రాంతానికి పోయి స్థిరపడసాగారు.

కన్ఫడరేట్ ప్రభుత్వ కాలంలో వాయవ్య ప్రాంతంలో ఒహియోనదికి, మహా సరస్సులకు మధ్య గల భూమిని, కాంగ్రెస్ అనేక ప్రాంతాలుగా విభజించి, ఆ ప్రాంతాలలో ప్రజలు పోయి వలసలు ఏర్పరచుకోవడాన్ని ప్రోత్సహించింది. ఈ వాయువ్య ప్రాంతానికంతా ఒక గవర్నర్‌ను, ముగ్గురు న్యాయమూర్తులను పాలనా పర్యవేక్షణకై నియమించింది. అక్కడ స్థిరపడ్డవారికి రాజకీయ స్వేచ్ఛ, మత స్వేచ్ఛ ఇచ్చారు. ఉచిత విద్యా బోధనకు వసతి కల్పించబడింది. భూ చట్టాల ద్వారా వారికి భూములు అమ్మబడ్డాయి. ఏ ప్రాంతంలోకైనా గాని 60 వేల జనాభా ఏర్పడినపుడు ఆ ప్రాంతాన్ని నూతన రాష్ట్రంగా గుర్తించి దానికి మొదటి 13 రాష్ట్రాల స్థాయి కల్పించి, సమాఖ్యలో చేర్చుకోవడానికి వీలు కల్పించబడింది. ఈ వాయువ్య ప్రాంతానికి సంబంధించిన ఈ ప్రణాళిక అంతా 1787 వాయువ్య ప్రాంత భూ చట్టంలో పొందుపరచబడింది. ఈ ప్రణాళిక భవిష్యత్‌లో పశ్చిమ దిశ విస్తరణకు దోహదం కల్పించింది. ఔదార్య పూరితమైన ఈ వలసల విధానం చివరకు వారికి 50 రాష్ట్రాలు చేకూర్చేటట్లు చేసింది.

ప్రథమంలో పశ్చిమానికి సమాంతరమైన మార్గాలలో మూడు వలసలు నడిచాయి. మొదటి ఉత్తరంలో న్యూ ఇంగ్లండ్ రాష్ట్రాల నుంచి నడిచింది. రెండోది వర్జీనియా నుంచి బయలు దేరింది. మూడోది దక్షిణ కెరోలీనా నుంచి బయలుదేరి ఒహియో నదికి వెంబడించి నడచింది. ఈ కొత్త వలసలన్నీ ఒక్కసారిగా ఏర్పడలేదు. నూతన ప్రాంతాలలో ప్రజలు స్థిరపడి తగిన అర్హత సంపాదించుకొన్న తరువాత ఆ నూతన ప్రాంతాలను సమాఖ్యలో రాష్ట్రాలుగా చేర్చారు. 1796 నాటికి కెంటకీ, టెన్నీసీ ప్రాంతాలు రాష్ట్రాలు అయ్యాయి. వెర్మాంట్‌ను న్యూ హ్యాంప్ షైర్ నుంచి వేరు చేసి 1791 లో నూతన రాష్ట్రంగా చేశారు. 1803లో ఒహియో ప్రాంతం రాష్ట్రమయింది. 1813లో లూయిసియానా ప్రాంతం ఒక రాష్ట్రంగా సమాఖ్యలో ప్రవేశం పొందింది.

మన్రో, ఆడమ్స్, జాక్సన్‌ల అధ్యక్ష పదవీ కాలాలలో (1817-1837) పశ్చిమ దిశ విస్తరణ చురుకుగా సాగింది. వలసదార్లు మిసిసిపీ నదిని దాటి మిస్సోరి నదీ ప్రాంతంలో స్థిరపడ్డారు. రెడ్ ఇండియన్లను మిస్సోరీనదీ అవతలి ప్రాంతాలకు తరలించి, మిసిసిపీ ప్రాంతంలో వలసలు ఏర్పడడానికి భద్రత చేకూర్చబడింది. 1816లో ఉత్తర ఇండియానా, 1818లో ఇల్లినాయిస్ సమాఖ్యలో ప్రవేశం పొందాయి. 1821లో మిస్సోరీ నూతన రాష్ట్రంగా ప్రవేశం పొందింది. 1821లో మెయిన్ నూతన రాష్ట్రమయింది. 1837లో మిచిగాన్, అర్కాన్సాస్‌లు రాష్ట్రాలయ్యాయి. 1836లో స్వతంత్రమైన టెక్సాస్ 1845లో రాష్ట్రంగా ప్రవేశం పొందింది. 1850లో కాలిఫోర్నియా, 1859లో ఒరిగాన్ యూనియన్‌లో రాష్ట్రాలుగా చేరాయి. 1861లో కాన్సాస్, 1864లో నెవడా, 1867లో నెబ్రాస్కా, 1876లో కెలరెడో, 1869లో మోంటానా, వాషింగ్టన్, ఉభయ డకోటాలు, 1890లో వైయోమింగ్, ఇడాహోలు, 1896లో ఉటా, 1907లో ఒక్ల హోమా, 1912లో ఆరిజోనా, న్యూమెక్సికో యూనియన్‌లో చేరాయి. (పటం. నెం. 5 చూడండి)




1. మెయిన్. 2. న్యూహాంప్షైర్, 3. మెసాచుసేట్స్, 4. కనెక్టికట్, 5. న్యూయార్క్, 6. రోడ్ ఐలండ్, 7. పెన్సిల్వేనియా, 8. న్యూజెర్సీ, 9. మేరీలాండ్, 10. డెలవేర్, 11. వర్జీనియా, 12. ఉత్తర కెరోలినా, 13. దక్షిణ కెరోలినా, 14. జార్జియా, 15. ఫ్లోరిడా, 16. అలబామా, 17. టెన్నెసి, 18. కెంటకీ, 19. ఓహైయో, 20. ఇండియానా, 21. మిచిగన్, 22. మిన్నెసోటా, 23. అయోవా, 24. మిస్కాన్సిన్, 25. ఇలినాయ్, 26. మిసోరి, 27. అర్కాన్సాస్, 28. మిసిసిపి, 29. లూయిసియానా, 30. టెక్సాస్, 31. ఓక్లహామా, 32. కాన్సాస్, 33. నెబ్రస్కా, 34. దక్షిణ డకోటా, 35. ఉత్తర డకోటా, 36. మోంటానా, 37. వ్యోమింగ్, 38. కొలరాడొ, 39. న్యూమెక్సికో, 40. అరిజోనా, 41. ఉటా, 42. ఇడాహొ, 43. వాషింగ్టన్, 44. ఓరిగాన్, 45. కాలిఫోర్నియా, 46. నెవాడా.

## 10.4. పశ్చిమ దిశ విస్తరణ ఫలితాలు - టర్నర్ సిద్ధాంతం :

అమెరికా సంయుక్త రాష్ట్రాల సరిహద్దు పశ్చిమ సముద్రానికి విస్తరించడం వల్ల ఆ దేశ నాగరికతలో ఏర్పడిన మార్పుల గురించి పండితులు బేరీజులు వేయసాగినారు. ఇటువంటి వారిలో ముఖ్యుడు విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో చరిత్రాచార్యుడైన ఫ్రెడరిక్ జాక్సన్ టర్నర్. అప్పటి వరకు అమెరికన్‌లు వ్యవస్థలకు, ఆ దేశపు నాగరికతకూ ఐరోపావారు ముఖ్యంగా జర్మన్‌లు మూలాధారమని విశ్వసిస్తూ ఉండేవారు.

1893లో ఫ్రెడరిక్ జాక్సన్ టర్నర్ అమెరికా చారిత్రక సంఘానికి అమెరికా చరిత్రలో సరిహద్దు ప్రాముఖ్యం' అనే సిద్ధాంత వ్యాసాన్ని ప్రచురించాడు. ఈ సిద్ధాంత వ్యాసంలో టర్నర్ అమెరికా పశ్చిమ దిశ విస్తరణ వల్ల ఏర్పడిన ఫలితాలను చర్చించి, చక్కగా వివరించాడు. అమెరికా నాగరికతా పరిణామంలో పశ్చిమ దిశ విస్తరణ ప్రధాన పాత్ర వహించిందని టర్నర్ తన సిద్ధాంత వ్యాసంలో ప్రవచించాడు. ఐరోపా, అమెరికా నాగరికతా, సంస్కృతులలోగల భేదాలు ఈ పశ్చిమ దిశ విస్తరణ వల్ల ఏర్పడినవే అని తెలిపాడు. "నేటి వరకు, చాలా వరకు, అమెరికా చరిత్ర పశ్చిమ దిశ విస్తరణ కంటే భిన్నమయింది కాదు. అనాక్రమితమయిన భూమి ఉండటం, ఆ భూమిని ఆక్రమించి అమెరికన్ వలసలు పశ్చిమ దిశగా ముందుకు సాగిపోవటం అనే విషయాలు అమెరికా అభివృద్ధిని విశదపరుస్తాయి." అని టర్నర్ ప్రవచించాడు. టర్నర్ సిద్ధాంతంలోని కొన్ని అంశాలు అతిశయోక్తితో కూడినవని కొంత విమర్శ ఉన్నప్పటికీ, పశ్చిమ దిశ విస్తరణ యొక్క ఫలితాలకు సంబంధించి టర్నర్ తెలిపిన ప్రధాన సిద్ధాంతాలు అందరి యొక్క ఆమోదాన్ని పొందాయి.

పశ్చిమ దిశ విస్తరణ వల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాల భూభాగము విస్తృతమయ్యెను. దీని సరిహద్దులు అట్లాంటిక్ తీరం నుంచి పసిఫిక్ తీరం వరకు వ్యాపించింది. అమెరికా విప్లవం నాడు 13 రాష్ట్రాలలో ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రాలు 50 రాష్ట్రాలతో కూడిన సువిశాల దేశమయ్యెను.

పశ్చిమ దిశ విస్తరణ వల్ల విశాల భూభాగాలతో బాటు అచటి అపార సంపద, వనరులు, ఖనిజ సంపద అమెరికా సంయుక్త రాష్ట్రాల హస్తగతమయ్యెను. వీనికి వ్యవసాయిక విప్లవం, పారిశ్రామిక విప్లవం తోడుగుటతో అమెరికా సంయుక్త రాష్ట్రాలు స్వయం సమృద్ధిగల, సంపన్న దేశంగా ఆవిర్భవించుటకు దోహదం చేసెను.

అమెరికా సంయుక్త రాష్ట్రాల సరిహద్దు మార్పులతో బాటు వారి సాంఘిక జీవనంలో పరివర్తన కూడా జరిగింది. పశ్చిమ దిక్కుకు పయనించటం వల్ల, అక్కడ జీవించే ఎర్ర ఇండియన్‌లతో సంపర్కల వల్ల అమెరికన్‌లు తమ నడవడిని తీర్చి దిద్దుకోవడమయింది. అమెరికా ప్రజల జాతీయ దృక్పథం అట్లాంటిక్ తీరస్థమయింది కాదనీ అది అమెరికా పశ్చిమ సరిహద్దు వర ప్రసాదమేనని టర్నర్ స్పష్టంగా పేర్కొన్నాడు.

తూర్పు తీరం నుంచి పశ్చిమ దిక్కున పయనించిన కొద్దీ అమెరికన్‌లపై ఐరోపా ప్రభావచ్ఛాయలు అంతరించి, వారి జీవితం నూతనత్వం సంతరించుకున్నది. ఈ పరిణామమే అమెరికన్ జాతీయతకూ, వారిలో ప్రజాస్వామ్య పద్ధతులు పెంపొందడానికీ, మొక్కవోని వ్యక్తిత్వ వికాసానికి ఆధారమయిందని టర్నర్ విశ్వసించాడు.

అమెరికా పశ్చిమ దిశ విస్తరణ ప్రజాస్వామ్య వ్యవస్థలను పటిష్టం చేసింది. పశ్చిమానికి వలసపోయి స్థిరపడిన వారు, వారు తూర్పు నుంచి కొనిపోయిన ప్రజాస్వామ్య ఆదర్శాలను సరిహద్దు అనుభవాలతో మేళవించారు. మానవ సమానత్వంలో దృఢమైన విశ్వాసంతో పశ్చిమంలో ప్రజాస్వామ్య విలువలు దృఢతరమయ్యాయి. పట్టణాలలోని పనివారికి, వ్యవసాయ కూలీలకు, ఔత్సాహికులయిన మధ్య తరగతి ప్రజలకు పశ్చిమము నూతన జీవన అవకాశాలను కల్పించింది. ఈ విధంగా పశ్చిమ విస్తరణ పనివారి దోపిడీ అరికట్టబడింది.

పశ్చిమ దిశ విస్తరణ ప్రాంతీయాభిమానాలను భగ్నం చేసి జాతీయ ఐక్యతను పెంపొందించింది. పశ్చిమంలో స్థిరపడ్డవారికి తాము అమెరికన్లమనే భావన దృఢంగా ఏర్పడింది. ప్రజా సంక్షేమాన్ని, రవాణా సౌకర్యాలను పెంపొందించగల పటిష్టమైన జాతీయ ప్రభుత్వాన్ని వారు కోరుకొన్నారు. వారి జాతీయతా దృక్పథం శక్తివంతమైన విదేశీ విధానాన్ని ఆకాంక్షించింది. వారి ఆకాంక్ష 1812 యుద్ధంలో, మెక్సికో యుద్ధంలో బాగా వ్యక్తమయింది.

పశ్చిమ దిశ విస్తరణోద్యమం అమెరికన్ నాగరికత విస్తృతమైన ప్రాంతాలకు విస్తరించేటట్లు చేసింది. పశ్చిమ ప్రాంతాలకు వలసపోయిన ప్రజలు ఒక నూతన ప్రాంతంలో స్థిరపడాలనే అక్కడి ప్రజాస్వామ్య ప్రభుత్వాలను, న్యాయస్థానాలను, చర్చీలను, పాఠశాలలను, విద్యాలయాలను అచ్చు యంత్రాలను స్థాపించారు.

పశ్చిమ దిశ విస్తరణలో పశ్చిమ ప్రాంతాలకు వార్తా సౌకర్యాలను, రవాణా సౌకర్యాలను విధిగా ఏర్పాటు చేయవలసిన అవసరం ఫెడరల్ ప్రభుత్వానికి ఏర్పడింది. పసిఫిక్ తీరం నుంచి తూర్పు ప్రాంతాలకు ఖండాంతర రైలు మార్గాలు నిర్మించారు.

అమెరికా పశ్చిమ దిశ విస్తరణోద్యమం అమెరికన్ స్వభావం మీద తన ప్రభావాన్ని కనబరిచింది. సెవిన్స్ మరియు కమేజర్‌ల మాటలలో, సరిహద్దు ఒక రేఖ మాత్రమేకాదు, అది ఒక సాంఘిక ఉద్యమం. అది వ్యక్తి ప్రతిభను ప్రోత్సహించింది. రాజకీయ, ఆర్థిక ప్రజాస్వామ్యానికి దారి తీసింది. సాంప్రదాయకమైన పద్ధతులను భగ్న పరిచింది. జాతీయాధికారానికి సముచిత గౌరవంతో స్థానికమైన స్వయం నిర్ణయ విధానాలను పెంపొందించింది.

ఐరోపాలో గాని, ఇతర దేశాలలోగాని సరిహద్దు అంటే కేవలం రాజ్యానికి అంతమని అర్థం. కాని అమెరికన్‌ల సరిహద్దు వారి స్వేచ్ఛకు, విస్తరణకు, అభివృద్ధికి గీటు రాయి. సారవంతమైన విశాల ప్రదేశాలనుంచి మానవుల వ్యాపకానికే, తమ తమ చట్టాలను నిర్మించుకొనేందుకు అనువైన భూ ఖండమది. కాబట్టే అమెరికా చరిత్రలో పశ్చిమ దిశ వ్యాప్తి ఘట్టము విశేష ప్రాముఖ్యం పొందింది.

## 10.5. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు

1. మానిఫెస్ట్ డెస్టినీ అనగానేమి ? 19వ శతాబ్దపు ప్రథమ భాగంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల పశ్చిమ దిశ విస్తరణను వివరింపుము.
2. 19వ శతాబ్దిలో అమెరికా పశ్చిమ దిశ విస్తరణకు కారణాలు, ఫలితాలు వివరింపుము ?

### 2) లఘు వ్యాస సమాధాన ప్రశ్నలు

1. టర్నర్ సిద్ధాంతము ప్రాముఖ్యతను వివరింపుము ?

## 10.6. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America - A History
2. C.P. Hill - A History of the United States
3. Parlit and Drummond - Our Nation from its Creation
4. David Donald - A History of American life and Thought
5. Richard M. Morris - Enyclopeedia of American History
6. Turner - The Frontier of American History
7. Hans Kohn - American Nationalism
8. Morrison & Commager - The Growth of American Republic (2 Vols)
9. Novins & Commager - A Short History of the United States
10. Charles and Mary Beard - Rise of American Civilisation.


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 11

# 1) మార్టిన్ వ్యాన్ బ్యూరెన్, 2) హెన్రీ హ్యారిసన్, 3) జాన్ టైలర్, 4) మెక్సికో యుద్ధము (1846-1848)

## 11.0. లక్ష్యం :

మెక్సికో యుద్ధానికి గల కారణాలు, యుద్ధ గమనము, ఫలితాలతో బాటు, జాక్సన్ తరువాత అధ్యక్షులయిన బూరెన్, హ్యారిసన్, టైలర్‌ల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**


11.1. మార్టిన్ వ్యాన్ బూరెన్ (1837-1841)

11.2. విలియం హెన్రీ హ్యారిసన్ (1841)

11.3. జాన్ టైలర్ (1841-1845)

11.4. మెక్సికో యుద్ధము (1846 - 1848)

11.4.1. మెక్సికో యుద్ధ కారణాలు

11.4.1.1. టెక్సాస్ సమస్య

11.4.1.2. లోన్‌స్టార్ రిపబ్లిక్

11.4.1.3. టెక్సాస్ విలీనీకరణ - సమస్యలు

11.4.1.4. యుద్ధ యత్నాలు

11.4.2. యుద్ధ గమనం

11.4.3. గ్వాడలూప్ హిడాల్గో సంధి

11.4.4. యుద్ధ ఫలితాలు

11.5. నమూనా ప్రశ్నలు

11.6. చదువదగిన గ్రంథాలు


## 11.1. మార్టిన్ వ్యాన్ బ్యూరెన్ (1837 - 1841) :

న్యూయార్క్ నగరానికి చెందిన బ్యూరెన్ 1837లో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఎనిమిదో అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. జాక్సన్ తొలి అధ్యక్ష పాలనా కాలంలో బ్యూరెన్ అతని విదేశాంగ కార్యదర్శిగా ఉన్నాడు. జాక్సన్ రెండో అధ్యక్ష పాలనా కాలంలో ఉపాధ్యక్షుడుగా ఉన్నాడు. జాక్సన్ ప్రవేశపెట్టిన 'స్పాయిల్స్' విధానానికి రూపుదిద్దినవాడు బ్యూరెన్. డెమోక్రటిక్ పార్టీకి సంబంధించిన రాజకీయపుటెత్తుగడలను, తంత్రాలను చాకచక్యంగా నడపగల అతని సామర్ధ్యం వల్ల అతనిని 'గుంట నక్క' అని, 'చిరు మాంత్రికుడు, అని పిలిచారు. బ్యూరెన్ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో దేశంలో అంతకు ముందెన్నడూ ఏర్పడని ఆర్థిక మాంద్యం ఏర్పడింది. స్వేచ్ఛా వ్యాపారంలో విశ్వాసం,

రాజ్యాంగాన్ని తు.చ. తప్పక అనుసరించాలనే సిద్ధాంతంలో నమ్మకం ఉన్న బ్యూరెన్ వ్యాపార రంగంలో, ఆర్థిక రంగంలో ఈ మాంద్యాన్ని అరికట్టడానికి ప్రభుత్వపరంగా ఎలాంటి గట్టి చర్యలూ తీసుకోలేదు.

ఆర్థిక మాంద్యాన్ని కొంతవరకు అదుపులో పెట్టడానికి, ఉపశమనం కలిగించడానికి బ్యూరెన్ 'డైవోర్స్ బిల్లును ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ నిధులను ప్రయివేటు బ్యాంకుల నుంచి వేరు చేసి (డైవోర్స్), వాటికి రాజకీయాలలో ప్రమేయం లేకుండా చేయడమే ఈ బిల్లు సారాంశం. బ్యూరెన్ ప్రతిపాదించిన ఈ 'డైవోర్స్' పథకం ప్రజానురంజకం కాలేదు. కాంగ్రెస్‌లోని డెమోక్రాట్‌పార్టీ ప్రతినిధులు కూడా దీనిని గట్టిగా సమర్థించలేదు. చివరకు బ్యూరెన్ నిర్మాణాత్మక పాలనా సామర్థ్యానికి ఒకే ఒక నిదర్శనంగా, 1840లో కాంగ్రెస్ 'స్వతంత్ర కోశాగార బిల్లు'ను ఆమోదించింది. జాతీయ బ్యాంకును పునరుద్ధరించాలనే సంకల్పం ఉన్న విగ్ పార్టీవారు ఈ చట్టాన్ని వ్యతిరేకించారు. 1841లో ఈ చట్టాన్ని రద్దు చేయించారు.

## 11.2. విలియం హెన్రీ హ్యారిసన్ (1841) :

1840 అధ్యక్ష ఎన్నికల్లో విగ్ పార్టీ బ్యూరెన్‌కు ప్రత్యర్థిగా హ్యారిసన్‌కు నిలబెట్టింది. విగ్ పార్టీ ఉపాధ్యక్ష పదవికి జాన్ టైలర్‌ను నిలబెట్టింది. హ్యారిసన్ ఒహియో రాష్ట్రానికి, టైలర్ వర్జీనియా రాష్ట్రానికి చెందినవారు. విగ్ పార్టీ వారు తమ ప్రచారంలో హ్యారిసన్‌ను సామాన్య పౌరుడైన అభ్యర్థిగా చిత్రించి బ్యూరెన్‌ను ధనిక వర్గానికి చెందినవాడనీ, తాగుబోతని, తిండిపోతని దుష్ప్రచారం చేశారు. విగ్ పార్టీ ఎత్తుగడలు ఫలించాయి. హ్యారిసన్‌కు 234 ఓట్లు రాగా, బ్యూరెన్‌కు 60 ఓట్లు మాత్రమే వచ్చాయి. హ్యారిసన్ విజయం వల్ల విగ్ పార్టీకి ఎలాంటి లాభం చేకూరలేదు. అప్పటికే 69 సంవత్సరాల వయసు గల హ్యారిసన్ విగ్ పార్టీ ప్రముఖులతో కార్యదర్శి మండలిని ఏర్పరచాడు. డేనియల్ వెబ్‌స్టర్‌ను విదేశాంగ కార్యదర్శిగా నియమించాడు. హ్యారిసన్ అధ్యక్ష పదవిని స్వీకరించిన తరువాత మొదటి నెలరోజుల కాలంలో అధిక భాగం ఉద్యోగ నియామకాలకై ఎగబడిన అభ్యర్థులకు సర్దుబాటు చేయటం సరిపోయింది. హెన్రీ క్లె మొదలైన ఎగ్ పార్టీ నాయకులు హ్యారిసన్‌కు తమ చేతిలో కీలు బొమ్మను చేసి ఆడించవచ్చునని ఆశించారు. కాని వీరి ఆశలన్నీ నిరాశలు చేసి 1841 ఏప్రిల్ 4న హారిసన్ అకస్మాత్తుగా మరణించాడు. అధ్యక్ష పదవికి ఎన్నికైన హ్యారిసన్ నాలుగు నెలలు మాత్రమే అధ్యక్షుడుగా ఉన్నాడు.

## 11.3. టైలర్ :

హ్యారిసన్ ఆకస్మాత్తుగా మరణించడంతో ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన జాన్ టైలర్ 1841లో అధ్యక్షుడైనాడు. దక్షిణాదికి చెందిన టైలర్ ప్రధానంగా ఉత్తరానికి చెందిన పార్టీ అయిన విగ్ పార్టీ అమలు పరచాలనుకొన్న ప్రణాళికలోని అంశాలలో చాలా వాటిని తీవ్రంగా ప్రతిఘటించాడు. స్వతంత్ర కోశాగార చట్టాన్ని తాత్కాలికంగా రద్దు చేయడంలో రక్షణ సుంకాలు పెంచటంలో విగ్‌పార్టీ హెన్రీక్లే నాయకత్వంలో విజయం సాధించింది. పడమటి ప్రాంతంలోని భూములలో స్థిరపడ్డవారు ఆ భూములను ఇతరుల నుంచి పోటీ లేకుండా తక్కువ ధరలకు కొనుక్కోవటానికి వీలుగా, తాము చిరకాలంగా వాంఛిస్తున్న 'ప్రీ ఎంప్షన్' చట్టాన్ని కాంగ్రెస్‌లో తమ మెజారిటీ ద్వారా సాధించుకొన్నారు. కాని,జాతీయ బ్యాంకు పునరుద్ధరించి మూడవ జాతీయ బ్యాంకు స్థాపించడానికి విగ్ పార్టీ వారు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఆమోదం పొందిన 'ఫిస్కల్ బ్యాంకు' బిల్లును టైలర్ వీటో చేశాడు. ఆ బిల్లునే కొంత మార్చి విగ్ పార్టీ 'ఫిస్కల్ కార్పోరేషన్ బిల్' అను పేరుతో మరలా ప్రవేశపెట్టి కాంగ్రెస్ ఆమోదాన్ని పొందింది. టైలర్ దీనికి కూడా వీటో చేశాడు. అలాగే రాష్ట్రాల అభివృద్ధి కార్యక్రమాలకు జాతీయ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందచేయటానికి విగ్ పార్టీ ప్రవేశపెట్టిన బిల్లులన్నింటినీ టైలర్ వీటో చేశాడు. విగ్ పార్టీలోని అతివాదులు టైలర్ చర్యల పట్ల ఆగ్రహించారు. చివరకు ఏమీ చేయలేక టైలర్‌ను విగ్ పార్టీ నుంచి బహిష్కరించారు.

## 11.4. మెక్సికో యుద్ధము (1846 - 1848) :

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు దక్షిణ సరిహద్దులో మెక్సికో దేశం ఉన్నది. ఈ మెక్సికో దేశం చాలా కాలం పాటు స్పెయిన్ నిరంకుశ పాలనలో ఉండి, తరువాత విముక్తి పోరాటం జరిపి 1821లో స్వతంత్రమయింది. ఆర్థిక, సైనిక ప్రయోజనాల దృష్టిలో అమెరికా సంయుక్త

రాష్ట్రాలు మెక్సికో స్వాతంత్ర్యాన్ని గుర్తించింది. **1844** అధ్యక్ష ఎన్నికలలో అమెరికన్ ప్రజలలో పెల్లుబికిన 'రుజువైన గమ్యము' (ఉత్తర అమెరికా నంతటిని తమ ఆధీనంలోనికి తెచ్చుకొని జాక్సన్ ప్రజాస్వామ్యమును విస్తరింపజేయవలెననే భావము), పశ్చిమ దిశగా విస్తరించి నూతన ప్రాంతాలను పొందవలెననెడి సరిహద్దు ప్రాంతం వారికి ఆకాంక్ష, పసిఫిక్ తీర ప్రాంతాన్ని తమ ఆధిపత్యంలోనికి తెచ్చుకొని దూర ప్రాచ్య దేశాలలో వర్తక వ్యాపారాలు సాగించాలనే లక్ష్యం పశ్చిమదిశగా విస్తరించుటకు ప్రేరేపించెను. ఈ విస్తరణలో మెక్సికో ఆధీనంలోని ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించుటలో మెక్సికోతో యుద్ధం తప్పనిసరి అయింది. ఈ యుద్ధము అమెరికా సంయుక్త రాష్ట్రాల 11వ అధ్యక్షుడయిన జేమ్స్ కె. పోక్ కాలంలో **(1845-49)** జరిగింది.

**11.4.1. మెక్సికో యుద్ధ కారణాలు :** అమెరికా సంయుక్త రాష్ట్రాలకు, మెక్సికోకు మధ్య ఏర్పడిన కొన్ని తగాదాల కారణంగా **1846**లో రెండు దేశాలకు మధ్య యుద్ధం ప్రారంభమయింది. అవి :

**11.4.1.1. టెక్సాస్ సమస్య :** అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని కెనెక్టికట్ రాష్ట్రానికి చెందిన మోసెస్ ఆస్టిన్ అనే సాహసికుడు మెక్సికో సరిహద్దు ప్రాంతంలో వ్యాపారం సాగిస్తూ స్పానిష్ వారసత్వాన్ని సంపాదించాడు. ఆనాడు మెక్సికో స్పెయిన్ అధికారంలో వుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాల అనుమతితో మోసెస్ ఆస్టిన్ మెక్సికోలోని ఉత్తర ప్రాంతమయిన టెక్సాస్‌లో ఒక వలసను ప్రారంభించే పథకాన్ని రూపొందించాడు. అతడు చనిపోయిన తరువాత అతని కుమారుడు స్టీఫెన్ ఆస్టిన్ ఆ పథకాన్ని కొనసాగించాడు. ఈ పథకానికి స్టీఫెన్ **1823**లో మెక్సికో ప్రభుత్వం నుంచి ఆమోదం పొందాడు. వలస స్థాపించడానికై ఒక నామ మాత్రపు మొత్తానికి విస్తారమైన ప్రదేశాన్ని అతడు మెక్సికో ప్రభుత్వం నుంచి పొందాడు. తరువాత మెక్సికో ప్రభుత్వం టెక్సాస్‌లో వలసల స్థాపనను ప్రోత్సహించింది. టెక్సాస్‌లో భూమి సారవంతమయింది. శీతోష్ణస్థితి అనుకూలంగా ఉంది. వ్యవసాయ భూములు చాలా చౌకగా లభిస్తాయి. ఫలితంగా చాలా మంది అమెరికన్ పౌరులు అక్కడ స్థిరపడ్డారు. **1820** నాటికి **20** వేల మంది అమెరికన్లు అక్కడ స్థిరపడ్డారు.

మెక్సికో ప్రభుత్వం నుంచి వలసల స్థాపనకై భూమిని పొందిన భూకామందులు **1826**లో తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించే ప్రయత్నాలు చేశారు. మెక్సికో ప్రభుత్వం సైన్యాలను పంపి తిరుగుబాటును అణచివేసింది. ఇదే సమయంలో మెక్సికోలోని అమెరికన్ దౌత్యాధికారులు టెక్సాస్‌ను కొనటానికి ప్రయత్నాలు చేశారు. ఈ రెండు సంఘటనల వల్ల అమెరికా సంయుక్త రాష్ట్రాలు టెక్సాస్‌ను ఆక్రమించటానికి కుట్రలు పన్నుతున్నట్లు మెక్సికో ప్రభుత్వం అనుమానించింది. ఫలితంగా **1830**లో ఇక మీదట టెక్సాస్‌లో అమెరికన్లు స్థిరపడటానికి వీలులేదని మెక్సికో ప్రభుత్వం ఒక ఉత్తరువు జారి చేసింది. అంతేగాక టెక్సాస్‌లోని ప్రజలను అదుపులో ఉంచడానికి అక్కడ సైన్యాన్ని నిలిపివేసింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల, టెక్సాస్ సరిహద్దు వెంబడి వ్యాపార సుంకాలు వసూలు చేయడానికి నిశ్చయించింది. దీంతో తమ హక్కులు తిరిగి సంపాదించుకోవటానికి స్టీఫెన్ ఆస్టిన్ ద్వారా టెక్సాస్ ప్రజలు మెక్సికో ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. కాని అది పూర్తిగా విఫలమయింది. ఈలోగా **1834**లో మెక్సికోలో శాంతా అన్నా ప్రభుత్వాన్ని చేజిక్కించుకొని టెక్సాస్ ప్రజల మీద మెక్సిలో అధికారాన్ని తీవ్రం చేయదలచాడు.

**11.4.1.2. లోన్‌స్టార్ రిపబ్లిక్ :** టెక్సాస్ ప్రజలు **1835**లో ఒక కూటమిగా ఏర్పడి మెక్సికో ప్రభుత్వానికి ప్రతిఘటించటానికి నిశ్చయించుకొన్నారు. వీరు తమ ప్రతిఘటనకు అమెరికా సంయుక్త రాష్ట్రాల సహాయాన్ని ఆర్ధించటానికై ఆస్టిన్‌ను పంపారు. ఈ కూటమి 'లోన్ స్టార్ రిపబ్లిక్ అనే పేరులో టెక్సాస్‌ను స్వతంత్ర గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. దీనికొక రాజ్యాంగాన్ని రూపొందించింది. టెక్సాస్ సైన్యానికి శ్యామ్ హూస్టన్‌ను సర్వసైన్యాధ్యక్షుడుగా ఎన్నుకొంది. **1836**లో టెక్సాస్ మీద దండెత్తి వచ్చిన శాంతా అన్నాను టెక్సాస్ సేనలు ఓడించి పట్టుకొన్నాయి. టెక్సాస్ స్వాతంత్ర్యాన్ని గుర్తించటానికి అంగీకరించి, శాంతా అన్నా విడుదల పొందాడు.

అమెరికా సంయుక్త రాష్ట్రంలో అంతర్భాగం కావటానికి టెక్సాస్ ప్రభుత్వం ప్రయత్నించింది. కాని అప్పుడు అధ్యక్షుడుగా వున్న ఆండ్రూ జాక్సన్ తటస్థ వైఖరిని అవలంభించాడు. **1837**లో స్వతంత్ర టెక్సాస్ రిపబ్లిక్ ఉనికిని అధికార పూర్వకంగా గుర్తించాడు. **1841**లో మెక్సికోకి శాంతా అన్నా అధ్యక్షుడయి టెక్సాస్‌మీద పగతీర్చుకుంటానని ప్రకటించాడు. **1842** టెక్సాస్‌కు అధ్యక్షుడైన శ్యాం హూస్టన్ తమ దేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించటానికై బ్రిటన్, ఫ్రాన్స్‌ల సహాయాన్ని అర్ధించాడు. దీనితో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భయాందోళనలు రేకెత్తించాయి. రాజకీయంగా, ఆర్ధికపరంగా టెక్సాస్‌ను ఒక ఐరోపా దేశం మీద ఆధారపడేటట్లు చేయటం మన్రో సిద్ధాంతానికి విరుద్ధం.

అందుచే అప్పుడు అధ్యక్షుడుగా వున్న టైలర్, అతని విదేశాంగ కార్యదర్శి ఐన ఉప్‌షర్‌లు 1843లో టెక్సాస్‌ను అమెరికా సంయుక్త రాష్ట్రాలలో విలీనం చేయటానికి చర్యలు తీసుకోవటం ప్రారంభించారు. కాని ఉత్తర, దక్షిణాల మధ్య స్పర్ధ టెక్సాస్ విలీనాన్ని ఆలస్యం చేసింది. 1844లో ఉప్‌షర్ మరణించగా కాల్హూన్ విదేశాంగ కార్యదర్శి అయ్యాడు. ఇతడు టెక్సాస్ విలీనం బానిసత్వ వ్యవస్థను విస్తరింపచేయటానికే అని ప్రకటించాడు. ఫలితంగా 1844లో టెక్సాస్ విలీనీకరణ సంధి సెనేట్‌లో వీగిపోయింది.

**11.4.1.3. టెక్సాస్ విలీనీకరణ - సమస్యలు :** టెక్సాస్ విలీనీకరణను, ఆరెగాన్ ఆక్రమణను సమర్థిస్తూ డెమోక్రాటిక్ పార్టీ 1845 అధ్యక్ష ఎన్నికల్లో ప్రచారం చేసింది. ఆ పార్టీ అభ్యర్థి జేమ్స్ నాక్స్ పోల్క్ అధ్యక్షుడుగా ఎన్నికయినందువల్ల టెక్సాస్‌ను అమెరికా సంయుక్త రాష్ట్రాలలో చేర్చటం తథ్యమని తేలిపోయింది. అందువల్ల పోల్క్ అధ్యక్షపదవీ ప్రమాణ స్వీకారానికి ముందుగానే, అధ్యక్షుడు టైలర్ 1845 జనవరిలో టెక్సాస్ విలీనీకరణను ఒక మూకుమ్మడి తీర్మానంగా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టాడు. ఇటువంటి తీర్మానం నెగ్గటానికి కాంగ్రెస్ ఉభయ సభలలో సాధారణ మెజారిటీ చాలు. ఈ తీర్మానాన్ని కాంగ్రెస్ ఆమోదించింది. ఈ తీర్మానానికి టెక్సాస్ తన సమ్మతిని తెలిపింది. 1845 డిసెంబర్‌లో టెక్సాస్ అమెరికా సంయుక్త రాష్ట్రాలలో విలీనమయింది. మెక్సికో అమెరికా సంయుక్త రాష్ట్రాలతో దౌత్య సంబంధాలు విరమించింది.

టెక్సాస్ విలీనీకరణతో మెక్సికో, అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సంబంధాలు క్లిష్టమైనాయి. టెక్సాస్ విలీనీకరణ తరువాత టెక్సాస్ దక్షిణ సరిహద్దు విషయమై మెక్సికోతో వివాదము తలెత్తినది. రియోగ్రాండ్ నది తమ దక్షిణ సరిహద్దుని టెక్సాస్ ప్రజలు వాదించారు. ఈ సరిహద్దు న్యూసెస్ నది అని మెక్సికో వాదించింది. ఈ విషయంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలపై యుద్ధం చేస్తానని మెక్సికో ప్రకటించింది.

రియోగ్రాండ్ - న్యూసెస్ నదుల మధ్య గల విస్తార ప్రాంతముతో బాటు కాలిఫోర్నియాను కూడా సంపాదించడానికి అధ్యక్షుడు పోల్క్ ప్రయత్నించాడు. కాని సైనిక బలంలో అపార విశ్వాసం, జాతీయాభిమానం గల మెక్సికో ఇలాంటి ప్రతిపాదనలకు వేటికీ అంగీకరించలేదు. టెక్సాస్‌లో లాగానే కాలిఫోర్నియా ప్రాంతానికి కూడా వలసదారులను పంపి దానిని కూడా కబళించే యత్నంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఉందని మెక్సికో విశ్వసించింది.

మెక్సికోకు, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు మధ్య మరో సమస్య కూడా ఉంది. అది మెక్సికో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెల్లించవలసిన రుణాలను సకాలంలో చెల్లించలేకపోవటం. మెక్సికోలో జరిగిన అనేక తిరుగుబాట్ల సందర్భంగా అమెరికన్లు తమ ఆస్తులను నష్టపడ్డారు. కొందరు ప్రాణాలను పోగొట్టుకొన్నారు. వీటికి నష్టపరిహారం చెల్లించడానికి మొదట్లో మెక్సికో నిరాకరించింది. అధ్యక్షుడు జాక్సన్ నష్టపరిహారం వసూలుకై యుద్ధ నౌకలను మెక్సికో మీదికి పంపిస్తానని బెదిరించాడు. చివరకు మెక్సికో రెండు మిలియన్ డాలర్లను వాయిదాలతో చెల్లించటానికి ఒప్పుకొంది. కాని మూడు వాయిదాలు చెల్లించిన తర్వాత దాని ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారడంతో మిగిలిన వాయిదాలను చెల్లించటం మానివేసింది.

అమెరికా సంయుక్త రాష్ట్రాలు, మెక్సికోల మధ్య గల ఈ సమస్యలను పరిష్కరించటానికై అధ్యక్షుడు పోల్క్ 1845లో జాన్ స్లిడెల్‌ను మెక్సికోకు దూతగా పంపాడు. డెమోక్రాటిక్ పార్టీలో ప్రముఖ రాజనీజ్ఞుడైన స్లిడెల్ లూయిసియానా రాష్ట్రానికి చెందినవాడు. మెక్సికో, టెక్సాస్‌ల మధ్య రియోగ్రాండ్ నదిని సరిహద్దుగా అంగీకరిస్తే మెక్సికో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెల్లించవలసిన రుణాలను రద్దు చేసేటట్లు స్లిడెల్ తన సంప్రదింపులలో మెక్సికో ప్రభుత్వానికి తెలపవచ్చు. కాలిఫోర్నియాను కొనడానికి కూడా స్లిడెల్ ప్రయత్నించాలి. స్లిడెల్‌తో ఎటువంటి సంప్రదింపులు చేయడానికి మెక్సికో అంగీకరించలేదు.

**11.4.1.4. యుద్ధ యత్నాలు :** మెక్సికో దాడుల నుంచి టెక్సాస్ ప్రజలను రక్షించే నెపంతో పోల్క్ సైన్యాన్ని జకరీ టెయిలర్ నాయకత్వంలో న్యూసెస్ నదీ తీరానికి పంపాడు. న్యూసెస్ - రియోగ్రాండ్ నదుల మధ్య ఉన్న వివాదాస్పదమైన ప్రదేశాన్ని ఆక్రమించమని టెయిలర్‌ను పోల్క్ ఆదేశించాడు. టెయిలర్ సైన్యాలను ఎదిరించడానికి మెక్సికో అధ్యక్షుడు పరెడెస్ సేనలను పంపించాడు. 1846 ఏప్రిల్ 25న రెండు సేనల మధ్య పోరాటం జరిగింది. ఈ పోరాటంలో కొందరు అమెరికన్లు చనిపోయినారు, మరికొందరు గాయపడ్డారు. మెక్సికో చర్య వల్ల యుద్ధం ఏర్పడిందనీ, పోల్క్ కాంగ్రెస్‌కు పంపిన సందేశంలో పేర్కొన్నాడు. 1846 మే 31న కాంగ్రెస్ మెక్సికోపై యుద్ధం ప్రకటించింది.

**11.4.2. యుద్ధ గమనం :** అమెరికన్లు కాలిఫోర్నియా, న్యూమెక్సికో, మెక్సికో అను మూడు ప్రాంతాలపై దండయాత్రలు చేశారు. యుద్ధానికి ప్రధాన లక్ష్యమైన కాలిఫోర్నియాలో చిన్న పోరాటాలు మాత్రమే జరిగాయి. జాన్ సి. ఫ్రెమాంట్ నాయకత్వంలో కొంత మంది అమెరికన్ సాహసికులు కాలిఫోర్నియాలోనికి చొచ్చుకొనిపోయి, అక్కడ నివసిస్తున్న వారిని మెక్సికోపై తిరుగుబాటు చేసి కాలిఫోర్నియాను స్వతంత్ర గణతంత్ర రాజ్యంగా ప్రకటించవలసిందిగా ప్రోత్సహించారు. శాక్రమెంటో వ్యాలీలో నివసిస్తున్న అమెరికన్లు ఫ్రెమాంట్‌తో సహకరించి మెక్సికో అధికారాన్ని కాదని స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. ఇదే సమయంలో కియర్నీ ఒక సైనిక దళంలో పోయి న్యూమెక్సికోను ఆక్రమించాడు. అక్కడి నుండి కాలిఫోర్నియాకు నడిచాడు. త్వరలోనే అమెరికన్లు కాలిఫోర్నియా రాష్ట్రానంతా ఆక్రమించారు. దక్షిణ కాలిఫోర్నియాలో నివసించే మెక్సికన్లు తిరుగుబాటు చేయగా వారిని అణచడం జరిగింది. కాలిఫోర్నియాను జయించిన వివిధ విజేతల మధ్య తగాదాలు ఏర్పడటంతో అక్కడ సైన్యం సైనిక ప్రభుత్వాన్ని నెలకొల్పింది.

మెక్సికోలో మెక్సికన్ సేనలు అమెరికన్లతో భీషణంగా పోరాడాయి. కాని ఆ సేనలలో సామర్థ్యం లోపించింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల సైన్యాలను జకరీ టెయిలర్, విన్‌ఫీల్డ్ స్కాట్ అనే ఇద్దరు సమర్థులైన సేనాపతులు నడపారు. రెండు మార్గాల ద్వారా అమెరికన్ సేనలు మెక్సికోలో ముందుకు నడిచాయి. మెక్సికో సైన్యాలకు శాంతా అన్నా నాయకత్వం వహించాడు. టెయిలర్ రియోగ్రాంట్ నదిని దాటి మాంటెర్రె వద్ద మెక్సికో సైన్యాలను ఓడించాడు. తరువాత బ్యూనాలిస్టా వద్ద జరిగిన యుద్ధంలో శాంతా అన్నా మీద టెయిలర్ ఘన విజయం సాధించాడు. స్కాట్ మెక్సికో ప్రధాన రేవు పట్టణమయిన వెరాక్రజ్ మీద దాడి చేసి దానిని ఆక్రమించాడు. అక్కడ నుంచి ముందుకు సాగి సెర్రగార్డ్ వద్ద శాంతా అన్నాను ఓడించాడు. తరువాత స్కాట్ మెక్సికో సిటిని వశం చేసుకొన్నాడు. శాంతా అన్నా విడిచి పారిపోయాడు. మెక్సికోలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

**11.4.3. గూడలూప్ హిడాల్గో సంధి :** అమెరికా సంయుక్త రాష్ట్రా అధ్యక్షుడు పోల్క్ ఇచ్చిన ఆదేశాల మేరకు, విన్‌ఫీల్డ్ స్కాట్ అనుమతితో నికోలస్ ట్రస్ట్ అనే విదేశాంగ శాఖ కార్యదర్శి 1848 ఫిబ్రవరిలో నూతనంగా ఏర్పడిన మెక్సికో ప్రభుత్వంలో గ్రూడలూప్ హిడాల్గో సంధిని చేసుకొన్నాడు. మార్చిలో ఈ సంధిని సెనేట్ ఆమోదించింది. ఈ సంధి ప్రకారం :

1. ఆరి జోనాతో కూడిన న్యూ మెక్సికో ప్రాంతాన్ని, కాలిఫోర్నియాను మెక్సికో ప్రభుత్వం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఇచ్చి వేసింది.
2. రియోగ్రాండ్ నది దక్షిణ సరిహద్దుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో టెక్సాస్ విలీనీకరణను మెక్సికో ప్రభుత్వం అంగీకరించింది.
3. వీటికి బదులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు 15 మిలియన్ డాలర్లను మెక్సికోకు చెల్లించడానికి అంగీకరించింది.
4. మెక్సికో ప్రభుత్వం నష్టపరిహారం క్రింద అమెరికన్ పౌరులకు చెల్లించవలసిన 3,25,000 డాలర్లను చెల్లించే బాధ్యత వహించింది.
5. ఈ సంధి ఫలితంగా ఒక మిలియన్ చదరపు మైళ్ళ ప్రాంతం కొత్తగా అమెరికన్ భూభాగంలో చేరింది.
6. ఈ సంధికి అనుబంధంగా 1853లో గాడ్సెన్ కొనుగోలు జరిగింది. గాడ్సెన్ కొనుగోలు వల్ల చేరిన భూభాగంలో ఉత్తర అమెరికా ఖండంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు భౌగోళికమైన సంపూర్ణత్వం సంతరించుకొంది.

**11.4.4. యుద్ధ ఫలితాలు :** మెక్సికో యుద్ధం క్లుప్తంగా జరిగింది. కాని దాని ఫలితాలు గణనీయమైనవి. అవి :

1. ఈ యుద్ధం వలన అమెరికా సంయుక్త రాష్ట్రాలు 10 లక్షల చదరపు మైళ్ళు అదనంగా పొందగల్గింది.
2. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు, మెక్సికోకు మధ్య గల సరిహద్దు వివాదము, రుణాల చెల్లింపు సమస్య పరిష్కారమయింది.
3. లాటిన్ అమెరికన్ దేశాలలో అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజకీయ ఉద్దేశాలను గురించి అనేక సందేహాలను, అనుమానాలను రేకెత్తించింది. మన్రో సిద్ధాంతం పేరుతో తన ప్రయోజనాలను సిద్ధింప చేసుకోవటానికై అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఎలాంటి బల ప్రయోగానికైనా, ఎలాంటి దురాక్రమణకైనా పాల్పడగలదని దక్షిణ అమెరికాలోని ఇతర రాజ్యాలకు సూచించినది. ఇటువంటి

దురాక్రమణకు బలియైన మొదటి దేశం మెక్సికో. నాటి నుంచి మధ్య అమెరికా, దక్షిణ అమెరికాలోని రాజ్యాలు అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజనీతి ధ్యేయాలను శంకించసాగాయి.

4. ఈ యుద్ధ ఫలితంగా కొత్త ప్రదేశాలు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో చేరటంతో 1820 మిస్సోరి రాజీ తర్వాత సద్దుమణిన సమస్యగా వున్న బానిస వ్యవస్థ విస్తరణా సమస్య మళ్ళీ తీవ్రరూపం దాల్చింది. మెక్సికో నుంచి సంపాదించిన ఏ ప్రాంతంలో కాని బానిసత్వం అనుమతించరాదని ప్రతినిధి విల్మొట్ 1846లో కాంగ్రెస్‌లో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ తీర్మానం వల్ల బానిసత్వ సమస్యకు సంబంధించి ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య చిరకాలంగా ఉన్న పోరాట వైఖరి ఒక్కసారిగా మరింత శక్తిని పుంజుకొని విజృంభించి చివరకు 1861లో అంతర్యుద్ధానికి దారి తీసింది. మెక్సికో యుద్ధారంభములో పేల్చబడిన తుపాకీ గుండ్లే అంతర్యుద్ధానికి నాంది అని థామస్ ఎ. బైలీ అంటాడు.

## 11.5. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు

1. మెక్సికో యుద్ధమునకు గల కారణాలు, ఫలితాలను వర్ణింపుము ?

### 2) లఘు వ్యాస సమాధాన ప్రశ్నలు

1. గ్వాడలూప్ హెడాల్గో సంధి
2. వ్యాన్ బూరెన్
3. హ్యారిసన్
4. జాన్ టైలర్

## 11.6. చదువదగిన గ్రంథాలు :

1. H.B. Parkes - The United States of America - A History
2. H.W. Elson - History of the United States of America
3. Novins & Commager - A Short History of the United States
4. K. Rajayyan - History of the United States.

- డా॥ వి.కె. మోహన్

పాఠం - 12

# బానిస సమస్య - అబ్రహాం లింకన్ (1809-1861-1865)

## 12.0. లక్ష్యం :

అబ్రహం లింకన్ తొలి జీవితం, అతను అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడుగా బానిసల విముక్తి కోసం చేసిన సేవలు వివరించటం మరియు అతని మరణమును వివరించుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం

### విషయసూచిక :


12.1. పరిచయం - తొలి జీవితం

12.2. అమెరికా అధ్యక్షుడగుట

12.3. బానిసత్వ నిర్మూలనకు కృషి

12.4. బానిసత్వ రద్దుకు కృషి

12.5. లింకన్ మరణం

12.6. నమూనా ప్రశ్నలు

12.7. చదువదగిన గ్రంధాలు


## 12.1. పరిచయము - తొలి జీవితం :

అబ్రహం లింకన్ కెంట్రక్ రాష్ట్రంలో 1809 లో జన్మించినాడు. చిన్నతనంలో తల్లిదండ్రులతో ఇల్లినాయిస్‌లో జీవించాడు. తల్లిదండ్రులు చాలా పేద కుటుంబమునకు చెందినవారు. అందువలన కష్టించి పని చేయటం నేర్చుకొన్నాడు. లా చదివి న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించినాడు. తన ప్రజ్ఞా పాటవాలతో మంచి పేరు సంపాదించుకొన్నాడు. ఇల్లినాయిస్ నందు విగ్ పక్షానికి నాయకుడు గాను, కాంగ్రెస్ నందు సభ్యుడుగా మంచి రాజకీయ అనుభవము సంపాదించినాడు. మితముగా మాట్లాడటం, సుదీర్ఘ ఆలోచన చేయుట, చింతాక్రాంతుడుగా కన్పించటం, కన్పించని కారుణ్యం, నిరాడంబరత లింకన్ సహజ లక్షణాలు.

## 12.2. అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడగుట - 1861 :

మంచి రాజకీయానుభవము గడించిన అబ్రహం లింకన్, రిపబ్లికన్ పార్టీ యొక్క గుర్తింపు, అభిమానం సంపాదించినాడు. 1860లో రిపబ్లికన్ పార్టీ చికాగోలో సమావేశమై లింకన్‌ను అధ్యక్ష అభ్యర్థిగా ఎంచుకొన్నది. ఎంతో మంది అగ్రనాయకులను త్రోసిపుచ్చి లింకన్ పేరు ప్రతిపాదించుట పార్టీ ఆశ్చర్యాన్ని కలిగించినది. ప్రాంతీయ విభేదాలతో సతమతమవుతున్న దేశానికి పటిష్టమైన నాయకత్వం అందించగలడని పార్టీ అభిప్రాయపడింది. అటు డెమోక్రాటిక్ పక్షంలో ఒక వర్గం స్టీఫెన్ గగ్లస్‌ను, మరొక వర్గం జాన్ బ్రెకిన్ రిడ్జ్‌ని అభ్యర్థిగా ఎంపిక చేసినది. యూనియన్ పార్టీ జాన్‌బెన్‌ను నామినేట్ చేసినది. జరిగిన అధ్యక్ష ఎన్నికలలో ఈ నలుగురికి ఈ విధంగా ఎలక్టోరల్ ఓట్లు లభించినాయి. లింకన్ 180, బ్రెకిన్ రిడ్జ్ - 72, జాన్ బెన్ - 39, గగ్లస్ - 12. ఒక్క న్యూజెర్సి మినహా అన్ని స్వేచ్ఛా రాష్ట్రాలు లింకన్ను ఎన్నుకొన్నాయి. దక్షిణంలో 10 రాష్ట్రాలు ఇతనికి ఓటు వేయలేదు. 1861 మార్చి నెలలో అబ్రహం లింకన్ అమెరికా అధ్యక్షుడయినాడు.

## 12.3. బానిసత్వ నిర్మూలనకు కృషి :

అబ్రహం లింకన్ అధ్యక్షుడయిన నాటికి ఉత్తర రాష్ట్రాలవారు దక్షిణ రాష్ట్రాలవారు బానిసత్వం, బానిసత్వ వ్యవస్థపై పోరాడుతున్నారు. కొందరు బానిసత్వాన్ని నిర్మూలించాలని, కొందరు బానిసత్వాన్ని కొనసాగించాలని, మరి కొందరు అది ప్రజాభీష్టమునకు వదలి వేయాలని వాదించుచున్న రోజులవి. బానిస సమస్య విషయంలో లాలస్యం చేయుటగాని, వాయిదా వేయుటగాని తగదని తక్షణ పరిష్కారం గైకొనాలని లింకన్ ప్రకటించినాడు. సగం బానితస్వం గల రాజ్యంగాను, సగం స్వేచ్ఛా రాజ్యాంగాను వుంచటం తగదని, అయితే బానిసత్వ రాజ్యంగాను, లేదా బానిసత్వ రహిత రాజ్యంగాను వుంచాలని భావించాడు. మానవులందరు సమానులేనని, ప్రాణ రక్షణ స్వేచ్ఛ, సౌఖ్యం నీగ్రోలకు ఉండాలి. బానిసత్వం అమెరికా లక్ష్యాలకు స్వాతంత్ర్య ప్రకటనకు విరుద్ధమని వాదించినాడు. సంయుక్త రాజ్యాలు సమాఖ్యను పరిరక్షించాలని వాంఛించినాడు. రాజ్యాంగ రీత్యా దక్షిణ రాష్ట్రాలు సమాఖ్య నుండి విడిపోయే హక్కు లేదని వాదించాడు.

అబ్రహం లింకన్ యొక్క నాలుగు సంవత్సరాల పదవీకాలం అంతర్యుద్ధంతోనే గడిచిపోయింది. ఎన్ని సమస్యలున్నను, అంతర్యుద్ధం జరుగుచున్నప్పటికి సమాఖ్యను పరిరక్షించటమే తన పవిత్ర ధర్మంగా భావించినాడు. ఫెడరల్ చట్టాలు అమలు జరపటానికి 75,000 మంది వాలంటీర్లను నియమించినాడు. ఫెడరల్ ప్రాంతాలను రక్షించటానికి సైన్యాలను పంపాడు. కొత్త పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచాడు. విడిపోయిన రాష్ట్రాల రేవులను దిగ్బందం చేసినాడు. అసమర్దులను తొలగించి యోగ్యులకు ఉన్నత పదవులిచ్చినాడు. సర్వోన్నత సైన్యాధిపతిగా తనకున్న సైనిక అధికారాలను గెలుపు కోసం వినియోగించాడు.

## 12.4. బానిసత్వ రద్దు ప్రకటన - 1862 :

అంతర్యుద్ధానంతరం బానిసత్వాన్ని రద్దు చేయాలని అమెరికన్లు లింకన్‌పై వత్తిడి తేసాగారు. యూనియన్ సైన్యాలు, సమాఖ్య సైన్యంపై విజయం సాధించనిదే ఇది సాధ్యం కాదని లింకన్ భావించినాడు. 1862 నాటికి యూనియన్ సైన్యాలు పలు యుద్ధ రంగాలలో విజయాలు సాధించాయి. దీనిలో తమకు గెలుపు తధ్యమని కనుక బానిసత్వాన్ని నిర్మూలించటానికి, దానికి సంబందించిన ప్రకటనలు చేయటానికి ఇది తగిన సమయమని భావించినాడు. 1862 జూలైలో బానిత్వ విముక్తి ప్రకటనను రూపొందించి మంత్రిమండలిలో ప్రవేశపెట్టినాడు. సెప్టెంబరు 22న అధికారికంగా ప్రకటించినాడు. ఈ బానిసత్వ విముక్తి ప్రకటన రాజ్యాంగంలో 13వ సవరణగా లిఖించబడినది.

## 12.5. అబ్రహం లింకన్ రెండవ మారు అధ్యక్షుడగుట - 1865 :

అంతర్యుద్ధం జరుగుచున్న కాలంలో 1864లో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. రిపబ్లికన్‌లు, డెమోక్రాట్లులో ఒక వర్గం నేషనల్ యూనియన్ కన్వెన్షన్‌గా ఏర్పడి, లింకన్ తమ అభ్యర్థిగా ఎన్నుకొన్నారు. డెమొక్రటిక్ పార్టీ మెక్లిన్‌ను అభ్యర్తిగా నిర్ణయించినది. న్యూజెర్సీ, టలావెర్, కెంటకీ, ఈ మూడు రాష్ట్రాలు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు లింకన్‌ను ఎన్నుకొన్నాయి. 1865 మార్చి 4న లింకన్ రెండవ సారి పదవీ స్వీకారోత్సవమునాడు తన ఉపన్యాసంలో "ద్వేషాసూయలకు అతీతంగా అందరి పట్ల ఔదార్యంతో తాను ధర్మ సమ్మతమైన, శాశ్వతమైన శాంతిని సాధించటానికి కృషి చేస్తానని" చిరస్మరణీయమైన మాటలు పలికినాడు. 1865 ఏప్రిల్ నాటికి అంతర్యుద్ధము ముగింపు దశకొచ్చినది. సమాఖ్య సర్వ సైన్యాధ్యక్షుడు రాబర్ట్ లీ 1865 ఏప్రిల్ 9న అపోమాటక్స్ కోర్టు హౌస్‌లో జనరల్ గ్రాంట్‌నకు లొంగిపోయినాడు. ఏప్రిల్ 26న జాన్సన్, షెర్మన్‌కి లొంగిపోయినాడు. సమాఖ్య అధ్యక్షుడయిన జెఫర్‌సన్ డేలిస్ కొండలలోకి పారిపోగా ఖైదీగా పట్టుకొన్నారు. ఈ విధంగా జాన్సన్, జెఫర్‌సన్‌లను బంధించటముతో సమాఖ్యసైన్యాలు లొంగిపోయినవి. దీనితో అంతర్యుద్ధము ముగిసింది.

## 12.6. లింకన్ మరణం :

యుద్ధం పరిసమాప్తి కావటంతో యూనియన్ రక్షించబడినది. యుద్ధానంతరము అనేక సమస్యలు ఉత్పన్నమయినవి. ఈ సమస్యలను సమర్ధవంతముగా పరిష్కరించటానికి తగిన విశాల హృదయుడు, ఔదార్యుడు, సానుభూతిపరుడు, నిజాయితి పరుడు, జాతీయ అంతర్జాతీయ

ఖ్యాతి గాంచి, దేశం యెడల అపారమైన పూర్తి అవగాహన కలిగిన మహోన్నత వ్యక్తిత్వం గలిగిన మహోన్నత వ్యక్తి అబ్రహం లింకన్ దుర్మరణం పాలయినాడు. యుద్ధం ఇంకా పూర్తిగా సమాప్తి కాకముందే ఏప్రిల్ 14, 1865 వాషింగ్టన్ పోర్టు నాటకశాలలో ఒక నాటకమును తిలకిస్తుండగా, సమాఖ్య పట్ల సానుభూతి కలిగిన ఉన్మాది జాన్ విల్కిస్ భూత్ అనునతడు, అబ్రహం లింకన్ కూర్చున్న ప్రత్యేక ప్రాంగణములోనికి ప్రవేశించి శిరస్సు వెనుక వైపు నుండి శిరస్సు పై కాల్పులు జరిపినాడు. వెంటనే స్పృహ కోల్పోయిన లింకన్ మరుసటి రోజు (15-4-1865) మరణించినాడు. లింకన్ని కోల్పోయిన అమెరికా అంతర్గతంగా అనేక తీవ్ర పరిణామాలను ఎదుర్కొన్నది. ఏ ఏ రంగాలలో ఎంతెంత కోల్పోయిందో ఆ పరిణామాలు స్పష్టంగా చేసాయి.

## 12.7. నమూనా ప్రశ్నలు :

1. అబ్రహం లింకన్ బానిసత్వ నిర్మూలనకు చేసిన కృషి ఎట్టిది.
2. అబ్రహం లింకన్ జీవితం అతను సాధించిన ఘనకార్యాలను వివరించుము.

## 12.8. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America : A History
2. Novins & Commagar - A Short History of the United States of Amierica
3. C.P. Hill - A History of United States
5. Telugu Academy Publication - America Samyukta Rastrala Charitra.


- యం.జె. జయప్రసాద్

పాఠం - 13.1

# అంతర్యుద్ధము - యుద్ధానంతర పునర్నిర్మాణము

## 13.1.0. లక్ష్యం :

అంతర్యుద్ధానికి దారి తీసిన పరిస్థితులు, సంఘటనలు, యుద్ధ గమనము ఫలితాలను తెలియచేయుటయే ఈ పాఠం యొక్క లక్ష్యము.

## విషయసూచిక :


13.1.1. పరిచయము

13.1.2. అంతర్యుద్ధానికి కారణాలు

- 13.1.2.1. ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య గల ఆర్థిక వైరుధ్యాలు
- 13.1.2.2. బానిస(త్వ) సమస్య
- 13.1.2.3. 1850 రాజీ పద్ధతి
- 13.1.2.4. 1854 కాన్సాస్ - నెబ్రాస్కా చట్టం
- 13.1.2.5. రాజకీయ పార్టీల పాత్ర
- 13.1.2.6. అంతర్యుద్ధానికి దారి తీసిన సంఘటనలు

13.1.3. అంతర్యుద్ధ గమనము

13.1.4. అంతర్యుద్ధంలో ప్రధాన ఘట్టాలు

13.1.5. బానిసత్వం రద్దు ప్రకటన

13.1.6. 1864 అధ్యక్ష ఎన్నికలు

13.1.7. 1865 అబ్రహం లింకన్ అస్తమయము

13.1.8. 1865 యుద్ధ సమాప్తి

13.1.9. ఫలితాలు

13.1.10. నమూనా ప్రశ్నలు

13.1.11. చదువదగిన గ్రంథాలు


## 13.1.1. పరిచయము :

అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో 1861-1865 మధ్య కాలంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య జరిగిన పోరాటములే అంతర్యుద్ధముగా మారినది. అమెరికా సంయుక్త రాష్ట్రాల నుండి దక్షిణ రాష్ట్రాలు విడిపోవాలనే ఆలోచన ఆ రాష్ట్రాలు ఓడిపోవుట ద్వారా వీగిపోయినది. దీని ద్వారా సంయుక్త రాష్ట్రాల ఐక్యత కాపాడబడినది. దీని ఫలితంగా దేశంలో బానిస వ్యవస్థ నిర్మూలించబడినది. అమెరికా ఆర్థికాభివృద్ధి ఊపందుకొంది.

## 13.1.2. అంతర్యుద్ధానికి కారణాలు :

అంతర్యుద్ధమునకు గల కారణములు వివిధ రకములుగా కలవని చరిత్రకారులు అభిప్రాయపడిరి. కొందరు ఆర్థిక కారణములని భావించిరి. కొందరు ఉత్తర దక్షిణముల మధ్య వ్యత్యాసాలు, వైరుధ్యాలు, విభిన్న ఆర్థిక వ్యవస్థలని, మరికొందరు సాంఘిక, నైతిక, బానిస సమస్యలు కారణములని భావించినారు. అందువలన పైన తెలిపినవన్నియు అంతర్యుద్ధమునకు కారణములుగా భావించవచ్చు.

**13.1.2.1. ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య గల ఆర్థిక వైరుధ్యాలు :** అమెరికా సంయుక్త రాష్ట్రాల అభివృద్ధి జీవన విధానంలో వచ్చిన మార్పులు, అనేక ప్రాంతాలలో ఏర్పడిన తగవులే అంతర్యుద్ధము. అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఒక గణతంత్ర్య రాజ్యంగా ఏర్పడినప్పటి నుండి ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య విభిన్నమైన ఆర్థిక ప్రయోజనాల అవసరాలు ఏర్పడినాయి. అవి క్రమముగా రాజకీయ వివాదాలుగా మారినవి. దక్షిణంలో మొదట నుండి వ్యవసాయం ఆర్థిక వ్యవస్థగా మారినది. ఇచ్చట ప్రముఖమైన ఆర్థిక ఆదాయపు పంట పత్తి, అంతర్యుద్ధ కాలంలో ఇచ్చట ఒకే ఒక ప్రముఖ నగరం న్యూ ఆర్లియన్స్ మాత్రమే. ఉత్తర ప్రాంతం మొదటి నుండి పారిశ్రామికంగా అభివృద్ధి చెందినది. అందువలన అనేక పట్టణాలు, నగరాలు ఏర్పడినాయి. పట్టణ పారిశ్రామిక నాగరికత ఏర్పడినది. 1850 నాటికి దక్షిణంలో కంటె ఉత్తరంలో ఎక్కువ రైలు మార్గాలు ఏర్పడినాయి. దేశంలో పారిశ్రామిక ఉత్పత్తులకు పోటీ లేకుండా ఉండుటకు ఉత్తరం దిగుమతులపై రక్షణ సుంకాలు విధించాలని కోరగా దక్షిణం అందుకు వ్యతిరేకించినది. ఉత్తరం పటిష్టమైన జాతీయ బ్యాంకు విధానాన్ని సమర్థించగా, దక్షిణం అందుకు నిరసించినది. ప్రయాణ సౌకర్యాల అభివృద్ధికి, ఇతర అంతరంగిక అభివృద్ధి కార్యక్రమాలకు జాతీయ ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని ఉత్తరం వాదించగా, రాష్ట్రాలలోని అభివృద్ధి కార్యాక్రమాలకు జాతీయ ప్రభుత్వం నిధులు వినియోగించుట దక్షిణం నిరసించినది. ఈ వైరుధ్యాలు చివరకు ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య శతృత్వంగా మారి అంతర్యుద్ధమునకు దారి తీసినవి.

**13.1.2.2. బానిసత్వ సమస్య :** అంతర్యుద్ధం ప్రజ్వరిల్లటానికి ప్రముఖ కారణం బానిసత్వ సమస్య. బానిస వ్యవస్థ - బానిసత్వం. ఇది కాక మరే యితర సమస్య అయిన అమెరికాలో అంతర్యుద్ధమునకు దారి తీసెడిది కాదు. ఈ సమస్య చాలా క్లిష్టమైనది, జఠిలమైనది.

దక్షిణ రాష్ట్రాలు తమ వ్యవసాయక క్షేత్రాలలోను, తోటలలో పని చేయటానికి ఎక్కువ సంఖ్యలో బానిసలను పోషించేవారు. బానిసత్వాన్ని పోషించటం పాపం కాదని, అది ప్రభుత్వం బాధ్యతని దక్షిణ రాష్ట్రాలు వాదించినాయి. ఉత్తర రాష్ట్రాలలో బానిసత్వం లేదు. బానిసలు లేరు. బానిసత్వం పాపమని, దానిని రద్దు చేయాలని ఉత్తర రాష్ట్రాల వారు వాదించారు. ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రారంభమయిన వాదోపవాదాలు వారి మధ్య తీవ్రమైన శతృత్వాన్ని సృష్టించాయి. బానిసత్వాన్ని రద్దు చేయాలనే ఉద్యమం 1815 నాటికే ఆరంభమయినది. అనేక మంది ఉద్యమంను ఆయా ప్రాంతాల నుండి ప్రారంబించినారు. న్యూజెర్సి నుండి బెంజమిన్, న్యూ ఇంగ్లాండ్‌లో విలియం లాయిడ్ గారిసన్, విండెన్ పిలిప్స్, థియోడర్ పార్కర్, ఓహియోలో థియోడర్ వెల్ట్, జేమ్స్ బర్ని, న్యూయార్క్‌లో ఆర్థర్ టప్పన్, స్మిత్. 1840 నాటికి దాదాపు 2000 సంఘాలు, 2,00,000 సభ్యులతో ఈ ఉద్యమం బలపడినది. బానిసత్వం క్రైస్తవమత ధర్మానికి, అమెరికన్ల ఆదర్శానికి విరుద్ధమని ఉత్తరాదివారు భావించారు. మానవులందరూ సమానులేనని వాదించారు. బానిసత్వాన్ని సమర్థించే అమెరికన్ రాజ్యాంగం తన పవిత్రతను కోల్పోయిందని, ఇదొక పాప కార్యమని, స్వప్రయోజనాలు కలిగి వున్న స్వార్థకార్యమని భావించినారు. ఇటువంటి రాజ్యాంగ నిర్మితమైన సమాఖ్య నుండి ఉత్తర రాష్ట్రాలు విడిపోవాలని విజ్ఞప్తి చేసినాయి.

బానిసత్వాన్ని, నిర్మూలించటానికి రాజ్యాంగ పద్ధతులు పాటించాలా, లేక బల ప్రయోగం చేయరా ? అనే విషయంలో నాయకుల్లో బేదాభిప్రాయాలు పొడసూపినవి. ఉత్తరాది వారు బానిసత్వ వ్యతిరేఖ ఉద్యమమును ప్రోత్సహింపగా, దక్షిణాదివారు బానిసత్వ వ్యవస్థలో ఇతరుల ప్రమేయం సహించమని ఉద్ఘాటించినారు. ఈ రెండు ప్రాంతాల వారు తమ వాదాలను 1836లో కాంగ్రెస్ ముందుంచినారు. ఉత్తర రాష్ట్రాలలో నీగ్రోలకు రాజకీయ హక్కులు ప్రసాదించటానికి ఇష్టపడనివారు తమ బానిస వ్యవస్థను ఖండించే హక్కు ఎలా కలిగి వున్నారని దక్షిణ రాష్ట్రాలవారు ప్రశ్నించినారు. బానిసత్వాన్ని కాపాడుకునే విషయంలో దక్షిణ రాష్ట్రాలవారు రెండు అభిప్రాయాలు కలిగి వున్నారు. ఒకటి - కేంద్ర ప్రభుత్వం బానిసత్వాన్ని కనుక కాపాడితే సమాఖ్యలోనే కలిసియుండాలని, రెండవది - అలా కాని పక్షంలో సమాఖ్య నుండి విడిపోయి దక్షిణ రాష్ట్రాలలో ప్రత్యేక సమాఖ్య ఏర్పాటు చేయుట. దీని ద్వారా బానిస వ్యవస్థకు రక్షణ కలుగుతుందని భావించినారు.

**13.1.2.3. 1850 రాజీ పద్ధతి :** ఇది ఇలా వుండగా 1848లో నాలుగు పశ్చిమ ప్రాంతాలు, ఒరెగాన్,కాలిఫోర్నియా,న్యూమెక్సికో, ఉటా, సంయుక్త రాష్ట్రాలలో క్రొత్తగా చేరినాయి. వీటిలో బానిసత్వాన్ని అనుసరించాలా వద్దా అని దక్షిణ ఉత్తర ప్రాంతాలు ఘర్షణ పడ్డాయి. డెమోక్రాటిక్ పార్టీ నేత హెన్రీక్లే 1850లో ఒక రాజీ పద్ధతిని సూచించినాడు. దీని ప్రకారం 1. కాలిపోర్నియాను బానిసత్వం లేని రాష్ట్రంగా చేర్చుకోవాలి. 2. మిగిలిన మూడు రాష్ట్రాలలో బానిసత్వ విధానంపై ఎలాంటి ఆంక్షలు విధింపబడరాదు. దీనిని మొదట రెండు ప్రాంతాల వారు తిరస్కరించి చివరకు ఆమోదించినారు. దీనినే 1850 రాజీ పద్ధతి అందురు. ఈ పద్ధతిని కాంగ్రెస్ ఆమోదించినది.

**13.1.2.4. 1854 కాన్సాక్ - నెబ్రాస్కా చట్టం :** 1850 రాజీ పథకం ఎంత కాలం నిలబడలేదు. ఈ కాలంలో ప్రభుత్వం ఒక రైలు మార్గాన్ని నిర్మించాలని తలపెట్టినది. ఈ మార్గం పై రెండు ప్రాంతాల వారు కలహానికి దిగినారు. చికాగో నుండి నిర్మించాలని ఉత్తర రాష్ట్రాలవారు. న్యూ ఆర్లియన్స్ నుండి మెక్సికో సరిహద్దు వెంబడి లాస్ ఏంజిల్స్ వరకు మార్గాన్ని నిర్మించాలని దక్షిణాదివారు పట్టుబడినారు. ఈ రైలు మార్గాన్ని నెబ్రాస్కా - కాన్సాస్ రాష్ట్రాల గుండా వెళుతుంది. అందువలన ఈ మార్గాన్ని నెబ్రాస్కా - కాన్సాస్ మార్గంగా వ్యవహరించినారు. ఈ రాష్ట్రాల ప్రజలు తమ ఓటు ద్వారా బానిసత్వం ఉండాలా ? వద్దా ? అనే నిర్ణయం తీసుకోవాలి. ఈ షరతులతో సెనేటర్ డగ్లస్ కాంగ్రెస్ నందు ప్రవేశపెట్టినాడు. అందుకు కాంగ్రెస్ ఆమోదించి కాన్సాస్ - నెబ్రాస్కా చట్టాన్ని నిర్మించింది. కాన్సాస్ ప్రక్క రాష్ట్రం మిస్సోరి. మిస్సోరి బానిసత్వ రాష్ట్రం. కాన్సాస్‌లో కూడా బానిసత్వం ఉండాలని మిస్సోరి భావించింది. లేని ఎడల, మిసేరిలో బానిసలు కాన్సాస్‌కు పారిపోయే ప్రమాదముంది. అందుకు దక్షిణంలోని రాష్ట్రాలు సమర్ధించినాయి. కాని ఉత్తర రాష్ట్రాలు కాన్సాస్‌ను బానిసత్వానికి దూరంగా ఉంచాలని అనేక సంఘాలు ఏర్పాటు చేసినాయి. 1855 లో తుది నిర్ణయం చేయటానికి కాన్సాస్‌లో ఎన్నికలు ప్రారంభమయినాయి. ఎన్నిక రోజున మిస్సోరి ప్రజలు అధిక సంఖ్యలో కాన్సాస్‌లో ప్రవేశించి బానిసత్వానికి అనుకూలంగా ఓటు వేసినారు. ఈ ఓటింగ్‌ను రద్దు చేయటానికి అధ్యక్షుడు పియర్స్ ఏ చర్య గైకొనలేదు. బానిసత్వాన్ని వ్యతిరేకించినవారు కాన్సాస్‌లో పోటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినారు. రెండు వర్గాల మధ్య వైషమ్యాలు పెరిగినాయి. ఆయుధాలు సమకూర్చుకొన్నారు. ఇరు పక్షాల మధ్య కలహాలు చెలరేగినవి. పరస్పరం చంపుకొన్నారు. దాదాపు రెండు వందల మంది చంపబడ్డారు. ఈ చట్టం అమెరికా రాజకీయా రంగాన్ని రక్తంలో ముంచి వేసినవి, రాజకీయ వాదులు చేసిన గొప్ప తప్పిదమని చరిత్రకారులు భావించినారు.

**13.1.2.5. రాజకీయ పార్టీల పాత్ర :** అమెరికాలో సాంఘిక, ఆర్థిక విభేదాలు కలిగిన రాజకీయ పార్టీలు 1840 నుండి బానిస వ్యవస్థ పై తమ దృష్టిని సారించాయి. దీని కారణంగా రాజకీయ పార్టీలు అవతరించటం, అంతరించటం జరిగింది. 1840 కాన్షెన్స్, కాటన్ అనే పార్టీలు అవతరించాయి. ఈ రెండు పార్టీలు ఒకప్పుడు 'విగ్స్' అనీ పార్టీలో వర్గాలుగా నున్నాయి. కాన్సాస్ బానిసత్వాన్ని ఖండించింది. కాటన్ సమర్థించినది. డెమోక్రటిక్ పార్టి బానిసత్వ విషయంలో రెండుగా చీలినది. లిబరల్ డెమోక్రాట్స్ బానిసత్వాన్ని రద్దు గావించాలని కోరగా, దక్షిణ డెమోక్రాట్లు బానిసత్వాన్ని కొనసాగించాలని కోరినారు. కాన్సాస్ - నెబ్రాస్కా చటాన్ని ప్రతిఘటించడానికి ఉత్తరాదివారు రిపబ్లికన్ పార్టీని స్థాపించినారు. బానిసత్వ నిర్మూలనే ధ్యేయంగా ఈ పార్టీలోనికి విగ్ డెమోక్రాట్ సభ్యులు చేరినారు. తర్వాత 'నేటివ్ అమెరికా' అనే పార్టీ ఆవిర్భవించినది.

1857లో అధ్యక్షుడుగా బుఖావిన్ దక్షిణాది వారిలో చేతులు కలిపి బానిసత్వాన్ని తొలగించి ప్రజాసార్వభౌమత్వాన్ని ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేసాడు. కాని అమలు జరుపబడలేదు. ఇదే కాలంలో సుప్రీంకోర్టు 'డ్రెడ్ స్కాట్' వ్యాజ్యంలో తీర్పు చెపుతూ బానిసత్వం అమెరికాలో చట్టబద్ధమైదని ప్రకటించినది. డ్రెడ్ స్కాట్ అనునతడు మిస్సోరి రాష్ట్రానికి చెందిన బానిస, తన యజమానితో పాటు బానిసత్వంలేని ఇల్లినాయిస్ ప్రాంతంలో 1834 నుండి నాలుగేళ్ళపాటు నివసించి వచ్చాడు. అందుకు బానిసత్వం లేని ప్రదేశం నుండి వచ్చాడు కాబట్టి, బానిసత్వం నుంచి విముక్తి కల్పించమని సుప్రీంకోర్టును అభ్యర్థించినాడు. అందుకు సుప్రీంకోర్టు, బానిసలు ఆస్తి కిందకు వస్తారు. అమెరికన్ పౌరులు తమ ఆస్తిని ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికైనా తీసుకొని వెళ్ళవచ్చు. కాబట్టి బానిసత్వం చట్టబద్ధమైనదని వక్కాణించినది. బానిసత్వాన్ని సమర్ధించేవారు, వ్యతిరేకించేవారు సమాన బలాన్ని కలిగి వున్నందున కాంగ్రెస్ ఈ సమస్యను పరిష్కరించలేకపోయినది.

**13.1.2.6. అంతర్యుద్ధానికి దారి తీసిన సంఘటనలు :** బానిసత్వాన్ని వ్యతిరేకించిన సెనేటర్ బ్రోడెరిక్‌ను ఒక దక్షిణ ప్రాంతం వాడు తుపాకీతో కాల్చి చంపినాడు. కాన్సాస్‌లో బానిసత్వ వ్యతిరేఖ వర్గనాయకుడైన బ్రౌన్‌ను ఫెడరల్ పోలీసులు కాల్చి చంపారు. దీంతో ఉత్తర ప్రాంతీయులు రెచ్చిపోయి ఆయుధాలు చేపట్టి దక్షిణ రాష్ట్రాలపై 1860లో ఆయుధ దండయాత్రను ప్రారంభించినారు.

ఉత్తర రాష్ట్రాలలోని న్యాయస్థానాలు బానిసత్వాన్ని సమర్థించే ఫెడరల్ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసినాయి. దీనితో రెచ్చిపోయిన దక్షిణ రాష్ట్రాలు సమాఖ్యనుండి విడిపోవటానికి నిర్ణయించినాయి. దీనిని నివారించటానికి ఫెడరల్ ప్రభుత్వం సైనిక బలాన్ని వినియోగించినది. ఇంతటితో 1861లో అంతర్యుద్ధం ప్రారంభమయినది.

## 13.1.3. అంతర్యుద్ధ గమనము :

అమెరికా అంతర్యుద్ధానికి ప్రముఖ కారణం బానిసత్వ సమస్య. 1860 నాటికి మరింత క్షీణించినాయి. దీని వలన ఉత్తర దక్షిణ రాష్ట్రాలు తీవ్ర శతృత్వాన్ని పెంచుకున్నాయి. 1860 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి అబ్రహం లింకన్ తన ముగ్గురు ప్రత్యర్థులను ఓడించి అత్యధిక మెజారిటీలో గెలుపొందినాడు. ఫలితం వెలువడిన వెంటనే రిపబ్లికన్ పార్టీ బానిసత్వాన్ని వ్యతిరేకించి, రద్దు చేయాలనే నిర్ణయంతో ఉంది కాబట్టి బానిస వ్యవస్థ రద్దు అగుననే భయంతో దక్షిణాది వారు యూనియన్ నుండి విడిపోవటానికి నిర్ణయించుకొన్నారు. 1860లో దక్షిణ కరోలినా, 1861లో మిసిసిపి, ఫ్లోరిడా, అంజామా, జార్జియా, లూసియానా, టెక్సాస్ విడిపోయినాయి. విడిపోయిన ఏడు రాష్ట్రాలు అంచామాలోని మాండ్‌గొమంలో సమావేశమై ఒక సమాఖ్యగా ఏర్పడి రాజ్యాంగాన్ని రూపొందించుకొని జఫరసన్ డెవిస్‌ను అధ్యక్షునిగా ఎన్నుకొన్నాయి. రాజ్యాంగ రీత్యా విడిపోయే హక్కు రాష్ట్రాలకు కలదని దక్షిణ రాష్ట్రాలు వాదించాయి. కాని విడిపోయిన రాష్ట్రాలను తిరిగి యూనియన్‌లో చేర్చటానికి రాజకీయ నాయకులు చేసిన కృషి నిష్ప్రయోజనమైనది.

కాని అధ్యక్షుడు లింకన్ యూనియన్ నుండి రాష్ట్రాలు విడిపోయే హక్కు లేదని, యూనియన్‌ని పరిరక్షించే బాధ్యత తనదని ప్రకటించినాడు. 1861 లో దక్షిణ కరోలినాలోని సుంటిర్, ఫ్లోరిడాలోని పీకెన్స్ దుర్గాలను రక్షించటానికి లింకన్ సైన్యాలను పంపినాడు. అయితే సమాఖ్య సైన్యం లింకన్ సైన్యాలను ఓడించి సుంటర్ దుర్గాన్ని వశపరుచుకొన్నది. దక్షిణ సమాఖ్య 75,000 మంది వాలంటీర్లను నియమిస్తు సమాఖ్య రేవు పట్టణాలను దిగ్బంధం చేయమని ఉత్తర్వులిచ్చినది. దీనితో అంతర్యుద్ధం ప్రారంభమయినది. ఇదే సమయాన మరి నాలుగు బానిసత్వ రాష్ట్రాలు - వర్జినియా, ఉ. కరోలినా, టెన్నిసీ, అర్కంపాస్‌లు దక్షిణ సమాఖ్యలో జేరినవి.

## 13.1.4. అంతర్యుద్ధంలో ప్రధాన ఘట్టాలు :

యూనియన్ పక్షంవారు, దక్షిణ సమాఖ్యవారు బలాబలాలను సమీకరించుకొన్నారు. ఆర్థికముగాను, సైనికముగాను తమ శక్తులను సమీకరించుకొన్నారు. ఇరువర్గాలలో సమర్థులైన సైనికాధికారులు గలరు.

అంతర్యుద్ధము ప్రారంభమయిన తరువాత ప్రధాన సంఘటన 1861లో జరిగినది. యూనియన్ సైన్యము మాక్డొవెన్ నాయకత్వంలో వర్జీనియాను ముట్టడించినది. సమాఖ్య సైన్యంలో బ్యూగర్డ్, జోసవ్ జాన్స్టన్ నాయకత్వంలో యూనియన్ సైన్యంను ప్రతిఘటించినది. బుల్‌రన్ అనుచోట జరిగిన పోరాటంలో యూనియన్ సైన్యం ఓడినది. యూనియన్ నౌకాదళం సమాఖ్య రేవులను దిగ్బంధం చేసినది. దీనితో ఆహార వస్తువుల కొరత విడిపోయిన రాష్ట్రాలలో ఏర్పడినది. దీనికి ప్రతిగా ఉత్తరాది వారికి చెందిన 200 పడవలను ధ్వంసం చేసినది.

1862 లో పశ్చిమ రంగంలో యూనియన్ సైన్యం జార్జి ధామస్ ఆధ్వర్యంలో సమాఖ్య సైన్యాన్ని తూర్పు కెంటకి నుండి తరిమి కొట్టినది. మరియొక భాగమైన యూనియన్ సైన్యం యులిసెస్ గ్రాంట్ ఆధిపత్యంలో పశ్చిమ టెన్నిసిలో చాలా ప్రాంతాన్ని ఆక్రమించినది. తర్వాత గ్రాంట్‌షిలో యుద్ధ రంగంలో సమాఖ్య సైన్యాన్ని ఓడించి మెఫిస్‌ను వశపర్చుకొంది. దీనితో మిసిసిపిలో విశాల ప్రాంతం యూనియన్‌కు దక్కినది. రాబర్ట్‌లీ ఆధ్వర్యంలోనున్న సమాఖ్య దళాలు మెక్లిన్ సైన్యాలను ఓడించి పారద్రోలాయి. మనాసన్ యుద్ధ క్షేత్రంలో యూనియన్

సైన్యాలను ఓడించి పోటోమాక్‌ను దాటి పెన్సిల్‌వేనియాపై దాడి చేసినాడు. అయితే ఆంటిటం రంగాలలో మెక్లిన్ చేతిలో ఓడిపోయి వెనుకకు మరలినాడు.

## 13.1.5. బానిసత్వ రద్దు ప్రకటన :

ఒక ప్రక్క అంతర్యుద్ధము జరుగుతు వుండగా, అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ అమెరికా సంయుక్త రాష్ట్రాలలో బానిసత్వాన్ని రద్దు చేస్తూ ఒక చారిత్రాత్మకమైన ప్రకటనను 22-9-1862న చేసాడు. ఇక ప్రకటన విడిపోయిన రాష్ట్రాలకు కూడా వర్తించునని 1-1-1863 నుండి అమలులోనికి వచ్చునని దేశంలోని బానిసలందరు విముక్తి పొంది స్వేచ్ఛ పొందుదురని తెలిపినది. దీనితో అమెరికాలోని బానిసత్వ వ్యవస్థ పూర్తిగా శాశ్వతంగా స్వస్తి చెప్పబడినది. 1865లో ఇది 13వ సవరణగా రాజ్యాంగంలో చేర్చబడినది.

1863లో యూనియన్ సైన్యం ఛాన్సలర్స్ నిలీ యుద్దంలో లీ చేతిలో చిత్తుగా ఓడి గెట్బెన్‌బర్గ్ క్షేత్రంలో లీ సైన్యానికి జార్జిమిడ్ ఆధ్వర్యంలోని యూనియన్ సైన్యానికి మూడు రోజులు భీకర సంగ్రామం జరిగినది. పలు విజయాలు సాధించిన లీ ఈ యుద్దంలో ఓడినాడు. పశ్చిమ తీరంలో యూనియన్ సైన్యాలు గ్రాంట్ ఆధ్వర్యంలో సమైఖ్య సైన్యాన్ని మట్టుబెట్టి విక్సబర్గ్ నగరాన్ని ప్రవేశించినాడు. దీనిలో మిసిసిపి నది పైన ఆధిపత్యం సంపాదించింది. సమాఖ్య సైనిక ఆహార సరఫరాలు ఆగిపోయాయి. నవంబరులో చట్టక రంగంలో గ్రాంట్ మరొక విజయం సాధించినాడు.

1864 మార్చిలో జనరల్ గ్రాంట్ యూనియన్ సైన్యాలకు ఉన్నతాధికారిగా నియమించబడినాడు. విలియం షర్మన్ పశ్చిమ దళపతిగా నియమించబడ్డాడు. సమాఖ్య సైన్యం నష్‌లీ రంగంలో ఓడింది. హెర్మన్ అట్లంటాను వశపర్చుకొని జార్జియా వైపు పురోగమించాడు. మే నెలలో గ్రాంట్ వర్జీనియా వైపు పురోగమించాడు. రిచ్ మండ్ వద్ద గ్రాంట్‌కి, లీకి మధ్య భీకర యుద్ధం జరిగినది. లీ సైన్యం బాగా నష్టపడినది.

## 13.1.6. 1864 అధ్యక్ష ఎన్నికలు :

1864లో అధ్యక్ష పీఠానికి జరిగిన ఎన్నికలలో లింకన్ తిరిగి ఎన్నికయినాడు. 1864 మార్చి 4 పదవీ స్వీకారం చేసినాడు. శాంతి న్యాయం కోసం అందరు సమిష్టిగా కృషి చేయాలని ఈ మహావ్యక్తి ఉద్బోధించినాడు. కాని యుద్ధానంతరం అమెరికాను చూడటానికి మహానుభావుడు నోచుకోలేదు.

## 13.1.7. 1865 లింకన్ అస్తమయము :

1865 ఏప్రిల్ 14న అబ్రహం లింకన్ వాషింగ్టన్‌లోని పోర్టు థియేటర్ ఉత్సవాన్ని తిలకిస్తుండగా దక్షిణ సమాఖ్య అభిమాని జాన్ విక్స్ బూత్ అనునతడు లింకన్‌పై కాల్పులు జరపగా మరుసటి దినాన అనగా ఏప్రిల్ 15న మరణించినాడు. యావత్ అమెరికా దిగ్భ్రాంతి చెందినది. ఆయన స్మృతి అమెరికాలోనే కాక ప్రపంచంలోనే నిలిచిపోయినది.

## 13.1.8. 1865 యుద్ధ సమాప్తి :

దక్షిణ సమాఖ్య సైనిక నాయకుడు జనరల్ రాబర్ట్ లీ 1865 ఏప్రిల్‌లో అపోమాటక్స్ కోర్టు హైస్‌లో జనరల్ గ్రాంట్‌నకు లొంగిపోయినాడు. ఏప్రిల్ 26న జాన్సన్, షెర్మన్‌కి లొంగిపోయినాడు. యుద్ధం ముగిసింది. యూనియన్ జయించింది. 1865 మే 26న దక్షిణ సమాఖ్య సైన్యం ఆయుధాలు విసర్జించినది.

### 13.1.9. ఫలితాలు :

1. మానవత్వానికి విరుద్ధమైన బానిసత్వం నిర్మూలించబడినది.
2. అమెరికా సమైఖ్యంగా మనుగడ సాగించటానికి ఇది తోడ్పడినది.
3. ఈ యుద్ధంలో 10 లక్షల మంది ప్రాణాలు కోల్పోయినారు.
4. 1500 కోట్ల డాలర్లు ఖర్చుయినది. ప్రజలు పై పన్నుల భారం పెరిగినది.
5. అమెరికా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక ఉత్పత్తులు పడిపోయినవి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినవి. దీనిని సరిదిద్దటానికి దేశ వ్యాప్తంగా పునఃనిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయినవి.

### 13.1.10. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)

1. అంతర్యుద్ధమునకు గల కారణములు వివరించుము.
2. అంతర్యుద్ధ గమనమును వివరించుము.
3. అంతర్యుద్ధమునకు గల కారణములు, ఫలితములు వివరించుము.
4. అంతర్యుద్ధము నందలి ప్రధాన ఘట్టములు వివరించుము.

### 13.1.11. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America : A History
2. Thomas A Bartey - The American Pagent
3. C.P. Hill - A History of United States of America
4. Telugu Acadamy - America Samyuktha Rastrala Charithra
5. Richard B Morris - Encyclopedia of American History


**- ఎం. జె. జయప్రసాద్**

పాఠం - 13.2.

# అంతర్యుద్ధానంతర పునర్నిర్మాణము

## 13.2.0. లక్ష్యం :

అంతర్యుద్ధం తరువాత సంభవించిన పరిణామాలను, పునర్నిర్మాణ విధానాలను, పథకాలను, వాటి ఫలితాలను వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయసూచిక :


13.2.1. పరిచయము - పరిణామాలు

13.2.2. లింకన్ పునర్నిర్మాణపు ప్రణాళిక

13.2.3. జాన్సన్ ప్రణాళిక

13.2.4. పద్నాలగవ రాజ్యాంగ సవరణ

13.2.5. కాంగ్రెస్ ప్రణాళిక

13.2.6. అతివాదుల పాత్ర

13.2.7. సైనిక పునర్నిర్మాణ పథకము - 1867

13.2.8. పునర్నిర్మాణ ఫలితాలు

13.1.9. నమూనా ప్రశ్నలు

13.1.10. చదువదగిన గ్రంథాలు


## 13.2.1. పరిచయము - పరిణామాలు :

అంతర్యుద్ధానంతరము అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఎదుర్కొన్న ప్రముఖ సమస్య అమెరికా పునఃనిర్మాణము. అంతర్యుద్ధము వలన దక్షిణ అమెరికా ప్రాంతము ఆర్థికముగా చితికిపోవటమే కాకుండా, దాని భౌతిక స్వరూపం చిన్నాభిన్నమయినది. తోటలో పనిచేయు ఉద్యోగులు ఇచ్చటి పరిస్థితులు గమనించి ఉపాధి కొరకు ఉత్తర ప్రాంతమునకు తరలిపోయిరి. వ్యవసాయరంగం పూర్తిగా పతనమయినది. ఈ సమస్యల నన్నిటిని అధిగమించుటకు అనేక చర్యలు తీసుకు రావలసి వచ్చెను. అమెరికా సంయుక్త రాష్ట్రాల ఐక్యతకు భంగము వాటిల్లుటకు పూర్వమే దక్షిణాదివారికి రాజ్యాంగ హక్కులు పునరుద్దరింప చేయాలని అబ్రహం లింకన్ భావించినాడు. జాతి వర్గ సమైక్యత కోసం, వర్గ పోరాటాలు నివారించటానికి పునః నిర్మాణ కార్యక్రమము చేపట్ట వలసి వచ్చినది. అందుకు ఉత్తరాదివారు తగిన చర్యలు తీసుకొంటే వర్గ సమత్వం పెంపొందించవచ్చుని రాడికల్స్ భావించినారు. అందుకోసం అనేక ప్రణాళికలు రూపొందించవలసి వుంది. ఇందుకు గాను ముందుగా పునఃనిర్మాణము అంటె ఏమిటో తెలుసుకోవలెను. అంతర్యుద్ధ బీభత్సం నుండి దక్షిణంను అభివృద్ధి పరచుటకు చర్యలు చేపట్టి, నల్ల జాతివారిని బానిస శ్రామికత్వం నుండి స్వేచ్ఛా స్వతంత్రులునిగా చేయుటకు తగు చర్యలు చేపట్టుటయే దక్షిణ అమెరికా పునఃనిర్మాణమందురు.

## 13.2.2. లింకన్ పునఃనిర్మాణ ప్రణాళిక :

లింకన్ తన పునః నిర్మాణ పథకమును యుద్ధం సమాప్తం కాక పూర్వమే 1863లో రూపొందించి ప్రకటించెను. ఈ ప్రకటన ప్రకారముగా దక్షిణ రాష్ట్రాలలో ఏదేని రాష్ట్రంలో ఒక విధేయత గల ప్రభుత్వము ఏర్పాటు చేయవలెను. 1860లో జరిగిన ఎన్నికలయందు 10 శాతం పౌరులు బానిసత్వం విషయంలో కాంగ్రెస్‌నందు ప్రవేశపెట్టిన శాసనాలకు బద్ధులై సమాఖ్యరాజ్యాంగ పత్రముపై సంతకము చేయవలెను. ఇందు నల్ల జాతి వారు (నీగ్రోలు) పత్రంపై సంతకం చేసే విషయంలో చర్చించకూడదు. సంతకం చేయకూడదు. ఎందుకంటే వారు 1860 ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొన లేదు కాబట్టి. నూతనంగా సృష్టించబడిన రాష్ట్రాలైన టెన్నసి, లూసియానా, ఆర్కన్సాస్ రాష్ట్ర ప్రభుత్వాలు 1864 ప్రణాళిక ప్రకారము అమెరికా అధ్యక్షునిచే గుర్తింపు పొందవలసి ఉంది. అంతర్యుద్ధ కాలంలో వర్జీనియా ఉనికి భయానకముగా నుండి నందున, ఆ రాష్ట్ర ప్రభుత్వమును అధ్యక్షుడు గుర్తించవలసి ఉంది.

1865 మార్చిలో రెండవసారి లింకన్ అధ్యక్ష పదవీ స్వీకారోపన్యాసములో "ద్వేషాసూయలకు అతీతంగా, అందరి పట్ల ఔదార్యంతో, యుద్ధమున మరణించిన వారి కుటుంబాలకు రక్షణ కల్పించి, జాతికి కలిగిన గాయాలను మాన్పి అందరి మధ్య ధర్మ సమ్మతమైన, శాశ్వతమైన శాంతి స్నేహ సౌహర్దములను నెలకొల్పుటకు శాయశక్తుల కృషి చేద్దామని'' చిరస్మరణీయమైన ఉపన్యాసమునందించినాడు.

లింకన్ 1865 ఏప్రిల్‌లో తన మరణానికి కొద్ది రోజుల ముందు, దక్షిణ రాష్ట్రాలను, మిగిలిన రాష్ట్రాలతో సమాన స్థాయికి తీసుకురావసిన ప్రముఖ సమస్య మన ముందున్నదని చెప్పెను. దక్షిణ రాష్ట్రాల యెడల ఉదార వైఖరి కలిగియుండాలని, ద్వేష భావం పెంపొందించుకోకూడదని లింకన్ భావించినాడు. కాని వీటి అమలు పరచటానికి అతను ఎక్కువ కాలం జీవించలేడు. ఒక వేళ ఆయన బ్రతికి యున్నప్పటికి దాక్షిణాత్యుల యెడల ఆ భావం లేని వాతావరణం కల్పించి యుండెడిది కాదేమో ? కాంగ్రెస్ కూడా శాంతి అధారిత, అసూయా ద్వేషాలకు అతీతంగా అందరిపట్ల ఔదార్యం ప్రదర్శించనీయకుండా అతనికి అడ్డుపడి ఉండెడిది.

## 13.2.3. జాన్సన్ ప్రణాళిక 1865 :

అబ్రహాంలికన్ మరణాంతరం అతని వారసుడుగా జాన్సన్ సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడయినాడు. లింకన్ ప్రారంబించిన పునః నిర్మాణ కార్యక్రమములను జాన్సన్ కొద్ది మార్పులతో కొనసాగించినాడు.

జాన్సన్ ప్రణాళిక ప్రకారము :

1. అంతర్యుద్ధములో పాల్గొనిన రాష్ట్రములకు గవర్నర్‌లను నియమించుట వలన రాజ్యాంగములను మార్పు చేయుటకు రాజ్యాంగ సమ్మేళనములు ఏర్పాటు చేయవలెను.
2. ఈ రాజ్యాంగ సమ్మేళనములు వేర్పాటు చట్టములను రద్దు చేయవలెను. అంతర్యుద్ధ రుణములు ఎగవేయవలెను. యూనియన్‌కు విధేయత కలిగియుండవలెను. బానిసత్వ నిర్మూలన ప్రకటనకు ఉద్దేశించిన పదమూడవ రాజ్యాంగ సవరణను ధృవపరచవలెను.
3. ఇరవై వేల డాలర్ల పైపడిన ఆస్తిగలవారికి తప్ప మిగిలిన దక్షిణాత్యులకు 1860 ఎన్నికల నాటి ఓటర్ల జాబితా ప్రకారము ఓటు హక్కు కల్పింపబడెను.
4. విద్యావంతులైన ఆస్తి గల నీగ్రోలకు ఓటు హక్కును ప్రసాదించటం భావ్యమని, వారి భవిష్యత్‌కు అనుగుణంగా చట్టములు ఆ రాష్ట్రాలు చేయవలెనని వ్యక్తపరచెను.

## 13.2.4. పద్నాలుగవ రాజ్యాంగ సవరణ :

జాన్సన్ అతివాదుల మధ్య రభస వీధిన పడినది. నీగ్రోల సహాయం కోసం తాత్కాలికంగా ఏర్పరచిన ఫ్రీడ్‌మెన్స్ బ్యూరో అనే సంస్థను పటిష్టం చేసి వాటి కార్యకలాపాలను విస్తరింపచేయటానికి అతివాదులు ఒక చట్టాన్ని చేసినారు. కాని జాన్సన్ తన వీటోతో తోసి

పుచ్చినాడు. తరువాత కాంగ్రెస్ ఆమోదించిన పౌర హక్కుల చట్టానికి కూడా ఇదే గతి పట్టినది. అందువల్ల 1866 జూన్‌లో కాంగ్రెస్ రాజ్యాంగానికి పద్నాలుగో సవరణను ప్రవేశపెట్టినది. భవిష్యత్‌లో కూడా నీగ్రోల హక్కులు కాపాడటానికి గట్టి ప్రయత్నం చేసినది. నీగ్రోలకు పౌరసత్వ హక్కులే కాక తదితర అమెరికన్ పౌరులతో సమానంగా అన్ని హక్కులను, రక్షణలు ఈ సవరణ ప్రసాదించినది. ఏ వ్యక్తి ప్రాణాలను గాని, స్వేచ్ఛనుగాని, ఆస్థినిగాని, చట్టరీత్యా విచారించకుండా లాగుకొనగూడదని ఈ సవరణ నిర్దేసించినది. దీనిలో నీగ్రోలకు ఎన్నిక హక్కు ఇవ్వవలెనని నిష్కర్లగా చెప్పినప్పటికి పౌరులకు ఓటు హక్కు తగిన దామాషా ప్రకారం ఆయా రాష్ట్రాలకు ప్రజా ప్రతినిధుల సంఖ్యను కూడా తగ్గించవలసి ఉంటుందని కట్టడి చేసినది. కాని తిరుగుబాటులో పాల్గొన్న దక్షిణాత్య సమాఖ్య ముఖ్య నాయకులకున్న ఓటింగ్ హక్కును సవరణ రద్దు పరచినది. దీని వల్ల టెన్నసి మిగిలిన దక్షిణ రాష్ట్రాలవారు జాన్సన్ సలహాను పాటించి పద్నాలుగో సవరణను నిరాకరించారు. బలవంతంగా ఈ సవరణను వారిచేత ఆమోదింపజేయటానికి కాంగ్రెస్‌గాను, కొన్ని చట్టాలను అమలు జరిపినది. అనాటి నుంచి కొద్ది కాలం కాంగ్రెస్‌దే పై చేయి అయింది. 1866 జూన్ ప్రవేశ పెట్టబడిన రాజ్యాంగ సవరణ 1868లో ఆమోదింపబడినది.

## 13.2.5. కాంగ్రెస్ ప్రణాళిక :

1865 డిసెంబరు నెలలో కాంగ్రెస్ సమావేశమయినపుడు జాన్సన్ ప్రణాళిక పరిశీలించబడినది. కాంగ్రెస్ నందు రిపబ్లికన్ పార్టీ ఆధిక్యత సంపాదించడంలో, జాన్సన్ ప్రవేశపెట్టిన పునఃనిర్మాణ ప్రణాళిక ప్రక్కన ఒక క్రొత్త పునఃనిర్మాణ పథకము కొరకు సంయుక్త సంఘము రూపొందించబడినది. ఈ సంఘ సభ్యులుగా పెన్సిన్‌వేనియా నుండి థాడియస్ స్టీవెన్స్, మెసాచుట్స్ నుండి సినెటర్ చార్లెస్ సమ్నర్‌ను నియమించినది. వీరికి దక్షిణ రాష్ట్రాలపై కఠినమైన అభిప్రాయాలు కలవు. స్టీవెన్స్‌కి దక్షిణ రాష్ట్రాలన్ని జయించిన రాష్ట్రాలని, విదేశీ రాజ్యాలను జయించినట్లు ఈ రాష్ట్రాలను అమెరికా సైన్యాలు జయించినట్లు, ఈ రాష్ట్రాలును అమెరికా సైన్యాలు జయించినాయి కాబట్టి, కాంగ్రెస్ వీటి సమస్యను సులువుగా పరిష్కరించవచ్చునని, వాటి పునఃనిర్మాణ విషయంలో స్వేచ్ఛగా వ్యవహరించవచ్చని భావించెను. 1866లో కాంగ్రెస్, స్వేచ్ఛా పౌరులు అనుభవించు పౌర హక్కుల చట్టాన్ని స్వేచ్ఛ పొందిన పౌరులకు కూడా ప్రసాదించెను.

## 13.2.6. అతివాదుల పాత్ర :

కాంగ్రెస్‌లో అతివాదల నాయకుడు స్టీవెన్స్. సునిసిత మేధా సంపత్తిగలవాడు. వాగ్దాటి గలవాడు. అసమానుడైన పార్లమెంటేరియన్. పద్నాలగవ రాజ్యాంగ సవరణను ఆమోదించే విషయంలో, ఆమోదించవలదని జాన్సన్‌ను దక్షిణ రాష్ట్రాలు కోరినవి. అందుకు జాన్సన్, తీవ్రదుల మధ్య సంఘర్షణ తీవ్ర రూపము దాల్చినది. అటువంటి సమయంలో 1866లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికలలో జాన్సన్ వర్గం తీవ్రవాదుల వర్గములు తీవ్ర గెలుపు కోసం తీవ్ర ప్రయత్నములు చేసిరి. ఈ ఎన్నికలలో అతివాదులు మూడింట రెండువంతుల మెజారిటి పొంది అధ్యక్షుని అధికారములను, వీటో అధికారమును సహితము వమ్ము చేసిరి. దీనిలో జాన్సన్ ప్రణాళిక వమ్ము కాబడినది.

## 13.2.7. సైనిక పునఃనిర్మాణ పథకము - 1867 :

1867 మార్చి రెండో తేదీన సైనిక పునఃనిర్మాణ చట్టాన్ని కాంగ్రెస్ ఆమోదించినది. జాన్సన్ ప్రణాళికను తర్వాత ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసెను. దాని స్థానములో పద్నాల్గవ రాజ్యాంగ సవరణను ఆమోదించిన టెన్నెసి రాష్ట్రము మినహా మిగిలిన దక్షిణ రాష్ట్రములను ఐదు భాగాలుగా చేసి ఒక్కొక్క దానికి ఒక్కొక్క మిలిటరీ జనరల్‌ను గవర్నర్‌గా నియమించెను. ఈ గవర్నర్‌లు తమ ప్రాంతములో ఎన్నికలు జరిపించి ఎన్నికయిన నూతన ప్రతినిధుల ద్వారా పదునాల్గవ రాజ్యాంగ సవరణను ఆమోదించి నూతన రాజ్యాంగమును తయారుచేయవలెను. ఇటు నీగ్రోల ఓటు హక్కును గుర్తించిన రాష్ట్రమునే యూనియన్‌లో చేర్చుకొనుట జరుగును. తీవ్రవాదుల చర్యలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు వాదించినను, వారు ఖాతరు చేయలేదు. చివరికి 1870 నాటికి దక్షిణ రాష్ట్రములన్ని 14వ రాజ్యాంగ సవరణను ధృవీకరించి యూనియన్‌లో అంతర్భాగములయ్యెను. నీగ్రోలకు పేర రాజకీయ హక్కులు రాజ్యాంగ రీత్యా ప్రసాదించబడినవి.

రాజ్యాంగ పద్ధతుల ద్వారా నీగ్రోల స్వేచ్ఛను, పౌర హక్కులను ప్రతిఘటించుటలో విఫలమైన కొందరు దక్షిణాత్య యువకులు టి.బి. ఫారెస్ట్ నాయకత్వంలో కుక్లక్స్ క్లాన్ అను ఉద్యమమును ప్రారంభించి నీగ్రోలను హింసించసాగిరి. ఇట్టి స్థితిలో కాంగ్రెస్ పదునైదవ రాజ్యాంగ సవరణ ద్వారా జాతి, రంగు వలనగాని, ఒకప్పుడు దాస్యవృత్తి, చేపట్టినందుకుగాని నీగ్రోలు ఓటు హక్కును ఎవరు బంగపరచరాదని శాసించెను. ఈ సవరణను అమలు పరుచుటకు కాంగ్రెస్ కొన్ని కఠిన శాసనములు చేసెను.

అంతర్యుద్ధ కాలంలో అమెరికా విషయంలో జోక్యం చేసుకొనిన ఫ్రాన్స్ ఇంగ్లండ్‌లకు అతివాదులు జాన్సన్‌లు చక్కని గుణ పాఠములు నేర్పిరి. 1867లో మెక్సికోలో ఆస్ట్రియా యువరాజును మెక్సికన్లనీ హత్యగావించి ఫ్రెంచివారిని మెక్సికో నుండి తరిమి వేసి కాంగ్రెస్ మన్రో సిద్ధాంతమును పునరుద్ఘాటించెను. అటులనే బ్రిటీష్ వారిని శిక్షించుటకు అమెరికన్‌లు Quen Shits లను పేరుతో కెనడాపై దాడి చేసిరి. 1867 జాన్సన్ పదవీ కాలంలోనే రష్యా ఆధీనంలోని అలస్కాను జాన్సన్ విదేశాంగ కార్యదర్శియగు స్వెవార్ట్ రష్యాతో సంధి చేసుకొని అలస్కాను 75 లక్షల డాలర్లకు కొనుగోలు చేసెను.

## 13.2.8. పునః నిర్మాణ ఫలితాలు :

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో బానిసత్వ నిర్మూలనము జరిగినది. బానిసలకు అమెరికన్ పౌరసత్వము ప్రసాదింపబడుటయే గాక రాజకీయ పౌర హక్కులు ప్రసాదింపబడినవి. దక్షిణ రాష్ట్రములు యూనియల్‌లో చేర్చబడినవి. పునః నిర్మాణ పథకమును జఫర్‌సన్ డేవిస్ వంటి కాన్ఫెడరేట్ నాయకులకు క్షమాభిక్ష ప్రసాదించబడెను. సాంఘిక ఆర్థిక రంగములలో కొంత ప్రగతి సాధింపబడెను. ఏది ఏమైనను నీగ్రోలు తెల్లవారిలో సమంగా గుర్తించబడుటకు, దుస్థితిని అధిగమించుటకు కొంత కాలము పట్టినది.

## 13.2.9. నమూనా ప్రశ్నలు :

1. అంతర్యుద్ధానంతరం పునర్మిర్మాణ కార్యక్రమమును వివరించుము.
2. లింకన్ పునర్నిర్మాణ పథకమును వివరించుము.
3. జాన్సన్ పునర్నిర్మాణ ప్రణాళికను వివరించుము.
4. అతివాదుల పునర్నిర్మాణ విధానమును వివరించుము.

## 13.2.10. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America : A History
2. C.H. Hill - History of United States
3. Novins & Commager - A Short History of Unitied States
4. Telugu Acadmey Publication - America Samyuktha Rastrala Charithra


- ఎం. జె. జయప్రసాద్

పాఠం - 14.1.

# అంతర్యుద్ధానంతరం పారిశ్రామికాభ్యుదయము- వ్యవసాయక విప్లవం - సాంస్కృతికాభివృద్ధి - పారిశ్రామికాభ్యుదయం

## 14.1.0. లక్ష్యం :

19వ శతాబ్ది రెండవ అర్ధభాగమున ముఖ్యంగా 1865-1900 సంవత్సరముల మధ్య కాలమున, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో అంతర్యుద్ధానంతరం భారీ పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి, వ్యవసాయక విప్లం, సాంస్కృతికాభివృద్ధి జరిగాయి. వీనికి తోడ్పడిన పరిస్థితులు, వాటి వలన వచ్చిన ఫలితాలను పరిశీలించుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


14.1.1. పరిచయము

14.1.2. పారిశ్రామికాభ్యుదయమునకు కారణములు

14.1.3. రైల్వేలు

14.1.4. బొగ్గు పరిశ్రమ

14.1.5. ఉక్కు పరిశ్రమ

14.1.6. నూనె పరిశ్రమ

14.1.7. విధ్యుత్చ్ఛక్తి

14.1.8. పారిశ్రామిక పెట్టుబడులు

14.1.9. కార్మికోద్యమములు - ఫలితములు

14.1.10. నమూనా ప్రశ్నలు

14.1.11. చదువదగిన గ్రంథాలు


## 14.1.1. పరిచయము :

అంతర్యుద్ధము మొదటి ప్రపంచముల మధ్య కాలములో అమెరికా సంయుక్త రాష్ట్రాలు సాధించిన ప్రగతిలో ప్రముఖమైనది పారిశ్రామికాభివృద్ధి. ఈ అంతర్యుద్ధానికి పూర్వం ఇంగ్లండ్, ఫ్రాన్సులు సాధించిన అభివృద్ధి కంటే అమెరికా చాలా వెనుకబడియున్నది. కాని 1914 నాటికి అమెరికా ఉత్పాదనలోను సాంకేతిక పరిజ్ఞానములోను, పారిశ్రామికాభివృద్ధిలోను ముందున్నది. ఇంతటి ఆర్థిక విప్లవము అమెరికాలో సంభవించుటకు ప్రముఖ కారణము అంతర్యుద్ధమే. ప్రభుత్వం అనుసరించిన విధానాలబట్టి, పారిశ్రామికాభివృద్ధి ద్వారా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా మారిపోయినది. ఈ పారిశ్రామికాభ్యుదయమునకు అనేక కారణములు గలవు.

## 14.1.2. పారిశ్రామికాభ్యుదయమునకు కారణములు :

అమెరికా భూ భాగము చాలా సంపన్నమయినది. సహజవనరులకు, అపారమైన ఖనిజ సంపదకు నిలయము. మూల ధనమునకు కొదువలేదు. చౌకగా లభించు కార్మికులు, కూలీలు కలరు. అమెరికా పునః నిర్మాణము తరువాత రాజకీయ పటిష్టత ఏర్పడినది. విదేశీ వ్యాపారం బాగా విస్తరించినది. పొరుగు రాజ్యాల యుద్ధ భయము లేదు, రక్షణ, సైనిక వ్యయం బాగా తగ్గినది. ప్రజల అలవాట్లలో, నైతిక విలువలలో, సాంకేతిక పరిజ్ఞానములో, రాజకీయ చైతన్యంలో గొప్ప ప్రమాణాలను కలిగియున్నారు. అమెరికన్ ప్రజలు అధిక సంఖ్యాకులు ఉద్యోగార్థం వలస వచ్చినవారు కాబట్టి, వారికి గల జ్ఞానం అభివృద్ధికి వినియోగించిరి. దీని వలన ప్రైవేటు పరిశ్రమలు వ్యాపారం అభివృద్ధి చెందినది.

అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రగతిని ప్రభుత్వ సహాయం కూడా ఒక కారణము. ఫెడరల్ రాజ్యాంగం తన ఉనికిని కాపాడింది. కార్పోరేషన్ల స్థాపనకు వీలు కల్పించింది. వ్యాపార పారిశ్రామిక స్వేచ్ఛకు వీలు కల్పించింది. పరిశ్రమలను రక్షించే చట్టాలను ప్రభుత్వం ప్రవేశపెడితే కాంగ్రెస్ ఆమోదించింది. రక్షిత సుంకాలు విధించింది. విదేశీ పోటీని పరిమితం చేసింది. జాతీయ బ్యాంకులు స్థాపించి కరెన్సీని క్రమబద్ధీకరించింది. సమర్థులైన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించింది.

అమెరికా మహోన్నత న్యాయస్థానం కూడా అమెరికా పారిశ్రామికాభ్యుదయానికి తోడ్పడినది. సుప్రీం కోర్టు తీర్పులు కూడా వ్యాపారానికి రక్షణ కల్పించినాయి. వ్యక్తి తన ఆస్తిని వ్యాపారంలో పెట్టి లాభాలు ఆర్జించవచ్చుని కోర్టు చెప్పింది. అంతరాష్ట్ర వ్యాపారాన్ని కాంగ్రెస్ పరిమితం చేయదాదని కోర్టు చెప్పింది. ఈ తీర్పులు ఫలితంగా ప్రభుత్వపు అనవసర జోక్యం శ్రామికరంగంలో తగ్గిపోయినది. 1870-1920 మధ్య పరిశ్రమను పరిమితం చేసే చట్టాలను కోర్టు రద్దు చేసినది.

ప్రభుత్వ సహాయం కోర్టు రక్షణ, ఉత్సాహవంతులయిన వ్యాపారులను ప్రోత్సాహపరచినది. శక్తి, చొరవ, సామర్థ్యం, ధ్యేయంగా గల యువ పారిశ్రామికులు తమ విజ్ఞానాన్ని పెట్టుబడిని పెట్టటానికి ముందుకు వచ్చారు. ఇటువంటి వారిలో వండర్ బిల్ట్, కార్నిగ్,రాక్ పెల్లర్, మోర్గన్ సుప్రసిద్దులు. సుసంపన్నులైనవారు, అమెరికా ఆర్థిక వికాసానికి ఎనలేని సేవ చేసిరి. నూనె పరిశ్రమకు రాక్ పెల్లర్, ఉక్కు పరిశ్రమకు కార్నిగ్, బ్యాంకింగ్‌కు మోర్గన్ కృషి చేసినారు.

## 14.1.3. రైల్వేలు :

1865-1900 మధ్య కాలంలో సంయుక్త రాష్ట్రాలలో రైలు రోడ్లు విస్తృతంగా నిర్మించబడ్డాయి. రైలు మార్గాల పొడవు అయిదింతలు అయినది. పశ్చిమ ప్రాంతాలు నివాసయోగ్యాలుగా మార్చటానికి, జాతీయ మార్కెట్లు నెలకొల్పటానికి, నూతన ఉత్పత్తిని పెంచటానికి రైలు మార్గాలు ఇతోధికంగా తోడ్పడినాయి. రైలు మార్గాలు ప్రవేటు కార్పొరేషన్లచే నిర్వహించబడినాయి. రైల్వే ప్రయాణం పెరిగింది. ఎయిర్ బ్రేకులు, ఉక్కు పట్టాలు, సిగ్నల్స్, నూతన ఇంజన్లు కనుగొనటంతో ప్రయాణ వేగం పెరిగింది. అన్నింటిలో ప్రముఖమైనది ట్రాన్స్ కాంటినెంటన్ రైలు మార్గం. ఆ తరువాత అనేకమైన ట్రాన్స్ కాంటినెంటన్ రైలు మార్గాలు నిర్మించబడ్డాయి. 1. సదరన్ పసిఫిక్, 2. నార్తరన్ పసిఫిక్, 3. శాంత ఫె, 4. గ్రేట్ నార్తరన్ రైలు మార్గాలు. రైలు మార్గాల నిర్మాతలలో ప్రసిద్ధుడు జేమ్స్ హిల్.

## 14.1.4. బొగ్గు పరిశ్రమ :

పెన్సిల్ వేనియా రాష్ట్రం అంత్రసైట్ అనే బలిష్టమైన ఒక రకం బొగ్గు నిక్షేపాలకు నిలయం. అపలేచియన్ పీఠభూమి, మధ్య దూర పాచ్య రాష్ట్రాలలో బొగ్గుగనులు కనుగొనబడ్డాయి. అన్ని బొగ్గు గనులు కార్పోరేషన్ల చేత నిర్వహించబడ్డాయి. లేక్ సుపీరియర్ ప్రాంతంలో ముఖ్యంగా మెసాచి కనుమలలో ఇనుప క్షేత్రాలు విరివిరిగా కనుగొనబడ్డాయి. పిట్స్‌బర్గ్, పెన్సిల్‌వేనియా ఓహియోలు భారీ పరిశ్రమలకు కేంద్రాలయినాయి.

## 14.1.5. ఉక్కు పరిశ్రమ :

ఆండ్రూ కార్నిక్ పర్యవేక్షణలో సంయుక్త రాష్ట్రాలలో ఉక్కు పరిశ్రమ విస్రృతమైనది. ఇతడు కార్నిక్ ఉక్కు కంపెనీని స్థాపించాడు. బొగ్గు, ఇనుము, సున్నపురాయి గనులు ఇతని యాజమాన్యంలో వుండినాయి. తన సంపాదనను గ్రంధాలయాలకు, విద్యావ్యాప్తికి ఖర్చుచేసినాడు.

## 14.1.6. నూనె పరిశ్రమ :

జె.డి.రాక్ ఫెల్లర్ ఆధ్వర్యంలో నూనె పరిశ్రమ అభివృద్ధి చెందినది. 1859లో పశ్చిమ పెన్సన్‌వేనియాలో మొదటి నూనె బావిని డ్రేక్ అనే వాడు త్రవ్వినాడు. నూనె శుద్ధి కర్మాగారాన్ని రాక్ పెల్లర్ స్థాపించినాడు. 1870లో స్టాండర్ట్ ఆయిల్ కంపెని స్థాపించినాడు. 1899లో న్యూజెర్సిలో అతి పెద్ద నూనె కంపెనీ వెలసింది.

## 14.1.7. విధ్యుచ్ఛక్తి :

19వ శతాబ్దంలో కాంతి, శక్తి, వార్తా ప్రసారాలు కోసం విద్యుత్‌చ్ఛక్తి వినియోగించినారు. 1879లో ఎడిసన్ పిల్మంట్‌ని కనుగొని విధ్యత్‌చ్ఛక్తిలో నూతనాధ్యాయాన్ని సృష్టించినాడు. 1882లో న్యూయార్క్‌లో ఎడిసన్ ఎలక్ట్రిసిటీ కంపెనీ నిర్మింపబడినది. విధ్యుత్‌చ్ఛక్తితో నడిచే కారును స్ప్రాగ్ తయారుచేసినాడు.

అలెగ్జాండర్ గ్రహంబెల్ టెలిఫోన్‌ని కనిపెట్టినాడు. తంతి సౌకర్యాలను రెండు కంపెనీలు - వెస్టర్న్ యూనియన్, పోస్టల్ టెలిగ్రాఫ్‌లు నిర్వహించినాయి. ఆ తర్వాత ఇవి కార్పొరేషన్ల పాలన క్రిందికి వచ్చాయి. 1867లో టైప్‌రైటర్, 1848లో కుట్టు యంత్రం ; 1848 ఆడింగ్ మిషన్‌లు కనుగొనబడ్డాయి. ఈ పరిశోధనలతో పాటు కొన్ని వ్యాపార కంపెనీలు వెలసినాయి. మెకార్మిక్ హార్వెస్టర్ కంపెని, చికాగో, అమెరికన్ టుబాకో కంపెని, అమెరికన్ షుగర్ రిఫైనరీంగ్ కంపెనీలు వెలసాయి. ఈ కంపెనీల కృషి ఫలితంగా వ్యవసాయక పరికరాలు పొగాకు, చక్కెర ఉత్పత్తులు ఎక్కువయినాయి.

## 14.1.8. పారిశ్రామిక పెట్టుబడులు :

పెట్టుబడి లేనిదే ఏ పరిశ్రమకు కూడా ముందుకు సాగదు. ఈ కారణం చేత సంయుక్త రాష్ట్రాలలో పెట్టుబడి బ్యాంకులు స్థాపించబడినాయి. ఇవన్నియు ప్రవేటు బ్యాంకులే. తమ ధనాన్ని పెట్టుబడిగా స్వీకరించిన కంపెనీల వస్తూత్పుల క్రయ విక్రయాలను సహితం ఈ బ్యాంకులు నిర్వహించేవి. అంతర్యుద్ధంలో ఫిలడెల్ఫియాలో స్థాపించబడ్డ 'జెకూక్ అండ్ కంపెని' దివాలా తీసింది. 1895లో న్యూయార్క్‌లో 'మార్గన్ కంపెని' అన్నింటికంటె పెద్ద పెట్టుబడి బ్యాంకు. దీని సంస్థాపకుడు జె.పి. మార్గన్. ఈతని ప్రాపకంలో 1901లో యునైటెడ్ స్టేట్స్ స్టీల్ ఏర్పడినది. ఇతను అనేక కంపెనీలలో షేర్లు కొన్నాడు. అనేక కంపెనీలలో పెట్టుబడులు పెట్టాడు. ఇతనే కాక అనేకమంది కోట్లకొలది డాలర్లు వివిధ కంపెనీలలో పెట్టుబడులు పెట్టారు. ఈ భారీ పెట్టుబడులు అమెరికన్ పారిశ్రామిక రంగంలో గొప్పమలుపు. అమెరికన్ భారీ పారిశ్రామికాభ్యుదయానికి తోడ్పడినది.

## 14.1.9. కార్మికోద్యమాలు - ఫలితాలు :

భారీ పారిశ్రామికాభివృద్ధి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అనేక కార్మిక సమస్యలు సృష్టించినది. 1860-1900 సంవత్సర మధ్య కార్మికుల సంఖ్య నాలుగింతలు పెరిగినది. వీరిలో అధిక భాగం ఐరోపా రాజ్యాల నుండి వలస వచ్చినవారే. స్త్రీ కార్మికులు సంఖ్య క్రమక్రమముగా పెరిగినది. కార్మికుల ఉద్యోగ పరిస్థితులు నిర్ణయించే యజమాలు కలిగివున్నారు. తత్ఫలితంగా కార్మికులకు తగినంత అధికారం వేతనం, ఉద్యోగ భద్రతలు లేకుండా పోయినవి. పని కాలం ఖచ్చితంగా నిర్ణయింపబడలేదు. ప్రమాదాలకు గురియైన కార్మికులకు ఆర్థిక సహాయం లభించుటలేదు. కనీసవసరాలు అంతకంటే లేవు. ఒక్కమాటలో చెప్పాలంటే 1840 నాటికి యజమానుల దయపై

కార్మికులు జీవించేవారు. తమ స్థితిగతులు మెరుగుపరుచుకునే ఆశయంతో కార్మిక సంఘాలు ఏర్పడటం ఆరంభించాయి. 1865లో విలియం సిల్విస్ 'నేషనల్ లేబర్ యూనియన్‌లో' స్థాపించినాడు. మూడేండ్లలో ఇందు ఆరు లక్షల మంది సభ్యులయినారు. 1869లో యూరియా స్టీఫెన్స్ నైట్స్ ఆఫ్ లాబర్‌ను స్థాపించినాడు. 1886 నాటికి దీని సభ్యత్వం ఏడు లక్షలయినది.

1886లో సామ్యూల్ గోంపర్స్ అనునతడు అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ అను కార్మిక సంస్థను స్థాపించెను. అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని పరిశ్రమలు, గనులు, రైల్వేలు, నూనె కంపెనీల సంస్థ కార్మిక యూనియన్లు దీనిలో అనుబంధ సంస్థలుగా చేరినాయి. క్రమ శిక్షణ, నియమ నిబంధనలు, వేతన చెల్లింపు, నిధులు సేకరించటం, సమిష్టి పోరాటం దీని మార్గాలు. రాజకీయాలకు దూరంగా వుంటూ కార్మిక సంక్షేమ చట్టాలు చేయించటం దీని లక్ష్యం. గోంపర్స్ నాయకత్వంలో గల కార్మిక సంస్థ చాలా కోరికలు సాధించినది. న్యాయస్థానాలు తీర్పులు కూడా కార్మికులకు అనుకూలంగా వుండటంతో సమ్మెలు, ఉద్యమాలు, వ్యాప్తిచెందకుండా ఆగిపోయినవి. దీనిని బట్టి పారిశ్రామికాభివృద్ధి వలన శ్రామికుల స్థితిగతులు మెరుగుపరుచుటకు, కార్మిక సంఘాల సమ్మెలు, ఉద్యమాలు మేలు చేసినవి. వీటికి బాసటగా కోర్టులు న్యాయమైన, చట్టబద్ధమైన కోర్కెలు తీర్చుటలో వుండుటతో అమెరికా పారిశ్రామికాభ్యుదయము ముందుకు సాగినది.

## 14.1.11. నమూనా ప్రశ్నలు :

1. 1865-1900 సంవత్సరాల మధ్య కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేసిన పరిస్థితులను వివరించుము.

2. అంతర్యుద్ధానంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పారిశ్రామికాభివృద్ధి, దాని ఫలితములు వివరించుము.

## 14.1.12. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America - A History
2. C.P. Hill - A History of the United States
3. Telugu Acadmey Publication - America Samyuktha Rastrala Charithra
4. Novins & Commager - A Short History of Unitied States


- ఎం. జె. జయప్రసాద్

**పాఠం - 14.2.**

# వ్యవసాయక విప్లవము

## 14.2.0. లక్ష్యం :

19వ శతాబ్ది రెండవ అర్ధభాగంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పారిశ్రామిక విప్లవమేగాక వ్యవసాయక విప్లవం కూడా సంభవించింది. ఈ వ్యవసాయక విప్లవానికి దారి తీసిన పరిస్థితులు అనుకూలించిన పరిస్థితులు, వ్యవసాయదారులు సాగించిన ఉద్యమాలు పరిశీలించుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


14.2.1. పరిచయము

14.2.2. వ్యవసాయాభివృద్ధికి అనుకూలించిన పరిస్థితులు

14.2.3. వ్యవసాయాభివృద్ధిలో సమస్యలు

14.2.4. 1867 గ్రేంజ్ ఉద్యమము

14.2.5. 1876 గ్రీన్ బాక్ ఉద్యమము

14.2.6. 1880 పాప్యులిస్ట్ ఉద్యమము

14.2.7. నమూనా ప్రశ్నలు

14.2.8. చదువదగిన గ్రంధాలు


## 14.2.1. పరిచయము :

అంతర్యుద్ధం దక్షిణ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసింది. బానిసలు విముక్తి పొందిన కారణంగా వ్యవసాయ భూములలో పనిచేసే వారి సంఖ్య తగ్గింది. భూకామందులు తోటల యజమానులు యుద్ధంలో సంపదను కోల్పోయినారు. అధిక పన్నులు విధించబడ్డాయి. పన్నులు చెల్లించలేనివారు భూములు అమ్ముకున్నారు. ఇటువంటి పరిస్థితులలో ఆర్థిక పునఃనిర్మాణ కార్యక్రమంలో భాగంగా పారిశ్రామిక రంగంలోవలె వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నవి. ఒక నలభై సంవత్సరాల కాలంలో అనగా 1860-1900 మధ్యకాలంలో అమెరికాలోని అధిక భూభాగము వ్యవసాయలోనికి తీసుకొని రాబడినది, తత్ఫలితంగా ముప్పయి అయిదు లక్షల వ్యవసాయ క్షేత్రాలు వెలసినాయి. అన్ని వ్యవసాయక వస్తువుల ఉత్పత్తి బాగా పెరిగినది. గోధుమలు, ధాన్యం, పత్తి ఉత్పత్తులు బాగుగా పెరిగినాయి.

## 14.2.2. వ్యవసాయ అభివృద్ధికి అనుకూల పరిస్థితులు :

ఇంత భారీగా వ్యవసాయ ఉత్పత్తులు పెరగటానికి ఈ క్రింది పరిస్థితులు, పరిశోధనలు తోడ్పడినాయి.

1. అర్కన్సాస్, టెక్సాస్, జార్జియా, దక్షిణ కరోలినా రాష్ట్రాలలో గల భూమి, బాగా వ్యవసాయ యోగ్యమైనది. ఆ భూములను పూర్తిగా వ్యవసాయంలోనికి తేవటం.

2. నూతన వ్యవసాయ పద్ధతులు, పరికరాలను కనుగొనటం. ఎలివిట్నీ 1793లో ప్రత్తినుండి గింజలు వేరు చేసే యంత్రం కనుగొనటం, 1837లో జాన్‌డిరి నాగలిని రూపొందించుట, 1855లో జాన్ ఆలివర్ ఉక్కు నాగలిని రూపొందించుట, 1860 పంటను కోసే యంత్రాలు వచ్చాయి.

3. ఆవిరి యంత్రాలు, పెట్రోలు, విధ్యుత్‌చ్ఛక్తి వాడకం బీడు భూములను వ్యవసాయ క్షేత్రాలుగా మార్చాయి. పశు సంపద పెరిగింది. కర్షకుల తెలివితేటలు, శ్రమ జాతీయాభిమానం బాగా తోడయింది.

## 14.2.3. వ్యవసాయాభివృద్ధిలో సమస్యలు :

అంతర్యుద్ధానంతరం, పున నిర్మాణ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం దినదినాభివృద్ధి చెందుతూ వచ్చినది. వ్యవసాయ అధికోత్పత్తుల వలన కొన్ని సమస్యలు పీడించటం ప్రారంభించినాయి. అవి ఏవనగా 1. కావలసినన్ని రైలు మార్గాలు, రవాణా సౌకర్యాలు లేకపోవటం, 2. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, 3. ప్రాంతీయ కలహాలు, రాజకీయ వైషమ్యాలు, 4. అతివృష్టి, అనావృష్టి, 5. మంచు భీభత్సం, 6. విదేశీ మార్కెట్ల పోటీ, ఈ సమస్యల ఫలితంగా 1900 నాటికి నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పడిపోయినాయి. భూముల ధరలు పడిపోయినవి. ఈ సమస్యలు చర్చించటానికి కాంగ్రెస్ నందు రైతు ప్రతినిధులు లేరు. ఈ సమస్యలను అధిగమించటానికి ఒకే ఒక్క మార్గం అమెరికన్ రైతులకు కనిపించినది. అదే ఉద్యమాలను లేవదీయటం. తమ వ్యవసాయ వస్తువులకు గిట్టుబాటు ధరల కోసం, వేరే మార్గం వీరికి కనిపించలేదు. ఈ రకంగా ఈ కాలంలో మూడు గొప్ప ఉద్యమాలు వచ్చినవి. అవి ఏవనగా 1. గ్రేంజ్ ఉద్యమము, 2. గ్రీన్ బాక్ ఉద్యమము, 3. పాప్యులిస్ట్ ఉద్యమము.

## 14.2.4. గ్రేంజ్ ఉద్యమము - 1867 :

దీని సంస్థాపకుడు ఆ లివర్ హడ్సన్ కెల్లి. ఇతడు పాట్రన్స్ ఆఫ్ హస్ బెండరి' అనే సంస్థను స్థాపించాడు. దీనికి 'గ్యేంజ్' అనే మరొక పేరు గలదు. దీని ముఖ్య ఆశయం వ్యవసాయాన్ని, వ్యవసాయక విజ్ఞానాన్ని రైతులకందించటం. 1874 గ్రేంటజ్ సభ్యత్వం 7,50,000లకు పెరిగింది. మధ్య పశ్చిమ రాష్ట్రాలలో దీని ప్రాబల్యం బాగా పెరిగినది. రాను రాను రాష్ట్ర శాసనసభలలో గ్రేంజ్ అభ్యర్థులు అనేక మంది సభ్యులయినారు. సహకార ఫ్యాక్టరీలను, ఋణాలను గ్రేంజ్ స్థాపించినారు. 1873 నాటికి దాదాపు అన్ని రాష్ట్రాలలో గ్రేంజ్‌లు స్థాపించబడినాయి. గ్రేంజ్‌ల వత్తిడిపై కొన్ని రాష్ట్రాలలో చట్టాలు చేయబడినాయి. వీటి వల్ల రైల్వే కంపెనీలు, రవాణా సంస్థలు, రైతులకు అన్యాయం చేయటానికి వీలు లేకుండా పోయినది. 1876 తదనంతరం గ్రేంజ్‌ల ప్రాబల్యం తగ్గినది.

## 14.2.5. గ్రీన్ బాక్ ఉద్యమము - 1876 :

గ్రేంజర్ విప్లవానంతరం గ్రీన్‌బాక్ ఉద్యమము సంయుక్త రాష్ట్రాలలో అవతరించినది. ధరలను అరికట్టటం, కరెన్సి చలామణిని క్రమబద్ధీకరించటం ఈ ఉద్యమ లక్ష్యం. 1878లో 15 మంది గ్రీన్‌బాక్‌లు కాంగ్రెస్‌కు ఎన్నికయినారు. 1880 అధ్యక్ష ఎన్నికలలో గ్రీన్‌బాక్ అభ్యర్థిగా జేమ్స్ వీవర్ పోటీ చేసినాడు. 1888 తర్వాత ఈ ఉద్యమం బలహీనమైనది.

## 14.2.6. పాప్యులిస్ట్ ఉద్యమం - 1880 :

1880 నాటికి భూస్వాముల, పారిశ్రామిక వేత్తల ఆధిపత్యాన్ని ప్రతిఘటించే ఉద్యమాన్ని చిన్న రైతులు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో లేవనెత్తినారు. అందుకుగాను మాక్యునే, పోక్‌ల నాయకత్వంలో "నేషనల్ ఫార్మర్స్ ఎలయన్స్" ఒకటి స్థాపించబడినది. ఇందు రెండు శాఖలు గలవు. ఒకటి సదరన్ ఎలయన్స్, రెండవది నార్తరన్ ఎలయన్స్, ఇది కాక నీగ్రోలతో కూడిన 'కలర్ట్ ఫార్మర్స్' నేషనల్ అలయన్స్ ఒకటి వేరుగా వున్నది. ఈ ఎలయన్సుల ఆశయాలు ఈ విధంగానున్నాయి.

1. భూస్వాముల ఆధిపత్యం అంతమొందింపబడటం.

2. పాఠశాలలు, రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలపై ధనాన్ని వినియోగించటం

3. ప్రజాస్వామ్య విధానాన్ని పటిష్టపరుచుట

4. వ్యవసాయ ఉత్పత్తి ధరల పడిపోకుండా చూచుట

5. నీగ్రోలపై దోపిడి విధానాన్ని అరికట్టుట

1890 నాటికి అలయన్స్‌లను సంవిలీనం చేసి, క్రొత్తపార్టీని స్థాపించాలనే ప్రతిపాదన చేయబడింది. అయితే దక్షిణ ప్రాంతాలవారు వ్యతిరేకించినారు. పశ్చిమోత్తర రైతు సంఘాలు 1891లో పాప్యులిస్ట్ పార్టీని స్థాపించారు. ఈ పార్టీ నిర్వహించిన ఉద్యమ నాయకుడు టాంవాస్టన్. ఇతని నాయకత్వంలో ఉద్యమం బాగా బలపడినది. ఈ పార్టీ కోరికలు ఏవనగా 1. పామర జనానికి పాలనలో ఎక్కువ పాత్ర, అధికారము ఉండాలి. 2. చట్టబద్దమైన ఆర్థిక వ్యవస్థ పెంపొందింపచేయాలి, 3. సెనెటర్లను నేరుగా ఎన్నుకోవలెను, రిఫరెండం ప్రవేశపెట్టవలెను, 4. రైలు రోడ్లు, తంతి తపాలా, టెలిఫోన్లు ప్రభుత్వ యాజమాన్యంలో ఉండాలి. పని గంటలు తగ్గించాలి. రైతులకు తక్కువ వడ్డీకి ఋణాలు కల్పించాలి.

బంగారు ప్రమాణీకాన్ని (గోల్డ్ స్టాండర్డ్) పాప్యులిస్ట్‌లు వ్యతిరేకించినారు. సంపన్నులు అంతర్జాతీయంగా సంపదను తమ ఆధీనంలో నుంచుకోవటానికి పన్నిన పన్నాగమని భావించినారు. ఆర్థిక పరిస్థితులు క్షీణించాయి. నిరుద్యోగము అధికమైనది. 1900 సంవత్సరం నాటికి పాప్యులిస్ట్ విప్లవం బలహీనమైనది. నీగ్రోల రాజకీయ హక్కులపై దక్షిణ రాష్ట్రాలు ఆంక్షలు విధించటం, ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టకపోవటం దీనికి కారణము. అయితే క్రమముగా వ్యవసాయ పద్ధతులు, జీవన ప్రమాణాలు, ఆరోగ్య, విద్యా వ్యాప్తి బాగా జరిగినాయి. జాతి వివక్షకు విలువ లేకుండా పోయినది. దీనితో పాప్యులిస్ట్ ఉద్యమాలు సఫలమైనట్లే.

అంతర్యుద్ధానంతరం ఈ వ్యవసాయక విప్లవం వలన సంయుక్త రాష్ట్రాలలోని రైతులు చైతన్యవంతులగుటయే గాక ఆర్థికాభివృద్ధికి పాటుపడినారు. ఈ ఉద్యమాల స్ఫూర్తితో తమ సమస్యలను వివరించుకోవటానికి రైతులు అనేక సంఘాలను నెలకొల్పుకున్నారు. ఈ సంఘాలను నిర్వీర్యం చేయటానికి సంపన్నులు 'కామన్ వీల్' సైన్యాన్ని రూపొందించినారు.

## 14.2.7. నమూనా ప్రశ్నలు :

1. అంతర్యుద్ధానంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వ్యవసాయ విప్లవమునకు దోహదం చేసిన పరిస్థితులను వివరించుము.

2. 19వ శతాబ్దిలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వ్యవసాయక విప్లవం గురించి వివరించుము.

3. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పాప్యులిస్ట్ ఉద్యమం గురించి వివరించుము.

## 14.2.8. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America - A History
2. C.P. Hill - A History of the United States
3. Novins & Commager - A Short History of Unitied States
4. Telugu Acadmey Publication - America Samyuktha Rastrala Charithra


- ఎం. జె. జయప్రసాద్

**పాఠం - 14.3.**

# అంతర్యుద్ధానంతరం సాంస్కృతికాభివృద్ధి

## 14.3.0. లక్ష్యం :

అంతర్యుద్ధానంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పారిశ్రామికాభివృద్ధితోపాటు, సాంస్కృతికాభివృద్ధి కూడా సంభవించినది. ఈ సాంస్కృతికాభివృద్ధికి కూడా అనేక పరిస్థితులు దోహదం చేసినవి. వీటితో పాటు సాంకేతిక పరిజ్ఞానము అభివృద్ధి చెందినది. వీటన్నిటిని కూలంకషముగా వివరించి పరిశీలించుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


14.3.1. పరిచయము

14.3.2. నగర జీవనము

14.3.3. మత వ్యవస్థలు

14.3.4. విద్యాభివృద్ధి

14.3.5. వైజ్ఞానిక విద్యా వికాసం

14.3.6. వయోజన విద్య

14.3.7. వార్తా పత్రికలు

14.3.8. సారస్వాతాభ్యుదయము

14.3.9. సారాంశము

14.3.10. నమూనా ప్రశ్నలు

14.3.11. చదువదగిన గ్రంథాలు


## 14.3.1. పరిచయము :

అంతర్యుద్ధానంతరం సంయుక్త రాష్ట్రాలలో పారిశ్రామిక ప్రగతితో పాటు, సామాజిక వ్యక్తి వికాసం కూడా చేకూరినది. ఇది ఎట్లా సమకూరినదో, దానికి దోహదం చేసిన విద్యా, మత, సంస్కరణలు ఏవో ఈ క్రింద సంక్షిప్తముగా వివరించబడినాయి.

## 14.3.2. నగర జీవనము :

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అంతర్యుద్ధానంతరం వ్యక్తి వికాసానికి బాగా దోహదం చేసిన పరిస్థితులలో మొదటిది నగర జీవనం. 1866 నాటికి మొత్తం జనాభాలో 19.8%, 1990 నాటికి 39.7%, 1920 నాటికి 50% నగరాలలో జీవించారు. నాటి ప్రముఖ నగరాలు, న్యూయార్క్, చికాగో, ఫిలడెల్ఫియా, బోస్టన్, డెట్రాయిట్, లాస్ ఏంజల్స్, క్లీన్‌లాండ్, ఈ నగరాల మొత్తం జనాభా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో నాల్గోవంతు. నగర పాలకులు, ప్రజారోగ్య, నీటి వసతులు కల్పించారు. 1900 నాటికి దాదాపు 3000 పట్టణాలు నీటి సరఫరాలను పొందగలిగాయి. పోలీసు దళాలు, అగ్ని మాపక దళాలు, వైద్యశాలలు నియమింపబడ్డాయి. నగర ప్రజల స్థితిని మెరుగు

పరచటానికి స్వచ్ఛంద సంస్థలు నెలకొన్నాయి. అమెరికన్ పబ్లిక్ హెల్త్ సంస్థ, ఛారిటి ఆర్గనైజేషన్‌లు అలాంటివే. జేన్ ఆడమ్స్, లిలియన్ వార్ట్ వంటి సాంఘిక సేవకులు ఉత్సాహంతో పనిచేసినారు. మానసిక విశ్రాంతికి అమెరికన్లు బేస్‌బాల్, ముష్టి యుద్ధం, గుర్రపు స్వారి, గోల్ఫ్, టెన్నిస్ వంటి క్రీడలను, చలన చిత్రాలను ఏర్పరచుకొన్నారు. సౌభ్రాతృత్వ సంఘాలు ఎన్నో ఏర్పడ్డాయి. ఐరోపా నుండి సంయుక్త రాష్ట్రాలకు వచ్చే ఐరోపా వలస ప్రజలపై చట్టబద్ధమైన ఆంక్షలు విధించబడ్డాయి.

## 14.3.3. మత వ్యవస్థలు :

సంయుక్త రాష్ట్రాలలో సామాజిక వికాసానికి దోహదం చేసిన రెండవ అంశం క్రైస్తవ మత వ్యవస్థలు. ప్రొటెస్టాంట్ మతాచార్యులు బైబిల్ సిద్ధాంతాలను హేతువాదంతో పరిశీలించారు. దీనినే సోషల్ గాస్పెల్ అని పిలిచినారు. న్యాయమైన ఆర్థిక వ్యవస్థ ఉండాలని శ్రామికులకు నివాస పరిస్థితులు శ్రేష్టంగా వుండాలని, జాతీయ ప్రయోజనాలు అందరికి సమంగా వుండాలని కార్మికులకు తక్కువ పనిగంటలు ఉండాలని, సోషల్ గాస్పెల్ వర్గం ఘోషించినది. ఈ హేతుబద్ధమైన క్రైస్తవ వర్గానికి నాయకుడు వాసింగ్టన్ గ్లాడెన్. ఇతని నాయకత్వంలో ఇవాంజిలికల్ ఎలయన్స్ 'బ్రదర్ హుడ్ ఆఫ్ ద కింగ్‌డమ్' 'ఫెడరన్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్' వంటి క్రైస్తవ సంస్థలు నెలకొల్పబడ్డాయి. హేతువాద క్రైస్తవ మతాన్ని గ్రామీణ ప్రాంతాలలో చాటిన వాడు డ్వైట్‌మూడీ, ఇట్లా వుండగా కార్డినల్ గిబ్బన్ నాయకత్వంలో, కాథలిక్కులు సాంఘిక సంస్కరణలు కోరారు. కార్మిక యూనియన్ల యెడల వీరు ఎక్కువ అభిమానాన్ని చూపారు.

## 14.3.4. విద్యాభివృద్ధి :

అంతర్యుద్ధానంతరం సంయుక్త రాష్ట్రాలలో ఆర్థికాభివృద్ధి, నగరీకరణతో పాటు విద్యా, సాంస్కృతిక రంగాలలో అనేకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాలంలోనే యావత్ ఐరోపా ఖండం నుండి అనేక తెగలవారు అమెరికాకు వలస వచ్చి స్థిర నివాసములు ఏర్పాటు చేసుకున్నారు. ఈ వివిధ రకాలయిన తెగల జాతుల వారు అమెరికాలో స్థిరపడటము వలన సమాజములో అనేక మార్పులు జరిగినాయి. ఈ మార్పులు విద్య, సాంస్కృతిక విషయాలపై ప్రభావము చూపినవి.

ఈ పునః నిర్మాణ కాలంలోనే విద్యాభివృద్ధి పాఠశాలలు, కళాశాలలు స్థాపించుట ద్వారా చాలా త్వరిత గతిన విస్తరించినది. అనేక నగరాలలో విద్యా సంస్థలు ఏర్పడినవి. 1867 లో జాతీయ ప్రభుత్వము విద్యాకమీషన్‌ను ఏర్పాటు చేసినది. మొరిక్ చట్టం ద్వారా లక్షలాది ఎకరాల భూమిని కళాశాలల, యూనివర్సిటీల స్థాపనకు కేటాయించబడినది. 1870లో వైద్య, న్యాయ విద్యా సంస్థలు హర్వర్డ్‌లో ఎలియట్ కృషి వల్ల నెలకొల్పబడ్డాయి. ఆ తర్వాత వీటి ఏర్పాటు అన్ని రాష్ట్రాలలో జరిగినది. 1900 నాటికి 500 కాలేజీలు, 5000 గ్రాడ్యుయేట్ పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. పోస్టుగ్రాడ్యుయేట్, రీసెర్చ్ కేంద్రాలు వెలసినాయి. హార్వర్డ్, యూలే, కొలంబియా, కళాశాలలు విశ్వవిద్యాలయినాయి. ఇన్ని రకాలుగా విద్యాభివృద్ధి గాంచటముతో 1900 నాటికి అక్షరాస్యత పెరిగి నిరక్షరాస్యత 11%నికి పడిపోయినది. 1915 నాటికి 1200 పబ్లిక్ పాఠశాలలు పనిచేసినాయి. 1918 నాటికి రాష్ట్రాలలో ప్రభుత్వం ఉచిత విద్యను ప్రవేశపెట్టినది. ఇన్ని రకాలుగా ప్రభుత్వం విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నప్పటికి ఉపాధ్యాయుల స్థితిగతులు మెరుగుపడలేదు. అందుకనే అమెరికన్లు ఈ వృత్తిపై శ్రద్ధ వహింపలేదు. అయినప్పటికి ఐరోపా నుండి మరియు ఇతర దేశాల నుండి వలస వచ్చిన ఇతర జాతుల వారు ఇందులో నియమించబడిరి. ఈ విద్యా వ్యాప్తి ఫలితముగా అమెరికన్ విద్యార్థులలో జాతి విచక్షణా భావాలు సన్నగిల్లిపోయినవి. ఉన్నత విద్యావ్యాప్తి త్వరితగతిన అభివృద్ధి చెందినది.

## 14.3.5. ఉక్కు పరిశ్రమ :

పరిశోధనా విభాగంలో కృషికి మంచి ప్రోత్సాహం లభించినది. నాటి అగ్రశ్రేణి వైజ్ఞానిక వేత్తలలో విలియర్డ్ గిబ్స్ అగ్రగణ్యుడు. ఇతడు యూర్ విశ్వవిద్యాలయంలో గణిత, భౌతిక శాస్త్రాచార్యుడుగా పనిచేసినాడు. 'రూల్ ఆఫ్ పేజ్' అనే నూతన సిద్ధాంతాన్ని కనిపెట్టినాడు. లోహ శాస్త్రానికి ఇది ఎంతో తోడ్పడినది. ఆల్బర్ట్ మైఖేల్ అను శాస్త్రజ్ఞుడు కాంతి వేగాన్ని కనుగొన్నాడు (1879), అలాగే గణిత శాస్త్రానికి,

బెంజిమన్ పియర్స్ ఖగోళ శాస్త్రానికి, సైమన్ న్యూకరాంబ్ పాలాంటాలజికి, మార్స్ కోఫ్ జెనిటిక్స్ అమోఘ కృషి చేసినారు. వైద్య రంగంలో వాల్టర్ రీడ్ పర్యవేక్షణలో రోగ నిర్ణయ విధానాన్ని కనుగొని మరణాల సంఖ్యను తగ్గించారు. ముఖ్యంగా 'యల్లో ఫీవర్' ను వీరు అరికట్టినారు. వాతావరణ (1870), భూగర్భ (1879) పరిశోధన సంస్థ లేర్పడినాయి.

## 14.3.6. వయోజన విద్య :

వయోజన విద్యా వ్యాప్తికి ప్రభుత్వం శాయశక్తులా కృషి చేసింది. 1900 నాటికి 9000 గ్రంథాలయాలు పనిచేసినాయి. వేసవి పాఠశాలలు, ఉపన్యాస బృందాలు పనిచేసినాయి. లూయిస్ మిల్లర్, జాన్ విన్సెంట్, విలియం జేమ్స్ జోసయా రైస్, జెనింగ్స్‌లు విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేసినారు. మహిళా మండలులు దేశవ్యాప్తంగా ఏర్పడినాయి. మహిళా విద్యా వ్యాప్తిని ప్రోత్సహించారు.

## 14.3.7. వార్తా పత్రికలు :

సంయుక్త రాష్ట్రాలలో వ్యక్తి, సామాజిక వికాసానికి పత్రికలు, వార్తా పత్రికలు బాగుగా ఉపయోగపడినాయి. ప్రపంచ వ్యవహారాలను అమెరికన్ పౌరులకు అందించటానికి వార్తా పత్రికలు వెలువడ్డాయి. 1900 నాటికి వార్తా పత్రికల సంఖ్య 16,200కు పెరిగినది. మొత్తం ప్రపంచ పత్రికల కంటె ఇది ఎక్కువ. 1892లో అసోసియేటెడ్ ప్రెస్ ఏర్పడినది. దీని సహాయంతో విస్తృతమైన సమాచార వ్యవస్థ ఏర్పడినది. గ్రీలి నడిపిన 'ట్రిబ్యున్', బ్రియంట్ నడిపిన' ఈవినింగ్ పోస్ట్,' నాటి ప్రముఖ పత్రికలు, 'న్యూయార్క్ వరల్డ్ అను పత్రికను పులిట్జర్ నడిపినాడు. దీనిని ఎక్కువ మంది చదివినారు. విలియం హార్ట్ 'న్యూయార్క్ జనరల్'ను నడిపినాడు. వీరు ఉదార, జాతీయభావాలను ప్రచారం చేసినారు. బడా వ్యాపారాన్ని ఖండించి, సామ్యవాదాన్ని హార్ట్ ప్రచారం చేసినాడు. 1900 నాటికి పెద్ద వార్తా పత్రికలలో పోటీ చేయలేక చిన్న పత్రికలు అంతర్ధానమయినవి. వార్తా పత్రికలను నిర్వహించే సిండికేట్లు మహా నగరాలలో వెలసినవి. నిష్పక్షపాత రాజకీయాలను వ్రాయుటలోను, సంపాదకీయాలను వ్రాయటంలోను 'న్యూయార్క్ టైమ్స్' ను మించిన పత్రిక లేదు. ఆనాటి ప్రముఖ మేగజైన్స్, 'అట్లాంటిక్ మంత్లీ' సెంచురి 'నేషన్' 'లేడీస్ హోమ్ జర్నల్'. ఈ రకంగా పత్రికలు మేగ్జయిన్స్, మొదలగునవి ప్రజలను చైతన్యవంతులను చేయుటలో ప్రధాన పాత్ర పోషించినవి.

## 14.2.8. సారస్వతాభ్యుదయము :

అమెరికన్‌ల మేధా ప్రగతికి సారస్వతం ఎంతగానో తోడ్పడినది. సారస్వతంలో నవీనత్వాన్ని చేర్చిన మొదటి రచయిత్రి ఎమిలీడికిన్సన్, జెనెట్, విల్కిన్స్ ప్రీమన్ అనేవారు భావ కవిత్వాన్ని వెదజల్లారు. కవిత్వానికి, సంగీతానికి మధ్యగల సంబంధాన్ని సిడ్నీ లెనార్ ఘనంగా చిత్రించినాడు. థామస్ నెల్సన్ పగె, మేంజాన్సన్‌లు గొప్ప నవలాకారులుగా ప్రసిద్ధిగాంచారు. సాంప్రదాయాలను ప్రతిబింబించే రచనలను హో, కిర్క్‌లండ్, రిలీ చేసారు. చమత్కార సాహితీ రచనలు, కథలు ఎన్నో అవతరించినాయి.

అమెరికాలో సాహిత ప్రవంతిని కాంతివంతం చేసిన వారిద్దరున్నారు. ఒకరు మార్క్ ట్వైన్, రెండవ వారు హెన్రి జేమ్స్. సున్నితంగా పరిభాషిక సరళిలో ఆంగ్లేయ సాహిత్యాన్ని అమెరికా శైలిలో నెలకొల్పినాడు, మార్క్ ట్వైన్. మానవత్వాన్ని సమర్ధించటం, అన్యాయాన్ని ఖండించటం, అవినీతిని, భూస్వామిక పద్దతులను వ్యతిరేకిస్తూ రూపొందించిన గ్రంథాలను అమెరికన్‌లకు అందించినాడు. నాగరికత అవినీతికి మరొక పేరని, నాగరికత పెరిగిన కొద్ది అవినీతి పెరిగినట్లేనని వ్యాఖ్యానించాడు.

యూరోపియన్ల నాగరికతను ప్రమాణికంగా తీసుకొని అమెరికా జీవితాన్ని నిర్ణయించినాడు హెన్రి జేమ్స్. ఐరోపావారి సంస్కృతి ద్వారానే అమెరికా సంస్కృతి పెంపొందుతుందని ఇతని వాదన. ఇతని 50 సంవత్సరాల సాహితీ జీవితానికి మూడు రకాలుగా విభజించవచ్చు. 1865-1882 ఐరోపాలోని అమెరికన్ల జీవితాన్ని చిత్రించాడు. 1882-1897 వరకు ఇంగ్లండ్‌లో ఉన్నత వర్గాల జీవితాన్ని వర్ణించినాడు. 1897 తర్వాత అంతర్జాతీయ రంగాన్ని రచించినాడు. ఇతని రచనలలో ఇతనికి మంచిపేరును సంపాదించిన గ్రంథాలు 'పైసీ మిల్లర్', ది పోట్రైట్ ఆఫ్ లేడీ'', 'ది యూరోపియన్స్', ది బోస్టోనియన్స్', ది అంబేసిడర్స్, "ది వింగ్స్ ఆఫ్ ది డౌ'', ది గోల్డెన్ బౌ.

ప్రముఖ నవలా రచయిత విలియం డీన్ హావెల్స్ అమెరికన్ల నవీన జీవిత విధాన్ని వున్నది వున్నట్లుగా చిత్రించాడు. మధ్య తరగతి ప్రజల జీవిత విధానాన్ని, నైతిక విలువల గురించి వివరించాడు. ఇతనికి పేరు తెచ్చిన ప్రముఖ నవల పేరు "ది రైజ్ ఆఫ్ సిలాస్ లఫమ్" నూతన పారిశ్రామిక జీవిత స్వరూపాన్ని ప్రతిబింబించే సరిక్రొత్త రచనలు చేసినవాడు హామ్లిన్ గార్లండ్. ఇతని సాహస గాథలను రచించినాడు. 'మైన్ ట్రావెల్డ్ రోడ్స్, తీవ్రవాద సాహిత్యాన్ని రాసినవారు స్టీఫెన్ క్రైన్, ఫ్రాంక్‌నోరిస్, థియోడర్ డ్రెసర్ మానవుడు విపత్కర పరిస్థితులలో ఎలా ప్రవర్తిసాడు అనే అంశంను వివరించిన వాడు క్రెస్. ఇతని గొప్ప నవల 'ది రెడ్ బేడ్జ్ ఆఫ్ కరేజ్' మొదటి సారి యుద్ధానికి వెళ్లే సైనికుని మనఃస్తత్వం ఎలా వుంటుందో దీనిలో వివరించినాడు. నోరిస్ అమెరికన్ల ఆర్థిక - సాంఘిక పరిస్థితులపై రచనలు చేసినాడు. ఈతని గ్రంథం 'ది ఆక్టోపస్', ది పిట్. అమెరికన్ సాహిత్యంలో పద్య నాటకాలను ప్రవేశపెట్టినవాడు వి.యం. మూడి. ఇంకను అనేక మంది సంగీతంలోను, జానపద గేయాలు రచించటంలో ప్రావీణ్యం పొందారు. ఈ రకమైన సాహితీ ప్రవంతి అమెరికన్లను చైతన్యులను చేసినది.

## 14.3.9. సారాంశము :

సంయుక్త రాష్ట్రాలలో అమెరికన్ల చైతన్యులను చేయుటమే కాక వ్యక్తి వికాశమునకు విస్తృతమైన మేలు చేయసాయని పై అంశాలు చెప్పకనే చెపుతున్నాయి. నగర జీవితం అమెరికన్లలో సంకుచితత్వాన్ని తొలగించి విశాల దృష్టిని పెంచాయి. క్రైస్తవ్యం శ్రామిక వికాసాన్ని పెంచినది. విస్తృతమైన నైతిక విలువలను పెంపొందింపచేసినది. విస్తృతమైన విద్యా వ్యాప్తి ద్వారా వ్యక్తిలో విజ్ఞానాన్ని, జిజ్ఞాసను, పరిశోధనా ఆలోచనలు పెంపొందింపచేసినది. వయోజన విద్య, ద్వారాను, వార్తా పత్రికల ద్వారాను పఠానాశక్తిని, సాంఘిక, రాజకీయ చైతన్యాన్ని రగిల్చింది. అమెరికన్ పౌరుడు ప్రపంచాన్ని క్షణంలో అర్థం చేసుకోవడానికి వార్తా పత్రికలు దోహదం చేసాయి. శాస్త్ర సిద్ధాంతాలు జాతి ఉన్నతాన్ని, భవిష్యత్ నిర్ణయ మేధస్సుని మానవునికి కలుగజేసాయి. సాస్వతాభ్యుదయం అమెరికా జీవన శైలిని మార్చి వేసినది. విద్యా, వార్తా పత్రికలు, జాతి, సారస్వతాభ్యుదయములు అమెరికాను అగ్రరాజ్యంగాను దిద్ది సామ్రాజ్య పథంలో కాలిడినది.

## 14.3.11. నమూనా ప్రశ్నలు :

1. అంతర్యుద్ధానంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో సాంస్కృతాభివృద్ధిని వివరించుము.
2. 19వ శతాబ్దంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో సామాజికాభివృద్ధిని వివరించుము.

## 14.3.12. చదువదగిన గ్రంథాలు :


1. Novins & Commager - A Short History of Unitied States
2. H.B. Parkes - The United States of America - A History
3. C.P. Hill - A History of the United States
4. Telugu Acadmey Publication - America Samyuktha Rastrala Charithra


- ఎం. జె. జయప్రసాద్

పాఠం - 15

# సామ్రాజ్య పథంలో అమెరికా - స్పానిష్ అమెరికన్‌ల యుద్ధము - 1898

## 15.0. లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాలు తమ విదేశాంగ విధానంలో సామ్రాజ్యత్వానికి స్పానిష్ అమెరికన్ యుద్ధమొక తార్కాణము. ఈ యుద్ధము చేయటానికి గల కారణములు అనేక ప్రాంతములపై ఆధిపత్యము సంపాదించాలనే కాంక్షలను వివరించటమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


15.1. పరిచయము

15.2. సామ్రాజ్యతత్వానికి గల కారణములు

15.3. హవాయ్ దీవులు పొందుట

15.4. కరేబియన్ ప్రాంతంపై ఆధిపత్యం

15.5. స్పెయిన్‌తో యుద్ధం

15.6. తలుపులు తెరిచి ఉంచే విధానం

15.7. నమూనా ప్రశ్నలు

15.8. చదువదగిన గ్రంధాలు


## 15.1. పరిచయము :

అంతర్యుద్ధం తర్వాత దాదాపు మూడు దశాబ్దాల పాటు అంటే 1860 నుండి 1890 వరకు సంయుక్త రాష్ట్రాలు తన అంతరంగిక వ్యవహారాలపట్ల, ముఖ్యంగా చితికి పోయిన తన ఆర్థిక వ్యవస్థను పునర్ నిర్మించుకోవడంలోనే శ్రద్ధ వహించినది. కనుక విదేశాలతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవడానికి వీలు కలుగలేదు. అంతర్జాతీయ వ్యవహారాలలో చొరవ చూపలేదు. వీ విధానాన్ని ఏకాంత విధానం అందురు. ఈ ఏకాంత విధాన ఫలితంగా అమెరికా పారిశ్రామిక, సాంఘిక, సాహిత్య కేంద్రాలలో అభ్యుదయాన్ని సాధించినది. 1890 నుండి అమెరికా సామ్రాజ్య పథంలో కాలుపెట్టి ఏకాంత విధానానికి స్వస్తి చెప్పినది. కొత్త వలసలకై తహతహలాడినది. కరేబియన్ ప్రాంతంలో ఆధిపత్యానికి పోరాడినది. క్యూబా పోర్టోరికో, ఫిలిప్పైన్స్‌లపై ఆధిపత్యాన్ని ఆర్జించింది. బ్రిటన్ స్పెయిన్‌లతో ఘర్షణ పడినది.

అమెరికా తన ఏకాంత విధానానికి స్వస్తి చెప్పి సామ్రాజ్య తత్వానికి అనుసరించటానికి అనేక కారణములు గలవు.

## 15.2. సామ్రాజ్యతత్వానికి గల కారణములు :

1. ఐరోపా రాజ్యాల సామ్రాజ్యతత్వం, సంయుక్త రాష్ట్రాలను సామ్రాజ్య మార్గానికి పురి కొల్పినది. బ్రిటన్, జర్మని, ఫ్రాన్సులు సైనిక శక్తిని కలిగి ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వలస పాలన కల్గివున్నాయి. జర్మని - ఆస్ట్రియా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలకు సైనిక

ఒప్పందములు కలిగియున్నవి. కనుక తనకు రక్షణ లేదని అమెరికా భావించినది. అట్లాంటిక్ పై ఇంగ్లండ్ ఆధిపత్యం, లాటిన్ అమెరికాలో స్పెయిన్ పలుకుబడి అమెరికా భయపెట్టినవి. కనుక తాను కూడా సామ్రాజ్య విధానాన్ని అనుసరించడం మంచిదని భావించినది.

2. తాను ఉత్పత్తి చేసిన వ్యవసాయక, పారిశ్రామిక ఉత్పత్తులకు విదేశీ మార్కెట్లు అవసరమయినాయి. వీటిని సాధించాలంటే ఐరోపా రాజ్యాలతో పోటీ పడక తప్పదు. కనుక ఏకాంత వాసానికి స్వస్తి చెప్పి నూతన మార్కెట్లు అన్వేషించి అక్కడ పెట్టుబడులు వినియోగించాలని అమెరికా భావించినది.

3. అమెరికాను సామ్రాజ్యంగా రూపొందించాలని నాటి రాజకీయ, సాహిత్య వేత్తలు గట్టిగా పట్టుబట్టినారు. వారిలో ప్రముఖులు ధియోడర్ రూజ్‌వెల్ట్ హెన్రీ కాబట్ లాడ్జ్, ఆల్బర్ట్ బెవరిడ్జ్. కిప్లింగ్ వంటి రచయితలు, మహన్ వంటి సైనికాధికారులు దీన్ని బాగా ప్రేరేపించినారు.

4. క్లీన్‌లాండ్ పరిపాలనలో సంయుక్త రాష్ట్రాల నౌకా బలం బాగా పెరిగినది. యుద్ధ నౌకలు నిర్మించటానికి కాంగ్రెస్ నిధులు ఖర్చు చేసింది. 1890 నాటికి నౌకా బలం పెరగటమే కాక పటిష్ట పడినది. అమెరికా సముద్రాదిపత్యం స్థాపించటం కోసం ఇది పురికొల్పినది.

## 15.3. హవాయ్ దీవులను పొందుట :

పసిపిక్ ప్రాంతంలో సంయుక్త రాష్ట్రాల వలసలు స్థాపించే కార్యక్రమాన్ని జాన్‌సన్ ప్రారంభించినాడు. 1867లో రష్యానుండి అలస్కాను 72,00,000 డాలర్లకు జాన్సన్ కొన్నాడు. ఇదే సమయంలో మిడ్వే దీవులను ఆక్రమించుకొన్నాడు. 1875 నాటికి అనేక మంది అమెరికన్లు హవాయ్ దీవులందు ప్రవేశించి ప్రభుత్వ అంగీకారాన్ని పొంది పంచదార, పైనేపిల్ తోటలను పెంచటం ద్వారా ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యాన్ని ఆర్జించారు. 1887లో పెరల్ హర్బర్‌లో నౌకా స్థావరాన్ని అమెరికా నెలకొల్పినది. 1891లో అధికారంలోనికి వచ్చిన హవాయ్ రాణి వీరిపై ఆంక్షలు విధించింది. తత్ఫలితంగా అమెరికన్లు వ్యతిరేకించినారు. మెకెన్లి అధ్యక్షుడయినాక 1898లో హవాయ్‌ను అమెరికా ఆక్రమించినది. 1959లో ఇది సంయుక్త రాష్ట్రాలలో అంతర్భాగమయినది.

## 15.4. కరేబియన్ ప్రాంతంపై ఆధిపత్యం :

1895లో వెనిజులాకు, బ్రిటీష్ వలసైన గయానాకు మధ్య సరిహద్దు తగాదా వచ్చింది. అమెరికా హెచ్చరికపై తగాదాను మధ్యవర్తుల సంఘానికి నివేదించటానికి బ్రిటన్ అంగీకరించింది. జర్మనీ జోక్యాన్ని నివారించటానికి కరేబియన్‌లో అమెరికా ఆధిపత్యాని అయిష్టంగా అంగీకరించింది. బ్రిటన్ తన నౌకా దళాన్ని ఉపసంహకరించుకొన్నది.

## 15.5. స్పెయిన్‌తో యుద్ధం - 1898 :

1898 స్పెయిన్‌తో అమెరికా యుద్ధం ప్రారంభమయ్యే నాటికి క్యూబా, ఫిలిప్పైన్స్, ప్యూర్టోరికోలపై స్పెయిన్ అధికారం కలిగివుంది. నిరంకుశమైన స్పెయిన్ పరిపాలనను అంతమొందించటానికి క్యూబన్లు 1895లో విప్లవం చేసారు. ఈ విప్లవాన్ని స్పెయిన్ ఘోరంగా అణచివేసినది. క్యూబాలో జోక్యం చేసుకోవలసినదిగా అమెరికన్లు అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. ఈ విధంగా జోక్యం చేసుకొనుట ద్వారా అమెరికాకు మూడు ప్రయోజనములు చేకూరును. ఒకటి కరేబియన్‌లో నౌకా స్థావరము ఏర్పాటు చేసుకోవచ్చు, రెండు ఫిలిప్పైన్స్‌ను స్వాధీనం చేసుకోవచ్చు, మూడు దూర ప్రాశ్చ్యంలో అధికార విస్తరణకు వీలుంటుంది. కనుక స్పెయిన్‌తో యుద్ధానికి దిగాలని అమెరికాలో వత్తిడి వచ్చినది. ఇది ఇలా వుండగా 1898లో హవానా దగ్గర అమెరికా యుద్ధ నౌక 'మెయిన్' అనే దానిని ఎవరో పేల్చివేసినారు. ఇది స్పెయిన్ పనేనని అమెరికన్లు భావించారు. అమెరికా స్పెయిన్ నుండి నష్ట పరిహారాన్ని కోరింది. అందుకు స్పెయిన్ సమ్మతించినది. అయినా అమెరికన్లు సంతృప్తి చెందక యుద్ధాన్ని ప్రేరేపించినారు. చేసేది లేక కాంగ్రెస్ స్పెయిన్‌పై యుద్ధాన్ని ప్రకటించినది.

1898 మే నెలలో మనిలా సింధు శాఖలోని స్పానిష్ యుద్ధ నౌకలను డివి నాయకత్వంలో అమెరికన్ నౌకలు నాశనం చేసినాయి. అమెరికన్ సైన్యం మనీలాలో దిగింది. జులైలో కాంటియాగో వద్ద స్పానిష్ నౌకా దళం అమెరికన్ నౌకా దళం చేతిలో నాశనం అయినది.

1898 డిశంబరులో పారిస్‌లో సంధి జరిగినది. ఈ సంధి ప్రకారముగా క్యూబాను స్పెయిన్ విడిచిపెట్టినది. అమెరికా క్యూబాను స్వీకరించినది. ఫిలిప్పైన్స్, పురిటోరికోలు అమెరికాకు ఇవ్వబడినవి. క్యూబాలో తాత్కాలికముగా సైనిక గవర్నర్ నియమించబడినాడు. క్యూబాను కాపాడే నిమిత్తం అమెరికా జోక్యం చేసుకునే హక్కు పొందింది. ప్యూరిటోరికో 1947 వరకు అమెరికా రక్షిత ప్రాంతంగా వుంది. ఆ తర్వాత స్వతంత్ర్యమైంది. ఫిలిప్పైన్ ప్రజలు అగ్వినాల్డో నాయకత్వంలో సంయుక్త రాష్ట్రాలకు వ్యతిరేఖముగా విప్లవం చేసారు. దీనిని అణచటానికి 70,000 సైన్యంతో జనరల్ మెకార్థర్ పంపబడ్డాడు. మూడేండ్ల పోరాటం తర్వాత 1901లో ఫిలప్పైన్స్‌లో పౌర పాలన ఏర్పడినది. ఈ విధంగా ఫిలిప్పైన్స్, క్యూబా ప్యూరిటోరికోలు అమెరికా ఆధీనంలోకి వచ్చాయి. వీటి ఆర్థిక, విద్యా, వైజ్ఞానికాభివృద్ధికి అమెరికా ఇతోధికంగా కృషి చేసింది.

ఈ విధంగా సంయుక్త రాష్ట్రాలు ఫసిపిక్, కరేబియన్ ప్రాంతాలపై ఐరోపా రాజ్యాల ఆధిపత్యాన్ని తగ్గిస్తూ తన నౌకా స్థావరాల స్థాపన ద్వారా ప్రపంచ నాయకత్వానికి మార్గం సుగమనం చేసుకొన్నది. అమెరికా ఏకాంత వాదం సామ్రాజ్య వాదంగా మారిపోయినది.

## 15.6. తలుపులు తెరిచి వుంచే విధానం (ఓపెన్ డోర్ పాలసి) చైనాలో స్వేచ్ఛా వ్యాపారం :

19వ శతాబ్దం మధ్య నాటికి సంయుక్త రాష్ట్రాలు చైనాలో వ్యాపార సంబంధాలు ఏర్పాటు చేసుకున్నది. చైనాతో వ్యాపారం చాలా లాభసాటిగా నుండుట వలన మార్కెట్లను పొందేందుకు ఐరోపా రాజ్యము పోటీ పడ్డాయి. వీటిలో ప్రముఖ రాజ్యాలు బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా జర్మనీ మరియు జపాన్‌లు. ఈ రాజ్యాలు చైనా ప్రాంతాలను తమ రక్షణలో వుంచుకొన్నాయి. భవిష్యత్‌లో చైనా ఐరోపా రాజ్యాలు, జపాన్‌ల హస్తగతమయిన తమ సామ్రాజ్యమునకు ముప్పు కలుగునని అమెరికా భావించినది. అప్పటికే చైనాలో అమెరికా వ్యాపారం చాలా లాభసాటిగానున్నది. దీని వలన ఇంగ్లండ్ వ్యాపారము దెబ్బ తినునని ఇంగ్లండ్ భావించినది. మిగిలిన ఐరోపా రాజ్యాల కంటే తన వ్యాపారం అధికముగా నుండవలెనను భావంతో 1898లో చైనాలో 'స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని (ఓపెన్ డోర్ పాలసి) ప్రవేశపెట్టటం బాగుంటుందని అమెరికాకు బ్రిటన్ సూచించినది. అంతట అమెరికా విదేశాంగ కార్యదర్శియైన జాన్ హే 'ఏ దేశము చైనా భూభాగమును హస్తగతము చేసుకొనరాదని, చైనాతో వ్యాపారం చేసుకోవటానికి, లాభాలు పొందటానికి అందరికి సమాన హక్కులు కలవని, ఒకే రక్షణ సుంకములు, రైల్వే చార్జీలు కలిగి వుండవలెనని, అన్ని రేవు పట్టణములు అందరికి తెరిచి వుంచవలెనని సూత్రములను ప్రతిపాదించెను. దీనినే తలుపులు తెరిచి వుంచే విధానమందురు. ఈ విధానములు అన్ని చైనాలో వ్యాపార దేశములు ఆమోదమునకు పంపగా ఒక రష్యా తిరస్కరించినది. తరువాత 1900 నాటికి అన్ని దేశాలు అంగీకారమును తెలిపినవి. ఈ విధానము వలన చైనా రాజకీయ స్వాతంత్ర్యములు పరిరక్షింపబడినను చైనా బలహీనతలు బయటపడినవి, ప్రతిష్ట అడుగంటినది. ఇది ఇట్లుండగా చైనాలో విదేశీయుల చర్యలను నిరసిస్తూ వారికి వ్యతిరేకముగా చైనీయులు ఒక విప్లవాన్ని లేవదీసినారు. దీనిని 'బాక్సర్' విప్లవమని అందురు.

## 15.7. నమూనా ప్రశ్నలు :

1. 1898 స్పానిష్ - అమెరికన్ యుద్ధమునకు గల కారణములు వివరించుము.
2. అమెరికా సామ్రాజ్య విధానమును వివరించుము.
3. అమెరికా సంయుక్త రాష్ట్రాలు చైనాలో ఓపెన్ డోర్ విధానమును వివరించుము.

## 14.3.12. చదువదగిన గ్రంథాలు :


1. Henry Bombard Parkes - A Short History of United States of America
2. C.P. Hill - A History of the United States
3. Novins & Commager - A Short History of United States
4. Telugu Acadmey Publication - America Samyuktha Rastrala Charithra


- ఎం. జె. జయప్రసాద్

పాఠం - 16.1.

# థియోడర్ రూజ్ వెల్ట్ (1901-1909) మరియు విలియం హువార్ట్ టాఫ్ట్ (1909-1913)

## 16.1.0. లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు 1901 నుండి 1909 వరకు అధ్యక్షునిగా ఉన్న థియోడర్ రూజ్వెల్ట్ మరియు విలియం హువార్ట్ టాఫ్ట్‌లు అనుసరించిన అంతరంగిక విధానాలను, విదేశాంగ విధానాలను, సంస్కరణలను, వారు అనుసరించిన పరిపాలనా విధానాలను గురించి తెలియచేయుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


16.1.1. తొలి జీవితం

16.1.2. స్వదేశీ విధానం

16.1.3. షెర్మన్ వ్యతిరేక చట్టం - ట్రస్టుల పై ఆధిపత్యం

16.1.4. అంతరాష్ట్రీయ వాణిజ్యంపై ఆంక్షలు

16.1.5. బొగ్గు గని కార్మికుల సమ్మె

16.1.6. జాతీయ సహజ వనరుల రక్షణ

16.1.7. ఆహార ఔషదాల చట్టము

16.1.8. విదేశాంగ విధానము

16.1.9. జపాన్‌తో సంబంధాలు

16.1.10. మొరాకో సంక్షోభము

16.1.11. కరేబియన్ విధానము

16.1.12. బడితె కర్ర విధానము - పనామా కాలువ సమస్య

16.1.13. నమూనా ప్రశ్నలు

16.1.14. చదువదగిన గ్రంథాలు


## 16.1.1. తొలి జీవితం :

1901లో అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు మెకెన్లీ హత్య గావించబడటంతో అప్పటి అమెరికా ఉపాధ్యక్షుడయిన థియోడర్ రూజ్‌వెల్ట్ అధ్యక్షుడయినాడు. ప్రొ. సి.పి. హిల్ మాటలలో చెప్పవలెనన్న "నూతన అధ్యక్షుడు లింకన్ తర్వాత వచ్చిన వారి కంటే ఇతడు గొప్పవాడు. ఇతని జీవిత కాలంలో మంచి ప్రజాదరణ పొందినాడు. ఇతను గొప్ప రచయితగాను, సైనికునిగాను, రాజకీయవేత్తగాను, ప్రకృతివేత్తగాను అమెరికన్ ప్రజలకు సుపరిచితుడు.

థియోడర్ రూజ్‌వెల్ట్ న్యూయార్క్‌లో జన్మించాడు. హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసము చేసినాడు. న్యూయార్క్ శాసన సంస్థలో సభ్యుడుగాను, సివిల్ సర్వీస్ కమీషన్ సభ్యుడుగాను, న్యూయార్క్ నగర పోలీస్ కమీషనర్‌గాను, నౌకాదళంలో సహాయ కార్యదర్శిగాను పనిచేసాడు. 1898లో సాన్‌జాన్ యుద్ధ రంగంలో 'రఫ్ రైడర్స్' దళాన్ని నడిపి మంచి విజయం సాధించి, గుర్తింపు సంపాదించినాడు. యుద్ధానంతరం ఇదే సంవత్సరంలో న్యూయార్క్ గవర్నరయినాడు. 1900 సంవత్సరములో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో రూజ్‌వెల్ట్ ఉపాధ్యక్షుడయినాడు. 1904లో రెండవ మారు అధ్యక్షుడుగా ఎన్నికయినాడు.

## 16.1.2. థియోడర్ రూజ్‌వెల్ట్ స్వదేశీ విధానము :

రూజ్‌వెల్ట్ అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడయే నాటికి దేశ రాజకీయ పరిస్థితులు బాగుగా లేవు. పరిపాలనపై అవినీతి, ఉన్నత వర్గాల ప్రభావం అధికముగా ఉంది. ఆర్థిక వ్యవస్థ దిగజారిపోయినది. ఈ పరిస్థితి అంతమొందించటానికి, చక్కదిద్దటానికి థియోడర్ రూజ్‌వెల్ట్ తన శాయశక్తులా కృషిచేసి సత్ఫలితాలను సాధించ నెంచి అభ్యుదయ సంస్కరణలు ప్రవేశపెట్టినాడు.

## 16.1.3. షెర్మన్ వ్యతిరేక చట్టం, ట్రస్టులపై ఆధిపత్యం :

థియోడర్ కాలంలో అభ్యుదయము ప్రారంభమయిందనటానికి మొదటి నిదర్శనం ట్రస్టులను నియంత్రించటం. ఈ పని 1902లో ప్రారంభమయినది. షెర్మన్ చట్టం ఈ క్రింది నార్తరన్ సెక్యూరిటీస్ కంపెనీపై సుప్రీం కోర్టులో దావాను వేసాడు. కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చినది. తర్వాత స్టాండర్డ్ అయిన కంపెనీ అమెరికన్ టుబాకో కంపెనీ, న్యూ హెవెన్‌రైల్ రోడ్ కంపెనీలపై దావా వేసింది. తన అధ్యక్ష కాలంలో దాదాపు 43 కంపెనీలను తన అజమాయిషిలోనికి తెచ్చాడు. గుత్తాధిపత్య పాలనపై సంపద ప్రభావం నశించినది. దుష్ప్రవర్తన, అవినీతి ఆలవాలమైన సంస్థలను సంస్కరించినాడు.

## 16.1.4. అంతరాష్ట్రీయ వాణిజ్యంపై ఆంక్షలు :

రూజ్‌వెల్ట్ అభ్యుదయ వాదని నిరూపించే మరొక అంశం రాష్ట్రీయ వాణిజ్యంపై ఆంక్షలను విధించటం. 1903 ఎల్కిన్స్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రవేశ పెట్టినది. రైలు రోడ్లు ప్రకటించిన ధరలను మార్చరాదని, రిబేట్లు ఇవ్వరాదని, ఈ చట్టం నిషేదించినది. ఈ చట్టం ఉల్లంఘించిన అనేక కంపెనీలపై రూజ్వెల్ట్ జరిమానా విధించినాడు. 1908లో కాంగ్రెస్ హెవ్‌బర్న్ చట్టాన్ని ప్రవేశపెట్టినది. కార్పోరేషన్లు విధించిన హేతువిరుద్ధమైన ధరలను తగ్గించే అధికారాన్ని అంతరాష్ట్రీయ కమిషన్‌కు ఈ చట్టం ఇచ్చింది. అయితే కమీషన్ నిర్ణయం పై కార్పోరేషన్లు కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. అకౌంటును తయారు చేసే బాధ్యతను చట్టం కార్పోరేషన్లపై పెట్టింది. దాని వల్ల రైలు రోడ్లు ఆర్జించిన ఆదాయంలో ఎంతో ప్రభుత్వానికి తెలిసేది. అనేక కార్పోరేషన్లకు వ్యతిరేఖంగా వేలాది ఫిర్యాదులు కమీషన్‌కు అందాయి.

## 16.1.5. బొగ్గుగని కార్మికుల సమ్మె :

అమెరికాలో ఆంత్రోసైట్ బొగ్గుగని కార్మికులు 1902లో జాన్ మిచెల్ నాయకత్వంలో సమ్మె చేసినారు. జీతాలు పెంచాలని, పని గంటలు తగ్గించాలని, రక్షణ కల్పించాలని బొగ్గుగని కార్మికులు సమ్మెచేసినారు. దీనితో బొగ్గుకరువైనది. అంతట రూజ్వెల్ట్ కార్మికుల పక్షాన జోక్యం కలిగించుకొని, ఒక మధ్యవర్తిత్వ సంఘాన్ని నియమించి సమ్మెను పరిష్కరింప చేసినాడు. రూజ్వెల్ట్ కార్మికుల అభ్యుదయాన్ని కాంక్షించాడని ఈ బొగ్గుగని కార్మికుల సమ్మె పరిష్కారము ఒక గొప్ప దృష్టాంతము. గని పని వారి కోర్కెలు పరిష్కరించబడ్డాయి.

## 16.1.6. జాతీయ సహజ వనరుల రక్షణ :

సహజ వనరులను సంరక్షించటం ప్రధాన కర్తవ్యంగా రూజ్వెల్ట్ భావించినాడు. అధ్యక్షుడుగా తన తొలి ప్రసంగంలో అడవులు, నీరుని సంరక్షించటం అంతరంగిక సమస్యలలో ప్రముఖమైనవిగా ఉద్ఘాటించాడు. అతని పరిపాలనా కాలంలో 60 మిలియన్ల హెక్టార్లలో కలపను

సాగు చేయించాడు. 34 మిలియన్ల హెక్టారులలో ఖనిజాలను ఉత్పత్తి చేయించాడు. 1802 న్యూ లాండ్స్ చట్టం ద్వారా ఇరిగేషన్ ప్రాజెక్టులను స్థాపించడానికి అధికారము పొందినాడు. దీని ఫలితంగా పశ్చిమ రాష్ట్రాలలో చాలా ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. జాతీయ వనరుల రక్షణలో గిఫ్ఫర్ట్ పించప్ రూజ్వెల్ట్‌కు బాగా తోడ్పడ్డాడు. మొత్తం మీద రూజ్వెల్ట్ 13 కోట్ల ఎకరాలను అటవీ సంపదకు కేటాయించినాడు.

## 16.1.7. ఆహారము, ఔషదాల చట్టము :

ఆహారము ఔషదములలో కల్తీని నిరోధించటానికి, సమాజాన్ని ఆరోగ్యవంతంగా వుంచటానికి అనేక చర్యలు చేపట్టినాడు. అందుకుగాను 1906లో కాంగ్రెస్ ఆహార ఔషద చట్టాన్ని ప్రవేశపెట్టినది. వినియోగకరమైన ఔషదాలపై కంపెని ముద్రలు అంటించాలని సూచించింది.

రూజ్వెల్ట్ అభ్యుదయ కార్యక్రమాలను ప్రజలు చిత్తశుద్దితో, ద్విగుణీకృత ఉత్సాహంతో సమర్ధించినారు. కాంగ్రెస్‌లోని సాంప్రదాయక వాదులు అడ్డుతగిలినప్పటికి, ప్రజలు మద్దతు కలిగిన అతని సంస్కరణలకు మంచి ఆదరణ లభించింది. ఈ సంస్కరణలు ఫెడరల్ పరిపాలనకు నూతన జీవమయినాయి. వ్యాపారంపై ప్రభుత్వ ఆధిపత్యాన్ని నెలకొల్పి, ప్రజా విప్లవాన్ని పరోక్షంగా ఆపాడు. ఈ విధంగా అభ్యుదయ శకాన్ని అమెరికా చరిత్రలో సృష్టించాడు.

## 16.1.8. రూజ్వెల్ట్ విదేశాంగ విధానము :

థియోడర్ రూజ్వెల్ట్ అధ్యక్షుడు మెకన్లీ హత్యగావించబడటంతో 1901లో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు అధ్యక్షుడయినాడు. రూజ్వెల్ట్ అమెరికా అధ్యక్షుడగు నాటికి అమెరికా ఏకాంతవాసము కలిగివుంది. రూజ్వెల్ట్ అధ్యక్షుడుగా అనేక అభ్యుదయ సంస్కరణలు ప్రవేశపెట్టి అంతరంగికముగా అభివృద్ధి పరచుటే కాక, అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద విధానం కలిగివున్నాడు. దీని ద్వారా తన ఉత్పత్తుల మార్కెట్ల కోసం విదేశాలలో స్థావరాలు వలసలు ఏర్పాలు చేసుకొని తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొనుటే గాక అమెరికాను అగ్రరాజ్యంగా రూపొందించినాడు.

అంతర్జాతీయంగా అమెరికా భద్రత కొరకు అభద్రతా భావంతో తన కాలంలోనే భద్రత కల్పించాలని భావించాడు. జర్మనీ ఆలోచనా విధానాన్ని అనుమానించటం ప్రారంభించినాడు. ఫసిఫిక్ ప్రాంతంలో రష్యా-జపాన్ కదలికలను గమనించసాగాడు. ఇతర రాజ్యాలతో సంధులు చేసుకొనక, ఇతర రాజ్యాల సమస్యలను పరిష్కరించే ప్రముఖ రాజ్యాంగా అమెరికాను రూపొందించినాడు. అందువలన ఇతను అనుసరించిన విదేశాంగ విధానాలను మనము అధ్యయనం చేయవలెను.

## 16.1.9. జపాన్‌తో సంబంధాలు : (రష్యా - జపాన్ యుద్ధం) :

కొరియా, మంచూరియాల విషయంలో జపాన్ - రష్యాల మధ్య 1904 యుద్దం చెలరేగింది. ఈ విషయంలో రూజ్వెల్ట్ తటస్థ విధానాన్ని అవలంబించదలచినాడు. తన ఓపెన్ డోర్ విధానమునకు వ్యతిరేకంగా నున్న రష్యాకి వ్యతిరేకముగా జపాన్ పోరాడుతున్నందున తన సానుభూతి జపాన్ వైపు కలిగివున్నాడు. రెండు దేశాలకు మధ్యవర్తిగా వ్యవహరించి 1905 లో 'పోర్ట్సు మౌత్ సంధిని కుదిర్చినాడు'. దీనివల్ల కొరియా, ద. మంచురియాలపై జపాన్‌కి ఆధిపత్యం లభించింది. ఇది ఇలా వుండగా మంచూరియాలో స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని జపాన్ రద్దు చేసినది. దానితో అమెరికా వ్యాపారం దెబ్బతిన్నది. ఆ సమయంలోనే కాలిఫోర్నియా ప్రభుత్వం, తన రాష్ట్రంలో నివశిస్తున్న లక్ష మంది జపనీయులను పట్టి జాతి వివక్షణా విధానాన్ని అనుసరించింది. జపానిస్ పిల్లలను ప్రత్యేక స్కూళ్లకు తరలించాడు. దీనితో జపాన్ రెచ్చిపోయింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలపై యుద్ధ సన్నాహాలు చేసినది. ఇక్కడ తను ఓడితే క్రర విధానం పనిచేయదని రూజ్వెల్ట్ గ్రహించినాడు. కాలిఫోర్నియా అధికారులలో మాట్లాడి జాతి విచక్షణా ఉత్తర్వులను తొలగించాడు. 1908లో జపాన్‌తో ఒక ఒప్పందం చేసుకున్నాడు. దీనినే 'రూట్ టకారియా' ఒప్పందం అంటారు. దీని ప్రకారం చైనాలో రెండు రాజ్యాలు స్వేచ్ఛా వ్యాపారాన్ని గుర్తించాయి. ఫసిఫిక్‌లో యధాస్థితిని గుర్తించాయి.

## 16.1.10. మొరాకొ సంక్షోభము :

రూజ్వెల్ట్ 1905-1906 మధ్య ఉద్భవించిన మొరాకో సంక్షోభంలో జోక్యం చేసుకోవటం ద్వారా మరియొక్క యుద్ధాన్ని నివారించగలిగినాడు. ఈ సంక్షోభంలో ఫ్రాన్సు కలుగజేసుకోవటాన్ని జర్మనీ వ్యతిరేకించినది. ఫ్రాన్సు జోక్యం చేసుకోవటం ద్వారా సమస్య తీవ్ర రూపం దాల్చునని జర్మనీ భావించింది. రూజ్వెల్ట్, రెండవ విలియం సలహా మేర ఉత్తర అమెరికా సమస్య గురించి ఒక సమావేశము ఏర్పాటు చేయవలసినదిగా ఫ్రాన్సును కోరెను. ఈ సమావేశము అల్జీరియా నందు ఏర్పాటు చేయబడెను. ఆ సమావేశమునకు హెన్రీ వైట్‌ను ప్రతినిధిగా పంపబడినాడు. ఈ సమస్య విషయంలో అమెరికా సెనేట్ నందు వ్యతిరేకత యున్నప్పటికి, ఆమోదించినది.

## 16.1.12. కరేబియన్ విధానము :

కరేబియన్ సముద్ర ప్రాంతంలో అమెరికా ప్రాబల్యంని పెంపొందింప చేయాలని తన విదేశాంగ విధానంగా చేసుకున్నాడు. తనకు (అమెరికాకు) వ్యతిరేఖ శక్తులు ఏవి కూడా ఈ ప్రాంతంలో స్థావరాలు సంపాదించుకోకూడదనేది ఇతని ప్రముఖ ఉద్దేశ్యం.

**ఎ) వెనిజులా :** వెనిజులా అధ్యక్షుడయిన సిపోయినో కాస్ట్రో ఐరోపా రాజ్యాల నుండి పొందిన ఋణము తిరిగి చెల్లించలేకపోయినాడు. 1902 డిశంబరులో ఇంగ్లండ్, జర్మని, ఇటలీలకు చెందినవారు ఋణాలను చెల్లించమని వెనిజుల అధ్యక్షుడయిన కాస్ట్రో పై వత్తిడి తేసాగారు. అధ్యక్షుడు కాస్ట్రో చెల్లించ లేకపోయినాడు. అందుకుగాను వెనిజులా దిగ్బందం గావింపబడటమేగాక, దాని రేవులను పేల్చివేసినారు. అందుకు వెనిజులాపై ఆ మూడు దేశాలు ఇక ముందు ఏ రకమైన ప్రతీకారచర్యలు తీసుకోకుండా వుండు నిమిత్తం రూజ్వెల్ట్‌ని జోక్యం చేసుకోమని కోరినది. తదుపరి జరిగిన పరిణామాలలో ఈ సమస్య పరిష్కరించబడినది.

**బి) సాంటో డొమింగో :** ఎప్పటికి తీర్చలేని భయంకరమైన అప్పుల ఊబిలోను, అంతరంగిక తిరుగుబాట్లలో ఆలవాలమైన శాంటో డొమింగో అంతరంగిక వ్యవహారములలో రూజ్వెల్ట్ జోక్యము చేసుకొనెను. భయంకరమైన ఋణములు దుష్పరిపాలన గల దేశాలలో రూజ్వెల్ట్ ఉప సిద్ధాంతం 1904 ద్వారా ఐరోపా రాజ్యాల ప్రజల అవసరతలను పరిరక్షించే నిమిత్తం అమెరికా జోక్యం కలుగజేసుకుంటుంది. ఈ ఉప సిద్ధాంతం సారాంశమేమనగా 'అమెరికాలోగాని మరే ఇతర ప్రాంతంలోగాని దుష్ప్రవర్తన గల రాజ్యాల వ్యవహారాలలో నాగరిక రాజ్యాలు జోక్యం కలిగించుకొనును'. ఈ మన్రో సిద్ధాంతానికి కట్టుబడి వున్న సంయుక్త రాష్ట్రాలు, దుర్మార్గంగాను లేదా శక్తి హీనంగాను వ్యవహరించే రాజ్య విషయాల్లో జోక్యం కలుగజేసుకుంటుంది. ఈ సిద్ధాంతం ప్రకారంగా సాంటో డొమింగో నందు జోక్యం కలిగించుకొని 1905లో ఆ రాజ్యం నందు అమలు జరిపినాడు. దానితో సాంటో డొమింగో ఆర్థిక వ్యవహారాలు అమెరికా స్వీకరించింది. డొమింగో ప్రజల నుండి పన్నులు వసూలు చేసి తన అప్పుకు జమ చేసినది.

**సి) క్యూబా :** రూజ్వెల్ట్ తన ఉప సిద్ధాంతాన్ని రెండవ సారి 1906లో మరొక లాటిన్ అమెరికా రాజ్యమైన క్యూబాలో ప్రవేశపెట్టాడు. క్యూబాలో విప్లవాన్ని అణచటానికి అమెరికన్ సైన్యం అచటికి వెళ్ళింది. 1909 వరకు విడిది చేసింది.

ఈ రకంగా కరేబియన్ ప్రాంతంలో అమెరికా తన సామ్రాజ్యతత్వంను బాగుగా అమలు జరుపుకొంది.

## 16.1.12. బడితె కర్ర విధానము - పనామా కాలువ సమస్య :

స్పెయిన్‌తో యుద్ధము ముగిసిన తరువాత అమెరికా తన రాజ్యాన్ని అట్లాంటిక్ పసిఫిక్ ప్రాంతాలలో స్థాపించినది. 'బడితె కర్ర విధానము' అనునది అధ్యక్షుడు థియోడర్ రూజ్వెల్ట్ పేరుతో ముడిపడియున్నది. సమస్యలను పరిష్కరించటానికి సైన్యము, నౌకాబలముతో అప్రమత్తమై యుండవలెనని భావించినాడు.

పనామా కాలువ సమస్యను పరిష్కరించటానికి థియోడర్ రూజ్వెల్ట్ ఈ బడితె కర్ర విధానాన్ని ఉయోగించినాడు. కొలంబియాకు చెందిన పనామా ప్రాంతంలో కాలువను నిర్మించాలని సంయుక్త రాష్ట్రాలు ఎంతో కాలం నుంచి ఆలోచిస్తున్నది. ఎందుకంటే దాని వల్ల

ప్రయాణ వ్యయం, సమయం తగ్గుతుంది. ఆదాయం పెరుగుతుంది. రక్షణ పెరుగుతుంది. అయితే అందుకు దీనికి బ్రిటన్, ఫ్రాన్స్‌లు అడ్డు తగులుతున్నాయి. ఈ ప్రాంతంపై ఈ రాజ్యాలకు అనేక హక్కులు గలవు. అయితే రూజ్వెల్ట్ వచ్చాక ఈ విషయంలో తాడోపేడో తెల్చుకోవాలనుకొన్నాడు. అవసరమయితే బడితెకర్రతో బ్రిటన్ ఫ్రాన్స్‌లపై దెబ్బ కొట్టాలనుకొన్నాడు. ఈ సంగతి కనిపెట్టిన ఫ్రాన్స్, బ్రిటన్‌లు, పనామా కాలువ నిర్మాణాన్ని అమెరికా సంయుక్త రాష్ట్రాలకు అప్పగించాయి. తమ హక్కులను ఈ ప్రాంతంలో వదులుకున్నాయి. 1901 లో బ్రిటన్‌తో హె-పాంప్ ఫోటో సంధి కుదిరింది. దీని ప్రకారం పనామా కాలువను నిర్మించే హక్కు అమెరికా పొందింది. శాంతి కాలంలో అన్ని రాజ్యాల పడవలు కాలువలో ప్రయాణం చేయటానికి అమెరికా అంగీకరించింది. 1903లో కొలంబియాతో హె-హర్రన్ సంధి కుదిరింది. దీని ప్రకారం 1. కొలంబియాకు అమెరికా ఒక కోటి డాలర్లు చెల్లించాలి. పనామా ప్రాంతాన్ని ఉపయోగించుకోవటానికి 2 1/2 లక్షల డాలర్లు వార్షిక అద్దెగా చెల్లించాలి. 2. ఈ ప్రాంతంలో ఫ్రాన్సు తన హక్కులను వదులుకోవాలి. ప్రతి ఫలంగా ఫ్రాన్సుకు సంయుక్త రాష్ట్రాలు 4 కోట్ల డాలర్లు ఇవ్వాలి.

ఇది ఇట్లుండగా హె-హెర్రన్ సంధి కొలంబియా సెనేట్ త్రోసి పుచ్చినది. దీనితో రూజ్వెల్ట్ తీవ్ర ఉగ్రరూపం దాల్చినాడు. తన చేతి దెబ్బ విధానాన్ని ప్రయోగించినాడు. పనామా ప్రజల చేత తిరుగుబాటు చేయించాడు. వారికి సహాయంగా యుద్ధ నౌకలను పంపాడు. పనామాను స్వతంత్ర దేశంగా గుర్తించాడు. నూతన పనామా ప్రభుత్వంతో సంధి చేసుకున్నాడు. పనామా కాలువ నిర్మాణాన్ని 1904లో ప్రారంభించినాడు. అది 1914 నాటికి పూర్తయినది.

థియోడర్ రూజ్వెల్ట్ బడితెకర్ర విధానం తాత్కాలికంగా సంయుక్త రాష్ట్రాలకు ప్రయోజనాలను చేకూర్చింది. లాటిన్ అమెరికాలో అమెరికా పలుకుబడి పెరిగింది. చైనాలో వ్యాపార స్వేచ్ఛ లభించింది. అమెరికాకు అగ్ర రాజ్య ప్రతిపత్తికి దారి ఏర్పడినది. అయితే దీర్ఘకాలంలో ఈ విధానం నష్టాన్ని కొని తెచ్చినది. లాటిన్ అమెరికాతో అమెరికన్ సంబంధాలు క్షీణించాయి. జపాన్, సంయుక్త రాష్ట్రాలపై శతృత్వం పెంచుకొంది.

## 16.1.13. నమూనా ప్రశ్నలు :

1. థియోడర్ రూజ్వెల్ట్ అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చేసిన సేవ ఎట్టిది ?
2. థియోడర్ రూజ్వెల్ట్ అంతరంగిక విధానమును వివరించుము.
3. థియోడర్ రూజ్వెల్ట్ విదేశాంగ విధానమును వివరించుము.

## 16.1.14. చదువదగిన గ్రంథాలు :


1. H.B. Parkes - The United States of America - A History
2. C.P. Hill - A History of the United States
3. Novins & Commager - A Short History of Unitied States
4. Telugu Acadmey Publication - America Samyuktha Rastrala Charithra


- ఎం. జె. జయప్రసాద్

పాఠం - 16.2.

# విలియం హువార్ట్ టాఫ్ట్ - (1909 - 1913)

## 16.2.0. లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు 1909 నుంచి 1913 వరకు అధ్యక్షునిగా ఉన్న టాఫ్ట్ అనుసరించిన అంతరంగిక, విదేశాంగ విధానాలను గురించి తెలియజేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


16.2.1. తొలి జీవితం

16.2.2. అంతరంగిక విధానం, పరిపాలన సంస్కరణలు

16.2.3. అభ్యుదయ సంస్కరణలు

16.2.4. మన్ - ఎల్కిన్స్ సంస్కరణలు

16.2.5. ట్రస్టుల నియంత్రణ

16.2.6. ఇతర ప్రజాహిత సంస్కరణలు

16.2.7. సాంప్రదాయ సంస్కరణలు

16.2.8. టారిఫ్ విధానం : పేని - ఆల్‌డ్రిచ్ బిల్లు - 1909

16.2.9. బాలింగర్ - పించాట్ వివాదము

16.2.10. సభాపతియైన కానన్‌ను బలపర్చుట

16.2.11. కెనడాతో సహకార సంధి 1911

16.2.12. విదేశాంగ విధానం

16.2.13. డాలర్ దౌత్యము

16.2.14. సారాంశము

16.2.15. నమూనా ప్రశ్నలు

16.2.16. చదువదగిన గ్రంధాలు


## 16.2.1. తొలి జీవితం :

థియోడర్ రూజ్‌వెల్ట్ పరిపాలనానంతరము అమెరికా అధ్యక్షునిగా హైయో రాష్ట్ర వాసియైన విలియం హువార్ట్ టాఫ్ట్ ఎన్నిక గావింపబడెను. సుమారు ముప్పది సంవత్సరములు ఫెడరల్ ప్రభుత్వమునందు అనేక పదవులు నిర్వహించెను. న్యాయమూర్తిగాను, ఫిలిప్పిన్స్ గవర్నర్ జనరల్‌గాను, 1904 నుండి యుద్ధ కార్యదర్శిగా పేరు గడించెను. కనుకనే థియోడర్ రూజ్‌వెల్ట్ తన వారసునిగా టాఫ్ట్‌ను రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసి గెలిపించెను. టాఫ్ట్‌కి ఎంత పరిపాలనానుభవము యున్నను రూజ్‌వెల్ట్ అంతటి సమర్థుడు కాదు. నాయకునికి

ఉండవలసిన చురుకైన వ్యక్తిత్వము, రాజకీయ తంత్ర్యములు ఆయనకు లేవు. కనుకనే టాఫ్ట్ థియోడర్ రూజ్‌వెల్ట్ అంతటి కీర్తిని, ప్రజాభిమానము పొందలేకపోయెను.

విలియం హోవర్డ్ టాఫ్ట్ రూజ్‌వెల్ట్‌నకు విధేయత గల అనుచరుడయినప్పటికి అతని కంటే విభిన్నమైన వ్యక్తి. ఇతను సాంప్రదాయ వాది. తాను అధికారము చేపట్టునాటికి రిపబ్లికన్ పార్టీ రెండుగా చీలిపోయినది. 1. సాంప్రదాయ వర్గము, రెండవది అభ్యదయ వర్గము. టాఫ్ట్ సాంప్రదాయ వర్గము పట్ల సానుభూతి వహించెను. అందుకు అభ్యుదయ వాదులు ఉదారులై టాఫ్ట్ ఎన్ని అభ్యుదయ భావాలు గల సంస్కరణలు చేసినను ఆయనకు బద్ధ విరోధులై ఆయన సాంప్రదాయ వాది అని దుష్ప్రచారము చేసిరి.

## 16.2.2. టాఫ్ట్ పరిపాలనా సంస్కరణలు :

టాఫ్ట్ ప్రవేశపెట్టిన పరిపాలన సంస్కరణలు రెండు వర్గములుగా విభజింపవచ్చును. ఒకటి అభ్యుదయ సంస్కరణలు, రెండు సాంప్రదాయ సంస్కరణలు. అభ్యుదయ సంస్కరణలు ప్రజాదరణ పొందినవి. అతని సాంప్రదాయ సంస్కరణలు ప్రజాదరణ పొందలేదు.

## 16.2.3. అభ్యుదయ సంస్కరణలు :

అవి ఏవనగా ఎ) మన్ ఎల్కిన్స్ చట్టము 1910, బి) ట్రస్టుల నియంత్రణ, సి) ఇతర ప్రజాహిత సంస్కరణలు

## 16.2.4. మన్ - ఎల్కిన్స్ సంస్కరణలు :

రైల్ - రోడ్లు నిర్వహణలోని లోపములను తొలగించి వానిని క్రమబద్ధము చేయుటకు నెలకొల్పబడిన అంతరాష్ట్రీయ వ్యాపార కమీషన్ అధికారములను విస్తృత పరుచుటకు టాఫ్ట్ 1910లో మన్-ఎల్కిన్స్ చట్టము చేసెను. ఈ చట్టము వలన అంతరాష్ట్రీయ కమీషన్‌కు టెలిఫోన్ - టెలిగ్రాఫ్‌లపై అధికారము ఈయబడెను. రైల్వే ట్రస్టులు పెంచిన రేట్లను నిలుపుదల చేసి అవి న్యాయ సమ్మతముగా యున్నవో లేదో విచారించి తుది నిర్ణయములు గైకొనుటకు వీలు కల్పించెను. అంతరాష్ట్రీయ వ్యాపార కమీషన్ నిర్ణయములపై అప్పీలు చేసుకొనుటకు వ్యాపార కోర్టులను స్థాపించెను.

## 16.2.5. ట్రస్టుల నియంత్రణ :

ట్రస్టుల కార్యకలాపములను అదుపులో పెట్టుటకు టాఫ్ట్, రూజ్‌వెల్ట్ అడుగు జాడలలో నడిచెను. తన పాలనా కాలములో ట్రస్టులపై సుప్రీంకోర్టులో 90 దావాలు వేసెను. ఇట్టి ట్రస్టులలో ముఖ్యమైనవి న్యూయార్క్ స్టాండర్డ్ అయిల్ కంపెని, అమెరికన్ టుబాకో కంపెని. ఈ దావాలలో సుప్రీంకోర్టు షెర్మన్ ఎంటీ ట్రస్ట్ ఆక్ట్‌ను విపులీకరించి, వ్యాపారమునకు సంకటముగా పరిణమించు ట్రస్టులను నిషేధించెను.

## 16.2.6. ఇతర ప్రజాహిత సంస్కరణలు :

ప్రజల కోర్కెలననుసరించి పోస్టల్ సేవింగ్స్ బ్యాంకులను స్థాపించి పొదుపు ప్రోత్సహించెను. పార్సిల్ పోస్టాఫీసులను ప్రారంభించి బంగీలు ఒక ప్రాంతం నుండి మరియొక్క ప్రాంతమునకు వెళ్ళుటకు వీలు కల్పించెను. కామర్స్ మరియు లేబర్ శాఖలను రెండుగా విభజించి కామర్స్ డిపార్ట్‌మెంటును గాను, లేబర్ డిపార్ట్‌మెంటుగా విభజించి సమర్ధవంతముగా పనిచేయునట్లు చేసెను. రాజకీయాలలో అవినీతిని అరికట్టుటకు ఎన్నికల ప్రచారమునకు అగు ఖర్చులపై పరిమితులు విధించి వాటినుల్లంఘించిన వారి ఎన్నిక చెల్లనేరదను చట్టము చేసెను. అటులనే పార్టీకి ఇచ్చిన చందాలు మొదలగు లెక్కలను కూడా ప్రభుత్వమునకు అప్పగించునట్లు చేసెను. పదహారవ రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టి ఆదాయపు పన్ను విధించుటకు వీలు కల్పించెను. పదిహేడవ రాజ్యాంగ సవరణ ద్వారా సెనెటర్‌లను ప్రజలే ప్రత్యక్షముగా ఎన్నుకొనుటకు ఏర్పాటు చేసెను. జాతీయ వనరుల రక్షణకు ఇతోధికముగా కృషి చేసెను. అనేక జాతీయ అడవులను నెలకొల్పి ఆటవిక సంపదను పరిరక్షించెను. గనుల శాఖను ఏర్పరచి, ఖనిజ సంపదను పెంపొందించెను.

## 16.2.7. సాంప్రదాయ సంస్కరణలు :

వీటినే ప్రజాదరణ పొందని సంస్కరణలు అని కూడా పిలుతురు. తన సొంత పార్టీలోని అభ్యుదయ వర్గము వారి నుండి తీవ్ర ప్రతిఘటనను పొందిన సంస్కరణలు ఏవనగా 1. టారిఫ్ విధానము, 2. బాలింగర్ పించేట్ వివాదము, 3. స్పీకర్ కానన్‌ను బలపరచుట, 4. కెనడాలో కుదర్చుకున్న పరస్పర సంధి విఫలమగుట.

## 16.2.8. టారిఫ్ విధానము - పేని ఆల్ డ్రిచ్ బిల్లు 1909 :

1897 లో ప్రవేశపెట్టిన డింగ్లీ సుంక చట్టము అధిక సుంకములు విధించెనని, అందువలన భారీ వ్యాపారస్తులు అధిక ధరలు వసూలు చేయుచున్నారని, కనుక ఆ సుంకములు తగ్గించవలెనని భావము ప్రజల్లో వ్యక్తమగుచుండెను. రూత్ వెల్ట్ ఈ విషయము పట్టించుకొనలేదు. కాని టాఫ్ట్ ఎన్నికల సమయంలో ఈ సుంకము తగ్గింతునని వాగ్దానము చేసెను. ఈ వాగ్దానము నిలబట్టుకొనుటకు కాంగ్రెస్ 1909లో పేని - ఆల్ డ్రిచ్ బిల్లు తయారుచేసెను. ఈ చట్టము విదేశీ పోటీలేని సుంకములపై సుంకములు తగ్గించి ప్రజలు ఎక్కువగా వినియోగించు ఉన్ని, పంచదార మొదలగు వాని మీద సుంకములు పెంచెను. దీని వలన సుంకము 40.8%గా నిర్ణయించెను. ఈ చట్టము వలన భారీ వ్యాపారస్తులకు డింగ్లీ సుంక చట్టము కంటె ఎక్కువ లాభము పొందునట్లు చేసినదని కనుక దీనిని మార్చవలెనని కొందరు అభ్యుదయ సెనెటర్లు టాఫ్ట్‌ని కోరిరి. కానిటాఫ్ట్ వారి మాటలు లెక్క చేయక ఈ బిల్లు పై సంతకము చేసెను.

## 16.2.9. బాలింగర్ - పించాట్ వివాదము :

రిచర్ట్ ఎ. బాలింగర్, టాఫ్ట్ అంతరంగిక కార్యదర్శి గిపార్ట్ పించాట్ రూజ్‌వెల్ట్ కాలము నుండి అటవీ శాఖ డైరెక్టర్. రూజ్ వెల్ట్ వలె టాఫ్ట్ కూడా జాతీయ వనరులను పరిరక్షింపబడవలెనని విశ్వాసము కలవాడు. రూజ్వెల్ట్ కాలమున వాయువ్యమున ఆటవిక సంపదను పరిరక్షించుటకు పొందిన భూములలో ప్రవేటు వ్యక్తులు మోసగింపబడిరని వానిని న్యాయసమ్మతముగా పొందవలెనని వానిలో కొన్నింటిని వారికి పునరుద్దరించెను. అంతట పిబాట్ ఈ చర్య జాతీయ వనరుల రక్షణకు వ్యతిరేకమని, బాలింగర్ జాతీయ వనరులకు బద్ద శత్రువని, అతడు భారీ పెట్టుబడిదారులకు అనుకూలుడని, బాహాటముగా ప్రకటించెను. బాలింగర్ చర్య సమర్ధనీయమని టాఫ్ట్ 1909లో పించట్‌ని పదవి నుండి తొలగించెను. పించాట్ ప్రకటన వలన రిపబ్లికన్ పార్టీలోని అభ్యుదయ వాదులు టాఫ్ట్ ప్రజా సంక్షేమమునకు బద్ద విరోధియని తీవ్రముగా విమర్శించిరి.

## 16.2.10. సభాపతియైన కానన్‌ను బలపర్చుట :

టాఫ్ట్ కాలమున సభాపతి జోసఫ్ కానన్. ఇతడు సభాపతిగా అనేక అధికారములు చలాయించుచుండెను. రూల్స్ కమిటికి తనకిష్టుడైన వారిని నియమించి, అభ్యుదయ వాదులకు కాంగ్రెస్‌నకు ఆటంకము కలిగించుచుండెను. అంతట రిపబ్లికన్ అభ్యుదయ వాదులు జార్జి నోరిస్ నాయకత్వమున తిరుగుబాటు చేసి సభాపతి అధికారములును తగ్గించుటకు, రూల్స్ కమిటీ సభ్యులను సభ సభ్యులే ఎన్నుకోవలెనని, సభాపతి నియమింపరాదని తీర్మానము ప్రవేశపెట్టెను. ఈ తీర్మానము డెమోక్రాట్లు కూడా సమర్ధించుట వలన అది అమలులోనికి వచ్చెను. కాని పార్టీ నియమావళిననుసరించి టాఫ్ట్ కానన్‌ను బలపరచెను. అంతట అభ్యుదయ వాదులు వీరిద్దరిని సాంప్రదాయవాదులని విమర్శించి అభివృద్ధికి నిరోధకులని దుయ్యబట్టిరి.

## 16.2.11. కెనడాతో సహకార సంధి 1911 :

టాఫ్టనకు మరియు రిపబ్లికన్ పార్టీలోని అభ్యుదయవాదులకు మధ్యన ఏర్పడిన విభేదాల వలన రిపబ్లికన్ పార్టీ బలహీనపడినది. తత్ఫలితముగా 1910లో కాంగ్రెస్‌కు జరిగిన ఎన్నికలలో ఘోర పరాజయము పొందెను. అంతట టాఫ్ట్ ప్రజల అభిమానమును చూరగొనుటకు కెనడాతో పరస్పర సహకార ఒప్పందమును చేసుకొనెను. ఈ ఒప్పందము ప్రకారము కెనడా నుండి వచ్చు వ్యవసాయ ఉత్పత్తులపై కెనడా

సుంకములు తగ్గించెను. ఈ సంధిని 1911లో కాంగ్రెస్ చట్టము ద్వారా ఆమోదించెను. కాని ఈ చర్య తమ ఉత్పత్తులకు కెనడా వ్యవసాయోత్పత్తులతో పోటీ ఏర్పాటు చేసెనని వ్యవసాయదారులు విమర్శించిరి. తదుపరి కొద్ది కాలమునకె కెనడా ఆ ఒడంబడికను రద్దు చేసుకొనుటతో టాఫ్ట్ అపఖ్యాతి పాలయ్యెను.

## 16.2.12. టాఫ్ట్ విదేశాంగ విధానము :

విదేశాంగ విధానంలో టాఫ్ట్ డాలర్ దౌత్యం సామ్రాజ్యవాదం కొనసాగించాలని భావించినాడు.

## 16.2.13. డాలర్ దౌత్యము :

డాలర్ దౌత్యము అనునది 1909లో ఎన్నిక కాబడిన టాఫ్ట్ పేరుతో ముడిపడియున్నది. అమెరికా భారీ పెట్టుబడుల ద్వారా తన దౌత్యమును ఇతరరాజ్యములతో వృద్ధి పెంపొందించుకొనుటకు కృషి చేసెను. దూర ప్రాశ్చ్యంలో జపాన్ ప్రాబల్యమును నిరోధించకపోతే, ఉత్తర చైనాపై ఆధిపత్యం సంపాదించుటయేకాక అమెరికా వ్యాపారాన్ని దెబ్బతీయునని టాఫ్ట్ భావించెను. ఈ సందర్భంగా అమెరికా, జపాన్ దూకుడును నిరోదించుటకు మంచూరియాలో రైలు రోడ్లు నిర్మించుటకు ఆర్థిక సహాయ మొనర్చుటయే కాక చైనాలో ఓపెన్ డోర్ విధానాన్ని సంరక్షించెను. అమెరికా పెట్టుబడిదారులను దూర ప్రాశ్చ్రప్రాంతంలో తమ మిగుల డాలర్లను పెట్టుబడులుగా పెట్టి వ్యాపారాభివృద్ధి గావించమని ప్రోత్సహించెను. పనామ కాలువ ప్రాంతాలలో కూడా పెట్టుబడులు పెట్టి అచ్చట గల అవరోధాలను అధికమించమని ప్రోత్సహించెను. లేని ఎడల శత్రు రాజ్యాలైన జర్మని దేశం లాంటివి చొచ్చుకొనిపోయి ఆధిపత్యం సంపాదించి తమ వ్యాపారాలను దెబ్బ తీయునని కోరెను. ఈ విధానాలు అవలంభించుట వలన అమెరికా అభివృద్ధి చెందుటయేగాక, అమెరికా పెట్టుబడిదారులు లాభాలు గడించును.

కరేబియన్ ప్రాంతంలో గల హోండూరస్, హైతిలలో ఆర్థిక, రాజకీయ సంక్షోభములను తొలగించుటకు విదేశీ జోక్యములను నివారించుటకు అనేక డాలర్లు ఆ దేశాలపై కుమ్మరించెను.

టాఫ్ట్ డాలర్ దౌత్యమును ప్రజాస్వామ్యవాదులు, ప్రగతివాదులు విమర్శించిరి. ఉడ్రో విల్సన్ అధ్యక్షుడయిన వెంటనే డాలర్ దౌత్యమును విరమించెను. అమెరికా పెట్టుబడిదారుల పెట్టుబడులను వెనుకకు రప్పించవలసినదిగా కోరెను. చైనాలో జపాన్ పురోభివృద్ధిని చెక్ చేసే నిమిత్తం అమెరికా తన పెట్టుబడులను వెనుకకు మరల్చెను.

## 16.2.14. సారాంశము :

ఇట్లు టాఫ్ట్ తన నాలుగు సంవత్సరముల పాలన కాలంలో పెక్కు అభ్యుదయ సంస్కరణలు, ప్రజాహిత సంస్కరణలు ప్రవేశపెట్టి తాను నిజమైన అభ్యుదయవాదినని నిరూపించుకొనెను. తన పరిపాలన సంస్కరణలు గమనించిన రూజ్వెల్ట్ కంటే టాఫ్ట్ అధికంగా (90) ట్రస్టులపై చర్యలు గైకొనెను. కాని సుంకముల తగ్గింపు చట్టం పించాట్‌ను పదవి నుండి తొలగించుట, కాననన్‌ను బలపరచుట వంటి చర్యలు, పార్టీలోని అభ్యుదయవాదులు ప్రజలు హర్షించలేదు. అభ్యుదయవాదుల దుష్ప్రచారము వలన ప్రజాదరణ పొందలేకపోయెను. ఆయన దేశమునకు చేసిన సేవలు ప్రజలు సరిగా అర్థము చేసుకొనలేదు.

## 16.2.15. నమూనా ప్రశ్నలు :

1. విలియం హోవర్ట్ టాఫ్ట్ పరిపాలన విధానమును వివరింపుము.
2. టాఫ్ట్ ప్రజాభిమానము పొందలేకపోవుటకు కారణములు వివరించుము.
3. టాఫ్ట్ విఫలము, ఇది మొత్తం మీద విఫలమైతే, ఇది కేవలం అభ్యుదయవాదుల దుష్ప్రచారము మాత్రమే విమర్శించుము.
4. అధ్యక్షునిగా విలియం టాఫ్ట్ అనుసరించిన విధానములను విశ్లేషించుము.

### 16.2.16 చదువదగిన గ్రంథాలు :


1. Allen Novins & Commagar - A Short History of United States
2. H.B. Parkes - The United States of America - A History
3. V. Kameswara Rao & B. Lakshmi Narayana - America Samyuktha Rastrala Charithra (Telugu Academy, 1986)
4. C.P. Hill - A History of the United States


- ఎం. జె. జయప్రసాద్

పాఠం - 17

# ఉడ్రో విల్సన్ (1913-1921) మొదటి ప్రపంచ యుద్ధం

## 17.0. లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు (1913-21) మధ్య కాలములో అధ్యక్షుడైన ఉడ్రో విల్సన్ ఆంతరంగిక వ్యవహారాలలో ప్రవేశపెట్టిన సంస్కరణలను, తద్వారా సామాన్య మానవుడికి కల్పించిన నూతన స్వేచ్ఛను గూర్చి, అతను అనుసరించిన విదేశీ విధానములను, మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికా పోషించిన పాత్రను గూర్చి, ప్రపంచానికి శాశ్వత శాంతిని కల్పించటానికి విల్సన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలను గూర్చి, మరియు పారిస్ శాంతి సదస్సు, ఆ సంధి షరతులను గూర్చి వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


17.1. విల్సన్ జీవిత విశేషాలు

17.2. ఆంతరంగిక విధానము & టారిఫ్ సంస్కరణ

17.3. ట్రస్టుల నియంత్రణ

17.4. ఇతర సాంఘీక చట్టాలు

17.5. విదేశాంగ విధానము

17.6. ప్రధమ ప్రపంచయుద్ధం - అమెరికా తటస్థ విధానము

17.7. యుద్ధంలో అమెరికా ప్రవేశం

17.8. విల్సన్ 14 సూత్రాలు

17.9. వర్సే సంధి

17.10. సారాంశము

17.11. నమూనా ప్రశ్నలు

17.12. చదువదగిన గ్రంథాలు


## 17.1. విల్సన్ జీవిత విశేషాలు :

ఉడ్రో విల్సన్ వర్జీనియాలో ప్రెస్బిటేరియన్ మత ప్రచారకుల సంతతికి చెందిన కుటుంబములో 1856లో జన్మించెను. విల్సన్ కాల్విలిస్ట్‌లకు సహజంగా వుండే పట్టుదల, నైతిక ఆదర్శవాదము కలవాడు. తన బాల్యమంతయూ జార్జియా, కెరోలినాలలో గడిపినాడు. ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయము నుండి డాక్టరేట్ పొందాడు. ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయము అధ్యక్షునిగా 1902 నుండి 1910 వరకూ కొనసాగాడు. పదవీ నిర్వహణలో తలెత్తిన వివాదాల వల్ల రాజకీనామా చేసి రాజకీయాలలో ప్రవేశించి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా న్యూజెర్సీకి గవర్నర్ అయినాడు. గవర్నర్‌గా వున్నప్పుడే ప్రగతిశీలక కార్యక్రమాలను నిర్వహించి ప్రజల మన్ననలకు పాత్రుడైనాడు. 1912లో జరిగిన అధ్యక్ష

ఎన్నికలలో పోటీచేసి హేమాహేమీలైన థియోడర్ రూజ్‌వెల్ట్, టాఫ్ట్ వెబ్స్, చాపిన్‌లను ఓడించి, 1913లో అధ్యక్ష స్థానాన్ని అలంకరించి 1919 వరకూ పరిపాలించెను. దక్షిణాది రాష్ట్రాల నుండి అమెరికా అధ్యక్షుడైన మొదటి వ్యక్తి ఉడ్రో విల్సన్. ఉడ్రో విల్సన్ ప్రమాణ స్వీకారం చేస్తూ "భారీ పారిశ్రామికుల చేత, పెట్టుబడిదారుల చేత సామాన్య మానవుడు పీడనకు గురి కాకుండా నూతన స్వేచ్ఛను కల్పించుటకై కృషి చేయగలనని" ప్రకటించాడు.

**కార్యదర్శులు :** ఉడ్రో విల్సన్ బ్రేయన్ (Bryan) ను విదేశ్యాంగ కార్యదర్శిగానూ, జోసఫ్ డేనియల్‌ను నౌకా విభాగ ఉన్నత కార్యదర్శిగానూ, ఎఫ్.డి. రూజ్‌వెల్ట్‌ను నౌకాదళ ఉప కార్యదర్శిగానూ నియమించినాడు. అంతరంగిక, విదేశాంగ విధానాలలో ఎడ్వర్డ్, ఎమ్. హౌస్ (Edward. M. House) ను ఎక్కువగా సంప్రదించేవాడు.

## 17.2. అంతరంగిక విధానము & టారిఫ్ సంస్కరణలు :

ప్రజలు పడే ఇబ్బందులకు మూల కారణాలలో టారిఫ్ నిబంధనలు ముఖ్యమైనవి. అందువలన పదవీ స్వీకారం చేయగానే టారిఫ్ సంస్కరణలు ఆరంభించినాడు.

**అండర్ వుడ్ టారిఫ్ చట్టము :** వస్తువుల ధరలు తగ్గించటానికి ఒక ముఖ్య చర్యగా సుంకాలు రద్దు చేయటానికి ఈ బిల్లు కాంగ్రేసులో ప్రవేశపెట్టబడినది. కాంగ్రేసు ప్రత్యేక సమావేశం ఏర్పాటయినది. దిగువ సభ ఆమోదం తర్వాత సెనెట్‌లో దీనికి ప్రతిఘటన ఎదురైనది. ఈ ప్రతిఘటనను ఎదుర్కొనటానికి విల్సన్ ప్రజలలో ప్రచారం చేసినాడు. ప్రజాభిప్రాయం సెనేటర్లకు ఎదురైనది. దాని వత్తిడి ఫలితంగానే సెనేట్ ఈ బిల్లును ఆమోదింపక తప్పలేదు.

**చట్టంలోని నిబంధనలు :** దీని ప్రకారం నూటికి పైగా వస్తువులపై సుంకాలు తొలగించబడినాయి. వేయికి పైగా వస్తువులపై సుంకాలు తగ్గించబడినాయి. దీని వల్ల నష్టపోయిన ఆదాయాన్ని భర్తీ చేయటానికై మొదటిసారిగా అంచెల వారీగా ఆదాయపు పన్ను ప్రవేశపెట్టబడినది. దీని ఫలితంగా సామాన్యుల ఆర్థిక స్థితి మెరుగుపడినది. భాగ్యవంతులపై పన్నుల భారం హెచ్చు చేయబడినది. ఈ విధంగా ఆర్థిక వ్యత్యాసం కొంత వరకూ తగ్గించే ప్రయత్నం చేయబడింది.

**గ్లాస్ ఓవెన్ ఫెడరల్ రిజర్వు చట్టము :** 1907లో ఆర్థిక సంక్షోభం ఫలితంగా బ్యాంకింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైనది.

## 17.3. ట్రస్టుల నియంత్రణ : ట్రస్టుల నియంత్రణ :

గుత్త వ్యాపారాన్ని నిర్మూలించటం లేదా వాటిని సక్రమ పద్ధతిలో నడిచేటట్లు చేయటం వల్లనే సామాన్య ప్రజలకు వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని విల్సన్ సంకల్పించినాడు. అతడు 5 సూత్రాలను నిర్దేశించినాడు. అవి :

1. ఇంటర్ - లాకింగ్ డైరక్టరేట్స్‌ను నిషేధించాలి
2. ఇంటర్ స్టేట్ కామర్స్ కమీషన్‌కు రైలు రుసుములను విధించే అధికారం ఇవ్వాలి.
3. 'కాంబినేషన్ ' అనే పదానికి సరైన నిర్వచనం చేయాలి
4. ఈ కాంబినేషన్లు చేసే మోసాలను అరికట్టటానికి కేంద్ర వ్యాపార బృందమును నియమించాలి
5. ట్రస్టు వ్యతిరేక చట్టాలను ఉల్లంఘించే వారిపై అపరాధపు పన్ను విధించాలి.

**ఫెడరల్ ట్రేడ్ కమీషన్ చట్టం - 1914 :** దీని ప్రకారం కేంద్ర వ్యాపార బృందం నియమించబడినది. అది నిర్వహించవలసిన విధులు నిర్వచించబడినాయి.

**క్లేటన్ చట్టం- 1914 :** ఈ చట్టం ప్రకారం మిగిలిన సూత్రాలు ఆచరణలోకి తేబడినాయి. ఇంటర్ లాకింగ్ డైరక్టరేట్స్ నిషేదించబడినాయి. ఒక సంస్థలోని నిల్వసరుకును మరో పోటీ సంస్థ కొనివేయటం, గుత్త వ్యాపారులు తమకనుకూలంగా ధరలు హెచ్చించటం తగ్గించటం కూడా నిషేధించబడింది. వ్యాపార సంస్థలు చేసే అక్రమాలకు వాటి అధికారులే బాధ్యులుగా నిర్ణయించబడినారు. ట్రస్టు వ్యతిరేక చట్టాల నుండి, కార్మిక సంస్థలు మినహాయించబడినాయి.

## 17.4. ఇతర సాంఘిక చట్టాలు :

**ఫెడరల్ వ్యవసాయ ఋణాల చట్టం - 1916 :** దీని వల్ల వ్యవసాయదారులకు తక్కువ కారణమని భావించబడినది. బ్యాంకులకు కలిగిన ఉపద్రవం వల్ల వ్యాపారం దెబ్బతిన్నది. నిరుద్యోగం హెచ్చింది. ద్రవ్యచెలామణి ప్రైవేటు బ్యాంకుల నియంత్రణలోకి పొందింది. పరిస్థితిని పరిశీలించి తగిన సూచలనలు చేయవలసినదిగా 'నేషనల్ మానిటరీ కమీషన్', పూజో కమిటీ అనే రెండు విచారణ సంఘాలు నియమింపబడినాయి. ఈ కమిటీలు బ్యాంకుల నిర్వహణలో వున్న లోటుపాట్లును పరిశీలించి కేంద్ర బ్యాంకును తిరిగి స్థాపించవలసినదిగా సిఫార్సు చేసెను.

1913లో ఫెడరల్ రిజర్వు చట్టము ఆమోదించబడినది. దీని ప్రకారం

1. దేశం మొత్తం 12 జిల్లాలుగా విభజింపబడి జిల్లాకొక ఫెడరల్ రిజర్వు బ్యాంక్ స్థాపించబడినది. ఈ బ్యాంకులు తమ తమ నిర్ణీత ప్రదేశాలలో బ్యాంకులకు బ్యాంకులుగా వ్యవహరిస్తాయి.
2. సభ్య బ్యాంకులు తమ వద్ద నిక్షిప్తం చేసిన సెక్యూరిటీల ఆధారంగా కరెన్సీని ఈ బ్యాంకులు విడుదల చేస్తాయి
3. ఆపత్కాలంలో సభ్య బ్యాంకులకు ఫెడరల్ బ్యాంకులు అప్పులిచ్చి వాటి నిర్వహణకు తోడ్పడతాయి
4. ఈ బ్యాంకుల వ్యవస్థను అజమాయిషీ చేయుటకు ఫెడరల్ రిజర్వు బోర్డు స్థాపించబడింది.

ఈ పద్ధతి తర్వాతి కాలంలో సబ్ ట్రెజరీ పద్ధతిగా మార్చి వేయబడినది. మొదట్లో ఈ వ్యవస్థపై భయ సందేహాలు వెలిబుచ్చినవారు కూడా ఫెడరల్ రిజర్వు పద్ధతిని మెచ్చుకున్నారు. 1914-18 మధ్య కాలంలో ఏర్పడిన ఆర్థిక ప్రమాదం నుండి ఈ విధానమే బ్యాంకులను రక్షించగలిగినది.

ఈ విధంగా ద్రవ్య సంస్కరణలు పరిశ్రమలకు, వ్యాపారానికి అండగానిలచి దేశ ఆర్థిక ప్రగతికి అమితంగా దోహదం చేసినాయి.

వడ్డీలపై ఋణ సౌకర్యం కల్పించబడినది. పంటల హామీలపై కూడా ఋణాలు ఇవ్వటానికి ఏర్పాటు చేయబడింది.

**లాఫోలెట్ సీమెన్స్ చట్టం - 1915 :** దీని వలన సరస్సుల మీద, సముద్రాల మీద నడిచే ఓడలపై పనిచేసే నావికులకు వేతనాలు లభించే ఏర్పాటు చేయబడింది. వారికి భోజనాది నౌకర్యాలు కూడా ఏర్పాటు చేయబడినాయి. ప్రభుత్వ కార్యాలయాలలోనూ, సంస్థలలోనూ పనిచేసే వ్యక్తులు అశక్తులైనపుడు వారికి నష్టపరిహారం చెల్లించే ఏర్పాటు చేయబడింది.

**ఆడమ్‌సన్ చట్టం - 1916 :** రైళ్ళలో పనిచేసే లక్షలాది కార్మికులకు 8 గంటలకు మించని పనికాలం నిర్ణయించబడింది. దీనికి మించి అధిక కాలం పనిచేసే వారికి అధిక వేతనం చెల్లించే ఏర్పాటు కూడా చట్టబద్ధం చేయబడింది.

**ప్రవాసుల చట్టము - 1917 :** అమెరికాకు వలసవచ్చే ప్రవాసుల సంఖ్యను ఈ చట్టం ద్వారా పరిమితం చేశారు.

**కీటింగ్ - ఓవెన్ చైల్డ్ లేబర్ చట్టం :** ఈ చట్టం ద్వారా బాల కార్మికులను నిషేదించే ఏర్పాటును కల్పించినాడు.

18వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మధ్య నిషేదానికి వీలు కల్పించబడినది. 19వ రాజ్యాంగ చట్టం ద్వారా స్త్రీలకు ఓటు హక్కు కల్పించబడినది.

## 17.5. విదేశాంగ విధానము :

ఉడ్రో విల్సన్ సామ్రాజ్య విధానాన్ని వ్యతిరేకిస్తూ శాంతిని స్థాపించుటకే కృషి చేశాడు. థియోడోర్ రూజ్‌వెల్ట్ అనుసరించిన బడితెకర్ర విధానాన్ని, డాలర్ డిప్లోమసీని తీవ్రంగా వ్యతిరేకించినాడు. లాటిన్ అమెరికాలో స్వైరవిహారం చేస్తున్న బ్యాంకులకు ప్రభుత్వ రక్షణ వుండదని తీవ్రంగా హెచ్చరించినాడు.

**జపాన్‌తో సంబంధాలు :** కాలిఫోర్నియా రాష్ట్రములోని జపాన్ నుండి అనేక వేల మంది వలస వచ్చారు. 1900 సంవత్సరం నాటికి జపనీయుల సంఖ్య బాగా పెరిగిపోయింది. ఇంకా నూతనంగా వచ్చే వారిని నిరుత్సాహపరచటానికి కాలిఫోర్నియా రాష్ట్ర శాసనసభ జపనీయులు ఆ రాష్ట్రములో భూములు సంపాదించరాదనే శాసనాన్ని ప్రవేశపెట్టాలని తలంచింది. దీనికి జపాన్ తీవ్ర నిరసన వ్యక్తపరుస్తూ యుద్ధ ప్రసంగాలు చేయటం కూడా మొదలుపెట్టింది. జపానీయ ప్రభుత్వం కాలిఫోర్నియాలో ప్రవేశపెట్టబడుచున్న జపాన్ వ్యతిరేక చట్టాలను గూర్చి వారి నిరసన భావాన్ని వ్యక్తపరచగా, విల్సన్ ప్రమేయంతో కాలిఫోర్నియా రాష్ట్రం 'జపనీయుల'ని ప్రత్యేకంగా చట్టంలో ఉటంకించటం మానివేసి, ఆసియా వాసులెవ్వరూ ఆ రాష్ట్రంలో భూములు కొనరాదనే సవరణను ఆమోదింపచేసినారు.

**బ్రిటన్‌తో సమస్య :** టాఫ్ట్ అధ్యక్షుడుగా వున్నప్పుడు 1912లో "పనామా కెనాల్ టోల్స్" చట్టం ప్రకారం అమెరికా కోస్తాలో తిరిగే అమెరికా ఓడలపై పన్నులు రద్దు చేశాడు. ఈ చట్టం అంతకు ముందు చేసుకున్న హే పాన్స్ ఫోర్ట్ (Hay - Pance Forte Treaty) సంధికి విరుద్ధమని, అమెరికా కోస్తాలో తిరుగాడు అన్ని ఓడలపై పన్నులు వసూలు చేయటం ధర్మమని బ్రిటన్ వాదించింది. బ్రిటన్ వాదనలో వున్న సత్యాన్ని గ్రహించి విల్సన్ 1914లో కాంగ్రెస్‌కు హాజరై అమెరికన్ ఓడలకున్న రేవు మినహాయింపులను తొలగించవలెనని విజ్ఞప్తి చేశాడు. తీవ్ర చర్చానంతరము ఈ విజ్ఞప్తిననుసరించి చట్టాన్ని సవరించటం జరిగింది.

**మెక్సికోతో సంబంధాలు :** విల్సన్ కాలం నాటికి మెక్సికోలో తీవ్రమైన రాజకీయ సంక్షోభం చెలరేగింది. మెక్సికో అధ్యక్షుడు పోర్ఫిరియో డయాజ్ (Porfirio Diaz) విదేశీ పెట్టుబడులను బాగా ప్రోత్సహించాడు. దాని వల్ల అనేక మంది అమెరికన్లు మెక్సికోలో స్థిరపడి అక్కడి వ్యాపారాన్ని తమ గుత్తాధిపత్యం క్రిందికి తీసుకువచ్చారు. మెక్సికో సహజ సంపదలతో వున్నా జనాభాలో అత్యధిక భాగం భూమిలేని పాటక జనమే. దేశంలోని భూమి కొంతమంది భాగ్యవంతుల చేతుల్లోనూ, విదేశీయుల చేతుల్లోనూ ఉండిపోయింది. అందువల్ల మెక్సికో ప్రజలు ఫ్రాన్సిస్ మాడెరో నాయకత్వంలో 1910లో డయాజ్‌పై తిరగబడ్డాయి. డయాజ్ పారిపోగా మాడెరో మెక్సికో అధ్యక్ష స్థానాన్ని ఆక్రమించాడు. కాని పరిస్థితి చక్కపెట్టలేక పోవడంతో జనరల్ హ్యూర్టా (Huerta) అను రెడ్ ఇండియన్ 'మాడెరా'ను హత్య చేయించి 1913లో మెక్సికో అధ్యక్షుడయినాడు. హ్యూర్టా ప్రభుత్వాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాయి. కాని అమెరికా అధ్యక్షుడు విల్సన్ హ్యూర్టా ప్రభుత్వానికి గుర్తింపు ఇవ్వలేదు. పైగా మెక్సికోలో ప్రజాస్వామ్య ఉద్యమ నాయకులైన కరంజా, విల్లాలాంటి వారికి తన మద్దతు ప్రకటించి వారికి కావలసిన సహాయాన్ని అందించటానికి సిద్ధపడ్డాడు. దీనికి ప్రతీకారంగా హ్యూర్టా అమెరికన్ పౌరులను హింసించటం మొదలు పెట్టాడు. అమెరికా నౌకా దళానికి చెందిన కొందరిని మెక్సికన్ పోలీసులు నిర్బంధించారు. విల్సన్ మెక్సికో రేవు పట్టణమైన 'వెరాక్రాజ్'ను ఆక్రమించాడు. యుద్ధం అనివార్యమయ్యే పరిస్థితులు ఏర్పడినాయి. యుద్ధాన్ని నివారించటానికి లాటిన్ అమెరికా రాజ్యాలైన అర్జెంటైనా, బ్రెజిల్, చిలీలు (A.B.C. దేశాలు) మధ్యవర్తిత్వం నెరపటానికి ముందుకు వచ్చాయి. అమెరికా దీనికి అంగీకరించినప్పటికీ, హ్యూర్టా దీనికి ఒప్పుకోలేదు. ఇటువంటి పరిస్థితులలో హ్యూర్టా మెక్సికో నుండి పారిపోవలసి వచ్చింది.

హ్యూర్టా తరువాత 'కరంజా' మెక్సికో అధ్యక్షుడైయినాడు. కరంజా అమెరికన్ల యందు స్నేహభావంతో వున్నందున, అమెరికా వెరాక్రాజ్ నుండి తన సైన్యాన్ని ఉపసంహరించింది. మెక్సికోలో అంతర్యుద్ధం రగిలినందున అమెరికన్ పౌరుల ప్రాణ, ధనాలకు రక్షణ లేకుండా పోయింది. 1914లో మాజీ సైనికాధికారి అయిన ఫ్రాన్సిస్ విల్లా అనునతడు కరంజా అధికారాన్ని కూలదోయటానికి ప్రయత్నం చేశాడు. విల్లా దుష్టచర్యలను అరికట్టటానికి 1915లో అమెరికా, ఎ.బి.సి. రాజ్యాలతో కలసి కరంజా ప్రభుత్వానికి గుర్తింపునిచ్చింది. విల్లా అమెరికాపై కోపంతో కొంత సైన్యాన్ని సమీకరించి కొలంబస్‌పై దాడి చేసి 17 మంది అమెరికన్ పౌరులను వధించాడు. దీనికి కోపోద్రిక్తుడైన విల్సన్, విల్లాను బంధించటానికి సైన్య పటాలాన్ని మెక్సికోకు పంపాడు. కాని విల్లాను పట్టుకోవడంలో విఫలమయ్యాడు. మెక్సికో అధ్యక్షుడైన

కరంజాను అగౌరపరచటం ఇష్టం లేనందువల్లనూ, 1917లో జర్మనీతో యుద్ధం అనివార్యమయ్యే పరిస్థితులు ఏర్పడినందున మెక్సికో దేశంతో అమెరికా రాజీపడటం జరిగింది. రాజీ ఫలితంగా అమెరికా తన సైన్యాన్ని మెక్సికో నుండి వెనుకకు రప్పించింది.

## 17.6. ప్రథమ ప్రపంచ సంగ్రామము - తటస్థ విధానము :

అమెరికా అధ్యక్షుడైన ఉడ్రో విల్సన్ తన దేశం ఈ సంఘర్షణతో నిమిత్తం లేకుండా తటస్థంగా వుంటుందని ప్రకటించినాడు. అందుకు గల కారణాలు :

1. జార్జి వాషింగ్టన్ కాలం నుండి యూరప్ రాజ్యాల వ్యవహారాలలో జోక్యం కలుగ చేసుకోరాదనే విధానం అనుసరించబడినది. మన్రో సిద్ధాంతం దాన్ని ప్రమాణీకరించింది.
2. అమెరికా ప్రజలలో అన్ని యూరప్ రాజ్యలకు చెందిన వారు వుండటం వలన ఏ వర్గానికీ ప్రత్యేకంగా సహాయం చేయటానికి సముఖంగా లేదు.
3. తటస్థ విధానం అనుసరించుట వల్ల అమెరికా పరిశ్రమలు బాగా వృద్ధి చెందినాయి. ఆర్థికాభివృద్ధి దృష్ట్యా కూడా అమెరికా తటస్థంగా వుండటమే లాభకరమైనది.

**మిత్ర రాజ్యాల వైపు మొగ్గు :** అమెరికా ఎంతగా తటస్థ్యంగా ప్రకటించినా కొన్ని పరిస్థితుల ప్రాబల్యం వలన మిత్ర రాజ్యాల వైపు మొగ్గు చూపటం తప్పనిసరి అయినది.

1) విల్సన్ తన బాల్యం నుండి కూడా ఆంగ్ల సంస్కృతిపై అభిమానం కలవాడు. వీలు కలిగినపుడల్లా ఇంగ్లాండులోనే విరామ కాలాన్ని గడుపుతుండేవాడు.
2) ప్రజలలో అధిక భాగం ఇంగ్లీషు, కెనేడియన్ సంతతికి చెందినవారు. జర్మన్ - ఆస్ట్రియన్ సంతతికి చెందినవారు 20% మాత్రమే. అందువలన ప్రజల సానుభూతి బ్రిటన్ వైపే మొగ్గుతుండేది.
3) తమ స్వాతంత్ర్య సాధనలో ఫ్రాన్స్ ఇచ్చిన సహాయ సహకారాలను అమెరికన్ ప్రజలు మరచిపోలేదు. వారి సానుభూతి పూర్తిగా ఫ్రాన్స్ తరపునే నిలిచింది.
4) అతిచిన్న దేశమైన బెల్జియంపై జర్మనీ దండెత్తి ధన, ప్రాణ నష్టాలు కలిగించటం అమెరికన్లకు జుగుప్స, కోపం కలిగించింది.
5) సమోవా, మనీలా ప్రాంతాలలో జర్మనీవారు అమెరికన్ల ప్రయోజనాలకు అడ్డుతగలటం వల్ల జర్మనీపై ద్వేషభావం పెరిగింది.
6) ప్రపంచ విపణిలో అమెరికన్ సరుకుల కంటే జర్మన్ సరుకులు తక్కువ ధరలకు విక్రయింపబడటం వల్ల అమెరికన్ వాణిజ్యం దెబ్బతినటం ఆరంభమైనది. దీనితో పాటు నౌకా విభాగంలో కూడా జర్మన్లు అగ్రస్థానానికై పోటీ చేయసాగినారు.
7) జర్మనీని పాలించే రెండవ విలియం చక్రవర్తి నిరంకుశత్వానికి, రాజరికానికి ప్రతీకగా అమెరికన్లు భావించారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాలు ఆదర్శంగా గల అమెరికన్లు దీనిని ఆదర్శాల స్థాయిలో కూడా ప్రతిఘటించాలని నిశ్చయించుకున్నారు.
8) బెల్జియంలో జర్మన్లు ఎడిత్‌కావెల్ అనే ఉపచారికను బ్రిటీష్ సైనికులు పారిపోవటానికి అవకాశం కల్పించిందనే నేరంపై మరణశిక్ష విధించి చంపినారు. ఈ సంఘటనను విస్తృతంగా ప్రచారం చేయటం వల్ల ప్రజలకు జర్మనీపై ఆగ్రహం పెచ్చు పెరిగింది.

**సముద్రాధిపత్యం కోసం పోరాటం :** బ్రిటన్, జర్మనీల మధ్య సాగిన పోరాటం సముద్రంపై తటస్థ నౌకలకు అనేక ఇబ్బందులు, నష్టాలు కలిగించింది.

1) 1909 లోనే కొన్ని ఆహార పదార్థాలను కూడా యుద్ధ వస్తువుల జాబితాలో చేర్చి శత్రు దేశాలకు వాటిని చేరవేయరాదని బ్రిటన్ ప్రకటించింది. జర్మనీతో తటస్థ దేశాల నౌకలు, వ్యాపార సంస్థలు కూడా వాణిజ్యం జరుపరాదని నిషేధించింది.

2) యుద్ధ ప్రారంభం నుండి మిత్ర దేశాల వారు జర్మనీపై నౌకా దిగ్బంధం విధించారు. దీనినెదుర్కొవటానికి జర్మనీ తన జలాంతర్గాములను విరివిగా ప్రయోగించసాగింది. 1915లో గుల్ఫైట్ అనే అమెరికన్ తలై వాహిక నౌకను ముంచి వేసింది. లూసిటానియా, అరేబిక్ అనే బ్రిటీష్ నౌకలను 1916లో సస్సెక్స్ అనే ఫ్రెంచి నౌకను ముంచివేసి అనేక మంది అమెరికన్ల ప్రాణాలకు ముప్పు కల్పించింది. ఈ విధంగా కొన్ని గత్యంతరం లేని పరిస్థితులలో అమెరికా తీవ్రంగా యుద్ధ ప్రయత్నాలు చేయవలసి వచ్చింది.

**యుద్ధ సన్నద్ధత - శాంతి కాముక సంస్థలు :** యుద్ధారంభ కాలంలో "అమెరికన్ యూనియన్ ఎగెనెస్ట్ మిలిటరిజమ్, 'అమెరికన్ లీగ్ టు లిమిట్ ఆర్మమెంట్స్', అమెరికన్ న్యూట్రాలిటీ లీగ్', 'విమెన్స్ పీస్ పార్టీ', మొదలైన సంస్థలు యుద్ధంలో చేరరాదని ప్రచారం చేసినాయి. విల్సన్ కూడా దీనికి సహకారమిచ్చాడు.

**యుద్ధానుకూల ప్రచారం :** కాని జర్మనీ దుడుకుతనం వల్ల అనేకులు యుద్ధం తప్పదనే అభిప్రాయానిక వచ్చినారు. జనరల్ లియొనార్డ్, ధియొడోర్ రూజ్‌వెల్ట్ మొదలైనవారు దీనికి దోవ తీసినారు. నేషనల్ సెక్యూరిటీ లీగ్,నేవీ లీట్, అమెరికన్ రైట్స్ కమిటీ, మొదలైన సంస్థలు ప్రజాభిప్రాయాన్ని యుద్ధోన్ముఖం చేయటానికి తోడ్పడినాయి.

**సన్నస్థ చర్యలు :**

1) షిప్పింగ్ బోర్డు ఏర్పాటు చేయబడినది. దీనికి నౌకలను నిర్మించే అధికారం, బాధ్యత ఇవ్వబడినాయి.

2) యుద్ధ కాలంలో జాతీయ సంపదను ఎలా సమీకరించి, వినియోగించవలెనో నిర్ణయించే అధికారం జాతీయ రక్షణ సంస్థకి ఇవ్వబడినది.

3) నేషనల్ అప్రోప్రియేషన్ చట్టం ద్వారా యుద్ధ నౌకల నిర్మాణానికి 50 కోట్ల డాలర్లు కేటాయించబడినవి.

4) జాతీయ రక్షణ చట్టం ద్వారా సైన్యాన్ని పెంచటానికి, జాతీయ రక్షణ దళాలను ఏర్పాటు చేయటానికి ప్రభుత్వానికి అధికారం ఇవ్వబడింది.

## 17.17. యుద్ధంలో అమెరికా ప్రవేశం :

**1916 ఎన్నికలు - శాంతి ప్రయత్నాలు :** శాంతి, తటస్థ్యం నినాదాలు ఆధారంగానే విల్సన్ తిరిగి అధ్యక్ష పదవికి ఎన్నికైనాడు. అతని శాంతి సూచనలను రెండు పక్షాలు అంగీకరించలేని స్థితిలో ఉన్నవని గ్రహించి స్వతంత్రగా శాంతి పథకాన్ని ప్రకటించినాడు. 1) విజయ రహితమైన శాంతి, 2) అన్ని దేశాలకు స్వయం నిర్ణయాధికారము, 3) సముద్రాలపై స్వేచ్ఛాయానము, 4) నిరాయుధీకరణము, 5) రహస్య ఒప్పందాలకు స్వస్తి, 6) యుద్ధ నివారణకు సమిష్టి భద్రత ఏర్పాటు అనే అంశాలతో ఇది కూడి ఉన్నది. కాని ఈ పథకానికి కూడా ఎవ్వరును సముఖత్వం ప్రదర్శించలేదు.

**జర్మనీ విజృంభణ :**

1) జర్మనీ జలాంతర్గాములు మరింతగా విజృంభించి సముద్రాధిపత్యాన్ని చేజిక్కించుకున్నాయి. జర్మనీ చేసిన ఒక హెచ్చరిక ఫలితంగా అమెరికా దౌత్య సంబంధాలను రద్దు చేసుకోవలసి వచ్చింది.

2) ఈలోగా జర్మనీ మెక్సికోతో ఒక రహస్య ఒడంబడిక చేసుకున్నదనే వదంతి బయలుదేరినది. 'జిమ్మర్ మన్‌నోట్' అనే పత్రం ప్రకటించబడింది. దీని ఫలితంగా దక్షిణ, పశ్చిమ రాష్ట్రాలు కూడా యుద్ధమునకు సుముఖత్వం ప్రకటించినాయి.

3) 1917లో రష్యాలో కమ్యూనిష్టు విప్లవం జరిగింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. నూతన ప్రభుత్వం యుద్ధం నుండి దూరంగా ఉండటానికి నిశ్చయించుకున్నది. దీనితో యుద్ధం కేవలం ప్రజాస్వామ్య నిరంకుశ విధానాల సంఘర్షణగా రూపొందించబడింది. అమెరికా యుద్ధంలో ప్రవేశిస్తూ కాంగ్రెస్‌లో ప్రకటన చేసింది.

**యుద్ధగతి - శాంతి సంధి - యుద్ధ లక్ష్యం :** యుద్ధాలను నివారించుటమేగాక ప్రపంచంలో ప్రజాస్వామ్య సుస్థిరతకే యుద్ధం జరుగుతున్నదని విల్సన్ యుద్ధ లక్ష్యాన్ని ప్రకటించినాడు.

**జాతీయ సంఘటన :** ప్రత్యర్థి పార్టీ అయిన రిపబ్లికన్లు డెమోక్రాట్లతో పూర్తిగా సహకరించినాడు. మిత్ర రాజ్యాలకు సైనికంగానే గాక, ఆహార సరఫరాలను కూడి విరివిగా సహాయం చేయవలసి వచ్చింది. ఈ కార్యక్రమాన్ని జాతీయ రక్షణ సంస్థ నిర్వహించింది.

**సైన్య సమీకరణ :** 'సెలెక్టివ్ సర్వీస్ యాక్ట్' అనే చట్టం ద్వారా నిర్బంధ సైనిక శిక్షణ ప్రవేశపెట్టబడింది. రెండు లక్షల నుండి నలభై లక్షలకు సైన్యం సంఖ్య పెంచబడింది. ఇరవై లక్షల మందిని దేశాంతర రంగాలకు పంపటం జరిగింది.

**ఇతర చర్యలు :** పారిశ్రామికాభివృద్ధి పెంచబడింది. ఆహార పదార్థాల ఉత్పత్తి పెంచబడింది. రవాణా సౌకర్యాలు విరివిగా విస్తరింపబడినాయి. అనేక రకాలుగా ధన సేకరణ చేయబడింది.

**యుద్ధరంగాలు :** 1918 ఆరంభం నాటికి అమెరికన్ సైన్యాలు యూరప్ రంగాలకు చేరుకోవటం ఆరంభమైనది. ఫ్రాన్స్ రంగంలో మార్నే, ఛటామ్ థియెర్రీ, సాయజన్స్, సెంట్‌మిహిల్ యుద్ధాలలో మిత్ర రాజ్యాలు విజయం సాధించాయి. మ్యూజ్ - ఆర్గోనే ప్రాంతంలో అమెరికన్లు జర్మన్‌లతో ముఖాముఖి పోరాడి విజయం పొందారు. 1918 నవంబరులో జర్మన్ చక్రవర్తి కైజర్ హాలెండ్‌కు పారిపోయాడు.

ఒక వంక మిత్ర పక్షాల వారికి సమాయ సహకారాలు అందిస్తూ, యుద్ధంలో పరోక్షంగా పాల్గొనుచూ మరియొక వంక శత్రుత్వ భావాలను తగ్గించే ప్రయత్నాలను కూడా విల్సన్ చేపట్టాడు. శత్రు దేశాల ప్రజలతో మిత్ర దేశాల సైన్యాలపై వ్యతిరేకత తగ్గించటానికి, యుద్ధనంతరము ఆదేశాలతో శాంతి సంభాషణలు నెరపటానికి కావలసిన వాతావరణం కల్పించటానికి, ప్రపంచ శాంతిని సాధించే 14 సూత్రాలను విశదీకరించాడు.

## 17.8. ఉడ్రో విల్సన్ 14 సూత్రాలు :

విల్సన్ తన 14 సూత్రాలను అమెరికన్ కాంగ్రెస్‌లో జనవరి 1918న వివరించాడు. ఆ పద్నాలుగు సూత్రాలు ఏమనగా,

1. దేశాలు రహస్యంగా కాక బహిరంగంగా ఒడంబడికలు చేసుకోవలెను.
2. సముద్రాలను స్వేచ్ఛగా అన్ని దేశాలు ఉపయోగించుకోవలెను
3. అంతర్జాతీయ వర్తకము స్వేచ్ఛగా జరగవలెను
4. అన్ని దేశాలు ఆయుధ బలాన్ని తగ్గించుకోవలెను
5. వలసల హక్కులు న్యాయంగా నిర్ణయం కావలెను
6. రష్యా భూ భాగం నుండి సైన్యాలను ఉప సంహరించవలెను
7. బెల్జియం నుంచి విదేశీ సైన్యాలను ఉప సంహరించి బెల్జియం స్వాతంత్ర్యాన్ని కాపాడవలెను
8. ఫ్రెంచి రాజ్య భాగాలయిన అల్సేస్ -లొరేయిన్‌లను ఫ్రాన్స్‌కు ఇవ్వవలెను
9. ఇటలీ దేశ సరిహద్దులు జాతీయతా సిద్ధాంతాన్ని అనుసరించి నిర్ణయం కావలెను

10. ఆస్ట్రియా - హంగరీలోని అనేక జాతులకు స్వయం పాలన ఇవ్వవలెను

11. బాల్కన్ రాజ్యాలయిన రుమేనియా, సెర్బియా మాంటె నీగ్రోలు జాతీయతను గుర్తించవలెను.

12. టర్కీలోని కొన్ని జాతులకు స్వయం పాలన ఇవ్వవలె. మిగిలిన టర్కీలో దానికి సార్వభౌమత్వము ఉండవలెను.

13. పోలాండ్ స్వతంత్ర రాజ్యం కావలెను.

14. అంతర్జాతీయ శాంతి సంస్థ ఏర్పడవలెను.

## 17.9. వర్సే సంధి :

1919 జనవరిలో పారిస్ సమీపాన ఉన్న వర్సే ప్రసాదంలో శాంతి సమావేశం జరిగింది. కానీ ఈ సమావేశం రూపొందించిన శాంతి నిర్ణయాలు, అమెరికాకు పూర్తి ఆమోద యోగ్యం కాలేకపోయాయి.

మొదటి ప్రపంచ యుద్ధంలో విజయం సాధించిన మిత్ర రాజ్యాలు, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, అమెరికా పారిస్‌లో 1919లో శాంతి సమావేశం జరిపాయి. అవి ఓడిపోయిన దేశాలు జర్మనీ, ఆస్ట్రియా, హంగేరి, టర్కీ, బల్గేరియాలతో వేరు వేరు సంధులు చేసుకున్నాయి. వాటిలో ప్రధానమైనది జర్మనీ 1919లో చేసుకున్న వర్సే శాంతి సంధి. ఈ సంధి వర్సేలో అద్దాల మందిరంలో జరిగింది. అక్కడే 1871లో బిస్మార్క్ మొదటి విలియమ్‌ను జర్మనీ చక్రవర్తిగా ప్రకటించాడు. అనేక రహస్య సమావేశాలు, బహిరంగ సమావేశాలు జరిగిన తరువాత 1919 మే నాటికి సంధి ముసాయిదా పత్రాలు తయారయినాయి. 230 పేజీలు వున్న సంధి ముసాయిదా పత్రాన్ని 15 భాగాలుగా విభజించిరి. ఈ సంధి - ముసాయిదా సంతకాల కోసం జర్మన్ ప్రతినిధుల ముందు వుంచిరి. జర్మన్ ప్రతినిధులు మొదట నిరాకరించి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేశారు. కాని చివరికి మిత్ర రాజ్యాల బలవంతము మీద గత్యంతరం లేక జర్మన్ ప్రతినిధులు సంధి పత్రాల మీద 1919 జూన్ 28న సంతకాలు చేశారు.

**సమావేశమునకు హాజరైన ప్రతనిధులు :** ఈ సమావేశమునకు అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్, ఇంగ్లాండ్ ప్రధాని లాయిడ్ జార్జి, ఫ్రెంచి తరపున క్లిమెన్సో, ఇటలీ తరుపున హార్లెండో ప్రముఖులు పాల్గొన్నారు.

**ప్రాదేశిక ఏర్పాట్లు :**

1. 1871 లో పోగొట్టుకున్న ఆల్సేస్ - లోరైన్ ప్రాంతాలు ఫ్రాన్స్ తిరిగి పొందింది.

2. జర్మన్ దురాక్రమణ వల్ల జరిగిన నష్టానికి పరిహారంగా యూపెన్ మాల్‌మెడి, మొర్సెనైట్ అనే భూభాగాలను బెల్జియం పొందింది.

3. ఉత్తర ష్లెస్‌విగ్‌ను ప్రజాభిప్రాయం ప్రకారం డెన్మార్క్‌కు ఇవ్వడం జరిగింది

4. పోసెన్, పశ్చిమ ప్రష్యా, ఎగువ సైలీషియా పోలెండ్‌కు ఇచ్చినారు.

5. సార్‌లోయ నానా జాతి సమితి ఆధీనంలో వుంచినారు. దీనిలోని బొగ్గుగనులు ఫ్రాన్స్‌కు ఇచ్చినారు.

6. ఎగువ సైలీషియాలో కొద్ది భాగము చెకొస్లావాకియాకు ఇవ్వటం జరిగింది.

7. సంధిలోని 80వ నిబంధన ప్రకారం ఆస్ట్రియాను సంపూర్ణ స్వతంత్ర దేశంగా జర్మనీ గుర్తించింది.

8. జర్మనీ పట్టణమైన 'డాన్ జింగ్' స్వేచ్ఛా పట్టణంగా ప్రకటించి నానాజాతి సమితి పరిపాలన క్రింద వుంచినారు.

9. ఈ సంధి వలన 260 మైళ్ళ పొడవు, 80 మైళ్ళ వెడల్పు వున్న జర్మన్ కారిడార్ పోలెండ్ ఆధీనంలోకి వచ్చింది. దీని ఫలితంగా జర్మనీ రెండు భాగాలుగా విభజింపబడింది.

**సైనిక నిబంధనలు :**

1. జర్మనీ నిర్బంధ సైనిక విధానాన్ని విడనాడవలెను. జర్మనీ సైనిక బలం ఒక లక్షకు పరిమితం చేయవలెను.
2. రైన్ నది ఎడమ భాగము పూర్తిగానూ, కుడిభాగం కొంత వరకూ నిస్సైనిక మండలంగా ప్రకటించటానికి జర్మనీ అంగీకరించింది.
3. జర్మన్ నౌకా బలం, ఆరు యుద్ధ నౌకలకు, ఆరు చిన్న యుద్ధ నౌకలకు, పన్నెండు నౌకా విధ్వంసక నావలకు పరిమితం అయింది.
4. జర్మనీకి విమాన బలం వుండకూడదు
5. జర్మన్ నదులు, కాలువలు అంతర్జాతీయ కమీషన్ ఆధీనంలో వుంచటం జరిగింది.

**ఆర్థిక నిబంధనలు :**

1. జర్మన్ వాణిజ్య నౌకలు ఫ్రాన్స్‌కు, యుద్ధ నౌకలు బ్రిటన్‌కు ఇచ్చినారు.
2. యుద్ధంలో మిత్రరాజ్యాలు పోగొట్టుకున్న నౌకల స్థానే క్రొత్త నౌకలను తన ఖర్చుమీద జర్మనీ నిర్మించి ఇవ్వవలెను.
3. విదేశాలలో వున్న జర్మన్ పౌరుల ఆస్తులను జప్తు చేసే అధికారము మిత్ర రాజ్యాలకు వచ్చింది
4. జర్మనీ రాబోయే పది సంవత్సరాలలో అధిక పరిమాణంలో బొగ్గును ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం దేశాలకు సరఫరా చేయవలెను.
5. జర్మనీ అయిదు వేల రైలు ఇంజన్లలను, లక్ష్యా యాభై వేల మోటారు వాహనాలను మిత్ర రాజ్యాలకు ఇవ్వవలెను.
6. అయిదు సంవత్సరాల కాలంలో జర్మనీ ఎగుమతి - దిగుమతి వ్యాపారం మీద మిత్ర రాజ్యాలకు ప్రత్యేక అధికారములు వుంటాయి.
7. కీల్ కాలువను అంతర్జాతీయం చేసినారు.

**నష్టపరిహార సమస్య :** జర్మనీ చెల్లించవలసిన నష్టపరిహారం మొత్తాన్ని నిర్ణయించటం సాధ్యం కానందువల్ల అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ జపాన్ దేశాల ప్రతినిధులతో నష్టపరిహార నిర్ణయ సంఘాన్ని ఏర్పాటు చేయటం జరిగింది. నష్టపరిహార మొత్తాన్ని జర్మనీ 1921 నుండి 30 సంవత్సరాల కాలంలో వాయిదా పద్ధతి ప్రకారం చెల్లించవలెను. ఈలోగా జర్మనీ మిత్రరాజ్యాలకు 10 కోట్ల పౌండ్లు చెల్లించవలెను.

1. యుద్ధ కాలంలో విధ్వంసం చేసిన భవనాల స్థానే క్రొత్త భవనాలు నిర్మించటానికి కావలసిన భవన నిర్మాణ సామాగ్రి జర్మనీ సమకూర్చవలెను.
2. జర్మనీ ఫ్రాన్స్ నుంచి కాజేసిన ప్రాచీన పత్రాలను, కళాఖండాలను తిరిగి ఫ్రాన్స్‌కు అప్పగించవలెను.
3. మాజీ కైజర్ రెండవ విలియంకు బహూకరించిన ఖురాన్ ప్రతిని తిరిగి స్వాధీనం చేసుకొనిరి
4. జర్మనీలో వున్న రెండు ప్రఖ్యాతి వహించిన వర్ణ చిత్రాలు బెల్జియమ్‌కు ఇవ్వవలెను.

**న్యాయ సంబంధమైన నిబంధనలు :** వర్సే సంధిలోని 231వ నిబంధనల ప్రకారం జర్మన్ చక్రవర్తిని యుద్ధ నేరస్తుడుగా ప్రకటించినారు. జర్మన్ చక్రవర్తి రెండవ విలియమ్‌తో సహా దాదాపు వందమంది జర్మన్ నేరస్థులను విచారణకు ఏర్పాటు చేసినారు. అయితే హాలెండ్ రక్షణలో వున్న రెండవ విలియంను విచారించుటకు వీలు పడలేదు.

**రాజకీయ నిబంధనలు :**

1. నానాజాతి సమితి స్థాపనకు సంబంధించిన నిబంధనలు వర్సే సంధిలో భాగంగా చేర్చినారు
2. రష్యా - జర్మనీలు చేసుకున్న సంధులు రద్దయినాయి.

3. జర్మనీ తూర్పు సరిహద్దు క్రొత్తగా నిర్ణయమయింది.

4. బెల్జియం, పోలెండ్, యుగోస్లావియా, చెక్‌స్లావియా దేశాలను స్వతంత్ర దేశాలుగా గుర్తించుట జరిగింది.

**వర్సే సంధి - విమర్శ :** వర్సే సంధి ఆధునిక కాలానికి చెందిన ఒక ముఖ్యమైన వివాదాస్పదమైన సంధి. ఈ సంధి తమ మీద జరిగిన పెద్ద కుట్ర అని, బలవంతంగా రుద్దిన శాంతియని జర్మన్‌లు అభిప్రాయపడినారు.

1. మిత్ర రాజ్యాలకు జర్మనీపై ఎంత పగ, ద్వేషము వున్నాయో ఈ సంధి వలన తెలియుచున్నది.
2. వర్సే సంధి తయారు కావటం రెండు ముఖ్య సిద్ధాంతాల మీద ఆధారపడి వున్నది. అవి. ఎ) యుద్ధానికి కారణమైన జర్మనీని శిక్షించటం, బి) భవిష్యత్తులో జర్మనీ దురాక్రమణ నుండి యూరప్‌ను కాపాడటం
3. శాంతి సంధిని తయారుచేసిన వారు జర్మన్ల మనోభావాలను గాని, మానసిక ప్రతిక్రియను గాని లక్ష్యము చేయలేదు. మిత్ర రాజ్యాల పగ సాధింపు ధోరణుల వల్ల జర్మన్ ప్రజలలో అసంతృప్తి, ద్వేషము ఎక్కువయినాయి.
4. జర్మనీ తన వలసనన్నింటిని పోగొట్టుకోవటమేకాక పారిశ్రామిక ప్రదేశాలను, ఖనిజ ప్రాంతాలను కోల్పోయి ఆర్థికంగా జర్మనీకి అన్యాయం జరిగింది.
5. ఈ సంధి మీద సంతకాలు చేసిన దేశాలన్నీ నిరాయుధీకరణ సూత్రాన్ని ఆమోదించినాయి. కాని మిత్ర రాజ్యాలు నిరాయుధీకరణను తమ విషయంలో అమలులో పెట్టలేదు.
6. వర్సే సంధిలో మూడు వాదాల సంఘర్షణ వున్నది. అవి విల్సన్ ఆదర్శవాదము, క్లిమెన్‌సో జాతీయవాదము, లాయిడ్‌జార్జి అవకాశవాదము.
7. వర్సే సంధి ఉడ్రో విల్సన్ 14 సూత్రాలకు అనుగుణ్యంగా లేదు. రెండవ ప్రపంచ యుద్ధానికి బీజాలు వర్సే సంధిలోనే వున్నాయని కొంత మంది విమర్శకులు అభిప్రాయము.

## 17.10. సారాంశము :

ఉడ్రో విల్సన్ ఈ విధంగా తన అంతరంగిక విధానాలలో భాగంగా టారీఫ్ సంస్కరణను, ట్రస్ట్‌ల సంస్కరణలను ప్రవేశపెట్టి నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాడు, మరియు ట్రస్ట్‌లను అదుపులోకి తీసుకొని వచ్చి వారు చేసే అక్రమాలను అరికట్టి ప్రజలకు మేలు చేసాడు. ఫెడరల్ రిజర్వ్ చట్టం ద్వారా, బ్యాంకింగ్ రంగాన్ని సంస్కరించాడు. విదేశీ విధానములో మిత్ర పక్షాల వారికి సంపూర్ణ సహకారాన్ని అందజేసివారు మొదటి ప్రపంచ యుద్ధంలో విజయం సాధించటానికి ముఖ్య కారకుడైనాడు. వర్సే సంధికి శాంతి సూత్రాలను ప్రతిపాదించి, నానాజాతి సమితి స్థాపనకై రాజీపడ్డాడు. మొదటి ప్రపంచ యుద్ధముగిసే నాటికి అమెరికాను ప్రపంచంలో ఆధిక్య స్థానంలో నిలిపాడు.

## 17.11. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)

1. అమెరికా విల్సన్ తన అధ్యక్ష కాలంలో ప్రవేశపెట్టిన స్వేచ్ఛా విధానాలను, ఇతర సాంఘీక సంస్కరణలను గూర్చి విశదీకరించుము.
2. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికా అవలంభించిన విధానమును గూర్చి వ్రాయుము.
3. విల్సన్ కాలంలో జపాన్, బ్రిటన్, మెక్సికో దేశీయులతో అమెరికాకు ఏర్పడిన సమస్యలను వివరిస్తూ వాటిని ఏ విధంగా పరిష్కరించింది తెలియపరచుము.
4. వర్సే సంధి షరతులను వివరించుము.

## 17.12. చదువదగిన గ్రంథాలు :


1. Allan Novins & Henry Steel Commager - The Pocket History of the United States, Pocket Books, INC, New York 1943, 1951 (8th reprint)

2. Henry Bamford Parkes - The United States of America - A History : Khosla Publishing House ; Mehra Offset Press, New Delhi 1986

3. Richard Hofst Adter & Millers & Aaron - The United States : The History of a Republic, Prentice - Hall INC N.J. 1957-1964 (14th edition)

4. V. Kameswara Rao & B. Lakshmi Narayana - America Samyukta Rastrala Charitra, Telugu Academy (1986)


- డా॥ యం. శ్రీనివాసరెడ్డి

పాఠం - 18

# అమెరికాలో మామూలు స్థితికాలం (1921-33)

## 18.0. లక్ష్యం :

అమెరికాలో 1921-1933 సంవత్సరాల మధ్య కాలంలో నెలకొన్న మామూలు స్థితిని గూర్చి తెలియపరచుట మరియు ఆ కాలంలో అధ్యక్షులైన వారన్ హార్డింజ్ (1921-23), కాల్విన్ కూలిడ్జ్ (1923-29), హెర్బర్ట్ హూవర్ (1929-33)ల పరిపాలనా విశేషాలను గూర్చి తెలియచేయటం మరియు వారు తీసుకున్న విదేశీ విధానాలను గూర్చి ముఖ్యంగా వాషింగ్టన్ సమావేశం, కెల్లాగ్ బ్రయాండ్ ఒడంబడికలను గూర్చి తెలియపరచటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


18.1. అమెరికాలో మామూలు స్థితి (1921-1933)

18.2. 1921-33 మధ్య కాలంలో అమెరికా వ్యవసాయరంగం

18.3. వారన్ హార్డింజ్ (1921-33)

18.4. కాల్విన్ కూలిడ్జ్ (1923-29)

18.5. హెర్బర్ట్ హూవర్ (1929-33)

18.6. వాషింగ్టన్ సమావేశం

18.7. కెల్లాగ్ - బ్రయాండ్ ఒడంబడిక

18.8. సారాంశము

18.9. నమూనా ప్రశ్నలు

18.10. చదువదగిన గ్రంథాలు


## 18.1. అమెరికాలో మామూలు స్థితి (1921-1933)

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికా తత్వానికి వ్యతిరేకమైన ప్రభుత్వ నియంత్రణలు విపరీతంగా పెరిగాయి. సాఫీగా నడిచిపోతున్న అమెరికా ప్రగతి యుద్ధం తారుమారు చేసింది. యుద్ధానంతర కాలములోని (1921 నుండి 1933) అమెరికా అధ్యక్షులు దేశాన్ని మాములు స్థితికి తీసుకొని పోవటానికి కృషి చేసారు. ఆ పని నెరవేర్చారు కూడా. అందువలననే ఆ కాలాన్ని మామూలు స్థితి అని అంటారు.

అభ్యుదయ శకంలో (1921కి ముందు) ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించటానికై అండర్ ఉడ్ టారీఫ్ చట్టాన్ని ప్రవేశపెట్టి దాని ద్వారా 100 వస్తువులపై సుంకాలను పూర్తిగా తొలగించారు, మరో వెయ్యి వస్తువులపై ఉన్న సుంకాలను తగ్గించారు. దీని వల్ల ప్రభుత్వానికి కలిగిన నష్టాన్ని పూడ్చటానికి పెట్టుబడిదారులపైన, వ్యాపారస్తులపైన అంచెల వారీ ఆదాయపు పన్నులను విధించారు.

అభ్యుదయ శకంలో ట్రస్టులను నియంత్రించుట మరొక చర్య. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులు ట్రస్టుల, గుత్తా వ్యాపార సంస్థలను ఏర్పడి చిన్న చిన్న పారిశ్రామవెత్తలను పోటీలో నిలువనీయకుండా చేసేవారు. అంతేకాకుండా ట్రస్టులు, గుత్త వ్యాపారసంస్థల

వారు వినియోదారులను ఎన్నో విధాలుగా మోసం చేసేవారు. వీరు వస్తువును నాణ్యత విషయంలోను, ధర విషయంలో నియమ, నిబంధనలు పాటించేవారు కాదు. ఇటువంటి ట్రస్టుల, గుత్త వ్యాపార సంస్థల దుశ్చర్యలను అరికట్టటానికి ఎన్నో చట్టాలను చేసారు. అంతే కాకుండా, పారిశ్రామిక కార్మికులకు కూడా వారి న్యాయమైన హక్కుల కోసం జరిపే సమ్మెలు, చట్ట సమ్మతమని గుర్తించుట జరిగింది. ఈ విధంగా అభ్యుదయ శకంలో తీసుకొన్న కొన్ని చర్యల వలన పారిశ్రామిక వేత్తలకు కొంత వ్యతిరేక వాతావరణ ఏర్పడి వారి అభివృద్ధికి అవరోధం కలిగింది. అమెరికాలో ఈ పరిస్థితిని మార్చటానికై మొదటి ప్రపంచ యుద్ధ అనంతర కాలంలో కొన్ని నూతన చట్టాలు చేసి తిరిగి పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించారు.

అదే విధంగా మొదటి ప్రపంచయుద్ధ కాలంలో అమెరికా మిత్ర పక్షాల వారి పక్షాన చేరి, వారికి కావలసిన ఆహార పదార్ధాలను అందించటానికై పూనుకున్నప్పుడు ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఎన్నో త్యాగాలు చేసారు. గోధుమలు లేని సోమవారాలు, మాసంలేని మంగళవారాలు, పంచదారల లేని ఐస్‌క్రీములు, కూరగాయలు లేని భోజనాలు అమెరికా పౌరులు బుద్ధి పూర్వకంగానే యుద్ధ కాలంలో అలవాటు చేసుకున్నారు. దీనితో పాటు మధ్య వినియోగాన్ని తగ్గించారు, బొగ్గును వారంలో ఒక రోజు వాడకాన్ని తగ్గించారు. రాత్రులందు విద్యుద్దీపాల వాడకాన్ని కూడా నిలిపివేశారు. ఇవి అన్నియూ అమెరికా జీవన విధానానికి, వారి తత్వానికి విరుద్ధం. మొదటి ప్రపంచ యుద్ధానంతర కాలంలో అధికారంలోకి వచ్చిన రిపబ్లికన్ పార్టీ అధ్యకులైన హార్డింజ్, (1921-23), కూలిడ్జ్ (1923-29), హువర్ (1929-33) అమెరికాలో మామూలు స్థితికి, అంటే యుద్ధ పూర్వపు స్థితికి తీసుకుపోవటానికి కృషి చేశారు. 1921-32 సంవత్సరాల మధ్య కాలంలో వ్యాపారాన్ని అభివృద్ధి పరచటము ప్రభుత్వ కర్తవ్యంగా అమెరికా అధ్యక్షులు భావించారు. ప్రభుత్వాలు వ్యాపార రంగంలో ఎటువంటి ఆంక్షలు విధించకూడదని, ప్రభుత్వం వ్యాపారాభివృద్ధి పరిచే చర్యలు మాత్రమే చెయ్యాలని, వ్యాపారస్తులకు దేశాన్ని అభివృద్ధి పరచే విధంగా వారికి స్వేచ్ఛను ఇవ్వాలని భావించటం జరిగింది.

హార్డింజ్, కూలిడ్జ్‌ల అధ్యక్ష కాలంలో హువర్ దేశ వాణిజ్య కార్యదర్శిగా పనిచేసారు. హువర్ ఆకాలంలో వ్యాపారస్తులను చాలా ప్రోత్సహించారు. వ్యాపారస్తులు ఒకరికొకరు కలిసి పరస్పర సహకారాలు చేసుకోవాలని, వ్యాపార పరిజ్ఞానాన్ని పంచుకోవాలని, మంచి నైపుణ్యతతో కూడిన వస్తువులను ఉత్పత్తి చేయాలని హితవు చెప్పారు.

ఈ కాలంలో ట్రస్టులను భ్రష్టు పట్టించే కార్యాక్రమాలు అంతం చేసారు. యుద్ధానికి ముందు అమెరికాలో అమలులో నున్న షెర్మాన్, క్లైటాన్ లాంటి చట్టాలను వెనుకకు తీసుకొన్నారు. అంతరాష్ట్రీయ వ్యాపార సంస్థలు కొత్త బాష్యాలు చెప్పుకొన్నారు. వ్యాపార సంస్థలకు సంఘాలకు ప్రోత్సాహం లభించింది. దీని వలన వ్యాపారాభివృద్ధికి చాలా దోహదం జరిగింది.

విపరీత ఆదాయము కలవారిపైన పన్ను భారం ఈ కాలంలో చాలా వరకు తగ్గించారు. ఈ చర్య వలన వారి వద్ద చేరిన నిలువు ధనం మరళా వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు జరిగింది.

రక్షణ సుంకాలు, రైలు ఛార్జీలు, ఓడ వ్యాపారం మొదలైన విషయాలలో కూడా పెట్టుబడిదారులకు చాలా అనుకూలమైన రక్షణను ఈ కాలములో కల్పించారు. గుత్త వ్యాపారము చాలా పెరిగిపోయినది. ఈ విధంగా గుత్త వ్యాపార సంస్థలు 20 పెద్ద బ్యాంకుల జాతీయ నిధులలో 27 శాతం తమ ఆధీనంలో పెట్టుకో గలిగారు. 1919 నుండి 1929 మధ్య కాలంలో చాలా వ్యాపార సంస్థలు కలిసిపోయి కేవలం కొన్ని గుత్త వ్యాపార సంస్థలుగా ఏర్పడ్డాయి. పబ్లిక్ యుటిలిటీ సంస్థలలో 3744 సంస్థలు మిశ్రమమైపోయినాయి. ఈ బాటలోనే బ్యాంకింగ్, రవాణా, వర్తక రంగాలు కూడా పయనించాయి.

1933 నాటికి 594 వ్యాపార సంస్థలు అమెరికా వ్యాపార మొత్తంలో 53 శాతం వారి ఆధిపత్యంలో పెట్టుకున్నారు. మిగిలిన 47 శాతం వ్యాపారం 3,80,000 వ్యాపార సంస్థల ఆధీనంలో ఉన్నాయి.

వ్యాపారస్తులకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా 1920లో 34 రాష్ట్రాల ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కూడా కొంత మేర సడలించారు. కార్మికులకు అందించే నష్ట పరిహార చట్టాలను తీసి వేసారు, కార్మికులు నమ్మిచేసుకొనే హక్కులపై కూడా కొన్ని ఆంక్షలు విధించారు.

ఈ విధంగా 1920-1932 మధ్య కాలంలో అంతకు పూర్వ అభ్యుదయ శకంలో అమలులో ఉన్న ఎన్నో పారిశ్రామిక, వ్యాపార వ్యతిరేక చట్టాలను ఎన్నో సడలించారు.

ఈ కాలంలో తీసుకున్న చర్యల వలన ఎన్నో పరిశ్రమలు చాలా లాభాలు గడించాయి. 1919 సంవత్సరములో 54,200,000 డాలర్లుగా ఉన్న అమెరికా జాతీయ ఆదాయం 1929 నాటికి 87,200,000 డాలర్లుకు పెరిగింది.

1919వ సంవత్సరములో 6,771,000 కార్లు మాత్రమే ప్రయాణికులకు అందుబాట్లో ఉన్నాయి. 1929 నాటికి అవి 23,121,000కి పెరిగాయి. దానితో పాటుగా పెద్ద ఎత్తున, కొత్త రోడ్ల నిర్మాణం చేయటం రహదార్ల ప్రక్కన గొప్ప హోటళ్ళు ఏర్పడ్డాయి. చాలా పెట్రోలు బంకులు ఏర్పడ్డాయి. అమెరికాలో ఒక పర్యాటక వాతావరణం ఏర్పడిందని చెప్పవచ్చును.

ప్రజలు ఎంతో విలాస వంతమైన జీవితాన్ని గడపనారంభించారు. రేడియో, రిఫ్రిజిరేటరు, టెలిఫోన్లు వంటి వస్తువులకు అమితమైన డిమాండ్ ఏర్పడింది. 1922-27 సంవత్సరాల మధ్య కాలంలో ప్రజలకు కొనుగోలు శక్తి సాలుకు రెండు శాతం చొప్పున పెరిగింది. ప్రజలు వారి సౌకర్యాల కోసం ఎక్కువ ధనాన్ని ఖర్చుచేసారు. అదే విధంగా కొంత ధనాన్ని పొదుపు చేసుకోగలిగారు కూడా, వారు కొంత ధనాన్ని స్టాక్‌లలో పెట్టుబడి పెట్టారు. దీని వలన స్టాక్‌ల రేట్లు బాగా పెరిగాయి. ఇది అంతయూ 1929 వరకు మనకు అమెరికాలో కనబడుతుంది. ఆ తరువాత ప్రపంచం అంతా ఆర్థిక మాధ్యం ఏర్పడంతో అమెరికాలో కూడా అదే పరిస్థితి ఏర్పడింది.

## 18.2. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు :

1920 నుంచి అమెరికాలో వ్యవసాయ రంగంపై ఆర్థిక మాంధ్యం మొదలైంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయి, వ్యవసాయ దారుల ఫలసాయం బాగా తగ్గిపోయింది. పన్నులు బాగా పెరిగిపోయాయి, వ్యవసాయదారులు చాలా మంది ఋణగ్రస్తులైనారు. అప్పులు తీర్చలేక చాలా ఇబ్బందులకు గురైనారు. చాలా మంది రైతులు వారి భూములను అమ్ముకున్నారు కూడా. 1920-1930 మధ్య కాలంలో జాతీయ వ్యవసాయ ఆదాయం 15 1/2 మిలియన్ డాలర్ల నుండి 5 1/2 మిలియన్ డాలర్లకు పడిపోయింది. 1920లో 800 మిలియన్ బుషెల్ల గోధుమలకు 1 1/2 బిలియన్ డాలర్ల ఆదాయము లభించగా, దాదాపు అంతే ఉన్న గోధుమలు 1932లో కేవలం 300 మిలియన్ డాలర్ల ఆదాయమే పొందగిలిగింది. 1920లో 13 మిలియన్ బేల్ల పత్తి ఒక బిలియన్ డాలర్లకు అమ్ముడు కాగా అంతే పంట 12 సంవత్సరాల తరువాత కేవలం 1/2 బిలియన్ డాలర్లకే అమ్ముడు పోయాయి. మిగలిన పంటలు పరిస్థితి కూడా ఇటువంటి పరిస్థితే ఏర్పడింది. అమెరికాలోని వ్యవసాయ ఉత్పత్తులు ఇతర దేశ ఉత్పత్తులతో పోటీ పడవలసిన పరిస్థితి కూడా వచ్చింది. కెనడా, ఆస్ట్రేలియా, అర్జెంటీనాల నుండి గోధుమలను, ఈజిప్ట్, బ్రెజిల్, భారతదేశాల నుండి పత్తి పంటతోను గట్టి పోటీ ఏర్పడింది. విదేశీయులు అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలను ఎక్కువగా విధించటం వల్లను కూడా, అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు చాలా వరకు పడిపోయినాయి. విదేశీ వ్యాపారం కూడా కొంత వరకు దెబ్బ తిన్నది. హార్డింజ్, కూలిడ్జ్‌లు అధ్యక్షులుగా ఉన్నప్పుడు వ్యవసాయదారులకు ఇవ్వచూపిన సబ్సిడీలు, పంటల నియంత్రణలు లాంటి చర్యలు చేపట్టడానికి చేసిన ప్రయత్నాలను, వారి వీటోలతో తిరస్కరించారు. వ్యవసాయదారులకు ఉపయోగకరంగా ఉండే చర్యలను హూవర్ అధ్యక్ష కాలంలోనే చేపట్టటం జరిగింది. ఫామ్ బోర్డును స్థాపించారు. ఆ బోర్డుకు కావలసిన అధికారాన్ని, ధనాన్ని సమకూర్చారు. వ్యవసాయ ఉత్పత్తులను ఒక పద్ధతి ప్రకారం అమ్ముకొనే విధానాన్ని వీలు కల్పించారు.

వ్యవసాయదార్ల ఉపశమనం కోసం ప్రభుత్వేతర సంస్థల ఋణాలు ఇచ్చే అవకాశం కల్పించారు. ప్రభుత్వమే 12 బ్యాంకులను స్థాపించి 5 మిలియన్ డాలర్లల పెట్టుబడి ప్రభుత్వ వాటాగా పెట్టారు. హూవరు స్థాపించిన ఫెడరలల్ ఫామ్ బోర్డుకు ప్రభుత్వం 500 మిలియన్ డాలర్లు కేటాయించి ఆ మొత్తాన్ని వ్యవసాయ సహకార ఋణాలు రైతులకు ఇచ్చే విధంగా వీలు కల్పించారు. ఈ చర్యల వలన వ్యవసాయదారులకు కొంత ఉపశమనం కలిగింది.

## 18.3. వారన్ హార్డింజ్ (1921-33) :

1865 ఒహియో రాష్ట్రంలో మేరియాన్ నగరం దగ్గర జన్మించాడు, ఒక దిన పత్రికను స్థాపించి దానిని నడిపించాడు. ఫ్లారెన్సు క్లింగ్ డి బల్ఫ్ అనునామెను వివాహము చేసుకొన్నాడు. అమె తనకన్నా 6 సంవత్సరాలు వయస్సులో పెద్దదైనది. తదుపరి సెనెట్ సభ్యుడయినాడు. ఒహైయో రాష్ట్రానికి ఉప గవర్నర్‌గా ఎన్నికైనాడు. కానీ గవర్నర్ పదవికి పోటీ చేసి ఓడిపోయాడు. 1914లో సెనేట్‌కు ఎన్నికయ్యాడు. హాండా ఘర్టీ అనే స్నేహితుని ప్రోద్బలం వల్ల 1920లో రిపబ్లికన్ పార్టీ తరుపున అధ్యక్ష ఎన్నికలకు నియంత్రించబడినాడు.

ఆ ఎన్నికలలో భారీ మెజారిటీతో ఎన్నిక కాబడినాడు. వారెన్. జి. హార్డింజ్ అందరితో కలుపుగోలుగా ఉండేవారు. అందువలన అతను ప్రజారంజకునిగా పేరు తెచ్చుకున్నాడు. చార్లెస్ ఇవాన్స్‌ను అమెరికా దేశ కార్యదర్శిగా, హెర్బర్ట్ హూవర్‌ను వాణిజ్య శాఖ కార్యదర్శిగా, హెన్రీ సి. వాలాస్‌ను వ్యవసాయ కార్యదర్శిగా నియమించినాడు. వారి ద్వారా వాషింగ్‌టన్ సమావేశాల, జర్మణీతో సంధి చేసుకొనటం వంటివి నిర్వహించగలిగాడు. ఇతని కాలములో రేడియో వ్యవస్థ అభివృద్ధి చెందింది. ఆకాశవాణిలో మొదట మాట్లాడిన అమెరికన్ అధ్యక్షుడు హార్డింజ్. హార్డింజ్ ఒక ఒహైయో రాష్ట్రానికి చెందిన కొందరు లంచగొండులకు అతి చనువుగా ఉన్నందువలన వారు కొన్ని లంచగొండి పనులు, దుష్ట కార్యాలు చేసి అధ్యక్షునికి చెడ్డపేరు తెచ్చారు. హార్టింజ్ అధ్యక్షునిగా ఉన్న రెండు సంవత్సరాలకాలంలో వెటరన్స్ బ్యూరోకు అధ్యక్షుడైన చార్లెస్ ఫోర్బ్సు 20 కోట్ల డాలర్లను కైంకర్య చేసినట్లు తేలింది. ఈతడు ఆసుపత్రులకు అవసరమైన సరుకులు కొనుగోలు చేయుటలో ఇట్లా మోసం చేసినందున జైలు శిక్ష పడింది.

విదేశీ ఆస్తులకు సంరక్షకునిగా ఉన్న కల్నల్ థామస్ మిల్లర్ జర్మనీ రసాయన పరిశ్రకు పెటెంట్లను, జర్మనీ నుండి యుద్ధ కాలంలో ఆక్రమించిన ఆస్తులను అన్యాయంగా అమ్మి కొంత వివాదానికి గురైనాడు. హార్డింజ్‌కి అటార్నీ జనరలైన డాఘర్టీ, కొన్ని అవకతవకలకు పాల్పడి కూలిడ్జ్ అధ్యక్ష కాలంలో అతనిని ఆ పదవి నుండి తొలగించినారు.

హార్డింజ్ అధ్యక్ష కాలంలో జరిగిన అన్ని చట్ట వ్యతిరేక చర్యలన్ని విస్తృతమైనది. టిపాట్ డూమ్ ఇల్క్ హిల్ నూనెనిలువలను చట్ట వ్యతిరేకంగా హారిసిలక్లెర్, డోహ్ని అనే వ్యాపారస్తులకు రహస్యంగా కౌలుకు ఇచ్చాడు. ఫాల్ సింక్లెర్ నుండి 223,000 డాలర్ల విలువ చేసే లిబర్టీ బాండ్లను మరియు డోహ్ని నుండి 100,000 డాలర్లను అప్పుగా తీసుకున్నాడని రుజువైనది. నేవీ సెక్రటరీ అయిన Debny ని ఉద్యోగం నుండి తొలగించారు. ఫాల్‌కు 1,000,000 డాలర్ల అపరాధ రుసుము వేసారు. సెలక్లెరుకు జైలు శిక్ష విధించారు. ఇట్లా బయటపడిన లంచగొండి చర్యలలో కొన్నింటి గురించి హార్డింజ్‌కు అవి వెలుగులోకి రాక పూర్వమే తెలుసునట. ఇవి తెలుసుకొని అధ్యక్షుడు చాలా విచారంగాను, ఆ విచారములోనే మనో వ్యధ చెందాడని తెలియుచున్నది. 1923 వేసవి కాలంలో అలస్కా సందర్శ నుండి తిరిగి వస్తూ జబ్బుపడ్డాడని, వైద్యులు అతనికి టొమెనియా పాయిజనింగ్ అయినట్లు చెప్పారు. హార్డింజ్ తన మిత్రులు చేసిన లంచగొండి పనుల వలన తనను అభిశంసిస్తారేమోనని కూడా అనుకున్నాడు. కానీ అది జరగక ముందే 1923 ఆగస్టులో హార్డింజ్ మరణించాడు.

హార్డింజ్ తన అధ్యక్షుడు తన పరిపాలనలో వ్యాపార రంగంలో వీలైనంత తక్కువ జోక్యం చేసుకొంటానని ప్రకటించాడు.

1921 వరకు నౌకా విభాగం ఆధీనంలో ఉన్న ఖనిజ తైలం నిలవలను ఇంటీరియర్ కార్యదర్శి ఆబర్ట్ ఫాల్ తనకిందకు మార్చుకొని ఆ మరుసటి సంవత్సరము కౌలుకు ఇచ్చినాడు. ఈ కార్యదర్శికి అధ్యక్షుడే తన అధికార శాసనం ద్వారా బదలాయించాడు.

## 18.4. కాల్విన్ కూలిడ్జ్ (1923-29) :

కాల్విన్ కూలిడ్జ్ 1923-29లో వెర్మాంట్‌లోని ప్లిమత్‌లో 4 జూలై 1872లో ఒక పూరిటన్ కుటుంబములో పుట్టాడు. తన తండ్రి ఒక గ్రామీణ స్టోరు నిర్వాహకుడు. ఆమ్‌హరెస్టు కళాశాల నుండి పట్టభద్రుడయ్యాడు. మసాచుసెట్స్ న్యాయవాదిగా జీవితాన్ని ఆరంభించి నార్త్ హామ్‌టన్‌లో రాజకీయాలలో ప్రవేశించాడు. మొదట ఒక చిన్న కౌన్సిల్ సభ్యునిగా ప్రారంభమైన అతని జీవితం, అంచెలంచలుగా మసాచుసెట్స్ రాష్ట్ర గవర్నర్‌గా ఎదిగాడు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అతను ఒక సాంప్రదాయ వాదిగా తయారయ్యాడు. ఆ రాష్ట్ర గవర్నరుగా ఉన్న సమయంలో బోస్టన్ నగర పోలీసులు ఒక పెద్ద సమ్మె చేసారు. దాని విషయం పరిశీలించమని కూలిడ్జ్‌ని ప్రభుత్వం కోరింది. ఈ సమ్మెను

చాలా చాకచక్యంగా అణచివేసాడు. తన రాష్ట్ర గార్డుల ద్వారా సమ్మె దారులను అణచివేయటం జరిగింది. చాలా మంది పోలీసు సంఘ నాయకులను వారి ఉద్యోగాల నుండి తొలగించారు. ప్రభుత్వానికి కూలిడ్జ్ సమ్మె విషయమై సమ్మె జరిగినంత కాలం ఏమీ మాట్లాడకుండా సమ్మె అయిన తరువాత "ప్రజా రక్షణకు వ్యతిరేకంగా ఎవ్వరికీ, ఎక్కడా, ఎప్పుడూ కూడా సమ్మె చేసే హక్కు లేదు'' అని ఒక టెలిగ్రాం ద్వారా తెలియపరచాడు. ఈ టెలిగ్రాము కాలిడ్జ్‌కి చాలా గొప్ప పేరు తెచ్చిపెట్టింది. అకస్మాత్తుగా అతను ఒక జాతీయ నాయకుడుగా గుర్తింపు పొందాడు. దానితోనే కూలిడ్జ్ అమెరికా ఉపాధ్యక్ష పదవికి నియంత్రించబడ్డాడు.

1923వ సంవ్సరములో కూలిడ్జ్ సెలవులో ఉండి తన సొంత గ్రామంలో తండ్రి నివాస గృహము ప్లియత్‌లో 2 ఆగష్టు నాటి రాత్రి నిదురపోతూ ఉండగా అర్ధరాత్రి 2.30 నిముషాలకు అతనికి హార్టింజ్ మరణ వార్త తెలిపారు. మరుక్షణమే అతను దీపం బుడ్డి వెలుతురులో అధ్యక్ష పదవీ స్వీకారం చేసాడు.

హార్డింజ్ అధ్యక్ష కాలంలో అధ్యక్ష పదవి హోదా కొంతమేర తగ్గిపోయినది. హార్డింజ్ సహచరులు లంచగొండితనము అధ్యక్ష హోదాను చాలా దిగజార్చింది. కూలిడ్జ్ అమెరికా అధ్యక్ష పదవిని అలంకరించటంతో తన వ్యక్తిత్వం ద్వారా, సత్‌ప్రవర్తన ద్వారా అధ్యక్ష పదవికి మరల గౌరవము తీసుకొని రాగలిగాడు.

కూలిడ్జ్ అధ్యక్షుడయ్యే నాటికి అమెరికా ఆర్థికంగా పుంజుకుంటూ ఉన్నది. యుద్ధానంతర ఆర్థిక మాంద్యం సమసిపోతున్నది. 1924వ సంవత్సరంలో కూలిడ్జ్ మరల అధ్యక్షునిగా పోటీ చేసి అఖండ విజయం సాధించాడు.

కూలిడ్జ్ అధ్యక్షునిగా "అమెరికా ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం వ్యాపారాన్ని అభివృద్ధి పరచటమేనని తెలిపాడు.'' వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధి కొరకు చాలా దోహదపడ్డాడు. వ్యాపార సంస్థలపైన, పారిశ్రామికులపైన అప్పటికి అమలులో ఉన్న ఎన్నో ఆంక్షలను సడలించి దేశ పారిశ్రామిక అభివృద్ధికి పాటుపడ్డాడు. ఇతడు అధ్యక్షుడుగా ఉన్న కాలంలో (1923-29)లో పారిశ్రామికులకు అధిక లాభాలు, కార్మికులకు హెచ్చుజీతాలు లభించి అందరూ సుఖ శాంతులు అనుభవించారు. కానీ కూలిడ్జ్ పరిపాలనాంతర కాలంలో ఆర్థిక మాంద్యం ఏర్పడింది.

## 18.5. హెర్బర్ట్ హూవర్ (1929 - 1933) :

ఐయోవా రాష్ట్రంలో 1874వ సంవత్సరములో జన్మించాడు. ఒరెగాన్‌లో పెరిగాడు. స్టాన్‌పోర్టు విశ్వవిద్యాలయం నుండి గనుల ఇంజనీరుగా 1891లో పట్టభద్రుడయ్యాడు. వివాహమానంతరము చైనా దేశానికి పోయి అక్కడ ఇంజనీరుగా కొంత కాలం పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నాడు. 1900 సంవత్సరపు చైనాలో బుక్సర్ తిరుగుబాటు కాలంలో అక్కడే ఉండి, హూవర్ భవణ నిర్మాణపు పనిని నిర్వహించాడు. వారి సతీమణి లూహెన్రీ వైద్యశాలలో పనిచేసారు. ఒక సందర్భంలో హువర్ తన ప్రాణాన్నే పణంగా పెట్టి చైనాలోని పిల్లలను ఒక ఆపద నుండి కాపాడాడు.

హువర్ లండన్‌లో ఉన్న సమయములో, జర్మనీ ఫ్రాన్స్‌పై యుద్ధం ప్రకటించింది. అమెరికా పర్యాటకులు యుద్ధంలో మార్గ మధ్యలో ఇరుక్కుపోయారు. ఆ సమయములో, వారిని రక్షణ కోసం హువర్ సహాయాన్ని కోరగా హువర్ ఆరు వారాలలో మొత్తం 1,20,000 మంది అమెరికా పర్యాటకులను అమెరికాకు సురక్షితంగా చేరుకొనేటట్లు చేయగలిగాడు. జర్మనీ బెల్జియంను ఆక్రమించుకున్న సమయంలో ఆ దేశ ప్రజలకు కావలసిన ఆహారాన్ని సమకూర్చే పనిని కూడా చాలా నేర్పుగా చేపట్టాడు.

అమెరికా మొదటి ప్రపంచయుద్ధంలో చేరిన సమయంలో, విల్సన్, హువర్‌ను ఆహార శాఖాధ్యక్షునిగా నియమించాడు. ఆ సమయంలో అమెరికా ప్రజలకు ఎటువంటి ఆహార కొరత కలిగించకుండా మిత్ర పక్షాల వారికి, సముద్రాలపై ఉన్న సైనికులకు కూడా కావలసిన ఆహారాన్ని అందచేయగలిగాడు. యుద్ధానంతరం మధ్య ఐరోపా దేశాలల్లో కోట్ల మందికి కావలసిన ఆహారాన్ని అందచేసే బాధ్యతను అమెరికా ప్రభుత్వం చేపట్టినప్పుడు కూడా చాలా చాకచక్యముగా కర్తవ్యాన్ని నిర్వహించాడు. 1920వ సంత్సరములో రష్యావారు కరువుతో సతమవుతున్నప్పుడు కూడా హువరు సహాయపడగలిగాడు. బోల్షవిక్ విప్లవానికి సహకరిస్తున్నావా అని తన మీద విమర్శలు వచ్చినప్పుడు

రాజకీయాలు ఎట్లా ఉన్నప్పటికీ 20 కోట్ల ప్రజలు కరువ కోరల్లో చిక్కుకుని బాధలోఉన్నప్పుడు వారికి ఆహారం అందుబాటు చెయ్యటం మన ధర్మం అని చాటగలిగిన గొప్ప మానవతావాది హువర్.

ఆ తరువాత హార్డింగ్, కూలిడ్జ్‌లు అధ్యక్షులుగా ఉన్నప్పుడు వారిద్దరికీ వాణిజ్య శాఖ కార్యదర్శి పదవిని అలంకరించి తన పాలనాదక్షతను నిరూపించుకున్నాడు. ఆ తరువాత 1929 నుండి 1933 అమెరికా అధ్యక్షునిగా సేవలందించాడు. ఈ కాలంలోనే ప్రపంచ మొత్తంలో ఆర్థిక మాంద్యము ఏర్పడి, అమెరికా కూడా ఆర్థిక మాంద్యాన్ని చవిచూడవలసి వచ్చినది. హువరుకు ఈ ఆర్థిక మాంద్యం పెద్ద సవాలయింది.

హువర్ ఈ పరిస్థితి నుండి అమెరికా ప్రజలను కాపాడటం కోసం ఎన్నో చర్యలు చేపట్టాడు. పెద్ద పారిశ్రామికులను పిలిపించి పనివారిని తొలగించకుండా, వేతనాలు తగ్గించకుండా ఉండేటట్లు చేసాడు. 1932లో రీకన్‌స్ట్రక్షన్ కార్పోరేషన్ అనే సంస్థను స్థాపించి రైల్వేలకు, బ్యాంకులకు, పరిశ్రమలకు, రైతులకు విరివిగా అప్పులు ఇచ్చే ఏర్పాటు చేసాడు. దాతల ద్వారా నిరుద్యోగలను ఆదుకొనేటట్లు చేయగలిగాడు. అమెరికా విదేశాలతో వ్యాపారం పెంపొందించే ఉద్దేశంతో అమెరికాకు ఇవ్వవలసిన దేశాలవారు ఒక సంవత్సరం వరకు వాటిని వాయిదా వేయవచ్చునని ప్రకటించాడు. ఇన్ని ప్రయత్నాలు చేసిన అమెరికా ఆర్థిక మాంద్యంలో మార్పేమీ జరగలేదు. 1932 ఎన్నికలలో ఈ ఆర్థిక మాంద్యంలో చిక్కుకొని ఎన్నికలలో ఓటమిపాలైనాడు.

హారిట్రూమన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు హువర్‌ను 1947 లో ఒక కమిషన్‌కు అధ్యక్షునిగా నియమించాడు. అదే విధంగా ఐసన్ హువర్ కాలంలో 1953లో మరొక కమిషనుకు కూడా అధ్యక్షునిగా విశేష సేవలను అందించారు. ఈ విధంగా హెర్బర్ట్ హువర్ 1900 సంవత్సరములో తను 26 సంవత్సరాల వయస్సు నుండి 1964వ సంవత్సరములో తన జీవితాంతం వరకు దగ్గర దగ్గర 64 సంవత్సరాల పాటు అమెరికా దేశానికే కాకుండా చైనాలో, రష్యాలో మధ్య ఐరోపా దేశాలలోని కోట్ల మంది ప్రజానికానికి విశేష సేవలందించిన గొప్ప మానవతావాదిగా పేరు తెచ్చుకున్నాడు.

## 18.6. వాషింగ్టన్ సమావేశం :

వాషింగ్టన్ సమావేశం ద్వారా రిపబ్లికన్ పార్టీ వారు అమెరికాను ప్రపంచ శాంతి నెలకొల్పటానికి అనుకూలమైన మార్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలియపరిచారు.

ఈ వాషింగ్టన్ సమావేశం 12 నవంబరు 1921 తేదిన మొదలైనది. ఈ సమావేశానికి రష్యాను ఆహ్వానించలేదు. ఈ సమావేశానికి అమెరికా ప్రతినిధి వర్గ నాయకుడైన చార్లెస్ ఇవాన్స్ హ్యూగన్ అధ్యక్షత వహించాడు.

ఇవాన్స్ తన ప్రారంభోపన్యాసంలో అమెరికా, బ్రిటన్, మరియు జపాన్ దేశీయుల నౌకా దళాల విస్తృతిని వెంటనే అరికట్టాలని మరియు అప్పటికే సిద్ధంగా ఉన్న నౌకాదళాలను కూడా కొంత వరకు రూపుమాపవలెనని ప్రతిపాదించాడు. ఒక పది సంవత్సరాల కాలం పాటు అన్ని రకాల యుద్ధ, రవాణా నౌకల నిర్మాణముపై ఆంక్షలను విధించాలని ప్రతిపాదించాడు. ఈ విధంగా మొత్తం ఈ మూడు దేశాలవారిచే అప్పటికే నిర్మాణములో ఉన్న, నిర్మించబడుచున్న 1,900,000 టన్నుల సామర్థ్యం గల నౌకలను నిర్వర్యం చేయాలని కూడా ప్రతిపాదించాడు.

ఈ విధంగా ఇవాన్స్ ప్రతిపాదనను ఎన్నో ఒక ఆంగ్లేయ ప్రతినిధి ఇవాన్స్ తన 35 నిమిషాల ఉపన్యాసంలో ఒక శతాబ్ది కాలంలో ప్రపంచ దేశాల నౌకా దళాధిపతులందరూ కలసి ముంచి వేసినన్ని నౌకలను ముంచి వేసాడు అని వ్యాఖ్యానించాడు. అంటే ఇవాన్స్ ఎంతటి భీకర ప్రతిపాదన చేసాడో చెప్పవచ్చును. ఈ ప్రతిపాదనకు అనుకూలంగా జపాన్ దేశస్థుల వారి నౌకా సామర్థ్యాన్ని కేవలం 300,000 టన్నులుగాను, ఆంగ్లేయులు, అమెరికా వారు చెరి ఒక 500,000 టన్నుల సామర్థ్యంగా నియంత్రించుకోగలమని ప్రతిజ్ఞను చేసారు.

అమెరికా వారు గువామ్ మరియూ ఫిలిపియిన్స్‌లలో వారి సైనిక శిబిరాలను పెంచమని కూడా హామీ ఇచ్చారు. జపాన్ మరియు బ్రిటన్ వారు కూడా అదే విధమైన హామీలు ఇవ్వటము జరిగింది.

అమెరికావారు తమకు అప్పటికే సిద్ధంగా ఉన్న నౌకా దళాంలోని 8,45,000 టన్నుల సామర్ధ్యం మేరకు నౌకలను వినాశనం చేయటానికి సిద్ధంగా ఉన్నదని ప్రకటించారు. ఇవాన్స్ బ్రిటన్ వారు కూడా 5,83,000 టన్నుల సామర్ధ్యం మేరకు నౌకలను ధ్వంసం చేయాలని కూడా కోరాడు.

ఈ ప్రతిపాదనలను ఆయా దేశాలు వెంటనే ఆమోదించాయి. అంతేకాక ఫిబ్రవరి 5, 1922వ తేదీన ఐదు దేశాలు అనగా అమెరికా, బ్రిటన్, జపాన్, ఫ్రాన్స్, మరియూ ఇటలీలు వారి వారి నౌకా సామర్ధ్యాన్ని 5 : 5 : 3 : 1.75 : 1.75 నిష్పత్తికి తగ్గించటానికి ఒక ఒప్పందానికి కూడా వచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం 1930 వరకు పైన పేర్కొన్న ఐదు దేశాలలో ఏ ఒక్క దేశం కూడా ఒక్క యుద్ధ నౌకను కూడా నిర్మించుకొనే అధికారం లేనట్లేనని భావించాలి. పైన పేర్కొన్న వాషింగ్టన్ సమావేశం మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఆయుధ నిర్మాణ నియంత్రణ కోసం ఏర్పాటు చేయబడిన సమావేశాలల్లో ఒక్కటి మాత్రమే.

ఈ సమావేశం ఫలితంగా మరో తొమ్మిది సంధులను వివిధ దేశాల వారి మధ్య ఏర్పాటు అయినవి. అవి ఈ క్రింది పేర్కొనబడినవి.

1. మొదటి సంధి వలన అమెరికా, బ్రిటన్, ఇటలీ ఫ్రాన్స్ దేశములు మరొక 5 సంవత్సరాలపాటు పెద్ద నౌకలను నిర్మించకుండా ఉంచటానికి నిశ్చయించినారు.
2. మరొక సంధి ద్వారా ఈ అయిదు దేశాల వారు యుద్ధంలో జలాంతర్గాములను నిర్ణీత పద్ధతులకు లోనై ఉపయోగించటానికి, విష వాయువుల ఉపయోగాన్ని మానివేయటానికి నిశ్చయించినాయి.
3. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్‌వారు మరో ఒప్పందం ద్వారా పసిఫిక్ సముద్రంలో తమకు గల స్థావరాల హక్కులను పరస్పరం ఆరాధించుకోవటానికి సిద్ధపడినాయి.
4. పసిఫిక్ ప్రాంతము ఏదైనా తీవ్ర యుద్ధ చర్య తీసుకోదలిస్తే మిగలిన దేశాలను సంప్రదించే ఏర్పాటుకు ఈ దేశాలవారు అంగీకరించారు.
5. వాషింగ్టన్ సమావేశానికి హాజరైన తొమ్మిది దేశాలవారు చైనా స్వాతంత్ర్యాన్ని అంగీకరించారు. చైనాలో 'ఓపెన్ డోర్' విధానాన్ని కూడా పునరుద్ఘాటించారు.
6. చైనాకు తన ఎగుమతి దిగుమతుల సుంకాలపై ఎక్కువ ఆధిపత్యాన్నివ్వటానికి అంగీకరించారు.
7. చైనా, జపానీయుల మధ్య జరిగిన సంధి ద్వారా చైనాకు కెయాచో, షాంటుంగ్ ద్వీపకల్పాల ఆధిపత్యాన్ని ఇస్తూ ఉభయులు రాజీపడ్డారు.
8. జపాన్, అమెరికా మరొక సంధి ద్వారా యాప్ ద్వీపంలో అమెరికాకున్న హక్కులను అంగీకరించారు.
9. మరొక సంధి ద్వారా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, చైనాలు ఇంతకు ముందు జర్మనీ ఆధీనంలో ఉన్న కేబుల్ మార్గాలను తమలో తాము పంచుకున్నాయి.

పైన పేర్కొన్న తొమ్మిది ఒడంబడికలను అమెరికన్ సెనెట్ ఆమోదించింది.

ఈ విధంగా అమెరికా నానాజాతి సమితిలో సభ్యత్వాన్ని స్వీకరించకపోయినా సమితి ముఖ్యాంశమైన శాంతి రక్షణకు అనేక విధాల అమెరికా కృషి చేయసాగింది. ఈ ప్రయత్నాలకు భాగమే మరియొక ముఖ్య ఒడంబడిక కెల్లాగ్ - బ్రయాండ్ ఒడంబడిక.

## 18.7. కెల్లాగ్ - బ్రయాండ్ ఒడంబడిక :

ప్రపంచంలో శాంతిని నెలకొల్పటానికై నానాజాతి సమితి 'జినీవా ప్రోటోకాల్' అనే పథకాన్ని ప్రతిపాదించింది. ఈ పథకం ద్వారా ఒక దేశం మరో దేశం మీద జరిపే దురాక్రమణను అంతర్జాతీయ నేరంగా పరిగణంచటం జరిగింది. కానీ బ్రిటన్ ఈ పథకాన్ని తిరస్కరించటంతో విఫలమైనది.

అలాంటి ఒడంబడిక మరొకటి 1925లో లొకార్నో ఒప్పందాలు. ఈ ఒప్పందం ద్వారా జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు ఒకరొకరు పరస్పర శాంతియుతంగా మెలగని ఉద్దేశించబడింది. లోకర్నో ఒప్పందము వలన జర్మనీకి పశ్చిమాన ఉన్న ఫ్రాన్స్, బెల్జియమ్ సరిహద్దులను నిర్ణయిస్తూ వాటిని జర్మనీ ఉల్లంఘించకుండేటట్లు చేయబడింది. కానీ ఫ్రాన్స్‌కు జర్మనీ పశ్చిమ సరిహద్దుల విషయమై తారతమ్యం కలిగింది. ఫ్రాన్స్‌కు యుద్ధ భీతి ఎక్కువైంది. దీనితో ఫ్రాన్స్ 1928వ సంవత్సరములో మరొక ఒంబడికను ఏర్పరచుకొన్నది. ఈ ఒడంబడికను పారిస్ ఒడంబడిక అని మరియు కెల్లాగ్ - బ్రయాండ్ ఒడంబడిక అని కూడా అంటారు. ఈ ఒడంబడికలో ముఖ్య పాత్ర వహించిన అమెరికా అంతరంగిక కార్యదర్శి అయిన కెల్లాగ్ మరియు ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి అయిన బ్రయాండ్‌ల పేరు మీద ఏర్పాటయింది.

ఈ ఒప్పందం ద్వారా ప్రపంచం మొత్తంలో యుద్ధాన్ని నిషేధించెలా ఉద్దేశ్యం. ప్రపంచంలో మొత్తం 59 తొమ్మిది దేశాల వారు ఒక ప్రతిజ్ఞ చెయ్యటం జరిగింది. దీని ప్రకారం ఆయా దేశాలవారు యుద్ధ నిషేధాన్ని వారి స్వదేశాల జాతీయ విధానంగా పరిగణించడం జరిగింది.

యుద్ధ నిషేధ సిద్ధాంతాన్ని అమోదించారు కానీ, ఈ ఒడంబడికలో, ఈ యుద్ధ నిషేధాన్ని అమలులో పెట్టనటువంటి దేశాలపై ఎటువంటి చర్య తీసుకోవలెనో తెలియపరచలేదు. అందువలన ఈ సిద్ధాంతాన్ని ఒక మంచి విలువలతో గూటినది ఉన్నది. కానీ అది సాధించటానికి కావలసిన బలము మార్గము ఆ ఒడంబడికలో సూచించినందున అంతర్జాతీయ రాజకీయ, దురాక్రమణ రాజకీయాలకు తెర దించలేకపోయినది.

ఈ విధంగా ప్రపంచంలో యుద్ధాన్ని నిషేదించిన పిమ్మట, కెలాగ్, బ్రయాండ్ ఒడంబడికలో ఉన్న ఏ గొప్ప శక్తివంతమైన దేశం కూడా వారి వారి సైనిక బలగాలను వినాశనపరచలేదు. దానికి కారణం ఆ ఒడంబడిక పై వారికి నమ్మకం లేకపోవటమో వాషింగ్టన్ సమావేశానంతరం కూడా ప్రపంచదేశాల మధ్య నౌకా నిర్మాణం ఎదో కొంతమేర జరుగుతూ వారు చిన్న చిన్న నౌకలను నిర్మించుతూనే ఉన్నారు. 1930వ సంవత్సరములు లండన్ నగరంలో ఏర్పాటైన ఒక సమావేశం ద్వారా అమెరికా, బ్రిటన్, జపాన్ దేశాల వారు ఎంత మేర నౌకా నిర్మాణాలను చేసుకోవాలో ఒక అంగీకారానికి వచ్చారు. ఈ అంగీకారం ద్వారా మరికొన్ని నౌకలను నిర్మించుకొనే ఆమోదం లభించింది. ఆయా దేశాల కాల్బిలను గానీ వైమానిక దళాలను ఏ మేరకు వృద్ధి చేసుకోవాలనే విషయమై ఎటువంటి నియంత్రణలు ఏర్పాటు కాలేదు.

ఆ తరువాత 1932వ సంవత్సరంలో హిట్లర్ జర్మనీ దేశ నియంత అవ్వటం జరిగింది. దానితో నిరాయుధీకరణ దిశలో అన్ని నమ్మకాలు, ఆశలకు కాలం చెల్లింది. అంతే కాకుండా ప్రపంచము ఇక శాంతి నెలకొల్పాలంటే నిరాయుధీకరణ ద్వారా కాకుండా, అమితమైన ఆయుధీకరణ ద్వారానే వీలవుతుందనే అభిప్రాయానికి రావటం జరిగిందని చెప్పవచ్చును.

## 18.8. సారాంశము :

1920 నుండి 1933 మధ్య కాలంలో అమెరికాలో పారిశ్రామిక, వ్యాపార రంగాలపై విధించబడని ఆంక్షలను రద్దు చేయబడినవి.

హార్డింజ్, కూలిడ్జ్, హువర్‌లు అధ్యక్షులుగా అమెరికాలో పారిశ్రామిక, వ్యాపార రంగాలను మొదటి ప్రపంచ యుద్ధం పూర్వపు వైభవాన్ని మరలా తీసుకొని రావటానికి తగిన చర్యలు తీసుకొన్నారు. పారిశ్రామికవేత్తలకు గుత్త వ్యాపార సంస్థలవారికి అవసరమైనంత ప్రోత్సాహాన్ని స్వేచ్ఛను అందించారు. ఈ ప్రయత్నంలో భాగంగానే షర్మాన్, క్లైటాన్ చట్టాలను రద్దు పరిచారు. ఈ విధమైన చర్యల వల్ల అమెరికాలో 1920 నుండి 1929 సంవత్సరాలలో మామూలు స్థితిని కల్పించారు. పారిశ్రామికవేత్తలు, కార్మికులు అందరికి అనుకూలమైన పరిస్థితి కల్పించారు. యుద్ధం వలన ఏర్పడిన ఆర్థిక మాంద్యంనుండి వ్యవసాయరంగాన్ని కూడా ఫెడరల్ ఫామ్ ఆక్టును ఏర్పాటు చేసారు. వ్యవసాయదారులకు కావలసిన ఋణాలను అందుబాట్లోకి తేగలిగారు.

అమెరికాలో ఈ కాలంలో ప్రజలు ఎటువంటి త్యాగాలను చేయనవసరం లేకుండా గొప్ప విలాసవంతమైన జీవితాన్ని గడపగలిగారు. బాగా ఖర్చు చేసి మంచి జీవితాన్ని గడపటమే కాకుండా, వారి ఆదాయాలను ప్రతి ఒక్కరూ కొంత పొదుపు చేయగలిగారు కూడా.

కానీ ఈ నూతన పరిస్థితులు ఎంతో కాలం నిలువలేదు. 1929లో ఏర్పడ్డ ప్రపంచ ఆర్థిక మాంద్యం ప్రభావం అమెరికా కూడా చవి చూసింది.

## 18.9. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)

1. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో అమెరికాలో పారిశ్రామిక, వ్యాపార సంస్థలు కుంటుపడటానికి కారణం తెలుపుచూ, వాటిని మామూలు స్థితికి తీసుకొని రావటానికి చేపట్టిన చర్యలు గూర్చి వ్రాయుము.
2. అమెరికా నానాజాతి సమితిలో ఎందుకు చేరలేకపోయిందో తెలుపుచూ, వాషింగ్టన్ సమావేశం ద్వారా, కెల్లాగ్ - బ్రయాండ్ ఒడంబడికల ద్వారా అమెరికా పరోక్షంగా సమితి ఉద్దేశ్యాలను సాధించే ప్రయత్నం చేయగలిగిందనే అభిప్రాయాన్ని విశ్లేషించండి.
3. హార్డింజ్, కాల్విన్ కూలిడ్జ్, హెర్బర్ట్ హువర్లు అమెరికా అధ్యక్షులుగా ఎలా ఎదగగలిగారో తెలుపుచూ వారి పరిపాలనలలోని ముఖ్యమైన చర్యలను గూర్చి తెలియపరుచుము.
4. మామూలు స్థితికాలంలో వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలను తెలియచేస్తూ, ఆ సమస్యను పరిష్కరించటానికి ఏ ఏ అధ్యక్షుడు ఏ ఏ చర్యలు చేపట్టారో వివరించండి.

## 18.10. చదువదగిన గ్రంథాలు :


1. Allan Novins & Henry Steel Commager - The Pocket History of the United States, Pocket Books, INC, New York 1943, 1951 (8th reprint)
2. Henry Bamford Parkes - The United States of America - A History : Khosla Publishing House - Mehra Offset Press, New Delhi 1986
3. Ralph W. Steen - The United States, A History, Prentice - Hall - INC; N.J. 1959.
4. Rebekah. R. Gertude. A. Young - The Growth of America, Printice - Hall, INC ; N.J. 1966
5. Richard Hofstadter & William Miller & Daniel Aaron - The United States : The History of a Republic, Prentice - Hall ; INC N.J. 1957-1964 (14th edition)
6. Richard M. Current T. Harry Williams & Frank freidel - American History - A Survey ; New York (1965)
7. V. Kameswara Rao & B. Lakshmi Narayana - America Samyukta Rastrala Charitra, Telugu Acadamy (1986)


- డా॥ యం. శ్రీనివాసరెడ్డి

పాఠం - 19

# ఆర్థిక మాంధ్యం - ఫ్రాంక్లిన్ డిలానో రూజ్‌వెల్ట్ (1933-45) - రెండవ ప్రపంచయుద్ధం అమెరికా

## 19.0. లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాల 32వ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డిలానో రూజ్‌వెల్ట్ (1933-45) కాలంలోని ఆంతరంగిక విధానంలో ప్రతిపాదించిన నూతన విధానమును విదేశాంగ విధానంలో రెండవ ప్రపంచయుద్ధ కాలంలో అనుసరించిన విధానాలను గురించి వివరించుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


**19.1.** ఫ్రాంక్లిన్ డిలానో రూజ్‌వెల్ట్ జీవితము

**19.2.** నవ విధాన చట్టాలు

**19.3.** కార్మిక చట్టాలు

**19.4.** వ్యవసాయ చట్టాలు

**19.5.** ద్రవ్య చట్టాలు

- **19.5.1.** ఋణాలు
- **19.5.2.** బ్యాంకింగ్ - చట్టాలు

**19.6.** రైల్వే - నౌకా - గృహ నిర్మాణాలు

**19.7.** ప్రజా సౌకర్యాలు - ఫలితాలు

- **19.7.1.** విదేశీ విధానము
- **19.7.2.** అంతర్జాతీయ ఆర్థిక సమావేశము
- **19.7.3.** సోవియట్ రష్యాను గుర్తింపు
- **19.7.4.** వ్యాపార ఒప్పంధాల చట్టము (1934-39)
- **19.7.5.** లాటిన్ అమెరికాతో స్నేహము
- **19.7.6.** ఫిలిపిన్స్ దీవులతో సంబంధాలు
- **19.7.7.** తటస్థ విధానము - యుద్ధము

**19.8.** రెండవ ప్రపంచ యుద్ధము అమెరికా సంయుక్త రాష్ట్రాలు వహించిన పాత్ర

- **19.8.1.** అమెరికా ఏకాంత విధానము

19.8.2. అరువు - కౌలు చట్టము (మార్చి, 1941)

19.8.3. అట్లాంటిక్ ప్రకటన పత్రము

19.8.4. ప్రత్యక్షంగా అమెరికా యుద్ధ రంగ ప్రవేశము

19.8.5. పెరల్ హార్బర్‌పై దాడి

19.8.6. ఆఫ్రికా రంగము

19.8.7. ప్యారిస్ విముక్తి (1944, ఆగష్టు 22)

19.8.8. జర్మనీ పతనము (1945 ఏప్రిల్)

19.8.9. జపాన్‌పై అమెరికా విజయాలు

19.9. శాంతి స్థాపనకు ప్రయత్నాలు

19.9.1. యాల్టా సమావేశము (1945, ఫిబ్రవరి)

19.9.2. పోట్స్‌డామ్ సమావేశము (1945, జూలై)

19.9.3. ఐక్యరాజ్య సమితి స్థాపన (1945, అక్టోబర్)

19.10. నమూనా ప్రశ్నలు

19.11. చదువదగిన గ్రంథాలు

## 19.1. ఫ్రాంక్లిన్ డిలానో రూజ్‌వెల్టు జీవితం :

ఫ్రాంక్లిన్ డిలానో రూజ్వెల్ట్ 1882వ సంవత్సరములో హట్సన్ లోయలో రూజ్వెల్ట్ జన్మించినాడు. గ్రోటన్ హార్వర్డ్ కొలంబియాలలో విద్యాభ్యాసం పూర్తిచేసి న్యాయవాది అయినాడు. న్యూయార్క్ సెనెటర్‌గాను. నౌకా సహాయ కార్యదర్శిగాను పనిచేసినాడు. 1920వ సంవత్సరములో డెమోక్రటిక్ పార్టీ తరుపున ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసి ఓడిపోయినాడు. తరువాత పక్షవాత వ్యాధికి గురి అయి కాళ్ళు పడిపోయినప్పటికి మనోధైర్యంతో శారీరక రుగ్మతలను ఎదుర్కొని నాలుగుమార్లు సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడుగా ఎన్నికైన ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ ఆ దేశ చరిత్రలోనే అపురూప శకాన్ని సృష్టించినాడు. 1933 నుండి 1945 వరకు అమెరికా అధ్యక్షుడుగా వెలిగినాడు. ప్రజాస్వామ్యం, అభ్యుదయ మానవశ్రేయోభావాలు అతని సొత్తు, ఇతనిలో అసాధారణ నాయకత్వ లక్షణాలు ఉండటం వలన అమెరికన్లను అభివృద్ధి పథంలో నడిపించటయే కాకుండా ప్రపంచ నాయకులలో అగ్రగణ్యుడుగా పేరు పొందాడు.

## 19.2. ఫ్రాంక్లిన్ నవ విధాన చట్టాలు :

F.D. రూజ్వెల్ట్ అమెరికా అధ్యక్షుడు అయిన నాటికి ఆర్థిక మాంద్య పరిస్థితుల వలన అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 5వేల బ్యాంకులు, దివాళా ఎత్తినాయి. వ్యవసాయ రంగంలో సంక్షోభం, పారిశ్రామిక రంగంలో ఆర్థిక దుస్థితి, 12 మిలియన్ల నిరుద్యోగ సమస్య మరియు దేశ సంపద కొద్ది మంది వ్యక్తుల చేతులతో కేంద్రీకరించబడినది. ఈ దుస్థితి నుండి తన ప్రజలను ఒడ్డుకు చేర్చాలని దృఢ నిశ్చయం చేసుకొన్నాడు. ఇందుకుగాను వాస్తవమైన చట్టాలను నిర్మించి ధైర్యంగా వాటిని అమలు పరిచాడు. సంపన్నుల దోపిడీని ఎదుర్కొన్నాడు. రూజ్వెల్ట్ ప్రవేశపెట్టిన వినూత్న పథకాలను రూజ్వెల్ట్ నవ విధానమును (Roosevelts New Deal) అని పిలిచారు. రూజ్వెల్ట్ మాటలలో చెప్పాలన్న “మనం ఆశించునది ఆర్థిక విధానంలో సమత (కార్మికులకు పెట్టుబడిదారులకు మధ్య సమత”) అన్నది.

తన విధానాన్ని చిత్తశుద్ధితో అమలు జరిపేందుకు తన డెమోక్రటిక్ పార్టీ వారితో పాటు, రిపబ్లికన్ పార్టీకి చెందిన వారిని కూడా కార్యదర్శులుగా నియమించినాడు. విశ్వవిద్యాలయ ఆచార్యులను సలహాదారులుగా నియామణ చేసినాడు. వీరిలో ముఖ్యమైన కార్యదర్శుల పేర్లు :

1) కొర్డెల్ హాల్ - విదేశీ కార్యదర్శి

2) హరాల్డ్ హిక్స్ - ఆంతరంగిక కార్యదర్శి

3) హెన్రీ వాలస్ - వ్యవసాయ కార్యదర్శి

4) ఫ్రాన్సిస్ పెర్కిన్స్ - కార్మిక కార్యదర్శి

వీరు నవ విధానాన్ని విజయవంతం చేసినవారు. అందుకు వీరికి 'New Dealers" అని పిలిచినారు. కాంగ్రెస్ ఫ్రాంక్లిన్ నవ విధానానికి అవసరమైన అన్ని చట్టాలను అడిగిన వెంటనే అమోదించినది. ప్రజలు వాటికి హర్షంతో స్వాగతం పలికారు. F.D. రూజ్వెల్ట్ తన సుదీర్ఘమైన పదవీకాలంలో అమలు జరిపిన కార్మిక, వ్యవసాయక, ద్రవ్య, ప్రజా సౌకర్య, రైల్, నౌకా, గృహ, అటవీ, సాంఘికభద్రత, నిరుద్యోగ నివారణ మొదలగు నవ విధాన చట్టాలను అమలు జరిపినాడు.

## 19.3. కార్మిక చట్టాలు :

రూజ్వెల్ట్‌కు పూర్వం 'అమెరికన్ కార్మిక సమైక్య' (American Fedaration of labour) అను కార్మిక సంస్థ కలదు. ఇందు అనిపుణ కార్మికులకు (Un Skill Workers) ప్రాతినిధ్యం లేదు. కార్మికులనేక ఈతి బాధలకు గురి అగుచున్నారు. కార్మికుల దుస్థితిని తొలగించి పరిశ్రమలకు స్థిరత్వాన్ని కలిగించటానికి F.D. రూజ్వెల్ట్ ఈ క్రింది చట్టాలను అమలు చేసినాడు. (National Industrial recover act 1933) ఈ చట్టం ఆశయాలు, వ్యాపార సంస్థలను పునరుద్దరించటం ధరలను నిలకడగా ఉంచటం, పోటీని పరిమితం చేయటం, వ్యాపారానికి రక్షణ ఇవ్వటం.

క్యూబ్ జాన్సన్ ఆధిపత్యాన కార్మికుల హక్కుల రక్షణకు 'National recovery administration' అనే సంస్థ నెలకొల్పబడినది. ఇది కార్మికుల వేతనాలను పెంచటం పని గంటలు తగ్గించటం, కార్మికుల హక్కులను పరిరక్షించటం దీని యొక్క విధి.

1935లో వాగ్నల్ చట్టం తీసుకొని రాబడింది. దీని ప్రకారం కార్మికుల యూనియన్ల స్థాపనకు ఆమోదం లభ్యమయినది. 'National labour relation board' అనే యూనియన్ సంస్థ స్థాపించబడినది. 1938లో చేసిన 'Fair labour standards' చట్టం కనీస కార్మిక వేతనాలను, పని గంటలను నిర్దేశించినది. పరిశ్రమలలో బాల కార్మికులను నియమించటాన్ని నిషేదించినది. 1940 జాన్ లేవిస్ నాయకత్వమున జరిగిన ఉద్యమ ఫలితంగా 1940లో కాంగ్రెస్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్ 'Congress of Industrial Organisation' ఏర్పడి కార్మికుల స్థితిగతులు మెరుగుపరుచుటకు తీవ్ర కృషి చేసినది. దీని ఫలితంగా 'American Congress' Fair labour Standard Act ప్రవేశపెట్టబడినది. దీనిలో కార్మికుల వేతనాలు, పని గంటలు, 16 సంవత్సరాల వయస్సు వారిని కర్మాగారాలలో నియమింపబడకుండుట మొదలగునవి నిర్దేశింపబడినాయి. ఈ చట్టాల వలన రూజ్వెల్ట్‌ను కార్మికులు 'విస్మృత మానవుని పాలిట పెన్నిధి' 'Forgotten mans men' గా పేర్కొన్నారు.

## 19.4. వ్యవసాయ చట్టాలు :

కార్మికులతో పాటు కర్షకుల దుస్థితి తొలగించి వ్యవసాయాభివృద్ధికి ఈ క్రింది చట్టాలను క్రమముగా రూపొందించి అమలు చేసినాడు. వ్యవసాయక ఉత్పత్తిని తగ్గించటం విదేశీ మార్కెట్ సౌకర్యాలను పెంపొందించటం, ప్రధాన పంటలు పండించే భూమి విస్తారాన్ని తగ్గించటం మొదలగు అంశాలను పరిశీలించటానికి 1133లో 'అగ్రికల్చరల్ Adjustment act' చేయబడినది. ఈ కార్యక్రమాలను అమలు చేయడానికి

నగదు రూపంలో రైతులకు ధన సహాయం చేస్తుంది. దీని ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినను, నిరుద్యోగము, సోమరితనము కొన్ని బీడులను బీడులను పెట్టుట మొదలగు దుష్ఫలితాలు వెలువడినాయి. వీటిని అధిగమించడానికి 1636లో కాంగ్రెస్ Conservation and allotment domestic act చేయబడినది. ఈ చట్టం ద్వారా భూసార పరిరక్షణ క్రింద పొలములను బీడు పెట్టినవారికి నష్టపరిహారం చెల్లించును. ఈ చట్టాలు ఆశించిన ఫలితాలు సాధించి 1935 నాటికి వ్యవసాయ సంపద పెరిగింది.

## 19.5. ద్రవ్య చట్టాలు :

పతనమైన ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించుటకు రూజ్వెల్ట్ ఋణ కరెన్సీ, బ్యాంకింగ్ చట్టాలను ప్రవేశపెట్టినాడు.

**19.5.1. ఋణాలు :** ప్రభుత్వం ముందుకు వచ్చి ఋణాలిచ్చి ఆర్థిక మాంద్యము వలన అప్పుల పాలైన పెద్ద పరిశ్రమలను ఇండ్లను తనఖా పెట్టిన వారిని, వ్యవసాయదారులను రక్షించుటకు Pump Priming Measures గైకొనెను. Re-Construction Finance Corporation అనే సంస్థ ద్వారా పరిశ్రమలకు, బ్యాంకులకు అప్పులిచ్చి అవి దెబ్బ తినకుండా కాపాడెను. House Owners Loan Corporation సంస్థ ద్వారా తనఖా పెట్టిన గృహస్తులకు ఋణాలిచ్చి ఇండ్లను కోల్పోకుండా కాపాడెను. మరియు Form Credit administration సంస్థ ద్వారా వ్యవసాయదారులు కుదువపెట్టిన క్షేత్రములను విడిపించుకొనుటకు నూటికి నాలుగు డాలర్ల వడ్డీకి ఋణాలను మంజూరు చేసినారు.

**19.5.2. బ్యాంకింగ్ చట్టము :** బ్యాంకింగ్ వ్యవస్థను క్రమబద్ధం చేయుటకు బ్యాంకులలో ఉంచిన ప్రజల డిపాజిట్లకు భీమా ఏర్పాట్లులను కల్పించటానికి Fedaral Deposit Insurance Corporation స్థాపించబడినది. Security and exchange act of 1934 ద్వారా Stock Exchange Market ను స్పెక్యులేషన్‌ను అదుపులో పెట్టబడినాయి. Currency డాలర్ విలువను నియంత్రణ చేయటానికి F.D. రూజ్వెల్ట్ పాలనా చర్యలను గైకొని తిరిగిపోవుచున్న బంగారు నిల్వలను అరికట్టుటకు దేశంలో ప్రజల వద్ద ఉన్న బంగారమును ప్రభుత్వపరం చేస్తే దానికి విలువగా కాగితపు ధనాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. దీని ద్వారా బంగారు నిల్వలను కూడబెట్టి నాటి వరకు అమలులో ఉన్న సువర్ణ ప్రామాణమును తీసివేసి రజిత ప్రామానమును ప్రవేశపెట్టెను. డాలర్ విలువ 40% తగ్గించబడింది. ఈ రకంగా నిలకడ అయిన ద్రవ్య స్థితిని తీసుకొని రావటానికి ప్రభుత్వంపై చర్యలను తీసుకొనుట చేట బ్యాంకులపై ప్రజలకు విశ్వాసం కలిగింది. సెక్యూరిటీలకు భద్రత కలిగింది. ధరలు నిలకడగా ఉన్నాయి. ద్రవ్య చెలామణి పెరిగింది. కాకపోతే సాంప్రదాయవాదులు ఈ చర్యలు రాబోయే కాలంలో దేశాన్ని దివాలా తీస్తాయని విమర్శించినారు.

## 19.6. రైల్వే, నౌక, గృహ నిర్మాణాలు :

రూజ్వెల్ట్ పదవీ స్వీకారం నాటికి ప్రైవేటు రైల్ కంపెనీలు దివాళా స్థితిలో ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేయుటకు ఋణాలిచ్చి యంత్ర పరికరాలు ఇచ్చి ప్రభుత్వం అన్ని విధాల తోడ్పడింది. Marchent Marin చట్టం 1930 ద్వారా ఏర్పడిన మ్యారి Time Commision ద్వారా నౌకా పరిశ్రమాభివృద్ధికి తోడ్పడుటయే కాక సంవత్సరానికి 50 నౌకలను నిర్మించే బాధ్యత ప్రైవేటు కంపెనీలకు ఇవ్వటం జరిగింది. 1934లో 'ఫెడరల్ హౌసింగ్ అధారిటీ, ద్వారా మురికివాడలను నిర్మూలించి తక్కువ ఖర్చుతో చిన్న ఇండ్లను నిర్మించి కార్మికులకు చౌక ధరలకు ఇవ్వటం జరిగింది. స్థానిక పాలనా సంస్థలకు, చిన్న ఇండ్లను నిర్మించేటందుకు అప్పులు ఇవ్వటానికి United States Housing Authority 1937 స్థాపించబడినది.

## 19.7. ప్రజా సౌకర్యాలు - ఫలితాలు :

ప్రజాసౌకర్యార్థం F.D. రూజ్వెల్ట్ అనేక సౌకర్యాలను ప్రజలకు కల్పిస్తూ నిరుద్యోగ సమస్యను అరికట్టుటకు తన నవ విధానంలో ప్రయత్నాలు చేస్తున్నాడు. Public Works administrative అనే సంస్థ విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయటానికి పశ్చిమ నదులపైన ఆనకట్టలు కట్టటానికి అయ్యే ఖర్చును సంస్థ తన మూలధనం ద్వారా ఖర్చు పెట్టసాగింది. గ్రామీణ ప్రాంతాలలో జనరేటింగ్ యంత్రాలను ద్వారా

విద్యుత్‌ను ఏర్పాటు చేయడానికి 'Rural Electrical Administration' ఏర్పడినది. 1933లో 'టెన్నిస్ లోయ' అనే అధారిటీ అనే సంస్థను కాంగ్రెస్ నెలకొల్పింది.

**19.7.1. విదేశీ విధానం :** పొరుగు రాజ్యాలతోటి స్నేహంగా ఉండాలనే దృక్పథం కలిగిన F.D. రూజ్వెల్ట్ శాంతి కాముకుడు, సామ్రాజ్య వాదమునకు విరోధి, అతని విదేశ కార్యదర్శి కార్డెర్ హాల్. F.D. రూజ్వెల్ట్ విదేశాంగ విధానములో అతని కార్యదర్శి అయిన హాల్ అత్యంత ప్రముఖ పాత్ర వహించుట చేత రూజ్వెల్ట్ విదేశాంగ విధానాన్ని హాల్ విధానము అని కూడా అంటారు. F.D. రూజ్వెల్ట్ వైదేశిక నీతిలో రెండు లక్షణాలు కనబడుతున్నాయి. 1. సామ్రాజ్య వాదము లేకపోవటం, కొద్దిపాటి ఏకాకి విధానాన్ని పాటించటం, 2. పొరుగు రాజ్యాలతో మంచిగా ఉండటం. హాల్ నిజాయితీపరుడు కావున అన్ని అంతర్జాతీయ వ్యాపారానికి సంబంధించిన నిర్ణయాలు ఉభయులు కలిసి చేసేవారు. కనుకనే రూజ్‌వెల్ట్ విధానమును మంచి పొరుగు విధానము అన్నారు.

**19.7.2. అంతర్జాతీయ ఆర్థిక సమావేశము (1933) :** అంతర్జాతీయ ఆర్థిక సమావేశమునకు అమెరికన్ ప్రతినిధి వర్గాన్ని హోవర్ అధ్యక్షుని కాలమున లండన్ పంపుటకు నిర్ణయము జరిగినది. ఈ ఆర్థిక సమావేశంలో కరెన్సీ నిలకడగా ఉండాలన్న ప్రతిపాదనను ఒప్పుకోవలసి వస్తుంది అనే నెపంతో హోవర్ తర్వాత అధ్యక్షుడైన F.D. రూజెవెల్ట్ ఆ సమావేశమునకు హాజరు కాలేదు. ఇది తన యొక్క విధానాలకు అడ్డుతగులునని ఉద్దేశ్యము. దీనితో అంతర్జాతీయంగా సమావేశమైన ఈ సమావేశంలో ఏ నిర్ణయము తీసుకోకుండానే విఫలము అయినది.

**19.7.3. సోవియట్ రష్యా అధికారము గుర్తింపు :** 1917 బోల్షివిక్ విప్లవం తర్వాత 1933లో హాల్ సలహాపై ప్రపంచ భూభాగంలో అత్యంత భూభాగం కలిగిన 16 కోట్ల జనాభా కలిగిన స్థిరమైన ప్రభుత్వము కలిగిన సోవియట్ రష్యాకి దౌత్య పరిగణను ఇవ్వకపోవటం అవివేకమని, రష్యాను అధికారంగా గుర్తించటం వలన వ్యాపారం పెరుగుతుందని F.D. రూజ్వెల్ట్ తలపోసినాడు.

**19.7.4. వ్యాపార ఒప్పందాల చట్టము (1934-39) :** ప్రభుత్వ సలహాపై కాంగ్రెస్ వ్యాపార ఒప్పందాల చట్టాన్ని 1934లో ప్రవేశపెట్టినది. ఇతర రాజ్యాలతో సంప్రదించి సుంకాలను తగ్గించటానికి ఒప్పందాలు చేసుకొనే అధికారం అధ్యక్షునికే పూర్తిగా ఇవ్వబడినది. 1939 నాటికి హాల్ సలహాతో F.D. రూజెవెల్ట్ 21 దేశాలతో వ్యాపార ఒడంబడికలు కుదుర్చుకున్నాడు. దీనితో అమెరికా విదేశీ వ్యాపారం అభివృద్ధి చెందెను.

**19.7.5. లాటిన్ అమెరికాతో స్నేహము - మంచి పొరుగు విధానము :** విదేశాంగ విధానములో నిర్మాణాత్మకమైన దౌత్య విజయం పొరుగు రాజ్యాంతో స్నేహంగా ఉండాలనే రూజ్‌వెల్ట్ విధానము లాటిన్ అమెరికా రాజ్యాలలో బాగా పనిచేసింది. లాటిన్ అమెరికా రాజ్యాలలో జోక్యం పెట్టుకొని వెనకటి అమెరికా విధానాలన్నీ అనగా డాలర్ దౌత్యము, బడిత కర్ర విధానములను హాల్, రూజ్‌వెల్ట్‌లు విడనాడినారు. ఆయా రాజ్యాల ప్రాదేశిక సమగ్రతను గౌరవించినారు. అమెరికాపై దురాక్రమణ జరిగినపుడు సంయుక్త రాష్ట్రాలు లాటిన్ అమెరికా రాజ్యాలు సమిష్టిగా ఎదుర్కోవాలని అంగీకరించారు. దీనినే మంచి పొరుగు విధానము "Good Neighbouring Policy" అన్నారు. దీనిలోని భాగంగా 1933, 36, 38 వ సంవత్సరాలలో వరుసగా మాంటివిడ్, బోనస్ ఐర్స్, లీమాలలో అఖిల అమెరికన్ సమావేశాలు పాన్ అమెరికన్ కాన్ఫరెన్స్ జరిగినాయి. అమెరికా రాజ్యాల మధ్య సంబంధాలు ఏ నియమాల పైన ఉండాలనేది ఈ సమావేశంలో నిర్ణయించాయి. మంచి పొరుగు విధానాన్ని ప్రకటించి, అమెరికా రాజ్యాల వ్యవస్థ ఒకటి తర్వాత ఒకటి ఏర్పడింది. కావున ఇతర రాజ్యాల అంతరంగిక వ్యవహారాలలో జోక్యం పెట్టుకొనే హక్కు తనకు లేదని సంయుక్త రాష్ట్రాలు ఈ సమావేశంలో ప్రకటించింది. తమకు యుద్ధ భయం కలిగినపుడు తమ విదేశాంగ మంత్రులు తక్షనం సమావేశం కావాలని బ్యూనస్ ఎర్స్ సమావేశం అంగీకరించింది. మంచి పొరుగు విధానంలోని అంశాలకు తాము కట్టబడి ఉంటామని తెలియచేసే కొన్ని దృష్టాంతాలు ఉన్నాయి. 1933లో క్యూబా విప్లవం జరిగినపుడు రూజ్‌వెల్ట్ జోక్యం కలుగచేసుకోలేదు. పనామా డోమినికన్ రిపబ్లికులపై తనకుండిన విత్త పరిరక్షణను విడనాడినాడు. ఇలా ఒక అగ్రరాజ్యం తన పొరుగున ఉండే చిన్న చిన్న రాజ్యాలతోకలిసి ఉండగలదన్న సత్యాన్ని ప్రపంచానికి F.D. రూజ్‌వెల్ట్ చెప్పాడు.

మెక్సికో అధ్యక్షుడైన లజారో కార్డెనాస్ (Lazaro Cardenas) మెక్సితో నందలి అమెరికా నూనెనంతటిని జాతీయం చేసెను. ఈ చర్య వలన నష్టపోయిన అమెరికన్ పెట్టుబడిదారులు మెక్సికోపై యుద్ధం ప్రకటించి దండెత్తి రావలసినదిగా అమెరికాను కోరినారు. కానీ రూజ్‌వెల్ట్ మంచి పొరుగు విధానం అనుసరించి సంప్రదింపుల ద్వారా మెక్సికో నుండి నష్టపరిహారాన్ని మాత్రమే కోరినాడు. ఈ చర్య వలన అమెరికాకు ఆర్థికంగా నష్టం కలిగిన రెండవ ప్రపంచ యుద్ధంలో మెక్సికో అమెరికాకు పూర్తి సహకారాన్ని అందించింది.

**19.7.6. ఫిలిపిన్స్ దీవులతో సంబంధాలు :** F.D. రూజ్వెల్ట్ పదవీ కాలంలో ఫిలిపిన్స్ దీవులు స్వాతంత్ర్యాన్ని పొందాయి. 1934లో రూజ్వెల్ట్ టైడింగ్స్ - మెక్‌డఫీ చట్టం ద్వారా ఫిలిపిన్స్ నందు అమెరికా సంయుక్త రాష్ట్రాలకున్న నౌకా సైనిక స్థావరాల హక్కులు ఒదులుకొని 10 సంవత్సరాల అనంతరము అది సంపూర్ణ స్వాతంత్ర్యం పొందుటకు వీలు కల్పించెను. 1935లో ఫిలిపిన్స్ దీవులు స్వాతంత్ర్య కామన్‌వెల్త్ రాజ్యంగా రూపొందాయి. 1948లో సార్వభౌమ రాజ్యంగా ఆవిర్భవించాయి.

**19.7.7. తటస్థ విధానము - యుద్ధము :** ఐరోపా రాజకీయాలలో ఏర్పడిన మార్పుల ఫలితంగా జర్మనీ, ఇటలీ, జపాన్ దేశముల వలన ప్రపంచంలో మరొక యుద్ధ ప్రమాదము ఏర్పడింది. F.D. రూజ్వెల్ట్ రెండవ ప్రపంచ యుద్ధము ఆరంభమైనప్పుడు తటస్థ విధానాన్ని అనుసరించాడు. ప్రజలు ప్రభుత్వాన్ని సమర్థించినారు. కాంగ్రెస్ 1935, 1936, 1937 సంవత్సరాలలో తటస్థ చట్టాలను చేసినది. ఏ రాజ్యానికి మందు సామాగ్రిని, ఆయుధాలను అమెరికా అమ్మరాదని ఈ చట్టాలలోని అంశాలు. దీనికి తోడు ఐరోపానందు సుస్థిర శాంతి నెలకొల్పవలెననే ధ్యేయంతో రూజ్వెల్ట్ బ్రిటీష్ ప్రధాని చర్చిల్‌తో 1941 సంవత్సరంలో అట్లాంటిక్ చార్ట్‌పై సంతకం చేసినాడు. అయితే అక్ష రాజ్యాలైన జర్మనీ, ఇటలీ, జపాన్‌ల దురాక్రమణ చర్యల వలన మిత్ర రాజ్యాలైన ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల పక్షము వహించి F.D. రూజ్వెల్ట్ యుద్ధంలో పాల్గొన్నాడు. విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తటస్థ చట్టాలను స్వల్పంగా సవరించి మిత్ర రాజ్యాలకి ఆయుధాలను సహాయం చేయసాగినాడు. 1941 డిసెంబరు 7వ తేదీన జపాన్ పెరల్ హార్బర్‌పై దాడి చేయటంతో అమెరికా భౌగోళిక సమగ్రతకు ముప్పు వాటిల్లడంతో అమెరికా సంయుక్త రాష్ట్రాలు రెండవ ప్రపంచ యుద్ధమున పాల్గొనక తప్పలేదు. యుద్ధ కాలంలో F.D. రూజ్వెల్ట్ అమోఘ కృషి చేసినాడు. అయితే యుద్ధం ముగియక ముందే 1945 ఏప్రిల్ 12వ తేదీన తలలో రక్త నాళాలు చిట్లి కన్నుమూసినాడు. ఇతని తరువాత వచ్చిన హారీట్రూమన్ ఇతని కృషిని విజయవంతంగా పూర్తి చేసినాడు.

## 19.8. రెండవ ప్రపంచయుద్ధమున అమెరికా సంయుక్త రాష్ట్రాలు వహించిన పాత్ర :

రెండవ ప్రపంచ యుద్ధానికి రెండు ప్రధాన కారణాలు. 1. జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముస్సోలిన్, ఫ్రాన్స్‌లో ఫ్రాంకో నియంతృత్వాన్ని స్థాపించి సామ్రాజ్యవాదాన్ని పాటించటం మరియు జర్మనీ, ఇటలీ, జపాన్‌లు సైనిక కూటములుగా ఏర్పడటం, ఈ కూటమిని ఎదుర్కొవటానికి బ్రిటీష్, ఫ్రాన్స్‌లు మిత్ర కూటములుగా ఏర్పడుట రెండొవది. హిట్లర్ వర్సైల్స్ సంధి షరతులను ధిక్కరించి, ఋణాలను ఎగ్గొట్టి, సామ్రాజ్యదాహంతో సైనిక బలాలను పెంచుకొని మ్యూనిక్ ఒప్పందాన్ని ఉల్లంఘించి జకోస్లోవేకియా, పోలెండ్‌లను ఆక్రమించినాడు. కొంత కాలం వరకు బ్రిటన్, ఫ్రాన్స్‌లు హిట్లర్ దురాక్రమణలను అరికట్టలేదు. కాని పోలెండ్ ఆక్రమణతో 3-9-1939న బ్రిటన్, ఫ్రాన్స్‌లు జర్మనీపై యుద్ధాన్ని ప్రకటించినాయి. రష్యా మొదట జర్మనీతో చేతులు కలిపి మిత్ర రాజ్యా కూటమితో చేరినది.

**19.8.1. అమెరికా ఏకాంత విధానము (1924-40) :** అమెరికా కాంగ్రెస్ ప్రపంచ యుద్ధం ప్రారంభం కాకముందు తన విదేశాంగ విధానము అయినటువంటి ఏకాంత విధానము ప్రకారము అమెరికా కాంగ్రెస్ తటస్థ చట్టాలను చేసినది. ఈ శాసనాల ప్రకారం యుద్ధమందు నిమగ్నమైన దేశాలకు ఎట్టి యుద్ధ సామాగ్రిని అమ్మరాదని, ఎట్టి ఋణములను ఇవ్వరాదని ఆదేశ నౌకలలో అమెరికన్ పౌరుడు ప్రయాణం చేయరాదని శాసించెను. అయితే హిట్లర్ దురాక్రమణలు అమెరికన్‌లను భయభ్రాంతులను గావించినాయి. అప్పుడు F.D. రూజ్‌వెల్ట్ ఈ తటస్థ చట్టాలను సవరించమని కోరినాడు. 1939లో సవరించిన తటస్థ చట్టాలలోని ముఖ్యాంశాలు అమెరికా యుద్ధ నౌకలు యుద్ధ ప్రాంతాలకు పోరాదు. విదేశీ రాజ్యాలకు అమ్మిన ఆయుధాలు ఆయా దేశ నౌకలలోనే తీసుకొని వెళ్ళవలెను. రొఖ్ఖం ఇచ్చి సరుకులను తీసుకొని వెళ్లవలెను. మొదలగునవి రొక్కమిచ్చి సరుకులు తీసుకుపోవుట సూత్రము ద్వారా F.D. రూజ్‌వెల్ట్ తమ మిత్ర దేశాలకు పరోక్షముగా సహాయపడుచున్నప్పటికీ జర్మనీ జలాంతర్గాముల దాడికి బ్రిటీష్ నౌకలు తట్టుకొనలేకపోవుచుండెను. అందువలన

రూజ్‌వెల్ట్ మిత్ర దేశాలకు బలమైన యుద్ధ నౌకలు ఆయుధ సామాగ్రులను సరఫరా చేయుటకు F.D. రూజ్‌వెల్ట్ రొఖ్కమిచ్చి సరుకులు తీసుకుపోవు విధానానికి స్వస్తి చెప్పి బ్రిటీష్ కోరిక మేరకు 1940 సెప్టెంబర్ 2వ తేదీన శతఘ్నినౌకలను బ్రిటన్‌కు సరఫరా చేసెను. దీనికి ప్రతిఫలంగా బ్రిటన్ అట్లాంటిక్ తీరమున ఉన్న న్యూ ఫౌండ్‌లాండ్‌నుండి దక్షిణ అమెరికా వరకు విస్తరించియున్న 8 స్థావరాలను 99 ఏండ్లకు కౌలుకిచ్చినది. తర్వాత ఎప్పుడైతే జర్మనీ దెబ్బకు ఫ్రాన్సు కూడా గురైనదో అమెరికా తన సొంత రక్షణార్థము సైనిక ఆయుధుత్పత్తి చర్యలను ప్రారంభించినది. రిజర్వు సైనిక దళాలను, యుద్ధ, వస్తూత్పత్తి సంస్థ, యుద్ధకాలిక కార్మిక సంస్థలను ఏర్పాటు చేసుకొనెను.

**19.8.3. అరువు - కౌలు చట్టము (1941) :** అమెరికాలో 1940లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో రూజ్‌వెల్ట్ తిరిగి అధ్యక్షుడైనాడు. ఇది తాను చేసిన ఆంతరంగిక విదేశ సంస్కరణకు గుర్తింపుగాను ప్రజలు తన మీద ఉంచిన ప్రగాఢ విశ్వాసములకు గుర్తింపుగా భావించినాడు. యుద్ధ రంగంలో జర్మనీ దెబ్బలకు ఫ్రాన్సు, బ్రిటన్ దేశాలు బాగా ఆర్థికంగా పతనావస్థ స్థితిలో ఉన్నాయి. తమ మిత్రదేశాలైన బ్రిటన్, ఫ్రాన్సులను ఆర్థికంగా ఆదుకొనుటకు, మరియు సహాయం చేయుటకు అరువు, కౌలు చట్టాన్ని (Lend-Lease System) ప్రవేశపెట్టినాడు. దీని ప్రకారం యుద్ధంలో పాల్గొనుచున్న దేశాలు తమకు కావలసిన యుద్ధ సామాగ్రిని తీసుకొని యుద్ధానంతరము అవసరము తీరినాక తిరిగి వాటిని అమెరికాకు ఇచ్చి వేయవలెనని F.D. రూజ్‌వెల్ట్ వివరించినాడు. అక్ష రాజ్యాల దండయాత్రల నుంచి రక్షించుకోవటానికి ప్రయత్నిస్తున్న దేశాలకు అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఇప్పుడు సహాయం చేస్తే అమెరికా ప్రజలు ప్రత్యక్షంగా యుద్ధంలో తలపడే అవకాశం రాదు అని రూజ్‌వెల్ట్ ప్రకటించినాడు. దీని కోసం మామూలు వ్యాపార ధోరణి పద్ధతులను మార్చుకొని ప్రజాస్వామ్యానికి ఆదర్శంగా ఉండాలని చెప్తూ మానవులకు అవసరమైన 4 స్వేచ్ఛాయుత హక్కుల గురించి చెప్పెను. వాక్ స్వాతంత్ర్యము, మత స్వాతంత్ర్యము, దారిద్ర్యము తొలగించుకొనే స్వాతంత్ర్యము, భయరహిత స్వాతంత్ర్యము. వీటిని కోల్పోవుచున్న దేశాలకు ఆయుధాలను సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో 1941లో ఈ అరువు - కౌలు బిల్లును కాంగ్రెస్‌లో ఆమోదించబడినది. ఈ చట్టం ద్వారా 1941-45 వరకు 50 బిలియన్ డాలర్ల విలువగల యుద్ధ సామాగ్రిని మిత్ర రాజ్యాలకు అందజేయుట జరిగెను. దీనితో అక్ష రాజ్యాలపై సైనిక, ఆర్థికంగా యుద్ధాన్ని ప్రకటించినట్లయినది. ఈ అరువు - కౌలు చట్టం ద్వారా అమెరికన్ జర్మనీపై అనధికారంగా యుద్ధాన్ని ప్రకటించడమేనని హిట్లర్ భావించాడు.

**19.8.4. అట్లాంటిక్ ప్రకటన పత్రము :** మాస్కో, బెర్లిన్ ఒప్పందము ద్వారా రష్యా, జర్మన్‌లు పరస్పర నిర్యుద్ధ ప్రకటనలు చేసాయి. తరువాత వారి మధ్య మైత్రి కొరవడి హిట్లర్ 22 జూన్ 1941న తన సైన్యాన్ని రష్యాపైకి దండయాత్రకు పంపినాడు. రష్యాకు సహాయంగా అరువు - కౌలు చట్టంలో భాగంగా ఒక బిలియన్ డాలర్ల సహాయాన్ని అమెరికా పంపటం చేత రష్యా సేనలు జర్మనీ సేనలను మాస్కో నుండి తరిమికొట్టాయి. ఈ విధంగా జర్మనీ దురాక్రమణలతో ప్రపంచ శాంతి నానాటికి దిగజారిపోతున్నది. దానికి నివారణోపాయంగా బ్రిటీష్ ప్రధాని చర్చిల్, F.D. రూజ్‌వెల్ట్ 1941 ఆగస్టులో అట్లాంటిక్ మహా సముద్రంలో ఒక ఓడమీద రహస్యంగా సమావేశమయ్యారు. ఉభయులు కలిసి జరుగుచున్న అనేక విషయాలపై తర్జనలు - భర్జనలు చేసి చివరకు 8 అంశాలతో కూడిన ముమ్మడి ప్రకటన చేసారు. దీనిలో

1. బలహీన దేశాలపైన బలవంత దేశాల దురాక్రమణను అరికట్టుట.
2. నిరాయుధీకరణ
3. సముద్రములో స్వేచ్ఛాయుత సముద్రయానం చేసే హక్కు
4. అంతర్జాతీయ శాంతిని నెలకొల్పుట
5. ప్రపంచంలో ఉన్న ముడిసరుకులు అన్ని దేశాలకు సమకూరేటట్లు సహకరించుట
6. ప్రజాస్వామ్య వ్యవస్థల ఏర్పాటు, పరిరక్షణ
7. దారిద్ర్యమును తొలగించుట
8. అంతర్జాతీయ శాంతిని నెలకొల్పుట

మొదలగు అంశాలతో అట్లాంటిక్ చార్ట్‌ను రూపొందించినారు. రష్యాతో పాటు ఈ చార్టర్‌లోని అంశాలను 15 దేశాలు తమ ఆమోదాన్ని తెలిపాయి.

**ప్రత్యక్షంగా అమెరికా యుద్ధరంగ ప్రవేశము :** అరువు, కౌలు చట్టము ద్వారా బ్రిటన్‌కు చేరవేస్తున్న అమెరికా సరుకులు జర్మనీ జలాంతర్గాముల బారినపడకుండా సురక్షితంగా ఐస్‌ల్యాండ్ వరకు వెళ్ళి సరుకును దింపవలసినదిగా తమ నౌకాదళాలను రూజ్వెల్ట్ ఆదేశించినారు. అంతే కాకుండా ఇలా సరుకులను జారవేసే సమయంలో జర్మనీ జలాంతర్గాములు కనబడినప్పుడు బ్రిటన్‌కు సమాచారం అందించమని తన విమానా నౌకాదళారులకు ఆజ్ఞాపించినాడు. అయినప్పటికీ జర్మనీ జలాంతర్గాములు దాడులకు అమెరికా నౌకలు బలైనవి. 1941లో గ్రీర్ అనే అమెరికన్ శత్రుఘ్న నౌకను జర్మన్ జలాంతర్గాముల నౌకలు ఢీకొన్నాయి. దానితో F.D. రూజ్వెల్ట్ జర్మనీ జలాంతర్గాములను కనబడితే కాల్చి వేయండి అని ఆదేశించినాడు. తరువాత కీర్నీ, రూబెన్ జేమ్ అనే అమెరికా శత్రుఘ్న నౌకలను కూడా జర్మనీ జలాంతర్గాములు ముంచివేశాయి. దానితో అమెరికాకు అపార నష్టము వాటిల్లినది. దీనితో అమెరికా తటస్థ విధానము మరియు వ్యాపార చట్టాలను సవరించుకొని బ్రిటన్‌కు పూర్తి స్థాయిలో ఆయుధాలను సరఫరా చేయసాగెను. అనగా అమెరికా అనధికారంగా 2వ ప్రపంచ యుద్ధంలో నౌకా యుద్ధం ద్వారా పాల్గొనినది.

**19.8.6. పెరల్ హర్బర్ పై దాడి :** అక్ష రాజ్యాలలో ఒకటి అయిన జపాన్ నానాజాతి సమితి షరతులను ఉల్లంఘించి 1931లో మంచూరియాపై జపాన్ దండయాత్ర చేసి దానిని తన ఆధీనంలోనికి తెచ్చుకొన్నది. 1932లో లిట్టన్ కమీషన్ కూడా తన నివేదికలో జపాన్ దురాక్రమణలను ప్రకటించినది. మరియు చైనా, జపాన్‌ల వాగ్వివాదాల ఈ విషయంపై విని నానా జాతి సమితి జపాన్ చర్య మంచిది కాదని, జపాన్‌పై కఠినంగా వ్యవహరించాలని తెలిపెను. దానితో సమితి నుంచి జపాన్ వైదొలగినది. అమెరికా జపాన్‌తో వ్యాపార సంబందాలు కుదుర్చుకొని ఖనిజాలు, నౌకా, ఉప్పు, ఇనుము మొదలగు వస్తువులు అమ్ముతూ ఉండేది. జపాన్, జర్మనీతో కుదర్చుకొన్న సంధులు, జపాన్ వహించుచున్న తీరు జపాన్ యొక్క సామ్రాజ్య కాంక్షను గుర్తించి అమెరికా ఎగుమతులను ఆపివేసినది. జపాన్ ఈ విషయంపై పరిష్కారమును అమెరికాతో తను కార్యవర్గం ద్వారా మంతనాలు ప్రారంభించినది. ఈ మంతనాలు కొనసాగుతున్నప్పుడే ఎలాంటి హెచ్చరికలు లేకుండానే 1941 డిశెంబరు 7వ తేదీన హవాయ్ దీవులలోని పెరల్ హర్బర్‌పై జపాన్ దాడి చేసింది. ఈ దాడులలో షుమారు 3000 అమెరికన్ సైనికులు మరణించినారు. అనేక విమానాలు, నౌకలు ధ్వంసమైనాయి. దీనికి అమెరికా కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి డిసెంబరు, 11 1941లో అమెరికా జపాన్‌పై యుద్ధాన్ని ప్రకటించినది. అప్పటి వరకు పరోక్షంగా యుద్ధ రంగంలో ఉన్న అమెరికా ప్రత్యక్షంగా యుద్ధ రంగంలో దిగటంతో ఆసియా, ఐరోపా యుద్ధం ప్రపంచ యుద్ధంగా మారినది. అమెరికా తన ఆయుధ సామాగ్రి ఉత్పత్తులను పెంచుకొంది. జపాన్ పెరల్ హార్బర్‌పైన విజయాన్ని పొందిన తరువాత విజయోత్సాహంతో బర్మా, గయామ్, వేక్ ద్వీపము, హాంకాంగ్, ఫిలిపిన్స్, అట్టా, కిస్కా దీవములను వశపరచుకొనెను. ఈ విజయములను అరికట్టుటకు అమెరికా జనరల్ మెకార్థర్ అనే సేనాని, బ్రిటీష్ నౌకాధిపతి అయిన మౌంట్‌బాటన్ మిత్ర రాజ్యాల పక్షాన పోరాడి పసిఫిక్ సముద్రమున మరియు ఆగ్నే, ఆసియా రంగమున జపాన్ దురాక్రమణను అరికట్టినారు.

**19.8.7. ఆఫ్రికా యుద్ధ రంగము :** సామ్రాజ్య కాంక్ష కలిగిన జర్మనీని ఎదుర్కొనుటకు మిత్ర రాజ్యాలు జనవరి 1, 1942లో 21 మిత్ర దేశాల ప్రతనిధులు వాషింగ్టన్‌లో సమావేశమై జర్మనీ కూటమిలోని సభ్య రాజ్యాలను జయించుట ద్వారా జర్మనీని ఏకాకిని చేయవచ్చునని వ్యూహం పన్నాయి. దీనిలోని భాగంగా బ్రిటీష్, అమెరికన్, ఫ్రెంచి దేశాల 4 లక్షల సైన్యం జనరల్ డ్వైట్ డి. ఐసెన్ హోవర్ నాయకత్వంలో ఆఫ్రికా ఉత్తర తీరాన్ని చేరుకొన్నారు. మొరాకో, ఆల్జీరియాలను జయించి 1943 మే నాటికి ట్యునిషియాను ఆక్రమించినారు. మిత్ర రాజ్యాల సైన్యం, మిత్రరాజ్యాలు సిసిలీని కూడా ఆక్రమించి రోమ్ పైన దాడి చేసినాయి. దీనితో అక్ష రాజ్య కూటమిలోని ఇటలీలో ఉన్న ఫాసిష్టు నియంత అయిన ముస్సోలినిని ప్రజలు నిందించి పదవి నుంచి తొలగించినారు. రోమ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పాటు అయినది. ఇటలీలోని నూతన ప్రభుత్వం 1945 వ సంవత్సరం వరకు మిత్ర రాజ్యాల సైన్యాలతో పోరాడి ఓడిపోయి యుద్ధం నుంచి విరమించుకున్నాయి.

**19.8.8. ప్యారిస్ విముక్తి (1944 ఆగష్టు 25) :** జర్మనీ దృష్టి రష్యా నుంచి పక్కకు మరల్చుటకు రష్యా అధ్యక్షుడైన స్టాలిన్ కోరికపై మిత్రరాజ్యాలు డెహరాన్ (ఇరాన్ రాజధాని)లో28 నవంబర్ 1943లో చర్చిల్, స్టాలిన్, రూజ్‌వెల్డ్ సమావేశం అయినారు. రష్యా

మీదకి వెళ్ళి జర్మన్ సైన్యాల ఉధృతాన్ని తగ్గించటానికి జర్మనీ పశ్చిమ దేశాల నుంచి ఎదుర్కొనే ఒక బృహత్పధకాన్ని రూపొందించినారు. ఈ పథకం ప్రకారం 30 లక్షల మిత్ర రాజ్యాల సైన్యాలు జూన్ 6, 1944వ సంవత్సరమున జనరల్ ఐసెన్ హువర్ నాయకత్వాన 4 వేల ఓడలతో, 11 యుద్ధ విమానాలతో బ్రిటన్ నుండి బయలుదేరినారు. ఇది ప్రపంచ యుద్ధ చరిత్రలో ఒక అపురూప సంఘటన. మిత్ర రాజ్యాల సైన్యాలు 1944 ఆగష్టు 25 నాటికి ఫ్రాన్సును జర్మన్ కబంధ హస్తాల నుండి విముక్తి చేసినారు. దానితో ఫ్రాన్స్ స్వేచ్ఛావాయువులను పీల్చుకొంది. చార్లెస్ డీ. గాన్ ఫ్రాన్స్ అధ్యక్షుడుగా వచ్చినాడు. ఈ సమయంలోనే అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగినాయి. డెమోక్రాట్స్ తరుపున మరల నాలుగవసారి F.D. రూజ్వెల్ట్ అధ్యక్ష పదవికి, హరిట్రూమన్ ఉపాధ్యక్ష పదవిని చేపట్టినారు.

**19.8.9. జర్మనీ పతనము (1945 ఏప్రిల్) :** జర్మనీ నుంచి ప్యారిస్ విముక్తి అయిన తర్వాత మిత్ర రాజ్యాల సైన్యం 1944లో పశ్చిమ జర్మనీ సరిహద్దులలో మోహరించినాయి. రష్యా సేనలు తూర్పు వైపు నుండి జర్మనీ వైపుకు కదిలినాయి. పశ్చిమ రంగంలోని ఆంగ్లో - అమెరికన్ - ఫ్రెంచి సైన్యాలు జర్మనీలోకి పురోగించి 25 ఏప్రిల్ 1945న సాక్సనీలోనిటర్గో వద్ద రష్యా సేనలను కలిసాయి. ఏప్రిల్ 30న మిత్ర రాజ్య సైన్యం బెర్లిన్‌లో ప్రవేశించగానే హిట్లర్ తన భార్యతో 1945 ఏప్రిల్ 30న ఆత్మహత్య చేసుకొనెను. దీనికి ముందే బెర్లిన్ విజయాన్ని వీక్షించకుండానే అమెరికా అధ్యక్షుడు F.D. రూజ్‌వెల్ట్ విశ్రాంతి తీసుకొనుటకు జార్జియాలోని వామ్‌స్ప్రింగ్స్ అనే ప్రదేశానికి వెళ్ళి ఏప్రిల్ 12వ తేదీన తలలో రక్తనాళాలు చిట్లి F.D. రూజ్‌వెల్ట్ చనిపోయినాడు. వెంటనే హారీట్రూమన్ అధ్యక్ష పదవీ బాధ్యతలను చేపట్టినాడు.

**19.8.10. జపాన్‌పై అమెరికా విజయాలు :** అమెరికా తన దృష్టిని జపాన్‌పై కేంద్రీకరించినది. తొలుత జనరల్ మెకార్థర్ నాయకత్వంలో జపాన్‌పై విజయాలు 1942-43లో సాధించినవి. అక్ష రాజ్య కూటమిలో ముఖ్య రాజ్యాలైన జపాన్, ఇటలీ పరాజయాల పాలైనను జపాన్ ఫసిఫిక్ రంగమున యుద్ధాలు కొనసాగించుచుండెను. మెకార్థర్ నాయకత్వంలోని సేనలు జపాన్‌కు అతి సమీపంలో ఉన్న సైపాన్ దీవిని, జీమా, ఒకినావాలను ఆక్రమించి టోక్యో నగరంపై 1945 మార్చి, 9, 10 తేదీలలో బాంబుల వర్షం కురిపించెను. ఈ దాడులలో అపారనష్టం జపాన్‌కు కలిగినది. 1945 జూన్ నాటికే అమెరికా ఆటంబాంబును సిద్ధం చేసినది. దీనికి కనుగొనటానికి 200 కోట్ల డాలర్లు అమెరికా ఖర్చుపెట్టినది. మిత్రరాజ్యాల హెచ్చరికలను జపాన్ పెడచెవిన పెట్టుటచేత అమెరికా 6-8-1945న జపాన్ నగరాలైన హిరోషిమా, మూడురోజుల తర్వాత 9-8-1945న నాగసాకిపై ఆటంబాంబును ప్రయోగించినది. ఈ దాడుల వలన సుమారు ఒకటిన్నర లక్షల మంది మరణించారు. మరియు లక్షల మంది వికలాంగులైనారు. దీనితో జపాన్ చక్రవర్తి తాను పదవిలో కొనసాగుతాను అనే బేషరతులపై 10-8-1948న మిత్రరాజ్యాలకు లొంగిపోయినది. అక్ష రాజ్యాలు పూర్తిగా మిత్ర రాజ్యాలకు లొంగిపోవటంతో రెండవ ప్రపంచ యుద్ధం అధికార పూర్వకంగా 14-8-1945న ముగిసినది.

ఈ రెండవ ప్రపంచయుద్ధ మారణకాండలో దాదాపు ఎనిమిది కోట్ల సైన్యం యుద్ధంలో పాల్గొంది. 14,000,000 మంది చనిపోయినారు. వారిలో 3,75,000 మంది అమెరికన్‌లు ఉన్నారు. ఐరోపా, ఆసియాలలో లక్షలమంది పౌరులు మరణించినారు. మానవుడు సంపాదించుకున్న సంపద చాలా వరకు మటుమాయం అయినది. ప్రపంచ యుద్ధాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అని అనుకుంటే ప్రపంచం చాలా కొద్ది రోజుల్లోనే నశిస్తుంది అనే సత్యాన్ని ఈ ప్రపంచ యుద్ధాలు తెలిపినాయి.

## 19.9. శాంతి స్థాపనకు ప్రయత్నాలు :

ప్రపంచయుద్ధం జరుగుచున్న సమయంలో F.D. రూజ్‌వెల్ట్ శాంతి పథకాలను తయారు చేయడంలో నిమగ్నమైనాడు. అయితే తాను ముందుగానే సెనేట్‌ను సంప్రదించి నిర్ణయాలు చేసారు. యుద్ధానంతరము F.D. రూజ్‌వెల్ట్ మరియు హాల్ మిత్రదేశాలతో ఎలాంటి సంధి సంప్రదింపులు చేసుకొనవలెనో సెనేటర్లను సంప్రదించారు. ఆ తర్వాత తమ మిత్ర రాజ్యాలైన బ్రిటన్, రష్యాలతో సంప్రదింపులను ప్రారంభించినారు. దానిలోని భాగమే యాల్టా, పోట్స్ డామ్ సమావేశాలు జరిగినాయి. మరియు ప్రపంచ శాంతికి ఐక్యరాజ్య సమితి స్థాపన.

**19.9.1. యాల్టా సమావేశము :** మిత్ర రాజ్యాలైన అమెరికా, బ్రిటన్, రష్యా 1943లో మాస్కోలో సమావేశమై ఐరోపాలో శాంతి కొరకు, దేశముల భౌగోళిక సమర్థతలను కాపాడుటకు, మిత్ర రాజ్యాలైన అమెరికా, బ్రిటన్ మరియు రష్యాలు పరస్పరము సహకరించుకుంటూ

శాశ్వతంగా, సమిష్టిగా వ్యవహరించుటకు అంగీకారం కుదుర్చుకొన్నాయి. కాని సామ్రాజ్య కాంక్షతో రష్యా తన మిత్ర రాజ్యాలైన అమెరికా, బ్రిటన్‌లతో సంప్రదించకుండా పోలెండ్, బాల్కన్ రాజ్యాలలో జర్మన్‌లను తరిమివేసి కమ్యూనిస్టు ప్రభుత్వాలను ఏర్పాటు చేసినది. అలాగే బ్రిటన్ కూడా మిత్ర రాజ్యాలకు తెలియకుండా గ్రీస్ నందు సనాతన వ్యవస్థను నెలకొల్పెను. దీనితో అమెరికా తమ మిత్ర రాజ్యాలలో వచ్చిన అపోహలను తొలగించుకొనుటకు F.D. రూజ్‌వెల్ట్ చొరవ మేరకు 1945 ఫిబ్రవరిలో రష్యాలోని క్రిమియానందలి యాల్టా నందు సమావేశమైనారు. దీనినే యాల్టా సమావేశమందురు. ఈ యొక్క సమావేశంలో అంగీకరించబడిన నిర్ణయాలు, (1). జర్మనీని 4 మండలాలుగా విభజించబడి అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ మరియు రష్యా ఆధీనములో ఉండును. (2). జర్మనీ వలన నష్టములు కలిగిన ఆయా రాజ్యాలకు జర్మనీ నష్ట పరిహారము చెల్లించును. (3). ఐరోపాలో ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుట, (4). రష్యా, చైనాలు దూర ప్రాచ్యమున స్నేహముగా ఉండుట. ఈ సమావేశము వలన మిత్ర రాజ్యాల మధ్య అపోహలు తొలగిపోయినాయి.

**19.9.2. పోట్స్ డామ్ సమావేశము (1945) :** తూర్పు జర్మనీలోని పోట్స్‌డామ్ నందు జూలై 17, 1945 నుండి ఆగష్టు 2, 1945 వరకు జరిగిన సమావేశము రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో చివరన జరిగిన శాంతి సమావేశము. దీనిలో యాల్టా సమావేశంలో తీసుకొన్న నిర్ణయాలను మరలా స్వ వివరణ ఇచ్చుటయే దీని ప్రధానాంశము. ఐరోపాలో నిరాయుధీకరణ, శాంతి స్థాపనకు కృషి ప్రజాస్వామ్య విలువలను కాపాడుట, దేశాల సమగ్రతను సరిహద్దును కాపాడుట పోలెండ్ సరిహద్దును తాత్కాలికంగా నిర్ణయించుట కౌనిక్స్‌బర్గ్ పట్టణమును రష్యాకు ఈయబడుట మొదలగు అంశాలు ఈ సమావేశంలో నిర్ణయించబడ్డాయి. ఈ అంశాలను ఒప్పుకోవటంలో అమెరికా నైతికంగా బలహీనత చెందిందా అను సందేహం కలుగుతుంది. ఈ సమావేశం మరియు రష్యా సామ్రాజ్యవాదానికి మద్దతు కలిగే విధంగా కూడా ఉన్నది.

**19.9.3. ఐక్యరాజ్య సమితి స్థాపన :** ప్రపంచ శాంతి కొరకు ఏర్పడిన నానాజాతి సమితి తన కర్తవ్యం సరిగా నెరవేర్చుకొనలేక అనేక విమర్శలకు గురైనది. నానాజాతి సమితిలోని లోటుపాటులను సవరించి దాని స్థానంలో ప్రపంచ శాంతి పరిరక్షణకు కృషి చేసే విధంగా మిత్ర రాజ్యాలు, తటస్థ రాజ్యాలు కలిసి 1945 అక్టోబర్ 24వ తేదీన ఐక్యరాజ్య సమితిని స్థాపించాయి. అమెరికా అధ్యక్షుడు కన్న కలల ప్రతిరూపం ఐక్యరాజ్య సమితి. అనేక సమావేశముల అనంతరము అట్లాంటిక్ చార్టర్ 1941 కాసాబ్లాంకా 1943, క్రిమియా 1945, మొదలగు సమావేశములు జరిగి చివరకు శాన్‌ఫ్రాన్సిస్‌కోలో జరిగిన సమావేశములోని నిర్ణయం ప్రకారం రాజ్యాలు అన్ని ఐక్యరాజ్య సమితి ఒడంబడిక పత్రంపై సంతకాలు చేసాయి. దీని ప్రకారం దీనిలో 3 ప్రకరణలు వున్నాయి.

1. మానవ జాతిని యుద్ధాల నుంచి కాపాడుట, 2. మానవుల హక్కుల మీద విశ్వాసం కలిగించుట, 3. సాంఘిక ప్రగతి, ప్రజల జీవన ప్రమాణాన్ని అభివృద్ధి చేయటం. నానాజాతి సమితి వలనే దీనిలో అనేక అంగాలు ఉన్నాయి. ప్రధానంగా సాధారణ సభ (General Assembly), భద్రతా సమితి (Security Council), ఆర్థిక సాంఘిక మండలి (Economic and Social Council), ధర్మకర్తృత్వ మండలి (Trusti Ship Council), అంతర్జాతీయ న్యాయస్థానము (International Court of Justice), సచివాలయము (Secreteriat).

## 19.10. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)

1. F.D. రూజ్వెల్ట్ నవ విధానమును వర్ణింపుము
2. ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ యొక్క దేశీయంగ విధానమును గురించి వివరింపుము.
3. F.D. రూజ్వెల్ట్ విదేశాంగ విధానమును గురించి వివరింపుము.
4. 2వ ప్రపంచ యుద్ధంలో అమెరికా చేరుటకు దారి తీసిన పరిస్థితులు పరిశీలించుము.
5. 2వ ప్రపంచ యుద్ధంలో అమెరికా పాత్రను విశ్లేషించుము.

## 19.10. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Elson | - | History of the United States of America |
| 2. | H.B. Parkes | - | The United States of America : A History |
| 3. | Merle Curti | - | Growth - American Thought |
| 4. | H.V. Faulkness | - | American Economic Theory |
| 5. | F.J. Turner | - | The Frontier in American History |
| 6. | Telugu Academy Publication | - | America Samyukta Rastrala Charitra, |


- డా॥ కె. అజయ్ కుమార్

పాఠం - 20

# రెండవ ప్రపంచ యుద్ధం - ఆ తరువాత అమెరికా

## 20.0. లక్ష్యం :

రెండవ ప్రపంచ యుద్ధానంతరము సంయుక్త రాష్ట్రాల స్వదేశ, విదేశ విధానము కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించుటకు చేసిన కృషిని గురించి వివరించుట ఈ పాఠం యొక్క లక్ష్యము.

## విషయసూచిక :


20.1. హారీ ట్రూమన్ పరిపాలన

20.2. ట్రూమన్ విదేశాంగ విధానము

20.3. కమ్యూనిజం విస్తీరణా నిరోధ కృషి (ట్రూమన్ సిద్ధాంతం)

20.4. మార్షల్ పథకము

20.5. నాటో (NATO)

20.6. అమెరికా చర్యలకు రష్యా ప్రతిఘటన

20.7. బెర్లిన్ దిగ్బంధము

20.8. కొరియా యుద్ధం

20.9. రష్యా వైఖరిలో మార్పు

20.10. ఐసెన్ హోవర్ పరిపాలన (1952-1960)

20.11. విదేశాంగ విధానము

20.12. జాన్ ఫిట్జరాల్డ్ కెన్నెడి (1961-1963)

20.13. విదేశాంగ విధానము

20.14. క్యూబా సమస్య

20.15. రష్యాతో సంబంధాలు - బెర్లిన్ సమస్య

20.16. లిండన్ బైన్స్ జాన్సన్ (1963-1965)

20.17. నమూనా ప్రశ్నలు

20.18. చదువదగిన గ్రంథాలు

## 20.1. హారీ ట్రూమన్ పరిపాలన :

ఫ్రాంక్లిన్ డిలార్డ్ రూజ్‌వెల్ట్ 1945 ఏప్రిల్ 12న మరణించెను. అంతట ఉపాధ్యక్షుడైన హారీ ట్రూమన్ అమెరికా అధ్యక్షుడయ్యెను. 1948 సంవత్సరములో పరాజయము తధ్యము అని భావించినను అధ్యక్ష ఎన్నికలలో అనూహ్య పరిణామముగా తిరిగి గెలిచి, 1852 వరకు ట్రూమన్ అధ్యక్ష పదవిలో కొనసాగినాడు. విజయోత్సాహంతో ట్రూమన్ తన స్వదేశాంగ విధానములో అభ్యుదయ సంస్కరణలను ప్రవేశపెట్టెను. సన్నకారు రైతులను ఆదుకొనుటకు వ్యవసాయ కార్యదర్శి అయిన చార్లెస్. యఫ్. బ్రానన్ సహాయంతో ఒక ప్రణాళిక తయారుచేసినారు. దీనిలో మార్కెట్ ధరలు తక్కువగా యుండునట్లు చేసి సంక్షేమమునకు కృషి చేయుట ముఖ్యాంశము. కాని కాంగ్రెస్ దీనిని ప్రక్కనపెట్టి వ్యవసాయదారులకు తమ ఉత్పత్తులకు ఎక్కువ మద్దతు ధరలు లభించేటట్లు నూతన చట్టమును ప్రవేశపెట్టెను. ట్రూమన్ తన సమతా విధానము, లేక అభ్యుదయ సంస్కరణలను రిపబ్లికన్‌లు సనాతన డెమోక్రాట్స్ అడ్డుకొన్నప్పటికి వాటిని అధిగమించి ప్రజాహిత సంస్కరణలు చేయుట అని గొప్పతనమునకు నిదర్శనము. అవి Fair Labour Stand Act ను అనుసరించి కార్మికులకు గంటకు 75 సెంట్లు చెల్లించు విధానము, నీగ్రోలకు పౌర హక్కుల రక్షణ కల్పించుచు వారికి ఉన్నత పదవులను ఒసంగెను. 1949 జాతీయ గృహ సమితి చట్టము చేయబడి తద్వారా సంవత్సర కాలంలో 81,000 పక్కా గృహముల నిర్మాణము చేయదలచెను.

## 20.2. ట్రూమన్ విదేశాంగ విధానము :

రెండవ ప్రపంచ యుద్ధకాలమున అమెరికా, రష్యాలు మిత్ర రాజ్యాలుగా ఒక పక్షాన వహించి, అక్షర రాజ్యాలైన ఇటలీ, జర్మనీ, జపాన్ పతనమునకు బాధ్యత వహించినాయి. యుద్ధానంతరము అమెరికా, రష్యా మధ్య మైత్రి సన్నగిల్లి ప్రపంచాధిపత్యము కొరకు పోటీకి దిగినారు. అధ్యక్షుడైన తర్వాత ట్రూమన్ ఎదుర్కొన్న మొదటి సమస్య రష్యా కమ్యూనిస్టు విస్తరణ అరికట్టడం. యల్టా, పోట్స్‌డాం ఒప్పందాలను బట్టి జర్మనీ, ఆస్ట్రియాలు అమెరికా, బ్రిటన్, ఫ్రెంచ్, రష్యన్ సైన్యాల చేత ఆక్రమించబడ్డాయి. తమ ఆక్రమణలోని ప్రాంతాలలో పై ఒప్పందాలకు విరుద్ధంగా రష్యన్‌లు కమ్యూనిజాన్ని ప్రవేశపెట్టారు. తూర్పు ఐరోపాలోని పోలెండ్, రుమేనియా, బుల్గేరియా యుగోస్లోవియా, అల్బేనియాలలో రష్యా కమ్యూనిస్టు ప్రభుత్వాలను నెలకొల్పినది. హంగేరి, జకోస్లోవేకియా, గ్రీస్, టర్కీలలో కమ్యూనిస్టు విప్లవ భావాలను ప్రేరేపించింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలు ప్రపంచంలోని పెక్కు దేశముల స్వేచ్ఛ, స్వాతంత్ర్యములను కాపాడి రక్షించు బాధ్యతలను చేపట్టవలసి వచ్చుట చేత అమెరికా ముఖ్యముగా తూర్పు ఐరోపా, మధ్య ప్రాశ్చాత్య రాజ్యములను కమ్యూనిస్టు కబంధ హస్తాలలోనికి పోకుండా నిరోధించుటకు తన ప్రయత్నాలను తాను చేయసాగినది. ఇలాంటి లక్ష్యములతో రష్యా, అమెరికాల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతను ప్రచ్ఛన్న యుద్ధం (Cold War) అంటారు. ఇది 1945-1960 వరకు కొనసాగింది. ఈ కాలంలో అమెరికా అధ్యక్షులుగా హారిట్రూమన్, జనరల్ డైట్, ఐసెన్ హోవర్ పనిచేసారు. 1945-53వ ట్రూమన్ కాలంలో ప్రచ్ఛన్న యుద్ధ దశ తీవ్రతగా ఉన్నది. 1953-64 వరకు ప్రచ్ఛన్న యుద్ధము తిరోగమన దశగా అభివర్ణించవచ్చును.

## 20.3. కమ్యూనిజం విస్తీరణా నిరోధ కృషి - ట్రూమన్ సిద్ధాంతం :

అత్యంత వేగంతో వ్యాప్తి చెందుతున్న రష్యా కమ్యూనిజాన్ని అడ్డుకోవటం తన ప్రధమ కర్తవ్యంగా ట్రూమన్ భావించాడు. హిట్లర్ నాజిజమ్ కంటే స్టాలిన్ కమ్యూనిజం 1000 రెట్లు ప్రమాకరమైనదని భావించి రష్యా కమ్యూనిస్టు విస్తరణను ఎలా ఆపాలి, రెండు కమ్యూనిజం వైపు ప్రపంచ ప్రజల మనస్సు మరల కుండా చేయాలని భావించాడు. దీనిలోని భాగంగా (1947) నుండి అమెరికా తన సైనిక బలాన్ని పెంచడాన్ని, ప్రపంచ ప్రజాస్వామ్యాన్ని వృద్ధి చేయడానికి చర్యలను ప్రారంభించినది. 1947 అధ్యక్షుడు ట్రూమన్ తన సిద్ధాంతాన్ని ప్రకటించినాడు. "స్వేచ్ఛా ప్రజలపై ప్రత్యక్షంగాను లేదా పరోక్షంగాను దురాక్రమణ చేసి నియంతృత్వాన్ని విధించటం వలన అంతర్జాతీయ శాంతి, సంయుక్త రాష్ట్రాల భద్రత ప్రమాదం ఏర్పడుతుంది. అల్ప సంఖ్యాకులు ఆయుధ బల ప్రయోగం నుండి బాహ్య రాజ్యాల ఒత్తిడిని నుండి తమను కాపాడుకోవటానికి పోరాడే స్వేచ్ఛా ప్రజలకు సహాయ పడటం సంయుక్త రాష్ట్రాల విధానము". ఈ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ ఆమోదించి నాలుగు వందల మిలియన్ల డాలర్లు సైనిక, ఆర్థిక సహాయమును గ్రీసు, టర్కీలకి చేసి ఆయా దేశాలలో కమ్యూనిస్టు విప్లవాలను అణచివేసింది.

## 20.4. మార్షల్ పథకము :

1947 జూన్ 5వ తేదీన అమెరికా విదేశాంగ కార్యదర్శి అయిన మార్షల్ తన కొత్త పథకాన్ని హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో ప్రకటించాడు. దీని ప్రకారం ఐరోపా రాజ్యాలు సమిష్టిగా ఆర్థిక, పునర్నిర్మాణ కార్యక్రమాన్ని రూపొందించుకుంటే దానికి సంయుక్త రాష్ట్రాలు సహాయపడుతుంది. ఈ మార్షల్ పథకం ఐరోపా పునర్నిర్మాణానికి ఉద్దేశించింది కాబట్టి దీనిని ఐరోపా పునర్నిర్మాణ పథకం అని కూడా అన్నారు. ఈ పథకము పరోక్షంగా కమ్యూనిజాన్ని ఐరోపా రాజ్యాలలో నిరోధించడానికి దీనిని అమలు జరుపడానికి అవసరమైన ధనాన్ని అమెరికా కాంగ్రెస్ విడుదల చేసింది. మార్షల్ పథకము అనూహ్య రీతిలో విజయాన్ని సాధించినది. ఐరోపా రాజ్యాలు అమెరికా సహాయంతో తమ ఆర్థిక దుస్థితిని అధిగమించి అభివృద్ధిని సాధించాయి.

## 20.5. సైనిక సంధులు - ఉత్తర అట్లాంటిక్ సంధి వ్యవస్థ (NATO 1949) :

ఐరోపా రాజ్యాలలో రష్యా కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టటానికి మరియు రష్యాబలాన్ని నిరోధించడానికి అమెరికా సైనిక సంధులను ప్రోత్సహించినది. ఐరోపా రాజ్యాలు అమెరికా సంయుక్త రాష్ట్రాలు కలిసి ఏర్పరచుకొన్న సైనిక కూటమికి ఉత్తర అట్లాంటిక్ సంధి 1948 ఏప్రిల్ 4వ తేదీన కుదిరింది. దీనిలోని సభ్యులు సంయుక్త రాష్ట్రాలు, కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియమ్, నెదర్లాండ్స్, లక్జెంబర్గ్ నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్, పోర్చుగల్. ఈ రాజ్యాలలో దేనిమీదైన దురాక్రమణ జరిగితే అది తమ అందరిపైన జరిగిన దురాక్రమణగా పరిగణిస్తామని (NATO) నాటో ప్రకటిచింది. దీనిని సెనేట్ పెద్ద మెజారిటీతో అంగీకరించింది. 1950లో నాటో రాజ్యాలు పశ్చిమ ఐరోపా రక్షణకు సమిష్టి సైనిక వ్యవస్థను సృష్టించాయి. దీనికి జనరల్ ఐసెన్ హోవర్ అధిపతిగా నియమించబడినాడు.

## 20.6. అమెరికా చర్యలకు రష్యా ప్రతిఘటన :

1948 నాటికి తూర్పు ఐరోపా రాజ్యాలలో బల్గేరియా, రుమేనియా, పోలెండ్, తూర్పు జర్మనీ, హంగేరి, అల్బేనియా, జకోస్లోవేకియా, యుగోస్లోవియాలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఏర్పడగా వాటి పరిరక్షణకు కమ్యూనిజం వ్యాప్తికి సోవియట్ విదేశాంగ మంత్రియగు మాల్టావ్, అమెరికా మార్షల్ పథకానికి, ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టు దేశముల ఆర్థిక పునర్నిర్మాణమునకై ఒక ఆర్థిక ప్రణాళికను రూపొందించెను. దీని ప్రకారం తూర్పు ఐరోపాలోని కమ్యూనస్టు దేశాలు, రష్యా ఒకరినొకరు ఆర్థిక సహాయం చేసుకొనుటకు కొమెకాన్ Council for Mutual Economic Assistance (COMECON) 1949లో స్థాపించాడు. దీనినే మాల్టావ్ ప్రణాళిక అంటారు.

## 20.7. బెర్లిన్ దిగ్బంధనము :

రెండవ ప్రపంచ యుద్ధానంతరము జర్మనీ తూర్పు జర్మనీ, పశ్చిమ జర్మనీగా విడిపోయినవి. తూర్పు జర్మనీ రష్యా ఆధీనంలో కమ్యూనిస్టు రాజ్యంగా పశ్చిమ జర్మనీ అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ ఆధీనంలో ప్రజాస్వామ్య దేశంగా ఏర్పడినాయి. సోవియట్ యూనియన్ అధ్యక్షుడు స్టాలిన్ పశ్చిమజర్మనీని స్వాధీనం చేసుకొనుటకు తొలి ప్రయత్నంగా బెర్లిన్ నగరాధిపత్యం కోసం 1948లో బెర్లిన్ దిగ్బంధాన్ని విధించెను. దీని వలన పశ్చిమ జర్మనీ, తూర్పు జర్మనీల మధ్య రాకపోకలు విచ్ఛిన్నమై నిత్యావసర వస్తువులకు తీవ్రమైన కొరత ఏర్పడినది. దానిలో అమెరికా ఫ్రాన్స్, బ్రిటన్‌ల క్రింద ఉన్న పశ్చిమ బెర్లిన్‌కు నిత్యావసర వస్తువులు అందచేయుటకు విమానాల ద్వారా నిత్యావసర వస్తువుల రవాణా సాగించారు. దీనితో రష్యా గత్యంతరం లేక 1949లో బెర్లిన్ దిగ్బందమును తొలగించెను.

## 20.8. కొరియా యుద్ధము (1950)

దక్షిన కొరియా నుండి అమెరికా సైన్యం వైదోలగటంతో రష్యా తన ఆధీనంలో ఉన్న ఉత్తర కొరియా నుండి దక్షిణ కొరియాకు దండయాత్రకు దిగినది. ఈ దురాక్రమణను ఎదుర్కొనుటకు ఐక్యరాజ్యసమితి యొక్క భద్రతామండలి ఏర్పాటు చేసిన సైన్యానికి

అమెరికా జనరల్ మెకార్థర్ ఆధ్వర్యంలో జూన్ 26, 1950న దక్షిణ కొరియాలో ఉన్న కమ్యూనిస్టు సైన్యాన్ని తరిమి వేయటమే కాక ఉత్తర కొరియాలోనికి మెకార్థర్ సైన్యం చొచ్చుకుపోయినది. ఈ సమయంలో చైనా కమ్యూనిస్టు సైన్యం దీనిలో జోక్యం కలుగచేసుకొని ఉత్తర కొరియాకు అండగా ఉండి మెకార్థర్ సైన్యాన్ని సరిహద్దు వరకు పారద్రోలినది. అప్పుడు చైనా స్థానిక స్థావరాలపై బాంబుల దాడులను కురిపిస్తాను అని చేసిన జనరల్ మెకార్థర్ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ తిరస్కరించి అతనిని పదవినుంచి తొలగించి అతని స్థానంలో జనరల్ మాథ్యూ బిరిడ్జ్‌వే (Mathew Ridgway) ను నియమించెను.

## 20.9. రష్యా వైఖరిలో మార్పు :

రష్యా విధానంలో కాలక్రమముగా మార్పులు చోటు చేసుకొని 1955లో వచ్చిన కృశ్చేవ్ విదేశాంగ విధానంలో ప్రచ్ఛన్న యుద్ధ తీవ్రతను తగ్గించుకొని శాంతియుత సహజీవన విధానమును అనుసరించారు.

## 20.10. ఐసెన్ హోవర్ పరిపాలన (1952-60) :

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి అయిన డైట్ డి. ఐసెన్ హోవర్ 1952 అధ్యక్ష ఎన్నికలలో ఎన్నికైనాడు. 1952 తర్వాత జరిగిన 1956 అధ్యక్ష ఎన్నికలలో తిరిగి ఎన్నికై 8 సంవత్సరాలు దేశమును జాగరూకతతో నడుపుచూ రష్యా పట్ల ట్రూమన్ విధానాన్ని ఐసెన్ హోవర్ కొనసాగించాడు. ఐసెన్ హోవర్ టెక్సాస్ నివాసి. సైనికుడుగా జీవితాన్ని ప్రారంభించి దేశంలో అనేక ఉన్నత పదవులు వహించి 1950లో దళాధిపతిగా పనిచేసినాడు. అధ్యక్షుడు అయిన తర్వాత తన అంతరంగిక విధానంలో మాధ్యేమార్గము (Middle of the Road Policy) తన విధానమును ప్రకటించాడు. స్వేచ్ఛ అనేది వ్యక్తికి ముఖ్యమని కాని అది జాతి ప్రయోజనాలకు విఘాతాలను కలిగించినపుడు ప్రభుత్వ జోక్యం అవసరము అనే ఉద్దేశ్యము. అందుకని ఐసెన్ హోవర్ తన సంస్కరణలో కొన్ని సనాతనముగా మరికొన్ని అభ్యుదయముగాను కనబడతాయి. ఐసెన్ హోవర్ చేసిన అంతరంగ సంస్కరణలో ముఖ్యమైనవి ఎ) ఆర్థిక సంస్కరణలు, బి) ప్రైవేటు రంగ ప్రోత్సాహము, సి) సాంఘిక వ్యవస్థతో అభ్యుదయ సంస్కరణలు, డి) వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర పెరుగుటకు పాటుపడుట, ఇ) నీగ్రోల పౌర హక్కుల రక్షణకు కాంగ్రెస్‌లో పౌర హక్కుల చట్టాన్ని ప్రవేశపెట్టుట, దీని ద్వారా ఓటు హక్కు కల్పించి జాతి విచక్షణా విధాన నిర్మూలనకు పాటుపడెను.

## 20.11. ఐసెన్ హోవర్ విదేశాంగ విధానము :

ఐసెన్ హోవర్ తన విదేశాంగ విధానములోని ముఖ్య లక్ష్యాలు, శాంతియుత సహజీవనము, పరస్పర సహకారము, కమ్యూనిజమ్ వ్యాప్తి నిరోధము, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుట, ఐసెన్ హోవర్ లక్ష్యాలకు ఆనాటి అమెరికా విదేశాంగ కార్యదర్శి జాన్ ఫాస్టర్ డల్లెస్ సహకారము ప్రముఖ పాత్ర వహించినది. ప్రపంచంలో కమ్యూనిజమ్ వ్యాప్తిని అరికట్టుటకు, ప్రజలను కమ్యూనిజమ్ బారిన పడకుండా అవసరమైతే బలప్రయోగానికి కూడా అమెరికా సంయుక్త రాష్ట్రాలు వెనుకాడకూడదని డల్లెస్ అభిప్రాయము. ఐసెన్ హోవర్ విదేశాంగ విధానమును నాలుగు భాగాలుగా విభజించవచ్చును. 1. దూర ప్రాశ్చ్య విధానము, 2. ఐరోపా మధ్య ప్రాశ్చ్య విధానము, 3. రష్యాతో సంబంధాలు.

1953లో కొరియా యుద్ధం అంతమైంది. కొరియా రెండు భాగాలుగానే ఉండిపోయింది. దీని వలన దక్షిణ కొరియాకు సుమారు 1500 చ.మైళ్ళ భూభాగము లభించెను. ఇలా కొరియా సమస్య పరిష్కరించబడింది. కాని వియత్నాం విషయంలో కమ్యూనిస్టు చైనా రష్యాల సహాయంతో ఉత్తర వియత్నాం, అమెరికా సంయుక్త రాష్ట్రాల సహాయంతో దక్షిణ వియత్నాం శక్తివంతమైన దేశాలుగా మారి ఒకరినొకరు ఢీ కొనుటకు సిద్ధమైనారు. అలాగే దూర ప్రాశ్చ్యములో కమ్యూనిజాన్ని అరికట్టటానికి 1954లో ఆగ్నేయాసియా రక్షణ కూటమిని (సీటో) SEATO ను ఐసెన్ హోవర్ నెలకొల్పాడు. ఆగ్నేయాసియా సంధి అనబడే దీనిలో చేరిన సభ్యులు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, పాకిస్తాన్, థాయిలాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిలిపిన్స్ పరస్పర సహకారం చేసుకొనుటకు అంగీకరించినాయి. ఇండియా దీనిలో చేరలేదు. 1954లో ఫార్మోజాపై చైనా బాంబులు వేసినప్పుడు తాను సైన్యాలను పంపుతానని ఐసెన్ హోవర్ ప్రకటించాడు. అంతేగాక కమ్యూనిస్ట్

చైనాను గుర్తింపగ ఐక్యరాజ్య సమితిలో చైనా ప్రవేశాన్ని నిరోధించాడు. పశ్చిమ జర్మని టర్కీలు 1954లో NATO లో చేరాయి. ఇదే కాలంలో దక్షిణ కొరియా, జపాన్, సోషలిస్ట్ చైనాతో అమెరికా రక్షణ సంధులను కుదుర్చుకుంది. మధ్య ప్రాశ్చ్యంలో కమ్యూనిజం నుండి దురాక్రమణ జరిగితే ఆ ప్రాంతంలోని రాజ్యాలను రక్షించటానికి అమెరికా సైన్యాలను పంపుతుందని ఐసెన్ హోవర్ ప్రకటించాడు. దీనినే ఐసెన్ హోవర్ సిద్ధాంతం అని అన్నారు.

సోవియట్ రష్యాతో కృశ్చేవ్ అధికారంలోనికి రాగానే రష్యా, అమెరికాల మధ్య సంబంధాలు మెరుగుపడకుండా ఉభయ దేశాలు అత్యంత ఆధునిక మరణాయుధ తయారీలో పోటీపడసాగాయి. అయితే 1558లో రష్యా, అమెరికాల మధ్య విద్యా, సాంకేతిక, సాంస్కృతిక రంగాలలో పరస్పరము సహకరించుకొనుటకు అంగీకరించినని. కానీ మైత్రినిలబడకముందే 1960, 1వ తేదీన U2 అమెరికా గూఢచారి విమానము సోవియట్ రష్యా గగన వీధి దాటి 1900 మైళ్ళు చొచ్చుకొని పోయెను. దీనిని రష్యా కూల్చివేసెను. U2 సంఘటనతో కృశ్చేవ్ పారిస్ శిఖరాగ్ర సమావేశమును బహిష్కరించెను. ఉభయ దేశాల మధ్య స్నేహ సంబంధాలు బెడిసికొట్టినవి. 2వ ప్రపంచ యుద్ధానంతరము ఐరోపా దూర ప్రాశ్చ్యము పట్ల వహించిన శ్రద్ధ అమెరికా సంయుక్త రాష్ట్రాలు లాటిన్ అమెరికా దేశాల మధ్య వహించలేదు. ఐసెన్ హోవర్ పదవీ కాలము ముగిసేనాటికి రష్యా కూడా అణ్వస్త్రముల తయారీలో ముందుండటం విపరీత పరిణామము.

## 20.12. జాన్ ఫిట్జరాల్డ్ కెన్నెడి (1961-1963) :

1960లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ పార్టీ తరుపున జాన్ ఫిట్జరాల్డ్ కెన్నెడి పోటీ చేసి అధ్యక్షుడైనాడు. అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన వారిలో చిన్నవాడు 1917లో ఐరిష్ జాతికి చెందిన సంపన్న బ్యాంకర్ ఇంటిలో జన్మించెను. మెసాచుసెట్స్ రాష్ట్రవాసి హార్వర్డులో పట్టాపుచ్చుకొని నాయకత్వ లక్షణాల ఉన్న వ్యక్తి J.F. కెనడి సమర్థులైన కార్యదర్శులను ఏర్పాటు చేసుకొని వారి సలహాలతో పాలనను సాగించెను. కనుకనే ఆచార్య బ్లమ్ "కెన్నడి రాకతో అమెరికా రాజకీయాలలో నవతరం ఆరంభమైనది" అని చెప్పినాడు. J.F. కెన్నడీ పరిపాలనను రెండు భాగాలుగా విభజించవచ్చు.

1. స్వదేశాంగ విధానము, 2. విదేశాంగ విధానము.

J.F. కెన్నడీ ఉదారవాదిగా, అభ్యుదయవాదిగా ఎన్నికలలో తాము ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకొనుటకు అనేక సంస్కరణలు చేసి దేశ ప్రగతిని అభివృద్ధి పథములోనికి నడిపించినాడు. J.F. కెన్నడీ ప్రవేశపెట్టిన ముఖ్య సంస్కరణలు వాణిజ్య విస్తీర్ణ చట్టము చేయుటద్వారా విదేశీ పోటీ నుండి అమెరికా పరిశ్రమలను రక్షించి వాటి ఆధునీకరణకు ప్రభుత్వం చేత ఆర్థిక సహాయం చేయించెను. ప్రపంచ శాంతి కాముదికునిగా J.F. కెన్నడీ వినూత్న పద్ధతిలో అమెరికన్ శాంతి సేవాదళ్ ఏర్పాటు చేసినాడు. దీనిలోని డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, మేధావులు ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలను సందర్శించి బడుగు ప్రజల స్థితిగతులు మెరుగుపరుచుటకు సహాయపడుదురు.

నానాటికి పెరుగుచున్న ఉక్కు ధరలను తగ్గించుటకు 1962లో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఉక్కు చట్టము చేసినది. దీనికి తోడు రక్షణ శాఖ ఉక్కు కొనుగోలును నిలిపివేయవలసినదిగా J.F. కెన్నడీ ఆదేశించినారు. దీనితో ఉక్కు ధరలు నియంత్రించబడినాయి. J.F. కెన్నడీ నీగ్రోల హక్కుల పరిరక్షణ కల్పిస్తూ, పాఠశాలలోను, రెస్టారెంట్‌లలోను జాతి విచక్షణ పాటించకుండా చర్యలు తీసుకొనెను. కొన్ని సంస్కరణలు సాధించినను J.F. కెన్నడీ తాను చేయదలచిన సంస్కరణలు కొన్ని కార్యరూపం దాల్చలేదు. అవి విద్యా సంస్థలకు ఫెడరల్ విధానము, మురికివాడల నిర్మూలనము, ప్రజల జీవన ప్రమాణము మెరుగుపరుచుట మొదలగునవి.

## 20.13. విదేశాంగ విధానము :

J.F. కెన్నడీ తన ముందు చేసిన అధ్యక్షుల వారసత్వ విదేశాంగాన్ని పుణికి పుచ్చుకొంటూ కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టుట తమ సైనిక అణ్వాయుద్ధ సంపత్తిని పెంపొందించుకొనుటకు కృషి చేసినాడు. అంతర్జాతీయ రాజకీయాలలో శాంతియుత మార్గాలకోసం అన్వేషిస్తూ, అవసరమైతే బలప్రయోగాలకు కూడా వెనుకాడలేదు. కెన్నడీ కాలంలో ముఖ్యమైనవి క్యూబా సమస్య, బెర్లిన్ సమస్య, లాటిన్ అమెరికా దేశాల అభివృద్ధికి పాటుపడి తద్వారా వాటి పూర్తి మద్దతు పొందవలనెని ఆశించిన J.F. కెన్నడీ 1961లో అభివృద్ధి ఒడంబడిక (Alliance

For Progress) ఏర్పాటు ద్వారా సాంఘిక, ఆర్థిక అభివృద్ధి కోసం ఆయా దేశాలలో కృషి చేసెను. కాని బ్రెజిల్, అర్జెంటీనా దేశాలలో సైనిక తిరుగుబాట్లు జరిగినపుడు లాటిన్ అమెరికా దేశాలు మద్దతు ఇవ్వలేదు. కాని 1963 క్యూబా సంక్షోభంలో మాత్రం లాటిన్ అమెరికా దేశాలు మద్దతునిచ్చాయి.

## 20.14. క్యూబా సమస్య :

క్యూబాలో సోవియట్ రష్యా క్షిపణుల స్థావరములను ఏర్పరచుకున్నాయి. దీని వలన అమెరికా ఖండానికి ముప్పు వాటిల్లుతుందని తెలిసి అమెరికా అధ్యక్షుడైనటువంటి J.F. కెన్నడీ తీవ్రంగా గర్జించినాడు. క్యూబా నుండి యుద్ధ విమానాలను, క్షిపణులను రష్యా ఉపసంహరించుకొనవలెనని లేని యెడల మూడవ ప్రపంచయుద్ధము తప్పదని తెలిపినాడు. నాటి రష్యా అధ్యక్షుడు కృశ్చేవ్ వివేకముతో వ్యవహరించి 1963లో తన క్షిపణులను, యుద్ధ విమానములను క్యూబా నుండి తొలగించినాడు. అలాగే కెన్నడీ, లావోస్, కాంగో దేశాలలో సుస్థిరమైన ప్రభుత్వాల ఏర్పాటుకు కృషిచేసినాడు.

## 20.15. రష్యాతో సంబంధాలు - బెర్లిన్ సమస్య :

రెండవ ప్రపంచ యుద్ధానంతరం జరిగిన సంధుల ప్రకారము పశ్చిమ జర్మనీ మిత్ర రాజ్యాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, ఆధీనంలోను తూర్పు జర్మనీ రష్యా ఆధీనంలోను ఉండెను. సోవియట్ రష్యా మొదటి నుంచి పశ్చిమ జర్మనీని తూర్పు జర్మనీలో కలిపి వేసుకొనుటకు ప్రయత్నిస్తూనే ఉన్నది. కృశ్చేవ్ అధ్యక్షుడైన తర్వాత తూర్పు బెర్లిన్‌తో పాటు పశ్చిమ బెర్లిన్ కూడా కలిపి వేసి తమ ఆధీనంలోనికి తెచ్చుకోవాలని ప్రయత్నాలు చేయసాగాడు. దీనిని J.F. కెన్నడీ తీవ్రంగా గర్జించి పశ్చిమ జర్మనీపై దాడి తమపై దాడిగా పేర్కొంటామని హెచ్చరించాడు. అంతేకాక అదనపు సైనిక బలాలను పశ్చిమ జర్మనీకి పంపించినాడు. కాని మరల J.F. కెన్నడీ విజ్ఞతతో వ్యవహరించి కేవలం బెర్లిన్ గోడకోసం యుద్ధం చేయుట అవివేకమని తలచి యుద్ధ సన్నాహాలు మానివేసినాడు. సోవియట్ రష్యాకు 1957-1964 మధ్య అధ్యక్షుడిగా ఉన్న కృశ్చేవ్ అమెరికా అధ్యక్షుడైన J.F. కెన్నడీ ఉభయులు అణ్వాయుధాల ఉత్పత్తిలో ఒకనొకరు పోటీ పడసాగినారు. కాని అణ్వాస్త్రాల తయారీలో పోటీపడుట వలన యుద్ధం సంభవిస్తే జరగబోయే పరిణామాలను ఉభయులు గుర్తించినారు. కనుకనే అంతర్జాతీయంగా వారి మధ్య వచ్చిన విభేదాలు యుద్ధానికి దగ్గరగా తీసుకెళ్ళకుండా తమ సమస్యలను ఎప్పటికప్పుడు విజ్ఞతతో పరిష్కరించుకొనేవారు.

J.F. కెన్నడీ తన పదవీ కాలం పూర్తి కాకుండా దురదృష్టవశాత్తు హత్య గావించబడినాడు. 1962లో ఉపాధ్యక్షుడైన జాన్సన్ ఆహ్వానం మేరకు టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరమున కారులో వెళుతున్నపుడు ఒక భవనం పైఅంతస్తు నుండి లిహార్వే అస్వార్ట్ కాల్చి చంపినాడు.

## 20.16. లిండన్ బైన్స్ జాన్సన్ (1963 - 1965) :

J.F. కెన్నడీ హత్య తరువాత 1963 నవంబరు 22న ఉపాధ్యక్షుడు అయినటువంటి లిండన్ బైన్ జాన్సన్ అధ్యక్షుడు అయినాడు. 1908లో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన జాన్సన్ టెక్సాస్ నివాసి. ప్రారంభ దశలో ఉపాధ్యాయునిగా పనిచేసి తొలుత రాజకీయ రంగంలోనికి ప్రవేశించినాడు. F.D. రూజ్‌వెల్ట్ యొక్క అభిమాని. డెమోక్రాట్ పార్టీలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకొని ఆ పార్టీ ద్వారా మరియు తన భార్య అయినటువంటి క్లానియా టైలర్ సలహా సంప్రదింపులతో అమెరికా ఉపాధ్యక్ష్య అధ్యక్ష పదవులకు ఎన్నికైనాడు. తాను ఉన్న 1963-65 సంవత్సర కాలంలో J.F. కెన్నడీ ప్రవేశపెట్టిన సంస్కరణలను పూర్తి చేయటానికి ప్రయత్నాలు చేసినాడు.

జాన్సన్ ఉదారవాది. మహోన్నతమైనటువంటి సమాజాన్ని నిర్మించాలని ధ్యేయము కలవాడు. అందుకే తన యొక్క అంతరంగిక విధానంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు పన్నుల రాయితీ చట్టము, పౌర హక్కుల చట్టము, ఆరోగ్య రక్షణ పథకము, దారిద్ర్య నిర్మూలన చట్టము మొదలగు వాటిని అమెరికా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టి వాటికి చట్ట రూపాన్ని కల్పించి, అమెరికా సాంఘీక సంక్షేమ అభివృద్దికి కృషి చేయుటలో కృతకృత్యుడు అయినాడు. అయితే వియత్నా యుద్ధంలో అనవసర విషయంలో జోక్యం చేసుకొని జాన్సన్ అప్రదిష్ట పాలయ్యెను.

## 20.17. నమూనా ప్రశ్నలు :


**1) వ్యాస రూప ప్రశ్నలు (20 మార్కులు)**

1. హారి ట్రూమన్ పరిపాలనలో ముఖ్యాంశములను విశదీకరించండి.
2. ఐసెన్ హోవర్ విదేశాంగ విధానమును తెలుపుము.
3. జాన్. ఎఫ్. కెన్నడి పరిపాలనా కాలంలో విదేశాలతో ఉన్న సంబంధాలు తెలుపుము.

## 20.18. చదువదగిన గ్రంథాలు :


1. Pratt, Julius, W. - A History of United States Foreign Policy
2. Ferre II - American Diplomacy
3. Telugu Academy - Adhunika Prapancha Charitra
4. Telugu Academy - Rendu Prapancha Yudhalu - Prapancha Santi Prayatnalu.
5. C.D.M. Kettlebey - A History of Modern Times.


- డా॥ కె. అజయ్ కుమార్



పటం 6. అమెరికా సంయుక్త రాష్ట్రాలు - రాజకీయ పటం

## అమెరికా సంయుక్త రాష్ట్ర సమాఖ్య అంతర్భాగాలు మొట్టమొదటి పదమూడు రాష్ట్రాలు

| | |
|---|---|
| వర్జీనియా | డెలావర్ |
| న్యూయార్క్ | పెన్సిల్వేనియా |
| మెసాచుసెట్స్ | మేరీలాండ్ |
| ఉత్తర కెరొలినా | రోడ్ ఐలాండ్ |
| కనెక్టికట్ | న్యూహాంప్షైర్ |
| దక్షిణ కెరొలినా | జార్జియా |
| | న్యూజెర్సీ |

## సమాఖ్య ఆవిర్భావానంతరం చేరిన రాష్ట్రాలు

| | | | |
|---|---|---|---|
| 1771 | వెర్మాంట్ | 1859 | అరెగాన్ |
| 1792 | కెంటకీ | 1861 | కాన్సాస్ |
| 1796 | టెన్నెసీ | 1863 | పశ్చిమ వర్జీనియా |
| 1803 | ఓహైయో | 1864 | నెవాడా |
| 1812 | లూయిసియానా | 1867 | నెబ్రాస్కా |
| 1816 | ఇండియానా | 1876 | కొలొరెడో |
| 1817 | మిసిసిపీ | 1889 | మోంటానా |
| 1818 | ఇలినాయ్ | 1889 | ఉత్తర డకోటా |
| 1819 | అలబామా | 1889 | దక్షిణ డకోటా |
| 1820 | మెయిన్ | 1889 | వాషింగ్టన్ |
| 1821 | మిసౌరి | 1890 | ఇడాహో |
| 1836 | అర్కన్సాస్ | 1890 | వై యోమింగ్ |
| 1837 | మిషిగన్ | 1896 | ఉటా |
| 1845 | ఫ్లోరిడా | 1907 | ఓక్లహామా |
| 1846 | అయోవా | 1912 | అరిజోనా |
| 1848 | విస్కాన్సిన్ | 1912 | న్యూ మెక్సికో |
| 1850 | కాలిఫోర్నియా | 1959 | అలాస్కా |
| 1851 | టెక్సాస్ | 1959 | హవాయ్ |
| 1858 | మిన్నెసాటా | | |

## సంయుక్త రాష్ట్రాల అధ్యక్షులు :

| | |
|---|---|
| 1789 - 1797 | జార్జ్ వాషింగ్టన్ |
| 1797 - 1801 | జాన్ ఆడమ్స్ |
| 1801 - 1809 | థామస్ జెఫర్సన్ |
| 1809 - 1817 | జేమ్స్ మాడిసన్ |
| 1817 - 1825 | జేమ్స్ మన్రో |
| 1825 - 1829 | జాన్ క్విన్సి ఆడమ్స్ |
| 1829 - 1837 | ఆండ్రూ జాక్సన్ |
| 1837 - 1841 | మార్టిన్ వాన్ బూరెన్ |
| 1841 | విలియమ్ హారిసన్ |
| 1841 - 1845 | జాన్ టేలర్ |
| 1845 - 1849 | జేమ్స్ పోక్ |
| 1849 - 1850 | జాచరీ టేలర్ |
| 1850 - 1853 | మల్లర్డ్ ఫీల్‌మోర్ |
| 1853 - 1857 | ఫ్రాంక్లిన్ పియర్స్ |
| 1857 - 1861 | జేమ్స్ బుకనన్ |
| 1861 - 1865 | అబ్రహమ్ లింకన్ |
| 1865 - 1869 | అండ్రూ జాన్సన్ |
| 1869 - 1877 | యులిసిస్ గ్రాంట్ |
| 1877 - 1881 | రూథర్ ఫోర్డ్ హేనీ |
| 1881 | జేమ్స్ గార్‌ఫీల్డ్ |
| 1881 - 1885 | ఛెస్టర్ ఆర్థర్ |
| 1885 - 1889 | గ్రోవర్ క్లీవ్‌లాండ్ |
| 1889 - 1893 | బెంజిమన్ హారిసన్ |
| 1893 - 1897 | గ్లోవర్ క్లీవ్ లాండ్ |
| 1897 - 1901 | విలియమ్ మెకెన్లీ |
| 1901 - 1909 | థియోడోర్ రూజ్‌వెల్ట్ |
| 1909 - 1913 | విలియమ్ టాఫ్ట్ |
| 1913 - 1921 | వుడ్రో విల్సన్ |
| 1921 - 1923 | వారన్ హార్డింజ్ |
| 1923 - 1929 | కాల్విన్ కూలిడ్జ్ |
| 1929 - 1933 | హెర్బర్ట్ హూవర్ |
| 1933 - 1945 | ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ |
| 1945 - 1949 | హారి ట్రూమన్ |